కనకపు సింహాసనం

బొమ్మకథ



D NRRB010374

జానపద సాహిత్యం

(A RESEARCH WORK IN FOLK LITERATURE)

వెల్ది

4374

Deepthi publications

1-8-150/4, (Upstairs), Chikkadapally,
HYDERABAD - 500 020.

JAANAPADA SAAHITHYAM

(A RESEARCH WORK IN FOLK LITERATURE)

By

ELLORA



T
398.2.
ELL.

Price Rs. 80/-
(RUPEES EIGHTY ONLY)
U.S DOLLARS 9

© *All Rights Reserved by the Author*

Published by :

DEEPTI PUBLICATIONS
1-8-150/4, (Upstairs), Chikkadpally,
Hyderabad - 500 020 A.P.

Cover Printed at :

SUPREME ARTS
Hyderabad - 500 020 A.P.

Paper used for the Publication of this book was made available by Govt. of Andhra Pradesh at concessional rate

---

Life

Ellora was born at Munganda village in the coconut-Fringed picturesque konaseema where time is measured by the length of shadows, the canals snake placidly and nature bestows its bounty in full on September 19, 1930.

His parents Godavarthi Rama Murthy and Ramanamma were devout sanatanists. Ellora, then Bhaskara Rao, roamed about with Mother Nature as his teacher. The freedom movement attracted him but he was soon disillusioned. For Sometime he worked as a Telugu Vidwan. In 1951 he joined Andhra Prabha where he still works.

Ellora edited 'Telugu Velugu' published on the occasion of the World Telugu Conference. He is founder & convenor of the literary forums Sahiti and General Secretaryi Jaanapada Sahiti Samakhya.

Several of Ellora's poems were translated into Urdu, Hindi, Bengali and Tamil.

Ellora has written over 30 Books during the last two decades. They include many novels, poetry, folk and children's literature.

Ellora's book of poems 'Nissabda Tarangaalu' (Silent Waves) received the Andhra Pradesh Sahitya Akadem award in 1977.

Bio Data

NOM DE PLUME
Ellora

Born at

Munganda in
Konaseema
in 1930 as
Godavarthi Bhaskara Rao

Works at

Andhra Prabha Illustrated weekly
as ASST. EDITOR

Author of

30 books including
novels, literary criticism, poetry, children's literature,
folk literature

AWARDS

Winner of Andhra Pradesh Sahitya Akademi
award for his poetic work
'Nissabda Tarangaalu'

On Jan. 26th 1981, Honoured as one of the National Poet
at New Delhi.

President

'SAHITI' Telugu Sahitya Vedika,
General Secretary
Jaanapada Sahiti Samakhya.

Adviser

A.P. Sahitya Akademy.
Modern Literature Committee,
Doordarsan-Hyderabad.

Work

POETRY

Repati Vasantham
Nissabda Tarangaalu
Jwalaa Torananalu
Minl Kavitha
Saraagaalu
Janapada Geyaalu-I
Janapada Geyaalu-II
Madhura Kavithalu

Eassy

PrachinaKalalu
Puttupurvottaralu

Novels

SOCIAL
Gudi Gantalu
Parisaraalu Prabhavaalu
Prema Neerajanam
Kalachakram
Sandya Deepaalu
KaarucheeKatlu - Kaanthi Rekhalu

MYSTERY

Paathala Gruham
Bhayankari Pannaagam

Short Stories

Jailu Godalaku Maata'u Vasthe?
Kadalipoyina Railubandi

Literature for Children

Chandravadana
Mandaaralu
Pandugala Paatalu
Papayi Paatalu
Dr. Kokila
Samudra Garbhamlo
Kokilamma Thelivi
Poovulu - Moggalu
Vichitra Kathalu

Recent works

Jaanapada Saahithyam
Samiksha (Sahitya Vyasalu)

VI



ఇందులో ఉన్నవి ఇవి

1. ఆమోదం - డాక్టరు కొత్తపల్లి వీరభద్రరావు
2. పీఠిక - పురిపండా
3. గ్రంథ పరిచయం - అరుద్ర
4. రచయిత పరిచయం ... 9
5. డాక్టర్ గిడుగు సీతాపతిగారి పలుకులు ... 14
6. నార్లవారి వివరణ ... 18
7. ఏడ్యాస్ విశ్వం ఆముఖం ... 30
8. మధుర కవితాస్రవంతి ... 23
9. తాపీ ధర్మారావుగారి పీఠిక ... 42
10. ప్రజావాజ్మయం ... 44
11. లయబద్ధ సంగీత గీతాలు ... 53
12. మిగడ తరగలు ... 58
13. కవితామాధురి ... 64
14 సినిమాలలో జానపద గేయాలు ... 100
15. వీరగాథలు ... 112
16. హరిహరీ జదాలు ... 126
17. యక్షగాన ప్రబంధాలు ... 130
18. స్త్రీల పాటలు ... 145

19.	బుర్రకథా తత్త్వం	...	170
20.	దాలవాఙ్మయం	...	183
21.	తోలుబొమ్మలాటలు	...	206
22.	సరసాలు - సరదాలు	...	219
23.	పొలం పాటలు	...	248
24.	భాగవత తరంగాలు	...	268
25.	మేలు కొలుపులు	...	328
26,	సవతుల సంవాదాలు	...	344
27.	నోముల పాటలు	...	379
28.	హాస్య వల్లరి	...	395
29.	శృంగార వల్లరి	...	440
30.	అప్పగింతలు	...	442
31.	పసుపు పాటలు	...	472
32.	చంపు పదాలు	...	487
33.	ఏల పదాలు	...	515
34.	రామ కథామృతం	...	555
35.	వేదాంత పర పాటలు	...	606
36.	నా విన్నపం	...	648
37.	పరిశీలించిన గ్రంథాల వివరణ	...	651



అంకితం

అర్షధర్మ నిష్ఠాపరులు,
స్వధర్మ ఉద్యమ
రథ సారథులు

శ్రీ బులుసు ఏ. ఎస్. ఎస్. మణి గారికి

తియ్యని స్నేహానికి
జ్ఞాపకంగా



ఆమోదం

– ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు

"కోనేమ్మతే సుమనసాం మనసాపి గంధః
కస్తూరికా జనయతి భ్రమతాప్యగేణ"

అన్నాడు పైనకటికి ఓ ముంగండ గ్రామవాసి. అవును మరి. స్వాయంగా కస్తూరిని సృష్టించే శక్తి ఉన్నప్పుడు పుప్పొల గుబాళింపు కోసం తహతహ ఎందుకు?

అసలు, ఈ అత్మ విశ్వాసం-ఆహంకారంలా ఇతరులకి కనబడే-తెలుగు వాళ్లసొత్తు. అందులో కవికూడా అయితే ఇంక చెప్పేదేముంది?

ఈ ఆత్మ విశ్వాసం ఎల్లోరాకి పుష్కలంగా ఉంది. సాహిత్యంలో ఎన్ని శాఖలున్నాయో అన్నింటిని స్పృశించి అలంకరించాడు. ఇతనిది కలంకాదు పరసువేది. అందుబాటులోకి వచ్చిన పరిశోధనాంశాలికి ఈయన స్పర్శ వల్ల సుపర్ణత్వం లభించింది. ఇంక కవిత్వ విషయం చేరే చెప్పాలా?

ఎల్లోరా ఎన్ని సాహిత్య శాఖల్ని తన రచనలలో అలంకరించినా, ఎల్లోరా అంటే కవి జ్ఞాపకం వస్తాడు. పైని చెప్పిన జగన్నాథ పండితరాయలు మహాకవి అయినా, లోకం ఆయన్ని పండితరాజుగా గుర్తించింది. స్మరించు కొంటుంది. మన ఎల్లోరా, పండితరాజులు ఎంత "కవి" అంత "పండితు" డైనా లోకం ఈయన్ని "కవి"గా గుర్తించి కీర్తిస్తోంది. అంటే ఈయన అటు పండితుడూ ఇటు కవీశుడా! సవ్యసాచి సాహిత్య రంగంలో ఆయనలాగే ఈయనా ముంగండవాడు!

ఇంచుమించుగా నాలుగు దశాబ్దుల నుంచి సాహిత్య రంగంలో పురోగామి. రచయితలలో అగ్రగామి. సహజంగా కవికావడం వల్ల, చెప్పవలసిన విషయం శుష్క-కాఠిన్యసదృశమైంది అయినా, దానికి లారుణ్య కోమలత్వాలు తెస్తాడు. వాగర్థ ప్రణయాన్ని ఇంతగా అర్థం చేసుకొన్న కవులు ఈనాడు చాలా కొద్ది మంది. అ కొద్ది మందిలో 'అహమహమిక'తో వ్యవహరించ గలడు. ఈయన కవిత్వాన్ని గురించి నేనిదివరలో అన్నమాటలే మళ్ళీ ఉటంకిస్తాను:

"తేటమాటల్లో నీటైన విషయాన్ని చెప్పడంలో సిద్ధహస్తులు ఎల్లోరా. వచన కవిత్వం సాధించిన ఘనవిజయం ఏమిటి? అని ప్రశ్నించే వాళ్లకి ఎల్లోరా కవిత-వాళ్లసంశయాల్ని ఛేదించే మౌనవ్యాఖ్య. సామాజిక స్పృహతో కవిత్వాన్ని రమణీయంగా వచన కవితా రీతిలో వ్రాయగల్గిన కొద్దిమందిలో ఎల్లోరా ఒకరు".

ఈ మాటలు నాటికి నేటికి సత్యాలే. సొంత గొంతు ఉన్నకవి ఎంత వ్రాసినా వింత గొలుపుతూనే ఉంటాడు! నవనవోన్మేషశాలిని అయిన ప్రజ్ఞ ఉన్న ప్రతిభావంతుడు ఈయన. ఆవేశాన్ని ఆలోచనాలోచనాంతో జాగ్రత్తగా పరిశీలించి పరీక్షించిగాని కవిత్వంలో వ్యక్తం చెయ్యడు గనక, ఈయన కవిత్వం-ఆవేశదృష్ట్యా ఆపాత మధురం. ఆలోచన దృష్ట్యా ఆలోచనా ప్పుతం. ఆవేశంతో శబ్దం పరవళ్లు తొక్కుతే ఆలోచన దాన్ని శాస్త్రీయంగా నడిపిస్తుంది. మహాకవికి సహజమైన సంయమనం, మన ఎల్లోరాకి "వెన్నతోపెట్టిన విద్య." విద్వాంసుడికి సహజమైన వినయం మన ఎల్లోరా కి "పెట్టనికోట". ఈ కవి పండితుడు లేదా పండితకవి - పరిశోధనాత్మక గ్రంథం వ్రాశాడంటే దాని విలువ వేరే చెప్పాలా ?

ఏమిటి ఆ గ్రంథం—"జానపద సాహిత్యం" దాని పేరు. ఇప్పుడు ప్రఖ్యాతికి వచ్చిన చాలా మంది, పట్నాలు వదలి జనపదాలలో అడుగు పెట్టక పూర్వమే జానపద సాహిత్యం విలువ గుర్తించి దాన్ని సేకరిస్తూ పత్రికల్లో ప్రచురిస్తూ వాఖ్యానం చేస్తూ ఎల్లోరా మాకందరికీ పరిచయం అయ్యాడు. తెలుగు జానపద సాహిత్యం అన్న వెంటనే మొట్ట మొదట జ్ఞాపకం వచ్చే కీ॥శే॥ నేదునూరి గంగాధరంగారి తరువాత ఈయన పేరే ఈ రంగంలో నేను మొదట విన్నది. ఇది ముప్పైఐదు సంవత్సరాల క్రితం మాట! అంత ప్రాచీనుడీ పండిత కవి!

ఆనాటి ఆచార వ్యవహారాదుల్ని, సంస్కృతిని వ్యక్తం చేసే శిలాశాసనాల వంటివే జానపద గీతాలైనా—శాసనాలిది రాతిగుండెకి హత్తుకు పోయే స్వభావం; జానపద గీతాలిది గుండెలోకి చూసుకుపోయి స్పందించే స్వభావం. జానపద గీతాలు మనతో మన భాషలో మాట్లాడి రంజింప చేస్తాయి. ఏడుస్తాయి; ఏడిపిస్తాయి. శోకమే శ్లోకం అవుతుందని రుజువు చేస్తాయి. కాబట్టి, మహాకవి ఎల్లోరా జానపద సాహిత్యాన్ని అభిమానించాడంటే ఆశ్చర్యం ఏముంది? రెండు దశాబ్దులనాడు "మధుర కవితలు" వ్రాసి జానపద సాహిత్య హర్మ్యంలో ప్రవేశించిన ఎల్లోరా ఈనాడు "జానపద సాహిత్యం" అనే బృహద్గ్రంథం వ్రాసి ఆ రమ్యహర్మ్యానికి యజమాని అయ్యాడు. వామనుడు త్రివిక్రమ య్యాడు!

'జానపద సాహిత్యం' అనే ఈ గ్రంథం తొందరగా చదివి వదలివేయగలిగిందీ కాదు; వదలివేయ తగిందీ కాదు. ప్రతి అక్షరం జాగ్రత్తగా చదువుతూ మననం చేయదగ్గది. గీతాల సేకరణలో మనకి "కవి ఎల్లోరా" కనబడతాడు. సిద్ధాంత చర్చలో వ్యాఖ్యలో మనకి "ఎల్లోరా పండితుడు" కనబడతాడు. విషయాన్ని శాస్త్రీయంగా విభజించి దాని వైశిష్ట్యాన్ని వైవిధ్యాన్ని ప్రదర్శించడంలో "పరిశోధకుడు ఎల్లోరా" కనబడతాడు. కవిగా, పండితుడిగా. పరిశోధకుడిగా మూర్తీభవించిన త్రిమూర్త్యవతారం ఈ బృహద్గ్రంథంలో ఎల్లోరా. పుస్తక ప్రచురణలో ఎల్లోరా కళాహృదయం కనబడుతుంది. ఎన్ని అందమైన రేఖాచిత్రాలు!

శుష్క పండితుడి పుస్తకం అయితే - విషయం సమగ్రంగా ఉన్నా-సహృదయుల్ని ఆకర్షించదు. ఆకట్టుకోదు. అరసికుడు అధ్యాయాలుగా విభజించే విషయాన్ని రసిక పండితుడు ఎల్లోరా వైఎద్య శోభితమైన విషయానికి తగిన సట్లుగా అందమైన శీర్షికలు పెట్టాడు. ఇవి పాఠకుల్ని ఆకర్షిస్తాయి. శీర్షికలికి తగిన చిత్రాలు!

సాహిత్యం జీవితానికి అద్దం పడుతుంది, జీవితం నవరస భరితం కనుక సాహిత్యం రసబంధురం అవుతుంది. జానపద జీవితం నగర జీవితంకంటె నిస్సంకోచమైంది గనుక మూర్ఖసాహిత్యంకంటె దేశి సాహిత్యం రస నిర్భరతతో తీవ్రతలో ముందంజ వేస్తుంది. ఈ విషయాన్ని ఎల్లోరా చాలాచోట్ల వ్యక్తం చేశాడు. చేయనిచోట్ల ఆ సాహిత్యమే చెప్పక చెప్పుతుంది.

ఈ పుస్తకం జానపద సాహిత్య సర్వస్వం. అంటే? జానపదసాహిత్యం అంతా ఇందులో ఉందా? ఉంది! లేదు! ఈ గ్రంథం లక్ష్య లక్షణ సమన్వయం చేసి చూపించింది గనక దీన్ని జానపద సర్వస్వం అన్నాను. ఇందులోకంటె ఎక్కువ ఉదాహరణలున్న గ్రంథాలు ఉండవచ్చు! ఇందులోకంటె ఎక్కువగా సిద్ధాంతాల చర్చలున్న పుస్తకాలు ఉండవచ్చు! నేనయితే చూచినట్లు గుర్తులేదు. కాని, సిద్ధాంత చర్చలు ఉదాహరణలు-ఇంత సమగ్రంగా ఉన్న ఒక్క పుస్తకం మాత్రం లేదని నేను గట్టిగా చెప్పగలను.

సాహిత్యాభిమానులూ, సహృదయులూ ఈ పుస్తకాన్ని కొని చదివి ఆనందించాలి. ఒప్పుడుగాని వాళ్లకి - ఇది చదవకపోతే కలిగే నష్టం తెలియదు. చదివితే కలిగిన ఆనందం అనుభవానికి రాదు. "మధుర కవితలు" గ్రంథంతో పాడ్యమి చంద్రుడిలా ప్రారంభించిన ఎల్లోరా "జానపద సాహిత్యం" అనే ఈ బృహద్గ్రంథంతో పూర్ణ చంద్రుడయ్యాడు. ఈ కళాప్రపూర్ణ వికాసాన్ని సహృదయ చకోరాలు దర్శించి ఆనందించగలవు. సముఖాన రాయబారమెందుకు?

XII



పీఠిక

-పురిపండా అప్పలస్వామి

వెలుగుతూన్న మెటల్ హెలైడ్ దీపానికి బేటరీలైట్ చూపడం ఎలాటిదో శ్రీ ఎల్లోరాగారి ఈ "జానపద సాహిత్యం"కి పీఠిక రాయడం అలాటిది.

ఏమంటే ఎన్నో ఏళ్ళనుంచి తెలుగు తోటలు గాలించి గాలించి పల్లెపాటల పారిజాతాలు పోగులు పోస్తున్న కళా కుశలి ఎల్లోరా. ఒకవంక వివిధ సాహిత్య ప్రక్రియలలో సృజనాత్మకమైన రచనలు-కవితలూ, కథలూ, నవలలూ, నాటకాలూ, వ్యాఖ్యలూ, వ్యాసాలూ రాస్తూనే, ఒకపంక పల్లెపాటల పాల సముద్రం మథిస్తున్న సవ్యసాచి ఎల్లోరా.

వేదాలు ఎప్పటివని అడిగితే ఫలానాచివంటే ఫలానాదానివని కొందల్లాటి పండితులు కుండలాలు తడువుతారు. కొలకర్రలూ తిస్తారు. అలాగే ఏ సూక్తం ఏఋషిదంటే-పేరు పేరునా చెప్పే పెట్టారు. అదే పల్లె సాహిత్యం ఎప్పటిదంటే, అందులో ఏ పాట ఎవరిదంటే, పులుపూ పుయికపూ చూస్తారు. వారికే కాదు, ఎవరికీ కాకూడా చేతులూ అంటవు. అందే వేదసాహిత్యం కంటే కూడా పల్లె సాహిత్యం (Folk literature) పల్లె చదువు (Folk lore) ఎంతో అంత పాతకాలం నాది దన్న మాట. పల్లెపాటల మహాకవులు పేరూ పూరూ తెలీని వారన్న మాట. ఎల్లోరా అన్నారుగా "జానపద గేయాలకు చూసి ఫలానా కాలం అని వాటికి వయసు కట్టడం చాలా కష్టమయిన పని-సాధ్యంకాని పని" అని.

మనిషి అవసరం లక్ష్య దాటి. మాటలు నేర్చి నేర్వని మొదటి రోజుల నాటివి పల్లెపాటలు, పద సాహిత్యమూను. అసలు భాషకే తొలి పునాది పల్లె సాహిత్యం.

కొందరు అంటుస్నట్టు "వేదాలు ప్రాచీనార్యుల జానపద విజ్ఞానం" అయితే, పల్లెపాటలు ప్రాచీన మానవుల జానపద విజ్ఞానం.

30 ఏళ్ళకి పైగా పల్లెపాటలు నొల్లుస వస్తున్నారు ఎల్లోరా. "జానపద గేయాలు" అని రెండు సంపుటాలు ఎండిచారు. ఇవవయ్యేళ్ళ క్రితం "మధుర కవితలు" అని మంచి పల్లెపాటల పరిశోధన గ్రంథం వెలువరించి, మేలిరకం వ్యాఖ్యాతగా పేరు పడ్డారు.

ఇదిగో ఇప్పుడు మరో పెద్ద గ్రంథం - పుందార మకరంద మాధుర్యాల "జానపద సాహిత్యం"-ఆలోచనామృతం తెలుగు వారికి అందించి మహోపకారం చేశారు. ఎంతైనా అభినందనీయులయారు. ఇదే ఏదో విశ్వవిద్యాలయంలో థీసిస్‌గా వచ్చుంటే ఉత్తమ పరిశోధన గ్రంథంగా ఎన్నికయేది, పసిడి పతకం అందుకునేది.

Folk literature - జానపద సాహిత్యం. **Folk** అనే ఇంగ్లీషు మాటకి తర్జుమా జనపదం. జనపద సంబంధమైంది జానపదం.

జనపదం, జానపదం అన్నమాటలు పాతవి, వైదిక సాహిత్యంలోవి. వెనకటి బ్రాహ్మణాల్లోనూ, ఉపనిషత్తులలోనూ తొలి చర్చనమిస్తాయి. వాటిలో జనపదం అంటే ప్రదేశం, దేశం, జనసమూహం అని అర్థం. పల్లె అని కాని, కేవలం పల్లె జనం అని కాని అర్థం కాదు. - చూ. ఐతరేయ బ్రాహ్మణం. 8.14; శతపథ బ్రాహ్మణం. 13.4.2.17; 14.5.1.20; తైత్తరీయ బ్రాహ్మణం. 2.3.9.9; బృహదారణ్యక ఉపనిషత్తు 2.1.20; ఛాందోగ్య ఉపనిషత్తు 5.11.5: 8.1.5. **Vedce Index - Magdonell and kieth**; వైదిక కోశ్.

మహాభారతంలోనూ 'జనపద' శబ్దం దేశం అనే అర్థంలోనే వాడాడు వ్యాసుడు.

"సంతిరమ్యా జనపదా బహ్వన్నాఃపరతి కురూన్,
పాంచాలాశ్చేది మాత్స్యాశ్చ శూరసేనాఃపటచ్చరాఃపచ్చాల
దశార్ణా నవరాష్ట్రాశ్చ మల్లాఃశాల్వా యుగంధరాఃశాల్వ
కుంతీరాష్ట్రం చ విపులం సురాష్ట్రవంత యస్తథా.

విరాట. 1.12.13.

(కురుదేశం చుట్టూ పాంచాల చేది మత్స్య శూరసేన పటచ్చర దశార్ణ నవరాష్ట్ర పుల్ల శాల్వ యుగంధర కుంతిరాష్ట్ర సౌరాష్ట్ర అవంతి-ఇలాంటివో రమ్యమైన జనపదాలు (దేశాలు) పుష్కలమైన ఆహారాలతో నిండుగా వున్నాయి.)

తన అనువాదంలో ఇక్కడ జనపద శబ్దం దేశం అనే అర్థంలోనే వాడాడు తిక్కన.

"వ. కురు జనపదంబు చుట్టు (కురుదేశంబు చుట్టు అని పాఠాంతరం కూడా వుంది) పాంచాల చేది మత్స్య సౌళ్వ విదేహ బాహ్లిక దశార్ణ శూరసేన కాంభోజ మగధ దేశంబులు, సుభిక్షంబులు, జనాకీర్ణంబులు.-విరాట. 1.61.

ఇలాగే ప్రాచీన కన్నడ కవులు జనపదమనే శబ్దాన్ని దేశం అనే అర్థంలోనే వాడారు:

"కావేరి యింద మాగో
దావరి వరమిర్దనాడదా కన్నడదొళ్
భావిసిద జనపదం పసు
ధావళయ విలీన విశద విషయ విశేషం."

-కవిరాజమార్గం. 9 శతాబ్దం.-తెలుగు కన్నడ జానపద గేయాలు. పు. 3. సుందరం.

అయితే తరవాత తరవాత జనపదం అంటే గ్రామం (పల్లె) అని అర్థం సంస్కృతంతోపాటు తెలుగులోనూ, కన్నడంలోనూ చోటు చేసుకుంది.

జనే గ్రామే జనపదః — నానార్థరత్నమాల. 4.65.

ఉత్తరరామచరితలో భవభూతి "పౌర జానపదాః" అని సంస్కృతంలోనూ, "పోరజాణపదా" అని ప్రాకృతంలోనూ వాడాడు. ఇక్కడ పౌర, పోర అంటే పట్నం వాళ్ళనీ, జానపద, జాణపదా అంటే పల్లెల వాళ్ళనిన్నీ అర్థం. అలాగే ఎర్రాప్రెగడ "జానపదుల్ పురీజనులు" అని వాడేడు.

ఇంచేత **Folk** ఇంగ్లీషు మాటకి జానపద అనీ, **Folk literature** కి జానపద సాహిత్యం అనీ అనడం సమంజసమే. బాగానే వుంది. కాని చదువు కున్న కొద్దిమందిలో తప్ప ఈ మాట వాడుకలో లేదు. ఏ పల్లె జనం గురించి

ఈ మాట వాడుతున్నామో ఆ పల్లె జనానికి దీని అర్థమే తెలీదు. 'జానపదం' అంటే "అదేం పదం దాయీ?" అని అడుగుతారు వారు. కనక వారికి సులువుగా తెలిసే మాట 'పల్లె సాహిత్యం' అని, 'పల్లె పాటలూ', 'పల్లె కథలూ' అనీ వాడడం మంచిపనుకుంటాను. ఈ సందర్భంలో తాపీ ధర్మారావుగారు అనాయాసంగా బోధపడే పేరు 'పల్లెపాటలు' అని పెట్టకుండా 'జానపదగేయాలు' అని పెద్ద పేరు పెట్టడం కొంత అనౌచిత్యమే, అన్న మాటలు యాదస్తు చేస్తున్నాను. (పు. 70).

ఏమయినా 'జనపదం', 'జానపదం' వేదాల్లోంచి వూడిపడి తెలుగులో తెలుగే ఆయిపోయాయి.

గలగలగల సెలయేటిలాగ అనాదినించీ ఆడుతూ పాడుతూ సాగిపోతున్న పల్లె సాహిత్యం-అదే జానపద సాహిత్యం బూర్జువాల గీర్వాణం ముంపుతో ఒక పంక అనాదృతపవుతూ వున్నా, రూపు మాసిపోలేదు. మనం ఎన్నా విసక పోయినా, కన్నా కరకపోయినా జనం నోట నానుతూ బతుకుతూనేవుంది. జపం వుంజుపుంటూనే వుంది. మూడు పండల ఏళ్ళయి యూరోపియనుల ధర్మమా అని లోకం కళ్ళు తెరిచింది. ఏది జాతిరత్నమో, ఏది నకిలీ రత్నమో అప గాహన చేసుకుంది.

"నేడు ప్రపంచంలో ఎక్కడ చూసినా జానపద సాహిత్య ప్రచారం పుష్కలంగా కనిపిస్తుంది." పెద్దపెద్ద పరిశోధన గ్రంథాలూ, వ్యాఖ్యానాలూ అవతరిస్తున్నాయి. అదిగో ఆలా చెప్పదగిన పెద్ద గ్రంథాల్లో ఒకటి ఎల్లోరా గారి ఈ "జానపద సాహిత్యం".

1961 లో వేరి 'మధుర కవితలు' లో లాగే ఈ 'జానపద సాహిత్యం' -ప్రజావాజ్ఞయం, మేగడతరగలు, పిరగాథలు, స్త్రీ పాటలు, దాంపత్యం, పడప పాటలు, ఏల పాటలు మొదలైన శీర్షికలతో విభాగించి, ఆయా విషయాలు విపులంగా విపరించారు. ఇప్పటికీ ఇంకా "కనుమరుగైపోతూన్న కొద్ది పల్లె పాటలన్నైనా, పదాలన్నైనా రక్షించవలసిన సమయం ఎన్నడూలేనంది" అని హెచ్చరించారు. ఎంతపరిశ్రమతో పాటుపడిన వారిని అభినందించారు. "జానపద గేయాలంటే బూతుపదాలు విరివిగా వున్నాయని పెదలు పరిశో

ఆషాఢ భూతులకు మెల్లమెల్లగా ఎంతో చక్కని జవాబుచెప్పారు. (పు. 84.86). ఒకవేపు దేవతలూ, తల్లులనీ మొక్కులు మొక్కుతూనే వాళ్ళ బూతులకోసం పూతులు చాపే మహాత్ములకు పల్లె సాహిత్యం పచ్చి బూతులాగే వుంటుంది పాపం !

"సినిమాలో జానపదగేయాలు" అన్న శీర్షికలో "సినిమాల్లో చోటు చేసుకోవడం ఈ సాహిత్యం చేసుకున్న పుణ్యమనే చెప్పాలి" అన్నారు ఎల్లోరా. పుణ్యమో పాపమో ఆకాశవాణి కూడా పల్లెపాటలకి చోటు కల్పిస్తున్నది. అయితే అవి చక్కగా పాడే పల్లెజనంతోనే పాడిస్తే వాటికి వున్నరూపు వున్నట్టు మనకు దక్కుతుంది. అప్పుడే అవి "మనల నేదో గంధర్వ నగరంలోనికి ఎత్తుకొని పోయి మైపురపింప జేస్తాయి". కానప్పుడు గణియం విడిచి సినిమా తార వేషం వేసిన భామవేషంలా వుంటుంది.

"స్త్రీల పాటలు" శీర్షికలో కొంచెం హెచ్చుగానే రాశారు. నిజానికి జానపద సాహిత్యంలో గుణంలోనూ పణంలోనూ స్త్రీల పాటలదే పెద్దపీట. అసలు ఈ సాహిత్యం ఆడంగులతోనే ఆరంభమై యుంటుంది.

"బాల వాఙ్మయం" శీర్షికలో "ఈనాడు పాతపాటల మాదిరిగానే కొన్ని పాటలు కొంతమంది రాస్తున్నవి" కొన్ని వివరించారు. జానపద సరళిలో అవి చక్కగానే వుండొచ్చు కాని అవి జానపద సాహిత్యంలో చేరవు.

"తోలుబొమ్మలాటలు" శీర్షికలో తెలుసుకో దగినవి ఎన్నో విషయాలు తెలిపారు.

"సరసాలు సరదాలు" శీర్షికలో "విశాఖమండలంలో మోటుసరసపు పాటలు, పచ్చి శృంగార గీతాలు చాలా ఉన్నట్లు అనుకుంటాను" అంటున్నారు ఎల్లోరాగారు. ఇరవయ్యేళ్ళనాడు "మధుర కవితలు"లో కూడా ఇదే శీర్షిక కింద ఇదే మాట అన్నారు వారు. విశాఖమండలం వాణ్ణని కాదు. కాని తెలుగునాట ఏ మండలంలో చూసినా-ఆ మాటకి వస్తే ఇండియాలో ఏప్రాంతంలో చూసినా విశాఖలోవి అని ఎల్లోరా చూపిన వాటికంటే ఎన్నో రెట్లు హెచ్చు 'మోటుసరసపు పాటలు, పచ్చి శృంగార గీతాలు' కోకొల్లలు కొట్టవచ్చినట్లు కనపడతాయి.

ఒక్క విశాఖమందలమే చేసిన పాపమేముంది? ఇవి ఎంత మోటూ, పచ్చి అయినా మనకావ్యాలపు తీసి కట్టేకదా!

ఎల్లోరాగారి గ్రంథం ఆపాత మధురంగా వుంది. అయినా ముఖ్యంగా 'హాస్యావల్లరి', 'శృంగార పల్లం', 'పడవ పాటలు' 'చంపు పాటలు', 'ఏల పాటలు' మొదలైన శీర్షికల్లోని పాటలూ, వ్యాఖ్యలూ మరింత మరింత మధు రంగా వున్నాయి. పత్తెక్కిస్తున్నాయి. మైమర్పిస్తున్నాయి. ఇవి ఇంత గొప్పగా అందించిన ఎల్లోరాగారిని అమాంతంగా మా సింహాచలం సంపంగి పూతోనూ, సాయారు మల్లిపూలతోనూ ముంచెత్తాలనిపిస్తున్నది.



సంతోష కారణం

- ఆరుద్ర

ఈ పుస్తకం పేరు ! జానపద సాహిత్యం. ఇది ఎల్లోరా రచన.

ఈ రెండు సంగతులూ చెప్పాక ఈ పుస్తకానికి ఇక పీఠిక అపసరం నిజంగా లేనేలేదని చెప్పాలి.

ఇప్పటికి మూడు దశాబ్దాలుగా వివిధ రంగాలలో, విభిన్న ప్రక్రియలలో ఎల్లోరా కృషి చేస్తున్నా జానపద సాహిత్యవేత్తగానే దేశం అతణ్ణి ముందుగా గుర్తిస్తుంది.

కొంచరు కొందరికి ఇటువంటి ముద్రలు పడిపోతూ ఉంటాయి. అయితే ఇది గర్వించతగ్గముద్రే.

జానపద సాహిత్యాన్ని సేకరించడంలో గాని, సమీక్షించడంలో గాని ఎల్లోరా చేపిన కృషి తక్కువదేంకాదు. 1955 నుండి జానపద గేయ సంకలనాలు ప్రచురిస్తూనే ఉన్నాడు. 'జానపద గేయాలు' (రెండు సంపుటాలు) 'మధుర కవితలు' (541 పుటలు), 'సరాగాలు' (సవ్యాఖ్యానం), 'మన ప్రాచీన కళలు పుట్టుపుర్వోత్తరాలు' మొదలైన గ్రంధాలే ఎల్లోరా ప్రతిభా వ్యుత్పత్తులకు సాక్ష్యాలు.

అందుకే హైదరాబాదులోని జానపద సాహితీ సమాఖ్యకు ఎల్లోరా అధ్యక్షులుగా అర్హులు. అందుకే ఈ 700 పుటల గ్రంథాన్ని ఆంధ్రులకు అందిస్తున్నారు. దీనికి నన్ను పీఠిక రాయమనడం ఎల్లోరాకు నాపట్లగల ప్రత్యేకాభిమానా

నికి దాఖలా. నేను ఆ పీఠికా రచనలో ఎంత జాప్యం చేసినా ఓర్చుకొనడం ఎల్లోరా పట్టుదలకు నిదర్శనం.

ఇది ఏ విశ్వవిద్యాలయం పట్టాకోసం పనిపెట్టుకొని రాసిన సిద్ధాంత వ్యాసం కాదు - అయినా ఇందులో సిద్ధాంత చర్చ లేకపోలేదు. ఇది ప్రతి విశ్వవిద్యాలయంలోనూ జానపద సాహిత్యంపై పరిశోధనలు చేసే విద్యార్థులు చూడక తప్పని గ్రంథమే. ఇప్పటికే ఎల్లోరా గ్రంథాలను వివిధ పరిశోధక విద్యార్థులు తమ సిద్ధాంత గ్రంథాలలో పేర్కొంటున్నారు.

ఇది ఒక ప్రణాళిక వేసుకొని ప్రయత్న పూర్వకంగా రాసిన పాఠ్య గ్రంథం కాదు. ఏది తోస్తే అది, ఎలాతోస్తే అలాగు, ఎప్పుడుతోస్తే అప్పుడు రాసినవి ప్రకరణాలుచేసి వైదుష్యంలో వైవిధ్యం, భిన్నత్వంలో ఏకత్వం చూపెట్టే గ్రంథాన్ని రూపొందించడం గమనించదగ్గ గడుసుదనం! ఇటువంటి రచనలు చదువుతున్నప్పుడే ఏ పుటలో ఏ భావముందో అన్న ఉత్కంఠ పాఠకునికి కలగడం సహజం. ఇక్కడో మౌలికమైన విషయం, అక్కడో జిజ్ఞాసాత్మకమైన వివరణం చెప్పుకుంటూపోతే ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. ఉదాహరణకు నాలుగు పందల నలభైతొమ్మిదో పుటలో అప్పగింతలు అనే శీర్షిక ను ఎల్లోరా ఇలా మొదలుపెట్టారు ;

> పాటలేనిదే బ్రతుకే లేదా అనిపిస్తుంది ! లేచింది మొదలు పడుకొనేవరకూ - ఆటకు పాట, గెంతుకుపాట, నిద్రకుపాట, పనికిపాట, షెక్కరింతకు పాట, పూజకు పాట, నీతికి పాట, పాపకు పాట, అటుచూసిన పాట, ఇటుచూసినా బ్రతుకే పాట-గ్రామికులుఏపని చేస్తున్నా పాటలేనిదే చేయరు, బండతోయడం నుంచి పగ్గంపట్టడం వరకూ; చెట్టుకొట్టడం నుంచి గట్టు త్రవ్వడం వరకు, చేనుకోయడం నుంచి ధాన్యం మూట కట్టడం వరకూ; బెల్లు తప్పడం నుంచి ఏతంవేయడం వరకూ; కర్ర పట్టడం నుంచి కొడవలి ధరించడం వరకూ; సూరీడు లేచింది మొదలు పడుకొనే వరకు పాట-అందులోపని - అదే బ్రతుకు ఆ జాతకాలకు - అదేవారికి నిత్య కార్యక్రమం. పుట 449.

ఈ ఎత్తుగడ యథాలాపంగా ఉన్నా ఇందులో పనికీ పాటకూగల సంబంధాలను చర్చించే మౌలిక జిజ్ఞాస ఉంది. ఈ భావాంకురం మొలకెత్తితే

శాస్త్రీయ సామ్యవాద దృష్టితో మొత్తం జానపద సాహిత్యాన్ని అవగాహన చేసుకొనే అవకాశాలు తప్పకుండా ఉంటాయి. పాటలేనిదే పనిలేదు. అయితే చేసే పని దేనికోసం ?

శ్రమతో కూడుకొన్న ఏ వ్యాపారమైనా కూటికొసమే. అందుకే ఉత్తరోత్తరా కోటి విద్యలు కూటికొరకే అవసరమయ్యాయి. అన్ని కళలూ ఆదిలో ఆహారోత్పత్తి కోసమే ఉద్భవించాయి. ఆది మానవులు వేటాడుతూ ఆహార సేకరణ చేసే దశలో మాటలు కూడా వచ్చీరాని దశలో కలిసికట్టుగా కూతలు పెట్టినా, కుప్పి గంతులు వేసినా, కూనిరాగాలు తీసినా, కొట్టినా జంతువుల కొమ్ములు తల పైన ధరించి కూటపు చిందులు తొక్కినా, గుహగోడలపై కొంకి బొమ్మలు వేసినా, ఆదిమ కళలకు అంకురాలైన ఈ మానవవ్యాపారాలన్నీ కూటికోసం జరిగే ఉత్పాదక సాధనాలే.

ఆహార సేకరణ దశనుదాటి ఆహారోత్పత్తి దశను చేరుకొన్నాక మాటలు వచ్చిన మనిషి పాటకట్టడం ప్రారంభించాడు. తిండి దండిగా దొరకాలన్నా, పంట బాగా పండాలన్నా ప్రకృతి మనతో సహకరించాలి. తనకు సహకరించే ప్రకృతికి సహాయం చేయాలని ప్రపంచంలోని ఆది మానవ సంఘాలన్నీ రక రకాల తీర్లల్లో కొలుపులు కొలుస్తూ, కూటపు పాటలు పాడుతూ తెగ పెద్ద పద మెత్తుకొంటే తంతూ తతంగంలో అంతా వంత పాడేవారు. ఇది సంవత్తిటిక్ మ్యాజిక్. ఈ పాటలన్నీ ఉత్పాదక మంత్రాలు.

గణాలు గ్రామాలుగా ఏర్పడి, గ్రామ జీవితంలో వర్గాలు ఏర్పడి, అ వర్గాలలోపాలకవర్గాలు పాలితవర్గాలు సామాజికవ్యవస్థలోఎక్కువలూ, తక్కువలూ ఏర్పడ్డాయి. సమష్టి ప్రయోజనాల స్థానంలో స్వార్థం చోటు చేసుకొంది. పాలక వర్గాల లాభారే సామాజిక ధర్మాలయ్యాయి. వాటిని పరిరక్షించడానికే అన్ని కళా రూపాలనూ పాలకులు వాడుకొన్నారు. దినమంతా కష్టపడి ఉత్పత్తి చేసే వర్గాలూ, తేరగా కూర్చుని తినే వర్గాలూ స్థిరపడ్డాక సాహిత్యంలో కూడా వర్గ భేదాలు వచ్చాయి. జానపద సాహిత్యంలో శ్రామిక శాఖ, మధ్య తరగతి శాఖ ఏర్పడ్డాయి. ఈ గ్రంథంలో ఎల్లోరా ఈ రెండింటినీ చర్చించారు

మధ్య తరగతి జానపదం పాలక వర్గాల విలువలనే ప్రచారంచేస్తుంది. యక్షగాన ప్రబంధాల్లో (పుట 130 నుండి), తోలుబొమ్మలు (పుట 206

నుండి), వేదాంత పర పాటలూ (పుట 606 నుండి) ఇక అడవాళ్ళ పాటలు సరేసరి ఈ సంగతినే రుజువుచేస్తాయి. ఎల్లోరా చెప్పినట్టు 'మన భారతీయ సంప్రదాయంలో హిందూ మత ధర్మంలో మహిళలకు అన్ని వారాలూ నోములే... చేసుకోవాలేగాని - సంపత్సరం పొడుగునా కావలసినన్ని చేసుకోవచ్చు (పుట 379).' ఈ వ్రతాలూ, నోములు స్వంత సంక్షేమం కోసమేగాని సమష్టి సామాజిక ప్రగతికోసం కాదు. అడవాళ్ళ సాహిత్యంలో వర్గ స్వభావాలూ, విభేదాలూ కొట్టవచ్చినట్టు కనబడతాయి.

మధ్య తరగతి మహిళ తన శక్తి తాను గుర్తించిన వ్యక్తే.

'సువ్వా' ని నేనొక్క
పోటేసి తేనూ
చుక్కల్లు పికటిల్లు
సూరన్న కదులు
'అస్స'ని నేనొక్క
పోటేసితేను
ఆకసమ్మా కదులు
ఆ రాజు కదులు

(పుట 489)

చుక్కల్ని సూర్య చంద్రులనీ ఆకాశాన్ని కదిలించే శక్తిగల ఈ స్త్రీ కోరుకొన్న దేమిటంటే

నాతోటి వారెల్ల
నానులడిగితిరి
నేనొక్కటడిగితి
ఐదవతనము.

(పుట 490)

మగడు ఎటువంటివాడైనా, తాగుబోతైనా, జూదగొట్టయినా, జారుడైనా మధ్య తరగతి మహిళకు అతడే దైవం. జన్మ జన్మాలకూ అతడే మగడు

కానాలని పూజలు చేస్తుండి. శ్రామిక స్త్రీ మాత్రం 'మగడెందుకే తగని మగ డెందుకే' అని ప్రశ్నించి 'నా మగడు లేకున్న నాకేటి చింత.' అని ధైర్యంగా చెప్పగలదు. ఈ గుండె ధైర్యానికి కారణం ;

ఏకేకు ఒకబార
ఎలుండి సంత
నా యేకు తై పోయె
నాకేటి చింత ! (పుట 167)

సుప్పని పోటేసి చుక్కల్ని కదిలించే మధ్యతరగతి ఇల్లాలు అందని ఆకాశందాకా వెళితే, శ్రామిక యువతి మాత్రం 'కదురు చల్లగుంపె కదిలించు గోల్కొండ' అని రాజ్యానికే చలనం తీసుకురాగలననే చైతన్యం చూపిస్తుంది. ఇటువంటి తులనాత్మక పరిశీలన మన జానపద సాహిత్య విశ్లేషణలో చాలా అరుదు. 'ఈ కదురు పాట పల్లెవారి ఆర్థిక జీవనానికి చక్కని అద్దం. స్త్రీ యొక్క ఆర్థిక పారతంత్ర్యమే మగవాని జులుమునకు మద్దత్తు' అని ఎల్లోరా సరిగ్గా వ్యాఖ్యానించారు. (పుట 148). ఇటువంటి వర్గస్వభావ పరిశీలన ఇంకా చాలా విపులంగా జరగాలి. జాతీయ సంపదను సృష్టించే శ్రామికుల సాహిత్యాన్ని సంపూర్ణంగా విశ్లేషించాలి.

"ఈ శ్రామిక తరహా పని పాటలలో బ్రతుకే భాగమై ... తాను చేయ గలిగినా లేనున్నా మోయ గలిగినా లేకున్నా జానెడు పొట్టకోసం ఎకరాల కొద్దీ చాకిరీ, సంపాదన లేకున్నా ఈ గూడుకోసం బండల కొద్దీ బరువు...ఈ జానపద శ్రామిక గేయప్రపంచాన్ని ఎంతని చూపగలం ! ఎన్నని వ్రాయగలం?" అని ఎల్లోరా అంటారు (పుట-505) అంతా చూడాలి అన్నీరాయాలి అని పై ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఈ చూప డానికి రాయడానికే సమకాలిక మైన పరిశోధనలు ఆవశ్యకం. దానికి ప్రతి పదికగా సేకరణ జరగాలి.

"...పత్రికలతో ఎవరో కష్టపడి సేకరించి ప్రచురించిన పల్లెపదాలకు శుద్ధ ప్రతులు వ్రాస్తూ...తమ పేరుతో ప్రచురించుకోగల ప్రతిభాసంపన్నులకు సేకరణలోని సాధక బాధకాలు తెలియక పోవచ్చు"ననే శ్రీ సభాగారి మాటలను ఎల్లోరా ఉదాహరించడం సముచితం (పుట. 33) జానపద సాహిత్య సేకరణ వ్యయప్రయాసలకు శ్రమదమాదులకు ఓర్వవలసిన పని.

పరపాలన స్థిగపడ్డాక, తెల్ల దొరలు మన జానపద సాహిత్య సేకరణ ప్రారంభించారు. వాళ్ళ వరవడిలో భారతీయులు కూడా ఈ సేకరణలో ఉద్యమించారు. అంతకు ముందు ఈ సాహిత్యాన్ని సేకరించ వలసిన అవసరం భారతీయులకు కలగ లేదు. ఎందుచేతనంటే ఏ వ్యక్తికి సంబంధించిన పదాలు ఆవ్యక్తి నోళ్ళకు వచ్చు. వాటిని ఇతర వృత్తుల వాళ్ళు కూడా పనులలో వింటూ ఆనందించేవారు. ప్రతీకులాన్ని ఆశ్రయించుకొని ఇంకోకులం వుంటుంది. పోషక కులాల వారి కథలనూ, గాథలనూ గోత్రాలనూ ఈ ఆశ్రిత వర్గాల వారు భద్ర పరచి గానంచేస్తూ వుంటారు. పిచ్చుకుంట్లు, వీరముష్టి వాళ్ళు, శారద కాండ్లు, బవనీలు, దాసకులు బీరన్నల వారు, జంగాలు, సుద్దుల వాళ్ళు మొదలైన దేశి సాహిత్య సంపదలు సజీవ సంకలనాలు. వీళ్ళు వీరగాథం గాయకులు.

కర్ణకర్ణిగావిని కలిసికట్టుగా పాడుకొనే జానపద గేయాలను కాగితం మీద పెట్ట పలసిన అవసరం మనవాళ్ళకు పూర్వం కలగలేదు. జాన్ ఆర్చి బాల్ట్ బోయర్ తెలుగువీరగాథల పైన ఇండియన్ యాంటిక్వెరి (1874)లో ఒక వ్యాసం రాశాడు. సర్వాయి పాపని కథ మొదలైనవి చర్చించాడు. బోయల్‌కు ముందే 1871లో ఛార్లెస్. ఇ. గోవర్ దక్షిణ భారత జానపద గీతాలు అనే పుస్తకం ప్రచురించాడు. ఆయితే తెలుగు పాటలు లేవు, వేమన పద్యాలే ఉన్నాయి. బోయెల్ దొరవేసిన కాలిబాటను ఘంటా పథంగా చేయడానికి పంధొమ్మిదవ శతాబ్దిలోనే శ్రమించిన తెలుగు వాళ్ళు నందిరాజు చలపతిరావు గారు, రాజా మంత్రి ప్రెగడ భుజంగరావుగారూ ముఖ్యులు.

నందిరాజు వారు 1886లో వేడుకపాటలు అనే సంకలనం ప్రచురించారు. 1859 లో భుజంగరావుగారు 'స్త్రీల పాటలు' అచ్చువేశారు. ఎవరో పి. రామదాసుగారు 1894 లో 'పెండ్లి పాటలు' అచ్చువేస్తే 1895 లో నందిరాజువారు 'పెండ్లి వేడుక పాటలు' ప్రకటించారు. 1896 తో డి. కేశవరావుగారు 'వేడుక పాటలు' అనే ఇంకో సంకలనాన్ని అచ్చువేశారు. 'పెద్ద బొబ్బిలి రాజు కథ' 1898 లో నిడిగంటి వీరయ్యా చెంగల్వరాజు సచిత్రగా అచ్చువేశారు. 1899 లోనే నేలూరు కన్నయ్య నాయుడు 'సకలజన రంజకంబగు సటుల నూతన బొబ్బిలి రాజుల కథ'ను ప్రచురించాడు. 1900 లో నందిరాజువారు స్త్రీల పాటలను పుస్తక రూపంతో తీసుకువచ్చారు.

కడచిన శతాబ్దపు చివరి దశాబ్దులలో ప్రారంభమై అంకురించిన జానపద సాహిత్య వృక్షం నేడు ఎంత విస్తరించినా ఇంకా ఎన్నో శాఖోపశాఖలుగా సాగవలసిన అవసరం ఉంది. ఎందరెందరో తమ పరిశోధనలకోసం సేకరించినవి ప్రచురితం కావాలి. ఉదాహరణకు అచార్య బిరుదురాజు రామరాజుగారు తమ పరిశోధనకోసం వేయి గీతాలను సేకరించారట. అవన్నీ లచ్చు పడ్డాయని చెప్పలేము. డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావుగారు చాలా కథా చక్రాలను సేకరించారు. అందులో ఒక్క 'కాటమరాజు కథలు' మాత్రమే పుస్తకరూపంలో వచ్చాయి.

జానపద సాహిత్య సేకరణ సముద్రానికి ఏతామెత్తడంవంటిది. అయినా తోడక తప్పదు. అదీ ఈ తరంలోనే ఎక్కువగా జరగాలి. ఇంకో రెండు మూడు తరాలు పోతే ఈ పాటలు కాలగర్భంలో కలసిపోవచ్చును. ఎల్లోరా ఈ గ్రంథంలో పతి చోట వాపోయినట్టు జీవితం యాంత్రికమవుతూంది."కాఫీ గింజలకు మర, పంచదార నలగడానికి మర, పోక చెక్కకు మర కత్తెర, ధాన్యానికి మర, పిండికి మర, పళ్లు పిండుకోడానికి మర-" (పుట 487) "తిరగళ్లు స్థానంలో పిండిమరలో, దంపువాళ్లకు బదులుగా బియ్యం మిల్లులు, గొబ్బి కోలాటాల ఆటల బయలు ప్రదేశాలలో టెంగ్ టెన్సిసులు" (పుట 81). పాత పాటలు, ఆటలు గృహ కృత్యాలు. వేడుకలు కనుమరుగవుతున్నాయి. అవక తప్పదు.

ఉత్పత్తి సాధనాలు మారినప్పుడు ఉత్పత్తి విధానాలు మారుతాయి. ట్రాక్టర్లూ, బుల్‌డోజర్లు, మోటారు పంపులు వచ్చాక ఆ యంత్రాల రణగొణ ధ్వనులలో వనిపాటల ప్రమేయం ఉండదు. గట్టుమీద ట్రాన్సిస్టర్ పెట్టి పాలం పనులు చేసుకొనే రోజులు వచ్చేశాయి. దేశాభ్యుదయానికి అవసరమైన యంత్ర యుగానికి స్వాగతం చెప్తూనే మనం మన ప్రాచీన నాగరికతను రికార్డుచేసి నిక్షిప్తంచేసుకొనాలి. దృశ్యకళలూ, వాగ్రూప కళలూ, ప్రదర్శన కళలూ పెన వేసుకొన్న జానపద సంస్కృతిని అర్థాయన్స్‌లో భద్రపరిచి గుణపాఠాలు నేర్చుకోవాలి. జన జీవితంలో ప్రవేశపెట్టాలి.

జానపద విజ్ఞాన సేకరణలో పూర్వ పద్ధతులు ఇప్పుడు పనికిరావు. ఏ అరుగుమీదో చెట్టుకిందో వ్యాస కర్త కూర్చొని పాడితే సేకరణ కర్త రాసు

కొనే రోజులు పోయాయి. పనిపాటలను ఆయా పనులు చేసుకొంటున్నప్పుడు టేప్ రికార్డు చేసుకోవాలి. అప్పుడే పనిలో ఉన్న లయ, ఊపు, విరుపులు. అలుపు పాటలో వినబడుతుంది. వీడియో సౌకర్యాలు వచ్చాక పాడే తీరును కళ్ళారా చూడగల అవకాశాలు కూడా ఏర్పడ్డాయి. డాక్యుమెంటరీ చిత్రాలవల్ల చాలా ప్రయోజనం ఉంటుంది. దీనివల్ల జాతీయ సమైక్యతకు అవకాశం ఉంది. ఉదాహరణకు మనకు 'దాదీనమ్మ వేషం' అనే కళారూపం ఒకటి ఉంది. పట్టె పుంచాన్ని నడుముకు కట్టుకొని దానిమీద పవ్వళించినట్టు అభినయిస్తూ కళాకారుడు లేక కళాకారిణి మూడు నాలుగు గంటల ప్రదర్శన ఇవ్వడం జరుగుతుంది. ఇది మన ఆంధ్రుల ప్రత్యేకత అనుకోవచ్చును గాని సరిగ్గా ఇదే కళారూపం గుజరాతీల భవాయిలో కూడా ఉందని ఒక డాక్యుమెంటరీ చలనచిత్రం చూశాక నాకు తెలిసింది.

విదేశాలలో జానపద విజ్ఞాన సేకరణ కృషి, పునరుద్ధరణ కృషి ఎంతో విస్తృతంగా ఎరుగుతుందో ఈ పుస్తకంలో ఎల్లోరా వివరించారు (పుటలు 171-2). భారీ యెత్తున శాస్త్రీయ పద్ధతులలో జానపద విజ్ఞాన సేకరణ ప్రస్తుత పాలకవర్గ ప్రభుత్వాల హయాంలో జరుగుతుందని చెప్పలేం. మన రాష్ట్రంలో జానపద సాహిత్య అకాడమీని సంస్థాపించుకొనే వార్త ఒకటి ఈ మధ్య వినబడింది. అది ఎప్పటికి కార్యరూపం దాలుస్తుందో చెప్పలేం. అంతదాకా ఈ సాహిత్యంకోసం కంకణం కట్టుకొన్న వ్యక్తులూ, అటువంటి వ్యక్తులతో ఏర్పడ్డ ఔత్సాహిక సంస్థలూ శ్రమించక తప్పదు.

రమారమి రెండున్నర పుష్కరాలుగా ఈ రంగంలో పుష్కలంగా కృషి చేస్తున్న ఎల్లోరా ఇంకా చేయవలసిన దెంతో ఉంది. 'జానపద సాహితీ సమాఖ్య' వంటి ఔత్సాహిక సంస్థకు ఆధ్యక్షులు కనుక ఆ సమాఖ్యలోని వారిచేత ఎన్నెన్నో చేయించాలి. మనకు 'జానపద విజ్ఞాన సర్వస్వం' ఒకటి అకారాధిగా సమకూర్చడం ఎంతో అవసరం. ఈ కార్యాన్ని ఎల్లోరా సారథ్యంలో ఈ జానపద సాహితీ సమాఖ్యవారు చేపట్టవచ్చు. దేవిడి జమీందారుగారు ఒంటిచేతి మీదుగా ఏడు సంపుటాల 'ఆంధ్ర విజ్ఞానం' అకారాది క్రమాన వెలువరించారు. కాబట్టి ఒక ఔత్సాహిక సంస్థ ఈ బృహత్కార్యాన్ని చేపట్టడంవల్ల అది అయ్యే పనేనా అని శంకించవలసిన అవసరం లేదు.

ఇరవై రెండేళ్ల కింపట ఎల్లోరా 'మధుర కవితలు' గ్రంథానికి ఆముఖం వ్రాస్తూ నార్ల చెప్పిన మాటలు అక్షరాలా నేటికీ సత్యాలు. "ఈ సాహిత్య ప్రచారాన్నే తన జీవిత లక్ష్యంగా పెట్టుకొన్నవారు ఈ యువకవి అట్టి తప్ప ఆశాభంగం లేదు : ప్రయత్నమే తప్ప ప్రతిఫలాపేక్ష లేదు". (పుట 19).

ఎల్లోరాకు ఆశాభంగం లేదన్న సంగతిని ఈ ప్రస్తుత పుస్తక ప్రచురణే విశదం చేస్తోంది. ప్రతిఫలాపేక్ష లేదన్న సంగతి ఎల్లోరా 'బయోడేటా' చెప్తోంది (పుటలు 9-13). ఏ అకాడమీతోనూ సంపూర్ణ సభ్యత్వం లేదు (సలహా సంఘ సభ్యత్వం లాంఛన ప్రాయం). జానపద వాఙ్మయ వేత్తగా ఎక్కడా సన్మానాలూ, సత్కారాలూ జరిగినట్టాలేదు. జరిగితే ఆ సంగతి ఈ ప్రచురణ కర్తలకు తెలియదనుకోవాలి.

ఈ ప్రచురణకర్తలు ఎల్లోరా బయోడేటాలో కొన్ని సంగతులు చెప్పలేదు, 1970 నుండి మద్రాసులోని అభ్యుదయ రచయితల సంఘం సహాయ కార్యదర్శిగా ఎల్లోరా ఎనలేని సేవ చేశారు. రాజకీయ పార్టీల ప్రాబల్యంలేని సంస్థగా అరసం వేళ్ళు నిలతొక్కుకొనడంలో ఎల్లోరా చాలా కీలకమైన పాత్రను వహించారు.

ఎల్లోరా కీలక పాత్ర వహించవలసిన రంగాలు కొన్ని ఉన్నా ఆయన ఏరికోరి అంకితమైన జానపద సాహిత్య రంగంలో కచ్చితమైన పథకాలు వేసుకొని జానపద విజ్ఞాన సర్వస్వాన్ని రూపొందించాలని నా ఆకాంక్ష. ఈ పనికి వెంటనే ఎల్లోరా పూనుకొంటే నాకన్నా సంతోషించేవాళ్ళు మరెవ్వరూ ఉండరు.

ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు



30 ఏళ్ళ క్రితం కోన సీమలో, కొబ్బరి తోపుల్లో, పచ్చని పంట పొలాలలో, ప్రకృతి అసంచారాసీమలో, గోదారి లంకల్లో, రాదారి పొడవల్లో పరినాట్లు, కోతలు, కూలి పనులు చేసుకొనే జనం అందాల మధ్య ఆనందాల మధ్య ఆడిపాడి నేను దోచుకొని దాచుకొన్న తియ్యని అనుభూతులు, కమ్మని జ్ఞాపకాలు, అమాయక ప్రజల అనురాగాలు, జానపదకవితా గానమాధుర్యం నాలో కలిగించిన మధురానుభూతుల జ్ఞాపకాల ముచ్చలసరాలే నా జానపద సాహితీ సముచ్చయం.

తలుచుకొంటే-కోనసీమ చల్లని ప్రకృతి రామణీయకతలో గడిపిన క్షణాలు - వేదపండితులు, సంస్కృత ఘనాపాఠీలు, పయ్యా కరుణులు, కవులు, రసగంగాధరుడు జగన్నాధ పండిత రాయలు-ఇలా ఎన్నో ఎన్నెన్నో సుందర దృశ్యాలు, నిశ్శబ్ద సహృదయ సాహితీ తరంగాలు.

అక్కడ పుట్టి, ముగండ అగ్రహారంలో చదువుకు అర్థం తెలియని రోజుల్లో చెట్లనీ పుట్టలనీ, చేలనీ కాలవలనీ, గోదాపని తల్లినీ నా ప్రస్తాన యాత్రాస్థలంగా - నా సాహితీ మండపంగా ఎంచుకొన్న క్షణాలు.

అప్పుడే - ఆప్పటికి ఇంకా తెలుగు నాడున జానపద సహిత్యంపై తగిన కృషీ, పరిశోధనా జరగని రోజుల్లో-నాలో దేశికాలస్వతం మీద మనసు, చూపు పడింది.

అలా వేలాది గేయాలు, పాటలు, పదాలు, సామెతలు, కీర్తనలు, తత్త్వాలు-ఒకటేమిటి-ఆరుద్ర అన్నట్టు ఏం దొరికితే అది, ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు సేకరించాను.

1950 నుంచీ మద్రాసు రేడియో కేంద్రం నుంచి 15 ఏళ్ళపాటు జానపద గేయాలను సమర్పించి వినిపించాను. ఆనాడు నాకు ఉత్సాహ ప్రోత్సాహాలు అందించిన-జనమంచి రామకృష్ణ, శ్రీవాత్సవ, బాలాంత్రపు రజనీకాంతరావు, మల్లిక్, వైదేహి-ఇలా ఎందరో ఆత్మీయులు.

వీటిని ఎప్పటి కప్పుడు చూస్తూ - గ్రంథస్తం చేయమని భుజం తట్టిన నార్లవారు, విద్వాన్‌విశ్వం, తాపీధర్మారావు, గుడుగుసీతాపతి, జల సూత్రం రుక్మిణీనాథశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రి, ఆరుద్ర, బోయి భీమన్న, శ్రీరంగం నారాయణబాబు, తిరుమల రామచంద్ర, తుమ్మల వెంక ట్రామయ్య పంటి ఆత్మీయులు.

ఇంతమంది పరిచయం-స్నేహం అభిమానం-ఆదరణలతో 'జాన పదగేయాలు' పేరున 1959లో ఒకటి 1960లో ఒకటి సంపుటాలను విశాలాంధ్ర ప్రచురణాలయం వారు ప్రచురించడంతో నాలో ఎక్కడ లేని ఉత్సాహం, పట్టుదల కలిగింది.

ఆ ఉత్సాహ ప్రోత్సాహాలకు గుర్తుగా-జానపద సాహిత్యంపై సంవత్సరాల తరబడి వ్యాసాలను ఆంధ్రప్రభ, విశాలాంధ్ర, ప్రసవంతి వంటి పత్రికలలో రాస్తూ వచ్చాను.

అప్పటికిగాని-ఇంటగెలువడ మంటే ఏమిటో తెలిసిరాలేదు.

జ్యోతిషశాస్త్ర వేత్త, సంస్కృతాంధ్ర పండితులు - హైదరాబాదు లోని తిరుపతి దేవస్థానం వారి సంస్కృత పాఠశాల ప్రిన్సిపాల్ - మా అన్నగారు గొడవర్తి శ్రీరామమూర్తిగారి ఆశీస్సులు అందడండలు లభించాయి.

ఎందరో మిత్రులు వాడవాడలా నాకు సాయపడ్డారు. అందులో పదలవాడ పిచ్చయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి (జానపదసలహా మందలితో

నన్ను సభ్యునిగా వేసిన అప్పటి ముఖ్యమంత్రి, ఆత్మీయులు) ఆచార్య ఆత్రేయ, అనిసెట్టి-ఇలా ఎందరో.

ఆప్పుడే జానపద సాహిత్య సమీక్షా గ్రంథాన్ని రచించాలనే తపన నాలో కలిగింది.

చాని పర్యవసానమే 20 ఏళ్ళనాడు నేను రచించిన "మధుర కవితలు".

ఈ మధుర కవితలు జనంలో చాలామంచిపేరుప్రఖ్యాతులను కలిగించింది. అదే సమయంలో "సరాగాలు" (ఉపోద్ఘాతంతో కూడిన జానపదగేయ సంపుటి) వెలువరించాను.

అప్పటికి బి. రామరాజు జానపద సాహిత్యంపై రిసెర్చి చేస్తూండడం, తూమాటిదోణప్ప, బి. రామరాజు, హరి ఆదిశేషువు, నేదునూరి గంగాధరం, నన్నూ చేర్చి ఫోక్‌లిటరేచర్ ఎడ్వయిజరీ కమిటీని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నియమించడం జరిగింది. అయితే చాని వల్ల పెద్దగా పని జరగలేదు.

ఈ లోగా ఉద్యోగరీత్యా నేను విజయవాడ, మద్రాసు, బెంగుళూరు ప్రస్తుతం హైదరాబాదులలో ఉంటూవడంతో నా దీక్షకు కాస్త అంతరాయం కలిగిందనే చెప్పక తప్పదు.

ప్రజల అంచనాకు పుష్కలంగా ఉంటూనే ఉంది. అంతటితో సరిపోదుగా-ప్రభుత్వం-ప్రత్యేకించి విద్యాశాఖ, సాంస్కృతిక శాఖలు ఇటువంటిపాటిలో అండగా నిలవాలి.

నిజం చెప్పడం నిజాయితీ కదా చెన్నారెడ్డిగారు, జలగం వెంగళరావుగారు, ఎం. వి. కృష్ణారావుగారు, భవనం వెంకట్రాంగారు, భట్టం శ్రీరామమూర్తి గారు, అంజయ్యగారు, విజయ భాస్కరరెడ్డిగారు, నాదెండ్ల భాస్కరరావుగారు-నేను చేస్తూన్న సాహిత్య కృషికి ఆశీస్సులు అందిస్తూ అండగా నిలవడం నా అభీష్టం.

ప్రస్తుతం (1982 డిశంబరు) అంటే మధుర కవితలు రాసిన 20 ఏళ్ళ అనంతరం ఒక బృహత్ కార్యాన్ని తలపెట్టి సాంస్కృతిక శాఖ

దృష్టికి, మంత్రుల దృష్టికి తీసుకు వచ్చాను. నీ జానపద సాహిత్య పరిశోధన గ్రంథం ప్రారంభించు, మేం ఉన్నాం అని పత్రాసు పంతులు-మాట నిలుపుకొన్నారు.

"జానపద సాహిత్యం" పేరున పరిశోధనాత్మక గ్రంథాన్ని సుమారు 700 పేజీలతో ఈనాడు వెలువరించ గలిగాను.

ఈ బృహత్ గ్రంథం సర్వాంగ సుందరంగా వెలువడడానికి ఎందరి అండదండలో-డాక్టర్ కొత్త పల్లి వీరభద్రరావుగారు, శ్రీ ఆరుద్ర గారు, శ్రీపుణిపండాగారు-ఈ సాహితీ త్రిమూర్తులు సమగ్రంగా నా ఈ గ్రంథాన్ని చదివి తొలిపలుకులు రాసి నా కృషిని పరిచయం చేయడం నా అదృష్టం !

3 దశాబ్దాల నా సాహితీ యాత్రలో ఇది నా 36వ గ్రంథం-తెలుగు ప్రజల, సాహితీ పరుల చల్లని దీవెనలే నా కృషికి కొండంత అండగా భావిస్తూన్నాను.

ఎందరో మహానుభావులు అందరికీ వందన సహస్రాలు !

1-8-150/4, Chikkadpally
Hyderabad - 500 020.

కృతజ్ఞతలు

ఈ గ్రంథముద్రణకు కొంత సాయం అందించిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ వారికి-ప్రత్యేకించి శ్రీ ఘట్టం శ్రీరామమూర్తి గారికి.

* * *

అసలు ఈ బృహత్ గ్రంథరచనకు నేనున్నానని భుజం తట్టి సాయపడిన ఆత్మీయులు శ్రీబులుసు వి. ఎస్. ఎస్. మణిగారికి.

* * *

మరికాస్త సహాయం అవసరమైనప్పుడు ఓయని పలికిన సప్తగిరీశ వాసునికి-ప్రత్యేకించి తిరుమల తిరుపతి దేవస్థానం వారికి.

* * *

రచన ప్రారంభించినప్పటినుంచీ నాకు అండగానిలచి హార్థికంగా, ఆర్థికంగా నా ప్రక్క నిలచిన నా శ్రీమతి గొడపర్తి మాణిక్యాంబకు.

* * *

గ్రంథాన్ని ముచ్చటగా అలంకరించడంలో పరిపూర్ణ సహకారం అందించిన సుప్రీంఆర్ట్ ప్రింటర్స్ అధిపతి చిరంజీవి జి. శ్రీనివాసరావు **MSc** కి.

* * *

గ్రంథంలోని అన్ని బ్లాకులూ, ముఖచిత్రం బ్లాకులూ అడిగ్గానే చేసి ఇచ్చిన మిత్రులు శ్రీ సుబ్బారావు గారికి.

* * *

ముఖ చిత్రం వేసి పెట్టిన బాపు, చిత్రాలు వేసిపెట్టిన చంద్ర. సాయి కృష్ణ గార్లకు.

* * *

కవరు పేజిని ఐదురంగుల్లో ముద్రించి ఇచ్చిన సుప్రీం ఆర్ట్స్ వారికి.

* * *

గ్రంథాన్ని ఆమూలాగ్రం చదివి తమ తమ అభిప్రాయాలను పీఠికా రూపంలో రాసిచ్చిన ఆత్మీయులు ఆచార్య, కొత్తపల్లి వీరభద్రరావు, ఆయుర్ద, పురిపండా అప్పలస్వామి గార్లకు.

* * *

ఈ గ్రంథరచనకు తోడ్పడిన మిత్రులకు, స్వాగతం పలుకు తూన్న సాహితీ ప్రియులకు

సాహితి

1-1-1982

-ఎల్లోరా

(అధ్యక్షులు-జాసపద సాహితీ సమాఖ్య)

9

మధుర కవితలు

ఆవిష్కరణ సభ



రెండు దశాబ్దాల క్రితం - అంటే 1961లో జానపద సాహిత్యంపై ఎల్లోరా రచించిన 'మధుర కవితలు' గ్రంథావిష్కరణ (విజయవాడలో) నాటి ఫోటో

నార్ల వెంకటేశ్వరరావు, అమరేంద్ర, సంజీవదేవ్, శ్రీవాత్సవ, విద్వాన్ విశ్వం, తుర్లపాటికుటుంబరావు, ఎల్లోరాగార్లు చిత్రంలో ఉన్నారు.

1951 నుంచి 1980

మూడు దశాబ్దాల సాహితీ ప్రస్థానంలో ఎల్లోరా

గోదావరి తీరంలోని కోనసీమకో ముంగండ ఎగ్రహారంలో జన్మించారు.

చిన్నతనం నుంచీ దాని సంఘాలనీ, ఆనంతరం యువజన సంఘాలనీ అంటూ ప్రజా సమస్యలలో నిత్య సంబంధం పెట్టుకొనే వారు.

పండిత కుటుంబంలో జన్మించిన పూర్వ జన్మ వాసన పల్లనేమో, చిన్న తనంలో అటు సంస్కృత కావ్యాల వెంపూ, ఇటు తెలుగు కావ్యాల వెంపూ దృష్టి ఉండేది.

ఏం చదివారు అంటే చిరునవ్వు నవ్వి "చదివింది తక్కువ - చదువుకో పలసింది బోలెడు" అంటారు.

1951 లో తెలుగు సినీరంగంలో టెక్నీషియన్‌గా చేర్చాలని అన్నగార్లూ వాళ్లూ ప్రయత్నించగా తన ప్రవృత్తికి సరిపడదని పదులుకొన్నారు.

తిరుపతి సంస్కృత పాఠశాలలో చదివిద్దామని అన్నగారు తీసువెళ్లగా తనకు అక్కడా పట్టలేదని ఆ చదువు పూర్తి చేయలేదు.

చిన్నతనం నుంచి ఓ చిన్నకవిత రాయాలనో, నాలుగు ముక్కలు మాట్లా డాలనో, ఏదో రాయాలన్న తపన ఉండేది.

పుట్టిన ఊళ్లో తగిన ప్రోత్సాహం దొరకలేదు. వామపక్ష రాజకీయాలు ఆ ప్రాంతంలో నిప్పులు చెరుగుతున్న రోజుల్లో అంటే 1951 నాన - ఆ ప్రాంతాలలో మద్రాసు చేరారు.

ప్రఖ్యాత తెలుగు జర్నలిస్టు, ప్రముఖ సంపాదకులు శ్రీ నార్ల వారి వద్ద ఆంధ్రప్రభలో ఉద్యోగం సంపాదించారు.

అప్పటి నుంచి పత్రికా రంగంలో నార్లవారు, విద్వాన్ విశ్వం, తెన్నేటి సూరి, జలసూత్రం రుక్మిణినాథశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రి మొదలయిన వారి ఉత్సాహ ప్రోత్సాహాలు లభిస్తూండేవి.

అప్పుడే అటు రేడియోలో - జనమంచి రామకృష్ణ, శ్రీవాత్సవ వంటి వారితో, నండూరి విఠల్, బుచ్చిబాబు వంటి వారితో మంచి స్నేహం ఏర్పడడం, తద్వారా నాటినుంచే రేడియో కార్యక్రమాలలో పాల్గొంటూండడం జరిగింది.

సంస్కృత పండితులు, జ్యోతిష శాస్త్రవేత్త, హైదరాబాదులోని తిరుపతి దేవస్థానం సంస్కృత పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ గొడవర్తి శ్రీరామమూర్తి గారు వీరి సోదరులు.

రేడియో కేంద్రాలు చాలాచోట్ల కథలూ, నాటికలూ, బుర్రకథలూ, కవితలూ, సమీక్షలూ, ప్రసంగాలూ వంటి అన్ని సాహితీ ప్రక్రియలలోనూ పాల్గొన్నారు.

మద్రాసు టి. వి, హైదరాబాదు దూరదర్శిని కేంద్రాలలో అనేక కార్యక్రమాలలో పాల్గొంటూనే ఉన్నారు.

జానపద సాహిత్యంలో అపూర్వ కృషి చేసి సుమారు ఆరు సంపుటాలు ముద్రించారు.

సుమారు వెయ్యి పేజీలలో "జానపద సాహిత్యం" అన్న గ్రంథాన్ని రచిస్తున్నారు.

తెలుగులో జానపద సాహిత్యంలో అపూర్వ కృషి చేసిన వారిలో శ్రీ వేపనూరి గంగాధరం గారి తర్వాత ఎర్రోరా గారినే చెప్పవలసి వుంటుంది.

వీరి జానపద గేయాలను 1955 లో మొట్టమొదటిసారిగా విశాలాంధ్ర ప్రచురణాలయం వారు ప్రథమ సంపుటిగా వెలువరించారు.

ఓరే ''జానపద గేయాలు''. రెండవ సంపుటిని గిడుగు సీతాపతి గారి తొలిపలుకుతో 1959లో వెలువరించారు.

జానపద సాహిత్య విమర్శకుడుగా, పరిశోధకుడుగా ఎల్లోరా పేరొందాడు.

''మధుర కవితలు'' అనే జానపద సాహిత్య సమీక్షాగ్రంథాన్ని 541 పేజీలతో 1961 లో వెలువరించారు.

జానపద సాహిత్య పరిశోధకునిగా జనం గుర్తించి విజయవాడలో అపూర్వ సత్కారం జరిపారు. ఆ సభలో శ్రీయుతులు వి. ఆర్. నార్ల, విద్వాన్ విశ్వం, అమరేంద్ర, శ్రీవాత్సవ, సంజీవ దేవ్ వంటి ప్రముఖులు పత్రులుగా పాల్గొనడం విశేషం.

అనంతరం "సరాగాలు" పేరిట జానపద గేయాల సంపుటిని రామోత్రీతో వెలువరించారు. 1960లో ''సినీప్రభ'' సినీ పక్షపత్రికకు ఎడిటర్‌గా పనిచేశారు. బి. ఎన్. రెడ్డి, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి మన్ననలు అందుకొన్నారు.

ఓయస్ ఆఫ్ అమెరికాలో కూడా తెలుగు జానపద కవితా మాధుర్యాన్ని వినిపించారు.

1961 లో నార్ల ఆహ్వానం మీద విజయవాడలో స్థాపించిన ఆంధ్రజ్యోతి దినపత్రికలో సబ్-ఎడిటర్‌గా చేరారు.

ఆ సమయంలో మంచి పత్రగా ప్రశంసలు పొందారు.

1960 లో 'మన ప్రాచీన కళలు పుట్టు పుర్వోత్తరాలు' అనే గ్రంథాన్ని శ్రీ నిడదవోలు వెంకట్రావుగారి ఆముఖంతో రచించి ఆరుద్ర, సంజీవదేవ్ వంటి ప్రముఖుల మన్ననలు అందుకొన్నారు.

1955 నుంచి బాల సాహిత్యంలో అద్వితీయమైన కృషి చేశారు.

పాపాయి పాటలు, చంద్రపదాలు, పండుగల పాటలు, కోకిలమ్మ కథ, డాక్టర్ కోకిల, మంచిరాయి, విచిత్ర కథలు, సరయుప్రభ గర్వంలో, పూపుణ్యా-మొగ్గలూ మొదలయిన 16 గ్రంథాలు రచించారు.

ఆంధ్రప్రభ, ఆంధ్ర సచిత్ర వారపత్రిక మొదలయిన పత్రికలలో చంద లాది కథలు, గేయాలూ రచించారు.

కదలిపోయిన రైలుబండి, జైలు గోడలకు మాటలు వస్తే అనే కథానికా సంపుటాలను రచించారు.

ఇంచుమించు కొన్ని కన్నడంలోకి, హిందీ భాషలలోకి వెళ్ళాయి. సాంఘిక నవలలు-గుడిగంటలు, పరిసరాలూ ప్రభావాలూ, కాలచక్రం, ప్రేమ నీరాజనం, సంధ్య దీపాలు, కారుచీకట్లు కాంతిరేఖలు మొదలయినవి రచించారు.

పాతాళ గృహం, భయంకరి పన్నాగం, ముగ్గురు అనుమానితులు వంటి మిస్టరీ నవలలూ రాశారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఎల్లోరా.

జానపద సాహిత్యం, బాల సాహిత్యం, కథానికలు, సాంఘిక నవలలు, మిస్టరీ నవలలు - ఇలా అనేక ప్రక్రియలలో కృషి చేసిన ఎల్లోరా తెలుగు సాహితీ వనంలో కొత్త గులాబులు విరిసి విప్పారాలనే ఆశతో, ఆశయంతో - తెలుగు వచన కవితా ప్రక్రియను కొత్త కోణం నుంచి చేబట్టి 1974 లో 'రేపటి వసతం' అనే వచన కవితా సంపుటిని రచించారు.

ఈ కవితా సంపుటి ఆధునిక వచన కవితాలోకంలో కొత్త గొంతు వినిపించింది.

"రేపటి వసంతం"కు శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మ ఉపోద్ఘాతం రాస్తూ "తెలుగు సాహిత్య ఎడారిలో ఎల్లోరా కవిత ఒక నీలి ఒయాసిస్సు. అందంగా కవిత్వం చెప్పగల ఒకరిద్దరిలో ఎల్లోరా ఒకడు" అని.

1976 లో ఎల్లోరా తెలుగు వచన కవితా ప్రక్రియలో రసవాదాన్ని ప్రవేశపెట్టి ఉద్యమాన్ని కొత్త దారి పట్టించారు.

1976 లో "నిశ్శబ్ద తరంగాలు" అనే వచన కవితా సంపుటి రచించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు అందుకొన్నారు.

తాయిగు పద్యం ముక్తకం రాసినా, సలభై పద్యం వచన కవిత్వం రాసినా ఎల్లోరా తనదీ అన్న ఒక వాణిని, ఒక వాణిని పలచుకోవడం ప్రత్యేకత.

తెలుగు నాటకంపై సమీక్ష రాసే విధానంలో ఎల్లోరా మంచి విమర్శకుడిగా పేరొందారు. ఉన్న దున్నట్లు, అనుకొన్నది అనుకొన్నట్లు నాటక సమీక్ష రాసి దూషణ భూషణ తిరస్కారాలు అందుకోడం ఎల్లోరా హాబీ !

ప్రత్యక్షంగా నిజ జీవితంలో ఎంత నిక్కచ్చిగా ఉంటారో ఎల్లోరా పత్రగా అంత నిర్భీకతతోనూ నిలవడం లక్షలాది ప్రజలకు నిత్యం తెలిసిందే.

విజయవాడలో, మద్రాసులో, బెంగుళూరులో జర్నలిస్టుగా పనిచేశారు.

ప్రస్తుతం హైదరాబాదులో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు అసిస్టెంటు ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

దీప్తి, అక్షరమూర్తి అనే పేర్లతో 'ఆంధ్రప్రదేశ్' పత్రికలో రాజధాని విశేషాలూ రాశారు. ప్రభ వీక్లీలో ఫోటో ఫీచర్‌నూ నిర్వహించారు.

ఒక మహాయజ్ఞంగా జరిగిన ప్రథమ, ద్వితీయ ప్రపంచ తెలుగు మహా సభలలో ప్రధాన పాత్ర వహించారు. మలేసియా సభలలో అధికార హోదాలో పాల్గొన్నారు.

మద్రాసు కమిటీ జాయింట్ కన్వీనరుగా ఉన్నారు. "తెలుగు వెలుగు" సావనీర్‌కు ఎడిటర్‌గా ఉండి ఒక్క చేతి మీదుగా సర్వాంగ సుందరంగా సావనీర్‌ను వెలువరించి, శ్రీ జలగం వెంగళరావుగారు, శ్రీ యం. వి. కృష్ణారావుగారల ప్రశంసలు పొందారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ మోడరన్ లిటరేచర్ ఎడ్వయిజరీ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

సాహితి (తెలుగు సాహిత్య వేదిక) వ్యవస్థాపకాధ్యక్షులు.

జానపద సాహితీ సమాఖ్య అధ్యక్షులు.

జానపద సాహిత్య సలహా మండలి సభ్యులు.

పండితాది కవి సమ్మేళనాలలో, సాహిత్య సదస్సులలో పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంపై "సమీక్ష" అనే విమర్శనాత్మక గ్రంథాన్ని రచించారు.

సాహిత్యం సమాజాన్ని ప్రతిఫలిస్తూ, ప్రభావితం చేయాలని అంటారు.

35 గ్రంథాలు రచించారు.

ఎల్లోరా ఆశయం—

సుకవితా యదస్తి రాజ్యేన కిం !

ప్రచురణ కర్తలు

1982 ఏప్రిల్ హైదరాబాదు

14

తొలిపలుకు

శ్రీ గిడుగు వెంకట సీతాపతి గారు

[1959 జూన్‌లో విశాలాంధ్ర ప్రచురణాలయంవారు ప్రచురించిన "జానపదగేయాలు" రెండవ సంపుటికి రాసిన తొలిపలుకు]

జానపద జీవితాన్ని ప్రతిఫలింపజేసే వాఙ్మయంలో జానపద గేయాలు ఉన్నతస్థానాన్ని పొందదగినవి. అందులో జానపదుల నిత్యకృత్యాలే ఎక్కువగా కనబడుతూవున్నా అవి రసపంతంగాను, హృదయరంజకంగాను రచితములయినవి. మాయామర్మ మెరుగని వారి జీవితాలు సహజసిద్ధములైన రాగద్వేషాలకు లోనైనా ఉదాత్తములయిన భావాలతోను, అవ్యాజములయిన ఆశయాలతోను, మృదుమధురములయిన పలుకులతోను, సరళమయిన నడవడితోను నదులలోని నిర్మలోదకములలే ఎట్లు సాగుతూ వుంటవో జానపద గేయాలు తెలియజేస్తూ ఉంటవి. ఉన్నదానికో తృప్తిచెంది, తృణం మేరువుగా చూచుకొని ఉత్సాహంతో ముందుకు పోగల శక్తి జానపదులలో ఎక్కువగా గోచరిస్తూ ఉంటుంది. ఊహాగానంలో వారు సర్వస్వతంత్రులు; మేఘాలలో బొమ్మలు చిత్రించుకోగలరు: బొమ్మలతో ప్రసంగించగలరు; ఆకాశంలో మేడలు కట్టుకోగలరు; రెక్కలు కట్టుకొని పైకి ఎగరగలరు; బ్రహ్మసృష్టికి మెరుగులు దిద్దగలరు; ధర్మదేవత అధర్మాలను అధిక్షేపించగలరు; దుష్టదేవతలకు పొలిమేరనే ఉపహారాలు పెట్టి పొమ్మనగలరు; సరసంగా సరసాలాడగలరు; పొంచులుకలు మెలుకువతో తీస్కొని పొత్తుపడగలరు; కష్టాలలో సుఖాలు చూడగలరు; తోడివారల సుఖదుఃఖాలు సమంగా పంచుకొని సహకరించగలరు; సంఘజీవిత మెట్లుంచవలెనో సవనాగరకులకు బోధించగలరు. ఈ సద్గుణములన్నీ జానపదగేయాలలో ప్రతిబింబితము అవుతూ ఉంటవి.

జానపద గేయాలను భాషాలక్షణానికి లక్ష్యంగా లక్షణజ్ఞులు గ్రహించలేదు. వారి భాషానుశాసనము ప్రబంధాది కావ్యరచనకు వర్తింపజేసినట్లు యీ జానపద గేయాలకు వర్తింపజేయక యీ గేయాల యెడల పండితులు ఉదాసీనులై ఉండడం వల్ల మేలే కలిగినది. ఆ పండితులు ఆ శబ్దానుశాసనాలకు ఈ జానపద గేయాలను బంధించివుంటే యివి కావ్యాలవలెనే ఏ వికృత కృతక భాషలోనో రచయితములై యుండును, అట్టి దుస్థితి కలుగలేదు, కనుకనే ఇవి సరళమైన శయ్యతో సాగుతూ వచ్చినవి. అయితే, పండితుల ఆదరణ లేకపోవుటచేత ఒక కీడుకూడా కలిగినది. కావ్యాలు తాటాకులమీదికి ఎక్కినట్లు యివి ఎక్కలేదు. అందుచేత కేవలం అనుశ్రుతంగా మాత్రమే వచ్చినవేవో నిలచినవి; తక్కినవి అంతరించినవి. ఆదినుండి నేటివరకు రచితములవుతూ వచ్చిన జానపద గేయాలు, సామెతలు మొదలయినవి నిలిచివుంటే సంఘజీవితము, భాష ఎట్లు పరిణమిస్తూ వచ్చినదో లెస్సగా గ్రహించగలుగుదుము. అట్టి సద్భాగ్యము మనకు లభింపలేదు.

జానపద గేయాలలో గ్రహించుటకు యోగ్యమయిన విశిష్టలక్షణము ఎక్కువగా ఉన్నది కనుకనే వాటి సంగ్రహణమునకు విలువ హెచ్చినది. అట్టి జానపద గేయాలను - కాలగర్భంలో మడిసిపోయినవి పోగా, నేటి కింకా పల్లెలలో జానపదుల పెదవులపై తాండవిస్తూ, వీనులవిందుగా వినబడుతూ వున్నవాటినైనా సేకరించడం సంస్కృతిగలవార మనుకొన్న మనకు విహితధర్మం. ఆ ధర్మమును నిశ్చలభక్తితో నెరవేర్చుటకు దీక్ష వహించి, శక్తివంచనలేక తీవ్రమైన కృషిచేసి కృతకృత్యులయిన "ఎల్లోరా" గారికి నా అభివందనాలు !

ఈ జానపద గేయాలను రచించిన వారెవరో మనకు తెలియదు. వారు తమ నామధేయాలను యథాతథంగా గాని, "ఎల్లోరా" వంటి ఉపపదాలతోగాని తమ గేయాలలో పొందుపరచుకోలేదు. వారు ఏనాటివారో స్పష్టంగా తెలియదు. అయినా, కొన్ని విశేషాలను బట్టి కాలనిర్ణయం, దేశనిర్ణయం కొన్ని గేయాల విషయంలో చేయగలము.

ఏయే గేయాలలో కొద్దిగానయినా పాతపద్ధ సుడికారం కనపడుతుందో, ఏయే గేయాలు మన బాల్యంలో మన ముసలమ్మలు, తాము తమ బాల్యంలో తమ ముసలమ్మలు పాడగా విని నేర్చుకొన్నామని చెప్పి వినిపించారో, ఏయే గేయాలు

తెలుగువాడు గల అన్ని ప్రదేశాలలోను ఇంచుమించు ఒకే విధముగ నేటి కింకా వినబడుతూ ఉన్నవో అవి ప్రాచీన-లేదా చారిత్రకాలం క్రిందటి జానపదగేయాలని మన మూహించవచ్చును. "గుమ్మడిదే గోపిదేవి", "కృష్ణమ్మా గోపాలబాలా కృష్ణమ్మా" మొదలయిన గేయాలున్నా, మేలుకొలుపు పాటలున్నా, శ్రీకృష్ణ లీలలున్నా - ఇంకా ఇటువంటివి మరికొన్నిన్నీ చారిత్రకాలం క్రిందటనే రచితములయి ఉండవలెను. కథాచక్ర సంఘటితములయిన కాటమరాజు, దేశింగ్ మొదలయిన గేయాలు ఆయా వీరుల చర్యలు జరిగిన కాలంలోనో, ఆ తర్వాతనో రచితములయి ఉండవలెను. "బత్తాయిచెట్టు", "బత్తాయిపండు" అనే మాటలు గల పాటలు బటేవియానుండి నారింజపండ్లు మన దేశానికి వచ్చిన తర్వాతనే పుట్టి యుండవలెను. ఈ విధంగా "లోలకులు పెట్టిందిరా పిల్ల", "లుంగీయేసుకు", "వాచీపెట్టి", "పకోడీలు", "బేసరి", "రైలుబండి", "రోడ్డు" మొదలయిన అన్యదేశ్యములు గల గేయాలు ఇటీవలవి అని చెప్పవచ్చునుగదా! ఈ విధంగానే గుంటూరు, పల్నాడు, గోదావరి, కృష్ణవేణమ్మ, భద్రాద్రి, దాచేపల్లి మొదలయిన ప్రదేశాలకు అంకితములయిన గేయాలు ఏయే ప్రాంతాలలో పుట్టియుండవచ్చునో ఊహించుకోగలము.

ఒక హెచ్చరిక. ఇటీవలి వారు - జానపదులు కారు, సవనాగరకులే - రచించిన పాటలుకూడా కొన్ని జానపద గేయాల క్రింద చెలామణి అవుతున్నవి; అందును నా యభిప్రాయమే తెలియజేస్తున్నాను. 1908 లో నేను రచించిన చిలుకమ్మ పెండ్లి, రైలుబండి పాటలు గుంటూరులో వెల్వడుతూ వుండిన 'వివేకపతి' అనే మాసపత్రికలో ప్రకటితములయినవి. అందు నా పేరు కూడా రచయితగా ముద్రితమయినది. దరిమిలాను నా యనుజ్ఞపొందే లాంగ్‌మన్స్, మాక్‌మిలన్ వారు తమ వాచకములలో చేర్చుకొన్నారు. ఆ తర్వాత కొందరు జానపద గేయాలంటూ ఒక చిన్న గ్రంథము ప్రకటించి అందులో నా చిలకమ్మ పాట నా పేరు లేకుండా చేర్చుకొన్నారు. ఈ విధంగా ఇంకా ఇటువంటి ఆధునిక రచనలు ఎన్ని చేరినవో!

సరే. ఇటువంటి ప్రక్షిప్తాలవలన కలిగే బాధ అంత గొప్పదికాదు. కాని, వాస్తవమయిన జానపద గేయాలు ఇంకా అగ్రహారాల విడబడకుండా వున్నవే

గ్రంథాలలోనికి ఎక్కనుండా వున్నంచుక ఎక్కువగా చింతించవలసియున్నది. జానపద గేయాల సేకరణ ఒకరిద్దరివల్ల పూర్తి కానేరదు. అమెరికా వంటి దేశాలలో యీ పనికి ప్రత్యేక సంస్థలు ఏర్పడి ఉన్నవి. ఇందుకు కాపలసిన పత్రికలున్నవి. జానపద వాఙ్మయ గ్రంథాలు - కథలు, గేయాలు, సామెతలు మొదలయిన శాఖలకు చెందినవి పండలకొలదిగా ఉన్నవి. ఈ పనికి ప్రభుత్వము వారు, విశ్వవిద్యాలయములు, ఇతర విద్యాసంస్థలు పూనుకొనవలెను.

జానపద గేయాలను సేకరించే పని ఇంత కష్టమైనదైనా "ఎల్లోరా"గారు శ్రద్ధవహించి పెక్కు గేయాలు సేకరించి ప్రకటిస్తూ వీటిని చక్కగా ముద్రిస్తూ ఉన్నందుకు దేశానికెంతో మేలు చేసినవారని చెప్పవలెను. వీరి కృషి ఇతోధికంగా ఫలించునుగాక !

(సం) గిడుగు వెంకట సీతాపతి

ఆ ము ఖ ం

శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు

[1961 లో నా "మధుర కవితలు"కు శ్రీ నార్ల వెంకటేశ్వర రావు గారు రాసిన పీఠిక]

బుకునుంచి బాహిరిల్లేది జానపద గేయం. దాని రచన కలంతో కాదు, సిరాతో కాదు, కాగితాలపై కాదు. కన్నీటితో, కవోష్ణరక్తంతో, వలపుతో, విరహంతో, నవ్వులో, నిట్టూర్పుతో, ఆశతో, ఆవేదనతో, కవ్వింపుతో, కౌగిలింతతో, చిన్మయానందంతో గుండెలోనే దాని రచన. అందువల్లనే అది పచ్చిగానూ వుంటుంది; వెచ్చగానూ వుంటుంది. భాషావిషయాలలో ఛాందసులైన వారికి నచ్చకపోయినా, అది అరవిచ్చిన మొగ్గలోని పచ్చితనం; సాహిత్య విషయాలలో బోలియులైనవారు మెచ్చలేకపోయినా, అది ఉచ్ఛ్వాస నిశ్వాసాలలోని వెచ్చదనం.

లయబద్ధమైనది జీవితం. జీవితంలో పెనవేసుకొని వుండే జానపదగేయం కూడా లయబద్ధమైనదే. ఛాపానియమాలను అది పాటించకపోవచ్చు; వ్యాకరణ నిబంధనలను అతిక్రమించవచ్చు; కాని, లయమాత్రం తప్పదు. అందువల్లనే సాహిత్యపు విలువలు లేనివైన సందర్భాలలో కూడా దానిలో సంగీత మాధుర్యం తొణికిసలాడుతుంది. అది శాస్త్రీయసంగీతం కాకపోవచ్చు; స్వరబద్ధమైనది కాకపోవచ్చు; రాగప్రస్తారానికి అనువైనది కాకపోవచ్చు. అయినా అది సంగీతమే - కోకిలసంగీతం, సెలయేటి సంగీతం, ఓరుగాలి సంగీతం, కడలి సంగీతం. సంగీతశాస్త్రం దొరకన్నా, కాదన్నా, అది మధురిమను మనకు పంచి పెడుతుంది. అందువల్లనే రామణీయకులు కూడా జానపద సాహిత్యాన్ని "మధుర కవిత" గా గుర్తించక తప్పలేదు.

జానపద సాహిత్యంలోని మాధుర్యాన్ని వివరించడానికి "ఎల్లోరా" చేసిన ప్రయత్న ఫలితమే "మధురకవితలు" అనే ఈ గ్రంథం. ఈయన ఉద్దండ పండితుడు కాకపోవచ్చుగాని భావుకుడు, కావ్యాలంకార వ్యాకరణాది శాస్త్రాలను కూలంకషంగా మధించినవాడు కాకపోవచ్చుగాని రసజ్ఞుడు. అందువల్లనే జానపద సాహిత్యంలోని మాధుర్యాన్ని ఈయన ఆస్వాదించ గలిగాడు, ఈ గ్రంథాన్ని రచించగలిగాడు.

ఈనాటిదా, నిన్నటిదా జానపద సాహిత్యం పట్ల "ఎల్లోరా" ప్రగాఢాభిమానం? దాదాపు రెండు దశాబ్దాలుగా ఈయన పల్లెపదాలను సేకరిస్తున్నాడు. శ్రీ నేదునూరి గంగాధరంగారి తర్వాత హెచ్చుగా ఈ పాటలను సేకరించింది ఈయనే; డాక్టర్ బి. రామరాజుగారి తర్వాత విస్తృతంగా వాటిని గురించి పరిశోధనలు చేసిందికూడా ఈయనే కావచ్చు. ఏలపాటలు, జోలపాటలు, లాలిపాటలు, సువ్వాల పాటలు, రాటం పాటలు, కోలాటం పాటలు, పంటకాపు పాటలు, పల్లెకారి పాటలు - ఎన్నని చెప్పడం? అన్ని రకాలపాటలను వందలాదిగా ఈయన సేకరించాడు. తాను సేకరించిన వాటిలోనుంచి కొన్నింటిని కూర్చి, తీర్చి, "జానపదగేయాలు" అనే పేరుతో రెండు సంపుటాలను ప్రచురించాడు. కేవలం జానపద గేయాల సంకలన కర్తగానే సంతృప్తి చెందక జానపద సాహిత్యంపై వ్యాఖ్యాతగా "ఎల్లోరా" ప్రచురిస్తున్న గ్రంథమిది.

ఏప్పిచూపినా, విమర్శ చెప్పినా, జానపద గేయ సాహిత్య సౌందర్యాన్ని ఎందరు హర్షించగలరనే సందేహం నా మిట్టుకు నాకు లేకపోలేదు. "కొయ్యబొమ్మల మెచ్చుకళ్ళకు కోమలుల సొగసెక్కునా?" అనే ప్రశ్న నన్నయ జాడ తిక్కాపురాణంలోనే పుట్టలేదు; జానపద సాహిత్యంతోనే అది పుట్టిందని అనవచ్చునేమో! ఏమైనా "ఎల్లోరా" ఈ సాహిత్య ప్రచారాన్నే తన జీవిత లక్ష్యంగా పెట్టుకొన్నందున ఈయనకు ఆశతప్ప ఆశాభంగం లేదు; ప్రయత్నమే తప్ప ప్రతిఫలాపేక్షలేదు. పది, పదిహేను సంత్సరాలుగా ఈయన కృషిని ఆసక్తితో గమనిస్తున్న నేను ఈయన దీక్షను ఆదినుంచీ హర్షిస్తున్నాను; ఇప్పుడు ఈ "తొలిపలుకు" రూపంలో ఆశీర్వదిస్తున్నాను.

(సం) నార్ల వెంకటేశ్వరరావు

20

పీఠిక

శ్రీ విద్వాన్ విశ్వం

[1961లో నా "సరాగాలు" గ్రంథానికి విద్వాన్ విశ్వం గారు రాసిన పీఠిక]

పిండి ఆరబోసినట్టున్న వెన్నెల. చుట్టూరా పొదలూ కాలువా. అక్కడక్కడా మొగలి చెట్లు. ఆ పూలపరిమళం మోసుకొని బరువుగా ఆడుగులు వేసుకొంటూ వెడుతున్న పిల్లగాలులు. కీచుకీచుమని ఒకే శ్రుతిలో ప్రకృతిని పలకరిస్తున్న కీచురాళ్ళు. సూది గ్రుచ్చినా దగని పొదల తిమిరచ్ఛటలో మిల మిలాడుతూ పోతున్న మిణుగురు పురుగులు.

చూరంలో ఒక కంచుగొంతు కమ్మని పాట నొకేమారు పంచమంలో ఎత్తుకొని ఆ నిస్తబ్ధ మంత్రముగ్ధ ప్రకృతిలో జీవం పోస్తున్నది.

"చెమటకు తడిసీ
చెదిరిన గంధం
ఘుమఘుమ లాడిం దోలాలా - ఆది
పదమఘుమ లాడిం దోలాలా
మొగాన డండే కస్తురితిలకం
ముక్కుపై జారిం దోలాలా - కొస
ముక్కున జారిం దోలాలా"

ఆ చల్లని వెన్నెలా, ఆ మెల్లని గాలీ, ఆ ఉల్లం జల్లుమనిపించే పాటా కళ్ళకూ కలకూ ఇలకూ మధ్యనున్న తెరను తొలగించి, మనల నేడో గంధర్వ నగరం లోనికి ఎత్తుకొని పోయి మైమరపింప జేస్తాయి.

వానిలో ఉన్నవన్నీ సహజధర్మ దీపితాలే. వానిలో ఎక్కడా కృత్రిమతకు తావులేదు; సంస్కారానికి అవకాశంలేదు. దున్నని మైదానంలో చల్లిన

విత్తనాలు, కట్టనినీటితో నునలెత్తి కొనలతో ఆకసాన్ని ముద్దిడుకొనబోయి గాలి లాలింపులకే వలపులు గ్రుమ్మరించే పూగుత్తులలాంటివి పల్లె పాటలు.

ఏ అజ్ఞాత మృదుమధుర హృదయస్పందనం వానిలో రూపు నిల్పు కొన్నదో ఎరుగుము.

అలాంటివి వేలూ, లక్షలూ, కోట్లూ అనాదిగా పస్తున్నవి. అజ్ఞాతంగా వాని రచయితలు ఉండిపోతున్నారు.

ఈ జానపద ప్రచురములైన గీతా లనేకం నేడు గ్రంథగ్రథితాలవు తున్నవి. ఒకప్పుడు పత్రికలలో ప్రచురితములూ అయినవి.

వీసేలో యథాశక్తి ఎవరికి దొరికినవి వారు ఏరుకొని మాలలు కట్టు కొంటున్నారు. ఈ మాలికలలో ఒక మాంతోనివి మరొక వానిలో దూరినా దూరవచ్చును.

వీనికొక శాశ్వతత్వం ఇవ్వవలసిందే. ఆ ప్రయత్నంలో వీనిలోని సహజ ముగ్ధ మోహనత కొంత తగ్గినా తగ్గవచ్చును; ఆ ఆవేగోద్వేగాలలో అటూ ఇటూ సాగీ, కత్తిరింపులు పొందీ కనబడే వ్యావహారిక పదజాలం కొంత ఈ ప్రచురణలలో బిగింపులకు, కుదింపులకు గురికావచ్చును.

అలా కాకపోతేనే మంచిది. కాని గ్రంథంలోని కెక్కినదనగానే ఏదైనా కొంత ఈ కుదింపులకు గురికాక తప్పదేమో కూడా. అందుకు మాత్ర మదే పనిగా ఈ సంకలన కర్తలు పూనుకొన కూడదని, పూనుకొనరని నా ఆశా, ఆశంసా.

మా "ఎల్లోరా" ఇదివరకే ఈ పల్లెపదాలను కొన్ని సంపుటాలుగా కూర్చి ప్రచురించే ఉన్నాడు—పెక్కింటిని మదరాసు రేడియో ద్వారా ప్రసారం చేసి ఉన్నాడు.

ఇలాంటి పాటలను సంకలనం చేయడం, దానిని ఏ మూలో వీసే గ్రంథస్థం చేసుకొనడం చాలాకాలంగా చేస్తున్నవాడు కావున "ఎల్లోరా" ఈ సరికొత్త

సంపుటి జానపద వాఙ్మయ మాధుర్యంలో మునుగుబంటిగా మునిగిపోగల సహృదయులకు ఉపాయనమే కాగలదు.

వీనిలో ఒక దేమిటి నానారకాలవీ ఉన్నవి. ఇదికాక మరికొన్ని సంపుటాలు వెనువెంటనే తేనున్నాడు కూడా.

ఇలాంటివన్నీ భద్రపరిస్తే వానిలో కొన్ని మణిపూసలేవో ఎలాగూ మిగిలి మేలిమి చూపగలవు.

మా "ఎల్లోరా" కృషి నింకింత ప్రోత్సహించేందుకే ఈ నాలుగు మాటలూ.

(సం) విద్వాన్ విశ్వం



తెలుగుభాష నన్నయార్యుని కాలానికి చాలా ముందే ఉన్నట్లు మనకు ఆధారాలు ఉన్నాయి.

నన్నయ యుగం కన్నా ముందునుంచే దేశి సారస్వతంగా వెలసిన జానపద సాహిత్యం వెన్నులు వేసి, పిందెలు తొడిగినట్లు మనకు అనేక ఆధారాలు అగుపిస్తూనే ఉన్నాయి.

ఆంధ్ర సాహిత్య సంపద పరంగా విరిసి విస్తరిస్తూ వస్తున్న మంచిపరం దీని సారస్వతం.

జానపద గేయాలను పరిశీలించేప్పుడు శిష్ట కావ్యాలతో పోల్చి చూడడం ఒక విధంగా అనవసరమే-అయితే కొన్నికొన్ని సందర్భాలలో అవసరమూ కాక తప్పదు. శిష్ట రచయితకు ఉండే లక్షణాలలో ఏవో కొన్ని అయినా జానపద కవికీ ఉండకుండా పోవు.

నన్నయ మార్గ కవితా స్రవంతి ధాటికి ఈ దేశి సాహిత్య ప్రక్రియ తట్టుకొనలేక కొన్ని శతాబ్దాలు గడిచిన సమయం లేకపోలేదు.

అయితే, దేశి కవితామూర్తి పాల్కురికి సోమనాథుని రచనా తరంగాల ధాటితో తిరిగి దేశి కవితకు వసంతోదయం అయింది.

వీధి నాటక లక్షణాలు చాలా ప్రాచీనము లయినవే నన్నది నిర్వివాదాంశం.

అయితే, తొలినాటి కవితారూపం క్రమానుగతంగా పెరుగుతూ వచ్చిన నాగరికతతోపాటు, జీవితానుభవం నేర్పిన అనుభవ సారంతోపాటు బలపడడం జరిగి వికశించి ఉంటుంది.

మానవ జీవిత పరిణామంతోపాటే అతని మేధ సాధించిన విజయంతో పాటే సాహిత్యమూ పరిణామం చెందడం సహజం.

ఆయా కాలాలలో ప్రజల ఆచార వ్యవహారాలు, అభిరుచులు, సాంఘిక పరిస్థితులు తెలుసుకోవానికే - ఆంధ్ర జాతి చరిత్ర ఏమిటి? దాని ఆచార వ్యవహారాలు ఎలా ఉండేవి? సాంఘిక స్థితి గతులు ఏమిటి? మతాల ప్రభావం,

సిద్ధాంతాల ప్రభావం, లోక పృత్తం తెలియడానికి సరి అయిన సమగ్రమయిన ఆంధ్రుల చరిత్ర లేదనే చెప్పవలసి ఉంటుంది.

అంటే–చరిత్ర లేదని, చరిత్రకారులు కృషి సలుపలేదనీ కాదు–ఇంకా పూర్తి చరిత్ర సిద్ధం కాలేదనే.

ప్రాచీన సాహిత్య చరిత్రలో-ప్రధాన శాఖ అనదగిన శతకవాఙ్మయంలో నాటి ప్రజల వేష భాషలనుంచి ఆచార వ్యవహారాల దాకా, సాంఘిక పరిస్థితుల నుంచి రాటకీయ చారిత్రక పరిణామం వరకూ మనకు కనిపిస్తుంది.

దేశి సారస్వతంలో ప్రతి ప్రక్రియా ప్రధానమయినదే - ప్రత్యేకమయినదే.

ఇక్కడ ఫలానా రసం ప్రధానం అనడానికి వీలులేదు.

సాహిత్యం అన్ని రసముల సమ్మేళనం. శృంగారం కానివ్వండి. వీర రసం కానివ్వండి. శాంత రసం అనండి. లేదా రౌద్రం అనండి - వేటికవే ఆయా కథా ఘట్టాలలో వాటి ప్రత్యేకతలు వాటికి ఉంటాయి.

జానపద వాఙ్మయంలో బాల గేయాల నుంచి స్త్రీల పాటలూ, గృహ కృత్య సారస్వతం, తత్వాల దాకా అన్నిటా ప్రత్యేకత తొణికిసలాడుతుంటాయి.

ప్రతి ప్రక్రియలోనూ జీవితానుభవాలు తొణికిసలాడుతూనే ఉంటాయి.

నేడు ప్రపంచంలో ఎక్కడ చూసినా జానపద సాహిత్య ప్రచారం ముమ్మరంగా కనిపిస్తుంది. దీనికి తార్కాణగా ఒకనాడు ఉచ్ఛరించడానికీ, తాకడానికి భయపడిన విశ్వవిద్యాలయాలు, పండితులు జానపద వాఙ్మయాన్ని ఒక ప్రధాన శాఖగా, సాహిత్యంలో ప్రధాన భాగంగా గుర్తించి, గౌరవించడమే.

నేడు అనేక విశ్వ విద్యాలయాలలో జానపద సాహిత్యం మీదా, జానపద విజ్ఞానం మీదా, జానపద కళల మీదా పరిశోధనలు జరుగుతున్నాయి. అంతే కాదు, అందులో ప్రత్యేక విభాగాలు, ప్రత్యేక శాఖలూ నెలకొని, ఇతర సాహిత్య ప్రక్రియలకు వలెనే జానపద సాహిత్య పరిశోధనకు అవకాశాలు కల్పించడం జరిగింది.

జానపద కవితా మాధుర్యం అనుభవైకవేద్యం.

అసలు కవిత్వం రెండు వర్గాలు చేస్తే ఒకటి చేతనా కృతము, రెండవది అచేతనా కృతము. జానపదకవితలు ఈ రెండో విభాగానికి చెందినవని చెప్పవలసి ఉంటుంది.

జానపదులు పాడుకొనే పాటలనే జానపద గేయాలంటారు.

జానపదులు అంటే గ్రామసీమల వారు అనగా పల్లె ప్రజలు అని అర్థం.

వీటిని అనేకమంది అనేక రకాలుగా పిలువడమూ కద్దు.

ఈనాటికి జానపద వాఙ్మయం ఒకశాఖగా, ఒక శాస్త్రంగా, ఒక విజ్ఞాన చారిత్రకఖనిగా గుర్తించబడి దేశదేశాలలో ప్రచారం ప్రాధాన్యతా పొందింది.

ఒకనాడు దూరంగా ఉన్న పండితుల మన్ననలూ పొందుతూ గౌరవాలు అందుకొంటూంది.

ఇందలి లోతులకు పరిశోధకులు చూపులు సారించాలే గాని, మానవజాతి చరిత్రకు జానపద సాహిత్యం ఒక చెరగని శాసనం అనవచ్చు.

ఒక దేశం లేదా రాష్ట్రం లేదా ఒక ప్రదేశం యొక్క చరిత్ర, కథలు గాథలు అప్పటి నాగరికత, నాటి ఆచార వ్యవహారాలు, సాంఘిక ధర్మాలు, అభిరుచులు ఇలా ఎన్నింటినో ఇవి మనకు వినిపించి సాక్ష్యాలుగా నిలబడతాయి.

ఒకనాటి సంస్కృతికి జానపద సాహిత్యం పనికట్టుకు రాయని అచేతనా కృత చరిత్ర శాస్త్రం.

అక్షరజ్ఞానం లేని పల్లెప్రజల సాంప్రదాయక విజ్ఞానమన్నమాట- దీనినే జానపద విజ్ఞానం అంటున్నాం.

డాక్టర్ బి. రామరాజు గారు పేర్కొన్న జానపద గేయ ముఖ్య లక్షణములు 9

1. అజ్ఞాత కర్తృత్వము లేదా సామూహిక కర్తృత్వము, 2. స్థిర రూప రాహిత్యము, 3. రచనాకాలము తెలియకపోవుట, 4. మౌఖిక ప్రచారము, 5. అకృతకత్వం, 6. గేయత్వము, 7. ఆపాతచమత్కారము, 8. పునరావృత్తి (పల్లవి వంటిది) 9. జన సామాన్య పరిచిత వస్తువు.

ప్రతి జానపద గేయమునందూ ఈ లక్షణములు అన్నీ ఉండవలసిన పని లేదనీ, ఈ లక్షణాలను కూడలి అయిన అచేతనా శిల్పము, సార్వజనీనత ఉన్నా చాలుననీ వారి అభిప్రాయం.

ఈ జానపద సాహిత్యాన్ని ''శాబ్దిక కళ'' అనడం సమంజస మంటారు డాక్టరు తంగిరాల.

ఇందులో అంటే ఈ శాబ్దిక కళగా మనం అనవచ్చు ననుకొంటున్న జానపద సాహిత్యంలో ఒక చేమిటి చాలానే చోటు చేసుకొన్నాయి.

జానపద కథలు, పిట్టకథలు, ఇతిహాసములు, పుక్కిటి పురాణాలు, జానపద గేయాలు, జానపద గేయకథలు, వీరగాథలు, పొడుపుకథలు, సామెతలు- ఇలా ఎన్నో.

జానపద వాఙ్మయ స్వరూపంలో మనం అనేక శాఖలను ఉపశాఖలను గుర్తించవలసి ఉంటుంది.

''గేయశాఖ, వచనశాఖ, దృశ్యశాఖ, కథావిరహితము, కథాసహితము.

శ్రామిక గేయాలు, పారమార్థిక గేయాలు, కుటుంబ గేయాలు, శృంగార ప్రధానాలు, హాస్య ప్రధానాలు, కరుణ ప్రధానాలు.

మార్మిక గేయాలు, తాత్విక గేయాలు, బంధుత్వ ప్రధానాలు, ఆచార ప్రధానాలు.

పెద్దలకు సంబంధించినవి, చిన్న పిల్లలకు సంబంధించినవి.

క్రీడాపూరితాలు, జోలలు, శ్రామిక గేయాలు, స్త్రీల పాటలు, వ్రత కథలు, పౌరాణిక కథలు.

వీర గాథలు, అద్భుత గాథలు, మత గాథలు, పురాణ గాథలు, గ్రామ దేవతల కథలు.

పౌరాణిక గాథలు, చారిత్రక గాథలు, స్త్రీలకు సంబంధించిన గాథలు.

పురాణ గాథలు, గ్రామ దేవతల కథలు, స్పష్టచారిత్రకములు, అస్పష్ట చారిత్రకములు.

ఇలాగే పదము, దృశ్యశాఖలు.

పొడుపుకథలు, సామెతలు.

నీతి కథలు, వీర కథలు, అద్భుత కథలు, పురాకథలు, పురాకల్పిత కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు.

మనుష్యులు ఆడునట్టివి, మనుష్యులు ఆడించే ప్రక్రియలు - అంటే పగటి వేషాలు, వీధినాటకములు, యక్షగానములు, తోలుబొమ్మలాట, చెక్క బొమ్మలాట మొదలయినవి.

ఒక్కమాటలో చెప్పాలీ అంటే - నన్నయకు ముందు వెలువడినదంతా దేశిరచనే అనాలి.

ఏ వాఙ్మయంలోనైనా పద్యకవిత్వానికంటే ముందు పదకవితే అవతరించి ఉంటుందనేది అందరూ అంగీకరించిన సత్యమే కదా.

నన్నయ తరువాత పాల్కురికి "ఆరూఢ గద్యపద్యాది ప్రబంధపూరిత రచన సర్వసామాన్యము" గాదని ద్విపదకే కదా ప్రాధాన్యం ఇచ్చి ప్రధాన మైన పీట వేశాడు.

ఆరుద్ర సినీవాలిలో అన్నట్లు జాపపద కవిత అనండి – దేశిచ్ఛందం అనండి, మరేదో పేరుస పిలవండి - అంచులో ఏదో ఒక లియధ్వనించక మానదు.-

"చెప్పుకుండానే ఏదో ఒక ఛందంతో
చెవికింపుగా వినసొంపుగా
కవిపలకడం కచ్చితంగా ఖాయం
ఇంతకుమించిన ఛందోనియమం
బంధి లేకుండా ఫుట్‌బాలాడ్డం" అని.
నన్నయకు పూర్వం రచనలేదనం ఎలా ?

క్రీస్తుశకారంభానికే తెలుగుభాష ఉంది అనడానికి నిదర్శనములూ చెపు తున్నవి. గాథాసప్తశతిలో కొన్ని తెలుగు పదములనుబట్టి తెలియవస్తున్నది.

చాకుక్యయుగానికి ముందు తెలుగు ఉన్నట్లూ అగుపిస్తూంది.

కుమారసంభవంలో నన్నెచోడుడు వ్రాసిన పద్యమే ఇందుకు ఉదాహరణ:

"మును మార్గకవితలోకం
బునవెలయంగ దేశికవిత బుట్టించి తెసుం
గును నిలిపి రంభ్రవిషయం
బున జన చాళుక్య రాజు మొదలుగ బలువుర్."

ఇందుకు నిదర్శనాలా ? నన్నయకు పూర్వపు శాసనాలలో దేశి పద్యములు మాత్రమే గోచరించడం.

"పండితారాధ్యుడు వెలనాటి చోడుని బౌద్ధ గురుపుతో వాదించుటకు పోవునపుడు ఆతని వెంటపచ్చిన శిష్యులు, భక్తులు పాడిన పదములు ఇవి :

"పదములు, తుమ్మెద పదముల్, ప్రభాత
పదములు, శంకర పదముల్ నివాళి
పదములు, వాలేసు పదములు గొబ్బి
పదములు, వెన్నెల పదములు సంజ
వర్ణన మటిగణవర్తన పదములు
బాడుచు నాడుచు....."

—దేశి సాహిత్య తరంగాలలో ద్విపద ప్రధానమైనదే.

ద్విపదలో కావ్యం రాసిన ప్రథముడు పాల్కురికి సోమన. నాటినుంచి నేటిదాకా ద్విపద కావ్యాలు సుమారు 245 దాకా ఉన్నట్లు శ్రీ జి. నాగయ్యగారి వివరణ.

జానపద వాఙ్మయంలో రామాయణ, భారత, భాగవత కథలు కోకొల్లలు.

జానపద సాహితీ నందనోద్యానంలో రామకథకు గొప్ప ప్రకాశం ఉంది.

రాము కథ తమ కథగా తెలుగునాటను జానపదులు భావించి గుండెల్లో గొంతుల్లో ఆ కథామృతాన్ని మలచుకొన్నారు.

"కేవలం ప్రకృతి ఒడిలోనే పెరుగుతూ అనభ్యస్తవిద్యగలవారై, ఛందో రీతులనుగాని, వాని పోకడలుగాని ఏమీ ఎరుగని జానపద రచయితల సహజ కవితా గానామృత బింబమే జానపద గేయములు" అన్నది నిష్ఠుర సత్యం.

"జానపదం" అనేది దేశంలో ఒక ప్రాంతాన్ని (తాలూకా, జిల్లాలుగా అన్నట్లు) సూచించేదిగా కూడా పేర్కొనడం, సాహిత్యంలో వినిపించడమూ జరిగింది.

"జానపద రచనలు" అనే దానిమీద కాస్త అటూ ఇటూ చర్చ ఉంది. జానపదులు రచించుకొని పాడుకొనేవి, వారికోసం మరొకరు రచించేవి.

* "శ్రీనాథుడు మొదలు వీధి బిచ్చగాని వరకూ జానపద కవులే. శ్రీనాథుని జానపద కవులలో చేర్చినందుకు కొందరు విమర్శకులు తమ అనంగీకారమును వెలిబుచ్చారు. కాని జానపదులు రచించినవీ, జానపదుల కోసం రచితమైనవీ జానపద రచనలనుట ఉచితమని నా అభిప్రాయం. అందువలన శ్రీనాథుడు విద్వత్కవులలో విద్వత్కవియనీ, జానపద కవులలో జానపద కవియనీ పరిగణించుట సబబని నా యుద్దేశము" అని తమ జానపద గేయ వాఙ్మయ పరిచయములో శ్రీహరి ఆదిశేషువుగారు పేర్కొనడం ఇక్కడ గమనించవలసిఉంటుంది.

పైన పేర్కొన్న జానపద సాహిత్య విజ్ఞాన శాఖాసముదాయంలో ఉప శాఖలనూ పేర్కొనవచ్చును.

జానపద విజ్ఞాన విభాగంలో 5 ప్రధాన భాగాలు ఉన్నట్లు డాక్టర్ తంగిరాల వెంకట సుబ్బారావు గారు పేర్కొన్నారు.

ఒకటి — జానపద సాహిత్యము లేక శాబ్దిక కళలు.

రెండు — జానపద కళలు లేక శాబ్దికేతర కళలు.

మూడు — జానపద శాస్త్రములు.

నాలుగు — జానపద వస్తువులు.

ఐదు — వస్తు సంస్కృతి లేదా జానపద పరికరములు.

జానపద కవిత్వాన్ని డాక్టర్ తంగిరాల వెంకట సుబ్బారావుగారు ఇలా విభాగించారు:

"పల్లె పాటలు లేక జానపద గేయములు వీరగాథలు లేక జానపద గేయ కథలు.

సంప్రదాయిక వీరగాథలు లేక జనప్రియవీరగాథలు, వీరగాథానుకరణ ములు, వీరగాథా చక్రములు, వీరగాథలు, వీరగాథానికలు, లేక లఘు వీరగాథలు.

శక్తికథాచక్రము, పల్నాటివీర కథాచక్రము, కాటమరాజు కథా చక్రము, బుర్రకథలు, జముకుల కథలు, సుద్దుల కథలు, తంచాన కథలు, బ్రహ్మకమ్మ పాటలు.

బొబ్బిలి వరుస కథలు, పదములు, జంగం కథలు, హరి హరీ పదములు, శారద పదములు, ఎల్లమ్మ కథా చక్రము, అంకమ్మకథ చక్రము, చౌడమ్మకథా చక్రము, ఇతర శక్తి కథలు.

ఇవన్నీ మౌఖిక ప్రచారంపొంది ఉండడం, లిపి శుద్ధం కాకపోవడం జాన పదగేయాల, జానపద వాఙ్మయం ముఖ్య లక్షణం.

డాక్టర్ నాయని కృష్ణకుమారి గారన్నట్లు "జానపద కథవిధానాన్ని అనుసరించి ఎవరన్నా నాగరక వాసన కలిగిన అక్షరాస్యులు లిఖితమైన వాఙ్మయాన్ని సృష్టిస్తే అది నకిలీ జానపద వాఙ్మయమే అవుతుంది కాని నిజమైనదికాదు.

కందుకూరి రుద్రయకవిదాసిన సుగ్రీవ విజయం యక్ష గాన నాటకంగాని శ్రీనాథుని విరచితంగా ప్రచారంలో ఉన్న పల్నాటి వీర చరిత్రగాని నిజమైన జానపద సాహిత్యమా ?

ఇది గమనించవలసిన విషయం.

ఇటీవల సినిమాలలో వినిపించే జానపద గేయాలు నిజమైన జానపద గేయాలనిపించుకొంటాయా ?

అనేకమంది సేకరించి ప్రచురించామని చెప్పుకొంటూన్న జానపద గేయాలూ, పదాలూ జానపద సాహిత్యం కిందకు రావుకూడా.

జానపద సాహిత్య పరిశీలన చేసేప్పుడు ఇది జానపదమా ? జానపద ప్రక్రియలో రచించిందా ? అన్నది ప్రధానంగా పరిశీలించాలి - నిగ్గుతేల్చాలి.

మూడు దశాబ్దాలనాడు గ్రామఫోనురికార్డుగా విన్న జానపద ఫక్కీ రచన లను జానపద రచన క్రిందో పల్లె పాటలనో పుస్తకాలలోకెక్కించి అధానుపాల యిన సంఘటనలు లేకపోలేదు.

చూడు : కాటమరాజు కథలు మొదటి భాగం పేజి-22.

ఇది జానపద సాహిత్య ప్రచారోద్యమానికే కళంకం.

అందుకు ఇక్కడ ఒక చిన్న ఉదాహరణ ఇస్తాను.

"జానపద వాఙ్మయం - దానిలోని జాణతనాలు" అని ప్రసిద్ధ దిన పత్రిక ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో (సుమారు 20 ఏళ్ల క్రితం ఒక ఆదివారం జూలై 8 పత్రికలో) ప్రముఖ రచయిత, జానపద వాఙ్మయానికి కొద్దో గొప్పో సేవ చేసిన శ్రీ కె. సభా ఒక గ్రంథాన్ని తులనాత్మక పరిశీలనగావిస్తూ చాలా విషయాలను జనం దృష్టికి తీసుకు వచ్చారు అందులో ఆయన అంటాడు :

"సారస్వత రంగంలో ఏది కొరవడినా పర్వే నష్టంలేదు కానీ చిత్త శుద్ధి కొరవడినప్పుడు స్వార్థం పురులు విప్పుకొని నృత్యం చేస్తుంది. అందుకే అఖండ మేధా సంపన్నులు సహితం వ్యాఖ్యాత లైనప్పుడు ఎవరో పరిశోధించి సేకరించిన విషయాల్ని ఉన్నదున్నట్లు చెబుతూ ఆ వెనుక తాము చెప్పదలచు కొన్నదేదో చెబుతుంటారు.

"హల శాతవాహనుడు మహా చక్రవర్తి. అతను ఏ పండితునితోనో, కవితోనో ఏదో వ్రాయించి, తన పేరిట ప్రచారం చేసుకొంటే అడిగే నాథు డెవడూ లేడు. అందరూ చిత్తం చిత్తం అనేవారే. కాని-అతని చిత్తం అలాటిది కాదు. కనుకనే తను సేకరించిన గాథల రచయితల పేర్లను, తనకు తెలిసినంత వరకూ తెలిపాడు. తెలుపవలసిన అవసరం ఏముంది? ఏ రూపంతో చిత్త శుద్ధి అతనిలో ఉంది కనుకనే.

"ఆ పద్ధతి సారస్వత రంగంలో ఒక సత్సంప్రదాయం.

అయితే "పర్ణ పదాలు" సేకరణ కర్త కృష్ణశ్రీ ఆ సంప్రదాయాన్ని విస్మరించడం విచారకరం అని పేర్కొంటూ ఇందుకు కొన్ని ఉదాహరణలు అక్షర సత్యాలను ఇచ్చారు.

అవి ఇవి :

"ఏ జనపద వాఙ్మయం ఏ ఒక్కరి సొమ్మో కాదన్న మాట యదార్థం.

ఈ విషయాన్ని నేను మధుర కవితలు ఉపోద్ఘాతంలో ఇలా స్పష్టంగా వివరించే ఉన్నాను:

గాలిమీదా నీటిమీదా మానవునికి ఎంత హక్కు వుందోఈ వాఙ్మయం మీదా అంతే హక్కు ఉందీ అని.

దీని అర్థం సేకరించి, ప్రచురించిన గ్రంథాలనుంచి తిరిగి పునర్ముద్రించుకోమని కాదు.

"ఆ సౌందర్య కవితా వధూటి పాద ముద్రలను ఏ పల్లెసీమల పంట పొలాతోలనో పోల్చి పత్రికలకెక్కించిన వారు చాలామంది ఉన్నారు. గగనానికేసి చూస్తూ గంటకు పది పాటలను కూడా అల్లుకోవచ్చు గానీ, పల్లెల వెంబడి అదే పనిగా తిరిగినా వారానికి నాలుగు పాటలు సేకరించడం దుర్లభం.

"ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక, భారతి, గృహలక్ష్మి వంటి పత్రికలలో ఎవరో కష్టపడి సేకరించి ప్రచురించిన పల్లె పదాలకు శుద్ధ ప్రతులు వ్రాస్తూ, రేడియోలో ప్రసారమయే పాటల అసలు ప్రతులు తీస్తూ, ఉన్నట్టుండి తమ పేరుతో ప్రచురించుకోగల ప్రతిభా సంపన్నులకు సేకరణలోని సాధక బాధకాలు తెలియక పోవచ్చు"నని శ్రీ సభాగారు ఆవేదనను వెళ్లబుచ్చడంలో వింతలేదు. నిజం చేదుగానే ఉంటుంది మరి.

అందుకే జానపద వాఙ్మయ సేకరణ విషయంలో పరిశోధన విషయంలో చాలా జాగ్రత్తలు అవసరం-అవగాహన అవసరం.

"శిష్ట సాహిత్యానికి ప్రేరణ, పోషణ ఇచ్చింది ఈ జానపద సాహిత్యమే" అన్న డాక్టర్ ఆర్వీ. యస్. సుందరం గారి మాట అక్షరాలా సత్యం.

జానపద సాహిత్యాన్ని సమగ్రంగా పరిశీలించిన డాక్టర్ బి. రామరాజు గారు వీటిని ఇలా విభాగించారు :

పౌరాణిక గేయాలు-ఇందుకో రామాయణ సంబంధములు, భారత సంబంధములు, భాగవత సంబంధములు, ఇతరములు.

చారిత్రక గేయములు - చారిత్రకములు. అస్పష్ట చారిత్రకములు - శైవమత సంబంధములు, వైష్ణవ మతసంబంధములు.

పారమార్థిక గేయములు - భక్తి గేయములు, వేదాంత సంబంధములు, కర్మమార్గ సంబంధములు.

స్త్రీల పాటలు—
శ్రామిక గేయాలు—
పిల్లల పాటలు—
శృంగార గేయాలు—
అమృత రస గేయములు—
కరుణ రస గేయములు—
హాస్యపు పాటలు—
భాషా సారస్వతములు—
సాంఘిక విషయములు—
జానపద గాయకులు—
జానపద గేయముల పరుసలు—

ఇలా డాక్టర్ బి. రామరాజు గారు జానపద వాఙ్మయాన్ని విభాగించారు.

అయితే జానపద వాఙ్మయాన్ని నేను 1961 లో ''మధుర కవితలు'' అన్న పేరున సుమారు 540 పేజీల గ్రంధంగా వెలువరించాను.

దానిలో సుమారు 18 శీర్షికలతో ఇలా విభాగించాను.

పాటలు - పద్యములాలు,
దాల వాఙ్మయం,
ప్రమదలు - ప్రత్యేకతలు,
సరసాలు - సరాగాలు
బుర్రకథాతత్త్వము
యక్షగాన ప్రశస్తి
పొలం పాటలు
శ్రామిక సారస్వతం
యేల పదాలు
పడపలు - పదాలు
డంపు పదాలు
వినోదము - హాస్యము

వీరగాథలు
సంవాదాలు,
అప్పగింతలు,
మేలుకొలుపులు,
లాలిపాటలు,
వేదాంత పర పాటలు.

ఇలా కొన్ని కొన్ని భాగాలతో కొన్ని కొన్ని ప్రాంతాల పదాలతో మాండలికాలతో జానపద సాహిత్యాన్ని సేకరించడం జరిగింది.

ఇందులో ఈనాడు చాలామంది మంచి కృషి చేస్తున్నారు.

సినిమాలలో పల్లె పదాల ప్రాముఖ్యం పెరిగింది.

సేకరించి ముద్రించిన వాటిని సునాయాసంగా చరణాలకు, పల్లవులనూ స్వంతం చేసుకోవడం జరుగుతూంది.

దీనికి సంబంధించిన పరిశీలన మరో భాగంలో పరిచయం చేస్తాను.

ప్రముఖ పత్రికా సంపాదకులు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు గారు జానపద సాహిత్యానికి ఇచ్చిన నిర్వచనం ఇక్కడ గుర్తు చేయడం బాధ్యతగా భావిస్తున్నాను.

''బ్రతుకునుంచి బాహిరిల్లేది జానపద గేయం, దాని రచన కలంతో కాదు. సిరాతో కాదు. కాగితాలపై కాదు. కన్నీటితో కవోష్ణరక్తంతో, పలవుతో, విరహంతో, నవ్వుతో, నిట్టూర్పుతో, ఆశతో, అవేదనతో, కవ్వింపుతో, కౌగిలింతతో, చిన్నయానందంతో గుండెలలోనే దాని రచన. అందువల్లనే అది పచ్చిగానూ ఉంటుంది, వెచ్చగానూ ఉంటుంది. భాషా విషయాలలో ఛాందసులయిన వారికి నచ్చకపోయినా అది అరవిచ్చిన మొగ్గలోని పచ్చితనం, సాహిత్య విషయాలలో శ్రోత్రియులైన వారు మెచ్చలేకపోయినా అది ఉచ్ఛ్వాస నిశ్వాసాలలోని వెచ్చదనం.

"లయబద్ధమైనది జీవితం. జీవితంలో పెనవేసుకొని ఉండే జానపద గేయం కూడా లయబద్ధమైనదే. భాషా నియమాలను అది పాటించకపోవచ్చు. వ్యాకరణ నిబంధనలను అతిక్రమించవచ్చు- కాని లయ మాత్రం తప్పదు. అందువల్లనే

సాహిత్యపు విలువలు తప్పుపైన సందర్భాలలో కూడా దానిలో సంగీత మాధుర్యం తొణికిస లాడుతుంది. అది శాస్త్రీయ సంగీతం కాకపోవచ్చు. స్వర బద్ధమైనది కాకపోవచ్చు. రాగప్రసారానికి అనువైనది కాకపోవచ్చు- అయినా అది సంగీతమే.

కోకిల సంగీతం, సెలయేటి సంగీతం, ఓరుగాలి సంగీతం, కవరి సంగీతం.

సంగీత శాస్త్రం ఔనన్నా కాదన్నా అది మధురిమను మనసు పంచి పెడుతుంది అందుకనే లాక్షణికులు సహితా జానపద సాహిత్యాన్ని "మధుర కవితలు"గా గుర్తించక తప్పలేదు"

అని అంటూనే శ్రీ నార్ల వారు ''మధురకవితలు''కు 30 ఏళ్ల క్రితమే తొలిపలుకు రాస్తూ ఓమాట అన్నారు.

''ఏప్పిచూపినా, విడమర్చిచెప్పి జానపదగేయ సాహిత్యాన్ని ఎందరు హర్షించగలరనే సందేహం (ఇది రాసిన సమయం 1961 లో) నామట్టుకు నాకు లేక పోలేదు'' అని.

అయితే పరిస్థితులు కాలానుగుణ్యంగా మారాయి.

విశ్వవిద్యాలయాలూ, పండితులూ సాహిత్యలోకం నేడు జానపద వాఙ్మయాన్ని ఒక ప్రధాన సాహిత్య శాఖగా గుర్తిస్తూంచడం గమనించదగినదే.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. వాల్మీకి రామాయణంలో శ్రీరాముని జనన పర్యంతము బట్టి దేశకాలస్పర్శగా ప్రచారం పొందిన జానపద రచనలు ప్రచారంలో ఉండి ఉన్నట్లు మనకు అవగతం అవుతుంది.

రామాయణ, భాగవత కథలలో ఈ విషయం మనకు అవగతం కావచ్చు.

దేశ రచనలు రెండువేల ఏళ్ల క్రితమే ప్రచారంలో ఉండి ఉన్నట్లు మనం ఊహించుకోవచ్చు.

భాగవతంలో కృష్ణుని జన్మ సమయంలో గోపికలు తమ తమ పాటలనే పాడినట్లు పద్యించబడి ఉంది. అంతటి ప్రాచీనమయిన దేశకాలస్పర్శ శాస్త్రీయ సంగీత రూపక ప్రధానమయిన యక్షగానాలలా ప్రత్యేకమైనదే.

''మన వాఙ్మయ ప్రక్రియలన్నీ ఇతరభాషా వాఙ్మయాల నుంచే గ్రహించామని అనుకొన్నా యథాగానం మాత్రం మనదనీ, ఈ విషయంలో నన్నా మనం అనుకర్యులము కామనీ గర్వంగా చెప్పుకోవచ్చు''నని ప్రముఖ సాహిత్య పరిశోధకులు డాక్టర్ ఎస్. వి. జోగారావు గారి మాటలు గమనించ దగినవి.

అసలైన జానపద సాహిత్య సేకరణ, పరిశీలన, పరిశోధన ఇప్పటికీ సరిగా జరగలేదనే అనిపిస్తుంది - ఏ ఒకరిద్దరో తప్ప.

మిగిలిన దానిలో కలిగావులగంగా రచించినదీ, సేకరించినదీ కలిసిన కలిగావులగపు పుట్టే.

అందుకే శ్రీమతి నాయనికృష్ణకుమారి గారు నుడివినట్లు-

జానపదాలు ఏవి ? జానపద ప్రక్రియలలో ఆధునికులు రచించినవి ఏవి? అన్న మీమాంసతో పరిశోధకులు జాగ్రత్త పడవలసిన అవసరం ఈనాడు ఎంతైనా ఉంది.

''ఈ విచక్షణ జానపద సాహిత్యాధ్యేతల్లో లేకపోవడం వల్ల కనపడిన ప్రతీదీ—ఆ ప్రక్రియకు దగ్గరగా ఉంటే జానపద సాహిత్యమనుకుంటున్నారు" అని అసలు విషయం విడమరచి వివరించారు శ్రీమతి నాయని కృష్ణకుమారి గారు.

జానపద సాహిత్య శాఖలను విభజించడంలో ఇంచుమించు అందరిదీ ఒకే సూత్రం- ఆశయం.

అయినా, విభజించే ధోరణిలో కొంత పేర్ల దగ్గరో, భావనవద్దో కాస్తో కూస్తో లేదా-ఒకటి రెండు చోట్ల తేడా కనిపించకమానదు.

1) కవిత, కథారహితము, కథా సహితము,

శృంగారం, లాత్వికం, గ్రామికం, కుటుంబపరం,

బంధుత్వపరం, ఆచారపరం, బాలల శాఖ,

జోలలు, ఆటలు సంబంధించి, కథాగేయాలు, గ్రామిక గేయాలు, స్త్రీల పాటలు,

కలుపు, ఉడుపు, పదము, చేడ్డు పాటలు,

ప్రతాలు, నోములు - పౌరాణికాలు.

పీరుల కథలు, పురుషుకు సంబంధించినవి, స్త్రీలకు సంబంధించినవి.

స్పష్ట చారిత్రకములు, అస్పష్ట చారిత్రకములు, చారిత్ర కేతరాలు.

మతాలకూ, సమ్మకాలకూ సంబంధించినవి.

పురాణాలు, గ్రామ దేవతలు.

హాస్యాలు, వినోదాలు.

(2) నాటకాలు

వీధి నాటకాలు, యక్షగానాలు, తోలుబొమ్మలాటలు, సుద్దులు, భజనలు, చెక్క భజనలు.

గొల్లసుద్దులు, సుద్దులు, వీధి భాగోతాలు, జముకులు, కథాసహిత శాఖ, కథారహిత శాఖ.

వీరుల కథలు, అద్భుత కథలు, పురాణ గాథలు, పురాకల్పిత గాథలు, నీతి కథలు, పొడుపు కథలు.

సామెతలు మొదలయినవి.

జానపద వాజ్మయాన్ని గురించి అనేక మంది అనేక విధాల పేర్కొన్నారు.

ప్రఖ్యాత సాహిత్యవేత్త డాక్టర్ గిడుగువారి అభిప్రాయం ఇక్కడ వివరంగా ఇవ్వడం అవసరం అనుకొంటాను.

జానపద కవితా సంపుటాల మీద ప్రఖ్యాత సాహితీమూర్తులు శ్రీ తాపీ ధర్మారావుగారి అభిప్రాయాలను మరోచోట పొందుపరుస్తాను.

డాక్టర్ గిడుగు సీతాపతిగారు నా పుస్తకం ''జానపద గేయాలు–2'' సంపుటికి 1959 లో రాసిన తొలిపలుకు నుంచి–

''జానపద జీవితాన్ని ప్రతిఫలింపజేసే వాజ్మయంలో జానపద గేయాలు ఉన్నత స్థానాన్ని పొందదగినవి. అందులో జానపదులు నిత్యకృత్యాలే ఎక్కువగా కనబడుతూ ఉన్నా అవి రసవంతంగాను హృదయరంజకంగాను రచితములైనవి. మాయామర్మ మెరుగని వారి జీవితాలు సహజసిద్ధములయిన రాగద్వేషాలకు లోనైనా ఉదాత్తములయిన భావాలతోను, అవ్యాజములయిన ఆశయాల

తోను, మృదుమధురములయిన పలుకులతోను, సరళమయిన నడవడితోను నదులలోని నిర్మలోదకములవలె ఎట్లు సాగుతూ ఉంటుందో జానపద గేయాలు తెలియజేస్తూ ఉంటవి. ఉన్నదానితో తృప్తిజెంది, తృణం మేరువుగా చూచుకొని ఉత్సాహంతో ముందుకు పోగలశక్తి జానపదులలో ఎక్కువగా గోచరిస్తూ ఉంటుంది. ఊహాగానంలో వారు సర్వస్వతంత్రులు. మేఘాలలో బొమ్మలు చిత్రించుకోగలరు. బొమ్మలతో ప్రసంగించగలరు. ఆకాశంలో మేడలు కట్టుకోగలరు. రెక్కలు కట్టుకొని పైకి ఎగరగలరు. బ్రహ్మసృష్టికి మెరుగులు దిద్దగలరు. ధర్మదేవత అధర్మాలను ఆధిక్షేపించగలరు. దుష్టదేవతలకు పొలిమేరనే ఉపాహారాలు పెట్టి పొమ్మనగలరు. సరసంగా సరసాలాడగలరు. పొలయలుకలు మెలుకువతో తీర్చుకొని పొత్తు పడగలరు. కష్టాలలో సుఖాలు చూడగలరు. తోడివారల సుఖదుఃఖాలు సమంగా పంచుకొని సహకరించగలరు. సంఘ జీవిత మెట్లుండవలెనో నవనాగరకులకు బోధించగలరు. ఈ సద్గుణములన్నీ జానపద గేయాలలో ప్రతిబింబితములవుతూ వుంటవి.

జానజద గేయాలను భాషా లక్షణానికి లక్ష్యంగా లక్షణజ్ఞులు గ్రహించలేదు. వారి భాషాను శాసనము ప్రబంధాది కావ్య రచనకు వర్తింప జేసినట్లు ఈ జానపద గేయాలకు వర్తింపజేయక ఈ గేయాల యెడల పండితులు ఉదాసీనులై ఉండడంవల్ల మేలే కలిగినది. ఆ పండితులు ఆశబ్దానుశాసనాలకు ఈ జానపద గేయాలను బంధించి వుంటే ఇవి కావ్యాలవలెనే ఏ వృతకృతక భాషలోనో రచయితములై యుండును. అట్టి దుస్థితి కలుగలేదు. కనుకనే ఇవి సరళమైన శయ్యతో సాగుతూ వచ్చినవి అయితే పండితుల ఆదరణ లేకపోవుట చేత ఒక కీడు గూడా కలిగినది.

కావ్యాలు తాటాకులమీదికి ఎక్కినట్లు ఇవి ఎక్కలేదు. అందుచేత కేవలం అనుశ్రుతంగా మాత్రమే వచ్చినవేవో నిలిచినవి. తక్కినవి అంతరించినవి. ఆదినుండి నేటివరకు రచితమౌతూ వచ్చిన జానపద గేయాలు, సామెతలు మొదలయినవి నిలిచి ఉంటే సంఘ జీవితము, భాష ఎట్లా పరిణమిస్తూ వచ్చినదో చెప్పగా గ్రహించగలుగుటము. అట్టి సద్భాగ్యము మనకు లభింపలేదు. జానపద గేయాలలో గ్రహించుటకు యోగ్యమయిన పెద్ద లక్షణము ఏకరూపుగా ఉన్నది కనుకనే వాటి సంగ్రహణమునకు ఎలుక పోచ్చినది. అట్టి జానపద

గేయాలను - కాల గర్భంలో మడిసిపోయినవి పోగా నేటికింకా పల్లెలలో జానపదుల పెదవులపై తాండవిస్తూ, వీనుల విందుగా వినబడుతూ ఉన్న వాటినైనా సేకరించడం సంస్కృతి గల వారమనుకొన్నమనకు విహిత ధర్మం. ...

ఈ జానపద గేయాలను రచించిన వారెవరో మనకు తెలియదు. వారు తమ నామ ధేయాలను యథాతథంగా గాని ఉపనామాలతోగాని తమ గేయాలలో పొందు పరచుకోలేదు. వారు ఏనాటివారో స్పష్టంగా తెలియదు, అయినా, కొన్ని విశేషాలను బట్టి కాల నిర్ణయం, దేశ నిర్ణయం కొన్ని గేయాల విషయంలో చేయ గలము.

—ఏ ఏ గేయాలతో కొద్దిగా నయినా పాతబడ్డ సుడికారం కనబడుతుందో, ఏ ఏ గేయాలు మన బాల్యంలో మన ముసలమ్మలు, తాము తమ బాల్యంలో తమ ముసలమ్మలు పాడగా విని నేర్చుకొన్నామని చెప్పి వినిపించారో, ఏ ఏ గేయాలు తెలుగువారు గల అన్ని ప్రదేశాలలోను ఇంచుమించు ఒకే విధమున నేటికింకా వినబడుతూ ఉన్నవో అవి ప్రాచీన—లేదా చాలా కాలం క్రిందటి జానపద గేయాలని మన మూహింప వచ్చును.

గుమ్మడేడే గోపిదేవీ, కృష్ణమ్మా గోపాలబాలా కృష్ణమ్మా మొదలయిన గేయాలున్నూ, మేలుకొలుపు పాటలున్నూ, శ్రీ కృష్ణ లీలలున్నూ-ఇంకా ఇటుపంటివి మరికొన్నినీన్ని చాలాకాలం క్రిందటనే రచయితములయి ఉండ వచ్చును.

కథావస్తు సంఘటితములయిన కాటమరాజు, దేశింగ్ మొదలయిన గేయాలు ఆయా వీరుల చర్యలు జరిగిన కాలంలోనో, ఆ తర్వాతనో రచితములయి వుండవలెను.

బత్తాయి చెట్టు, బత్తాయి పండు అనే మాటలుగల పాటలు బతేవియా నుంచి నారింజపండ్లు మన దేశానికి వచ్చిన తర్వాతనే పుట్టి యుండవలెను. ఈ విధంగా లోలకులు పెట్టిందిరా పిల్ల, లుంగీ ఏసుకు, వాచీపెట్టి, పకోడీలు,

---

చూ॥ జానపద గేయాలు II. 1959.

బేసరి, రైలుబండి, రోడ్డు మొదలయిన ఆధ్యా దేశ్యములుగల గేయాలు ఇటీవలవి అని చెప్పవచ్చును గదా? ఈ విధంగానే గుంటూరు, పల్నాడు, గోదావరి, కృష్ణవేణమ్మ, భద్రాద్రి, దాచేపల్లి మొదలయిన ప్రదేశాలను అంకితమయిన గేయాలు ఏ ఏ ప్రాంతాలలో పుట్టియుంటవచ్చునో ఊహించుకోగలము.

* ఒక హెచ్చరిక :

ఇటీవలి వారు– జానపదులు కారు నవ నాగరికులే-రచించిన పాటలు కూడా కొన్ని జానపద గేయాల క్రింద చెలామణి అవుతున్నవి. అందుకు నా అనుభవమే తెలియజేస్తున్నాను.

"1908 లో నేను రచించిన చిలుకమ్మ పెండ్లి, రైలు బండి పాటలు గుంటూరులో వెల్వడుతూ ఉండిన "వివేకవతి" అనే మాసపత్రికలో ప్రకటితము లయినవి. అందులో నా పేరు కూడా రచయితగా ముద్రితమయినది. దరి మిలాను నా అనునతి పొంది లాంగ్‌మన్స్, మాక్‌మిలన్ వారలు తమ వాచకము లలో చేర్చుకొన్నారు.

ఆ తర్వాత కొందరు జానపద గేయాలంటూ ఒక చిన్న గ్రంథము ప్రకటించి అందులో నా చిలుకమ్మ పాట నా పేరు లేకుండా చేర్చుకొన్నారు. ఈ విధంగా ఇంకా ఇటువంటి ఆధునిక రచనలు ఎన్ని చేరినవో !..... ...

---

* జానపద గేయాలు-ఎల్లోరా-నాడగ సంపుటికి రాసిన కొని పలుకును గమనించాలి.

సమీక్ష

ఆంధ్రవిశారద శ్రీ తాపీ ధర్మారావు నాయుడు గారు

(ఆంధ్రవిశారద శ్రీ తాపీ ధర్మారావు నాయుడు గారు
21-12-1955 లో ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో
ఎల్లోరా జానపద సాహిత్యంపై చేసిన సమీక్ష.)

సరళమైన జాతి జీవనం చూడాలంటే పల్లెలకే పోవాలి. పట్టణాలలో వుండే సంపర్క-దోషాలు అక్కడ అంతగా వుండవు. ఆచారాలూ, వ్యవహారాలూ కల్తీలేకుండా-అంటే చాలవరకూసుమండీ - ఉంటాయి. కల్లా కపటంలేని బ్రతుకులతో, పరస్పరం సాయం చేసుకునే బుద్ధులతో, అన్నా, మామా; వదినే, అత్తా అన్న వరసలతో, పల్లెఅంతా ఒక్క కుటుంబంగా కనబడుతుంది. ఆటోపం లేని ఆటలూ పాటలూ, ఆడంబరం లేని అలంకరణలూ, అసత్యాలకు పాల్పడని మాటలూ - అన్నీ మన పట్టణవాసులకెంతో ఆశ్చర్యంగా వుంటాయి. పల్లె జనుల హాస్యాలూ, సరసాలూ, ప్రోత్సాహాలూ, అన్నీ అమాయక ధోరణిలో ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తూ ఉంటాయి. ఈ విషయాలన్నీ పల్లె పాటలలో ప్రత్యక్షంగా కనిపిస్తాయి. తికమకలు లేని వరుసతో, సులభంగా బోధపడే మాటలతో, అందరికీ అందుబాటులో వుండే భావాలతో ఒక చక్కని సహజ ధోరణిలో ఉంటాయి ఈ పల్లెపాటలు.

అటువంటి వాటిని చాలవరకు సేకరించి శ్రీ 'ఎల్లోరా' గారు చక్కని సంపుటాలను తయారు చేశారు. ఇంకా మరికొంత పరిశోధనా చేస్తున్నారు. ఈ సంపుటిలో అనేకము పురాతనమయినవీ చాలమందికి పరిచయమున్నవీ వున్నాయి. ఇందులో ఆమాయకమైన వివిధ రసాలూ చూడవచ్చును. ఈదుళ్ళలోను, దంపుళ్ళలోనూ, పడప సడపడంలోనూ, ఆఖరికి రోడ్డు రోలరు ఈడ్వడంలోనూ, పనివారిని ప్రోత్సహిస్తూ, జప (spring) ఇవ్వగలుతూ పుట్టిన చక్కని పాటలు

ఈ గ్రంథంలో వున్నాయి. సరియయిన పరిసరాలతో ఈ పాటలు పాడితే వీణా మృదంగాది పరికరాలు లేకపోయినా, పాడే వారి పెదవుల నుంచి వినేవారి హృదయాలలోనికి ఒక రస ప్రవాహం ఏర్పడుతుంది. ఎందుకంటే, కష్టమైన మాట వుండదు; అనుభవం లేని సన్నివేశం ఉండదు; పరిచయాలు లేని భావం ఉండదు; అందుబాటులో లేని పరిస ఉండదు. ఇంక హృదయాలకు హత్తుకోవడంలో ఆశ్చర్య మేముంది ?

జానపద గేయాలు, సరాగాలు అను పేర్లతో గతంలో మూడు చక్కని సంపుటాలను అందించిన 'ఎల్లోరా' ''మధురకవితలు'' అను పేరున జానపద వాఙ్మయ పరిశోధన గ్రంథం అందించి దేశ సాహిత్యానికి ఎంతో కృషి చేశారు. అభినందనీయం.

(సం) తాపీ ధర్మారావు నాయడు

ప్రజా వాఙ్మయం



"భారతీయ సంస్కృతీ నిక్షిప్తమైన వేదాలను మహర్షులు అనుక్షణంగా పాగ్రూపంగా వేలాది సంవత్సరాలుగా పరిపోషించారు. ఆంధ్ర జాతీయ సంస్కృతీ నిధికృతమైన జానపద వాఙ్మయాన్ని జానపదులు నోటి పాటలుగా వంద లాది సంవత్సరాలు పరిరక్షించారు" అంటారు నేదునూరి గంగాధరంగారు తమ ఉపోద్ఘాతంలో.

అంచుకే వీటిని అనాధృత వాఙ్మయమని నెట్టినా తీట్టినా జనం నోళ్ళల్లో మనసుల్లో గుండెల్లో శాశ్వతత్వాన్ని సాధించుకొన్నాయి.

జానపద సాహిత్యము చతుర్విధములు. జానపద నృత్యములు, జానపద గీతములు, జానపద గాధలు, ప్రకీర్ణ సాహిత్యము.

దేశం యొక్కగాని, రాష్ట్రం యొక్కగాని, జాతి యొక్కగాని నాగరికతలో జానపద విజ్ఞానము ప్రధాన స్థానము ఆక్రమించుకొని ఉంటుంది.

ఆ చరిత్ర ఆ విజ్ఞానము కోటానుకోట్ల ప్రజల ఆశలను ఆశయాలనూ, సమ్మకాలలో వారి నైతిక విలువలను ప్రతిబింబిస్తూ ఉంటుంది. అంటే ఆ దేశం యొక్క ఆ ప్రజల యొక్క సంస్కృతిని పరిపూర్ణంగా అర్థం చేసుకోడానికి జానపద సాహిత్యం, జానపద విజ్ఞానం తప్పనిసరిగా పరిశీలించవలసి ఉంటుంది.



అసలు ఆదికవిత్వం ఏది? ఆది కవి ఎవరు అని ప్రశ్నిస్తే నన్నయ కన్నా ముందే ఉన్న జానపద కవులే ఆదికవులు అనడం న్యాయం అనుకొంటాను.

ఎందుకంటే, అనువాదం చేయడం ద్వారా గొప్ప కీర్తిని పొందినవాడు నన్నయ అయితే మౌలికమైన కవితలు, పాటలూ, గాథలూ విరచించి జానపదకవులు ఘన కీర్తిని పొందారు. వీరి ప్రత్యేకత ఏమిటి అంటే పేరును ఆశించకపోవడమే.

నన్నయ్య కవిత్వం కంటే చాలాముందు అయిదారు వందల ఏళ్ల క్రితమే శాసనాలు మనకు తెలుగు కవిత్వం వినిపించి సాక్ష్యాలు చెబుతున్నాయి.

ఇక్కడ లెనిన్‌ను గుర్తు చేస్తా.

"……Folklore is material about the hopes and yearnings of the people... so necessary and important for the study of their psychology..." —Lenin.



పల్లె సాహిత్యం అనబడే జానపద సాహిత్య విలువలను, గొప్పతనాన్ని, ముందుగా గుర్తించినవారు పాశ్చాత్యులే.

చూ॥ 'పుస్తిరు'పై చాలిపలుపై రాస్తూ పురిపండా వారి వివరణ.

"ఆసియా దేశాల సంస్కృతీ, సాహిత్యమూ, చరిత్రా, కళలూ, విజ్ఞానమూ మొదలయిన వాటిని విమర్శనాత్మకంగా, శాస్త్రీయంగా పరిశోధించడం కోసం 1784లో విలియంజోన్స్ (1746-94) బెంగాల్ ఏషియాటిక్ సొసైటీని స్థాపించారు. 1804 లో బొంబాయి రాయల్ ఏషియాటిక్ సొసైటీ ఏర్పడింది.

"అత్యంత ప్రాచీనమైన వేద వాఙ్మయము మన దేశమున తరతరముల నుండి యనుశ్రుతముగా పచ్చుట మనకందరకును తెలిసిన విషయమే. వేదము లలేఖ్యములు: వానినొకరి నుండి మరియొకరు విని నేర్చుకొనెడివారు. కనుకనే వేద ములను శ్రుతులందురు. ఇదిగాకను వేదము లపౌరుషేయములని మనవారి అభి ప్రాయము. అనగా వేదములు మనుష్యులచే నిర్మింపబడినవి కావనుట. అవి భగ వదత్తములని మనవారి నమ్మకము. భగవదత్తములైనను కాకున్నను అపౌరుషే యములను మాటలోని యంతరార్థము జానపదగేయ ప్రథమ లక్షణమున(ప్రత్యేకం రచయిత లేకపోవుట)కు సన్నిహితముగా నున్నది. శ్రుతము,అపౌరుషేయము అను నీరెండు లక్షణములను దృష్టియందుంచుకొని కొందరు పండితులు వేదములుగూడ ప్రాచీనార్యుల జానపదగేయములై యుండునని భావించిరి. ఈ భావన కొంత సమంజసముగానే యున్నను వివాదాస్పదమయినది. ఏలయన, జానపద గేయ మునకు మౌఖిక ప్రచార లక్షణముచే మార్పులు కూర్పులు జరుగుచుండుట మనము తెలిసికొని యున్నాము. కాని వేదమున మార్పులకు కూర్పులకు తావులేదు కదా. వేదములకుత్పత్తి దశయందు సామూహిక కర్తృత్వ లక్షణము కొంత వరకు సరిపడినను ప్రచార దశయందు మాత్రమొక నోటినుండి మరియొక నోటి కెక్కినను మార్పులకు కూర్పులకు నవకాశము మాత్రము లేదు.

జానపద గేయముల మరియొక లక్షణము వాని సహజ (అకృతక) శైలి. ఇదివరకు పరిణత స్వరూపము చెప్పబడినది. స్వరూపమునకును శైలికిని భేదము కలదు. స్వరూపము రచనము యొక్క బాహిరరూపము, శైలి అంతర రూపము. Style is man అనునపుడు మనము గ్రహింపవలసినదీ యాంతర రూపమే కదా.. జానపదగేయోత్పత్తి గురించిచర్చించునపుడు దాని తత్వమును అప్రయత్న శిల్పమును గూర్చి తెలిపియుంటిని. ఆ తత్వమునకు సంబంధించినదే ఈ యకృతక

చూ॥ డా॥ బి రామరాజుగారి "తెలుగు జానపదగేయ సాహిత్యము."

శైలి యేసు లక్ష్యము. జానపద గేయముల శైలి నిరలింకృతమై, స్వచ్ఛందమై, సరసమై సాధారణముగా నుండును. ప్రయత్నపూర్వకములైన శబ్దాలంకారములు గాని, అర్థాలంకారములు గాని, కవిప్రౌఢోక్తులుగాని వానియందగుపడవు..."

చలం అన్నట్లు "ఈ పాటలు ఒక కవిగాని, కవయిత్రి గాని ఒకనాడు రాసినవి కావు, దశాబ్దం నుంచి దశాబ్దానికి మామూలు అక్షరజ్ఞానంలేని స్త్రీల నోళ్ళలోపడి వాళ్ళ అనుభవాలు– కొత్త పాటల్లోనూ పదజాలంలోనూ, వాతావరణంలోను మార్పులుచెంది నిలిచిపోయినాయి" అన్నది నిజం.

పద పద్య కవితలలో పదకవితే మొదట పుట్టిందన్న సంగతిని గురించి తర్జన భర్జనలు లేవు. ఈ విషయం అందరూ అంగీకరించినదే.

అదే అంటారు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు.

"చిత్రవిచిత్ర కాఠ్యకమనీయమైన ప్రకృతి దేవతా చిద్విలాసమును చూచి యానంద పరవశుడై ప్రాకృత జీవియగు ప్రాక్తన మానవుడు చిందులు త్రొక్కుచు పాడిన పాటయే మానవలోక కవిత్వావిర్భావమునకు శ్రీకారము. ఆ కవిత్వము ఆడుచు పాడినది గనుక దానికి 'ఆటపాట' లేక, నృత్యగీతము అని పేరు. కనుక పద పద్య కవితల్లో పదమే ప్రాచీనమనీ, పదకవిత నుంచి పద్య కవిత్వమావిర్భవించిందనే రాళ్ళపల్లివారి అభిప్రాయము.

పున: జాతీయ సాంస్కృతిక సంపదలో జానపద సాహిత్యం, జానపద సంగీతం, జానపద కళలు ప్రధానమైనవి. జానపదగేయాలలో, జానపద సంగీతంలో ఒక విలక్షణ మాధుర్యం నిండి ఉంది. మనసును ఆహ్లాదపరచడం ప్రధానంగా గలది జానపద కవితలు.

ప్రజలపైనుండిన సంభాషణలలోని సుడికారాల తూగూ టెంగూ, ఓయ్యారాలు పంపులూ సొంపులూ అన్నీ ఈ మధుర కవితా నిక్షేపాలలో నింకి నిబిడీకృతమై ఉన్నాయి.

ప్రస్తావన- ప్రజావాఙ్మయం- చలం.

గౌతమ వ్యాసాలు- క్షేత్రయ్య పదసాహిత్యము

జానపద సాహిత్యం

- కవిత
  - కథా రహిత శాఖ
    - శృంగార గేయములు
    - తాత్విక గేయ.
    - శ్రామిక గేయ.
    - కౌటుంబిక గేయములు
      - బంధుత్వ ప్రదర్శకములు
      - ఆచార ప్రదర్శకములు
      - బాల గేయాలు
        - జోల పాటలు
        - ఆటలకు సంబంధించినవి
  - కథా సహిత శాఖ
- నాటకం
  - యక్షగానం
    - గొల్ల భామ
    - తోలు బొమ్మలాట
  - వీధి నాటకం
  - చెక్క
- వచనం
  - కథా సహిత శాఖ
    - వీరుల కథలు
    - అద్భుత కథలు
    - పురాణ గాథలు
    - పురాకల్పిత గాథలు
    - నీతి కథలు
  - కథా రహిత శాఖ
    - పొడుపు కథలు
    - సామెతలు


కథా గేయాలు
శ్రామిక గేయాలు
స్త్రీల పాటలు
కలుపు పాటలు
చిత్ర కథలు
పౌరాణిక కథలు
వీర గాథలు
స్త్రీ సంబంధి
మత గాథలు
స్పష్ట చారిత్రక
అస్పష్ట చారిత్రక
చారిత్రకేతర
పురాణ కథలు
గ్రామదేవతల కథలు

1. "ఈ పల్లెపాటల బాణీలు చాలా మంది శాస్త్రీయ సంగీత రచయిత లను సైతం ఆకర్షించాయి. త్యాగరాజు, గోపాలకృష్ణ భారతివంటి ప్రముఖ వాగ్గేయకారులు కొన్ని పల్లెపాటల ఫణతులలో కీర్తనలు రచించారు. సాహిత్యం కూడా పల్లెపాటల భాషలోనే మార్చిన రామస్వామి శివం వంటి వాగ్గేయకారులు కూడా కొందరు ఉన్నారు.

కొంత నాజూకుతనంగల పల్లెపాటలు చాలవరకు పున్నాగవరాళి, నాద నామక్రియ, ఆనంద భైరవి, సైంధవి, సింజురుట్టి, కురంజి. నవరోజ్, నీలాం బరి మొదలయిన రాగాలలో పాడతారు. ఈ పాటలలో చాలా భాగం ఆది, రూపక, చాపుతాళాలలో ఉన్నవి. ఎక్కువగా తీవ్రగతిలో ఉన్నట్టు కనిపిస్తుంది.

"పల్లె పాటలు పాడేవారు సాధారణంగా చేతితోగాని, పుల్లలతో గాని కొట్టి వాయించే (దకి=మొ) వాద్యాలను వాడతారు. ఈ పాటలలో గమనం ప్రధానం అవడం వల్ల ఈ తట్టు వాయిద్యాలే వాటికి అనుగుణమైనవి. మృదంగ తాళాలు కూడా ఈ వాయిద్యాలలో వాడతారు. తంత్రీ వాద్యాలలో మంద్ర స్వరం కోసం 'తుంతిన' అనే వాద్యాన్ని వాడతారు. కొన్నిప్రాంతాలలో 'ఏకతార' ఎక్కువగా వాడుకలో ఉన్నది.....

జానపద గాయకులు వాడే తాళ వాద్యాలలో ముఖ్యమైనవి మృదంగం. డోలక్, జమిడిక, డక్, కంజిర. ఉడుక్కై, ఘటం, పంబ, శిలాంబు, కర్ర చిఱతలు, నాటుతాళాలు ప్రధానమైనవి"

2. ప్రాంతానికీ ప్రాంతానికీ పాటల్లో మాటల్లో, ఆటల్లో చాలా తేడా లున్నాయి.

---

1. మద్రాసు విశ్వవిద్యాలయ సంగీత శాఖాధ్యక్షులుగా పనిచేసిన ప్రొఫెసర్ పి. సాంబమూర్తిగారు "తెలుగు పల్లెపాటలు"కు రాసిన ఉపోద్ఘాతంలో జానపద కవితా, సంగీత లక్ష్యాలను, లక్షణాలను వివరించారు.

2. ప్రొఫెసర్ యామాబి. దోణప్ప "ఓట్టి-జాయే" పాటలు ప్రవంతిలో-

మచ్చుకు ఒక ఉదాహరణ ఇస్తాను. జానపద సేకరణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-రెండు దశాబ్దాల క్రితం నాటి మాట— ఒక ఫోక్‌లిట రేచర్ కమిటీ వేసింది. అందులో నేను (ఎల్లోరా), దోణప్పగారు, గంగాధరంగారు, ఆదిశేషువుగారు, రామరాజుగారు - ఇంకా కొంతమంది సభ్యులం. అప్పటి పరిచయం మాది.

నేను సేకరిస్తూ, ఆంధ్రప్రభ దినపత్రికలోనూ, విశాలాంధ్ర దినపత్రిక లోనూ వ్యాసాలు రాస్తూండడం, అటు రామరాజుగారు, దోణప్పగారు అదేపనిలో నిమగ్నమై ఉండడం మేము మరీ దగ్గర అవడానికి దోహదం ఇచ్చింది.

''జట్టి-జామ్'' పాటలు దోణప్పగారి సేకరణలో ప్రత్యేకమైనవి.

* వీటిని గురించి ప్రొఫెసర్ దోణప్పగారి మాటలనే ఇక్కడ ఇస్తున్నాను.

''జట్టి-జాము-కోశముల కెక్కని వింత మాట. తొలుత నిది చేతి కోల లతో తాళము వేయుచు పాడుచు, ఆడెడు క్రీడయని నాయూహ. ఆయూహకు సత్తువలివి, సంస్కృతమున చేతికోల అను నర్థమిచ్చు 'యష్టి' శబ్దము పాక్ర తమున నిదే యర్థమున 'జట్టి'గా మారినది. ఆట్లే ప్రహారమను నర్థముకల'యమ' శబ్దము ప్రాకృతమున 'జామ'యయినది. రెంటిని జోడించగా 'జట్టిజామ' తదను సారిణియగు తెనుగున 'జట్టిజాము' మొదట కోలాటము నందువలె చేతి కోలలతో ఆడెడు ఆట. కాలక్రమమున ఉత్త చేతులతో ఆడుటగా మిగిలినదేమో''

అసలు జానపద సంగీత లక్షణాలు పరిశీలించడమూ అప్రస్తుతం కాదను కొంటాను.

ప్రొఫెసర్ సాంబమూర్తిగారు ఇలా వివరించారు :

''స్వర పరిమితి తక్కువగా ఉండటం, సాధారణంగా ఒక సప్తస్వర స్థాయిని మీరిపోదు. పాడేవారు సంగీత శిక్షణ పొందనివారు గనుక ఇది సహజం.

2. సరళమైన సంగీత రచన గమకానికి ప్రాధాన్యం.

3. అనాది సంప్రదాయ సిద్ధములు – అనగా అజ్ఞాత కర్తృకములు అవటం. ఇటీవల ఆధునికులు జానపద సంగీతఫణతులలో రచించిన ఏవో కొన్ని పాటలు తప్ప, మిగిలిన పల్లెపాటలన్నీ అజ్ఞాతకర్తృకాలే.

4. చరణాలు అపరిమితంగా ఉండటం. కొత్త భావాలు వాడుకలోకి వచ్చినప్పుడల్లా కొత్త చరణాలు కూర్చుకొంటూ, పాతబడిన భావాలుగల చరణాలను వదిలేస్తూండటం.

5. ప్రతిమధ్యమ స్వరం లోపించడం. ఈ స్వరం విద్వాంసుల స్వరం అవడం వలన అశిక్షిత కంఠాలకు ఒదుగదు. అయితే, పెళ్ళి పాటల వంటి నాగరికమైన పల్లె పాటలలో కొన్ని పంతుపరాళిలో పాడతారు.

6. ''కండిత'' మొదలయిన కొన్ని గమకాలను మాత్రమే వాడడం.

7. సాహిత్యంలో మాటలు మరీ ఎక్కువగా వాడటం.

8. సువ్యవస్థితములైన సంగతులు గాని, స్వరదీర్ఘకరణాలు గాని లేక పోవడం.

9. సాహిత్యం ద్విపాద చరణాలుగా గాని, చతుష్పాదాలుగాగాని ఉంచటం, కన్నడ లావణీలలో మాత్రం కొన్ని త్రిపాదులు కూడా ఉన్నవి.

10. అర్థం ఏమీలేని ''ఏలేలో'', - ''ఐలేసా''లాంటి శ్రావ్యమైన శబ్దాలు వాడటం ...

పౌరాణిక గేయాలు-రామాయణ సంబంధములు, భారత సంబంధములు, భాగవత సంబంధములు, ఇతరములు, చారిత్రక గేయములు, అస్పష్ట చారిత్రకములు, మత సంబంధ గేయములు, శైవమత సంబంధములు, వైష్ణవమత సంబంధములు, పారమార్థిక గేయములు, భక్తి గేయములు, వేదాంత సంబంధములు, కర్మమార్గ సంబంధములు. శ్రేష్ఠ పాటలు, శ్రామిక గేయములు, పిల్లల పాటలు. శృంగార గేయములు, అద్భుతరస గేయములు, కరుణరస గేయములు, హాస్యపు పాటలు, భాషా సారస్యతములు, సాంఘిక విషయాలు, జానపద గాయకులు. జానపద గేయముల వరుసలు.

డాక్టర్ రామరాజుగారు తమ జానపద సాహిత్యాన్ని ఇలా విభాగించారు :

లయబద్ధ సంగీత గీతాలు



ఒకానొక సమయంలో అవిమానవుడు ఆవేశపూరితుడై జీవితవ్యవహారాలు పరిచయం కొంటున్న సమయంలోనే ఏకాకీరూపంలో ఈ కవిత ప్రాపుర్భవించి ఉంటుంది. అయితే, తొలినాటి కవితా రూపం క్రమానుగతంగా పెరుగుతూ వచ్చిన నాగరికతతో పాటు, జీవితానుభవం నేర్పిన అనుభవ సారంతోపాటు బలపడడం జరిగి వికసించి ఉంటుంది! మానవజీవిత పరిణామంతో పాటే - అతని మేధ సాధించిన విజయంతో పాటే సాహిత్యమూ పరిణామం చెందడం సహజం!

పూర్వకాలంలో ఒక్కొక్కతెగ - లేక జాతివారు వారి వారి సమ్మేళనాలను బట్టి ఒక్కొక్క పద్ధతిని సృష్టించుకొని ఆ కళ ద్వారా, ఆ విజ్ఞానం ద్వారా ఆనందానుభూతులను అనుభవిస్తూ ఉండేవారు.

ఇలా ఆయా జాతులు, తెగలలో వారు పంచుకొని రూపొందించుకొన్న నాగరిక, విజ్ఞానం రకారీతులు-వాటికితగ్గ అభిరుచులూ పెరగడం, ప్రచారం అవడం జరిగింది. ఈ దశల ప్రస్థానంలోనే అనేకానేక రూపాలలో జానపద సాహిత్యం, కళలు రూపు దిద్దుకొని ప్రపర్ధతను సంతరించుకొన్నాయి. ఇలాటి వాటిలో జానపద కళలు సృష్యాది ప్రధానమైనవి.

ఇందులో సాహిత్యం-జానపాటలు, స్త్రీ సాహిత్యం, శృంగారపదాలు, బుర్రకథా రచనలు, యక్షగానాలు, పొలంపాటలు, గ్రామీణసాహిత్యం, యేల పదాలు. పసిపదాలు, దంపుడుపదాలు, విన్నోదము, హాస్యము, వీరగాథలు, సంవాదాలు, ఒప్పగింతలు, మేలుకొలుపులు, జాలిపాటలు, వేదాంతపరమైన పాటలు.

ఇందులో-కళలు : జానపద నృత్యాలు, తోలుబొమ్మలు, యక్షగానాలు కురవంజులు, చెక్కభజనలు, బుర్రకథలు, పంబరకథలు, పిట్టనాటకాలు మొదలైనవి.

ఇలా ఇలా రూపుదిద్దుకొన్న ప్రవంతినుండి ప్రవహించిన సెలయేరే జాన పద సాహిత్యం.

జానపద సాహిత్యంలో—ప్రధానంగా జానపద గేయాలలో అందాలన్నీ సెంటిమెంట్లతో అల్లుకుని హృదయాన్ని సమీపిస్తాయి. అసలు ఈ పల్లెపాటలు శాసనాలకంటె చాలా విలువయినవి. ఆయా కాలాలలో, ఆయా మండలాలలో జరిగిన విషయాల సంగ్రహ చరిత్ర స్వరూపమే జానపద కవితలలోని గొప్పతనం.

ఫ్లెచర్ పేరొక్కన్నట్లు-ఇవి ప్రాచీన శాసనాలకంటే విలువైనవి. యాగర్టీ క్రఫే వివరించినట్లు-ఆయా కాలాలలోని ఆయా జాతుల నాగరికతా విలువలు, వారి వాతి ఆచార సంప్రదాయాలూ తొణికిసలాడే భాండాగారాలండే సరిపోతుంది.

ఈ సాహిత్యంలో చాలా సులభమైన భాష, పెద్ద భావం నిండి ఉంటుంది. సులభమైన భాషలో చెప్పడానికి శక్తిలేనివాడే కష్టమైన భాష ఉపయోగిస్తాడని చలం ఒకచోట చమత్కరించాడు.

కాలం, ప్రాంతం నిర్ణయాలు : ఈ గేయం, ఈ రచన ఫలానా కాలానిది అని చెప్పడానికి శ్రమే మరి.

ఈ జానపద కవితా ప్రవంతి అలా అలా ఓళ్ళనే ఏరులనీ దాటుకొంటూ ఆక్కడో పదం, మరెక్కడిదో ఓ మాండలికం కలుపుకొని - అలా అలా మండలాలను దాటి మాండలికాల అలంకరణల గలగలలతో ఎక్కడో పుట్టి, ఎక్కడో నిలవడం కష్టం. అంచుకే ఒకే పాట కాస్త మాండలిక భేదంతో ఒకేలా వినిపించడమూ కష్టం. పలికించడమూ కష్టం.

ఈ జానపద సాహిత్యశాఖ క్రిందకే - ఏల పదాలూ, తుమ్మెద పదాలూ, ఆనంద పదాలూ, నిమ్మళి పదాలూ, గొబ్బి పదాలూ, వెన్నెల పదాలు మొదలయిన పన్నీ వస్తాయి.

ఈ పల్లె పదాలలో భంచుపన్న లోయలు, పంచతమ్మన్యాల కావ్యసంబంధనల లోపాలు ఉన్నా రసపుష్టికీ. భావ గాంభీర్యానికీ వెలితి ఉండదు.

ద్విపదలు, రగడలు.. యక్షగానాలు దేశికవితలుగానే పేర్కొన్నారు దేశికవిత్వకు పాల్కురికి సోమనాథుడే ప్రారంభోత్సవం చేశాడని చెప్పాలి.

దేశిరచనలు రెండు విధాలు – 1: పాటలు 2. పదాలు.

పదాలు :- తుమ్మెద, ప్రభాత, వెన్నెల, కోవెల, చిలుక, కీచాళి, బొబ్బినివాళి, మువ్వగోపాల – హరిహరీ పదాలు.

పాటలు :- లాలి, జోల, ఏల, సువ్వీ, ఉయ్యాల, జాజిరి, ఐరేసి, అప్పగింతలు, అర్కాల, గోభనం, ఫలశ్రుతులు, చద్దులు, సుద్దులు, చిందులు, కీర్తనలు, సంవాదాలు.

ఈ కవితలలో ఇంపులు :- బాలసాహ్యంపం నుంచి తత్త్వాల దాకా ఎన్నో రకాల గేయాలు ఉన్నాయి. ఆయుర్వేద రహస్యాలను, జీవిత జీవన మర్మాలనూ ఇవి వినిపిస్తాయి.

ఒకనాడు జానపద రచనలు, బుర్రకథలు, జంగం కథలు, తోలు బొమ్మలు, ఏకపాత్రాభినయాలు, చెక్క భజనలు, పగవ పాటలు అధ్యాత్మిక ప్రబోధాన్ని; పురాణ ప్రభావాన్ని వినిపించేవి. జానపద కళలూ అంతే!

కాని కాలం మారింది. మానవుని అభిరుచీ, సమస్యలూ మారిపోయాయి. చచ్చి స్వర్గాన్ని సాధించడం గురించి, కైలాసాన్ని గురించి, పుణ్యాన్ని గురించీ ఆలోచించే సమయం లేదు – నేటి మానవుడికి.

అతని చుట్టూ ఆకలి-బాధలు, ఈర్ష్యలు, కక్షలు, మోసాలు, యుద్ధాలు, ఇలాంటి చక్రబంధంలో చిక్కిన ఈ శతాబ్దపు మానవుడు జానపద రచనలనూ, జానపద కళలనూ నేటి సమస్యలతో రంగరించి, బంధించి, ఆయా బాణీలలోనే ఈ ఇతివృత్తాలను ప్రజలకు సందేశాత్మకంగా మలచడం జరుగుతూంది. ఇదే ఆధునిక దృక్పథం.

ఈ దృక్పథం రెండవ ప్రపంచ యుద్ధం నాటినుంచీ బాగా అమలులోకి వచ్చింది – ఈ ఘనత ప్రజానాట్యమండలి వారికీ, నాటి యువజన విద్యార్థిబృందం వారికీ చెప్పుకోతుంది. ఈ విషయంలో నాగిర్, మిక్కిలినేనిలను ప్రథమపంక్తిలో శాశ్వతంగా గుర్తుంచుకోవాలి.

ఒకనాడు బుర్రకథల్లో పల్నాటి యుద్ధం, బొబ్బిలికథలు మారుమ్రోగాయి. అసంతరం ప్రజల సమస్యలతో అవి నిండాయి. ఆంధ్రలో ప్రజోద్యమాలకు విప్లవ నాదాన్ని, వాదాన్ని, వాడిని అందించాయి.

అలాగే షేడోప్లేస్ పేరుస ఈ తోలుబొమ్మలనీ మార్చి ప్రగతికి బాటలు సూచించింది.

పాటలు జనాపద వరుసల్లో ప్రజల సమస్యలు రూపు దిద్దుకొన్నాయి.

ఆధునిక కవులు, అభ్యుదయ కవులు, విప్లవ కవులు ఈ జానపద గేయాలను నేటి చైతన్య కవితా స్ఫూర్తితో చేతనావిష్కరణకి శంఖారావంగా-కత్తుల బావుటాలుగా, క్రాంతి శంఖాలుగా మారుస్తున్నారు.

సుంకరవంటి ప్రజాకవిచేతిలో బుర్రకథలు విప్లవరూపం ధరిస్తే, నాజర్ వంటి ప్రజా కళాకారుని గొంతులో ప్రజానాదంలా ప్రతిధ్వనించి లక్షలాది సామాన్య ప్రజల గుండెల్లో విప్లవ బీజాలు నాటింది. అలా ఎందరో నవకవులు, కళాకారులు జానపద కవితలను కొత్తగా రూపొందించి విశ్వప్రగతి మహోదయానికి, క్రాంతి మహాప్రస్థానానికీ-సమసమాజావిర్భావానికీ విప్లవ తోరణాలతో-ప్రగతి భావపరిమళాలతో అలంకరించి ఆవిష్కరిస్తున్నారు.

ఇది రేపటిని గురించి చిగురించే మహోదయపు ఆశ!

ఇది ప్రగతిని గురించి నేటి నవతరపు ఆశయాలకు వేగుచుక్క!!

ఒకనాడు ఈ కవిత తిరస్కృతాంధ్రవాఙ్మయం! నేడు జాదపద కవిత లేనిదే సినిమా లేదు. పాటలేదు, జీవితంలేదు.

ఎన్నో పాటలకు కొత్త రాగాలు, కొత్త రూపాలు వినిపిస్తున్నాయి.

ఒకనాడు ఈ సాహిత్యాన్ని బూతు కవితగా, తిరస్కృత కవితగా వెలి వేసినా - నేడు జనసామాన్యపు ఆదరణలో కమ్మని తియ్యని "మధుర కవితలు"గా సింహాసనాన్ని అధిష్టించింది.

అందుకే యూనివర్సిటిలలో డాక్టర్ పట్టాతో ఈ కవితామతల్లిని అలంకరించి సత్కరించడం.

పిండారబోసినట్లు ఉన్న వెన్నెల, చుట్టూరా పొదలూ, కాలువా, అక్కడక్కడా మొగలిచెట్లు, ఆ పూల పరిమళం మోసుకొని బరువుగా ఆడుగులు వేసుకుంటూ వెడుతున్న పిల్లగాలులు, కీచుకీచుమని ఒకే శ్రుతిలో ప్రకృతిని పలకరిస్తున్న కీచురాళ్ళు; నూదిగుచ్చినా దిగని పొదల తిమిరచ్ఛటలో మిలమిల లాడుతూ పోతున్న మిణుగురు పురుగులు—

దూరంలో ఒక కంచుగొంతు కమ్మని పాట ఒకేమారు పంచమంలో ఎత్తుకొని ఆ నిశ్శబ్దమంత్రముగ్ధ ప్రకృతిలో జీవం పోస్తున్నది—

ఆ చల్లని వెన్నెలా, ఆ మెల్లని గాలీ, ఆ ఉల్లం జల్లుమనిపించే పాటా నేలకూ నింగికీ మధ్యనున్న తెరను తొలగించి, మనల నేదో గంధర్వ నగరంలోనికి ఎత్తుకొనిపోయి మైమరపింపజేస్తాయి - అదే వాటి గొప్పతనం.

లయబద్ధమైనది జీవితం - జీవితంతో పెనవేసుకొనిఉండే జానపద కవిత కూడా లయబద్ధమైనదే!

అందుకే ఈ పల్లెపాటల గుండెలోతుల్లో మానవుని నాగరికతా విలువలూ, సంప్రదాయాలు ప్రతిఫలిస్తాయి - ప్రతిధ్వనిస్తాయి !!





మిగడ తరగలు

* "మన కావ్య సాహిత్యం చాలాభాగం ఎత్తువారి చేతిబిడ్డ. ఉత్తమ నాయికా నాయకుల నెపంతో ఉదాత్తకావ్యేతివృత్తం సాకుతో, ఉన్నత శిల్పం పేరుతో సంస్కృత సాహిత్యానికి ఛాయగా రూపుదిద్దుకున్న తెలుగు కావ్యాల్లో సామాన్య ప్రజాజీవనచ్ఛాయలు చూచాయగా నయినా పొడకట్టవు - దేశీయతా ముద్ర ప్రగాఢంగా ఉన్న ఏవో కొన్ని తావుల్లో తప్ప. ఆంధ్రసాహిత్య వీధుల్లో సగటు మనిషి ఇంచుమించుగా మనకి కన్పించడు. ఇక అతడి రుచులూ, అభిరుచులూ, ఆశలూ, ఆశయాలూ మున్నగువాటి ముచ్చట కలలోని వార్త.

"అయితే జానపద సాహిత్యంలో మటుకు అతడి విరాట్ స్వరూపం స్పష్టంగా, పరిపుష్టంగా గోచరిస్తుంది. కష్టసుఖాల పడుగు పేకల్లో అల్లుకుపోయిన ఆనాటి గ్రామీణ జీవితానికి అద్దం పట్టిన జానపద సాహిత్యం మధురాతి మధురం."

---

* ప్రొఫెసర్ తూమాటి దోణప్పగారు "జానపద సాహిత్యంలో ప్రజల కష్ట సుఖాలు" అన్న వ్యాసంలో నిక్కచ్చిగా నాలుగు మాటలూ వివరించారు. చూ॥వాణి.

అందుకే వేటూరి ప్రభాకరశాస్త్రి, గిడుగు వేంకటసీతాపతి, నార్ల వెంక టేశ్వరరావు వంటి ఉద్దండులు వీటిని మధుర కవితలు అన్నారు.

హిందీలో అశేష పరిశ్రమ చేసిన తెలుగు రచయిత శ్రీ బాలశౌరిరెడ్డిగారు. ఆయన జానపద వాఙ్మయాన్ని గురించీ, హిందీ, తెలుగు జానపద గేయాలను గురించీ చాలా వివరించారు.

''తెలుగుపలె హిందీ కూడా కావ్యభాషగా 11 వ శతాబ్దంలోనే రూపొంది ఆదరణ పొందగలిగింది. అంతవరకూ బృందావనము (వ్రజ ప్రాంతం), రాజ స్థానం, అయోధ్య, పాటలీపుత్ర, కాశీ, ప్రయాగ మొదలగు స్థానాల్లోనేగాక, విశేషంగా గ్రామాల్లో ఈ అనుశ్రుత, అనాధృత వాఙ్మయమే ప్రజల కంఠాల్లో వినిపించేది. ఆంధ్రలోని రాయలసీమ, సర్కారు జిల్లాలు, శ్రీకాకుళం, విశాఖల లోని జానపద గీతాలో మాండలిక విభేదాలు, భాషాపరంగా గాని, కొన్ని ఆచా రాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. కాని, హిందీ ప్రాంతంలో ఈ మార్పు విశే షంగా ఉంది. అందుకే అవన్నీ హిందీ జానపద గేయాలని పిలువబడవు. భోజ పురీ లోక్‌గీత్, రాజస్థానీ గీత్, మాలవీలోక్ గీత్, బుందేల్‌ఖండ్ లోక్‌గీత్, సంథాలీ లోక్‌గీత్, ఛత్తిస్‌ఘడీ లోక్‌గీత్, భఘేలీ లోక్‌గీత్, గఢివాలీ లోక్‌గీత్, పూర్వీలోక్‌గీత్, వింధ్యభూమీలోక్‌గీత్, మైథిలీలోక్‌గీత్, అవధీలోక్‌గీత్— ఇలా విభిన్నమైన నామాలతో సంగ్రహించబడ్డాయి. హిందీ ప్రాంతమంతా ఆయామండలాల్లో భౌతికంగా విభజించబడినట్లు కనిపిస్తుంది. ఈ గేయాలన్నీ తర్వాత దేవనాగరి లిపిలోనే రాయబడ్డాయి. లోక్‌గీత్ అన్నా, గ్రామగీత్ అన్నా ఇవన్నీ జానపదగేయాలే.

పండిత రమేశ త్రిపాఠీగారు ''కవితా కౌముదీ'' పేర ఆరు భాగాల్లో ప్రచు రించారు.

''హిందీ జానపద వాఙ్మయాన్ని శ్రీ రామనరేశ త్రిపాఠీగారు 11 రకాలుగా విభజించారు. 1. సంస్కారానికి సంబంధించిన గీతాలు, 2. తిరుగలి, రాట్నపు పాటలు, 3. ధర్మగీత్, ఉత్సవాలు, పర్వాల్లో పాడేపాటలు, 4. రుతువుల భజనలు, గీతాలు–శ్రావణ, ఫాల్గుణ, చైత్రగీతాలు, 5. హొలంపాటలు, 6. బిచ్చగాళ్లపాటలు,

7. తిరునాళ్లపాటలు, 8. విభిన్నజాతుల పాటలు, 9. వీరగేయాలు, 10. గేయ కథలు, 11. అనుభవ వచనాలు.''

వీరి తరువాత ఇందులో గొప్పకృషి చేసినవారు శ్రీ దేవేంద్ర సత్యార్థి గారే. ఈయన పంజాబునుండి అస్సాం వరకూ, కాశీనుండి కన్యాకుమారి వరకూ పర్యటించి వేలాది గీతాలను సంగ్రహ పరిచారు.

*''జె. ఎ. బాయిల్ (J. A, Boyle) అనే ప్రభుత్వోద్యోగి ఇండియన్ ఆంటిక్వేరీ అనే ప్రసిద్ధ ప్రాచ్యపరిశోధన పత్రికలో తెలుగు జానపద వాఙ్మయాన్ని గురించి ''Telugu Ballad Poetoy'' అన్న వ్యాసాన్ని ఇంగ్లీషు భాషలో రాయడం జరిగింది.

కీ॥ శ॥ 1871లో చార్లెస్ ఇ. గవార్ అనే ఆంగ్ల పరిశోధకుడు ''దక్షిణ ఇండియాలోని జానపద గేయములు'' అను పేర ఒక వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో తమిళానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. అంతేకాదు, తెలుగుకు వచ్చేప్పటికి ఆయన వేమన పద్యాలను జానపద గేయాలనుకొనడం జరిగి-అదే ఆ వ్యాసంలో ఈ రూపంలో అచ్చయింది.

ఒక మేలు- బాయిల్‌దొర దీనిని పరిశీలించడం, జరిగిన పొరపాటును గ్రహించడంతో- గవార్ చేసిన పొరపాటును వెల్లడించి, వేమన పద్యములెంత మాత్రము జానపద గేయములు కావని తెలపడం జరిగింది.

ఈ సందర్భంలో ఆయన రాసిన వాక్యాలనే ఇక్కడ పరికిద్దాం.

It is therefore to be hoped that while the treasures of national poetry are being gleaned from so many languages, the stores of the sweetest dialect of Southern India may not be overlooked and that the

---

* జూన్ 1955 కిన్నెరలో ఆచార్య శ్రీ నిడదవోలు వెంకట్రావుగారి వ్యాసం చూడండి.

popular songs of the Telugu people may be collected. That such exist, it is the object of the present writer to show; but his fitful gleanings are worthless, except as they may lead other and more competent gatherers to the field.

The specimens of popular ballads which are now offered are undoubtedly the composition of rural bards. They have been gathered by the roadside, from rudemen that could neither read nor write. The ploughman who sang to his team, and the carter as he sat between his bullocks have contributed sanatches of which they often only half-knew the meaning, and which they changed and corrupted into their vulgar tongue. The very simplicity and boldness of the verses are their certificate of genuineness and attest the unskilled rudeness of the singers though and the uncritical patience of the simple listeners.

బాయల్ దొర వ్యాసాంతంలో చెప్పిన పంక్తులు ఇవి :

"This song was repeated to me by the same man gave me the epic about Papadu and considering that, with one doubtful exception there is not a coarseness throughout this love song. It is I think a somewhat remarkable effusion for a village poet. With this I will leave my poor attempt to illustrate Telugu Lyric Poetry: Those who are qualified by a knowledge of the language to critise the test of these songs will find many errors to pardon and those who test the translations by a high standard will hold them very cheap.

They have however served to lighten the monotony of some lonely hours in my camp life; and now if they induce other to glean the same field and return with a richer sheaf, they will have completed my purpose."

1874 ప్రాంతంలో రాయలసీమలోని కడప మండలంలో ప్రభుత్వోద్యోగిగా ఉన్నప్పుడే J. A. బోయల్ జానపద గేయాలను సేకరించి ప్రచురించడం జరిగింది.

తెలుగులో నందిరాజు చలపతిరావు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, చిలుకూరి నారాయణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, లక్ష్మీకాంతమోహన్, చింతా దీక్షితులు, నేదునూరి గంగాధరం, ఎల్లోరా, డాక్టర్ సుందరం, హరి ఆదిశేషువు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, ప్రయాగ నరసింహశాస్త్రి, తూమాటి దోణప్ప, రామరాజు, కృష్ణకుమారి, నండ్యాల గోపాల్, జి. లింగారెడ్డి, సభా, రఘుమారెడ్డి, వింజమూరి సీతాదేవి, యస్. గంగప్ప, చేకుమళ్ళ కామేశ్వరరావు, తంగిరాల సుబ్బారావు మొదలయినవారు ముఖ్యులు-ఇంకా చాలా మంది నాకు తెలియనివారూ ఉండవచ్చు.

* "దేశి సారస్వత విభూతి" అన్న వ్యాసంలో కిన్నెరలో కృష్ణశ్రీ దేశి సారస్వత గుణాలు విశేషాలను ఇలా వివరించడం జరిగింది.

"ఏ వాఙ్మయములోనైనా ముందు పాటలూ, తర్వాత పద్యాలూ, ఆ పిమ్మటనే పదసమూ ఆవిర్భవిస్తాయి. కాబట్టి నన్నయగారికి ముందు చాలకాలము నుంచీ పాటలు ఉండియుండాలి. నన్నెచోడుడూ, పాల్కురికీ కొన్ని రకాల పాటలపేర్లు పేర్కొన్నారు. నన్నెచోడుడు "అంకమాలికలు" అన్న రాగయుక్త గేయములను పేర్కొన్నాడు. "ఈశ్వరు నంకమాలిక ల్వాడుచో" పార్వతీదేవి రాగములను నేర్చినదట. అభినయముతో కూడిన "ఆలతుల"ను కూడ నన్నెచోడుడు చెప్పినాడు. పాల్కురికి "కరమర్థినూరూర సిరియాళుచరిత, పాటలుగా

---

* కిన్నెర మాసపత్రిక, జనవరి – 1955 లో "దేశి సారస్వత విభూతి" అన్న వ్యాసంలో శ్రీపాద గోపాలకృష్ణమూర్తి వ్యాసం.

గట్టి పాడెడివారు'' అని పాటలకథలను సూచించినాడు. విద్దికూచి రామాయణము ఈ మోస్తరుదే అయియుండాలి ఈనాటి వరదోపాఖ్యానమూ, రామకథామృతము, ఓడపాటా, అక్కెన ప్రగడ హరిదాసుని కుబ్జాకృష్ణవిలాసమూ, కిలారి బ్రహ్మ యోగి తారకనామ రామాయణమూ, కోడెల రామదాసు రామదాసు చరిత్రమూ, పూడిపెద్ది బుచ్చెన్న గోపికావస్త్రాపహరణమూ, కారుపల్లి రామాంబ గానకరామాయణమూ, బొడ్డుపల్లి శేషయ్య సంపూర్ణ రామాయణమూ కీర్తనల గాథలే. కపోతయ్య ''వీరచోడవ్వ చరిత్ర'' ప్రాచీన గేయముల ననుసరించి రచించినదట. వీటిలో సంగీతమూ, సాహిత్యమూ రెండూ ఆకర్షకాలే. అయితే సంగీత జ్ఞానము లేనివారికి ఈ కీర్తనల గాథలను వినిపించి ఆకర్షించడము కష్టమైన పని. అట్టి వారి కోసమే పాల్కురికి ద్విపద రచనలను వెలయించినాడు. వీటినిండా గాథలే. ఈ గాథలకు స్త్రీల పాటల ద్వారా విస్తృతి అబ్బినది.

సామాన్యముగా స్త్రీల పాటలు ద్విపదలవలె కనబడే తరువోజలలో ఉంటాయి. ప్రచార బాహుళ్యముతో తరువోజలోని ప్రాసలు లోపించిపోయాయి. ఆఖరి గణము చాలా పాదాలలో మూడు లఘువులతో కనబడుతూ ''ఇవి ద్విపదలా?'' అన్న అనుమానము కలిగించినా, ఈ పాటలలోని అయిదక్షరాల గణాలూ, గురువూ మూడు లఘువులూ చేరి యేర్పడ్డ గణాలూ (వీటిని అయిదు అక్షరాల ఆవృతాలనాలి) వీటిని తరువోజలలో చేరుస్తాయి. ఇపన్నీ పాటలు. బసవపురాణాదులు ''చదివిన''ట్లు వీటిని చదవరు స్త్రీలు; పాడతారు. ద్విపద నడుస్తుంది వచనములాగ; ఈ పాటలు ప్రవహిస్తాయి. నాడేకాదు, నేటికీ ఇవి దంపుళ్ళ పాటలూ, విసురురాతి పాటలూ, అవిరేణి పాటలూ రూపంలో పరిగెత్తుతూనే వున్నాయి. ''తలకొని తలంబ్రాలు దంపెడిచోట, తరుణులచేతను తనరు తరోజ'' అని విన్నకోట పెద్దన కూడా అన్నాడు కదా?...క్రీ. శ. 1900 లోనూ, 1903 లోనూ శ్రీ నందిరాజు చలపతిరావుగారు ఈ స్త్రీల పాటలను సంపుటాలుగా అచ్చువేశారు. అంతకంటె ముందు స్త్రీల పాట లేవీ అచ్చయినట్లు నాకు సాక్ష్యము దొరకలేదు. వీరి తరువాతనే కాకినాడవారైన మంగు వెంకట రంగనాధరావుగారు 1905 లో స్త్రీల పాటలను కొన్ని కొత్తవి కూడా సమకూర్చి వేరేవేరే అచ్చువేయించినారు. కాబట్టి శ్రీ సారస్వత పితామహులు శ్రీ నందిరాజు చలపతిరావుగారే. వీరి సంపుటాలలో స్త్రీల పాట లసంఖ్యాకముగా ఉన్నవి."

—:o:—

కవితా మాధురి



"జానపద గీతాలు-ఆయాదేశాలు, లేక జాతుల ఆ ప్రాంతపు శాసనాల కంటే ఎక్కువ విలువైనవి"- అన్నాడు ఫ్లెచర్.

"జానపద సాహితి వారివారి ఆచారాలు - నాగరికతా విలువలు ప్రతి ధ్వనించే సాహిత్యం" - అని పేర్కొన్నాడు అలెగ్జాండర్ యాగర్ట్రీక్రాఫే.

మన జానపదులు తీరిక సమయాలలో - వారివారి పనులు చేసుకుంటూ ఉల్లాసంగా పాడుకునే ఈ జానపద గేయాలకు చెవియొగ్గని హృదయం ఉండదు.

"ఆది మానవుడు తన కష్టాలను పోగొట్టుకోడం కోసం, క్రూరజంతు దాడులనుంచి రక్షించుకోడం కోసం, ప్రేమపాత్రములైన తన వస్తువులను రక్షించుకోడంకోసం - ఆవేశపూరితుడై జీవించడం ప్రారంభించిన సమయంలోనే కవిత ప్రాదుర్భవించి వుంటుంది. అది క్రమానుగతంగా నాగరికతతో పాటు, అనుభవ సంస్కారాలతో పాటు వికసించి బలపడడం జరిగివుంటుంది. పూర్వ కాలంలో ఒక్కొక్క తెగ లేక జాతివారు వారివారి నమ్మకాలనుబట్టి, ఆచార వ్యవహారాలనుబట్టి ఒక్కొక్క కళాపద్ధతి సృష్టించుకొని, అ కళ ద్వారా, ఆ విజ్ఞానంద్వారా ఆనందాన్ని అనుభవిస్తూండేవారు.

అలా ఆ జాతి, తెలుగులో వారి నాగరికత, విజ్ఞానం, కళారీతులు, అభిరుచులు పెరుగుతూ ప్రచారం పొందుతూ వచ్చాయి. ఈ దశల క్రిందనే అనేక జానపద కళాఖండాలు, జానపద నృత్యాలు, జానపద కళలు ప్రపంచంలోకి వచ్చాయి. ఇవే తోలుబొమ్మలు, సుద్దులు, జంగం కథలు, పంబకథలు లాంటివి. వీటితోబాటే గేయాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ గేయాలను—స్త్రీ సాహితని, గ్రామిక సాహితని, గృహకృత్య సారస్వతమని, పౌరాణికములని, తత్వాలని, కథలని, గాథలని, శృంగారపద గేయాలని, భక్తి గేయాలని - బాలసాహితి క్రిందను, ఆటపాటల రూపంలో వుండే పాటల క్రిందను వీర రసప్రధానాల క్రిందనూ రకరకాలుగా విభాగించుకోవచ్చును.

తెలుగు నాడున తెలుగు పండితులు అనేక తరహాలలో వీటికి నామకరణం చేశారు.

ప్రజా వాఙ్మయం, పద వాఙ్మయం, అనాధృత వాఙ్మయం, తిరస్కృతాంధ్ర వాఙ్మయం, గేయ రచనలు, మధుర కవితలు, దేశి సారస్వత• అని వేరువేరుగా పేర్లుపెట్టినా నుంచి మిగిలిన మరెందరో జానపద సాహిత్య పునరుద్ధరణ కర్తలు జానపద గేయాలనే పిలవడం - ముఖ్యంగా ఆదే ఎక్కువ ప్రచారంలో వుండడం - ప్రచారమందడం జరుగుతూంది.

పైన పేర్కొన్న పేర్లు అన్నీ ఈ వాఙ్మయానికి సరిగా అతకవు సరికదా వ్యతిరిక్తార్థమిస్తాయేమోకూడా.

ఆంధ్రులచేత తిరస్కరించబడిన వాఙ్మయమని అర్థమిస్తోంది. ఆంధ్రుల తిరస్కృతివుంటే ఇన్ని యేళ్ళుగా ఇంత సాహిత్యం వృద్ధిపొంది-ప్రచారమై ఎలా గుంటుంది? కనుక - కొంతమందిచేత అనాదరించబడినంత మాత్రాన అనాదరణ వాఙ్మయమనో, తిరస్కృతాంధ్ర వాఙ్మయమనో పిలుచుకోడం - ఈ వాఙ్మయ ఉద్యమానికే ప్రమాదం, కలుగవచ్చు.

పద కవిత్వమనుమాట జానపద కవితలకే సరిపడుతుంది - ప్రజా కవిత్వ మని మాత్రం ఎందుకనగూడదు ? పండితులు పీకనొక్కి, ఛాందసులు ఉరిశిక్ష విధించడానికి ప్రయత్నించిన పరిస్థితులలో తమ పదాలని, పాటలని, సాహిత్యాన్ని, లేదా వాఙ్మయాన్ని నోళ్ళల్లో దాచుకొని, కాపాడుకుని, రక్షించుకొని, సంరక్షించుకొన్నది ప్రజలు — వారిచే సృష్టించబడి - వారిచే ప్రచారమంది, వారిమధ్యనే మసిలి, వారిచేతనే పోషింపబడి - వారి కవితలుగానే నిఁబడింది ప్రజాకవిత్వమే - ప్రజా వాఙ్మయమే, ఈ పాటలు ప్రజలపాటలే అనుకుందాం - అనాలికూడా !

*"సార్థకమగు నొక పేరుపెట్టుటకు పూనుకొన వలయు నన్నచో నా విషయము యొక్క ప్రధాన తత్వమును పరిశీలించ వలయును. తత్వము లక్షణములుకూడ విస్ఫురించు నట్టిదేయైనను ఒక్కొక్క లక్షణమునకన్న దాని పరిధి విస్తృత మని ఎరుగుట యత్యావశ్యకము. ఒక విషయమునకున్న ముఖలక్షణము పుఁబట్టి దానికి నామకరణము చేయవలెనన్న నొక్కొక్క సమయమున వివాదము లేర్పడుఁను. ఒకరొక లక్షణము నంగీకరించిన మరొకరింకొక లక్షణమునకు ప్రాధాన్య మొసఁగెదరు. రెండుమూడు ముఖ్యలక్షణములు సమాన ప్రాధాన్యము కలిగినచో నప్పుడింతకన్న గొప్ప చిక్కు సంభవించును. తత్వమందా చిక్కు లుంచవు. కనుక వస్తుతత్వము నాధారముగా గైకొందురేని సులభముగా నా వస్తువునకును, తదితరములకును గల భేదము తెలిసిపోవును. ఆ దృష్టితో చూచిన కవిత్వమంతటిని రెండు పెద్ద భాగములుగా చేయవచ్చును. ఒకటి :— చేతనాకృతము, రెండవది :— అచేతనాకృతము ఈ రెండును పరస్పర భిన్నములు. ఒకటి : భావుకుడైన ఒక కళాకారుని ప్రయత్నమున దిద్ది తీర్చబడినది. రెండవది : జానపదసృష్టి. మరియు నప్రయత్నముగా నొక నోటి నుండి వెడలి తనకుతానే రూపు దిద్దుకొన్నట్టిది. ఒకటి కళాత్మక కవిత్వము, ఏకకర్తృకము. రెంటవది ప్రావృట్కాలపయోద ప్రదమోచబంధు సంసిక్త మంధమంద పృథ్వీ గంధ బంధురము. కనుక నిట్టి తత్వమునుబట్టి నామకరణము చేయుపలయు నన్నచో జానపద శబ్దమే సార్థకముగా తోచును" — అని రామరాజుగారు పేర్కొన్నారు.

---

* డా. రామరాజు జానపద సాహిత్యము - చూ : పేజీ 4

నిజంగాకూడా అంతే! దేనికైనా ఒక పేరు ఒక నియమం నిర్ణయించడం చాలా అపసరం — ఆ విధంగా ఆలోచించినా - ఏవిధంగా చూసినా - 'జాన పద' శబ్దమే ప్రచారమందింది —తగియుండికూడా !

* ఇంకొక పండితుని అభిప్రాయం పరికిద్దాం– ''దక్షిణ భారత జానపద గీతాలు (పల్లెపాటలు) చారిత్రక, సాంఘిక సమాచారానికి కోశాగారాలు. సాముద్రికానికి, జ్యోతిషానికి, మూలికా వైద్యానికి సంబంధించిన పాటలు ప్రత్యేక ప్రయోజనం కలవి.

దక్షిణ భారతంలో మానవ జీవితంలో ఎదురయే ప్రతి ప్రముఖ సంఘటనకూ తగిన పాటలున్నవి. ఈ పాటల బాణీలు చాలమంది శాస్త్రీయ సంగీత రచయితలను కూడా ఆకర్షించాయి. త్యాగరాజు, గోపాలకృష్ణభారతి వంటి ప్రముఖ వాగ్గేయకారులు కొన్ని పల్లె పాటల ఫణతులలో స్వయంగా కీర్తనలు రచించారు. కొంత నాజూకుతనం గల పాటలు చాలవరకు పున్నాగవరాళి, నాదనామక్రియ, ఆనందభైరవి, సైంధవి, సెంజురుట్టి, కురంజి, నవరోజ్, నీలాంబరి మొదలైన రాగాలలో పాడారు. ఈ పాటలలో చాలాభాగం ఆది, రూపక, చాపు తాళాలలో వున్నవి. ఎక్కువగా త్రిశ్రగతిలో వున్నట్లు కనిపిస్తుంది.''

మద్రాసు విశ్వవిద్యాలయ సంగీత శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ పి. సాంబమూర్తిగారి అభిప్రాయం ఇలా వుంటే ఆచార్యశిరోమణి వేదాల తిరువెంగళాచార్యులుగారు అంటున్న మాటలు పరికిద్దాం.

• ''ఏ దేశంలోనైనా వాఙ్మయం పాడుకోవడానికీ, ఊరికే చదువుకోవడానికీ వీలుగా ఉండడం మామూలు. ఇంతమాత్రానికే గేయ వాఙ్మయమనీ, జానపద వాఙ్మయమనీ పెద్ద పేర్లు పెట్టినా, ఎన్ని విధాల మార్పులూ, చేర్పులూ

---

* చూ-తెనుగు పల్లెపాటలలో పి. సాంబమూర్తిగారి ఉపోద్ఘాతం.

• చూ- ''కృష్ణశ్రీ'' పల్లెపదాలకు ముందుమాటలో శ్రీ వేదాల తిరువెంగళాచార్యులు.

చేసినా ఇవన్నీ కూడా దాన్ని ఉపయోగించుకునేవాళ్ళను బట్టి వచ్చేవేకాని ఆ వస్తువులలో మాత్రం ఏతేడా కన్పించదు''—

* "ప్రబంధాల్లోను, పాతపాటల్లోను గొప్ప ఫ్లాషెస్ ఆఫ్ బ్యూటీ వున్నాయి. కొందరు ముసలమ్మల చిరునవ్వుల్లో మల్లే రెండు సెంటిమెంట్లు పుట్టలు. ప్రబంధాలలో సెంటిమెంట్లు అసహజం, అబద్ధం. అప్పుడప్పుడు అసహ్యం.

"ఈ పాటల్లో అందాలన్నీ సెంటిమెంట్లతో అల్లుకుని హృదయాన్ని సమీపిస్తాయి. ఈ పాటలన్నీ వినడం తటస్థించినప్పుడల్లా వాటిల్లోని రసాన్ని గుర్తించి అసలు తెలుగు భాషా, భాషామార్దవమూ, కవిత్వ లక్షణమూ వీటిల్లోనే ఉందని గ్రహించి వాటి పునరుద్ధరణకోసం తహతహ పడ్డారు. ఏ కఠిన పదజాలాన్నో, కావ్యాలంకారాన్నో, అసహజ పాండితినో ఎరువు తెచ్చుకోక హృదయంలోంచి వచ్చే ప్రేమకీ, అందానికీ రంగులు పూయక స్వచ్ఛంగా సూటిగా పాడిన ఈ పాటలకన్న కవిత్వం ఎక్కడ వుంటుంది? ఎప్పుడూ నా నిశ్చితాభిప్రాయం ఏమంటే— సులభమైన భాషలో చెప్పడానికి శక్తిలేనివాడే కష్టమైనభాష ఉపయోగిస్తాడని. పద్యంలో చెప్పలేనివాడు పద్యం రాస్తాడు.

"ఈ పాతపాటలు తాళపత్రాలలో లేవు. వీటికోసమై ఒక ఆఫీసు తెరచి, పెద్ద జీతాలిచ్చి పండితుల్ని నియమించి ఏడాదికి నాలుగు పేజీలు ఓ పత్రికలో ముద్రించే ఏర్పాటు ఎవరూ చెయ్యలేదు. ఈ పాత భాండాగారమంతా స్త్రీ హృదయంలోనే నిలిచిపోయింది. ఈ పాటలు ఒక కవిగాని, కవయిత్రిగాని ఒక నాడు రాసినవి కావు. దశాబ్దంనుంచి దశాబ్దం వరకు మామూలు అక్షరజ్ఞానం లేని స్త్రీల నోళ్ళలోపడి వాళ్ళ అనుభవాలు కొత్తపాటల్లోనూ, పదజాలంలోనూ, వాతావరణంలోనూ మార్పులుచెంది నిలిచిపోయినాయి. వీటినోసారి పోగొట్టుకుందా మళ్ళీ పిలుచుకోగలదా దేశం?

"పోనీ, కాలంలో నిలిచి ప్రచారంలోకి వచ్చిన ఈ గానాల్ని వాఙ్మయంలో కలిపివేసి వాటికోస్థానం కల్పిద్దామంటే ఈ పండితులు అంగీకరించరు. ఈ

---

* 'ప్రజా వాఙ్మయము' గ్రంథానికి చలం రాసిన ప్రస్తావన.

పాటల్లో అందం వుందని అంగీకరిస్తే, భాషనుగూడా అంగీకరించాల్సి వస్తుం దేమో. వీటికి గౌరవమిస్తే తమ గౌరవమెక్కడ పోతుందోననే భయంతో వీటిని స్త్రీల, పిల్లల, పామరుల పాటలని తోసేశారు. అందువల్ల ఇప్పుడు చెయ్యవలసిన దేమిటంటే ఈ వాఙ్మయాన్నంతా తెలుగు సారస్వతంలో కలిపివెయ్యడం''—

భారతదేశంలో నలుమూలలా తిరిగి—జానపద సాహిత్య సేకరణ కర్తలను కలుసుకుని - వారితో చర్చించి- అనేక భాషలలోని పాటలను అనువదించి ప్రచు రించడం జరిగింది— దేవేంద్ర సత్యార్థివంటి ప్రముఖులద్వారా.

ఆంధ్ర విశారద— ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు— అభ్యుదయ సాహిత్యోద్యమ ప్రధానాచార్యులూనగు శ్రీ తాపీ ధర్మారావుగారు 'జానపద గేయాలు' పై ఇచ్చిన అభిప్రాయమును ఇక్కడ పొందుపరుస్తున్నాను:

* ''సిసలైన జాతిజీవనం చూడాలంటే పల్లెలకే పోవాలి. పట్టణాలలో వుండే సంపర్కదోషాలు అక్కడ అంతగా ఉండవు. ఆచారాలూ వ్యవహారాలూ కల్తీలేకుండా- అంటే- చాలావరకూ సుమండి - వుంటాయి. కల్లాకపటం లేని బ్రతుకులతో పరస్పరం సాయం చేసుకునే బుద్ధులతో అన్నా, మామా, వదినా, అత్తా అన్న వరుసలతో- పల్లెఅంతా ఒక్క కుటుంబంగా కనబడుతుంది. ఆటోపంలేని ఆటలూ, పాటలూ, ఆడంబరంలేని అలంకరణలూ, అసత్యాలకు పాల్పడని మాటలూ- అన్నీ మన పట్టణవాసులకెంతో ఆశ్చర్యంగా వుంటాయి. పల్లెప్రజల హాస్యాలూ సరసాలూ, ప్రోత్సాహాలూ అన్నీ అమాయక ధోరణిలో ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తూ వుంటాయి. ఈ విషయాలన్నీ పల్లెపాటలలో ప్రత్య క్షంగా కనిపిస్తాయి. తికమకలు లేని వరుసలతో, సులభంగా బోధపడే భాషలో, అందరికీ అందుబాటులో వుండే భావాలతో ఒక చక్కని సహజధోరణిలో వుంటాయి ఈ పల్లెపాటలు.

---

* ''జానపద గేయాలు'' (1954 ప్రథమసంపుటి) సేకరణ: 'ఎల్లోరా' శ్రీ తాపీ ధర్మారావుగారు రేడియోలో ఇచ్చిన సమీక్ష.

';అటువంటివాటిని చాలావరకు సేకరించి శ్రీ 'ఎల్లోరా' ఒక్క సంపుటాన్ని తయారుచేశాడు.

''వీణామృదంగాది పరికరాలు లేకపోయినా - పాడేవారి పెదవులనుంచి- వినేవారి హృదయాలలోనికి ఒక రసప్రవాహం ఏర్పడుతుంది. ఎందుకంటే, కష్టమైనమాట వుండదు. అనుభవంలేని సన్నివేశం వుండదు. పరిచయంలేని భావం వుండదు. అందుబాటులోలేని వరుస వుండదు. ఇంక హృదయాలను హత్తుకొనడంలో ఆశ్చర్యమేముంది!''

అని అంటూనే శ్రీ ధర్మారావుగారు పేరును గురించి ఏమంటున్నారో చూడండి.

''అటువంటి పాటలన్నీ గల ఈ పుస్తకానికి ''జానపద గేయాలు'' అనాయాసంగా బోధపడేపేరు— ''పల్లెపాటలు'' అన్నట్లు పెట్టకుండా 'జానపద గేయాలు' అని పెద్దపేరు పెట్టడం కొంత అన్యాయమే...'' అని విన్నవించారు.

అయితే జానపద వాఙ్మయానికి సంబంధించి కొన్ని వ్యాసాలు వ్రాసిన డాక్టరు గిడుగు సీతాపతిగారు ఏమంటున్నారో కూడా చూద్దాం.

*''జానపద జీవితాన్ని ప్రతిఫలింపజేసే వాఙ్మయంలో జానపదగేయాలు ఉన్నత స్థానాన్ని పొందగినది. అందులో జానపదుల నిత్యకృత్యాలే ఎక్కువగా కనపడుతున్నా అవి రసవంతంగాను, హృదయరంజకంగాను రచితములైనవి. మాయామర్మ మెరుగని వారి జీవితాలు సహజసిద్ధములైన రాగద్వేషాలకు లోనైనా ఉదాత్తములైన భావాలతోనూ, అవ్యాజములైన ఆశయాలతోనూ— మృదుమధురములైన పలుకులతోనూ, సరళమైన నడవడితోనూ, నదులలోని నిర్మలోదకములవలె ఎట్లు సాగుతూ వుంటవో ''జానపద గేయాలు'' తెలియజేస్తూ వుంటవి...సంఘజీవిత మెట్లుండవలెనో నవనాగరికులకు బోధింపగలవు. ఈ సద్గుణములన్నీ జానపద గేయాలలో ప్రతిబింబితము లవుతూ వుంటవి.

---

*''జానపదగేయాలు'' (రెండవ సంపుటి 1959) సేకరణ: 'ఎల్లోరా', తొలిపలుకు రాస్తూ డాక్టర్ సీతాపతిగారు నుడివిన పలుకులు ఇవి.

"జానపద గేయాలను భాషాలక్షణానికి లక్ష్యంగా లక్షణజ్ఞులు గ్రహించ లేదు. వారి భాషానుశాసనము ప్రబంధాది కావ్యరచనకు వర్తింపచేసినట్లు ఈ జానపద గేయాలకు వర్తింపజేయక ఈ గేయాలయెడల పండితులు ఉదాసీనులై ఉండడంవల్ల మేలే కలిగినది. ఆ పండితులు ఈ శబ్దానుశాసనాలకు ఈ జాన పదగేయాలను బంధించివుంటే ఇవి కావ్యాలవలెనే ఏ వికృతకృతకభాషలోనో రచితములై యుండును. అట్టి దుస్థితి కలుగలేదు. కనుకనే ఇవి సరళమైన శయ్యతో సాగుతూ వచ్చినవి.

—ఆది నుండి నేటివరకు రచితములవుతూ వచ్చిన జానపద గేయాలు, సామెతలు- మొదలయినవి నిలచివుంటే సంఘజీవితము, భాష ఎట్లు పరిణమిస్తూ వచ్చినదో లెస్సగా గ్రహించగలుగుదుము. అట్టి సద్భాగ్యము మనకు లభింప లేదు.

జానపదగేయాలలో గ్రహించుటకు యోగ్యమైన విశిష్ట లక్షణము ఎక్కువగా యున్నది. కనుకనే వాటి సంగ్రహణమునకు విలువ హెచ్చినది. అట్టి జానపద గేయాలను కాలగర్భంలో పడిసిపోయినవి పోగా నేటికింకా పల్లెలలో జానపదుల పెదవులపై తాండవిస్తూ వీనులవిందుగా వినబడుతూన్న వాటినైనా సేకరించడం, సంస్కృతిగలసంసారమనుకొన్న మనకు విహితధర్మం—ఆ ధర్మమును నిశ్చల భక్తితో నెరవెర్చుటకు దీక్ష వహించి, శక్తివంచనలేక తీవ్రమైన కృషిచేసి కృతకృత్యులయిన 'ఎల్లోరా'గారికి నా అభినందనాలు.

—జానపదగేయాల సేకరణ ఒకరిద్దరివల్ల పూర్తి కానేరదు. అమెరికా వంటి దేశాలలో ఈ పనికి ప్రత్యేక సంస్థలు ఏర్పడివున్నవి. ఇందుకు కావలసిన పత్రికలున్నవి. జానపద వాఙ్మయ గ్రంథాలు, కథలు, గేయాలు, సామెతలు మొదలయిన శాఖలకు చెందినవి వందలకొలదిగా ఉన్నవి. ఈ పనికి ప్రభుత్వం వారు, విశ్వవిద్యాలయములు, ఇతర విద్యా సంస్థలు పూనుకొనవలెను-" అంటూ తెలిపిచ్చారు.

ఈ వాఙ్మయమును జానపద వాఙ్మయము, జానపద సాహిత్యము (ఫోక్ లిటరేచర్, ఫోక్‌లోర్ అన్న అర్థంలోనే) అనే వాడిపుంచడం గమనించడం అవసరం.

పాశ్చాత్య దేశములలో జానపదవాజ్మయ పునరుద్ధరణకోసం కృషిచేసిన పెద్దలెందరో—ఎందరో మహానుభావులున్నారు. అందులో చైల్డ్‌హిందర్‌సన్, సేగరీ, లామ్సన్, గమ్మేర్, మిల్లక్, గ్రిమ్, యగర్టి మొదలగువారు- అలాగే భారతదేశమున ముఖ్యంగా టెంపుల్, గోవర్, ఎలీవన్, కూల్డ్రి, బోయల్, హెమేండార్ఫ్, బ్రౌన్ మొదలగువారు ముఖ్యులు.

జానపదాలలో పుట్టిపెరిగి అనుశ్రుతంగా వస్తూన్న సాహిత్యానికి జానపద సాహిత్య మంటున్నాము. వారిభాషలో వారి కర్థమయ్యే శైలిలో కృత్రిమం లేకుండా, వ్యాకరణపు బిరులూ, ఛందస్సు గోడల పట్టింపులు లేకుండా, హాయిగా పాడుకోడానికి చక్కని వావీ వరుసా కలిగిన పాటలనే జానపద గేయా లనడం సహజం. వీటినే పల్లెపదాలని, జానపద గీతాలని, పాతపాటలని వ్యవహ రిస్తున్నారు. కాని పాటలు వేరు, పదాలు వేరు.

''హిమాలయ శిఖరాగ్రమందున పుట్టి వివిధ ప్రదేశాలను దాటుకుంటూ, కొండగుట్టలను చుట్టుకొని రకరకాలుగా ప్రవహించిన గంగవలెనే- ఆదిమానవుని అమాయక హృదయంలో పుట్టి, అనోటా ఆనోటా పల్లెలకి ఎగబ్రాకి- ఆ ప్రయా ణంలో ఆయా మాండలిక పదాలను తనలో లీనం చేసుకుంటూ— ఎక్కడోపుట్టి ఎక్కడికో ప్రయాణం సాగించింది ఈ జానపదగేయ వాజ్మయ స్రవంతి.''

ఆంధ్ర జానపదగేయ వాజ్మయ స్రవంతి ప్రవాహానికి కాలువలు త్రవ్వి గట్లుపోసి, ప్రతిచోటుకీ — నేల నాలుగు చెరగులకు ప్రవహింపజేసినవారు ఎవ రంటే వారిపేరు చెప్పడం కష్టం. వీటికి ఒక రచయిత అంటూ లేడు.

ఈ విషయాన్ని గురించి ''ది సైన్స్ ఆఫ్ ఫోక్‌లోర్''అన్న గ్రంథంలో జానపదగేయాలను గురించి పేర్కొంటూ అలెగ్జాండర్ యాగర్టీ క్రాఫీ ఇలా పేర్కొన్నాడు:

''ఇది ఎవరి సొమ్మూకాదు - గాలిమీదా, నీటిమీదా మానవునికిపున్న హక్కే ఈ సాహితిమీద కూడా వుంది.

"మానవుడు గాలినీ, నీటినీ ఉపయోగించుకొన్నట్లుగానే - జానపదగేయ కళాఖండాలనుకూడా ఉపయోగించుకొని వుండివుంటే, మొచటినుంచీ శ్రద్ధ తీసు కొనివుంటే — ఈనాడు ఎంతో జానపదసాహితి మనకు కనుమరుగైపోయిం దని బాధపడవలసినపని వుండేదికాదు."

ఈ సంస్కృతిలో ఇమిడివున్న నాగరికతా విలువలూ, సందేశాలు, సాహిత్యపటిమ - గుర్తించే రోజు, విలువకట్టే సమయం ఇప్పటికి ఆసన్న మయింది.

ఆంధ్రుల ప్రాచీన ఆచారాలు. నాగరికతలు, కట్టుబాట్లు, నమ్మకాలు, కథలు, గాథలు, వింతలు, విశేషాలూ ఎప్పుడు తెలుసుకోవాలన్నా, ఈ సాహిత్య సంపదను పునరుద్ధరించవలసిన అగత్యమూ అవసరమూ కలుగకతీరదు -కలిగి తీరుతుంది.

జానపద గేయాలను చూసి ఫలానాకాలం అని వాటికి వయసుకట్టడం చాలా కష్టమయినపని - సాధ్యంకాని పనికూడా. కాని, రచనలోని విషయం ఏనాటిదో తెలిస్తే కవికాలం అర్థమవుతుంది. చరిత్రలోగాని, మాండలికముచ్చట్లతో గాని సంబంధం గల పాటలు-ఆ ముచ్చట్లు జరిగిన కాలంలోగాని, దాని తర్వాత గాని ఆమండలంలోని వారే వ్రాసి వుండవచ్చునని - వుంటారని ఊహింపనగును.

ఫలానా పాట ఫలానా మండలానిది అని చెప్పడంలో మాండలిక పదాలు చాలా వుపయోగపడతాయి. ఆలాగని ఈ సూత్రమే శరణ్యమంటే మాత్రం చిక్కువస్తుంది.

ఉదాహరణకు:- విశాఖలో వాడుకలోవున్న గుంట శబ్దం—తూర్పు గోదా వరి జిల్లాలోనూ వాడుకలో వుంది. ఈ గుంట పదానికి రెండు అర్థాలు చెప్ప వచ్చును. ఒకటి-పదుచు. రెండు-నీటితోనిండిన చిన్న పిల్లపు ప్రదేశం.

''చక్కని గుంట
నీ సరసను కూకుంట
ఏతంట లేకపోతె
నాయంట రాయే
చక్కాని గుంటా...''

ఈ పాట ఎక్కడిదీ అన్నచర్చకు జవాబు మనం ఏమి చెప్పుకోవలసి వుంటుంది? ఇటువంటి సమస్యలు కొన్ని ఈ పాట ఫలానా ప్రాంతానిదే అని నిర్ణయించే సమయమంచు ఎదురైతీరుతుంది. ఈ విషయం పెద్దలయిన విమర్శకులకే వదిలేద్దాము.

ప్రాంత నిర్ణయానికి ఉపకరించే పాట-చూడండి...

''తుంగభద్ర ఒడ్డున
దొంగలున్నారు
సీతమ్మ దాచుకోకుంటేను
దోచుకుంటారు''—

ఈ పాటను సరిగా చూస్తే మనకు బోధపడేది ఏమిటి? ఆ ప్రాంతాలలో- ఆ రోజులలో దొంగతనాలు ఎక్కువని అర్థమవుతూంది. ఈ పాట ఫలానా ప్రాంతానిదే అనడానికి తుంగభద్ర అనేపదం ఆధారం.

అలాగే ఒకేపాట అనేక ప్రదేశాలలో వాడుకలో వుండడమనేది కూడా వుంటుంది - అందుకు ఒక చిన్న ఉదాహరణ పేర్కొంటాను.

''శ్రీ సూర్యనారాయణా
మేలుకో.....
హరి సూర్యనారాయణా
మేలుకో.....''—

అన్న పాట ఆంధ్ర, తెలంగాణాలరెండింటా ప్రచారంలో వుందని - జానపద వాఙ్మయ పరిశోధకులు, తెలంగాణా కవిమిత్రులు శ్రీ బి. రామరాజుగారు ఒకచోట పేర్కొని ఉన్నారు. ఇది గమనార్హం.

అంటే దీనినిబట్టి మనకు ఒక విషయం బోధపడుతుంది. ఒకచోట చాలా కాలం కాపురం చేసిన వ్యక్తి ఒక పాటని అక్కడ నేర్చుకుంటాడు. తదుపరి మరో మండలానికి పచ్చి స్థిరపడడం జరుగుతుంది. ఇదేపాటను ఇక్కడ పాడుకుంటాడు. అలా ఒక మండలంలో నేర్చుకొన్న ఈ పాట ఒక నోటినుంచి ఒక నోటికి వ్రాకి వ్రచారమయి బలపడుతుంది. అలా ఆనోటా ఆనోటా—ఆయా మండలాలు మారుతున్నప్పుడు ఒక కొత్త మాండలికాన్ని తనలో కలుపుకుంటూ మార్పు చెందడంకూడా సహజం.

మానవునిలో కవితాలత ఎలా చిగురించిందీ అనేదికూడా చూడడం అవసరం. ''పక్షుల కిలకిలారావాలు, పకపకలు మూలమై వుండొచ్చు. పిల్లపక్షిని తల్లిపక్షిచేరి ఆదరించడం, మొగపక్షిని చూసిన ఆడపక్షి స్వాగతం పలకడం చూస్తూనే వుంటాము. ఈ దృశ్యములే మానవునిలో వ్రేమను నూరిపోశాయేమో అనుకోవాలి''—అన్న అలెగ్జాండర్ యాగర్టిక్రాఫే పలుకులు పరికించండి.

''.....వెన్నెల వెలుగుల్లో పొందే ఆనందం, కోరలు చాచి భూంకరించే చీకటిలో అనుభవించే భయం, హోరున కురిసే వర్షంలో తడిసి ఋష్కించిన శరీరం, చలిలో వడిగాకొట్టుకు పిడచకట్టుకుపోయే గుండెలు, చక్కిలిగింతలమధ్య మధుర స్వప్నాలమధ్య మత్తెక్కించే వసంత కాలం, క్రూరులనుంచి బాధ, అక్కసులు బాధవ్రతుకులూ.....'' ఇవే కవితా రచనకు మూలము, వ్రోత్సాహమూ అయివుండాలి !

ఇదీ యధార్థమేమరి ! జానపద కవితలలో కష్టమయగాథలు ఇతివృత్తంగా గల పాటలు, బరువు వ్రతుకుల జీవితాలకు సంబంధించిన శ్రామిక గీతాలు, మధుర వసంతగీతాలనబడే శృంగార గీతాలు, ఆచారాలు, కట్టుబాట్లూ వ్రతిధ్వనించే కథలు, అన్యాయాన్ని పాటల్లో ఇమిడ్చి ఎదిరించిన వీర రస గాథలు- ఏన్నో వున్నాయి ఈ జానపదగేయ వాజ్మయ పల్లరిలో. మచ్చుకు కొన్ని పేర్లు ఇస్తాను.

బాలనాగు కథ, ధర్మాంగద, గంగావివాహం, కాంభోజరాజు కథ, లంకాయాగం, కుశలవుల యుద్ధం, బొబ్బిలి కథ, కాకమ్మ కథ, కాటమరాజు కథలు, గేయాలు—అన్నీ వీటి క్రిందకే వస్తాయి.

బాల పాటలు, దంపు పదాలు, శ్రామిక గేయాలు (రోడ్డువేస్తూ, పడవ లాగుతూ, గడ్డికోస్తూ పాడేలాంటివి), శృంగార పదాలు (కందకుందచూస్తానె కడగదిలో కొస్తావ పిల్లా ఓ పిల్లా అనే పాటలు లాంటివి,) తత్వాలు (చేతిలో బెల్లం వున్నంతవరకె కాకిబలగమంతా—ఆ చేటిలో బెల్లం అయిపోగానే ఎవరు రారు వెంట - లాంటి తత్వ ప్రబోధితములయిన పాటలు) ఇవన్నీ జానపద సాహితి క్రిందకే వస్తాయి.

ఏలపాటలు, తుమ్మెదపదాలు, ప్రభాతపదాలు, ఆనందపదాలు, నివాళి పదాలు, గొబ్బిపదాలు, మేలుకొలుపులు, వెన్నెల పదాలు – మొదలగునవన్నీ జానపద గేయాలే.

ఇవన్నీ ఆచరణ లేక, విమర్శావిమర్శల మధ్య నలగిపోతున్నా - జాన పదుల నోటిలో గూడుకట్టుకొని, తమ ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే ఉన్నాయి ఈ తరహా పాటల్లో—అంటే జానపద గేయాలలో ఛందస్సు లోపాలు, పండిత మన్యుల కావ్యనిబంధనల లోపాలు—వున్నా, రసపుష్టికీ, భావ గాంభీర్యానికీ వెలితి వుండదు. కాని, అక్కడక్కడ కొన్ని బూతుపదాలు, మోటుపదాలు వాడబడినమాట నిజమే-వీటిని చూసి, 'నన్ను ముట్టుకోకు నామాలకాకి' అని ఊరుకోక, క్షీరనీరన్యాయంగా అటువంటివాటిని వదిలి, మంచివాటినే యేరి, కూర్చి, చేబట్టడం అవసరం—మంచిది.

జానపద గేయాలలో తల్లి కడుపున పాప జన్మించింది మొదలు—ఆఖరి దశవరకూ జరిగే యావత్తు చర్యలూ కూర్చబడి, వర్ణించబడి వున్నాయి.

ఈ జానపద గేయాలనే అనేక పేర్లతో పిలుస్తున్నారు. జానపద గేయా లని, పల్లెపదాలని, పాత పాటలని—వాడుకలో వుంది. హిందీలో 'గ్రాం గీత్' అని, 'లోక్‌గీత్' అని వ్యవహరిస్తున్నారు. వీటినే ఇంగ్లీషులో 'ఫోక్ సాంగ్స్' అంటారు. ఈ సాహిత్యం మీద చక్కని విమర్శనాత్మక గ్రంథాలు ఎక్కువగా వెలువడినది ఇంగ్లీషులోనే.

దేశి కవితలుగా ముఖ్యమయినవి–ద్విపదులు, రగడలు, యక్షగానాలు—పేర్కొవాలి. ఈ దేశి కవితను తొలుత పాల్కురికి సోమనాథుడు ప్రారంభించినట్లు మనకు కొన్ని ఆధారాలు వున్నాయి.

ద్విపదులు, ఏలలు, దరువులు, ధపళములు, మంగళహారతులు మొదలగునవేకాక, ఇంకనూ రాగ, తాళ యుక్తములయినవి వీటియందు కానవస్తున్నవి. లాక్షణికులూ, ప్రబంధకవులూ కూడా వీటిని అంతగా పట్టించుకోలేదు. అయినా సామాన్య జనులనోళ్ళలో పాడుకొనే పాటలుగా మాత్రం నిలిచిపోయి వున్నవి. యక్షగానాలను ప్రబంధములని పేర్కొనకపోలేదు.

దేశి రచనలు రెండు విధములు. ఒకటి—పాటలు, రెండు—పదములు. పదములు:– తుమ్మెద, ప్రభాత (మేలుకొలుపులు), వెన్నెల (చందమామ), కోవెల, చిలుక, కిరాళి, గొబ్బి, నివాళి (హారతులు, మంగళములు), మువ్వ గోపాల, హరిహరీ పదాలు-కావచ్చును. ఇక పాటలు:- లాలి, జోల, ఏల, సువ్వి, ఉయ్యాల, జాజరి, ఐరేని, అప్పగింతలు, శ్రావణశుక్రవారం, అక్కల, శోభనం, ధవళములు, చద్దులు, సుద్దులు, చిందులు, కీర్తనలు, సంవాదాలు-గా చెప్పవచ్చును.

స్త్రీల పాటలలో చాలారకాలున్నాయి. వారు పాడుతూంటే, అవి వింటూంటే, నిర్మలంగా నిండుగా ప్రవహించే నదీ ప్రవాహంలాగా వుంటుంది. అసలు ఈ వాఙ్మయం అంతా వారినోటినే చోటుచేసుకుందా అనిపిస్తుంది. స్త్రీ సాహిత్యాన్ని మధ్యతరగతి సాహిత్యమంటే బాగా వుంటుందేమో !

బాలసాహిత్యం క్రిందనూ చాలారకముల గేయాలు మనకు నిత్యము వినిపిస్తూనే వుంటాయి. ఆటల రూపంలో కొన్ని, పాటలుగా వుండేవి కొన్ని, వైద్య విజ్ఞానములకు సంబంధించి కొన్ని-ఇలా రకరకములుగా ఎన్నో వుంటాయి. బాల సాహితికి సంబంధించిన ఈ గేయాన్ని వినండి:

"కాళ్లగజ్జి
కంకాలమ్మా
వేగులచుక్కా
వెలగా మొగ్గా

ఈ రచన ఒకవిధమైన ఆయుర్వేద వైద్యప్రబోధమయిన అటపాట. ఎంతవరకూ దీనిని పాటగా పాడడానికి వీలుగా వుండుందంటే పిల్లలను ఆడించడం వరకే. అలాగే ఈ క్రింది గేయం—

"ఏం కర్ర?
జీలకర్ర,
ఏం జీల?
....."

ఈ పాటను సరదాగా ఎనిమిది, పది వయస్సు బాలలు కాలక్షేపంకోసం వరుసతప్పకుండా ఈ రకం పదజాలంతో పాడతారు. ఇది ఒక విధంగా ఆట. అది అంతవరకూనే అందం. వీటిలో కొన్ని కొన్ని పలుకులు చాలా విలువయినవీ, అవసరమైనవీ దొర్లుతుంటాయి. అటువంటి పదములను త్రోసివేయకూడదు.

కొన్ని పదాలు మంచివి అనడంలో నా ఉద్దేశ్యం-మచ్చుకు ఈ క్రింది పాటను పరికించండి.

ఒక పశువుల కుర్రవాడు ఒకనాటి ఉదయ సమయమున సారంగధర మెట్టవద్ద పాడుతున్నాడు ఈపాటని (ఈ సారంగధర మెట్ట తూర్పుగోదావరిజిల్లా రాజమండ్రిలోనిది). ఈ పాట నాకేమంత బాగా వినిపించనూలేదు కనిపించనూ లేదనుకోండి. కాని, అందులో ఒకమాట-నన్ను ముగ్ధుడిని చేసింది.

"ఎద్దు కొమ్ముల మీద
పొద్దు పొడిచింది..."

అన్న చరణం. ఈ మాటలో ఎంతటి భావనావిలుప, కవితామాధురీ పుందంటారు? సాధారణంగా ఎద్దుకొమ్ములు నిలువుగా వుంటాయి. వాటిమీదికి పొద్దురావడమంటే- సరిగా పన్నెండు గంటలు అయిందన్నమాట. ఈ పాటలోని మాట కవితావిలువకు సానమీదక త్తేగాని, చెవులకు ఇంపుగా వుండదీ పాట.

అలాగే మరొక పాటను కూడా పరికిద్దాము. ఇది రాయలసీమలోనిది అనుకుంటాను- నేను వెళ్ళివస్తా అని భర్తతో చెబుతూ భార్య—

"మొగలి డొంకల్లోన
ముడుచుకొని కూర్చున్న
ఓ మొగలి రేకా....."

అని భర్తను సంబోధించి- ఫలానాతీర్థం వెడుతున్నాను, అడ్డుచెప్పకు- ఇష్టపడు అని అడగడం - మొత్తంమీద సరే వెళ్ళు- మరి ఎప్పుడు వస్తావు? అని భర్త అడగడం, ఈ ప్రశ్నకు సమాధానంగా భార్య ఇలా అంటుంది:

"రాతిబసవేశ్వరుడు
రంకె వేసే వేళ
రాతిమీద రాజనాల్
పంట పండే వేళ....."

నేను తిరిగొస్తానని ఎంతటి చమత్కృతితో సమాధానం ఇస్తూందో! ఈ పాటలో పదగుంభనం ఎంతటి పటుతరంగా పొదిగాడో జానపదకవి. ఇటువంటి జానపద కవితలు అనుకోకుండా జానపదుల నోటినుంచి వెలువడ్డాయంటే- ఆశ్చర్యం కాదూ మరి.

రాతిమీద రాజనాలు పండడమూ వుత్తిదే, రాతి బసవయ్య రంకెలు వేయడమూ కలలోనిమాటే. ఇటువంటి పరిస్థితిలో తిరిగి వస్తానన్న పడుమా తిరిగి రావడం నమ్మకంలేని వాస్తవమే. కాని,

"రాచూరు దగ్గరా
రాతిబసవడున్నాడు
రంకే లేసే కాల
మొస్తుందిరా....."

అని బ్రహ్మంగారు తన తత్వంలో కూడా చెప్పారు. ఏమో, ఏం కానుందో. ఇటువంటి మధుకలశా లనదగిన జానపద రచనలను గురించి, అందలి ఇంపుసొంపులను గురించీ, వాటిలోని మాధుర్యాన్ని గురించీ- దిఙ్మాత్రంగానైనా పరిచయం చేయడానికి ప్రయత్నిస్తాను.

కష్టాలతోనే పుట్టి, కష్టజీవితాలు వెళ్ళబుచ్చే శ్రామికులకు భూదేవే తల్లి- ఆకాశమే తండ్రి — చుట్టూవున్న చెట్టు చామలే బంధువులు. ఇట్టివారి

నుంచి ప్రభవించిన సాహితిలో బాలసాహితినుంచి తత్వాలవరకు ఎన్నో అపురూప గేయాలు మనకు కనుపిస్తాయి.

శ్రీ చలంగారు నుడివినట్లు "...ఎన్ని ఏళ్ళనుంచో ఇవి తల్లిప్రేమలో, భార్య పాతివ్రత్యంలో, చిన్న పడుచు కలల్లో, పసిపిల్లల చిరునవ్వుల్లో... నాని నాని మెరుపులేసుకొని, ఎన్నివేల హృదయాల తపనల్నో పోగుచేసుకొని, చిత్రిక పడి ఈ రూపాల్ని పొందాయి..." ఈ పాటలు.

ఈ జానపద వాఙ్మయాన్ని వ్యతిరేకించేవారిని, అంటనివారిని చూసి "ఈ కృతకభాషావాదులు పూర్వాచార పరులకన్న అంధులు - వాళ్ళకు ఏది చూసినా శత్రుత్వమే. పూర్వాచారాల్లో నిలచిపోవలసినవి చాలా వున్నాయి. కాని ఈ కృతకభాషలో మిగిలిపోవలసింది ఏదీలేదు. వీరికి తమకన్నా పాతవీ పనికి రావు, తమకన్నా కొత్తవీ పకికిరావు. దురదృష్టవశాత్తూ ఈ కృతకభాషావాదులే అధికారంలో వుంటూ వుంటారు..." అని పేర్కొన్నారు చలంగారు.

అటువంటి ప్రజాసాహితి–సజీవసాహితి–సముజ్జ్వల సాహితిని గురించి చాలా తెలుసుకోవలసివుంది.

"ఈ పాటలు తెలుగుజాతి జీవనమంతా కళ్ళకు కట్టేట్లుగా చూపుతాయి. తెలుగుబ్రతుకు అంతా–వానదేముడి నుంచి పరికోతలదాకా, వ్యవసాయంనుంచి వీరత్వందాకా, కాడినుంచి కత్తిదాకా–ఇలా తెందుకు తుడుము దగ్గరనుండి దేవతార్చనదాకా ఆద్దంపలె కనబరుస్తుంటాయి ఈ పాటలు."

మన నడత, నాగరికములు, విజ్ఞాన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఎలా క్రమానుగతంగా వికాసం చెందుతూ పచ్చాయో పరిశీలించగోరే వారెవరైనా మన జానపదవాఙ్మయాన్ని విధిగా పరిశీలించాలి. పుష్పాల పరిమళాలను ఆఘ్రాణించాలి.

ఎపరూ అంటక, ముట్టక టీరుకున్న సమయంలో ధైర్యంచేసి పల్లె జీవితచరిత్రగా పేర్కొనదగిన పాత పాటలను కూర్చి, ఏరి ఒక రూపుదిద్ది చిన్నగానైనా పుస్తకరూపంలో వెలువరించారు కనుకనే నేడు ఆ పుస్తకాలను,

ఆ వ్యక్తులను, ఆ పాటలను వెతుకుతున్నాము. అటువంటి వ్యక్తులు చిరస్మరణీయులు. అటువంటి పాటలు మేలుబంతులు–నేటివారికి పచ్చని చామంతులు, గుత్తుల పూబంతులు.

అయితే ఈనాడు చామంతులు జడలూ కనుమరుగయా యనుకోండి–పూబంతుల కొప్పులూ కనుపించడం లేదనుకోండి. పెళ్ళివాకిట బంతులాటలూ మరచిపోయా రనుకోండి.

అంతదాకా ఎందుకు – ఈ యాంత్రిక యుగంలో, ఈ యాటం యుగంలో - పాశ్చాత్య నాగరికత ధర్మమా అని–చద్దికుండల స్థానంలో కాఫీ కప్పులు ప్రత్యక్షమయాయి, చామంతి జడల స్థానంలో ఇనుప ముక్కలు రింగులూ–రంగుగుడ్డలూ ప్రత్యక్షమవుతున్నాయి. పెళ్ళివారి గదపల్లో పేర్లు చెప్పడాలు, బంతులాటలు పోయి షేకు హండులూ, హాండ్‌బాగ్‌లూ కనిపిస్తున్నాయి.

తిరగళ్ళ స్థానంలో పింజిమరలు, డంపురాళ్ళ ప్రదేశాలలో బియ్యం మిల్లులు, గొబ్బికోలాటల ఆటల బయలు ప్రదేశాలలో రింగు టెన్నిస్సులు, బాడ్మింటన్‌లు తయారైనాయి. నవనాగరికతపేర–పాత పాటలు, ఆటలు గ్రహకృత్యాలు, వేడుకలు, విందులు కనుమరుగైపోతున్నాయి.

అలా కనుమరుగై పోతూవున్న కొద్ది పల్లెపాటలనైనా పదాలనైనా విని - చూసి - కూర్చి - రక్షించవలసిన సమయం - ప్రచురించవలసిన కాలం ఆసన్నమయింది.

ఆ ప్రాధాన్యాన్ని గుర్తించే ఈనాటి రచయితలు, సాహితీవేత్తలు, ప్రచురణకర్తలు, జానపదవాజ్మయ రక్షణకు కదిలారు - కదులుతున్నారు. అందుకు తొలిగా విఘ్నేశ్వరపూజ చేసిన ఘనత శ్రీ మంగువారికీ, శ్రీ చలపతిరావు గారికీ దక్కుతుంది. వారెంతయో అభినందనీయులు.

ఈ పుస్తకాలన్నీ గుజలీ ప్రతులుగా కనబడినా-ధైర్యంచేసి ప్రచురించారు. జానపద వాజ్మయ సేకరణోద్యమానికి నాంది ప్రస్తావన పలికారు.

నాడు వారు నాంచీప్రస్తావనచేసిన ఘనతే నేడు కొన్ని చక్కని సంపుటాలు వెలువడడానికి దోహదం చేసినదంటే అత్యుక్తి కానేరదు.

మధుర కవితలు అన్న వ్యాసాలు ఏనాటివి? అవన్నీ పుస్తకాల నలంకరిం చాయా? లేదు.

ఒక వ్యాసమూ, రెండు వ్యాసాలా? బాల భాష, స్త్రీ భాష - పామరభాష మొదలగు చక్కని నామాలతో, విషయ విభాగాలతో, చర్చలతో, ఉద్గ్రంథ లూగించినవి. (ఈ సాహితిని చూసి భయపడే పెద్దలనులెండి). ఆ వ్యాసావళిలో ఒకటి-అదైనా ఈనాటికి-ప్రభాకర పరిశోధక మండలివారు 'బాలభాష' పేరుతో వెలువరించారు.

బాలభాష అంటే ఏమిటి?-ఇది జానపద సాహితి క్రిందనే పేర్కొన్నారే-జానపదులు భావావేశంలో అల్లినట్లుగానే-బాలల నోట్లోంచే ఈ పాటలు వచ్చాయా? అని ఒక మిత్రుడు ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు నాకు కొంచెం నవ్వు కలిగినా-ఆశ్చర్యం కలిగించలేదు.

బాలలతో ఆడుకొని, బాలల మధ్యనే వుండి ఆ పాలబుగ్గలను ముద్దుపెట్టుకుని, ఆ పసిహృదయాల లోతులలోంచి - ఆ పూరేకుల పెదవులలోంచి తేనె చినుకులుగా వెలువడే చిన్న చిన్న పలుకులూ, కులుకులూ చూసేవారికి - బాల భాష అంటే ఇట్టే ఆకళింపవుతుంది. కాని, లేకపోతే అర్థం అవడం కష్టమే.

అసలు బాలలను అర్థం చేసుకోవడమే కష్టం. "ఏసుగుడు తెచ్చిస్తేకానీ అన్నం తినను" అంటాడు. "ఆ చందమామను నాకు తెచ్చిపెట్టు" అని మారాం చేస్తాడు. ఏమిటి ఈ చేష్టలు? వీటినే బాలక్రీడలు అన్నాము.

అందుకే కురవాడు "పిల్లాడినెత్తుకునేకంటే బిచ్చమెత్తుకుంటే నయం" అన్నారు.

అంటే పాపలమీద ప్రేమ - ఇష్టంలేక కాదు ఈ మాటన్నది. వారి బాల క్రీడలను సరిగా అర్థం చేసుకోలేక, ఆ పసివాలలు వేసే యక్షప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేక అన్నమాట.

అలాగే చాలాకాలం క్రిందటనే "బాలానందం"పాటలు అని అనుకుంటాను, రాజమండ్రినుంచి ఒక పుస్తకము ప్రచురించారు. ఆ పాటలన్నీ జానపద సేకరణలే, బాలపాటలే, అన్నీ పరిచయమైనవే-ప్రచారమైనవే.

తెలంగాణానుంచి నేదునూరి గంగాధరంగారి సేకరణలు "సెలవేరు" పేరుతోనూ, విజయవాడనుంచి "ఎల్లోరా" (నావి) సేకరణలు 1954 లో ప్రథమ సంపుటి, 1959 లో ద్వితీయ సంపుటి "జానపదగేయాలు" అనే పేరుతోనూ, 1960 లో "సరాగాలు" పేరుతోనూ, 1961 లో "మధురకవితలు" పేరున వెలుపడినాయి. "కృష్ణశ్రీ" గారి సంకలనం "పల్లెపదాలు" పేరుతోను, శ్రీ ప్రయాగ "తెలుగు పల్లెపాటలు" పేరుతోనూ వెలువడ్డాయి.

సమీక్షాగ్రంథాలకు ముందర సమీక్షావ్యాసాలు భారతి, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, గృహలక్ష్మి, ప్రసంతి మొదలగు పత్రికలలో చాలామంది సాహితీవేత్తలు రకరకాల శీర్షికలతో వెలువరించారు.

అందులో అగ్రగణ్యులు – కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారే. వీరు చక్కని వ్యాసాలను అందజేశారు. వీరి తరువాత చాలమంది అప్పుడప్పుడూ కొన్ని వెలువరించారు.

తరువాత మిత్రులు శ్రీ బేతుమళ్ళవారి పేరు వినవస్తుంది. వీరు చాలా కాలంగా-చాలా పట్టుదలతో కృషి చేస్తున్నారు. అలాగే ప్రత్యేకంగా శ్రద్ధతీసికొని శ్రీ జ. సూత్రం రుక్మిణీనాథశాస్త్రిగారు ఆలిండియా రేడియోలో మహిళామండలి కార్యక్రమాల్లో చక్కని సమీక్షలను అందించారు. వాటిలో చక్కని విషయాలు పొందుపరచి-చక్కని విషయసంగ్రహం అందించారు.

అలాగే - శ్రీ గిడుగు సీతాపతిగారు (వాణిలో), డాక్టరు శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారు (కిన్నెరలో), శ్రీ ఆవంత్స సోమసుండర్ (కిన్నెరలో), శ్రీ నిడదవోలు వెంకటరావుగారు (కిన్నెరలో), శ్రీ పిలకా గణపతిశాస్త్రి గారు (భారతిలో), 'ఎల్లోరా' (ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, విశాలాంధ్ర, ప్రసంతిలలో),

శ్రీ యస్వీ జోగారావుగారు భారతి మొదలైన వాటిలో, శ్రీ నేదునూరివారు ప్రజామతలో, శ్రీ కె. సభా ఆంధ్రప్రభలో వ్యాసాలు వ్రాయడంతోపాటు చిత్తూరు మండలానికి సంబంధించి ఎన్నో జానపదగేయాలు సేకరించారు. ఇంకా ఎంతో మంది పెద్దలు వివిధ పత్రికలలో గేయాలను గూర్చి, పదాలను గూర్చి, దేశికవితలను గురించి, హరిహరీ పదాలు, యక్షగానాల గురించి - మార్గ - దేశి కవితలమధ్య తేడాలగురించి చాలా వ్యాసాలు వెలువరించారు. ఇవి సారస్వత ప్రియులకు, రచయితలకు ఎంతో సహాయకారి అయినాయి.

జానపదసాహితి అనగానే "నన్ను ముట్టుకోకు నామాలకాకి" అన్నట్లుగా వుంటారు కొందరు. ఏమిటి కారణం? అలా అంటకుండా దూరంగా వుండడానికీ- ముట్టితేనే పాపం అనుకోడానికీ ??

వారు బహిరంగంగా చెప్పే సాకు-ఈ జానపద గేయాల నిండా బూతు పదాలు ఎక్కువగా వున్నాయని. బియ్యంలో బెడ్డలు ఏరగలిగిన ఈ పెద్దలు పద్దు ఎందుకు ఏరలేదని మనం గ్రహించాలి.

ఆ పని తప్పు- ఈ దారి ప్రమాదం అని చెప్పేవాళ్ళు ఈ పని మంచిది, ఈ దారి సులువైనదీ అనికూడా చెప్పగలిగితేనే విలువ వుంటుందికాని - గాలిలో బెలూనులాగ ఎటుపడితే అటు మాట్లాడకుండా వుండాలి.

జానపద సాహిత్యమంతా పట్టి బూతుతో నిండిన దన్నప్పుడు - మార్గ కవితలలోని శృంగారపదాల మాట ఏమిటి ?

వీటితోని బూతులు వారి చెవులకు వినిపించినప్పుడు, మార్గకవుల రచనల లోని బూతుపద ప్రయోగాలు వారికి ఎందుకు వినరావడంలేదో ! వాటిని చదువుకుంటూ ఏల ఆనందం పొందుతున్నారు ?

ఇంతకూ వీరు జానపద కవితలకు ఆపాదించినది బూతు పదాలు వున్నా యని. ఆ బూతు పదాలే వారి మార్గకవితలలో దొర్లితే అది బూతు అనిపించు కోదా ? అభం శుభం తెలియని అమాయకమైన పల్లెజనాళి - తమ కష్ట సమ యంలో - సుఖసమయంలో తన్మయత్వం పొంది - భావావేశంతో అల్లిన పాట లలో బూతులు దొర్లడం సహజం - అసహజం అనిపించుకోను కూడా.

కాని చక్కని పాండితీ పటిమయుండి - వ్యాకరణంలో, ఛందోరీతులలో ఘటికాగ్రగణులయి వుండీకూడా వారి మార్గకవితాలతకు ఈ బూతు పూవుల లాంటి పదప్రయోగాలు వన్నె తెస్తాయంటారా? ఒకరి విషయంలో ఒక పని తప్పు అని మనం చెప్పినప్పుడు ఆ పనే మనం చేసినా తప్పే అవుతుంది కాని ఒప్పు కానేరదు.

జానపద కవితలలో విసబడే బూతులు ఏమిటి? కొంచెం పరికిద్దాము :-

"వెన్నుమీదా చూపు
మలపరా - నా సామి
చన్నుమీదా చేయి
తియ్యరా నా సామి..."

అని ఒక పాట.

ఈ పాటలోని అసలు భావం :— సోమరిపోతులాగా తిని, శృంగార చేష్టలు చేస్తూ, స్త్రీలోలుడవయేకంటే, నీ కాలాన్నీ, తెలివితేటల్నీ దేశ సౌభాగ్యానికీ, దేశ పురోభివృద్ధికీ వినియోగిస్తే ఎంతో బాగుంటుంది సుమా – అని.

ఇంతటి విశాల భావంతో వాడబడిన ఈ చన్ను శబ్దప్రయోగం అమాయకురాలైన పల్లెపడుచు నోటినుంచి వచ్చినపుడే తప్పు అయినపుడు—

"సూత్రమునకైన సందీక స్థూలమగుచు
క్రిక్కిరియు నీదు చన్నవయొక్క అంత
రమున, నెట్టులో నా చూపులిముడి
అహహ క్రమ్మరగలేవు రాతిలో కప్పలటుల"—

"నిక్కి పొగరెక్కువారిని నిగ్రహింప
దగునె తలవాల్చువారికి తగునె శిక్ష
తరుణి చనులకు కర మర్దనమె కాక
వృద్ధకుచములకొక నమస్కృతియెకాదె"—

అనే ఈ పైపద్యాలలో ప్రత్యేకం శృంగారం కొరకే వాడబడిన "తరుణి చనులకు కరవిమర్ధనమె", "వృద్ధకుచములు" పద ప్రయోగం ఎందుకు తప్పుకాదో?

ఈ మార్గ కవులు వాడిన చన్ను శబ్దం బూతు కానప్పుడు జానపదులు వాడిన చన్ను బూతు ఎలాగైందో దురూహ్యం.

నేటి సాహితీపరులు - నాగరికులమనుకునేవారు - కదలి మంచి చెడ్డల మధ్య, విమెర్శావిమర్శలమధ్య నలిగి అట్టడుగున పడిపోయిన - పడిపోతూన్న జానపద కళాఖండాలను, జానపద వాజ్మయక్షేత్రంలో పరిశోధనలు జరిపి వెలికి తియ్యాలి - మెరుగులు దిద్ది పునరుద్ధరించాలి.

అటువంటి రక్షణోద్యమము, కార్యదీక్ష కనుక మనలో కలిగిననాడు- ఎన్నో గాథలు, చరితలు, పదాలు, పాటలు దొరుకుతాయి.

జానపద కవితలలో - ప్రతి పాటా ఒక జీవిత సత్యం, ఒక సందేశం, ఒక ప్రబోధం ధ్వనిస్తూ మానవజాతిని మేలుకొలుపుతూ వుంటాయి.

ఇందులో పిల్లలకు పాలు, ఉగ్గు, బువ్వ పెట్టడం దగ్గరనుంచి, ఆయుర్వేద రహస్యాలనుంచి, ప్రథమ చికిత్సా విషయాలనుంచి - ఆటపాటలు, వెటకారాలు, వెక్కిరింతలు, గృహకృత్యాలు, బోధలు, తత్త్వాలదాకా ఎన్నో రకాలు వున్నాయి.

ఈ బాల పాటల నడకలో యతిప్రాసనియమాలు చక్కగా వుంటాయి. ఈనాటి మన తల్లులు కాఫీగతప్రాణు లవడం మూలంగాను, ఆముదం అంటేనే వెగటు చూపిస్తూ పాశ్చాత్య వ్యామోహితు లవుటవలనను - ఉగ్గుపాటలు మరచి పోయారా అనిపిస్తూంది.

బియ్యపు మరల ధర్మమా అని దంపుపాటలు మరచి పోయారు. మిషనులు రాగానే తిరగలి పాటలు వదిలేశారు. నాగరికత పేరుతో నోములకు, వ్రతాలకు స్వస్తి చెప్పారు.

పాశ్చాత్య అనుకరణలతో మన పాత ఆటలు, కోలాటాలు పోయి, రింగు రెన్నీసులు వచ్చాయి.

"కాళ్ళా గజ్జె కంకాలమ్మ..." స్థానంలో
"ట్వింకిల్ ట్వింకిల్
లిటిల్ స్టార్..." పాటలు వినబడ్తున్నాయి.

వీరి వ్యామోహం ఎంతవరకు పోయిందంటే ''కొత్తాక వింత, పాతాక రోత—'' అన్న ధోరణిలో వుంది.

పూర్వపు బాలపాటలలోవున్న నడక, శైలీ, తెలుసుకోతగ్గ విషయాలూ - ఈనాటి రచనలలో కానరాదంటే కోపం ఎవరికీ రాచకుంటాను.

శ్రీ గిడుగు వారు పేర్కొన్నట్లు ''...అటువంటి విలువ గలిగిన పాత సాహితిని మన పండితులు కొంతమంది - ఆదరించలేదు - సరే ఆదరించవద్దు. ఒకవేళ వీరు ఆదరించినా వారి ముళ్ళకంపలాంటి, ప్రజలకు అర్థం కాని ఛందో రీతులలో అల్లిన రచనలపలనే ప్రజలకు దూరంగానే ఈ జానపద రచనలూ వుండిపోయేవేమో. అదీ ఒక మేలుగానే పరిణమించింది.

అయితే వారి రచనలు తాటాకు ముక్కలనైనా ఎక్కాయి - ఈ జానపద రచనలు తాటాకులమీదకైనా రాలేకపోయాయి ...'' అని పండితులు ఆక్షేపించవచ్చు.

వీరు రాజులను, రారాజులను పొగడుతూ ప్రాసిన అంకితాల కవిత్వాలకీ-ఆర్భాటపు కవితలకీ పల్లకీ మోతలూ, ప్రచారాలూ ఆవసరమయాయి కాని ఈ నిర్మల జానపద సాహితీ ప్రవంతి ఏ అండా - ఏ ప్రచారమూ లేకపోయినా నేల నాలుగుచెరగులా - ప్రవహిస్తూనే వున్నది.''

విచిత్రమేమిటంటే, ఏ పూర్వ ఛాందస కవులయితే ఈ జానపద వాజ్మయాన్ని బూతు సాహిత్యమన్నారో - వారి బాల్యంలో వారిని కన్నతల్లి ఉగ్గు పెడుతూ - పాలుపోస్తూ - పాడిన పాటలు ఏమిటో వారొకసారి తమ బాల్యం వెంపుకు తిరిగి ఆలోచించమనండి. నాడు తల్లి ఆడిస్తూ పాడిన ఆ పాటలకు వీరే పకపక నవ్వి, ఉబ్బి తబ్బిబ్బవ లేవంటారా ? అంతేకాదు - ఈనాటికీ వారి వారి ఇళ్ళలో వారి భార్యలూ, వారి ముసలమ్మలూ - వారివారి బాలురకు ఏ పాటలు నేర్పుతున్నారో - ఏ విధంగా ఉగ్గు, పాలు పెట్టుతున్నారో తెలుసుకోమనండి. ఈ జానపద సాహిత్యం లేని గ్రామం, పాడని కంఠం, నవ్వని హృదయం, వినని చెవి, ఉండవంటే అత్యుక్తి కానేరదు.

ఆటుపంటి సాహిత్యం ఎన్నటంలో చేయవలసిన పని గురించి ఎంతైనా తెలుసుకోవలసియుంది, నేటికి ఈ గేయ కుసుమాలు - సవనసోన్మేషంగా

విలసిల్లుతూ శ్రామిక జనావళిచే మాత్రమే కాదు. నవజనాళిచేకూడా ఆదరణ పొంది - వారి హృదయాలను కితకితలు పలికిస్తున్నవంటే ఈ గేయాలలో వుండే విలువ గ్రహించవచ్చు.

శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మగారు పేర్కొన్నట్లు 'అటువంటి ఈ దేశి కవితలు ఎత్తుకుని పరీక్షించిననాడు - అందలి సున్నితమైన భావములు, దేశీయమగు భాష, కమ్మని తెలుగు నుడికారమూ, అడుగడుగునా - పలుకు పలుకునా ప్రతిధ్వనిస్తూండును - పొడగట్టుచుండును.'

ఈ పద కవితలు ఎంత నిసర్గ రమణీయమైనను ఛందోడంబరమును, సంస్కృత బాహుళ్యమునూ గల మార్గకవిత ఎడుట మసలలేక - పామర జనాశ్రయమై చిరకాలము పల్లెపట్టులందే పారాడవలసివచ్చినది.

కాని దీనియందలి సహజ మాధుర్యములనూ, సర్వజనీనతను గుర్తించి దీనికినీ నాగరిక లోకమున నాదరమును సారస్వత ప్రపంచమున ఉచిత స్థానమును కలిగించుటకు యత్నించిన మహానుభావులే ద్విపద కావ్యకర్తలు. నాటి నుంచియే దేశిసాహిత్యం-పొంగులు వారుతూ-తుష్టినీ, పుష్టినీ సంతరించుకొని ముందుకు నడక సాగించింది.

వీరిలో — అంటే ఈ ద్విపద కావ్యకర్తలలో ప్రథమాచార్యుడుగా పేర్కొనదగినవాడు పాల్కురికి సోమనాథుడు. ఈ మహానుభావుడు మహా పండితుడు. కావ్యగౌరవమును పోషించునది సర్వజనీనతగాని, ఛందఃప్రయాసాతిశయము కాదని గుర్తించి-వివిధవృత్తములతో సంస్కృత బహుళముగా గద్యపద్యాత్మకమగు గ్రంథ రచన మొనర్పవలయు ననెడి యాకాలపు మార్గకవులకు —

"ఒప్పదు ద్విపద కావ్యోక్తి నాజనదు
ఆరూఢ గద్య పద్యాది ప్రబంధపూరిత
సంస్కృతభూయిష్ట రచనమానుగా
సర్వసామాన్యంబుగామి జానుతెనుగు
విశేషము ప్రసన్నతకు"

(బసవ పురాణము)

అని చక్కని సమాధానమిచ్చి—

''ఉరుతర గద్యపద్యోక్తులకంటే
సరసమై పరగిన జాను తెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
గూర్చెద ద్విపదలు కోర్కెదైవార...''
(పండితారాధ్యచరిత్ర)

అని ఎలుగెత్తి సవాలు పలికి మార్గ కవితోద్యమానికి ఎదురుతిరిగి దేశికవితోద్యమానికి బాసటగా నిలచాడు :

''సరళముగాగ భావములు
జానుతెనుంగున నింపు పెంపుతో''—

అని నన్నెచోడుడు కూడా ప్రవచించాడు.

దేశి కవితలు-మార్గ కవితలు అన్నది చాలాచోట్ల చర్చించడం జరిగింది.

జానపద రచనలనే దేశిరచనలుగా మనం చెప్పుకొన్నాం. సులభగ్రాహ్యమూ, సుందరస్వరూపము, ఇంపైన ధ్వని ప్రధానమూ అయిన భాషనే 'దేశి' అందాం! సంస్కృత పదభూయిష్టమైన వాటినే 'మార్గ' రచనలు అందాం ! !

మొట్టమొదట ఈ మార్గ, దేశిపదాలను ప్రయోగించినవాడు నన్నెచోడుడు అనేది ఇక్కడ మనం ముఖ్యంగా చెప్పుకొనవలసివుంది.

''మును మార్గకవిత లోకం
బున వెలయంగ దేశికవిత
బుట్టించి తెనుంగున నిలిపిరంధ్రవిషయం
బున జన చాళుక్యరాజు
మొదలగు పలువుర్
సురవరులం గ్రమంబున వచో
మణిసంహతి బూజచేసి మా
ద్గురు చరణారవిందములకున్

దగ సమ్మతిజేసి కొల్చి వి
స్తరమతులం బురాణకవి సంఘము
నుత్తమమార్గ సత్కవీ
శ్వరులను దేశి సత్కవుల
సంస్తుతి జేసి మనోముదంబునన్''

అని పేర్కొని "మార్గ'' - "దేశి'' పదాలను పేర్కొన్నాడు.

అక్కడదాకా ఎందుకు క్రీస్తుశకం 750కి పూర్వపువాడని చెప్పబడుతున్నవాడు మతంగుడు తన గ్రంథంలో ఆలా పేర్కొన్నాడు. కొన్ని పంక్తులను పరికించండి :—

''దేశికార ప్రబంధోయం'' అనీ,
''సప్తమీ కథితాగాథా
తతో ద్విపదకోత్తమా'' అనీ,
''దేశిగీతేపి వస్తుస్యా
న్నాటకేపి ప్రయుజ్యతే'' అనీ,
''ఏలా నాదవతీరమ్యా
వర్ణాలంకార శోభితా'' అని

ఇలా ఎన్నో దేశి రచనలున్నట్లు, దేశి, మార్గ రచనలను గురించి పేర్కొన్నాడు.

1230 ప్రాంతంవాడని చెప్పబడుతూన్న శార్ఙదేవుడు కూడా దేశి రచనలను గురించి చెబుతూ ద్విపద, త్రిపది, చతుష్పది, షట్పది, ఏల, పచం, కళిక, ఉత్కళిక, ఏకతాళి, ధవళం, మంజరి, మంగళం, వర్తన, ముక్తాపళి—మొదలగు దేశిచ్ఛందోరీతులను గురించి పేర్కొనడం గమనించవలసిన ముఖ్యవిషయము !

అప్పకవీయములో లాలిపాటకు, పెండ్లిపాటకూ, దవళము, సువాల మున్నగు పాటలకు లక్షణములున్నవి.

ఆనందరంగరాట్బృందములో సుళాదితాళకొట్నములు, ధవళములు, శోభనములు, ఆరతిపాటలు, జోలలు, ఏలలు, గొబ్బిళ్ళు మున్నగు పాటలు పేర్కొనబడ్డవి.

గుడారు వెంకటదాసకవి బలరామచరిత్రలో ధవళము, సువ్వాల, శోభనము, ఆరాత్రిక, లాలి మున్నగు పాటలు పేర్కొనబడ్డవి.

లక్షణదీపికలో ధవళములు మున్నగు పాటలు పేర్కొనబడ్డవి.

కళాపూర్ణోదయములో జోలపాటలు, పెండ్లిపాటలు పేర్కొనబడ్డవి.

పొలుపరదన్ను వే నిదుర
బుచ్చుటకై తమతల్లి పైడి యు
య్యెల నిడి యూపుచో, గువల
యాధిపుపాటలు పాడినం గర
బలరుచు గేరికేరి నగు
నన్యుల పాటలు పాడినం, గరం
బలయుచు నేడ్చు, లోకు లవు
రా పతిభక్తియటంచు నవ్వగన్

మంగళసూత్రము గట్టె గు
రంగాక్షికి నంతరంగ రాజేంద్రుడు పు
ణ్యాంగనలు పెండ్లిపాటలు
మంగలికోళ్ళ మృదుగీతి మధురిమ నెనయన్''

శంకరకవి హరిశ్చంద్రోపాఖ్యానములో ఇట్లు వర్ణించబడినది :

''గాణల్మెచ్చగ బాడి రింపుదొలకంగా దాక
మానంబులన్
క్షోణీనాధజయాంక సంకలితముల్
సూళాది గీతాపళుల్
వాణీపాణి సరోరుహాంగళి సఖ వ్యాపార
లీలారణ

వీణాసంచిత పంచమక్వణ కళా
విఖ్యాత కంఠధ్వనిన్."

—చేమకూర వేంకటకవి తన విజయవిలాసములో ధవళములనూ, అయిరేని పాటలనూ పేర్కొన్నాడు :

"కట్టిరి మంచి లగ్నమున కంకణముల్
కర పంకజంబులన్
బెట్టిరి మేపులన్ నలుగు మేలిమృగీమద
కుంకుమంబులన్,
జుట్టిరి కైశికంబుల విశుద్ధ మనోహర
పుష్పమాలికల్
పట్టిరి పేరటాండ్రు ధవళంబులు దాపుచు
నుల్లభంబులన్"

నాచన సోమన జాజర పాటలను గురించి ఈ క్రింది విధముగా పలికాడు:

"వీణాగానము వెన్నెలతేట
రాణమీరగా రమణుల పాట
ప్రాణమైన పినబ్రాహ్మణ వీట
బాణలు మెత్తురు జాజఱ పాట"—

ఈ పాటలు ఎక్కువగా (బ్రాహ్మణవీట అన్నాడు) బ్రాహ్మణులలో ప్రచారమందు ఉండినవి అనుకోవాలి.

అయితే శ్రీనాథమహాకవి ఈ 'జాజిఱ' పాటనే కాబోలు "జాదర" అని పేర్కొనడం గమనించవలసి ఉంటుంది.

*"జాదర జాదరంచు మృదుచర్చరి
గీతలు వారుణీ రసా
స్వాద పుడాతిరేకముల చంద్రిక
కాయగ దక్షవాటికా

---

* భీమేశ్వర ఖండములో—

వేచుల మీదటన్ కనక వీణలు
మీటుచు పాడిరచ్చరల్
మోదమెలర్పగా భువనమోహన
విగ్రహు భీమనాథునిన్''

అయితే మనం గ్రహించవలసింది - నాచన సోమన బ్రాహ్మణుల ఇంటి దనడం, శ్రీనాథుడు అచ్చరల్ పాడేపనడం మాత్రమే. మొత్తంమీద ఈ జాజఱ లేక జాదర పాటలు అప్పటికే మంచి ప్రచారంలో ఉన్నాయనేదే —

(1) ''పల్నాటి వీరుల చరిత్రను పిచ్చులకుంట్లవారును, కాటమరాజు కథను గొల్లవారును, ఎల్లమ్మ కథను బవనివారును చెబుతూండేవారు.

*''పనిచేసి గంజియైనను
అంబలైనను నెద చల్లగా
ద్రాగి యెచటనైన పడియుండి
వెన్నెల గుడిపాట పాడగా
పేదల కాత్మ సంప్రీతి కలుగు''—

—వెన్నెల పదాలు, వాలేశు పదాలు అని పాల్కురికి సోమనాథుడు పేర్కొన్నదే ఈ ''వెన్నెలగుడి పాట'' అయి ఉంటుందేమో?

కవితలలోనూ, సంగీతంలోనూ, నాట్యంలోనూ, పాటలలోసూ-అన్నిటా రెండు పద్ధతులు ప్రచారమైనాయి. "దేశి'', "మార్గ''—విధానమని !

సంగీత శాస్త్రములో మార్గ, దేశి విధానము లుండినట్లు విపరించినారు. అలాగే ''అగాయితాం మార్గ విధాన సంపదా'' అనీ దేశిమార్గ లాస్యతాండవ ములు (కాశీఖండం) చెప్పినారు.

నాట్యములలో ముఖ్యముగా మార్గ, దేశి విశేషాను గురించి శ్రీనాథ మహాకవి కాశీఖండంలో ఒకటికి రెండుసార్లు ఉదాహరించడం జరిగింది. జక్కణి

---

(1) ఆంధ్రుల సాంఘిక చరిత్ర—191

* సింహాసన ద్వాత్రింశిక—

అనే దేశినృత్యం ఒకటి, చిందు అనే నృత్యవిధానం ఒకటి ఉన్నాయి. ఇందులో ''జక్కిణి'' నృత్యమును గురించి దశవతార చరిత్రమునందు ఇలా వర్ణించడం జరిగింది. అది ఇది:—

''దరుపదంబులు సొక్కుమై సిరులు నొసగ
సరిగ నిరుగెల కుంచియల్ సపదరించి
పెక్కు వగ జక్కిణీకోపు ద్రొక్కె నొక్క
చక్కని మిటారి నరపతుల్ సొక్కి చూడ''—

—దీనినిబట్టి ''జక్కిణీకోపు''ను ప్రజలు చాలా ఆదరించేవారనీ, చూసి ఆనందించేవారనే కాకుండా - ''నరపతుల్ సొక్కి చూడ''డం కూడా ఉండడం నాడు ఈ దేశి నృత్య ప్రచారానికి - ప్రత్యేకతకు నిదర్శనం.

''గొండ్లి'' నృత్య విధానము కూడా అప్పటికే ప్రచారంలో ఉన్న దేశీ పద్ధతి ఆట ఒకటి వుంది. ''గొండ్లి'' నృత్యాన్నే మన కోలాటంతో పోల్చుకోవచ్చు ననుకుంటాను.

ఆక్కడదాకా అనవసరం-తెలంగాణములో వున్న ''బతుకమ్మ'' రాయల సీమలో వున్న ''బొడ్డెమ్మ'' నృత్యపు ఆటపాటలే ఈ ''గొండ్లియాట''కు సరిపోల్చుకోవచ్చును —

*''...గొండ్లి యాడించుచున్నారు • గొరగపడుచు
నాడుచున్న చూడు మూర్ధాభినయము
తాను నెట్టిక సీలంతగానిలేదు''—

అని చెప్పబడింది.

ఈ 'గొండ్లి' నృత్యం చాలా ప్రాచీనమూ, ప్రచారమూ అయినదని చెప్పడానికి మరొక్క ఉదాహరణ ఇచ్చి ముగిస్తాను.

---

* గొరగపడుచు—మైలారుదేవునికొలుచు స్త్రీ అని సుకవరం ప్రతాపరెడ్డి గారు పేర్కొని ఉన్నారు.

• కుండలాకార నృత్యమే గొండ్లి.

దీనిని శ్రీ సుకవరం ప్రతాపరెడ్డిగారు తమ ఆంధ్రుల సాంఘిక చరిత్ర లోనూ పేర్కొని ఉన్నారు.

"ఆ కాలపు తెలుగు వాఙ్మయంలో గొండ్లి నృత్యమును గూర్చి పలుమారు ప్రాసినారు. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రిట్లు ప్రాసినారు. "జాయపసేనాని తన నృత్తరత్నాకరములో—చాళుక్య భూలోకమల్లసోమేశ్వరుడు దానిని ప్రచారం చేసె"నని తెలిపి ఈ క్రింది ప్రమాణము నిచ్చెను:—

"కళ్యాణ కటికే పూర్వం
భూతమాతృ మహోత్సవే
సోమేశః కుతుకీ కాంచిత్
భిల్లవేష ముపేయుషీం
నృత్యంతీ మథ గాయంతీం
స్వయం ప్రేక్ష్య మనోహరం
ప్రీతో నిర్మితవాన్ చిత్రం
*గోండిలీ విధిమత్యయం
యతోభిల్లీ మహారాష్ట్రీ
గోడిగీత్యభిధీయతే"-

(:) "జానుతెనగు" ననేకదా రచనలు చేస్తానని పచించాడు నాచన సోముడు. అయితే ఈ "జానుతెనుగు" అంటే ఏది అనేది పాఠకునిలో కలిగే ప్రశ్న?

"తత్సమ తద్భవ దేశి పదజాలంతో కూడిన భాష ఆంధ్రభాష అనబడు తుందని ప్రౌఢ వ్యాకరణకర్త నిర్వచించాడు-"

"సర్వసామాన్యమైన తత్సమ తద్భవ దేశి పదజాలంతో కూడిన భాషే జానుతెనుగు అన్న నిర్వచనం"—

---

*గోండిలీ, గొండిలి—గొండ్లి

సుకవరం ప్రతాపరెడ్డిగారు—

(:)"ఆంధ్రభూమి" 1961

చూ॥ జాను తెనుగు తీరుతెన్నులు-వ్యాసం.

''ఆంధ్ర శబ్దం భాషాపరంగా తిక్కన కాలానికే వ్యవహారంలోకి వచ్చిం దని నిన్న మొన్నటివరకూ పెక్కురు భావించారు. కాని తిక్కనకు పూర్వుడైన పాల్కురికి సోమన్నయే చతుర్వేద సారంలో భాషాపరంగా ఆంధ్ర శబ్దాన్ని ప్రయోగించాడన్న సంగతి ఈ క్రింది పద్యంవల్ల తేటతెల్లమగుచున్నది.

''ఈ కృతి రచియించి యీ లోకమందు బ్ర
తిష్ఠింతు నీశ్వరాధిక్య మహిమ
నీ కృతి భావించి ఈ లోకమందు సం
పాదింతు జంగమపాత్ర మహిమ
నీ కృతి యెనరించి ఈ లోకమందు ని
ష్ఠింతు బ్రసాదనం సేవ మహిమ
నీ కృతి గావించి యీ లోకమున ప్రతి
పాదింతు బటుతర భక్తి మహిమ
నాద వృషభాంశజుడు బసనాథు
డట్టి కృతినాథు కృపచేత నిప్పుడాంధ్ర
భాష, ప్రకటింతు బద్యప్రబంధము
గను వసుధ సత్కవిసమ్మతి బసవలింగ''

దీనినిబట్టి ఆంధ్ర భాషనే తెనుగు అనుకోవడంలో బాధ ఉండదు -

వాఙ్మయ మహాధ్యక్షులు - మిత్రులు శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారి మాటలలోనే - ''జాను తెనుగంటే ఆంధ్ర భాష అన్నమాటే కదా, అంటే ఆంధ్ర భాషకూ, జాను తెనుగుకూ ఏ మాత్రం భేదం లేదన్న మాట !''

''తన భారత రచనలో తత్సమ, తద్భవ దేశి పద సమ్మిశితమైన ఆంధ్ర భాషను ప్రయోగించిన నన్నయే ఆ భాషను 'తెనుగు' భాషగా ఈ క్రింది పద్యాలలో నిర్దేశించాడు :—

''జనసుత కృష్ణద్వైపాయన
ముని వృషభాభి హిత మహాభారతం బ
బద్ధ నిరూపితార్థ మేర్పడ
దెనుగున రచియింపు మధికధీయుక్తి మెయిన్''

అలాగే మరో ఉదాహరణ :—

"సారమతిం గవీంద్రులు ప్ర
సన్న కథాకలితార్థ యుక్తిలో
నారసిమేలుసీని తరు
లక్ష్యర రమ్య తనాదరింప నా
నారుచిరార్థ సూక్తి నిధి
నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన
బంధురుడయ్యె జగద్ధితంబుగన్"—

దేశీయ రచనలు ఎన్ని రూపాలలో ఉండేవో మనం ఈ క్రింది రచన ఆధారంగా ఊహించ నగును :

వెలనాటి చోడుని బౌద్ధ గురువుతో చర్చలు జరపడానికి బయలుదేరిన పండితారాధ్యుడు వెనుక ఆయన శిష్య బృందం ఈ రకమగు పాటలు పాడుతూ ఆడుతూ వెళ్ళినట్లు పేర్కొన్నాడు - అది ఇది :—

"పదములు తుమ్మెద పదముల్
ప్రభాత పదములు శంకర
పదములు, నివాళి పదములు
తాళేసు పదములు, సంజ
పదములు, గొబ్బి పదములు
సంజ వర్ణన మణిగణ
వరన పదములు—"

ఆ మార్గాన్నే తదుపరి ఎంతో మంది అనుసరించారు. యేల పాటలను కూడా మొట్టమొదట పాల్కురికి సోమనాథుడే రచించినట్లు - ఆంధ్రలో ఉన్న ఒక నది యేలానదిని వర్ణిస్తూ పాడిన పాటయే యేల పాట అని - ఈ పరుసలే యేలలుగా వచ్చిన వని సాహిత్య రత్న శ్రీ నిడుదవోలు వెంకటరావుగారి అభిప్రాయంగా పేర్కొని ఉన్నారు.

శ్రీ వీరేశలింగం పంటి భాషో కోవిదులు ఈ 'మార్గ-దేశి' లను గురించి ఇలా నిర్వచించి ఉన్నారు: "మార్గ రచన అంటే సంస్కృత భాషా కవిత్వమనీ, దేశి రచన అంటే తెనుగు మొదలైన దేశ భాషా కవిత్వమనీ"-నుడివారు.

"తెలుగు రచనలోనే పై రెండు పద్ధతులూ - అనగా 'మార్గ - దేశి' పద్ధతులు వున్నాయని కూడా ఒకరు సెలవిచ్చారు.

ఈ యేల పాటలు అనేవి సుగ్రీవుని పట్టాభిషేక సమయంలో, వాలి సంహార సమయమున శ్రీరామచంద్రుడు వచ్చినపుడు స్వాగతం పలుకుతూ వనితలు పాడిన పాటలే అని విమర్శకుల అభిప్రాయం.

ఈ యేలలు రెండు విధములుగా కనబడుతున్నాయి.

ఒకటి : సుగ్రీవుడు శ్రీరామచంద్రునకు కానుకలు పట్టుకొచ్చిన సమయంలో చెంచితలు యేలలు పాడినారట. అవి ఇలా ఉన్నాయి :

"భానువంశమునా బుట్టి
దానవ కామిని గొట్టి
మానివరులా సన్నుతింపగా
ఓ రామచంద్రా
పూనిసుఖమూ నిర్వాహింపవా
రాతి నాతిజేసి పూడా
రాతి చేతి విల్లూ విరచి
భూతలేంద్రులెల్లా మెచ్చగా
ఓ రామచంద్రా
సీతనూ వివాహమాడినా ?
పరుపరాము భంగపరచి
భరతునకు రాజ్యమిచ్చి
గురుడుబడప నంపేవేగా
ఓ రామచంద్రా
సుకలు, భూసురుల పాలనా..."

సరే, పైన పేర్కొన్నది యేలపాటే. మరి నిమ్మనాధుని విరచితమయిన చిక్కయ్య చరిత్రలోని యేలపాటగా పేర్కొన్న ఈ కింది పాట ఇంకోలా ఉంది చూడండి...

"శరణు శరణు దేవరాయ
శరణు శరణు జన విధేయ
శరణు దేవతారాధ్యా
శరణు వేదాంత వేద్యా
ఎన్ని జన్మములను నిన్ను
ఏనుపూజ చేసినానొ
కన్నులార నిన్ను జూడ
కలిగెనే పవిత్ర మైత్రీ....."

దీనినిబట్టి యేలలు రకరకముల ఛందస్సులలో వివిధ రచయితలు రచించి ఉన్నట్లు మనం ఊహించవలసి ఉంటుంది.

సినిమాలలో జానపద గేయాలు



ఆపుమరి !

పల్లెపాటలు అంటే - సామాన్యమా ?

పల్లెజానాన్ని ఆకర్షించే, ఆకట్టుకోనే

కమ్మని పాటలు అవి. తియ్యని స్వరాలఅవి, ఆడించి, పాడించి, మనిషినీ. మనసునీ షరోలోతానికి-ఆనందజగత్తుకు ఆ లయతో, ఆ రాగంతో, ఆ బాణీతో అలా అలా తీసుకువెళ్లే సత్తా గలవి !

అవును !

అవి జానపద గేయాలు ! పల్లెప్రజల ఆలోచనలకు; జాతిజీవన ప్రస్థానంలో అడుగడుగునా క్షణక్షణానికీ వినిపించే మధుర కవితలు అవి

అందుకే - సినిమాలలో ఆ పాటలకో ప్రత్యేకత - ఆ బాణీలకోస్థానం - ఆ భాషకూ భావాలకూ ఓ పీట !

అటువంటి మధుర కవితలు కొంత కాలంపటకూ జనం నోళ్లలోనే ఉండిపోయాయి. ప్రస్తుత కాలంలో సినీకవుల ధర్మమూ అని ఇవి కాస్త భాష, ఓ కాస్త భావం అటూఇటూగా సినిమాలలో చోటు చేసుకోవడం ఈ సాహిత్యం చేసుకున్న పుణ్యమనే చెప్పాలి.

అందుకు ఈ జానపద సాహిత్యమనే మధుర కవితలను సినిమాలలో పరిచయం చేసిన, చేస్తున్న రచయితలకు మనం ధన్యవాదాలు అందించాలి కూడా.

ఇక్కడ ఒక విషయం ప్రధానంగా గమనించాలి.

సినిమా–అది హిందీ అయినా, తెలుగు అయినా సంగీత బాణీలు సైతం జానపద ఫణితులలో రూపుదిద్దుకొని బాగా పాప్యులర్ అయిన సందర్భాలు చాలా ఉన్నాయి.

అదే ఈ సాహిత్యం గొప్పతనం!

* ఆటువంటి మధుర కవితా ప్రపంచంలోని మీగడ తరగలను సినిమాలు ఎలా జుర్రుకొన్నాయో మిత్రుడు రెడ్డిమల్ల స్వర్ణకుమార్ 1974 జనవరి 1 సంచిక ''చలనచిత్ర''లో ఒక వ్యాసరూపంలో రూపొందించారు. దాని ఆధారంగా కాస్త అటూఇటూగా దానిని ఇక్కడ పాఠకుల అవగాహన కోసం పొందుపరుస్తున్నాను.

ఇటు పల్లెటూళ్ళలోనూ అటు పట్టణాలలోనూ ప్రజల్ని ఉర్రూత లూగించిన 'దసరాబుల్లోడు' లోని పాట —

"పచ్చగడ్డి కోసేటి
పడుచుపిల్లోయ్–నీ
పైట కొంగు జారిందే
పడుచుపిల్లా"

ఈ పాట కొన్ని దశాబ్దాలకు పూర్వమే పల్లెటూళ్ళలో సృష్టింపబడి, యువ రసికుల నోళ్ళలో నానింది. పై పాటకు ఆధారం :

"పచ్చగడ్డి కోసేటి
పచ్చని పిల్లా
పమిటకొంగు జారిందే
పలుచని పిల్లా"

(మధుర కవితలు - 'ఎల్లోరా' సంకలనం - పేజీ 152) చూడండి ఎంత చిన్న చిన్న మార్పులతో ఎంత రక్తి గట్టిందో :

తరువాత 'ప్రేమనగర్' లోని రచన.

చూ॥ 1974 జనవరి–1. "చలనచిత్ర"

"ఉంటే ఈ పూళ్ళో వుండు
పోతే మీ దేశం పోరా''

ఈ పాటను మునుపు పల్లెటూళ్ళలో ఈ క్రింది విధంగా పాడుకొంటుండే వారు.

పోతే పొరుగూరికి పొరా
చుట్టుపక్కలా పల్లెల యుంటే
చూడకుండ వుండలేను"
కూలికి పోతే నాకేరా రా
నీలికి పోతే నాకేరా రా
.....
గూటుమీనినె కూకుండి పెడతా
కూడువండీ నీకే పెడతా

(మధుర కవితలు-పుట 287) కానీ 295 వ పేజీలో ఇలా వుంది:

ఉంటే ఈ వూళ్ళో వుండు
పోతే పొరుగూరికి పోరా
సుట్టుపట్ల ఏ మూలన వున్నా
సూడక నా మనసుండదు
ఎంకటసామి॥

మునుపు చెప్పినట్లుగా నూతన పదజాల మార్పులతోను, వాతావరణం మార్పులలోను దశాబ్దాల తరబడి రకరకాలుగా మారిపోవటమంటే - ఇదే.

సినిమా అనుకరణకు దాని మూలానికి వున్న పోలిక పై పాటద్వారా స్పష్టమౌతుంది. అమూ ముక ప్రజావాహినిలో దొర్లిపోతున్న ఇటువంటి పాటలకు సంగీత రూపం ఇచ్చి సర్వ జనుల కందించి నట్లయితే ఇటువంటి పాటల విలు వెంత హెచ్చవుతోందో పై పాట స్పష్టం చేస్తోంది. ఇలాటి గేయాల్ని పరిచయం చేసేందుకు, ఆకర్షణీయంగా తీర్చి దిద్దేందుకు ఒక్క సినిమాలే రాచమార్గ మని పిస్తోంది.

"చిల్లర రాళ్ళకు
మొక్కుచునుంటే
చిత్తము చెడిపో(వు)న
ఒరే ఒరే

మధుర కవితలు —ఎల్లోరా పుట)

పై పాటకు "పూలరంగడు" తో సినిమా అనుకరణ ఈ క్రింది విధంగా వుంది.

చిల్లరరాళ్ళకు మొక్కుతు వుంటే
చెడిపోదువురా ఒరేఒరే

.....

పచ్చని పొలాన్ని చూసి ప్రతి కర్షక హృదయంలో పొంగే ఆశ గేయ రూపంలో—

"వాసలు కురవాలి
వరిచేలు పండాలి
మా గాదె నిండాలి
మా దాసి దంచాలి."

మధుర కవితలు —ఎల్లోరా పుట : 94)

పై పాట "అల్లుడే మేనల్లుడు" లో పై రెండు పాదాల నలాగే వుంచి చివరి రెండు పాదాల్ని క్రింది విధంగా మార్చారు :

"మా ఇంట మహలక్ష్మి
చిందెయ్యాలి."

"చింతచెట్టు చిగురుచూడు
చిన్నదాని పొగరుచూడు" 'అదృష్టవంతులు'లోని చిత్రంలోని పాట.

జానపద వాఙ్మయంలోనిదే యుపకథలు పొడుతుండేవారు :

చింతచెట్టు చిగురూ చూడు
చిన్నదాని పొగరూ చూడు

అద్దములో నీడా చూడు
ఇద్దరికీ జోడూ చూడూ
(మధుర కవితలు -ఎల్లోరా పుట 377)

చక్కని రూపకల్పన చేసిన అదే చిత్రంకోసమని :

"నా మగడు వాడకెళ్ళి
నాకు తోడు ఎవరులేరు
కోడికూసే వేళదాకా
తోడురారా వన్నెకాడా"

పై చరణంలోని చివరి పాదాల్ని పల్లవిగా మార్చారు.

"కోడికూసే జాముదాకా
తోడురారా చందురుడా"

ఇకపోతే "మొక్క జొన్న తోట"లో అనే పాట కూడా ఈ కోవకు చెందినదే.

తెలుగు సాహిత్య నందనంలో మహోన్నతమైన స్థానాన్నేర్పరచుకొన్న కీ॥ శే॥ నండూరి వెంకట సుబ్బారావుగారి "ఎంకి పాటలు" (8వ పేజీ)లోని.

"నీతోటె వుంటాను నాయుడు బావా
నీ మాటె యింటాను నాయుడు బావా

అనే పాటకు 'జమీందార్'లో ఇలా వుంది :

"నీ తోటె వుంటాను నీలగిరి బావా
నీ మాటె వింటాను మాటకరిబావా"

"విజయం మనదే" చిత్రంలో ఒక పాట చరణాల్లోని--

"ఎవ్వరో నవ్వినట్టున్నాది
ఎందుకో గుండె ఝల్లుమన్నాది"

"ఎవ్వరో నడిచినట్టున్నాది
ఎందుకో గుండె ఝల్లుమన్నాది" వింటూంటే "యెంకి" పాట

"నా యెంట యెవ్వరోను
నడిసినట్టున్నాది"
''నా యెనక యెవ్వరోసు
నవ్వినట్టున్నాది"

జాపక మొస్తోంది.

ఇక పండుగలకు సంబంధించిన పాటల్లో ప్రధానమైనవి. ఇవి ఎక్కువగా పల్లె ప్రాంతాల్లో గోచరిస్తాయి.

''అట్లతద్దోయ్
అరట్లోయ్
ముద్దపప్పోయ్
మూడట్లోయ్

మధురకవితలు ఎల్లోరా పేజీలోని ఈ వాక్యాల్ని పవిత్రబంధంలో ''ఆటల నోము..." అనే పాటకు సాకీగా వుపయోగించు కొన్నారు. వుయ్యాల పాటలు ఎక్కువగా 'బ తు క మ్మ' పండుగలో పాడుకొంటారు. దీన్ని ఆధారంగా ''జీవితచక్రం"లో ఈ విధంగా రచించారు :

"బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు గౌరమ్మ ఉయ్యాలో"

అలాగే తెలంగాణా ప్రాంతాల్లో కానవచ్చే "జిల్లాయిలు - కవ్వింపులు'' అనే ప్రాతిపదిక ఆధారంగా ''రైతు కుటుంబం" లో ''జిల్లాయిలే-జిల్లాయితే" అనే పాటను సృష్టించారు.

''వేళ జూడ వెన్నెలాయె'' అనే నాటకాల రాయుడులోని విరహ గీతి కను పల్లెటూళ్ళలో సరసంగా పాడుతుంటారు :

''వేళ జూడ వెన్నెలాయె
వెండికట్ల కిన్నెరాయె
పుల్లెపూల పండిరాయె

వయ్యారి రాయె-మన
నవ్వులోనే తెల్లవారునూ !"
(మధుర కవితలు - ఎల్లోరా పుట...278)

రాయలసీమలో ఇప్పటికీ పాడుకొనే ఒక హాస్యగీతిక

"ఎక్కడమామా బండెక్కడమామా

.....

ఎక్కడ బండి దిగొద్దుమామా
ఎనకకు ముందుకు చూడొద్దు మామా"

"అన్నదమ్ములు" చిత్రంలో వినిపిస్తుంది.
'అమ్మమాట' చిత్రంలో 'మాయదారి సిన్నోడు' అనే పాట, 'జీవితం'లో

"మామిడి తోపుల్లోనా మాపటేల మాటేసి

.....

మాయచేసి పోతివిరో నాగులూ-నా
మాట మరిచిపోతివిరో నాగులూ"

ఇవి కూడా జానపద వాఙ్మయం లోనివే. "భార్యబిడ్డలు" లోని "చెల్ మోహన రంగా" అనే వూతపదం పల్లెల్లో ఎంతో ఖ్యాతి గడించుకున్నదే.

అలాగే 'గణనాథా' అనే వూతపదాన్ని "డబ్బుకు లోకం దాసోహం" చిత్రంలో టైటిల్ సాంగ్‌కు ఉపయోగించుకున్నారు.

"కథానాయకుడు" లోని గీతం:

"పళ్ళండి పళ్ళండి పళ్ళు
జామపళ్ళు, జామపళ్ళు"

ఇది పళ్ళమ్మే 'అమ్మ' పాటను స్ఫురింపజేస్తోంది.

"పళ్ళమ్మ పచ్చేను పళ్ళు
మంచి పరుపు కొచ్చిన
జామిపళ్ళు"

దీన్ని చదువుతుంటే 'ఆస్తులు-అంతస్తులు' చిత్రంలోని ''రేగుపళ్ళ'' పాట జ్ఞప్తికొస్తోంది.

జానపద గేయాలను - తుమ్మెద పదాలు, వెన్నెల పదాలు, ఏలపాటలు, కిన్నెర పాటలు...ఇలా రకరకాలు విభజించారు. ఈ తుమ్మెద పాటకు సంబంధించినదే ''అక్కా-చెల్లెలు'' చిత్రంలో వుంది.

''పాండవులె పాండవులె తుమ్మెదా
పంచపాండవులోయమ్మ తుమ్మెదా''

ఇది సాధారణంగా పల్లెల్లో నాట్లు వేయునప్పుడు, కలుపు తీయునప్పుడు పాడుకొంటారు. ఇదే పాటను ''కదలడు వదలడు'' చిత్రంలో ''ఎండావానా-వెన్నెల'' అనే పాట (కోరస్)కు చరణంగాడి పయోగించారు.

ఇవన్నీ మన చిత్రసీమలో జానపద గేయాల్ని రెండు తెగలుగ విభజించితే, వానిలో రెండవ తెగకు చెందినవి.

''తాత-మనవడు'' చిత్రంలోని గేయం-

''రాయంటి నా మొగుడు
రంగమెల్లి రాలేదు''

ఇది ''మన జానపద గేయాల్లో శృంగారం.''

''ఒకనారి వందతుపాకులు'' లోని ''చింతచెట్టు నీడవుందిరా-ఓ నాయుడు బావా'' ఇది కూడ పక్కా జానపద వాజ్మయానికి సంబంధించినదే.

''పసిడిమనసులు'' లోని ''వొద్దంటే ఎల్లాను మంగళగిరికి అమ్మ వొదంటే ఎలాను మంగళగిరికి'' వింటుంటే-

''నే నెరక్కపోతినే గోంగూరకు నే నెవరితోను చెప్పకుంట గోంగూరకు'' అనే పాతకాలం పాట గుర్తొస్తోంది.

కానీ ఈ పాటను చూస్తుంటే మరో పాట వినిపిస్తుంది.

''ఎందుకో ననుకొంటి గోంగూరకు-నే
నెందుకో ననుకొంటి గోంగూరకు''

ఇలాంటి జానపద గేయాలకు సంబంధించినదే ''విచిత్ర దాంపత్యం'' లో ''నీలాల నింగిపై చందమామ'' అనే పాటకూడా. ''మానవుడు దానవుడు''లోని

"కొప్పుచూడు కొప్పందంచూడు''

ఈ పాట మన జానపద గేయాల్లో శృంగారం.

ఈ పాటను కొద్దిమార్పులతో సన్నివేశానుగుణంగా మార్చుకొన్నారు. ఈ పాటను వింటుంటే ''జగదేక వీరుడు'' లోని-

''కొప్పునించా పువ్వులేమె కోడల కోడల'' పాటకు దానికీ చాలా దగ్గర పోలికుందనిపిస్తోంది.

ఇదే చిత్రంలో

''కంచెకాడ మంచెకాడ...'' అనే పాటకూడా ఈ జానపద గేయాల కోవకు చెందినదే.

ఇహపోతే అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికీ మరువలేని ''రోజులు మారాయి'' లోని-

''ఏరువాకా సాగారో రన్నో చిన్నన్న-''

పక్కా పల్లెపాటేనని స్పష్టమవుతూంది. వుదాహరణ :

''ఏరువాకమ్మా ! మా
కెదురు రావమ్మా''

. . ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కకు మిక్కిలి ఉన్నాయి. కనీసం ఇప్పుడు ఉదహరించిన పై వానిని బట్టి చూస్తే మన జానపదగేయా లెలాంటివో, వాని రూప కల్పనలు ఎలాంటివో, వాటిని మన తెలుగు ప్రేక్షకులు, శ్రోతలు ఎలా ఆదరించారో స్పష్టమౌతోంది. కాబట్టి జానపద గేయాలు సినిమా ద్వారా చాలా హిట్టపు తాయని నిర్మాతలకు భరోసా ఇవ్వవచ్చు. ఇప్పుడొచ్చినవి ఏమంత పెద్దమొత్తం కాకపోయిన - ఫర్వాలేదనిపిస్తోంది. కానీ ప్రతి చిత్రంలోనూ కనీసం ఒక్క జానపద గేయాన్నైనా విసపలసి వచ్చే రోజు వచ్చినందుకు జానపద వాఙ్మయ పరిశోధకుడుగా నా కెంతో ఆనందంగా ఉంది.

సినిమా పాటలలో అధికంగా కన్పించేది జానపద గీతాల ప్రభావం. చాల వరకు జానపద గీతాల పల్లవులు సినిమా పాటల పల్లవులుగా మారి చరణాలు సినిమాలోని కథా సందర్భానికి అనుగుణంగా మారుతుంటాయి. కొన్ని జానపద గీతాల చరణాలుకూడ సినిమా పాటలలో కన్పించకపోవు. బాల మిత్రుల కథలోని ఈ పాట చూడండి.

పుట్టమీద పాలపిట్టోయి నా సామి
పట్టబోతే తేలుకుట్టిందోయ్.

రెండవ చరణం :

మంతరించే మొగాడుంటే నా సామీ
మందుపూసే మొనగాడుంటే
నా సామీ
వాగుసేపా సింతసిగురూ
వండిపెడతానోయ్
ఆ కూరలోనా వలపంతా
కూరిపెడతానోయ్.

దీనికి మూలమయిన జానవద గీతం ఇది :

పుట్టమీద పాలపిట్టోయ్ నా సామి
పట్టబోతే తేలు కుట్టేనోయ్
మంతరించే జానలుంటే నా సామి
మల్లెమొగ్గా పానుపేదూ నోయ్.
నేల నేలా నెల్లికూరోయ్ నా సామి
పాలపాలా బులుసు కూరోయ్
వాలుగొమ్మా చింత చిగురోయ్ నా సామి
వండి పెడితే వలపు తీరెనోయ్.

ఇలా సాగుతుందీ గీతం (మధుర కవితలు–ఎల్లోరా : పుట 237).

అయితే జానపద గీతంలోని మల్లెమొగ్గ పానుపు ఆకర్షించినట్లు, సినిమా పాటలోని 'వాగుసేప సింతచిగురు' కూర పాఠక శ్రోతల మనస్సుల నాకర్షించ లేదు.

ఆజన్మ బ్రహ్మచారిలోని "ఓ వాలుచూపుల మువ్వ వెంకటసామి నిన్ను నేను మరువజాలరా" ఆనే పాట పల్లవి జా న ప ద గీతమే. ఇలాగే బంగారు బాటులోని 'చెంగావి ర ం గు చీ.ర' అ నే పా ట ప ల్ల వి కూ డా జానపద గీతమే. చెంగావి రంగు చీర మీద తెలుగు ఆడపడుచులకు ఎనలేని మోజు. ఈ మోజు ఈనాటిది కాదు. దాదాపు రెండువేల సంవత్సరాలనాడే ఆంధ్ర చక్రవర్తి హాలుడు గాథాసప్తశతిలో ఈ వి ష యం తెలిపాడు. చెంగావి అన్న పదంలో చెన్ను, కావి అనే రెండు పదాలున్నాయి. వాటికి అందమైన ఎరుపు అని అర్థం చెప్పుకోవచ్చు. పై పాటలోనేకాక మరొక రెండు పాటలలో కూడ ఈ చెంగావి చీర కనబడుతుంది.

''అల్లనేరేడు చెట్టుకాద అమ్మలాలా'' ''చింతాచెట్టు నీడవుందిరా ఓ నాయుడుబావ చినదాని సోకుచూడరా'' (ఒకనారి-వంద తుపాకులు) అని సాగే పాటల పల్లవులుకూడా జా న ప ద గీతాలను ఆధారం చేసుకొని రచింపబడినవే. భక్త తుకారాంలోని '' సువ్వి సువ్వన్నాలె సువ్వన్ననాలె,'' అన్న దంపుడు పాట, ''జాజిరి జాజిరి జాజిరి'' అని సాగే తిరగలిపాట జా న ప ద గీతాలుగా ప్రసిద్ధి చెందినవే.

'నందమయా గురుడ నందామయా ఆనందజ్యోతికి నందామయా' అన్న బ్రహ్మంగారి త త్వ ం ఇదిపఠలోనే సినిమా పాటకు పల్లవిగా తయారయింది.

సీమలలో విని పించిన జానపద గేయాల వివరాలను డాక్టర్ జి. లింగా రెడ్డి అనే మిత్రుడు కరీంనగర్ రాసి పంపిన వాటిని పరిశోధనా రచయితలకు అందుబాటులో ఉండడానికి యథాతథంగా ఇక్కడ ఇస్తున్నాను.

1.	రాయంటి - తాతా మనపడు - తె. జా. గీ. బిరారా.		పేజీ	460
2.	ఉంటే ఈ టిరిలోవుండు - ప్రేంనగర్	,,		539
3.	ఉల్లిపూల పడవగట్టి - పాప కోసం	,,		541
4.	పలచీనాదమ్మా - భార్యా బిడ్డలు	,,		541

5. వేల చూడ వెన్నెలాయే ,, ,, 342
6. కోడి కూత జాముదారే - అదృష్ట పంతులు - ఎల్లోరా 37
7. కాళ్ళాగజ్జ కంకాలమ్మ – తిక్క శంకరయ్య ,, 37
8. పచ్చగడ్డి కోసెటి - దసరా బుల్లోడు ,, 152
9. నిరా నిరాబండి - మంచి కుటుంబం ,, 142
10. సిన్నీ నా సిన్నీ - జీవన జ్యోతి ,, 141
11. మంగమ్మా – జమీందారుగారమ్మాయి ,, 140
12. జంబైలే జోరులంగరు - (గుర్తులేదు) ,, 259
13. కొత్త కుండనీరు తీపి ,, ,, 290
14. ఓ పోలీసెంకటసామి - మంచిమనిషి 296
15. నాయుడోల్లింటికాడ - మంచి మనుషులు ,, 312
16. ఓడెల్లి పోతుంది - సిపాయి చిన్నయ్య ,, 313
17. పడవెళ్ళిపోతున్నది - భక్తకారాం ,, ,,
18. సిరిమల్లె చెట్టుకింద - చందన ,, 636
19. కామూడా కామూడా - పిల్లా పిడుగా ,, 548
20. ఆకులు పోకలియ్యకురా – భార్యా బిడ్డలు
21. రారా నా యింటికి - దొరబాబు
22. చింత పువ్వెరుపు - ఇంటి గౌరవం
23. పొన్నపూలా వుయ్యల - చందన
24. నందామయా గురుడా - జీవనతరంగాలు
25. ఉడుతా ఉడుతా హుత్ - ,,

"చిలుకల్లు చిలుకల్లు ఆడురేగాని
చిలుకలకు రూపేమి ? పలుకులేగాని !"

— ఇదీ ఒక సినిమాలో వినిపించిందే.

ఇది చాలా ప్రచారంలో ఉన్న జానపదగేయం.



వీరగాథలు

ప్రతి గ్రామానికీ ఓ స్థానిక గాథ. లేదా ధీరుడు కనిపిస్తారు-వినిపిస్తారు. కులం పేరున వచ్చే చిన్న చిన్న పోరాటాలోనూ, లేదా మతం అనుకొందాం - లేదా జాతి అందాం - దేముడు మీద పేచీ, భాష మీద ఘర్షణ, మతం పేరిట కొట్లాట, స్త్రీ పేరున రక్షలు - ఇలాంటి చిన్న చిన్న సమస్యలు రాజిరాజి పుండి, రగులుకొని, గ్రూపులుగా పర్టాలుగా జరి చీలి, యుద్ధాలు చేసి ఆయా ఘర్షణల్లో వీరమరణం పొందిన ఆయా వీరులను పొగడుతూ, ఆరాధిస్తూ, స్మరించుకొంటూ గాథలుగా, కథలుగా హత్తుకొని పాడుకొనే వీరగాథలు వీరుల గేయాలు చాలా ఉన్నాయి; ప్రచారం పొందాయి.

బొబ్బిలి యుద్ధం, పల్నాటి పోరాట గాథలు - ఇలాగే ఎన్నో కథలూ, గాథలు, గేయాలు వీర రస ప్రధానము లయినవి ఎన్నో ఉన్నాయి.

* ''ప్రపంచపు ప్రముఖ సాహిత్యము లన్నింటియందు వలెనే, తెలుగు సాహిత్యమునను 'వీర గాథలు' ఒక ప్రత్యేక ప్రక్రియగా జనానీకపు ఆదరణను, అందును ముఖ్యముగ జానపదుల మన్ననను విరివిగా ఆర్జించినవి. ఈ విషయమున తెలుగు సాహిత్యమునకు సంబంధించి నంతవరకూ ఒక ప్రత్యేక విశిష్టత కన్పట్టు చున్నది. తక్కిన ప్రపంచ సాహిత్యములలో ఎచటను ఈ సాహిత్య ప్రక్రియ అగ్రశ్రేణికి చెందిన కవులను ఆకర్షించినట్లు కన్పట్టదు. కాని తెలుగు దేశపు మేటి కవులలో ఒకడుగా చారిత్రక ఖ్యాతిని ఆర్జించి, కవి సార్వభౌముడుగా ప్రశంసితు డైన శ్రీనాథునంతటి వానిని ఈ 'వీర గాథా ప్రక్రియ' ఆకర్షించినది...'' అని ప్రఖ్యాత సాహితీ పరులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు పేర్కొన్న విష యాన్ని గమనించవలసి ఉంటుంది.

• ''అసలు ఈ ఫోక్‌లోర్ (FLOK LORE) శబ్దం ఇటీవలి వరకును ఒక్క జానపదుల ఆచార వ్యవహారములకు మాత్రమే పరిమితమై యుండెడిది. కాని, నేడు దాని అర్థము అతి విస్తృతమై, జానపదులకు సంబంధించిన ప్రతి విషయమును సమీకరించుకొని జానపద సాహిత్యమును కూడా కలుపుకొని ఒక మహా సాగరమైనది'' అంటారు, డాక్టర్ రాళ్ళపల్లి సుందరం.

''Internal Encyclopaedia of the Social Sciences చక్కగా చెప్పున్నది. ''Folklore means folk learning; it comprehends all knowledge that is transmitted by word of mouth and all crafts and techniques that are learned by imitation or example as well as the products of these crafts.'' ''Folklore includes folk art, folk crafts, folk tools, folk costume, folk music, folk

---

* చూ॥ కాటమరాజు కథలు, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి తొలి పలుకు.

• చూ॥ ఆలిచిప్పలు - ఆణిముత్యాలు.

dance, folk games, folk gestures and folk speech as well as those verbal forms of expression which have been called folk literature but which are better described as verbal art.'' 1

* ''పదకొండో శతాబ్దం నాటిది నన్నయగారి కవిత్వం, అంతకి ముందు అయిదారువందల ఏళ్ళనుంచి శాసనాల్లో అగుపిస్తున్నది తెలుగు కవిత్వం. ఇంకా వేలాది సంవత్సరాల నాటివి పల్లె పాటలు. తెలుగు జాతి పుట్టుకతోనే పుట్టినవి. చరిత్ర కందని యుగాల నాటి పాటలు ఈ నాటికిన్నీ జీవిస్తున్నాయి. అందుకే Andhra Folk-Songs are Irresistibly alive some of them surely go back to the prehistoric days'' అంటారు దేవేంద్ర సత్యార్థి.

(By Folklore it is meant) ''those materials in culture that circulate traditionally among members of any group, in different versions, whether in the oral form or bymeans of customary examples''.

—Jan Harold Brunvand, The Study of American Folklore.

ఇక్కడమనం మరొక ముఖ్యాంశాన్ని పరిశీలనలోకి తీసుకోవలసిన అవసరమూ అగత్యమూ ఉంది.

• అదే డాక్టర్ తంగిరాల వెంకట సుబ్బారావుగారు సవిపరంగా తమ వీరగాధల్లో పేర్కొన్నారు.

---

1. International Encyclopaedia of the Social Sciences. Pages 496-97
2. Same page 497. (అదే పుట 49⁻)
   * చూ॥ MEET MY PEOPLE
   •చూ॥ వీరగాధలు డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావు.

''ఇటీవలికాలమున కొందరు విమర్శకులు జానపదులు తమ నిత్యజీవితములో ఉపయోగించెడి వస్తుపరికరములను కూడ జానపద విజ్ఞానములో చేర్చవలసిన ఒక ముఖ్యాంశముగా పరిగణించుచున్నారు. దీనినే వారు జానపదుల భౌతిక సంస్కృతి లేదా వస్తుసంస్కృతి అనుచున్నారు. దీనిని పూర్వవిమర్శకులు విస్మరించియున్నారు.

* "Folklore (is the) generic name used to denote those traditional beliefs, superstitions, customs and observances of ordinary people which have persisted from earlier into later periods...,in some cases down to the modern times. Folk tales, traditional ballads, folk songs and proverbs also come under this heading and, by a recent extension of meaning, certain aspects of material culture originally excluded by definition."

ప్రపంచ పరివ్యాప్తంగా వీరులూ, వారి సాహసగాథలులేని దేశం, చోటు అంటూలేదు. ఇంతకుముందే నేను పేర్కొన్నట్లు దేశాలేమిటి, ప్రతిగ్రామానికీ ఓవీరగాథ వినిపిస్తుంది. డెన్మార్క్, పోర్చుగీసు, సిసిలీ, స్పెయిన్, స్కాట్లెండ్ మొదలయినచోట్ల సాహిత్యం అంతా వీరగాథలమయం.

మనదేశానికివస్తే - అందరికీ తెలిసిందే - రాజస్థాన్ వీరులకు పోతుగడ్డ అనడంలో అతిశయోక్తి కానరాదు. అలాగే మన ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎన్నో వీరగాథలు ఉన్నాయి.

మన రాష్ట్రానికేవస్తే ఓ బోలెడుగాథలూ, గాథలూ!

వీరగాథా నిర్వచనమును గురించి డాక్టర్ తంగిరాల ''జానపదగేయ రూపమున నుండి, వీర రస ప్రధానమగు కథను చెప్పుచు, సంచారగాయక భిక్షువులచే పాడబడు సరళకథా గేయమే వీరగాథ- అని తెలుగున నిర్వచింపవచ్చును.

---

* Encyclopaedia Britannica Vol. 9,P-513.

బొబ్బిలి కథ, దేశింగురాజు కథ, ముగ్గురు మరాఠీల కథ, సర్వాయి పాపడు కథ మొదలయినవి దీనికి చక్కని లక్ష్యములు''- అంటారు.

జనంకోసం, సమాజంకోసం పోరాటాలు జరిపి వీరమరణం పొందినవారిని గురించిన కథలూ, వారి గొప్పతనాన్ని చాటే పాటలూ చాలాచోట్ల మనం వింటూంటాం.

నిజాం రాజరికంపై పోరాటం జరిపి రక్తతర్పణచేసిన వారిని గురించి ఈ కాలంలో చాలా పాటలు వచ్చాయి.అందులో ఇవీ జానపద గేయాలే? అన్నంత పట్టుగా సాగినవీ ఉన్నాయి. అయితే వాటిని జానపద సరళిలో సాగిన అధునాతన రచనలుగా మనం గుర్తించాలి.

పూర్వకాలంలో గ్రామాలను దోచుకొనే గుంపులు ఎక్కువ. దానికి సాయం భూస్వామ్య జమీందారీ అహంకారపు చలాయింపు. బలవంతపు చాకిరీ, అన్యాయంగా పన్నుల వసూలు, వీటిని ధిక్కరించి ఎదురునిలచి ప్రాణార్పణ గావించిన అజ్ఞాత వీరులను స్మరించుకొంటూ ఆయా ప్రాంతాలలో పాటలుగా కట్టి పాడుకోడం వింటూన్నదే. తమకు ఇష్టం లేకపోతే ఎదురు తిరిగి కత్తులు కరకర లాడించే పల్లెజీవితాలు ఇష్టమైతే నెత్తిన పెట్టుకు పూజిస్తాయి– అటువంటి వీరుల అజ్ఞాత గాధల పాటలు చూదాం.

గుర్రాల గోపిరెడ్డి పేరు చాలా ప్రచారంలో ఉంది. ఇతడు చండ శాసనుడని ప్రతీతి. ఓ ధైర్యవంతుల గుంపు ఇతగాడిని చేను గట్టున చిత్రపధ చేసి పగతీర్చుకొందని అంటారు.

ఈ చండశాసనుని ఆకారం అహంకారం ఎలాటిదో ఈ పాట చెబుతూంది. ఎంత దుష్టుడైనా కన్న తల్లికి ప్రేమ ఎక్కడకి పోతుంది పుడి. అందుకే తల్లి తలుచుకు తలచుకు ఏడుస్తుంది.

బాధల కోర్వలేని ప్రజ బాధతో ఏడిస్తే, కొడుకు కోసం తల్లి ఏడ్పు.

ఓ గుర్రాలా గోపిరెడ్డి
దాచేపల్లికి దానమైతివా !

శేరు శేరు ఎండిమురుగులు
చేతులాకూ బెట్టుకోని
కట్టమీదా వస్తావుంటే
కలకచేరనుకొంటిని కొడకా ॥పి॥
వయ్యారి కొడకా
బంగారు కొడకా
దాచేపల్లికి దానమైతివా ॥పి॥
ఆ ప్రక్క ఒక చేను
ఈ ప్రక్క ఒక చేను
నడుమ నాపచేను
సందున నిను నలుగురు బట్టి
నరికిరి కొడకా వయ్యారి కొడకా
చిన్నారి కొడకా
దాచేపల్లికి దానమైతివా
ఓ గుర్రాలా గోపిరెడ్డి
దాచేపల్లికి దానమైతివా !
ముందార మూడు బళ్లు
ఎనకాల ఏడు బళ్లు
ఏ బండిలో ఉన్నావు కొడకా
బండోడు గురువులన్నా
తోడోళ్ళు వెంటనేరు
తమ్ముళ్ళు ఎంటనేరు
పాలేళ్ళు ఎంటనేరు
ఒంటారిగాను పోకు
బండోడు గురుపులన్నా-
నీ బండిమీద ఆన
నీ ఒంటిమీద ఆన
ఒంటరిగాను పోకు
తంటాలుపూడ వాళ్లు
బండోడు గురుపులన్నా—

నీ పంట పొలముతోడు
నీ పాడి పశువుతోడు
ఆ పశుబలము నమ్మబోకు
బండోడు గురువులన్నా !

— పది బళ్ళనిండా జనంతో బయలుదేరిన కొడుకుని తల్చుకుని — ఏ బండిలో ఉన్నాడో అని బాధపడుతూ పశు బలాన్ని చూసి నమ్మకు సుమా అని వాపోతూంది తల్లి.

గుర్రాల గోపిరెడ్డి జనానికి అన్యాయాలు చేస్తే మరణించాడు. నందిరెడ్డి కామ పిశాచంతో బలవంతంగా చంపబడ్డాడు.

చందమామలాంటివాడే నందిరెడ్డి. అయినా గుణం కూడా కావాలిగా !

రాజా మా నందిరెడ్డీ
నీ కిలలో బ త్తెము తీరేనా— ॥రా॥
కొడుకా మా నందిరెడ్డీ
మల్లు పంచకట్టుకోని
నల్లకోటూ తొడుక్కొని
పల్లెగాడను కొంటిరా
కొడుకా మా నందిరెడ్డి !
కట్టమీదా పోతావుంటే
కలకటేరనుకొంటిని కొడకా !
రాజా మా నందిరెడ్డీ
నీ కిలలో బ తెము దీరేనా ?
నున్నంగా తలదువ్వి
నూగాయ జడవేసి
సందువెంట బోతావుంటే
సందమామనుకొంటిని కొడకా!
వచ్చిపోయే దోవలోనా
దానిమ్మా చెట్టు కిందా

వెండికుచ్చే నేలబడితే
ఏటుకే తెగనరికిరన్నా
రాజా మా నందిరెడ్డీ
నీ కిలలో బత్తెము తీరెనా !

—పూర్వ కాలంలో తన కొడుకు కలక్టరంత కావాలనీ, కలెక్టరులాగా ఉన్నాడనీ మురిసిపోడం పరిపాటి—దీనినే గుర్రాల గోపిరెడ్డి, నందిరెడ్డి పాటలు సూచిస్తున్నాయి—ఇది అంతా ఆ రోజుల్లో సంగతి.

మల్లన్నమీద ప్రజలకు చాలా కోపం, పగ ఉన్నట్టుంది. దానికి వారు మల్లన్నని చిత్రవధ చేయకుండా గోరీ కట్టారు.

''ఓరోరి మల్లన్నా
బొమ్మనిపాటి మల్లన్నా
పాలోడై పుడితివిరా
బొమ్మనిపాటి మల్లన్నా
పగదారై పుడితివిరా
బొమ్మనిపాటి మల్లన్నా
నీ తండ్రి చావంగా
నీ తల్లి చావంగా
నా సేతు లేసిరిరా
బొమ్మనిపాటి మల్లన్నా
బండికీ కట్టుండూ
యల్పటకాడు చంద్రిగాడు
దుమ్మేపాడచిరా
బొమ్మనిపాటి మల్లన్నా
బోరు బోరు బాగు
డొల్లా కాసోడు కొట్టిన
కక్కూసపు రాళ్ళల్లో
నీ గోరి కట్టిరిరా
బొమ్మనిపాటి మల్లన్నా''

— పాటలో వచ్చే పదాలను బట్టి సుమారుగా కాలం, మండలం నిర్ణయించుకోవచ్చును. 'కకూ్కసు' అన్న పదం ఇంగ్లీషు పాలకుల పలన వచ్చింది గాన ఈ సంఘటన అప్పటిదై ఉండవచ్చును. 'పకోడీలు', 'బత్తాయి', 'లోలకులు' లాంటివి—అవి వచ్చాకనే కదా పాటల కెకా్కయి.

వీరుల కథలూ, వీరగాధాతత్వాన్ని గురించి పాశ్చాత్య విమర్శకులు చాలా నిర్వచనాలు ఇచ్చారు.

* "BALLAD శబ్దము BALLARE అను లాటిను శబ్దమునుండి పుట్టింది. దీనికి మొదట నృత్తగీతము (DANCE SONG) అను అర్థము వున్నను, నేడు ఆ అర్థము నశించి "గేయ రూపమున్ననున్న కథ" అను అర్థము వ్యాపించియున్నది.

"BALLAD అనునది బాహ్యరూపమున Lyricను, అంతర స్వరూపమున Epicను పోలియుండునని పాశ్చాత్య విమర్శకులు నిర్ణయించారు."

వీరగాథల ఉత్పత్తి కర్తృత్వములు వివాదగ్రస్తమైనవి. పాశ్చాత్య విమర్శకులలో కొందరు వీరగాథలు అతిప్రాచీన కాలమున జానపద సంఘములచే నృత్యమునందు అశువుగా సృజింపబడినవని సిద్ధాంతము చేసినారు.

ఈ పట్టికను యథాతథంగా ఇక్కడ ఇస్తున్నాను. ఇది ప్రసిద్ధ జానపద వాఙ్మయ పరిశోధకులు డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావుగారు తమ గ్రంథం వీరగాథలు–1 "కాటమరాజు కథలు"లో ఇచ్చినది. దీనిని ప్రత్యేకంగా ఎందుకు పేర్కొన్నానంటే, వీరగాథలుకు చెందిన జానపద సాహిత్యంలో ఇంత పరిశోధన చేసిన ఏకైక వ్యక్తి ఈయన. అందుకే ఈయన సూచించిన పట్టికను, వివరాలతో ఇక్కడ పరిశీలనకు ఇస్తున్నాను. (చూ. పే : 122, 123)

చూ॥ వీరగాథలు-1. డాక్టర్ తంగిరాల వెంకటసుబ్బారావు.

చూ॥ వీరగాథలు-1 "కాటమరాజు కథలు" xxii – డాక్టర్ తంగిరాల

"Finally there are other ballads (Cathalu) of great length framed in a peculiar chant on principles different from all other sorts of poetry. Some of these, as the Bobbili–catha or Ranga Rao charitra, the Nagamma catha and the like are chiefly preserved by oral recitation, without having been until now committed to writing. These are everywhere popular, though despised, as illiterate, by professed Scholars.''

ఈ మాటలు 1841లో సి. పి. బ్రౌన్ అన్నారు.

క్రీ॥పూ॥ 5000–4000 సంవత్సరములకు చెందినవిగా చెబుతూన్న మన వేదాలలోనే ఇటువంటి వీరగాథాబీజాలు ఉన్నట్లూ చెబుతున్నారు. అంటే ఈ వేదములు ప్రాచీనార్యుల జానపద విజ్ఞానమని విమర్శకుల్లో ఒక భావం ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.

డాక్టర్ తంగిరాలవారి వీరగాథా విమర్శనంలోనూ పేర్కొన్నట్లు ''ఉపాఖ్యానాలు వీరగాథలే. వేదములలో వీరగాథలు ''గాథా'', ''నారాశంశీ'' అను పేర్లతో వ్యవహరించబడినవి.''

* ''Objects which are mass produced and knowledge which is acquired through books or formal education are a part of culture, which includes total body of learing, but they are not folklore. In non-literature socities folklore is virtually idential with culture, but in literature-industrialized societies it is only a fragment of culture. Anthropologists and humanists have defined folkore differently, but their definitions are in fundamental agreement in excluding all learing that is transmitted by writing''

—William Bascom.

---

* (International Encyclopaedia of Social Seiences Vol. 5. PP 496–497.)

జానపద కవిత్వం
(Folk Poetry)

- పల్లె పాటలు లేక జానపద గేయములు (Folk songs)
- వీరగాథలు లేక జానపద గేయ కథలు (Ballads)
  - సాంప్రదాయిక వీరగాథలు లేక జనప్రియ వీరగాథలు (Traditional Ballads / Popular Ballads)
    - వీరగాథా చక్రములు (Ballad cycles)
    - వీరగాథలు (Ballads)
    - వీరగాథానికలు లేక లఘు వీరగాథలు (Balladings)
  - వీరగాథానుకరణములు (Ballad Imitations)


శక్తి కథా చక్రము
పల్నాటి వీరకథా చక్రము
కాటమరాజు కథాచక్రము
బుఱ్ఱ కథలు
జముకుల కథలు
సుద్దుల కథలు
తందనాన కథలు
బ్రతుకమ్మ పాటలు
బొబ్బిలి వరుస కథలు
పదములు
జంగం కథలు
హరిహరీ పదములు
శారద పదములు


వీరగాథలు
బొబ్బిలి వరుస కథలు
పదములు
జంగం కథలు
హరిహరి పదములు
శారద పదములు
చారిత్రకములు
సాంఘికములు
జానపదములు
పౌరాణికములు
స్పష్ట చారిత్రకములు
అస్పష్ట చారిత్రకములు
పేరంటాండ్రు
సాహసికులు
బందిపోట్లు
గజదొంగలు
గ్రామకక్షలు-హత్యలు
కుటుంబ కలహములు
లేచిపోవుటలు

మన రాష్ట్రంలో వీరగాథలకు కొదవలేదు. ఒక ప్రేమికుడి–చారిత్రకంగా, సాంఘికంగా, పౌరాణికంగా విభాగించినా - ఎన్నో వీరగాథా సముచ్చయాలు.

అలా చెప్పుకోవలసివస్తే - పల్నాటి వీరగాథలు, కాటమరాజు కథలు, బొబ్బిలి కథలు—

ఇంకా మరెన్నో! పాటలు సరేసరి !

కోలు కోలనకోలు కోలన్నకోలే
కోలుమాయకుబాల నరసింహకోలె
గుట్టగురప్పకొండ గురిదప్పకుండా
పైదళము రాకుండ పడెర నీ జండా
సైరా ఓబులరెడ్డి నెలవన్నెకాడా
నినుజూచి నా గుండె జల్లుజల్లుమనెరా...

* "Folklore includes folk art, folk crafts, folk tools, folk costumes, folk custom, folk belief, folk medicine, folk recipes, folk music, folk dance, folk fames, folk gestures, and folk speech as well as those verbal forms of expression wich have been called folk literature but which are better described as verbal art. Verbal art which includes such forms as folk tales, legends, myths, proverbs, riddles and poetry, has been primary concern of folklorists from both the humanities and social sciences since the beginnings of folklore as a field of study."

—William Bascom.

---

*International Encyclopaedia of social sciences, Vol. 5. PP 496–97.)

హరిహరి పదాలు



తెలుగులో జానపద సాహిత్య ప్రవంతిలో అనేక పుష్పాలు - అందులో దేనికదే ప్రత్యేకత గలిగింది.

అలాగే "హరి హరీ పదా"లది మరో శాఖ.

విచిత్రం ఏమిటంటే - మనకు తారస పడేవీ, దొరికేవీ ప్రాచీనమైన సాహిత్యం కాదనే చెప్పవలసి ఉంటుంది. ఇంచుమించుగా ఇవన్నీ ఆధునిక పదాలే.

ఈ హరి హరీ పదాల ఫక్కీ, వరుస, లేదా లక్షణం ఒకటేగా కనిపిస్తుంది.

"హరి హరీ నారాయణా
ఆది నారాయణా!
కరుణించి మమ్మేలు
కమల లోచనుడ..."

ఇదీ వీటి వరుస, లక్షణం.

ఇటువంటి పదాలలో స్వకపోల కల్పితాలు ఉండవనే చెప్పవలసి ఉంటుంది. ఇతర్ధా శ్రవణ ఆధారంతో రచితములయినవే ఇవన్నీ.

ఇక్కడ మరో ప్రధాన విషం ఏమిటంటే- మన పురాణ గాథలను, ప్రబంధాలను చదివి, వాటి ఆధారంతో రచించడం జరిగింది.

అందుకు ఉదాహరణగా పూరి రామచంద్రరాజు కుశలాయక పదాన్ని "కఠినంబు కాంచితే కాపులకు తెలియదని, మరుగులుంచుట మాని మాటలుంచితిని" అని పేర్కొనడం గమనార్హం.

అలాగే మరో సాక్ష్యం- అయ్యగారి కూర్మనాధం విరాటపర్వపదంలో— "ప్రబల ప్రబంధములు పండితార్హములనుచు, పామరులకొరకు నీ పదము జెప్పెనను, కఠిన శబ్దములున్న గాపులకు తెలియదని మరుగు పదములు మాని మాటలుంచెదను".

అంటే పైన సూచించినట్లుగా పురాణ ప్రబంధములు అర్థం చేసుకోడం సామాన్య జనానికి జరగని పని కనుక, వారికి అందుబాటుగా పదాలుగా రచించారు అని తేటపడుతూంది.

వీటి లక్షణాలను గురించి చేపుమళ్ల కామేశ్వరరావుగారు * ఇలా పేర్కొన్నారు... వీటి లక్షణాలను బట్టే ఇపన్నీ ఒక వర్గంలో చేశాయి. సర్వ సాధారణంగా ఒక చరణంలో ఏడు అయిదేసి మాత్రా గణాలు. చివర ఒక మూడు మాత్రలగణం ఉంటుంది. చరణం పొడుగుగా ఉండడం బట్టి రెండు పంక్తులుగా వ్రాయబడుతుంది.

హరి హరీ నారాయణా ఆది నారాయణా
కరుణించి మమ్మేలు కమలలోచనుడ

అను దానియొక్క లక్షణ మదే అని చెప్పవచ్చు ఒక్కొక్కప్పుడు గణంలో ఒక మాత్ర పెచ్చపచ్చు తగ్గవచ్చు– కాని అది సహజం —

పదాలు చాలా రకాలున్నాయి. రామాయణ కథకి సంబంధించి పదాలు చాలానే ఉన్నాయని చెప్పవచ్చు.

---

* కిన్నెర వ్యాసం- చేపుమళ్ల కామేశ్వరరావు

అయితే ఇక్కడ మనం ప్రధానంగా ఒక విషయం గమనించవలసి ఉంటుంది. ఒకే కథ వేరువేరు కళారూపాలలో విరచితములై వినిపిస్తూంటుంది. మచ్చుకు- ఒకే కథ యక్షగానం గానూ, హరికథగాను, జంగం కథగానూ రచించబడుతుంటుంది. అదే హరిహరీ పదంగా కూడా చెప్పడం కద్దు.

పదాలు చాలా వరకూ ఫలానా సమయంలో రచించబడినవని ఖచ్చితంగా చెప్పడానికి ఆధారాలు లేవు గానీ, పదాలు 18 వ శతాబ్దానికి ఇవతలే రచించ బడ్డాయని చెప్పవచ్చు.

పసగాడ సన్యాసి 1850 ప్రాంతంలో గంగా వివాహం, సారంగధర చరిత్ర, శతకంఠ రామాయణం మొదలయినవి రచించాడు. ఇతనికి రాముడంటే పరమభక్తి అయినా హరి హరులయందు అభేద భావం గలవాడని అంటారు.

"ఆటలందునైన పాటలందునైన పరగు హరి హర కథల్ పాపహరణ ములు ఏ కథలు హరిహరుల యోగ్యతల్ గల్గున్ ఆ కథలు పుణ్య కథలవి దోషహతులు"—

ప్రధానంగా గంగా వివాహంలో శైలి సులభమూ, సుందరమూ కూడా. గంగా గౌరీ సంవాదంలో తెలుగు మాటల చమత్కార సౌందర్యాన్ని ఇక్కడ చెప్పడం అవసరం-ఎందుకంటే, శైలీ విధానం అవగాహన మవుతుంది.

"ఉన్నచోటన నన్ను ఉండమన్నందుకు
తప్పకను నీ జిహ్వ తరిగింతు గంగ-
నీవు తరిగిన కూర నేను తరిగిన కూర
వండి వడ్డింతుమే పనిత గౌరమ్మ
చెంపకాయలు గొట్టి చెవులూడదీతులా
జగడ పోతుల మారి జాలారి గంగ
నీవు గొట్టిన కాయ నేను గొట్టిన కాయ
గంప నింపింతుమే కాంత గౌరమ్మ"-

శివుడు పలికిన పలుకులు ఆదర్శనాదాలు.

"సఖియ నా ప్రాణంబు సంశయము లేదు
జీవధన మెవ్వరు జెడ జూచుకొంటారు
ప్రతుకాశ లేనట్టి ప్రజలెందు గలరు.
కుల వధూమణులతో కలహింపకూడదని
శాస్త్ర పద్ధతులంత చదివి యెరుగుదును."

—ఇలా ఎందరో పదాలను రచించారు. పూరి రామచంద్రరాజు అనే కవి కుశలాయక పదాన్ని 1862 ఆ ప్రాంతంలో రచించాడు.

పూరి నారాయణరాజు 1874 ప్రాంతాలలో ధర్మాంగద చరిత్ర రచించాడు.

1880 ప్రాంతాలలో వెలువడిన శశిరేఖా పరిణయం, నల చరిత్రలను తోలేటి సీతారామ కవి రచించాడు.

వీరుగాక మంథా సుబ్బరాయ శాస్త్రి పాతాళ హోమం (1922), పొడుగు రామబ్రహ్మకవి (1925) గయోపాఖ్యానం, వైకుంఠ మహాత్మ్యంలు రచించారు. అలాగే అయ్యగారి కూర్మనాధం విరాట పర్వము రచించాడు. ఇదే కథను ధేనుకొండ వెంకయ్యకవి జంగc కథగా రాసినట్లు ఆధారాలున్నాయి.

*వీరే గాక—"పైడికొండ అప్పన్న సుభద్రా కల్యాణము, చంద్రగిరి తాతయ్య ఉత్తర దక్షిణ గోగ్రహణాలు, ముడుంబ లక్ష్మణాచార్యులు శ్రీరామ కథను, చిత్రాద కామేశ్వ త్రినాధ చరిత్ర, నడిమింటి రామయోగి బాణాసుర యుద్ధం, కటోజు వీరాచారి భల్లాణరాయ పదము- ఇలా ఎందరో ఎన్నెన్నో పదాలను రచించారు."

ఇవన్నీ హరి హరీ పదాలేనా ? అన్నది పరిశోధకులు చెప్పవలసిన విషయం. ఇదే అనుమానాన్ని శ్రీ చేకుమళ్ల కామేశ్వరరావు గారు కిన్నెర వ్యాసంలో సూచించారు.

జనం కోసం జనంలోంచి జన కవులనుంచి పుట్టిన ఈ పదాలు జన సాహిత్యమే !

---

* కిన్నెర-డిశెంబరు 1953.

యక్షగాన ప్రబంధాలు



"జగ్రాహ పాఠ్యం ఋగ్వేదా
త్సామభ్యో గీతమేవచ,
యజుర్వేదా దభినయాన్
రసా నాథర్వణాదపి,
వేదోపవేదై స్సంబద్ధో
నాట్యవేదో మహాత్మనా,
ఏవం భవగతా సృష్టో
బ్రహ్మణా లలితాత్మకః"—

ఋగ్వేదంనుంచి వాచకాన్ని, యజుర్వేదం నుంచి అభినయాన్ని, అధర్వణ వేదం నుంచి రసాన్ని, సామవేదం నుంచి సంగీతాన్ని గ్రహించిన బ్రహ్మ నాట్య వేద మనే పంచమవేదాన్ని ప్రవచించినట్లు భరతముని చెప్పివున్నాడు. అంటే వేదాలలోనే రూపకబీజాలున్నవన్నది మనకు బోధపడుతుంది.

వీథి నాటకాలకు చాలా పయసు వున్నట్లుగా హలశాతవాహనుడు రచించిన గాథాసప్తశతి మనకు చెపుతూనేవుంది. సుమారు రెండువేలయేళ్ళకు పూర్వమే వీథినాటక లక్షణాలు, దేశివాచ్య విశేషాలు. వున్నట్లు నాటి శిల్ప ప్రతికృతుల రూపావశేషాలద్వారా మనం గుర్తించవలసి ఉంటుంది.

''జగుః కలంచ గంధర్వా ననృతుశ్చాప్స రోగణాః
దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిశ్చ ఖాత్పతత్
ఉత్సవశ్చ మహానాసీ దయోధ్యాయాం జనాకులః
రథ్యశ్చ జనసంవాదా నటనర్తక సంకులాః
గాయనై శ్చ విరావిణ్యోవాదనై శ్చ తథాపరై ః
విరేజుర్విపులా స్తత్ర సర్వరత్న సమన్వితాః
ప్రాదేయాంశ్చ దదౌ రాజా సూత మాగధ వందినామ్!''—

వాల్మీకి రామాయణంలో శ్రీ రామచంద్రుని జననవర్ణన చూడగా, దేశి సారస్వతంగా ప్రచారంపొందిన జానపదరచనలు ప్రచారంలో వుండివున్నట్లు బోధపడుతుంది. రామాయణ, భాగవత చరిత్రలలో ఇనకు ఈ విషయం తెలియకపోదు.


తెలుగు దేశి కవిత్వం
అనిబద్ధ దేశి (శుద్ధ దేశి)
నిబద్ధ దేశి
పామర దేశి (జానపదదేశి)
జాతి దేశి
సాహిత్య ప్రధానములు
సంగీతో ద్దేశకములు (ఉదా:త్యాగరాజు కీర్తనలు)
అభినయో ద్దేశకములు (ఉదా॥ క్షేత్రయ్య పదములు, జావళులు)
ప్రదర్శనో ద్దేశకములు (వీథి నాటకములు, యక్ష గానములు, హరికథలు)
పల్లె పాటలు (జానపద గేయములు)
వీరగాథలు (జానపద గేయ కథలు)
గేయము (ఉదా॥ అన్నమాచార్యుల కీర్తనలు, పెద తిరుమలా చార్యుల పచనములు, సింహగిరి నరహరి వచనములు, ఆధ్యాత్మరామాయణము మొ॥)
పాఠ్యము (ఉదా॥ ద్విపద కావ్యములు, శతకములు, అష్టకములు, ఉదాహరణములు మొ॥)
స్త్రీల పాటలు
రామదాసు భజన కీర్తనలు
ముక్తకములు
కథలు

'గంధర్వుల మధురగానం, అప్సరసల నాట్యం, దేవతల దుంధుభి వాద్యం, వీథులలో నటులనాట్యం, సూత, మాగధ, నందీజనుల వాద్యాలను గురించి పైన వర్ణింపబడింది. ఈ సమయంలో గంధర్వులు గానం చేసినవి గేయాలే కదా? అవే తర్వాత తర్వాత దేశకాల పరిస్థితులనూ, ప్రభావాలనూబట్టి రూపు దిద్దుకొని, కొత్త కొత్త రూపాలలో సాక్షాత్కరించివుండవచ్చును. అది కాకుండా సంస్కృతంలో ఆది కావ్యం రామాయణమన్నది చర్చలేని విషయం.

నన్నయార్యుని కాలానికి నాటకాదులు ప్రచారంలో ఉన్నాయనడానికి ఈ క్రింది ఉదాహరణం చాలుననుకుంటాను.

''విమలమతిన్ బురాణములు
వింటిననేకము, అర్థధర్మ శా
స్త్రముల తెరంగెరింగితి
నుదాత్తరసాన్విత కావ్యనాటక
క్రమములు బెక్కు సూచితి, జ
గత్పరిపూజ్యములైన యీశ్వరా
గమములయందు నిల్పితి ప్ర
కాశముగా హృదయంబు భక్తితోన్''.—

అన్న పద్యభాగముద్వారా మనకు బోధపడుతూనే వుంది.

దీనినిబట్టి ఈ తరహా దేశిరచనలు రెండువేల యేళ్ళక్రితమే ప్రచారంలో వుండి వున్నట్లు మనమూహింపగలము! భాగవతంలో కృష్ణుని జన్మసమయంలో గోపికలు ఈ తరహా పాటలనే పాడినట్లు దశమస్కంధంలో వర్ణింపబడివుండి కూడా. అంతటి ప్రాచీనమయిన దేశి సారస్వతశాఖలో సంగీతరూపక ప్రధాన మయిన యక్షగానములను గురించి కొంచెం చూదాం.

యక్షగానమనగా దేశీయ ఛందోబద్ధమైన నాటకం. తంజావూరు నాయక రాజు విజయరాఘవుడు తన యక్షగానాలను నాటకాలనే పేర్కొన్నాడు. దీనినే పాటగాకూడా పేర్కొనకపోలేదు. 'యక్షగానాల' గురించి బ్రౌణ్య నిఘంటువులో పాటగా పేర్కొన బడింది. అయితే అప్పకవి దృష్టికో యక్షగానం పాటలు గల ప్రబంధం అయివుండవచ్చునని తోస్తుంది.

ఎందుచేతనంటే అప్పకవీయంలో యక్షగాన ప్రశస్తివుంది. అందులో అర్ధ చంద్రికలూ, త్రిపుట, జంపె, ఆటతాళము, 'వీన యక్షగాన ప్రబంధంబు లతుక వచ్చు' అని పేర్కొని వున్నాడు. యక్షగానాలు 12వ శతాబ్ది నుండీ ప్రచారంలోఉన్నా అప్ప కవికి పూర్వం ఏ లాక్షణికుడూకూడా వీటిని ప్రస్తావించ లేదు.

శ్రీనాధుని కాలంలో యక్షగానాలు చాలా ప్రచారంలో వుండి వున్నట్లు ఈ క్రింది పాదంవలన మనకు సుబోధకమవుతూంది.

"కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు,
గాంధర్వమున యక్షగాన సరణి"—

అనియూ సూచించి వున్నాడు!

అదే కాదు, ఈ యక్షగానాలు తెలుగులో సుమారు నాలుగు వందలకుపైగా వున్నట్లునూ, ఇందులో సుమారు రెండు వందలదాకా ముద్రితము లయినట్లునూ, మిగిలినవి ఆముద్రితములుగా వుండివున్నట్లునూ, చారిత్రక పరిశోధకులు ఒకరు పేర్కొని వున్నారు.

తరచి చూడగా చూడగా నా పూహకు తట్టినంతమట్టుకు యక్షగానం సంగీత రూపకం అంటే సరిపోతుందని తోస్తుంది. ఈ యక్షగానాలు చక్కని రసవత్ ప్రబంధా లనడంలో సందేహంలేదు. మచ్చుకు ఒక పరిచయం.

సుగ్రీవ విజయం అనే యక్షగాన ప్రబంధాన్ని కందుకూరి రుద్రయకవి రచించాడు. ఈ యక్షగాన రచనలో రుద్రయకవి ఏ ఏ దేశి ఛందస్సులను చూపాడో చూడండి. '33 సంధి పచనాలు, 14 జంపెలు, 11 ద్విపద మాలికలూ, 9 అర్ధ చంద్రికలూ, 5 ఆటతాళములూ, 4 గీతములూ, 2 సీసములూ, 1 ఉత్పల మాల, 1 కురుజంపె, 1 ఏకతాళమూ, 1 కందమూ, 1 ధవళమూ, 1 ఏలపదమూ వున్నవి".

దీనిని బట్టి యక్షగాన స్వరూపం మనం వూహింపగలం. యక్షగానాల గురించి ఇంకా చాలా వివరాలూ, విషయాలూ తెలిసికోవలసి వుంది.

ఈ యక్షగానాలకు వసంత ఋతువు, తంజావూరు రాజుల కాలంలో అని చెప్పవలసి ఉంటుంది. తంజావూరి రాజుల కాలంలో యక్షగానాలకు మంచి ఆదరణా, పోషణా, ప్రోత్సాహమూ, ప్రోద్బలమూ లభించాయి.

ఇక్కడ ఒక చిన్న విషయం చెప్పవలసి ఉంటుంది. యక్షగానం వేరు, వీధి నాటకం వేరూ అనికూడా ఒక వాదం వుంది. అలా చూసినా యక్షగానాలూ, నాటకాలూ కూడా తంజావూరి రాజుల కాలంలో ప్రదర్శించేవారు.

నాటి రాజులు వీటి ప్రదర్శనాలకు చక్కని ఏర్పాట్లు కలుగ చేయటమూ, చక్కని ఆదరణ అందివ్వడమూ - యిక్షగానాలు ప్రకాశవంతమూ, ప్రచారమూ అవడానికి కారణమయింది. ఆ రోజులలో స్త్రీలు కూడా యక్షగానాలు రచించారన్నది గమనార్హం. వీరి కాలంలోనే రచించబడిన ''మన్నారు దాస విలాసం'' రంగాజమ్మ అను కవయిత్రి రచించిందే. ఇంకో విశేషం ఏమిటంటే, ఇందులో స్త్రీలు కూడా వేషాలు ధరించడం !

ఈ తరహా యక్షగానాలకే జక్కుల పాటలనికూడా పేరువుంది. ఈనాటికీ రాయలసీమలో అనంతపుర ప్రాంతంలో జక్కుల చెరువు అనే ప్రాంతం, ఆచుట్టు పట్ల జక్కుల జాతివారూ వున్నారు.

ఆ జక్కుల్నే కాబోసును - ఆనాటికే వున్నారుకూడా కాబట్టి - పాల్కురికి సోమనాధుడు పండితారాధ్య చరిత్రలో ''అచట గంధర్వ యక్ష విద్యాధరాదులు పాడెడు, నాడెడు వారు'' అని పేర్కొన్నాడు.

తెలుగునాడున ''వీధి నాటకా''లున్నట్లుగానే తమిళదేశంలో ''తెరుక్కుత్తు'' లనీ, కన్నడదేశంలో ''బయలాటము'' లనీ వ్యవహారంలో వున్నాయి.

యక్షగాన మనగా పద్యాలూ, దరువులూ మొదలగువాటితో వుండే సంగీత రూపకం లాంటి దేనని ముందే చెప్పి ఉన్నాను. అయితే ఈ యక్షగానాల్లో వేష ధారణ యక్ష వేషాలే వేయడం పరిపాటి !

ఒకనాడు రాజాంతఃపురాలలో, కలవారి ప్రాంగణాలలో మార్గనాటకాలూ, వేశ్యా నృత్యాలూ జరుగుతూ వుండేవనీ, జరిగినాయనీ మన మూహించుకోడానికీ, తలచి అంచనా వేసుకోడానికీ చాలా అవకాశాలు వున్నాయి. సరే! ఇది యధార్థమే

అనుకుందాం. మరి నాటి సామాన్య ప్రజానీకం సంగతి ఏమిటి? అనేది కూడా మనం చూడవలసి ఉంటుంది.

వారికి - అంటే సామాన్య జనాళికి ఆ లోటును లేకుండా తీర్చినది ఈ యక్షగానాలే అని చెప్పుకో వచ్చును; చెప్పవలసిఉ:టుంది కూడా! యక్షగాన ప్రాధాన్యాలలో ఇది చాలా ప్రాధాన్య మయింది.

మన వాజ్మయంలో యక్షగానాల కున్న వయస్సు తమిళ, కన్నడ వాజ్మయాలలో వున్నట్లు కనిపించదు.

"యక్షగాన పరిశ స్తి ముందుగా మన వాజ్మయంలోనే కానవస్తుంది" అని మన చరిత్ర పరిశోధకుల అంచనా. అది ముమ్మాటికీ నిజం కూడాను! ఈ యక్షగానాలను మననుంచే ఇతరులు గ్రహించారని చెప్పుకోవచ్చును.

"మన వాజ్మయ ప్రక్రియలన్నీ ఇతర భాషా వాజ్మయాల నుంచే గ్రహించామని అనుకొన్నా, యక్షగానం మాత్రం మనదనీ, ఈ విషయంలోనైనా మనం అనుకర్యులం కామనీ గర్వంగా చెప్పుకోవచ్చు" అన్న యక్షగాన పరిశోధకులు శ్రీ యస్. వి. జోగారావుగారి పలుకులు గమనించదగినవి!

ద్రవిడ భాషయందు మొట్టమొదట కురవంజి అనే దృశ్య రచనలు బయలు దేరినవి. అసలు ఈ కురవలు అనువారు ఆటవికులు.

వీరు అడుగు వేస్తూ నృత్యం చేయడం అలవాటు. "అంజి" అనగా "అడుగు" అన్న అర్థం వుంది. అందుకే దీనికి కురవంజి అని వాడుక అయింది.

అయితే యక్షగానాలలో గేయములకే ప్రాధాన్యం అయివుంటే, కుర వంజిలో నృత్యం ప్రాధాన్యం వహించింది.

యక్ష గాంధర్వాది వేషములు కలిగి, గాన ప్రధానమై ఉండుటచే వీటికి యక్షగానములనే నామ ప్రచార మొచ్చిందనేది విదితమే.

"ప్రాచీనాంధ్ర లక్షణ కర్తలు తెలుగు కవిత్వమును ఆశు, మధుర చిత్ర, విస్తరము - లను పేళ్ళ చతుర్విధముల విభజించారు. యక్షగానాలంటులో మధుర కవిత్వమున జేరును.

"మధుర కవిత్వం బన్నది నాటకాలంకారంబులు, కళికోత్కళికలు, విభక్త్యధి దేవతోదాహరణములు, సప్తతాళ నటనలు నట్టొట్లు, గీతప్రబంధంబులు, చతుర్భద్రికాష్ట భద్రికలు, బిరుదావళి, నామావళి, భోగావళి, రంగఘోష, త్యాగ ఘోష, చతురుత్తర సంఘటనలు. యక్షగానంబున వెలయు పదంబులు, దరువులు నేలలు, ధపళంబులు, మంగళ హారతులు, శోభనంబులు, నుయ్యాల జోలలు, జక్కుల రేకు పదంబులు, చందమామ, సుద్దులు, అష్టకంబులు, ఏకపద, ద్విపద, త్రిపద, చతుష్టదాష్ట పదులు నివియాదిగా గల్గునన్నియు"

—లక్షణ దీపిక.

ఆ యక్షగాన ప్రాచీన ప్రదర్శన కళలో మొదటిదిగా ఓబయ మంత్రి రచించిన "గరుడాచలం"ను పేర్కొనవచ్చును. తరువాత కందుకూరి రుద్రయ రచించిన "సుగ్రీవ విజయం"ను పేర్కొనవలసి ఉంటుంది.

ఈ సుగ్రీవ విజయం యక్షగానములందు ప్రసిద్ధి, ప్రచారమూ పొందిన కృతి. ఇందలి కథ రామాయణంలోనిది.

పోతే ఈ 'సుగ్రీవ విజయం' అంతటి ప్రసిద్ధి యక్షిగానాలలో రావడానికి కారణం దేశి రచన అవడమూ, గేయ రూపంలో రచించబడటం. మచ్చుకు ఒక చరణం చూదాం.

"తరణి కులమున బుట్టి, శరచాపములబట్టి
తరుణి గోల్పడు కంటె మరణమే మేలు
నను శౌర్యవంతుడని తన పుత్రి నిడినట్టి,
జనక విభు డీవార్త విని వగువకున్నె"

తరుణిని కోలుపోయిన శ్రీరామచంద్రుని మనస్సునందలి బాధను రుద్రయ కవి చాలా చక్కగా చూపించినాడు.

అసలు ఈ దేశీయ రచనలలోనే అంతటి మహత్తూ, హుందా కనిపిస్తుంది. అందుకే అనుకుంటాను నన్నెచోడుడూ, పాల్కురికీ జాను తెనుగునే కవిత్వం చెప్పారు.

"సరళముగాగ భావములు
జాను తెనుంగున నింపు పెంపుతో"—అని

నన్నెచోడుడూ,

జాను తెనుగు 'విశేష ప్రసన్నతకు' ననియు ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ పూరిత సంస్కృత భూయిష్ఠ రచన మానుగా సర్వసామాన్యంబుగామి జాను తెనుగుననే యుత్తమ కవితా విశేషముల జూపి సోమనాథుడునూ జాను తెనుగును విశేషముగ గౌరవించారు.

ఈ యక్షగాన ప్రదర్శనములు ఏ రూపంలో వుంటాయో కూడా మనకు తెలిపినాడు శ్రీనాథుడు !

"..... ధక్క హుడక్క జర్ఝరల్
ఝల్లరి యాదిగా గలుగు శబ్ద పరంపర తాళబద్ధమై
యుల్లసిలం ప్రబంధముల కొప్పగ నాడుదురగ్రవేదిపై...

అని సూచించి ఉన్నాడు.

బసవపురాణంలో పాల్కురికి సోమనాథ కవి యక్షగాన ప్రదర్శనల రూపం యిలా సూచించాడు—

".....
పాటలుగాగట్టి పాడెడివారు
బ్రస్తుతోక్తులగద్యపద్యకావ్యముల
విస్తారముగజేసి వినుతించువారు
నటుగాకి సాంగభాషాంగక్రియాంగ
పటునాటకంబుల నటియించువారు'

(బసవపురాణం)

పండితారాధ్య చరిత్రలో పాల్కురికి సోమనాథుడు ఇలా పేర్కొన్నాడు. నాడు ప్రదర్శించిన నాటకాలు సంస్కృత నాటకాలు కాదనీ, యక్షగానా లనబడే దేశినాటకాలే యివి అని మనకు సోదాహరణంగా ఇచ్చి ఉన్నాడు— చూడండి :

"భ్రమరులు జాకెముల్ బయసముల్ పెరసి
రమణ బంచాంగ పేరణయాడువారు,

ప్రమధ పురాతన పటుచరిత్రములు
క్రమమొంద బహు నాటకము లాడువారు,
లలితాంగ రసకళాలంకార రేఖ
లలవడ బహురూప మాడెడువారు,
అమరాంగనలు దివినాడెడుమాడ్కి
నమరంగ గడలపై నాడెడువారు,
ఆవియద్గతి యక్షులాడెడు నట్టి
భావస మ్రోకులపై నాడువారు
భారతాది కథలు చీరమరగు
నారంగ బొమ్మల నాడించువారు
కడు నద్భుతంబుగ గంభసూత్రంబు
లడరంగ బొమ్మలనాడించువారు,
వారట గంధర్వ యక్ష విద్యాధ
రాదులై పాత్రలనాడించువారు''—
(పండితారాధ్యచరిత్ర)

ఈ యక్షగానాలలో చాలా హాస్యప్రధానమయిన సంప్రదాయక పాత్రలు వున్నాయి. ప్రతి యక్షగానంలోనూ అందలి ఇతివృత్తం వేరు అయినా హాస్య పాత్రలు ప్రతిదానిలోనూ వుంటాయి. ఈ పాత్రలన్నీ కూడా హాస్యంకోసం ఉద్దేశించబడినవే! రుచులలో ఉప్పుకు ఎంత ప్రాధాన్యం వుందో రసములలో హాస్యంకు అంత విలువ ఉంది. అందుకే సంస్కృత నాటకాలనుంచి దేశిరచనల వరకూ ఈ హాస్యానికి గౌరవం, విలువ వుంది. ఈ హాస్యం అందరికీ సమాన మయింది.

అటు పామరజనం, ఇటు పండితజనం— ఇద్దరికీ వినోదాన్ని ఇస్తాయి ఈ పాత్రలు. మనకీవిషయం తోలుబొమ్మలలో బంగారక్క, జుట్టుపోలిగాడు ఘట్టంలో తెలిసినదే !

అసలు ఈ సంప్రదాయిక హాసపాత్రలు పీటిల్లో లేకపోతే ప్రేక్షకులకు హుషారు అనేది వుండదు. ఎంతో పెద్దగావుండే ఈ ప్రదర్శనలకు ముఖ్యంగా హాస్యపాత్రలు చాలా అవసరం.

ఈ హాస్యం కొంత మోటుగానూ, వెగటుగానూ వుంటుందని ఈనాడు మనమెంత ఇది పడ్డా ఒకనాడు వీటికి ఉన్న గౌరవం చాలా పెద్దది.

నాడు రాజాంతఃపురాలలో—రాజులకీ, రాణులకీ, పల్లెలలో సామాన్య జనతకీ కూడా సరిసమానమయిన వినోదాన్ని ఇచ్చి - చక్కని గౌరవం అందుకున్నవే.

పోతే ఈ హాస్యపాత్రలు విజ్ఞానయుతమయినవి కాకున్నా, అవి లేకుంటే ప్రేక్షకులను ఆకర్షించలేమన్నది గుర్తించబట్టే—నాటి నాటకకర్తలు ఈ సంప్రదాయిక పాత్రలను విడువక పోషించారు.

తోలుబొమ్మలలో లాగనే యక్షగానాలలోనూ, తత్ రూపాంతరములయిన గొల్ల, భామ కలాపములు, కురవంజులు మొదలగువానిలోనూ, కొన్ని కొన్ని పాత్రలు హాస్యరసప్రధానములే.

ఈ తరహా హాస్యరస ప్రవృత్తి కలిగిన ఒక రెండు పాత్రలు పరిచయం చేయడానికి ప్రయత్నిస్తాను.

అన్ని కాలాలలోనూ అన్నితరహాల ప్రజలనూ పక్కన నవ్వించకలిగింది హాస్యం ! నవ్వని, నవ్వలేని, నవ్వురాని మానవుడు వుంటాడనుకోను ! హాస్యం లేనిదే శృంగారమే లేదేమో ! అందుకే మన లాక్షణికులు హాస్యం శృంగారానికి మైత్రీరసమన్నారు. ముఖ్యంగా హాస్యరసం నాటకంలో ముఖ్యం, అందుకే హాస్య పాత్రలను ప్రతి నాటకంలోనూ ప్రవేశ పెట్టారు. ప్రేక్షకులకు వినోదాన్ని కలిగించే ఉద్దేశ్యంతోనే సంస్కృత నాటకాదులలో విదూషకుని పాత్రను సృష్టించింది.

సంస్కృతంలో విదూషకుని పాత్రే పాశ్చాత్యదేశాలలో 'కోర్టుఫూల్', 'కోర్టుజెస్టర్', 'బఫూన్' లు. వీటికి సరిపోలినవే తోలు బొమ్మలలో 'జుట్టుపోలిగాడు', 'గాంధోలిగాడు', 'బంగారక్క'. యక్షగానాలలో 'కోణంగి', కురవంజులలో 'సింగీ, సింగడు'—

అలాగే 'మాధవి' పాత్ర ! కూచిపూడివారి సృష్టి ! ప్రతి భామాకలాపంలోనూ ఇతడు మనకు ప్రత్యక్షమవుతాడు !

విదూషకునిలాగ హాస్య ప్రసంగాలూ, కథనూ నడిపిస్తాడు. పాత్ర పరిచయాలూ వల్లిస్తాడు.

మాధవి అచ్చు ఎలాగుంటాడో శ్రీ యస్వి జోగారావుగారు పరిచయం చేశారు. ''ఇతడచ్చుమచ్చు సింహళదేశపు నృత్యరూపకం—'కోలంనాటియూ' లోని 'తోరాతరు కథాకారయ' లాంటివాడు, బర్మాదేశపు పీథినాటకము 'నిభటీ కిన్'లో 'లూ—బయట్' లాంటివాడు.''

మొత్తంమీద ఈ మాధవిపాత్ర చాలా ప్రాముఖ్యం కలిగింది. కథకు కలసివచ్చే పాత్ర కేవలం వెనుకనుండి హుంగుచేసేవాడు గనుక నాయికా నాయకులకు సహాయకుడుగా వ్యవహరించే పాత్ర మాధవి. వెటకారాలు విసరటంలో ఇతడికి ప్రత్యేకస్థానం వుంది.

ఈ హాస్యరస ప్రధానములయిన నాటకాములో ఈ తరహాపాత్రలకు రకరకాల రూపాలు చూపారు. కాని మొత్తంమీద అన్నీ సరిసమానంగానే వుటాయి. సంస్కృతనాటకాములలో విదూషకుడు ఎలా వుండేవాడో చూదాం.

ఈ విదూషకుని ప్రత్యేకత నవ్వు పుట్టించడం. కాని ఆకారాన్ని, వింత సంభాషణలూ తెచ్చిపెట్టుకొని వినోదింపచేయడం ఇతనిలో గొప్పతనం.

ఈ విధంగా రాజాస్థానాలలో పూర్వం వినోదంకోసం కొంతమందిని పోషించేవారు. పాశ్చాత్యదేశాలలో 'కోర్టుఫూల్' 'కోర్టుజెస్టర్' అనేవారు ఇటువంటివారే. దీని క్రిందకే విదూషకుడినీ, లేక మాధవిని లేదా సుంకరి కొంచమిని తీసికోవచ్చు! విదూషకుని రూపం ఈ క్రింవిధంగా చు డేపని పేర్కొన్నారు.

భరతముని మతప్రకారం విదూషకుడు బట్టతల, మరగుజ్జు, వికార స్వరూపం, ఎత్తు ళ్ళు, ఎబ్బెట్టుకళ్లు—కలవాడుగా చెపుతున్నారు.

ఇంకోవిధంగా విదూషకుని రూపం ఇలా వర్ణించబడింది:

'జుట్టు రాగిది, పీచుగడ్డం, మొత్తంమీద ఈ వర్ణనమబట్టి సంస్కృత నాటకాలలో విదూషకుని పాత్ర కేవలం హాస్యంకోసమే సృష్టించినట్లు కనిపిస్తుంది.

దేశి దృశ్య రచనలు :

* "యక్షగానమన్న పేరు గల దృశ్య రచనలు నన్నయాదుల కాలమునే ఉన్నవన్నటకు ప్రబలాధారములు కానరావు కాని, యానాడేదో కొన్ని దేశి దృశ్య రచనములున్నవని మాత్రము గుర్తింప నగును. నన్నయకిన్నూరేండ్లకు దర్వాత నున్న పాల్కురికి సోమనాథు డిట్లు చెప్పినాడు :

"భ్రమరులు జాలెముల్
బయనముల్ మెరసి రమణ
పంచాంగ పేరణి యాడువారు"...

సుగ్రీవ విజయంలో ఈ దేశి రచన లున్నవి.

త్రిపుట, జంపె, కురుచ జంపె, అర్ధ చంద్రికలు, ఆట తాళము, ఏక తాళము, ద్విపదలు, ధవళములు, ఏలలు. అర్ధ చంద్రికలు, త్రిపుటాది రచన లఖండ రచనలు గాబోలును. ఇందలి యర్ధ చంద్రిక లెల్ల నొక్క తెరగు పదక గలవిగాక భిన్న గతులతో నున్నవి. సంగీత తాళ లక్షణము లెరిగినవారు వాని ప్రభేదములు గుర్తింప వలెను.

శ్రీనాథుడు భీమఖండంలో ద్రాక్షారామ భీమేశ్వర మహోత్సవ సమయము లండు సాసులు వేషములు వేసుకొని నాటకములు ఆడినట్లు వర్ణించాడు.

సీ॥ విరుల దండలతోడి వేణికాభారంబు
పొంకంబు పిరుదుల బొరలి యాడ
మణితులా కోటికోమల ఝణత్కారంబు
రవలి మట్టెల మ్రోత యవఘలింప
గుదురు నిండిన చిన్న గుబ్బ చన్నుల మీద
ముత్యాల త్రివరంబు మురుగు జూప
నలమాన తాటంక వ్రజాంకుర ఛ్ఛాయ
లేత వెన్నెల బుక్కిలించియుమియ

సాని యిూశానియై మహోత్సవము నందు
గేల నవచంద్రకాంతపు గిన్నె పూని

---

* మధుర కవితలు

వీధి భిక్షాటన మొనర్చు వేళ జేయు
సురులు నృత్యంబు జగముల మరులు గొలుపు''

అప్పకవి యక్షగాన లక్షణములను ఇలా వివరించాడు :

సీ॥ తుద నేడు లఘువులు తొలగించి చదివిన
త్రిపుటకు వృషభ గతి పదయుగము
లలిగదవల నొక్క లఘువు మానిన జంపె
మును ద్విరదగతి సమ పదయుగము
గురుతగురచ్చెరకు దురగవల్లనా
హ్వాయమేకతాళి యా మధురగతికి
నంఘ్రి కిర్వదినాలు గటతాళమున మాత్ర
లోలి విశ్రాంతి పద్ధాలుగింట

దెలియ నర్థంబు అర్థ చంద్రికలు దీన
యక్షగాన ప్రబంధంబు లతుక వచ్చు
రగడ భేదంబు లివి యంద్రు రసగవీంద్రు
లలిత నిజసేవక స్తోమ ! యబ్ధిధామ !''

—పై పద్యాన్ని తిలకించినప్పుడు మనకు ప్రత్యేకంగా బోధపడేది - యక్షగాన ములలో అతి ప్రధాన గేయ రచనలు దేశి రచనలో మార్చి - త్రిపుట, జంపె, ఏక, ఆట, తాళములకు అనుగుణంగా కల్పితము లయినట్లుగా గ్రహించవలసి ఉంటుంది.

యక్షగానాలలో అప్పకవి విహరాలే కాకుండా అనేక విధములయిన దేశి రచనలు చేరినట్లూ కనిపిస్తూంది.

అలా చేరిన వాటిలో - ఏలలు, జోలలు, సువ్వాలులు, ఆరతులు, ధవళ ములు. చందమామ సుద్దులు, వెన్నెల పదములు, విరాళి పదములు, తుమ్మెద పదములు, గొబ్బి పదములు, కోవెల పదములు, చిలుక పదములు, ఆల్లోనేరేళ్లు, సీస - కందార్థములు, త్రిభంగులు, ద్విపదలు, త్రిపదలు, చౌపదలు, షట్పదులు, మంజరులు, జక్కుల రేకులు ఇలాంటివి.

సంస్కృత నాటకాలలో విదూషకుని అవతారము అలాగుంటే-మన గొల్ల కలాపాలలో సుంకరి కొండడివాలకం ఎలాటిదోచూదాం : పీడి వాలకం 'లాలా కన్నయ' దృష్టిలో ఇది. ఇలా వర్ణించాడు :

"గడితపు చల్వాచల్లడముపైన బిగించి
తగరాణమెరయగాదట్టి జుట్టి
పిక్కటిబిరుదుగాబిగియుచుందురు గుంటి
చొక్కాయ పిక్కల నంటదొడిగి
జరికుసుంబారంగు శాలుపాగామీద
రవగుల్కు కల్కితురాయిచెక్కు
గుభగుభాళించు సౌరభము గుడిమేనలెక్కు
కమ్మిదుప్పటి వేటుగానమర్చి
కత్తిరుళిపించి వరకరాగ్రముననుంచి
వాడికొనగోళ్ళ మీసంబుదీడిదీడి
దుండగీడౌచు సుంకరికొండడదిగొ
వచ్చెకాబోలు వినవమ్మ వారిజాక్షి"

యేతావాతా చెప్పొచ్చేది మన దేశ ప్రదర్శనాలలోని హాస్యపాత్రలు చాలా ప్రాధాన్యం వహించినవియే! అంతటి ప్రధానమయి ఉండబట్టి అన్నిటా ఆ పాత్రలు మనకు ప్రత్యక్షమై గిలిగింతలతో నవ్వించి, కవ్వించి మురిపించి, కూర్చోన్నచోటునుంచి మనలను, ప్రేక్షకులను కదలకుండా కూర్చోబెడుతున్నాయి.

ఇక హాస్యపాత్రలను విడిచి అసలువిషయంలోకి వద్దాం. నేను మొదటనే సూచించి ఉన్నట్లు వేషాలు వేసుకొని పాడుతూ ప్రదర్శించే రూపకమే—యక్ష గానమన్నది నిర్వివాదాంశం.

దేశి సారస్వతమణియై వెలసిన ఈ వీథినాటక రూపం, యక్షగానాల లోని భాష జీవద్భాష ! వీటిని అంతగా ఎవరూ ఆదరించకపోయినా నిలదొక్కు కుని ప్రచారం పొందాయి. చారిత్రక పరిశోధకులకు ఈ యక్షగానాలలాంటి దేశీయ రచనలు ఒక మ్యూజియంలాంటివి. నాటి ఆచారాలూ, కథలూ, గాథలూ, రూపాలూ, నమ్మకాలూ, కళ్ళకు కట్టినట్లు వీటిద్వారా తెలుసుకొన వచ్చును. ఇటువంటి ఈ యక్షగాన రచనలు ప్రాచీన సంస్కృతికి నిలయంగా వెలసిన భాండాగారాలంటే భాగుంటుందనుకుంటాను.

స్త్రీల పాటలు

తెలుగు సాహిత్యంలో జానపద వాజ్మయానిది ఓ ప్రత్యేకత - అందులో స్త్రీల పాటలది మరో ప్రత్యేకత.

జానపద గేయ వాజ్మయంలో ప్రమదల ప్రత్యేకత చాలా కన్పిస్తుంది - ప్రమదల పెదిమలనుంచి వెలువడే ప్రతి పాటా, పదం ఒక ప్రత్యేకతనీ, గౌరవాన్ని రంగరించుకొని మానవ హృదయాలను చక్కలిగింతలతో ఊయలలూపుతుందంటే ఆశ్చర్యం లేదు.

తొట్టిలో పాపను పరుండబెట్టి నిద్రబుచ్చుతూ పాడే లాలిపాటలు మొదలు వృద్ధాప్యం పొంది జీవితానుభవాలను చిత్రీకరించే తత్త్వాలదాకా వీరి గళాలనుంచి గగనవీధి దద్దరిల్లేలాగ భావపూరితమైన పాటలు ఎన్నో వెలువడువాయి. ఒక్క మాటలో చెప్పాలంటే-మానవజాతి ప్రతిబింబాన్ని ప్రతిధ్వనింపజేసే సాహిత్యం స్త్రీల సాహిత్యం అంటే చాలు చూడండి: తెలుగుపడుచు నిలువని వాకిలి, గడప, ఉత్సవం, పెళ్ళి, ఇల్లు ఏవుంది? పురుషునితో పాటు, సంఘంతోపాటు, సమాజంతో పాటు అన్ని రంగాలలోనూ-అన్ని వెంపులనుంచీ స్త్రీ మనకు కనిపిస్తుంది. మనతో సహకరిస్తుంది. సహజీవనం సల్పుతుంది-కష్టనష్టాలను సమానంగా పంచుకొని సమాజపు పల్లకీని ఓ భుజంతో మోస్తుంది - అందుకే స్త్రీలేని కావ్యం కథ, కబురు-గడప వాకిలి లేదు అలా స్త్రీ లేని వాకిలి వున్నా ఓరవాకిలే అది, మకరందం లేని మందారమే అది. వింతా, పసందూ లేని ఓ సందే అది. అటువంటి ఘనతరమూ, ఘటుతరమూ అయిన-మధురమూ-మహిమాన్వితమూ, అయిన ప్రమదల ప్రత్యేకతలను చూపించే స్త్రీలపాటలను పరికిద్దాం:

"శ్రీ సూర్యనారాయణా మేలుకో
హరి సూర్యనారాయణా మేలుకో..."

అంటూ మన ఇళ్ళలో ఆడవాళ్ళు ఉదయం సమయాలలో మేలుకొలుపులు పాడుతుంటారు, కాని మేలుకొలుపులు ఏవి విన్నా అంత ఆశ్చర్యం లేదు. కాని, ఈ మేలుకొలుపు పాటవింటే చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఎందుచేతనంటే... లోకాన్నే మేలుకొలపవలసిన నారాయణునికి ఇంకా మేలుకొలుపు ఏమిటి? అని.



సూర్యునితోనే లేచి, సూర్యునితోనే నిదురించే మనం-సూర్యుని మేలుకొలుపుతూ పాడడం అంటే ఆశ్చర్యమేకదూ చెప్పండి. అటువంటి ప్రత్యేకతలు ఒక్క స్త్రీ సాహితిలోనే ఉన్నాయని అనుకుంటాను.

అసలు స్త్రీ సాహితిలో ప్రత్యేక స్థానం అలంకరించుకొని వున్నవి మేలు కొలుపులు.

ఈ మేలుకొలుపులను - భూపాల రాగంలో - మహానందం కుమ్మరిస్తూ మన ఆడవాళ్ళు తెల్లవారు సమయపు పిల్లతెమ్మరలు వీస్తూన్న సమయంలో పాడుతుంటారు. మన తెలుగువారి నిత్యజీవితాన్ని ప్రతిబింబించేవి ఈ స్త్రీల పాటలే. తరచిచూస్తే ఈ స్త్రీలకు సంబంధం లేని రచన చరిత్ర, సంస్కృతి లేదనిపిస్తుంది. ఉయ్యాలనుంచి యుద్ధందాకా ఈ స్త్రీలకు సంబంధం కనిపిస్తుంది.

యక్షగానాలు ప్రాసిన కవయిత్రులు వున్నారు, యుద్ధాలు సలిపిన వీర నారులు వున్నారు. చూడండి, సీతాదేవి కూడా యుద్ధం చేసిందట. పసగాడి సన్యాసి రచించిన దశకంఠుని రామాయణంలో దశకంఠుడు (రావణుడు) మరణానంతరం-శతకంఠుడనే రాక్షసుడు రావడం-ఆతనికి రామునికీ యుద్ధం జరగడం-అందులో అంటే ఆ యుద్ధంలో సీతాదేవి కూడా పాల్గొనటం తెలుప బడింది.

అక్కడదాకా ఎందుకు, మన తెలుగు గ్రామాలలో కదురుపాట అని ఒక పాట వుంది.

"వడుకు వడుకూ కదుర
పడకవే కదురా
ఏకుల్ల బుట్టంత
ఎల్లుండి సంత
ఏకేకు ఒక బార
ఎల్లుండి సంత
నా యేకులై పోయె
నాకేమి చింత !
ఏకుల్ల యెల్లక్క
పత్తిపుల్లక్క
రాట్నాల రామక్క
రావె పోదాము—"

అని పాడే ఈ స్త్రీ మనోధైర్యానికి తార్కాణంగా చెప్పదగిన...

''కదురు సల్లాగుంటే
కదలింతు గోల్కొండ...''

అని చెప్పిన స్త్రీయే ఆఖరున ఏమంటుందో—ఆ పాటలో

''మగడెందుకే తగని
మగడెందుకే—''

అని. ఈ పాట ఏమిటి అంటారు? ఈ కదురుపాట పల్లెవారి ఆర్థిక జీవనానికి చక్కని ఆద్దం. స్త్రీ యొక్క ఆర్థిక పారతంత్రమే మగవాని జులుమునకు మద్దతు. కదురు చల్లగుంటే తగని మగడెందుకూ? అని పేర్కొన్నారు.

* ''పురుష కవుల ప్రపంచం వేరు, వారి భావనా పరిధి, ఊహా సంపద అనంతము, అతి విచిత్రము. ఇక రచయిత్రుల లీలా విలాసమంతయు గృహాం గణములకే పరిమితములై యుండి వాని వికాసమునకు అవి తోడ్పడుచుండును. వారి ఆశయములు, ఆశలు అభివృద్ధి చేసి తీర్చిదిద్దినవై యుండును. కనుక, వాటి కల్పనా పటిమ, భావనా సంపద, రచనా సంవిధానము ఆ హద్దులకు, ఆ పరిమితికి లోబడియున్నంత మాత్రముచేత అది సంకుచితమైనదని, అందుసరిఅయిన విజ్ఞానముండదని భావించరాదు. పురుష కవులు తమకుగల భావనా పటిమతో, వర్ణనా నైపుణ్యముతో మహత్తర కల్పన సంతటిని రచయిత్రులు తమకు గల స్వల్ప పరిధిలోనే గృహ సంబంధమైన తమ విజ్ఞానముతో, అనుభవముతో, అనుభూతితో ఈ పాటలను మధురాతి మధురంగా తీర్చిదిద్ది అనంతమైన తమ కాలమున సంభవించు ఒడుదుడుకులను ఎదురొడ్డి నిలుచునట్టి విజ్ఞానకళాఖండములుగా వానిని తీర్చిదిద్దిరి.''

ఈ పాటనే తెన్నేటి సూరిగారు ఇంకోలా పేర్కొన్నారు. మొదటిపాటంతా పైపాటలాగే సాగుతు ది. కాని, ఆఖరున మగడెందుకే తగని మగడెందుకే ... అన్న చరణానికి బదులు...మగడు యుద్ధానికి పోతే సంతోషంతో ఏకులు వదుపుకుంటాను—దేశ స్వాతంత్ర్యంకోసం భర్త వెళ్ళాలి—ఢిల్లీ చల్లగుండాలి అని.

ఏమైనా ఏనాడూ స్త్రీ దేశం కోసం - జాతి కోసం - పాటుపడేది అని తేలుతుంది. స్త్రీ వాఙ్మయంలో ఇటువంటి ప్రత్యేకతలు ఎన్నో వున్నాయి.

''ఏడుకొండలవాడ
వెంకటా రమణా
మేలుకో తెల్లార వచ్చెను...''

---

* చూ॥ స్త్రీల పాటలు : పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు.

అంటూ పాడుతుంటే - భక్తి రసము హృదయాలలో ప్రవహిస్తుంది. ఈ మేలుకొలుపులూ మొదలయిన పాటలు తెలుగు నేలలో ఏ ఒక మూలనో పాడుకొనేవి. ఏ ఒకరో ప్రాసినవీ కావు. నేల నాలుగు చెరగులా పాడుకుంటారు. మన తెలుగు హృదయాలనే ప్రతిధ్వనింప జేస్తాయి ఈపాటలు. అటువంటి విశాలత్వం చేకూర్చుకోబట్టే భాష సులువు, సాఫీగా వుండి, తేట తనంతోపాటు మాధుర్యాన్ని కూడా పొంది వుంటుంది.

ఈ స్త్రీల పాటలలో విశేషమేమంటే - కొన్ని పాటలలో వున్నట్లుగా ద్వ్యందార్థాలూ, కల్పితాలూ వుండవు.

శరద్రాత్రి నిండు వెన్నెలకో పెండ్లివారి బండి ప్రయాణంలాగా ఉంటుంది ఈ స్త్రీ సాహితీ అలాగా సాగుతుంది ఈ పద జాలం.

"మేలుకో శ్రీరామ
మేలుకో రఘురామ
మేలుకో గుణధామ
మేలుకో...
దీనుల రక్షింప
దీక్ష పహించినా
దేవ నిద్రా వేగ మేలుకో—-'

ఈ మేలుకొలుపు పాట మానవ హృదయంలోని వేదననూ, ఆవేదననూ ప్రతిధ్వనింప జేస్తుంది. శ్రీరాముడు తెలుగువారి అధిష్టాన దైవం అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇంట్లో అతని పేరు, సీతమ్మ పేరూ పెట్టని తెలుగువారు చాలా తక్కువ. ఆ మహిమాన్విత నామాలను వింటేనే తెలుగు హృదయం పరవళ్ళు తొక్కుతుంది. ఏ తెలుగు వాకిట చూసినా రామాయణ కాలక్షేపాలూ, సీతా కళ్యాణాలూ, భజన గోష్ఠులతో తెలుగు నాడంతా రామమయమై ఓయని పల్కుతూ ఉంటుంది. అంతకంటె తెలుగు ఆడ బడుచుల హృదయాలు సీతమ్మ పేరు వింటేనే పాల కడలిలాగ పొంగులు వారుతాయి.

"లేవే సీతమ్మా
లేవే ముద్దుల గుమ్మా
లేవే బంగరు బొమ్మా లేవే..."

అన్న పాట తెలియని స్త్రీ హృదయం తెలుగునాడున కనిపించదు.

కష్టంవచ్చినా, సుఖంలో తెలియాడుతున్నా, శ్రీరాముని తలవడంమాత్రం మనుషరు, మరువలేరు తెలుగువారు - అదే వారి ప్రత్యేకత.

కాని ఈ మేలుకొలుపులు అనేవి ఏమిటి ? దేముడు నిద్ర పోవడం అనేది వున్నదనీ - అలా నిద్రలో మునిగి ప్రజా రక్షణ కృషి మరచిపోకుండా, భక్తుల కోసం మేలుకొనమని ఎప్పుడూ మేలుకొనే ఉండు సుమా ఈ దీనులకోసం అన్న అర్థం ఇందులో ధ్వనిస్తూంది.

స్త్రీల పాటలలలో ఉయ్యాల పాటలు చాలా మనోహరంగా ఉంటాయి. ఈ పాటలు అనేక పరుసలలో వుండి చివరన ఉయ్యాలా అనో, లేక ఉయ్యాలో అనో ఊత పదం వాడబడుతూ ఉంటుంది.

ఈ పాటలు పాపలను ఉయ్యాలలో పరుండ బెట్టి ఊగించడం మొదలు అట్లతద్దిలో పెద్దలు ప్రాడు ఉయ్యాల లూగి కోతలూ, ఊడ్పుల సమయాలలో ఏదో ఒక కథను చెబుతూ ఆఖరున ఉయ్యాలా అంటూ ఈ ఉయ్యాల పాటలు పాడుతుంటారు.

"ప్రబంధ కవులు ఊహించు ఊహల కన్న ఈ స్త్రీల పాటలలో ఎంతో లాలిత్యం, మధుర్యం, సౌందర్యం, యధార్థత గోచరించుచుండును. నిత్యజీవిత ములో ఇవి ఎంతయో సన్నిహితంగా ఉండి సహజ సౌందర్యంతో, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తుంటాయి. తమ కన్న బిడ్డలను తలచుకొని మాతృమూర్తి పొందే ఆనందం, అనుభూతిని ఈ చిన్ని పాటలో చవిచూడగలం.

"గోరంత దీపమ్మ కొండంత వెలుగు
గోపాలకృష్ణమ్మ గోవులకు వెలుగు
మాడంత దీపమ్మ మేడెల్ల వెలుగు
మా చిన్ని అబ్బాయి మా కళ్ళ వెలుగు"

— అలాగే మరోటి,

పూసపాటి వారి లోగిళ్ళలోన
పురి విప్పి ఆడింది పుణ్యంపు నెమలి
భాగ్యపాటి వారి లోగిళ్ళలోన
పాల్లాగి ఆడింది పట్టి అమ్మాయి

— ఇలా వీటి సొబగులు అనంతం.

అసలు ఈ ఉయ్యాల పాటలు అనేవి, ఉయ్యాల అనేది చిన్నవారికేకాదు ప్రేమీప్రేమికులు, భార్యాభర్తలూ, వారు వీరూ ఏమిటి అందరూ సరదాగా పాడుకుంటూ ఊగుతారు. ఇందులో అంత ప్రత్యేకత కనబడుతుంది.

అంత ప్రత్యేకత లేకుంటే పెద్దన్నగారంతటి వారుకూడా ఇలా పేర్కొంటూ చెప్పండి ! కవిత్వం చెప్పడానికి ఉంచుకున్న హంగులను పేర్కొంటూ...

"నిరుపహతి స్థలమ్మె
రమణీ ప్రియదూతిక అంది యిచ్చు
కప్పుర విడెంతోబాటు
బంగరు తూగుటుయ్యల..." అన్నారు.

చంటి పిల్లలను నిద్ర బుచ్చడానికే కాదు - ఆఖరికి కవిత్వోపాసనకూ ఈ ఉయ్యాల కావాలన్నారంటే యీ ఉయ్యాల పాటలో ఉండే ఘనత ఎంతటిది అంటారు ?

ఈ ఉయ్యాల పాటలు - అటు ఏ చెట్టు కొమ్మకో ప్రేలాడగట్టిన పాత చీరలో పరుండి ఆడుకునే బీద పసికూన నుంచి, ఇటు అంతఃపుర సౌధాలలో చక్కని తూగుటుయ్యాలలో ఊగే కలవారి బిడ్డ దాకా నిద్రపోయి - ఆడుకోవడం సహజంగా జరుగుతూంటుంది.

వారూ వీరూ అనే భేదం లేకుండా అన్ని తరగతులలోనూ ఈ పాటలకు విలువ, గౌరవం, స్థానం ఉంది - అదే ఈ పాటలకున్న ప్రత్యేకత, ఆకర్షణ.

అలాగే స్త్రీల పాటలలో తలుపుచగ్గర పాటలని పాడేవి ఉన్నాయి. ఈ పాటలు ఏ దేవుళ్ళ మీదో పెట్టి పాడుతారు.

"శ్రీ కాంతామణి
నేనీ సఖుడను
శీఘ్రము వాకిలి తీవే, నీవు
శీఘ్రము వాకిలి తీవే—"

అని భర్త అడుగుతాడు. అంచుకు సమాధానంగా-

"ఓ కాంతుడ నీ
గుణములు తెలిసెను
ఊరికి వెళ్ళగదోయీ - నీవు
ఊరికి వెళ్ళగదోయీ—"

అని భార్య సమాధానం ఇస్తుంది. ఈ పాట ఇలాగే సాగి ఆఖరున రాజీగా అంతమౌతుంది.

ఏమిటో - ఆ పరాత్పరులలోనే ఒకరిమీద ఒకరికి ఇంత అనుమానాలయితే ఇక మానవమాత్రులలో వీటిని గురించి ఆలోచించాలా చెప్పండి.

అక్కడదాకా ఎందుకు - అందుకే - బ్రహ్మంగారను కుంటాను...

"రాముడంతటివాడు
రమణి సీతనుబాసి
అడవులా పాలాయెరన్నా..."

అని సెలవిచ్చారు.

ఈనాడు జీవితాలే కారడవులయినప్పుడు ఇక ఆలోచనకే తావులేదు. అదేకాదు - నేడేకాదు - నాడూ ఇద్దరు స్త్రీల మధ్య తన భర్తల అందచందాలను గురించి ఎంత పట్టింపులు వుండేవో చూడండి:

ఈ సంవాదం గౌరీ, లక్ష్మి మధ్య సాగుతుంది...

"గౌరిదేవి నీ శంభుదేవునకు
గళమున నలుపేమమ్మా..."

అని లక్ష్మి గౌరిని అడుగుతుంది—ఆ మాటకు గౌరి ఎంత సూటిగా సమాధానం ఇస్తుందో చూడండి...

"నారీమణి నీ విష్ణుదేవుడూ
నలుపు కాదటే కొమ్మా..." అని!

ఇలా ఇద్దరిమధ్య నడుస్తుంది - ఈ సంవాదాలు చూడ ముచ్చటగాను, వినసొంపుగాను ఉంటాయి. ఈ సంవాదంలో గొప్పతనం హరిహరుల అపతారాలు కళ్ళకు కట్టినట్లు చిత్రించడం గమనార్హం.

ఇక స్త్రీల సారస్వతంలో సందేశాలు చూడండి. జానపద సాహిత్యంలో కూడా కావ్యాలలోలాగ మేఘసందేశం, దమయంతి హంస సందేశలాంటి సందేశాలూ ఉన్నాయి.

పక్షులద్వారా, మేఘాలద్వారా తమ సందేశాన్ని ప్రియునికి తెలియ చెప్పటంలాంటి రచనలు చాలా వున్నాయి. అటుపంటిదే ఈ గేయం. ఈ గేయంలో రంగనాథుని జాడ తెలియక ఒంటరితనాన్ని భరించలేక అలా వెన్నెలలో కూర్చుని తన బాధను రంగనాథునికి చెప్పమని చందమామ ద్వారా సందేశం పంపుతుంది లక్ష్మీదేవి.

"నావెన్న దన్నూకో
నాడూ జన్మించినా
చందమామా.
నా నగధారులతో
నా మనవీ దెల్పావే
చందమామా.
నిన్నా నీ పొద్దూన
తిన్నన్నమే గాని
చందమామా.
నీ కన్నుల నే
నన్య మెరుగనయ్యా
చందమామా.
పాలాసంద్రునీ యింట
పుట్టినామూ మనము
చందమామా.
ఇంత పగతూడవై నన్ను
బాధింపుడదియేమొ
చందమామా—"

.... ఇందలి భావం ఎంత హృదయంగమంగా వుందో గమనించండి. చిలుకమ్మ ద్వారా శ్రీకృష్ణునికి రుక్మిణి సందేశం పంపడం విన్నదే. సరే-నలమహారాజు హంసద్వారా రాయబారాలు పంపిన సంగతి చదివిందేకదా. పోతే సీతాదేవి రాములవారికి రాయబారమంపిన విషయము పాటద్వారా మనకు విదితమే - అది ఎలాగుందో వినండి...

''భూదేవి కూతుర్ని కోయిలారో
జనకుని కూతుర్ని కోయిలారో
దశరథుల కోడల్ని కోయిలారో
శాంతకు మరదల్ని కోయిలారో
రాఘవుల దేవిని కోయిలారో
నల్లనయిన వారె కోయిలారో
నవ్వుచూవుందురే కోయిలారో
శ్రీరామచంద్రులే కోయిలారో
భర్తను విడిచుంటి కోయిలారో
ఆహార నిద్ర లేకుంటి కోయిలారో
రాము రమ్మని చెప్ప కోయిలారో
మెడది హారం యిస్తు కోయిలారో
ప్రాణేశు తో డ్తెమ్మ కోయిలారో
పక్షిచేసిన పనులు కోయిలారో
ఉపకార మెయుండు కోయిలారో...''

ఇందులో కవి ఎంత ఇంపుగా సందేశం సడిపించాడో గమనార్హం.

అలాగే అన్నగారితో చెల్లెలు సలహాగా చెబుతున్న ఈ పాటలో ఎంత యథార్థత, జీవితసత్యం ఇమిడి వుందో :

''ఊరి ముందరి చేను
చేయకుర అన్న,
ఊళ్ళోన వియ్యంబు
అందకుర అన్న,
ఊరి ముందరి చేను
కాకుల్లపాలు,

తోళ్ళోన వియ్యంబు
మాటలా పాలు... '

దీంట్లో ఏది యథార్థం కాదంటారు ?

నేడేకాదు-నాడూ అత్తవారింటికి అడుగుపెట్టిన కోడలిని యివి తేలేదు అనడం ఉంది. అత్తవారి యింటికి వెళ్ళింది సుభద్ర :

"పున్నెంబు నాడైన
బూరెలొండుకొనీ
పుణ్యీద రమ్మనీ
పిలిచిరా మీవాళ్ళు ?
అమవాస్యనాడైన
అట్లు వండుకోనీ
అల్లుడా రమ్మనీ
పిలిచిరా మీవాళ్ళు ?"

అని సుభద్రని నిలవేస్తాడు అర్జునుడు. దానికి సుభద్ర మా వాళ్ళు బీవవాళ్ళని సమాధానం చెప్పడం, చివరకు పుట్టింటికి వెళ్ళి అన్నగారిని అడిగి ఏవేవో పట్టుకు వచ్చి అర్జునుడిని సంతృప్తిపరచడం వరకూ ఈ సంవాదం నడుస్తుంది. ఈ పాటలో మధ్యతరగతి సంసారాలలో జరిగే నిత్యానుభవాలు జ్ఞప్తికి వస్తాయి.

ఇటువంటివన్నీ మన పాత చరిత్రలకు నిఘంటువుల లాంటివే.

పెళ్ళిళ్ళలో వుండే వాతావరణం చూస్తే ఆనందం ఆకాశం ఎత్తు ఎగురుతుంది. ఆ పెళ్ళి అయిదు రోజులూ ఏ అరమరికలూ లేకుండా వుంటారు. అటువంటి అరమరికలకు తావు వుండనివ్వదు ఆ వాతావరణం. అందుకే బాపగార్లమీదా, వదినగార్లమీదా, వియ్యాలవారిమీదా వేళాకోళాలు, వెక్కిరింతలూ రూపంలో పాటలు పాడుతారు. అవి వినాలి - ఆ పెళ్ళిళ్ళు చూడాలికాని, వాటిని గురించి రాయడం, చెప్పడం కష్టం. వీటినే పెళ్ళిపాటలు అంటారు. ఈ పెళ్ళి పాటలనే మనం బూజుబంతి పాటలు, అలకపాన్పు పాటలు, అంపకాల పాటలు అనికూడా వ్యవహరిస్తుంటాం.

ఏదో పెద్ద నిరవాకం చేస్తూ బావగారు వచ్చారు. చూసింది మరదలు పిల్ల - ఊహు, సమయం పోనిస్తే ఎలాగ ?

"చూపులేనీ బావగారికి
శుభా మ్ంగళం
చేయిలేనీ బావగారికి
జయా మంగళం..."

అంటూ పాడుతుంది. ఈ పాటలో ఎంత చనువూ, కలిసికట్టుతనం, చిలిపితనం- ఎంతగా పొంగులు వారుతున్నదో విన్నారూ ?

అదేమిటి - ఎదురుగుండా వదినగారు కనబడేప్పటికి...

"వదినారో నీవెంత
నెరజాణా వమ్మా..."

అంటూ పాట మొదలు పెడతారు. వియ్యపరాలకు పెళ్ళిలో పీటవేసి-వెండికంచం వేసి, నిండావున్న పిండివంటలూ, అన్నం, పప్పూ, కూరా, వడియాలూ - ఓ పాతిక చెయ్యి పట్టకుండా వడ్డిస్తారు, వడ్డించి యింకా ఎక్కడ ఆలుగుతుందో అన్నట్లు ప్రక్కనే కూర్చుంటుంది పెళ్ళికూతురు తల్లి. ఆ సమయంలో ఆడపెళ్ళి వారు పాడే పాటలు కడుపుబ్బా నవ్విస్తాయి.

"విందూ చేసినారూ
వియ్యాలా వారింటా
విందూమాట చెబితే
వింతగా వుంటుంది,
పొట్టి బావగారూ
కొట్టూ పెత్తనమాట
కొట్టూలో సరుకులూ
ఇపతలకూ రానీయరూ,
అత్తగారూ వచ్చీ
పళ్ళెం తట్టినాదీ

మామగారు వచ్చి
మటమటా లాడేరూ
పెద్దా బావగారూ
మేళం పద్ద నుండే
వదినగార్లంతాను
వడ్డించా బోయారూ..."

ఈ పాట విన్నాక మీకుమాత్రం నవ్వు రాలేదంటారా?ఇలాటి పెళ్ళిపాటలు, వేళాకోళం పాటలు ఈ స్త్రీలపాటలలో లక్షోపలక్షలున్నాయి. సరే-పెళ్ళి అయి నది మొదలు ఆడ అమ్మాయికి ఊపిరి సలు పనంత ఉద్యోగం- నోములు, వ్రతాలు, పని పాటలు.

గొబ్బి అని పాడుతారు. పేడను ఉండగా బెట్టి, అందులో బంతిపువ్వో, గుమ్మడిపువ్వో పెట్టి పాడే ఈ పాటలో-రేపటి తన జీవితానికి ఈనాటినుంచీ మంచినే కోరుకుంటూ పాడే ఈ పాటలు చూడండి...

"సుబ్బీ గొబ్బెమ్మా
సుబ్బడ్నియ్యావే
చామంతి పువ్వంటి
చెల్లెల్నియ్యావే
తామర పువ్వంటి
తమ్ముడ్నియ్యావే
మల్లీ పువ్వంటి
మొగుడీ నియ్యావే..."

ఆలాగే మూగనోములని ఉన్నాయి.

ఈ పాట నడక - శైలి ఎలాగ సాగుతోందో వినండి, సీటిమీద తామర పూవులాగ.

"మోచేటి పద్మమ్మ
పట్టేటి వేళ

మొగ్గల్లు తామరలు
పూసేటి వేళ
సందేళదీపంబు
పెట్టేటి వేళ
చాకింది మడతల్లు
తెచ్చేటి వేళ
ఆవుల్లు దూడల్లు
వచ్చేటి వేళ
ఆబోతు రంకెల్లు
వేసేటి వేళ
అన్నల్లు అందలా
లెక్కేటి వేళ
బావల్లు పల్లకీ
లెక్కేటి వేళ
అక్కల్లు మజ్జన్న
మాడేటి వేళ
బీరాయి పువ్వుల్లు
పూసేటి వేళ
బిండెలతో ఉదకంబు
తెచ్చేటి వేళ
ఆనపా పూవుల్లు
పూచేటి వేళ...''

అవన్నీ సరే - ఆడవారివి అనుకోండి - **మగవారిని** కూడా కవ్వించే ఈ **అట్లతద్ది నోము** ఏమిటి చెప్పండి.

తెల్లారకుండా లేవడం - గుంపులు గుంపులుగా కూడి నిద్రపోతూన్న **వాళిని కూడా** లేవడం-అక్కడనుంచి - ఆటలు - తరువాత ఉయ్యాల లూగడం, **కడుపునిండా** అట్లూ తిమ్మనం ఆరగించడం - ఎంత విచిత్రమైన పండుగ - **నోము** యిది,

నాలుగింటికే లేస్తారు ఆడ పిల్లలూ - మగ పిల్లలూ.

"అట్లతద్దోయ్ ఆరట్లోయ్
ముద్దపప్పోయ్ మూడట్లోయ్
పిడికిల క్రిందా పిల్లల్లారా
లేచీ రారండోయ్..."

అని ఒక్క యిదిగా ఈ పాట పాడుతూ బయలుదేరుతారు. ఆటలూ, పాటలతో తెల్లవారుతుంది. అక్కడినుంచి (ఈ నోముకు ఏడు వుయ్యాలలు కాబోసును ఊగాలనే శాస్త్రం వుంది) ఉయ్యాల లూగడానికి బయలుదేరుతారు.

ఈ పండుగ వస్తుందంటే చాలు - ప్రతి వాకిటా-ప్రతి యింటా ప్రాడు ఉయ్యాలలూ, బల్ల ఉయ్యాలలూ వేసి, సిద్ధం చేస్తారు. గ్రామాలలో పెద్ద పెద్ద చెట్లకు ఉయ్యాలలు వేసి అందరూ ఊగుతారు. అది ఒక సమష్టి జీవిత విధానానికి ప్రతిబింబం. అందులో రైతుకుటుంబాల యిళ్ళలోనే యిటువంటి అంద చందాలకు ఒక ప్రత్యేకత కనిపిస్తుంది.

ఆ ఉయ్యాలలో ఒకరికి యెదురుగా ఒకరు నిలబడి భయం లేకుండా రంగు రంగు చీనీలు పోసిన పరికిణీలు గాలికి ఎగురుతూంటే, పచ్చచామంతులూ పూబంతులూ ఆ గాలిలో జడలమధ్యన దోగాడుతుంటే చూసేవాళ్ళకు ఏ లోకంలోనో విహరిస్తున్నట్లే వుంటుంది.

అలా పాడే పాటలో...

"ఓయి దామలాల ఉయ్యాలా
బామ్మందూనా ,,
రాజు మారాజు ,,
ఏడుగురు కొడుకులు ,,
ఆర్గురు కొడుకులకు ,,
కళ్యాణమయింది ,,
కడసారపు కొడుక్కి ,,
కళ్యాణ మవలేదు ,,

ఓయి బామలాల ,,
బామలందూనా ,,
.....,,

ఎంత హాయిగా ఉందంటారు యీ పాట.

సరే, ఈ నోములు తాము ముందు ఏదో ఫలితం పొందదలచి చేస్తారు. అదిసరే, సాక్షాత్తూ భగవత్స్వరూపుడైన సుబ్రహ్మణ్యేశ్వరునికి ఈ స్త్రీ లోకం సలహా యిస్తూందంటే వింతగా కనిపించడం లేదూ!

నాగుల చవితి అనేటప్పటికి పాలు పుట్టలో పోసి నాగుమయ్యను ప్రార్థిస్తారు.

"పడగలెత్తకు పాము
పగవారము కాము
పడగెత్తి చూసింది
నాలుకలు రెండు
నాలుకలు దూయకే
నీవారము నాగు
మంచినాగువైతే
పంచెలెట్టేము
కోడెనాగూవైతె
కోకలెట్టేము
.....
.....
మా పత్తి పండితే
పంచలెట్టేము
పడగెత్తకే నాగు
పగవారము కాము
నీ పూజ చేసెదము
నీకు ప్రొక్కెదము..,"

అని నాగుమయ్యని ప్రార్థించిన వీరే, చివరకు ఆ నాగుమయ్యని బంధువుగా భావించి ఆప్యాయతతో సలహాలు యిస్తారు.

"పుట్టలో నాగన్న
బూచి నాగన్న
ఎండలో పడుకోకు
వెర్రినాగన్న
.....
అటుబోకు నాగన్న
చాకిరేవులకు
సాలెపురుగని నిన్ను
చంపుతారు వారు...
....."

అంటూ బుద్ధులు చెపుతున్నారంటే - మనకు వింతగా లేదంటారా ? అలా నోములు పూర్తి అయాక అమ్మాయిని అత్తవారి యింటికి పంపుతారు. అలా పంపుతూ తల్లి కూతురికి బుద్ధులు చెబుతూంది :

"మాయమ్మా లక్ష్మిందేవి
పోయీరావమ్మా
పోయీ నీ అత్తింట
బుద్ధి గలిగుండూ
ఎవ్వరేమనినా
ఎదురాడకమ్మా
వీధినిలుచుండి తల
విప్పి ముడవకుమీ
మాట లెన్నన్నాను
మాటాడకమ్మా
పలుమారు మామీద
ప్రేమలుంచకుమీ

అతనీ కాదనీ పూలు
ముడవాబోకమ్మా...''

అని తల్లి సలహా యిచ్చి సాగనంపుతుంది.

ఈ పాట వింటూంటే ఓ బంధువుకు దూరమైపోతున్నట్లు మనం బాధ పడతాము. అలా పుట్టింటినుంచి అత్తింటికి వెడుతూ, చెల్లెళ్ళకు, అక్క, అన్నలకు అప్పగింతలు పెడుతూంది:

''బొమ్మరిల్లున్నాయి
బొమ్మలున్నాయి
నేను ఆడేటి
సాలలున్నాయి
నా మారుగా మీరు
ఆడుకోరమ్మా
పోయి నా అత్తింటికి
పోయి వస్తాను
దీవించు అన్నయ్యా
దీవించు అక్కా—''

అని కంటితడితో బండి యెక్కుతుంటే అంతదాకా ఆడుకొన్న చెల్లీ, తమ్ముడూ ఏ విధంగా బాధపడతారో ఈ పాటలో ప్రతిధ్వనించడం గమనించండి.

అలా అత్తింటికి వెళ్ళిన కోడలు భర్తకూ, అత్తగారికీ అణగిమణగి ఉండాలి - ఊఁ అంటే భర్త అలుగుతాడు - అలా అలిగిన భర్త - భార్యతో సూటిగా మాటాడకుండా ఏ చిలుక మీదనో పెట్టి పనులు ముగించుకో చూస్తాడు. అటుపంటి విచిత్రమైన యీ పాట చూడండి.

ఎదురుగుండా తడిక కనబడింది - తడిక పక్కనే వుంది భార్య. తడిక ద్వారా రాయబారాలు:

''కొల్లూరు తెచ్చాను
గోంగూర తెచ్చాను

వండమాని చెప్పవే
తడికమ్మా..."

అని భర్త తడికతో కబురు పంపుతాడు. భార్య మాత్రం ఏం తీసిపోదు. ఆ తడికతోనే...

"కొట్టికూర తెస్తేను
గోంగూర తెస్తేను
వండనాని చెప్పవే
తడికమ్మా..."

అని సమాధానం యిస్తుంది.

ఈ విధమైన తడిక రాయబారాలు, చిలుక రాయబారాల లాటి పాటలు చాలా వున్నాయి. కాని ఇక్కడ ఒక చిన్న అనుమానం: కూనలమ్మ పదాలని కొన్ని వున్నాయి. ఈ కూనలమ్మ పదాలు అన్నవి మరం అనుకునే కూని రాగాలు తీస్తున్నాడనీ, కూనలమ్మ సంగీతాలు తీస్తున్నాడనీ అంటున్నాము. అలా ఒక నానుడి వుంది. వీటికి సంబంధించిందే ఈ క్రింది పాట :

"జపతపంబులకన్న
చదువుసాములకన్న
ఉపకారమే మిన్న
ఓ కూనలమ్మా!

అన్నమిచ్చినవాని
నాలినిచ్చినవాని
నపహసించుట హీని
ఓ కూనలమ్మా.

మగని మాటకు మాట
కెదురుబల్కెడి బోటి
మృత్యుదేవత సాటి
ఓ కూనలమ్మా."

ఈ పాటలు కూలనమ్మతో చెబుతూన్నట్లు వేదాంతపరంగా పాడతారు. కాని ఈ పాటలో కొన్ని చరణాలు యింకోలాగ కూడా వినవొను - మచ్చుకు :

"ఆడితప్పినవాని
ఆలిమరచినవాని
ఆదరించుట
మోసమన్నా..."

అంటూ 'మోసమన్నా' అన్న సంబోధనగా నడుస్తాయి.

బాల్యంలో ఆటపాటలతో చక్కగా పెరిగి పెద్దయిన అమ్మాయి. యుక్త వయస్సు వచ్చేటప్పటికే నోములని, వ్రతములనీ ప్రారంభిస్తారు. అక్కడినుంచి వివాహం, అత్తింటికి వెళ్ళడము జరుగుతుంది. అక్కడినుంచి సంసార తాప త్రయం, గృహిణిగా కర్తవ్య నిర్వహణ ప్రారంభం.

ఈ గృహకృత్యంలో జరుపుకొనే ప్రతి పనికీ ఒక్కొక్క పాట వుంది అంచుక్రిందకే దంపులు, విసురుతాతి పదాలు, నీళ్ళతోడు పాటలు మొదలయినవి వస్తాయి.

ఆలా అత్తింటికి వెళ్ళిన కోడలిని దంపు దంపమంది అత్తగారు. ఒక్కతే దంపుతూంటే ఊసుపోవాలిగా మరి - అందుకు:

"నా చేతి రోకళ్ళు
సల్ల రోకళ్ళు
వేయించు అన్నయ్య
వెండి పొన్నుల్లు
.....
కోడలా కోడలా
కొడుకు పెళ్లామా
పచ్చిపాలమీది మీగడేది
వేడిపాలమీది వెన్నలేవి?
.....

పాపమ్ము చేసుకుని
బావిలో పడితే
పైమురికియేగాని
పాపాలు పోవు
.....
దంపు దంచాలేను
దండె త్తలేను
.....
వేపచెట్టూ కాద
నా బొమ్మరిల్లు
కూకోర అన్నయ్యో
కూడొండుతాను !
కూటికీ కాదప్ప
కూతురుకొచ్చాను..."

లాంటి పదాలు వందల కొలదీ వున్నాయి. ఈ పాటలద్వారా కష్టాలు - సుఖాలు, నీతులు-నియమాలు చెప్పుకుంటూ పనిలోవుండే కొంతశ్రమని ఈ పాట పాడ్డంలో మరచిపోతారు.

అలాగే విసురు, రాతి పదాలని వున్నాయి. పిండి విసురుతూ ఈ పాట పాడుతారు :

"చిలుక నీళ్ళు తోడే
జలకమాడేను
హంస అన్నము వండె
ఆరగించేను
వెలదీ మంచములాయె
వెన్నెలల పైటా..."

లాంటి పదాలు గృహకృత్య సారస్వతంలో చిరపరిచితాలు.

అప్పుడే లేచింది కోడలు - ఉదయం అయేటప్పటికి కవ్వము ఎదురౌతుంది. కోడల్ని పిలిచి మజ్జిగ చేయమంది అత్తగారు. కవ్వంతో మజ్జిగచేస్తూ పాడుతూంది ఈ పాట:

''అన్నా బిందేటి పాలు
కిన్నెరల మోత
అమ్మా చేసేదీ చల్లోయీ!
అమ్మా చేసేదీ చల్లా
కవ్వాల మోత
రాగిదీ కవ్వామోయీ...''

ఈ మజ్జిగ కవ్వం పాటలు తెలియని తెలుగువారు - అందులో రైతుకుటుంబాల్లో అరుదే అనుకుంటాను. ఈ పాటలు కొంచెం తేడాతో పరికిస్తే కోలాటం పాటలకు దగ్గరగా కనిపిస్తాయి. ఆ కవ్వాన్నే ఇద్దరు ఎదురెదురుగా నిలబడి తిప్పుతూ పాడితే కోలాటమే అనుకోవచ్చును. అలాగే రాట్నాల పాటలు. మన భారత దేశానికే-ముఖ్యంగా తెలుగునాడులో కూడా కుటీరపరిశ్రమలే కదా జీవితాధారం! ఈనాడంటే రాట్నాలు-మగ్గాలు-కొయ్యబొమ్మలు మొదలగు పరిశ్రమలు మూలపడుతున్నాయి గాని నాడు యివేకదా మనకు జీవనాధారం!

అటువంటి రాట్నములు త్రిప్పుతూ పాడే పాట యిది అనుకుంటాను.

''అందచందము లేని
ఆడకూతురుకి
అందమేరుపరచు
ఆ పత్తి చెట్టు!
కవ్వమాడని యిల్లు
కదురు త్రిప్పని కొంప
మగ్గము లేనూరు
పరి కాసరాదు...''

చూడండి. ఈ పాట మన పాత చరిత్రనూ-ఒక యథార్థ సత్యాన్ని ఎలా ప్రతిధ్వనింపచేస్తూందో.

అందంలేని ఆడకూతురికి బట్టలు సింగారిస్తే సరి ఎక్కడా లేని అందం వస్తుందట. ఈ మాట నిజం కాదంటారా ? విచిత్రంగా లేదంటారా ?

పూర్వకాలంలో కవ్వము, కదురు, మగ్గము వుండని కొంప లేదని - ఆ రోజులలో వాటికి అంత విలువ, బలిమీ వుండేదనీ - మనకు లెక్కలూ అంది స్తూంది.

ఈ పాటలను పరికిస్తే కొంచెం దంపుపదాల వరుసలోనే వినిపిస్తుంది అనుకుంటా.

పల్లెటూరి జీవనం అంత హాయి అయినదీ, గౌరవమైనదీ యింకోటి లేదు. అత్తగారు ఏ పనో చేస్తోంది. కోడలు వూరికే కూర్చుంటే ఎలాగ ? కదురు అందుకుంది. ఆ సమయంలో పాడే పాట యిది :

"వడకు వడుకూ కదుర
వడకవే కదురా
ఏకుల్ల బుట్టంత
ఎల్లుండి సంత
ఏకేకు ఒక బార
ఎల్లుండి సంత
నాయేకులై పోయె
నాకేమి చింత!
కదురు సల్లాగుంటె
ధిల్లి సల్లాగుంటె,
నా మగడు రాకున్న
నాకేమి చింత..."

అన్న యీ పాటలో స్త్రీ దేహ సౌభాగ్యంలో ఎంత భాగస్వామో, పూర్వపు దేహ సౌభాగ్యం కోసం స్త్రీ ఎంత సహాయపడిందో సుస్పష్టంగా తెలుస్తుంది.

ఢిల్లీ చల్లగుండాలట (అంటే ప్రభుత్వము అనుకుంటాను). ఢిల్లీ ప్రభుత్వ సైనికుడు అనుకుంటాను యీమె మొగుడు. అతను భార్యకోసమని ప్రభుత్వపు పనులు మానేసి వస్తే ఎలాగ ? రాదు. అలా రాకూడదనే ఈమె కోరిక. అందుకే కదురు సల్లాగుంటే (పొట్ట గడవాలిగా మరి) అందుతో పాటు - ఢిల్లీ సల్లాగుంటె నా మగడు రాకున్న నాకేమి చింత...అని యెంత ధైర్యంగా చెబుతుందో గమనించండి.

ఇక ఒక్క పరిచయాన్ని చూపి ముందుకు వెడతాను. స్త్రీల సారస్వత శాఖలో మంగళ హారతులకున్న హుందా, గొప్పతనం మరెందులోనూ కనుపించదు. కొన్ని కొన్ని పాటలు వింటూంటే అందులో లీనమైపోతాము కూడా. అటువంటి తరహాక్రిందకే వచ్చే ఒక పాట- ఎంత పసందైన నడకతో ముందుకు సాగిపోతుందో పరికించండి.

ఈ క్రింది పాటలో పార్వతి ఎక్కడికో బయలుదేరడం, ఎక్కడికని చెలికత్తెలు అడగడం, సంభాషణరూపంలో – శివుని అవతారాన్ని కన్నులకు కట్టినట్టుగా గోచరింపజేసే పద్ధతిలో సాగుతుంది. ఆ పాట యిది...

"ఘల్లూ ఘల్లూనా పాద
గజ్జెలందెలూ మ్రోయ
కలహంసా నడకాల
కలికీ ఎక్కడికే?
జడలోనూ గంగానూ
ధరియించుకొన్నట్టి
జగములేలే సాంబ
శివుని సన్నిధికే...
మంగళం – మంగళం

బొడ్డూమల్లెలూ జాజి
దండాలు మెడనిండ
అందామెరిగిన జగ
దాంబా ఎక్కడికే?

అందముగ విభూతి
అలరూగంధామూ
నలచీన నీల
కంతేశు సన్నిధికే.
మంగళం - మంగళం.

తళతళమనూ రత్న
తాటంకములూ మెరయ
పసిడీ మండలముల
పణతీ ఎక్కడికే
కలియూగ జన్మాము
గలశివుతైనట్టీ
గురువైనా శంభు
శంకరునీ సన్నిధికే
మంగళం - మంగళం
....."

ఇటువంటి గేయాలు యింకా ఎన్ని వున్నాయో ! గృహకృత్య సారస్వతం విలువ, పటిమ అంత బరువైంది !





బుర్రకథాతత్త్వం

జానపద వాఙ్మయంగా (రకరకముల దేశీయ ఛందస్సులలో పాటలు) ప్రసిద్ధిపొంది-చాలా ప్రాచీన చారిత్రక విలువను పొందిన జంగం కథలనే బుర్ర కథలు తెలుగునాడున జరిగిన ఎన్నో గాథలకూ, చారిత్రకాంశాలకూ ప్రతిబింబాలుగా నిలిచాయి.

జంగం కథలుగా తెలుగునాట ప్రచారమయిన ఈ సంగీత కథలు చాలా రూపాలలో - చాలా కథల యితివృత్తాలతో ప్రచారమయి వున్నాయి.

వీటిని గురించి యింతకుముందే ఎంతోమంది చారిత్రక పరిశోధకులు, జానపద వాఙ్మయోద్ధారకులు చర్చించి వున్నారు. కనుక, వారు సూచించిన ముఖ్య విషయాలను ఆధారంగాగొని జంగం కథాతత్త్వాన్ని దిఙ్మాత్రంగానైనా పరిచయం చేయడానికి ప్రయత్నిస్తాను.

ఈ తరహా దేశరచనలను గురించి - ఇంతకుముందే జానపద వాఙ్మయ పరిశోధకులు ఎంతోమంది కాలాలవారీగా, కథలవారీగా ఎన్నో వ్యాసములలో చర్చించి వున్నారు.

ఈ తరహా రచనలను, దేశిసారస్వతాన్ని గురించి శ్రీ కోరాడ రామ కృష్ణయ్యగారు, చిలుకూరి వీరభద్రరావు గారు, నిడుదవోలు వేంకటరావుగారు-యింకా ఎందరెందరో రకరకాల శీర్షికల క్రింద చర్చించియున్నారు.

క్రితంలో ఈ జంగం కథలపై వెలువడిన వ్యాస భాగముల నాధారంగా గొనియే నేను కొంచెం పరిచయం చేయడానికి ప్రయత్నిస్తాను. జానపద వాఙ్మయ మన్నా, జానపద గేయాలన్నా మనవారికి అంత శ్రద్ధ వున్నట్లు కనిపించదు. ఈనాడు ప్రభుత్వం కొంత కదిలి ఒక కమిటీని సేకరణకుగాను వేసిందనుకోండి. ఈ ప్రభుత్వం అండ, ఈ కమిటీ గుర్తింపు లేని ఎంతోమంది ఏనాడో యిటు వంటి సేకరణలు చేసి, ఉప్మమానికి బలం చేకూర్చిన అజ్ఞాత కవులూ, సాహిత్యోద్ధారకులూ వున్నారు. అటువంటివారికి గుర్తింపు జరగదు-ఎందుచేత ?

ఇదే ఇతరదేశాలతో పోల్చిచూస్తే మనం ఈ సేకరణ కృషిలో, పున రుద్ధరణకృషిలో చాలా వెనుకబడివున్నామని అనిపిస్తుంది. ఒక సమీక్షలోని లెక్కలను క్రింద యిస్తున్నాను :—

*"జానపద విజ్ఞానంయొక్క ప్రసిద్ధిని గుర్తించిన తర్వాత ప్రపంచంలో అన్ని ప్రాంతాలలోనూ కూడా దానిని సేకరించడానికీ విజ్ఞానులు పాటుపడ్డారు. ఆ కృషిలో అతి నవీనంగా జరుగుతూన్న ప్రయత్నాలను మాత్రమే కొంత యిక్కడ వుదహరిస్తాను :

"ఐరోపాఖండములోని హంగరీదేశంలో లజ్‌త అనే ఆయన హంగేరీ జానపద గేయాలను సేకరించాడు. (బి. బి. సి. లండన్ లెటర్-నెం. 892). అమెరికా దేశస్థులు జానపద గేయాలను సేకరించుకోడానికి చాలా పాటుబడ్డారు.

---

* శ్రీ వేటుమల్ల కామేశ్వరరావుగారి-జంగం కథా పరిచయ వ్యాసాలు-గృహలక్ష్మిలో.

ఆ గేయాల ప్రదర్శనలు కూడా తరచు జరుగుతుంటాయి 17 వ శతాబ్దంలో వ్యాప్తిలో వున్న జానపద గేయాలు నేటికికూడా వినిపిస్తూంటాయి. అమెరికా కాంగ్రెస్ గ్రంథాలయంవారు 40,000 జానపద గేయాలను సేకరించారు. (అమెరికన్ రిపోర్టర్ - తెలుగు ప్రతి 25-7-52-పుట 2). ఫాబియన్‌బవర్స్ అనే అమెరికా రచయిత ప్రపంచంలోని జానపద నాట్యాలను పరిశీలిస్తూ భారత దేశం కూడా వచ్చాడు. ఈయన కథక్ నృత్యాన్ని, మణిపురి నృత్యాన్ని పరిశీలించాడు. ఈయన భారతీయ నృత్యం (ది డాన్స్ ఆఫ్ ఇండియా) అను గ్రంథాన్ని ఆంగ్లంలో ప్రకటించడానికి పూనుకున్నాడు. (అమెరికన్ రిపోర్టర్-తెలుగుప్రతి 9-1-53). ఈ మొత్తరుగా ప్రపంచంలో జానపద కళలమీద శ్రద్ధాసక్తులు నానాటికీ వృద్ధి అవుతున్నాయి.''

జానపద వాఙ్మయంలో జంగం కథలది ఒక శాఖ, ఒక ప్రత్యేకత. ఇందులో చాలారకాలు మనకు కనిపిస్తాయి. నాటి చరిత్రలను ఆధారంగా తీసుకొని రచించినవి. నాటి సాంఘికాచారాలను పరిస్థితులతో ముడిపెట్టి రచించినవి. రామాయణ కథలలాంటి ఇతివృత్తాలతో రచించినవి. యుద్ధచరిత్రలను వీర రస ప్రధానంగా రచించినవి.

ఈ జంగం కథాపద్ధతి, రచనావిధానం నాడూ నేడూ కూడా ప్రచారంలోనే వుంది. నేటికీ జంగంకథ వరుసలలో బుర్రకథలు రచించి రాజకీయ పరిస్థితులను ప్రచారం చేస్తున్నారు. మచ్చుకు కష్టజీవి, పల్నాటియుద్ధం, బెంగాల్ కరువు మొదలగునవి. అలాగే పూర్వ ఔన్నత్యాన్ని గొని రాసినవి-బుద్ధచరిత్ర, పండితరాయలు మొదలగు బుర్రకథలు.

వీరశైవమతం విజృంభించిన కాలానికే-అంటే క్రీ. శ. 1150 నాటికే జంగాలు ఈ కథలను పాడుతూండేవారు. కనుకనే వీటికి జంగం కథలు అనే నామం ప్రసిద్ధమై నిలిచిపోయింది. మహాప్రవంతి అయిన తెలుగు జానపద వాఙ్మయంలో జంగం కథలు ఒక శాఖగా ప్రధానమై నిలిచాయి.

ఒక విషయాన్ని ప్రజల మనస్సులలో హత్తుకునేలా చేయగల పటిమ ఈ బుర్రకథలకు వుంది. నాటి అన్యాయాలనూ, అక్రమాలనూ ఏలుతున్న ప్రభువుల దృష్టికి తీసుకురావడంలో కూడా ఈ జంగం కథల పాత్ర చాలా వుంది.

ఈ జంగం కథలకు ఊతపదాలనేవి తప్పక వుంటాయి. ఈ కథలకు ప్రతి చరణం చివరనూ ''తందానా తందానే'' అనియు, ''రామారామా రామా రామా రామా రఘురామా'' అనియు, ''తందాన రాజనందనా'' అనియు, ''తందానాబాయి రాజనందన'' అనియు, ''మేలు మేలు'', ''తందాన తాన'' అనియు ఊతపదాలు ప్రచారంలో వున్నాయి - వాడబడుతున్నాయి.

కొంచెం ఉద్ధృతంగా - వేగంగా పాట సాగే సమయంలో 'సై' అనే ఊత పదం పాడుతుంటారు-మచ్చుకు పల్నాటియుద్ధం ఒప్రకథలోనిది—

''అందెవేసినా పందెగాండ్లురా -సై
అందమైన పుంజులెత్తిరి -సై
పాతలు కత్తులు దీసిరి -సై
సానలమీదే సాదిరీ -సై

ఆలాగే పూర్వకాలపు రచన ఆయిన ఆరుగురు మరాఠీల కథలోనిది :—

''అప్పుడు ఓరి తమ్ముడా -సై
మాపట్నము చేరినవారికీ -సై—''

ఈ రకంగా 'సై' అనే ఊతపదం వాడుతుంటారు.

పోతే పూర్వకాలపు జంగం కథలను ఎవరు రచించారూ అని. అది ఒక ప్రశ్నే. ఈ ప్రశ్న చాలా కష్టమయినది-కొన్ని కొన్ని కథలలో వారి వారి పేర్లు కవులు చెప్పుకొన్నారు. కొందరు పేర్లు పేరొక్కనలేదు - కొన్ని కొన్ని కథలకు కవి పేర్లు దొరికినా - కొన్నింటికి దొరకలేదు. చూడండి - చిన్నమ్మకథ రాసింది చెఁగల్వరాజని పేరొక్కన్నారు. కాంభోజరాజుకథ రాసింది జంగం సుబ్బయ్య దేపరట - జంగం కథలలో ఆఖరున కవి తన నామాన్ని ఎత్తుకోడం అనేదివుంది కనుక-ప్రతి కథని ఆసాంతం పరిశీలిస్తేనేగాని కవి నామం తెలియడం కష్టమే. జానపద గేయాలు మొదలగువాటిలో దొర్లినట్లుగానే జంగం కథలలోనూ ప్రక్షిప్తాలు దొర్లినాయి. అది సహజం కూడా - పద్యాలు మొదలగునవి.

ఈ కథలను ఎక్కువగా చెప్పుకొనేది జంగాలు, జక్కులు, బసనీలు — వీరు ఫలానా ప్రాంతమని కాకుండా అన్ని ప్రాంతాలలోనూ ఉన్నారగనియే చెప్పవలసి వుంటుంది. వీరి వేషములూ-పరికరములూ కూడా ఒకటిగానే వుంటాయి. ఒక తంబుర, ప్రక్క వంతచెప్పేవారి చేతిలో డక్కీలు—అంతే.

తంబుర మీటుకూ కథకుడూ కథ చెప్పుతూంటాడు. ప్రక్కన పంతవారు వంతచెబుతూ తాళం వేస్తుంటారు.

పూర్వకాలపు జంగం కథలన్నీ చాలా అద్భుతాలతోనూ, వింతలూ విచిత్రాలతోనూ, మహిమలూ మాయాజాలాలతోనూ నిండివుండేవనే చెప్పాలి - అతి ప్రాచీనకథ అయిన కాంభోజరాజుకథ నుండి-చారిత్రకకథ అయిన పల్నాటి వీర చరిత్ర వరకూ మనకు ఈ విషయములు యథార్థములుగానే కానవస్తాయి. జంగం కథాతత్త్వంలో చేకుమళ్ళవారు పేర్కొన్న పలుకులనే ఉదాహరిస్తాను.

"జంగం కథలో వీరుడు పరమాద్భుతమైన అసాధారణ మనిషిగా ఉండాలనే నియమంవల్ల రచన యథార్థతకే దూరమైపోయింది. ఇది ఒక్కొక్కప్పుడు గంధర్వ కథ కాబోలు అనిపించేటంత అసహజంగా కూడా కనబడుతుంది. పాతదైన కాంభోజరాజు కథలోనూ, అదే ఒరవడి అయిన బాలనాగమ్మ కథలోనూ (బాల పేరుతో చాలా కథలు ప్రచారమయాయి) కాకుండా, చారిత్రకమైన పల్నాటి వీర చరిత్రలోకూడా కొన్ని పట్టులలో నిజం కాదేమో ననిపిస్తుంది. బ్రహ్మనాయడు విషం తిన్నా చావడు; బాలచంద్రుడి మెడమీద కత్తిపడగా ఆ కత్తి పిండిపిండయిపోతుంది; చచ్చిన భటులమీద కుమార రాముడు మంత్రజలం చల్లగా వారు బ్రతుకుతారు."

దీనినిబట్టి చూస్తే అతిశయోక్తులతో రచనలు ఆల్లడం నాటి ప్రజలనూ, ప్రభువులనూ మెప్పించడం కోసం యిటువంటి అతిశయోక్తులను వారు ఆచరించడంగా మనం గుర్తించవలసి వుంటుంది. రాను రాను ఈ అతిశయోక్తులకే ప్రచారం ఎక్కువై అన్ని రచనలలోనూ వాటికి స్థానం, విలువ, బలం-ఎక్కువయి కూర్చుంది. ప్రబంధ కవుల దగ్గరనుంచి జానపద కవులవరకూ ఈ లక్షణాలు వారి వారి రచనలలో మనకు సమానంగానే కనిపిస్తున్నాయి మిస్టరీ సాహిత్యంలాగ.

పక్షులు పలుకడం, మాట్లాడడం, జంతువులు యుద్ధాలు చేయడం, రాళ్లూ రప్పలూ సహాయపడడం, నాగులు ప్రత్యక్షమయి వరాలియ్యడం ఈ కథలనిండా మనకు కనుపిస్తాయి. ఆ పద్ధతులు అన్నిటా ప్రత్యక్షమయి కూర్చున్నాయికూడా,

పాల్కురికి సోమనాథకవి ఈ కవిత్వానికి జీవం పోశాడని చెప్పవచ్చును. పూర్వకాలంలో ఎంతోమంది ఈ దేశికవిత్వాన్ని తూలనాడినా శ్రీనాథుడంతటి వాడు 'పల్నాటి వీరచరితం' ద్విపదలోనే రచించాడు.

పాల్కురికి సోమనాథుడు, శ్రీనాథమహాకవి, నన్నెచోడుడూ నాడే ఈ దేశికవితకు అందగా నిలిచి - యిందులోనే ఎన్నో రచనలను మలచినారు.

అందుకు మనకు ఎన్నో ఉదాహరణలు కనిపిస్తూనే వున్నాయికదా. పోతే, ఈ జంగం కథాతత్త్వమును గురించి యింకా కొంచెం దగ్గరగా పరిచయం చేయవలసి వుంటుంది. అదికూడా చూదాం.

జంగంకథలు అన్నా, బుర్రకథలు అన్నా, తందాన కథలు అనుకొన్నా ఒకటే అన్నది మనకందరకూ తెలిసిందే.

అసలు ఈ బుర్రకథా సంప్రదాయం అనేది తరచి చూస్తే యక్షగాన మహాప్రవంతిసుంచి పుట్టిన సెలయేరా అనిపిస్తూంది.

ఈ జంగం కథలను ఎక్కువగా ప్రచారంలోనికి తెచ్చింది, అనుకరించింది జంగాలు. వీరు ముగ్గురు ముగ్గురుగా ఒక తంబుర, రెండు ధక్కీలతో గ్రామాలలో సంచారం చేస్తూ కథలు చెప్పుకుంటూ పోతుంటారు.

ఈ బుర్రకథలు శ్రీనాథుని కాలానికే చాలా ప్రచారంలో వున్నట్లు క్రీడాభిరామం రచనలో మనకు తెలుస్తూన్నదే. పోతే, ఈ బుర్రకథలనే జంగం కథలు ఎక్కువగా మంజరీ ద్విపదలోనే రచించినట్లు తెలుస్తూంది. ప్రస్తుత కాలంలో రగడలలోనూ చాలా కథలు వెలువడినాయి.

బుర్రకథ రచనలో ద్విపదలే కాకుండా తదితరములయిన ఛందోరీతులు కూడా అనుసరించబడినట్లు ధేనువకొండ వెంకయామాత్యుడు రచించిన ఉత్తర గోగ్రహణం మనకు ప్రత్యక్ష నిదర్శనంగా వినిపిస్తూంది.

దేశీయ ఛందస్సు అయిన ద్విపదతోపాటు - కీర్తనలూ, పదువులూ, కందార్ధాలూ మొదలగునవి కూడా వాడబడ్డాయి.

చూడండి - ఒక విషయం చెపుతాను - ఎక్కువగా నేడు పాతకాలపు జంగం కథల ప్రతులను తిరగవెయ్యలేదు. కాని, అనుకోకుండా బంగారు తిమ్మ

రాజు కథ అని ఒక పుస్తకము చూడడము తటస్థించింది. అది 28 పేజీల పుస్తకము - మూడు అణాలు - దీనిని ప్రచురించినది స్కోప్ అండు కో, ముద్రాక్షరశాల.

ఈ బంగారు తిమ్మరాజు కథలో నేను చూసిన ప్రతిలో రచయిత పేరు మొదటగాని, ఆఖరునగాని కనిపించలేదు.

ఆఖరున వున్న చరణం ఇది:—

"శ్రీరంగములో చేరివున్నదూ
ఆ రాయలవారు
రామా రామా రామా రామా
రామా రఘురామా
.....
.....
పెనుగొండా తా నేలుతున్నదూ
పూల రంగరావు ॥రామా॥

.....
ఎవరు పాడినా ఈ కథ విన్నా
పుణ్యము గలదయ్యా ॥రామా॥

రామచంద్రుడూ వారికిచ్చునూ
రాజ్యసంపదాలు ॥రామా॥

సీతమ్మా వారికిచ్చునూ
శ్రీ సంపదాలూ ॥రామా॥

అని వుంది. కొన్నింటిలో ఆఖరున కవి తన నామధేయాన్ని చెప్పుకోవడం పరిపాటి. కాని యిందు కవి నామధేయం కానరాలేదు.

పూర్వకాలపు జంగం కథారచనలు చాలా రకాలలో, తీరులలో నడచినవి. చూడండి — కొన్ని పాత కథలలోని నడకలు క్రింద యిస్తున్నాను—

చిన్నమ్మ కథ :—

''అత్తకట్టిన కట్టులన్నియు విప్పినాదిగా
కంకణ హస్తములతల్లి కడవలో వేసింది
వక ఇంతటి కబళము తల్లి వడ్డించబోయె
అట్టి మాటలకు స్వామి ఆలోచన చేసెను''

బంగారు తిమ్మరాజు కథ:—

"ఎదురుగవచ్చిన రావణబ్రహ్మను
యెగరగొట్టినట్లు
వెళ్ళిన కార్యం బాగుజేసుకూ
బేటికి రావయ్యా
.....
వెన్ను దగిలి వెనువెంటనుండుమీ
అలమేల్మంగమా''

కాంభోజరాజు కథ :—

''కుర్చీమీద కొలువుతీరింది
తందాన తాన
తొమ్మిదో గడియలోగాను
తందాన తాన
బాలుడే ప్రసన్న మౌతున్నాడు
తందాన తాన''

పెద్ద బొబ్బిలిరాజు కథ :—

"కపటమాటలూ చెప్పినాడు
దుబాసి లక్ష్మడూ
ఎత్తిన కత్తి దండుమీదనే
రాయిగ పొడిచేను
చదురువిడిచి లేచినాడు
ధర్మా రాయుడు''

కుమార రామని కథ:—

''తండ్రి ఎరుక లేకుండ
కుళ్లాయిలు పెట్టిరి
జరీ అంగరకాలు తొడిగిరి
రుమాలు నడుములగట్టి
చెట్టపట్టాల్ పట్టుకొని
పెద్ద బజారుకి వచ్చిరి
అక్కడ కోమటివారి పిల్లలు ॥తందాన॥"

కా క మ్మ క థ :—

''భీమవరపు కాలువ ఒడ్డు
కొచ్చింది కాకమ్మ
ఒడ్డుమీదనె గంగ
పొర్లుచున్నది కాలువ
పొంగే గంగను కండ్ల
చూచింది కాకమ్మ''

బా ల నా గ మ్మ క థ :—

''పిల్లలంతా గుంపులు గూడి ॥తందాన।
ఇసుకబట్టి పప్పు చేసినాడు ''
చిల్లపెంకులు వరహాలు చేసెను ''

దే శి ం గు రా జు క థ :—

''వారటు చక్కెర పంచిరప్పుడు
వరుస వీథులాను
పరమ ముదంబున వచ్చినవారికి
బహుమతులను యిచ్చె
అరయగ కొలువున వున్న
జనులకు నట యీనాములిచ్చే''

ఈ వరుసలను తిలకించిన మనకు ఒక విషయం బోధపడుతూంది-ఇన్ని వరుసలలోకి మంచి ప్రచారమూ, పేరూ అందినది బొబ్బిలి కథలాటి వరుసలకే. అందుకే దానినే నేటి కథా రచయితలు ఎక్కువగా అనుసరించడం జరిగింది.

అయితే—పాత కథల వరుసలను ఎనిమిదిదాకా చూపించినప్పుడు కొత్త బుర్రకథా రచనా శైలిని చూపడం భావ్యమనుకుంటాను—కనుక క్రింద నేటి బుర్రకథలను కొన్ని చూపించడానికి ప్రయత్నిస్తాను - పరికించండి :

కష్టజీవి బుర్రకథలోనిది:—

"చంపలేను ఆ దొరనండి నే
తందానా తందానా తందన
హరిశ్చంద్రులూ ఆ బాబండి
తందానా తందాన తందస
కోపమెరుంగని గొప్పోరండి
తందానా తందాన తందన"

యింకొక వరుస:—

"వినిపించండి దొరలు నన్ను పిలి
పించిన పని యేమొ
వినరా నారిగ పెద్దపనుండే
పిలిపించా నిన్ను
నేను జెప్పినా పనిజేసితివా
నీకు మాన్యమిస్తా"

బుద్ధచరిత్ర బుర్రకథలోనిది:—

"బుద్ధదేవుని కథ చెప్పుచుంటిమీ
శ్రద్ధగ వినరయ్యా
జయము జయము మన బుద్ధదేవునకు
జయము దిగ్విజయము
కాశికి నుత్తర దిక్కున నున్నది
కపిలవస్తు పురము ॥జయ॥

దానిని శుద్ధోదన మహారాజు
నేలుచు నున్నాడు... ॥జయ॥

పల్నాటి యుద్ధం బుర్రకథలోనిది:—

దీనిని రచించినది ప్రసిద్ధ బుర్రకథకుడు శ్రీ నాజర్. స్వయంగా రచించుకొని, స్వయంగా కథను చెప్పి పేరు సంపాదించుకొన్న ఆంధ్రుడు ఈయనే అనుకుంటాను. కథా రచనలో, కథ చెప్పడంలో ప్రజా నాట్యమండలి కొత్త అధ్యాయాన్ని సృష్టించినది మరువకూడదు.

అసలు ప్రాచీన సంప్రదాయ కథా వాఙ్మయానికి ప్రజా నాట్యమండలి ధర్మమా అని తిరిగి ప్రచారం లభించింది. నాటి ప్రజా నాట్యమండలి ప్రత్యేక కృషి ఫలితమే బుర్రకథలూ, వీధి భాగోతం, ఛాయా ప్రదర్శనలూ మొదలగునవి ఆంధ్రనాడున తిరిగి ప్రజా మన్ననల నందసాగినాయి. పల్నాటి యుద్ధము లోని కొన్ని చరణాలు విసండి.

"ఎక్కువ తక్కువ మతవిభేదము
అక్కర లేదనుచూ
వక్కటిగ ప్రజలందరుండ తా
చక్కగ యోచించి
చాకలి మంగలి మాల మాదిగ
సర్వజనులకెల్ల
ఏక పంక్తిలో విందు భోజనము
యేర్పాటుజేసి
చాపకూటి సిద్ధాంతము పేరిట
సాగించెను ఘనుడు—"

ఇంకో చరణంలో:—

"తలతోక కాపాడు కత్తిరా—
తళతళా మెరిసేది కత్తిరా—

కాలానికి నాలుక కత్తేరా-
శత్రుసేనకూ మిత్తేరా—
భళానంటిభాయి తమ్ముడా—సై
మేలు భళానోయి దాదానా''

పండితరాయలు బుర్రకథలోనిది:—

నేను రచించిన ఈ 'పండితరాయలు' బుర్రకథ ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రం వారు ప్రసారితం చేసివున్నారు. ఇందులోని రెండు చరణాలు పరికించండి:—

''బంగారు మా జన్మభూమి— భళి భళి
పాడిపంటల ఆంధ్రభూమి ,,
నందనోద్యానవనములు ,,
నానందముగ నుండు భూమి ,,
ఆంధ్రదేశపు ధాన్యగాదివలె
దేశాన నిలిచిందోయ్''

ఇదే కథలోని యింకో వరుస:—

''వినరా ఆంధ్రుడ పండితరాయని
విశ్వగాథ నేడూ
గలగల పారే గోదావరి నది
ముఖద్వారమంచూ
కోటివేలకూ పాగా వేసిన
కోనసీమ నడుమ
పచ్చని పొలాల పైరు చేలతో
బంగరు భూములతో''

పైన ఉదహరించిన పాత, కొత్త తరహాలలో రచించబడిన కొన్ని కథలను ముచ్చటగాను చూపించాను— ఇందులో నాటి పరుసలూ - యిప్పటి పరుసలూ కొంచెంగానైనా గుర్తించడానికి వీలు కలుగుతుందనుకుంటాను.

ఇంకా తెలుగునాడున ఎంతోమంది బుర్రకథా రచనలు చేస్తూన్నవారు ఉన్నారు. చరిత్రాత్మకమైనవి, సాంఘికపరమైనవి, రాజకీయ ప్రచారపరమైనవి, ప్రాచీన వీర గాథలకు సంబంధించినవి - యిలా రకరకాల యితివృత్తాలతో - రకరకముల వరుసలలో రచిస్తూన్నారు. అవన్నీ వరుసగా పరిచయం చేదామన్నా గ్రంథ విస్తరణ భీతిచేత వూరుకుంటున్నాను.

ప్రస్తుత కథా రచనలను తిలకిస్తే చాలా మట్టుకు ఒకే తరహాలో - ఛందస్సులో - (కొంచెం తేడాలో) మనకు అగుపిస్తాయి.

ప్రస్తుత రచనలలో రగడలు ఎక్కువగా వాడబడుతున్నాయి. చిత్రకవి పెద్దనార్యుడు లక్షణసార సంగ్రహంలో రగడలు తొమ్మిదిగా పేర్కొనివున్నాడు. కాని, చిత్రకవి తరువాతివాడైన అప్పకవీ రగడలు తొమ్మిదిగానే చెప్పకపోలేదు. అయితే ఛందోదర్పణకర్త అనంతామాత్యుడు రగడలను ఎనిమిదిగా మాత్రమే పేర్కొని ఉండడం గమనించవలయును. యితని మతములో - అనగా అనంతామాత్యుని మతములో - హయప్రచారమూ, తురగ వల్గనమూ ఒక్కటే !

తొమ్మిది రగడలూ యివి :-(1) హయప్రచారము, (2) తురగవల్గనము, (3) విజయమంగళము, (4) ద్విరదగతి, (5) విజయభద్రము, (6) మధుర గతి, (7) హరిగతి, (8) హరిణగతి, (9) వృషభగతి.

బుర్ర కథలలో యిన్ని పద్ధతులూ అనుసరించబడకపోయినా కొన్ని మాత్రం వాడుతున్నారు-కొన్ని పద్ధతులు ఆచరణలో పెడుతున్నారు.

ఈ జంగం కథలనే బుర్రకథా సంప్రదాయంలోవున్న గొప్పతనం ఏమిటీ అని ? ప్రజలను ఈ కథల ద్వారా యిట్టే ఆకర్షించవచ్చు. మవం ప్రచారం చేయ దల్చుకున్న విషయ సంగ్రహాన్ని శ్రోతల హృదయాలకు యిట్టే హత్తుకొనేలాగ చెప్పవచ్చు.

అతి చాకచక్యము గలిగి, కంఠస్వరం తగుమాత్రమయినా బాగుండి, సంగీత జ్ఞానం కొంచెం కలిగుండి, వీర, కరుణ రసాలను ఒప్పిస్తూంటే శ్రోతలు ఉర్రూత లూగుతారంటే వింతా, విచిత్రమూ, విడ్డూరమూ కానేరదు.

సరిఅయిన కథకుడు బుర్రకథ చెబుతూంటే, అయా కరుణ, వీర రసాలను ఒప్పిస్తూంటే మనము తెలియకుండానే అందులో లీనమైపోతాము - అదే కథకుని లోని ప్రత్యేకత - ఆ కథలలోని గొప్పతనము !!

బాల వాఙ్మయం



బాల వాఙ్మయానికి కర్తృత్వం వహించేది తల్లి హృదయం. తెలుగు తల్లులు తమ పాపలకు ఉగ్గుతోపాటు, పాలతోపాటు, ఆటపాటలూ, కథలూ, గాథలూ నేర్పడంతో-కావ్యరసాన్ని, భక్తిరసాన్ని కూడా రంగరించి పోశారు.

బాలలకు ప్రపంచంతో నిమిత్తం లేదు- కాని భవిష్యత్తు తమదే ! తమకు ఈర్ష్యాద్వేషాలూ, కులమతాలూ, హెచ్చుతగ్గులతో సంబంధం లేదు. అందుకే వారి చేష్టలు, గెంతులు, పలుకులు, ఆటలూ, పాటలూ ఏ ఒకరికో అందం అనిపించి, ఆనందం కలిగించి, మకరందం కుమ్మరించేవి కావు. పిల్లల ఆటపాటలకు, చిలిపి తనపు చిట్టి పనులకు, లేనె చినుకుల యక్ష ప్రశ్నలకు ముదియని హృదయం, చూడని, వినని, సంతోషపడనివారు ఎవరు ?

ఆటంబాబులను గురించిన ఆలోచనలు వారికి ఉండవు. భయం, పుట్టి వారికి సంబంధించినది కాదు. లేదని బెంగా ? ఉండన్న గర్వమూ ?? అసలు వీరి వారికి తెలియని విషయాలు ! తినడం, ఆడుకోడం, పాడుకోడం - హాయిగా

తల్లి ఒడిలో, జోల పాటల కమ్మదనంలో నిదురపోడం - యివే వారి ప్రపంచ విషయాలు-యివే వారి మనోభావ మందారాలు ! !

బాలురు, బాలికలు - వీరు విడివిడిగా ఆడుకుంటూ పాడుకొనేవి, కలిసి పాడుకునేవి, ఆడుకొనేవి కూడా చాలా ఆటపాటలు ఈ బాల వాఙ్మయంలో ఉన్నాయి.

చెడుగుడు ఆట, అకు ఆట, కోతి కొమ్మచ్చి ఆటలు, వాటికి సంబంధించిన పాటలూ బాలుర సొత్తు; బుజబుజ రేకుల పెండ్లి ఆట పాట, ఉయ్యాల ఆట, తూరుతే పిల్లి, గొబ్బిళ్ళు మొదలగు ఆటలూ వాటి పాటలూ బాలికలకు చెందిన కాపీరైటు హక్కు ! !

ఈ ఆటల్లో, పాటల్లో పురాణ గాథలు, జానపద కథలు, నీతులు, ఆరోగ్య విషయాలు, ఆయుర్వేద రహస్యాలు, భవిష్యత్ రథ సారథ్యానికి పరుగులు, భవిష్యత్ ప్రయాణానికి దారులు ఎన్నో ఉన్నాయి.

మన ప్రాచీన వాఙ్మయంలో ఆటలను పేర్కొన్నారు-వినండి :

పాటలద్వారా ఆటలు - ఆటలద్వారా పాటలు - ఈ రెండింటి సంబంధ సమ్మేళనంద్వారా శారీరకబలం, విజ్ఞానహేతువూ కూడా!

పూర్వకాలంలో-అనగా సుమారుగా నూటఏబది ఏళ్ళనాటి కవి (నారాయణ కవి అనుకుంటాను) ఒక సీసమాలికలో ఆటలన్నింటిని ఒక లిస్టుగా యిచ్చి వర్ణించాడు. అలాగే ప్రాచీన సాహిత్యంలో మన ఆటల వర్ణనలు చాలాచోట్ల వున్నాయి. మచ్చుకు ఈ క్రింది పద్యం చూడండి:

"చూచియు జాబిల్లి
బూచికన్నుల కచ్చి
గుడిగుడికుంచంబు కుందెనగిరి
చీకటి మొటికాయ
చింతాకు చణుదులు
పులియాటలును చిట్ల పొట్లకాయ

తూరనతుంకాలు తూనిగ తానిగ
చిడుగుడు మొకమాట చిల్లకట్టె
దాగిలిమూతలు తసుబిల్ల యాలంకి
గుప్పట గురిగింజ కొండకోతి
చిక్కణబిల్లయు జెల్లెను గొడుగును
బిల్లదీవులు లక్కబిక్కదండ
గడ్డెరబోడి యొక్కసి కొక్కబయగాయ
పోటు గీరనగింజ బొంగరములు..."

అని తలిపినాడు - కాని ఇందులో చాలా ఆటలు ఇప్పుడు మనకు విన రావు, కనరావు...

ప్రస్తుతం మనకు అందుబాటులోవుండే విషయాలనే పరికిద్దాం :

మన ఆంధ్రదేశ చరిత్రను పరికిస్తే మహాకవి గురజాడ అప్పారావుగారు జానపద సరళిలో, కొన్ని రచనలతో కొత్త కొత్త రీతులలో భాషాసరస్వతిని అలంకరించారు.

పుత్తడిబొమ్మా పూర్ణమ్మా లాంటి గేయాలు, ఇంకా తదితరములూ - ఈ జానపద ఫణతులలోనే నడచినట్లు మనకు కనబడుతుంది. ఖచ్చితంగా చెప్పాలంటే తెలుగు కవిత్వానికి కొత్త మెరుగులుపెట్టి, వ్యావహారిక భాషలో కవన మల్లిన నవయుగ వైతాళికుడు మహాకవి గురజాడ వారే. రాను రాను చాల మంది కవులు ఈ ధోరణిలోనే రచనలు సాగించారు. ఈనాటి ఈ తరహా రచనల కన్నింటికీ మూలపురుషులు అమరకవి గురజాడవారే.

నేటి బాలురే రేపటి పౌరులని గురించినవాడు-నేడు తొడిగిన మొగ్గే రేపటి పూవన్న సత్యాన్ని అర్థం చేసుకొన్ననాడు-బాలపాటల యొక్క విలువను తృణీకరించరు సరికదా, దేశానికి - దేశసౌభాగ్యానికి మాతృకగా ఎంచి గౌరవిస్తారు - పునరుద్ధరించి పూజిస్తారు.

అంతటి విలువ అయిన బాలపాటలను తెలుగుదేశంలో సేకరించినవారు చాలామందే ఉన్నారు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ నేదునూరి గంగాధరం,

శ్రీ చేకుమళ్ళ కామేశ్వరరావు, డాక్టర్ బి. రామరాజు, ఎల్లోరా - (నేను), 'కృష్ణశ్రీ', ప్రయాగ-మొదలగువారు ఇంకా మరికొందరు ఉన్నారు.

బాలగీతావళి, పిల్లల పాటలు, గీతామంజరి, పాతపాటలు, బాలానందం పాటలు, బాలభాష—మొదలగునవి కొన్ని ఉన్నవి.

ఈనాడు పాతపాటల మాదిరిగానే కొన్ని పాటలు రచిస్తున్నారు కొంత మంది రచయితలు. ఈ రచనలలో కొన్ని జానపద సరళిలో - చక్కగానే ఉంటున్నాయి కూడా. అందుకు తార్కాణంగా కొన్ని రచనలు ఇస్తాను:

ఈ క్రిందిపాట రచించినది అమరకవి గురజాడవారు. ఈ పాట "ముత్యాలసరాలు" పుస్తకంలోనిది.

"ఆటలపాటల పేటికలారా
కమ్మని మాటల కొమ్మల్లారా
కలువల కన్నెల కన్నెల్లారా
పిల్లలగన్న తల్లుల్లారా
విన్నారమ్మా ఈ కథను—"

ఈ పాట చూడండి - ఎంత సరళంగా-నిర్మలంగా బాలల హృదయాలకు ఇట్టే అంటేలాగ ఎలా సాగుతుందో.

అలాగే ఈ రచన శ్రీ చింతా దీక్షితులుగారు రచించినది చూడండి. ఈ గేయం "లక్క-పిడతలు" పుస్తకంలోనిది.

"బాజాలురానాన్న బాజాలు
బాజాలు వచ్చాయి బాజాలు
బాజాలతో వచ్చె పల్లకీ అదిగో
పల్లకీలో ఉంది పార్వతీ దేవి
పార్వతీ దేవికి జేజేలు పెట్టు—"

ఈ రచన ఎంత మనోహరంగా ఉంటుంటారు? బాజాలు, పల్లకీ, పార్వతీ-జేజేలు-అన్నపదాలు పాప నేర్చుకోదం ఒకటి. ఆ బాజాలతో కూడిన పాలకీలో-జేజేలు పెట్టవలసిన పార్వతి రావడం - అర్థమవుతుంది.

అలాగే నా ('ఎల్లోరా') స్వంతరచన ''ఎర్రపూలు'' అను పుస్తకంలోనిది వినండి.

''శ్రావణామాసాన చవితి వెళ్ళాక
బొమ్మలా పెళ్ళండి కమ్మగా విందు
చెప్పలేదని తలచి రాకపోయేరు
విందుకై ఎన్నెన్నో వింతలుంటాయి
బొమ్మలాపెళ్ళికి ప్రొగ్రాము లివిగో
కప్పదప్పులతోటి కోకిలా గానం
నెమలి నాట్యంతోటి హంసన్నృత్యాలు
అప్పుడే మీకంత ఆరగింపూలు
తేనెటీగలు అన్ని తేనెకడవలతో
చిలుకబంధువులంత పండ్ల బుట్టలతో
వస్తారు తెస్తారు విందు చేయంగ
రావాలి తప్పకా విందు గుడువంగా.
విందు జరిగే చోటు వినిపింతు వినుడు
జాజిపూల తోట మల్లె పందిరిలో
మాధవీ లత ప్రక్క మందార చెంత
మంచిగంధపు మాసు మంచాలు వేసి
మల్లెపూవుల పాన్పు ఇల్లంత పరచి
హుందాకు దర్జాకు లోటు లేకుండ
విందు వినోదాలు తెల్లవార్లూను
చేశాము ఏర్పాటు చెప్పుతున్నాము.
రావాలి మరువకా రావాలి సుమండీ!
రాజు రాణీగార్ల పెళ్ళి రేపండి
అందుకే ఇంతగా పెళ్ళి పిలుపండి.''

ఈ విధమైన గేయాలను - చక్కని శైలీ, నవకా ఉన్న గేయాలను ఎంతో మంది వ్రాస్తున్నారు. శ్రీ కవిరావు, శ్రీ బి. వి. నరసింహారావు,

శ్రీ నార్ల చిరంజీవి, శ్రీ కె. సభా మొదలగువారు - ఇంకా ఎంతో మంది రచయితలు వ్రాస్తున్నారు - తయారవుతున్నారు.

బాల సాహితీగా పేర్కొనదగిన జానపద గేయాలను ఇక్కడ పరిచయం చేస్తాను.

పూర్వకాలపు పిల్లల గేయాలను ఎవరు రచించారో అంతగా తెలియదు. కాని, ఆ పాటలు మన తెలుగు నేల నాలుగు చెరగులా - ప్రతి తల్లి నోటా కంఠస్థమై ప్రచారానికి వచ్చాయి. ఈ పాటలు అనేక రీతులలో అనేక ప్రబోధిత రూపాలలో రచింపబడి ఉన్నాయి. పూర్వకాలపు బాల సాహితిలో ఎంత తేలిక భాష వాడబడిందో గమనించండి. ఒక్కొక్క పనికి, ఆటకు ఒక్కొక్క పాట. లేచింది మొదలు పడుకొనే వరకు జరిపే ప్రతి పనికీ ఈ పాట - పని విలువను ప్రతిబింబిస్తుంది. అటువంటివాటిలో కొన్ని పరిచయం చేస్తాను.

ఉదయాన్నే చంటి పిల్లవాడు లేస్తాడు. అలా లేచీ లేవడంతోనే మన ఇళ్ళలో ఆముదం (ఉగ్గు) పెట్టడం పరిపాటి. అలా ఉగ్గుపెట్టే సమయంలో పాడే ఈ పాటలు చూడండి.

"జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
గుర్రాలు తిన్న గుగ్గిళ్ళు జీర్ణమై..."

అంటూ ఉగ్గుతో పాటు పాత కథలను రంగరించి, బోధించి - ఆఖరున -

"అబ్బాయి త్రాగిన పాలూ ఉగ్గూ జీర్ణమై
కుందిలాగ కూర్చుని
పందిలాగ ప్రాకి
లేడిలాగ లేచి
నందిలాగ నడిచి
తాంబేలు లాగ..."

అంటూ తన కొడుకు కుందిలాగ కూర్చొని, పందిలాగ ప్రాకి, లేడిలాగ పరుగెత్తి - వాటిలాగే మంచి పుష్టి కలిగి ఆరోగ్యవంతుడుగా అవాలని, ఆ తల్లి తన దీవెనలను పాట రూపంలో పాడుతుంది.

అక్కడి నుండి స్నానానికి తీసుకు వెడతారు పాపని.

''అమ్మ కడుపు చల్లగా
అత్త కడుపు చల్లగా
లెక్కలేని సొమ్మెట్టుకుని
పుట్టం లేని బట్టకట్టి
అనుమూ తునుమూ
మునిమనుమలతో వర్ధిల్లాలి...''

అంటూ తలకు నూనె పెడ్తూ దీవిస్తారు-అటు అత్తగారి వెంపూ, ఇటు పుట్టింటి వెంపూ సుఖంగా వుండి ఆయురారోగ్యాలతో వర్ధిల్లమని.

స్నానం పూర్తి అయాక తల తుడిచి - కాళ్ళ మీద కూర్చో బెట్టుకొని ఆడిస్తూ పాడే పాటలు వినండి :

''గుమ్మాడమ్మా గుమ్మాడీ
ఏ వూరు వెళ్ళింది గుమ్మడీ
ఏం తెచ్చింది గుమ్మడీ
వేలూరు వెళ్ళింది గుమ్మడీ
వెలక్కాయ తెచ్చింది గుమ్మడీ''

అంటూ ఆడిస్తూ ఊపుతారు, అలా వూపుతూ పాటలు పాడుతూ వుంటే చక్కగా నిద్రపోతారు పిల్లలు. అప్పుడు ఉయ్యాలలో పరుండబెట్టి చక్కగా పాడుతూ ఊపుతారు. ఈ సమయంలో పాడే పాటలని లాలి పాటలనీ, జోల పాటలనీ, ఉయ్యాల పాటలనీ వ్యవహరిస్తారు. ఈ పాటలను సరైన వరుసలలో చక్కని గొంతుతో పాడుతుంటే ఆ సమయంలో పెద్దవాళ్ళకే కునికి పాట్లువస్తాయంటే ఆశ్చర్యం లేదు.

ఒకవేళ ఎంత ఊపినా నిద్రపోక చంటి పిల్లలు ఏడుస్తూంటే పాడే ఈ పాటలో పాపమీద వుండే బలమైన ప్రేమకొద్దీ తల్లి -

"ఏడవకు ఏడవకు వెర్రి చల్లమ్మ
ఏడిస్తే నీ కళ్ళు నీలాలు గారు
నీలాలు గారితే నే చూడలేను..."

అంటూ తన ప్రేమను వెలిబుచ్చుకొని - కన్నబిడ్డ కనుల నీరు పెట్టడం చూడ లేక...

"పాలైన కారవే బంగారు కండ్లా..."

అని వాపోతుంది తల్లి. అలాగే ఈ గేయం పరికించండి—

"పిల్లరావే తల్లి పిల్లలకు తల్లి
పిల్లలకు నీళ్ళోసి పల్లెలకు పంపి..."

అన్న పాటలో ఎంత ఆనందముందో ? చంటి పాపడిని చూసి, ఎప్పుడు పెద్ద వాడవుతాడా అని ఉవ్విళ్ళూరే తల్లి సంతోషం పట్టలేక...

"ఆడి రాగా ముద్దు
వాడి రాగా ముద్దు
నట్టింట అబ్బాయి
నడవంగ ముద్దు..."

అనుకుంటుంది - అంతకంటే మాతృ హృదయం ఏం కోరుకుంటుంది చెప్పండి !

ఏ కందిపప్పు బద్దలు కావాలనో, బెల్లం ముక్క కావాలనో ఏడుస్తూ ఎంతకీ ఊరుకోకపోతే, తల్లి పాపను బెదిరిస్తూన్నట్లుగా పాడే ఈ పాటలు చూడండి...

"అదిగో బూచివాడు
మన అటక మీదున్నాడు
ఏడుస్తే వాడు నిన్ను
ఎత్తుకు పోతాడు..."

అంటూ భయపెట్టి మాయబుచ్చ చూస్తుంది తల్లి. కాని అంతదాకా భయపెట్టిన తల్లే గారంతో...

"అల్లరి చేయకమ్మా
నీకు బెల్లము పెట్టెదనమ్మ
అల్లరి చేయకమ్మా
పల్లకీ ఇదిగోనమ్మ..."

అని ఓదార్చ చూస్తుంది మళ్ళీ.

జడ వేసుకోకుండానో, కాటిక పెట్టించుకోకుండానో గదబిదచేస్తూ ఉండే సమయంలో తల్లి - తన పిల్ల ఎంత బుద్ధిమంతురాలైనా - పక్కింటి పిల్ల ఎంత అల్లరిదైనా - ఆ పిల్లనే మంచిదాన్నిగా చూపిస్తూ...

"కన్నతల్లి నీవు
కాటుక పెట్టించుకోవె
వాళ్ళ అమ్మాయి చూడు
నిన్ను చూసి నవ్వుతోంది—"

అని పక్కింటి తోటిపిల్లల మీద తెలియకనే ద్వేషం నేర్పుతారు. ఇది మన పూర్వపు పాటలలో వున్న మహాదోషం. భయపెట్టి పనిచేయించడం, ద్వేషాన్ని పుడిగొల్పడం, అదియిస్తా ఇదియిస్తా ఈ పనిచేస్తావా? అని లంచం అలవాటు చేయడం మొదలుపెడతారు.

ఈ పప్పూ, బెల్లం అలవాటు పెద్ద అయాక కూడా పోదు. ఏదైనా అవసరమొచ్చి దగ్గరకు వెడితే, ఏం ఇస్తావు? అనడం వరకూ ఈ అలవాటు పెరుగుతుంది.

కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారు ఉత్తమ మాత లక్షణాలు శిక్షిక క్రింద ఈ విషయాన్ని చాలా గొప్పగా చెప్పారు. కనుక పూర్వపు పాట లలో వున్న ఇటువంటి - లంచం, భయం, ద్వేషం - అలవాటు చేసే వాటిని మనం మరచిపోవాలి - వాటిని వదిలిపెట్టయ్యాలి.

చిన్నతనంలో ఉగ్గుతో రంగరించి - బోధించే మంచి విషయాలే పెద్ద అయాక కీర్తి ప్రతిష్టలకు పునాదిగా ఉంటాయి. చిన్ననాటి ఉగ్గుబోధలే రేపు కీర్తికి బాటలు పరచి క్రాంతికి అంకుర్పారణ చేస్తాయి.

ముసలితనంలో కదల నవసరం లేకుండా ఉండే పని-పిల్లలను ఆడించడ మొక్కటే, పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకుని - ఆటల రూపంలో పాడే ఈ పాటలు గమనించండి.

''కాళ్ళాగజ్జీ గంగానమ్మా
వేగూ చుక్కా వెలగా మొగ్గా...''

అంటూ ఆడిస్తారు. ఈ ఆటపాటల్లో చక్కని శరీర వ్యాయామం కూడా ఉంది. ఇదే పద్ధతిలో భక్తి, బలం కలిగించే ఈ పాటలు వినండి :

''తప్పట్లోయ్ తాళాలోయ్
దేవునిగుళ్లో బాజాలోయ్...''

అంటూ ఆడించి, మా పాపకు పాలూ, ఉగ్గూ అని నవ్విస్తారు. అలాగే ఈ క్రిందిపాట...

''ఒక్కా ఓ చెలియా
రెండు రోకళ్లూ
మూడూ ముచ్చెలుకా
నాలుగు నందన్నా
అయిదూ చిట్టిగొలుసు
ఆరూ జవ్వాజి
ఏడుం బేడీలు
ఎనిమిది వెన్నముద్ద
తొమ్మిది తోపచ్చు
పది పటిలేడు...''

అనే ఈ పాట అంకెలు నేర్పడానికి చాలా ఉపయోగిస్తుంది. అలాగే చంటిపాపకు అన్నం తినుపించు సమయంలో ఏ వెన్నెల కాంతిలోనో వుండి - చందమామను చూపిస్తూ, పిల్లవాడిని మాయపెడ్తూ ఈ పాటలు పాడతారు. ఈ పాటలు వింటూంటే మన చిన్నతనం కళ్ళముందు కనిపించడం లేదంటారా ?

"చందమామ రావె
జాబిల్లి రావె
కొండెక్కి రావె
కోటి వేలు తేవె
పైడి గిన్నెలో
పాలు పోసుకుని
వెండి గిన్నెలో
పెరుగు పోసుకుని
ఒలవని పండూ
ఒళ్లో వేసుకు
ఒలచిన పండూ
చేత్తో పట్టుకు
అలా అలా తిరిగొచ్చి
అమ్మాయి కియ్యవే..."

ఈ పాట పాడుతూ, మధ్యమధ్యన కబుర్లు చెబుతూ అన్నం పెడితే ఎంత అల్లరి పాపలైనా ఇట్టే బువ్వ తినేస్తారు.

అలాగే పసిపాపలకు - తొక్కుపల్కులని సంభాషణ రాపడానికీ, నోరు సునాయాసంగా తిరగడానికీ ఈ పలుకులు నేర్పుతారు.

"ధిమిత ధిమిత
ఏమి ధిమిత ?
పసుపు ధిమిత !
ఏమి పసుపు
ఛాయ పసుపు ..."

ఇలాంటి పాటలు చాలా ఉన్నాయి.

అలాగే బాలురలో చిన్నతనంనుంచీ పరిశీలనా పటిమను అభివృద్ధి చేయటానికి పనికివచ్చే ఈ పాటను పరిశీలించండి :

"వీరీ వీరీ గుమ్మడిపండూ
వీరెవ్వరోయ్ ?
దాగుడుమూతా
దండాకోర్
పిల్లీ వచ్చే, ఎలుక భద్రం
ఎక్కడి దొంగలక్కడికే
గప్ చిప్ సాంబారుబుడ్డి ... "

ఈ పాట వ్యాయామాన్ని, పరిశీలనా పరిజ్ఞానాన్ని కూడా పాపలకు అంది స్తుంది. ఇంతేకాదు - ఈ రకములైన బాలపాటల్లో కొన్ని ఆయుర్వేద రహస్యాలు కూడా ఉన్నాయని అంటారు...మచ్చుకు :

"కొండమీద వెండిగిన్నె
కొక్కిరాయి కాలు విరిగె
దానికేమి మందూ ? ... "

అన్ని ప్రశ్నించి ...
" వేపాకు చేదూ
వెల్లుల్లిగడ్డా
నూనెమ్మ బొడ్డూ
నూటొక్క సారీ
పూయవోయి నూరి
పూటకొక్క తూరి ..."

అని సమాధానం ఇస్తుంది. ఇటువంటి ప్రథమ చికిత్సా ప్రబోధితము లయిన పాటలు ఇంకా ఎన్ని ఉన్నాయో కదా?

కొంతమంది గుంపులుగా చేరి ఆడుతూ పాడే ఈ పాట చూడండి, ఎంత వ్యాయామం ఇస్తుందో ?

" అల్లల్లా కోడి పిల్లల్లా కోడి
గుట్టమీదా కోడి గవ్వల్లా కోడి ... "

అంటూ పాట పాడుతూ - ఆటలాడి తిన్నది అరగించుకొంటారు పిల్లలు. ఆటువంటిదే ఈ బాలగేయం కూడా :

" ఒకటీ ఒప్పిందం
రెండూ దలితండ్రీ
మూడూ త్రిమూర్తీ
నాలుగూ వేదాలు ..."

అలాగే —

" రావే రావే బాలా
ఆడుతు పాడుతు రావే
ఒకటీ రెండూ వయ్యారిబాలా
రెండూ, మూడూ ముత్యాలబాలా ... "

అంటూ సాగుతుంది.

ఈ కోలాటం పాటను వినండి - ఎంత ఇంపుగా, సొంపుగా - తాళ యుక్తంగా - దృశ్య మనోహరంగా ఉంటుందో —

"ఆటవీ స్థలముల కరగుదమా
వట పత్రంబులు కోయుదమా !
జనులారా గుమి గూడుదమా
జటకోలాటము వేయుదమా !
నొకరి నొకరి తా-
నొక కుడియదమల
నొప్పుగ దీనిని తిప్పుదమా !
మంచిగంధమూ తీయుదమా
చెంచిత మెడకిది పూయుదమా !
మల్లెపూవులూ కోయుదమా
మందయానపై జల్లుదమా

కోతికొమ్మచ్చి లాడుదమా
కోరివనంబుల చేరుదమా
దాగుడుమూతా లాడుదమా !
తరువుల చాటున దాగుదమా
విప్పపువ్వులూ ఏరుదమా !
విసువక మనమిపుడు పోవుదమా ! !''

పై పాటను గుంద్రంగా కూడిన బాలికలు కోలాటంకర్రలు చేత ధరించి కథానాయిక కథ చెబుతూంటే మిగిలిన జట్టు తిరిగి పాటను చెబుతుంటారు. ఒకరిని తప్పించుకు ఒకరు తప్పుకుంటూ, ఒకరి కోలాట కర్రలతో మరొకరు కొడుతూ, కాలి అడుగులు తాళం మాదిరి మార్చుకొంటూ, వెనుకకూ ముందుకూ మారుతూ, ఇంకా ఒకరిని తప్పించుకుని ఒకరు కోలాటం వేస్తూ పాడే ఈ పాట, వేసే కోలాటం - చాలా ఇంపుగా ఉంటుంది. ఇటువంటి కోలాట పద్ధతులు ఇంకా బాలికోన్నత పాఠశాలల్లో వేయిస్తున్నారు.

ఇలాగే గొబ్బి తట్టడం కూడా ! గొబ్బిపాటలు చాలా ప్రాచీనమైనవి. ''గొబ్బియళ్ళో'' పాదాంత పదం చాలా చోట్ల మనకు దర్శనమిస్తుంది. అన్నమయ్యగారి సంకీర్తనలలో మనకు ఈ గొబ్బిళ్లు వినిపిస్తాయి ! ''కొలని దోసరికి గొబ్బిళ్ళో, యదుకుల సామికి గొబ్బిళ్ళో—''అన్నది !

ఈ కోలాటం పాటలూ, గొబ్బి పాటలూ సామాన్యంగా పౌరాణికంగానే ఉంటాయి !

గంగమ్మ గౌరమ్మ అప్ప సెల్లెండ్రూ -
గొబ్బియళ్ళో ! గొబ్బియళ్ళో ! !
ఒక తల్లిబిడ్డలకు వైరము లేదు ,,
మంచి మంచి పూలేరి ఒక రాసిపోసిరి ,,
కానరాని కలువలేరి ఒక రాసిపోసిరి ,,
ఏడుమూర లింటిలో ఏడొక్కతూము ,,
ఏడొక్క తూమేసి ఎల్లా కొలిపించే ,,

పొగిడి ఒక తూమేసి పారా కొలిపించె ,,
గంపెడు తీసేసి గంగా కెత్తండీ ,,
మంచి మంచి పూలేరి మామయ్య కంపె ,,
కానరాని పూలేరి గౌరమ్మ కంప ,,
అక్కనూ చెల్లినీ ఒక్కరీ కిచ్చె ! ,,

— చెమ్మఆట అని పిలవబడే ఈ పాటలో అవతార వర్ణనలు ప్రత్యక్షం అవుతున్నాయి !!

కొండెకూ పూలు జుట్టవే !
అమ్మ నన్ను
గోపాలకృష్ణుడనావే !
చిన్నారి నామాలెట్టవే !
అమ్మ నాకు
వన్నేలా సొమ్ము లెట్టవే !
వీరుడిని నన్ను పిలువవే
అమ్మ నన్ను
వీరులాఖ్యాతి అనవే !
కుచ్చులా జడలు వెయ్యవే !
అమ్మ నన్ను
కూర్మావతారుడనావే !
పతకాలు నాకు వెయ్యవే !
అమ్మ నన్ను
అయోధ్య రాముడనావే !
చేతి వంకెలు నాకు పెట్టవే !
అమ్మ నన్ను
వైకుంఠ వాసుడనావే !

వేలికుంగరం నాకు పెట్టవే !
అమ్మ నన్ను
వెలలేని కృష్ణుడనావే !

మొలకు గజ్జెలు నాకు పెట్టవే !
అమ్మ నన్ను
మోహావతారుడనావే !

కాలికందెలు నాకు పెట్టవే !
అమ్మ నన్ను
కలికావతారుడనావే !

ఒళ్ళంత సొమ్ములేయవే !
అమ్మ నన్ను
వజ్రాల వాసుడనావే !

పట్టుపంచలు నాకు కట్టవే !
అమ్మ నన్ను
పార్వతీ తనయుడనావే !

—పండుగలకు సంబంధించిన పాటల్లో అట్లతద్ది, ఉయ్యాల పాటలు ప్రధానమైనవి. అట్లతద్ది బాలికలకే సంబంధించినదైనా, వ్రతం, పూజ పిమినహా యించి మిగిలిన అన్నిటా అంటే అట్లు తిమ్మనం తినడంలోనూ, ముంతక్రింద అన్నం తినడంలోనూ, పిల్లలతో తెల్లవారు జాముననేలేచి అరుచుకుంటూ, ఆడి, పాడి, ఊయలలూగి - గెంతడంలోనూ బాలురకూ పాలు ఉంది!

అట్లతద్దోయ్
ఆరట్లోయ్
ముద్దపప్పోచ్
మూడట్లోయ్
పడకల మీదా

పిల్లల్లాలా - జల్లల్లారా
లేచి రారండోయ్ ! !
పీటా క్రింద పిడికెడు బియ్యం
పిల్లల్లారా - జల్లల్లారా !
లేచీ రారండోయ్ !

వెన్నెల వె లు గు ల్లో ఒక గ్రూపు అటు, ఒక గ్రూపు ఇటు నిలుచుని పెళ్ళి ఆట అని ఆడుతారు.

చిట్టి మీ రేమిటివారే
చిట్టెక్కా మీ రేమటివారే
పూర్ణీ మీ రేమిటివారే
తామర మొగ్గల్లా

చిట్టీ మేం వ్యాపారులం
చిట్టెక్కా మేం వ్యాపారులం
పూర్ణీ మేం వ్యాపారులం
పూర్ణక్కా మేం వ్యాపారులం
తామర మొగ్గల్లా

చిట్టీ మీ వ్యాపారమేమి
చిట్టెక్కా మీ వ్యాపారమేమి
పూర్ణీ మీ వ్యాపారమేమి
పూర్ణక్కా మీ వ్యాపారమేమి
తామర మొగలా
గ్గల్లా

చిట్టీ మేం రత్నాల వ్యాపారులం
చిట్టెక్కా మేం రత్నాల వ్యాపారులం
పూర్ణీ మేం రత్నాల వ్యాపారులం
పూర్ణక్కా మేం రత్నాల వ్యాపారులం
తామర మొగ్గల్లా

గుజ గుజ రేకుల పిల్లుందా
గుజ్జా రేకుల పిల్లుందా
స్వామీ దండల పిల్లుందా
సహరాజులు మెచ్చే పిల్లుందా

గుజ గుజ రేకుల పిల్లుందీ
గుజ్జా రేకుల పిల్లుందీ
స్వామీ దండల పిల్లుందీ
సహరాజులు మెచ్చే పిల్లుందీ

గుజ గుజ రేకుల పిల్లాడున్నాడా
గుజ్జా రేకుల పిల్లాడున్నాడా
స్వామీ దండల పిల్లాడున్నాడా
సహరాజులు మెచ్చే పిల్లాడున్నాడా

గుజ గుజ రేకుల పిల్లాడున్నాడు
గుజ్జా రేకుల పిల్లాడున్నాడు
స్వామీ దండల పిల్లాడున్నాడు
సహరాజులు మెచ్చే పిల్లాడున్నాడు

గుజ గుజ రేకుల పిల్లనిస్తారా
గుజ్జా రేకుల పిల్లనిస్తారా
స్వామీ దండల పిల్లనిస్తారా
సహరాజులు మెచ్చగ పిల్లనిస్తారా

గుజ గుజ రేకుల కట్నమెంత
గుజ్జా రేకుల కట్నమెంత
స్వామీ దండల కట్నమెంత
సహరాజులు మెచ్చగ కట్నమెంత

గుజ గుజ రేకుల జరీ కుచ్చులు
గుజ్జా రేకుల చంద్రహారాలు
స్వామీ దండల ఒడ్డాణం
సహరాజులు మెచ్చగ సూరీడూ

గుజ గుజ రేకుల మాకొద్దూ
గుజ్జా రేకుల మాకొద్దూ
స్వామీ దండల మాకొద్దూ
సహరాజులు మెచ్చగ మాకొద్దూ

గుజ గుజ రేకుల పిల్లాడి కట్నమెంత
గుజ్జా రేకుల పిల్లాడి కట్నమెంత
స్వామీ దండల పిల్లాడి కట్నమెంత
సహరాజులు మెచ్చగ పిల్లాడి కట్న మెంత

గుజ గుజ రేకుల రవ్వంగరాలూ
గుజ్జా రేకుల కడియాలూ
స్వామీ దండల హారములూ
సహరాజులు మెచ్చగ తుదాయి

గుజ గుజ రేకులు మాకొద్దూ
గుజ్జా రేకులు మాకొద్దూ
స్వామీ దండలు మాకొద్దూ
సహరాజులు మెచ్చగ మాకొద్దూ

గుజ గుజ రేకుల చీనాంబరాలు తెచ్చాము
గుజ గుజ రేకుల జల్లరు రవికలు తెచ్చాము
స్వామీ దండల పండ్లూ పసుపూ తెచ్చాము
సహరాజులు మెచ్చగ పెండ్లికి వచ్చాము

—ఆటలు ఆడుకుంటూ, పాటలు పాడుకుంటూ కూడా పిల్లలు తమ పంటలు బాగా పండాలనీ, గాదెలు నిండాలనీ, అమ్మ పండితే తమ బొజ్జ నిండాలనే కోరుకొనే పసి హృదయపు లోతు ఎంతటిదో ?:

వానల్లు కురవాలి
వరిచేలు పండాలి
బుడుగో బుడుగో !
మా గాదె నిండాలి
మా దాసి దంచాలి
బుడుగో బుడుగో !
మా అమ్మ వండాలి
మా బొజ్జ నిండాలి !
బుడుగో బుడుగో !

ఈ 'బుడుగో బుడుగో' పాట గిరగిరా తిరుగుతూ పాడతారు !

—ఒక చేతిమీద ఒక చెయ్యి పెట్టి ఆడుతూ పాడేది ఈ పాట.

గుడి గుడి గుంచం
గుండా దాగం !
పాముల పట్నం
పడగా రాగం !
కత్తెనా బద్దెనా ?
వేస్నిళ్ళా ! చస్నిళ్ళా ?

—అలాగే చంటి పిల్లాడిని నవ్వించడానికి ఆటగా పాడేది ఈ పాట :

చేతులు కడిగి
ఆరిటా కేసి
పప్పు పెట్టి
బువ్వ పెట్టి

కూరేసి
నెయ్యోసి
చారోసి
మజ్జిగోసి
అత్తారింటికి దారేదోయ్
అంబలి కుండకి చిల్లేదోయ్

—పాటలు పాడి ఆడిస్తూ అందులోనే బాలలకు భక్తి, నీతి గరపడం బాల గేయాలలో ఒక ప్రత్యేకత! అందుతోపాటు మన వంటల పేర్లు, వాని వరుసలు, వస్తువులు, దేముళ్ళ పేర్లు నేర్పడంతోపాటు ఆయుర్వేద రహస్యాలు కూడా రంగరించి నేర్పడం చాలా గొప్ప కదూ మరి.

కొండమీద
వెండి గిన్నె
కొక్కొరాజు
కాలు విరిగె
దానికేమి మందు?

—అని, కాలు విరిగిన కొక్కొరాజుకు మందు ఏమిటో ఈ పాటే చెబుతుంది:

వేపాకు చేదు
వెల్లుల్లి గడ్డ
నూనాయిబొడ్డు
నూటొక్క ధార!

—అని మందు కూడా చెప్పి ఆయుర్వేద సూత్రం ప్రబోధిస్తుంది. ఇటు పంచి పదాల ప్రత్యేకత ఎంత విలువైన దంటారు?

ఈ విధంగా పాటల ఆటలను, ఆటలతో కూడిన పాటలను పరిచయం చేసుకురావాలంటే - నేను ప్రత్యేకం బాలల కోసం బాల కవితలకు (జానపద)

సంబంధించి తయారుచేసిన 'బాల గీతాల' పుస్తకం అంత అపుతుంది. ఇక్కడ మచ్చుకు కొన్ని మాత్రమే పరిచయం చేశాను! ఆఖరున మన ఆటలను పరిచయం చేసి ముగిస్తాను.

"చెడుగుడు దోబూచి చిట్లపొట్లకాయ
గుడుగుడుగుంచాలు గూపనాళ్ళు!
చీకటి మెటికళ్ళు సిరిసింగనాపత్తి
కుప్పిగంతులు నెట్లుకుందికాళ్ళు!
తూరనతువాలు గీరనగింజలు
గుజగుజరేకులు గుంటచాళ్ళు!
పింపిళ్ళు కుచ్చెళ్ళు పిడిగ్రుద్దులాటలు
దాగిరి ముచ్చులు, తన్నుబిళ్ళ!
బొమ్మరాలున్వాలపోటి వెన్నెలకుప్ప
లప్పళావాలంకు లందలములు!
పుట్టచెండ్లుప్పనబట్టె లచ్చనగండ్లు
పిల్లదీపంబులు పిల్లగోళ్ళు!
గంజనగాలీనెగాజులు నాల్గు
కంజాలాటబట్టిన గోలాలాకె!
పీకెటబొమ్మల పెల్లిండ్లునోమన
గుంటలు గుజ్జెల గూళ్ళనండి!
కోలక్రోతుల గొబ్బెళ్ళు శుంచెనగుడి
గచ్చకాయలు కలుమూసి గంతలల్లి
చిక్కనాబిల్లలోటిల్లు విందెరయస
నొప్పినాటల పేర్లయి యువిదలార!"

చూచండి—ఎన్ని ఆటలు ఉన్నాయో ఆడుకోడానికి? మరి అన్ని ఆటలు నేడు ఆడుకోడానికి ఆంత సమయముందా అనేదే ఆలోచన!- ప్రశ్న!!

మన ఆటలను గురించి ముఖ్యంగా ప్రాచీన క్రీడలను గురించి మన ప్రాచీన కావ్యాలలో ప్రశస్తి మెండుగా కనుపిస్తుంది - దీనినిబట్టిపైన మనం చదివిన ఆటలు అన్నీ బాలా ప్రాచీనమైనవని మనం గుర్తించ గలుగుతాం !

ఈ విధంగా ఉదయం లేచింది మొదలు తిరిగి నిద్దుర పోయేవరకూ - జరిపే ప్రతీపనికీ పాటలద్వారా-ఆటలద్వారా సంరక్షణ జరుపుతారు-పిల్లలకు అందులోనే చక్కని నీతులూ, కథలూ నేర్పుతారు !



మన ప్రాచీన కథలు తోలుబొమ్మలాటలు

రథ బొమ్మలాట అతి ప్రాచీనమయింది. ప్రాచ్య ఖండంలో ఈ కళ ఉద్భవించిందని అందరు అంగీకరించిందే.

చైనాలో హాన్‌రాజుల కాలంలో ఉన్నట్లు చారిత్రకాధారాలు ఉన్నాయి. దీనిని గురించిన ప్రస్తావన జపాన్ ప్రాచీన సాహిత్యంలోనూ మనకు కనుబడుతుంది.

మన ఆంధ్రప్రదేశ్‌కు వస్తే అతి ప్రాచీన కళారూపం తోలుబొమ్మల కళ అనవలసి ఉంటుంది. క్రీ॥పూ॥ మూడవ శతాబ్దిలోనే తోలుబొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు కనిపిస్తూంది.

శాతవాహన, పల్లవ, చాళుక్య, కాకతీయ రాజుల కాలంలో మంచి ప్రోత్సాహం లభించి, తదుపరి కాలాలలో–అంటే, విజయనగర, తంజావూరు



ఒక తోలు బొమ్మ

రాజులకాలంలో ఆరుకాయలూ మూడు పువ్వులుగా మంచి ఉచ్ఛస్థితిలో వెలుగొందింది.

ఇక్కడినుంచే ఇతర దేశాలకు వెళ్ళినవారితో ఈ కళ ఇతర దేశాలలో, ఖండాంతరాలలో ప్రచారం పొందింది, ప్రజాదరణ అందుకొంది.

ఆగ్నేయాసియాలో బహుజనాదరణ లభించింది. అలా అలా పర్షియా, టర్కీలమీదుగా గ్రీసువరకు పాకింది. అలా వెళ్ళిన ఈ కళకు కొత్త అలంకారాలు రూపొందాయి.

అక్కడి నుంచి ఉత్తరాఫ్రికలోని దేశాలకూ వెళ్ళింది. 17 వ శతాబ్దానికే ఇటలీ, ఫ్రాన్స్, పారిస్‌లలో ఆదరణ పొందింది.

అయితే ఒకచోటనుంచి మరోచోటికి, ఒక దేశం నుంచి మరో దేశానికి, అలా ఖండాల నుంచి ఖండాలకు మారడంలో ఈ బొమ్మలాటలు విభిన్నరూపాలు పొందాయి. రూపంలో పెద్దగా తేడా లేకపోయినా ప్రక్రియతో భిన్నత్వము, వైవిధ్యం కనిపిస్తుంది.

ఈ తోలుబొమ్మలు జానపదకళారూపమే కాదు, జానపదులకు అపూర్వమైన వినోద ప్రదర్శనం కూడా.

ఈ ప్రదర్శనను "ఛాయాచర్మ చిత్రనాటక"మని కూడా అనడం కద్దు.

* "గ్రామీణ వినోదము, సాంస్కృతిక ప్రతిబింబము, చారిత్రక నిదర్శనము అయిన ఈ తోలుబొమ్మలాట రెండువేల సంవత్సరాలకు పూర్వమే భారతదేశంలో ప్రసిద్ధిలో ఉన్నట్లు చెప్పబడుతోంది. ఇది మానవకోటిని ఆకర్షించే మూగభాషతో కూడిన దృశ్య వినోదము. వినోదంతో పాటు విజ్ఞానాన్ని—వార్తపత్రికలు, ఆకాశవాణి లేని రోజులలో వార్తా ప్రసారాన్ని ప్రజలకు అందించిన ఈ బొమ్మలాట మానవుని ఆది వినోదము. పండిత పామర జన రంజకమై, ఆరుబయట చీకటిరుగున ప్రదర్శించబడే ఈ తోలుబొమ్మల కళ తెలుగువారి ప్రాచీన కళాఖండాలలో మొట్టమొదటిదిగా పేరొందినది....

---

* ప్రసిద్ధ తోలుబొమ్మల పరిశోధకులు శ్రీ యస్. వి. రమణామూర్తి గారి "తోలుబొమ్మలు" వ్యాసం : నాట్యకళ—ఫిబ్రవరి—1970.

... ఇండోనీసియా, కొలంబో, మలేసియా, థాయ్‌లాండ్, బర్మా, లావోస్, సయాం, ఆఫ్రికా, గ్రీస్, మెడతోనియా, బిజాంటైన్, ఎంపైర్, టర్కీ-ఇలా ఎన్నో దేశాలలో ఈ కళ ఆదరణ పొందింది.

''ప్రపంచంలో బొమ్మలాట పుట్టుక స్థలం భారతదేశమని కొందరు, చైనా దేశమని కొందరు భావిస్తున్నారు. ఏమైనా బొమ్మలాట పుట్టుక స్థలం ఆసియా ఖండం-అది మాత్రం నిజం...''

తెలుగువారి ప్రాచీన కళావైదగ్ధ్యాన్ని ఖండాంతరాలకు వ్యాపింప చేసి, ఆంధ్ర కళామతల్లిని అందల మెక్కించి నీరాజనాలు అందుకున్న కళ ఈ తోలుబొమ్మల ప్రదర్శనాలే!

ఉత్తర హిందూస్థానంలో 'కట్‌పుత్లే' - దక్షిణ భారత ప్రాంతంలో - గుడ్రపు బొమ్మలాటలకు ప్రసిద్ధి. ప్రచారమూ వున్నదే - ఆంధ్ర కళగా తెలుగునాడున తోలుబొమ్మలాటలు అతి ప్రాచీన వినోద ప్రదర్శనాలు !

నేడు మన సినిమా పరిశ్రమకు - మొట్టమొదటి రూపం తోలు బొమ్మల ప్రదర్శనాలే అంటే - ఆశ్చర్యంగానే ఉంటుంది. సినిమా స్వరూపానికి-మార్గం చూపం ప్రసాదించింది - ఈ తోలుబొమ్మలే!

నేడు పాశ్చాత్య దేశాలలోనూ - దేశంలోనూ గొప్పగా చెప్పుకొనే ఛాయా ప్రదర్శనాలకు - మూలం ఈ తోలుబొమ్మలే!

ఎన్నో మార్పులు - కాలగమనంలో జరిగిపోతున్నా - కాలప్రవాహంలో అనేక ప్రాచీన కళారూపాలు ఆదరణ, పోషణ లేక కనుమరుగై పోయినా - నేడు సినిమాలు అందరికీ అందుబాటులో ఉన్నా - తెలుగు వారి ప్రాచీన కళా ఖండ మయిన తోలుబొమ్మల ప్రదర్శనాలు మాత్రం నిలద్రొక్కుకొని - వాటి ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనాయి.

అంతేకాదు - ఖండాంతరాలయిన జావా, బోర్నియో, సుమిత్ర, బలి, సయాం, కంబోడియా, బర్మా - మొదలయిన దేశాలలో - మన దేశం నుంచి వలసవెళ్లిన వారు- ఈ తోలుబొమ్మల ప్రదర్శనాలను ప్రదర్శిస్తూ - ఆంధ్ర

కళా విశిష్టతను అక్కడ ప్రచారంచేసి - ప్రసిద్ధిలోకి తెచ్చారు. అక్కడ రామాయణం, భారతం మొదలయిన కథలను ఎక్కువగా ప్రదర్శిస్తూంటారు.

ఈ తోలు బొమ్మల ప్రదర్శకుల నివాసం - మొట్టమొదట మహారాష్ట్ర దేశం. వీరు మహారాష్ట్రులు. వీరిని బొందిలీలు, బొందిలీ క్షత్రియులు, బొందిలీ కాపులు అని పిలువడం వాడుకలో ఉంది. కాని అనంతరం వీరు తెలుగుదేశానికి వచ్చి, ఇక్కడే స్థిరపడి పోయారని చెప్పవలసి ఉంటుంది. వీరు మహారాష్ట్ర నుంచే వచ్చిన వారని చెప్పడానికి ఇప్పటికీ రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఈ నాటికి తెలుగుదేశంలో తోలు బొమ్మల ప్రదర్శకులు మాట్లాడే భాష మరాఠీ, వీరి పేర్లు కూడా మహారాష్ట్ర సరిహద్దు నామాలయి ఉండడం. వీరి పేరిట ఒక గ్రామం బళ్లారి జిల్లాలో ఉంది - బొమ్మలాటపల్లి. ఆంధ్రతో అన్ని జిల్లాలలోనూ ఇప్పుడు ఒకటైనా బొమ్మలాటబళం వున్నా, తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కువగా కాకినాడ ప్రక్కన వున్న మాతవపట్నంలో ఎక్కువగా ఉన్నారు.

కూచిపూడి నాట్య విద్యను వారి వంశంలో అందరికీ తర్ఫీదు నిచ్చినట్లే - తోలు బొమ్మల దళంవారు కూడా అందరికీ తర్ఫీదు ఇప్పడం - ఒక ఆచారం - ఒక సంప్రదాయం - వంశంలోని అందరూ ఇంచుమించు నిష్ణాతులై ఉంటారు!

వీరు చక్కటి సుస్వరభూపులు. చక్కటి రూపురేఖా విలాసాలు, పెట్టి పుట్టిన కమ్మని కంఠధ్వనీ వీరి ప్రత్యేక లక్షణాలు.

వీరికి ఉన్న ఆస్తి అల్లా ఈ తోలు బొమ్మలే! వీరిలో ఆక్కడక్కడ ఉన్న వారూ, సంపాదించిన వారూ లేకపోలేదు. మొత్తం మీద వీరి అందరికి సత్రాలు, గోపురాలు, గుళ్ళు తల దాచుకోడానికి నిలయాలు.

ఈ తోలు బొమ్మలను మొదట్లో కీలు బొమ్మలని పిలిచినట్లు తెలుస్తుంది. కాని పాల్కురికి సోమనాథుని కాలానికే "కీలు బొమ్మలు" నామం విసబడకుండా - "తోలు బొమ్మలు" ఆనే వినబడుతుంది. అయితే, పాల్కురికి "తోలు బొమ్మలు" అని పేర్కొన్నట్లు లేదు. "చీర మరగున బొమ్మల నాడించువారు" అని మాత్రం - తోలు బొమ్మల ప్రదర్శనా సూచికను తను బసవపురాణంలో వివరించాడు. ప్రతి కీలు కదలడం వలన మొదట్లో వీటిని "కీలు

బొమ్మలు'' అని పిలవడం జరిగిందనుకుంటాను ఆ సమయంలో ఈ బొమ్మలను అట్టలతో మాత్రమే తయారు చేయడం జరిగింది. అనంతరం అట్టతో కాకుండా తోలుతో బొమ్మలను తయారుచేసి ప్రదర్శనలీయడం ప్రారంభించారు. అప్పటి నుంచే ఈ ప్రదర్శనకు 'తోలు బొమ్మలాటలు' అనే నామం ప్రచార మయింది. ఇప్పటికీ చైనా మొదలగుచోట్ల 'కీలు బొమ్మలు' అనే పేరున కొన్ని ప్రదర్శనాలు ప్రచారంలో ఉన్నాయి. పాశ్చాత్య దేశాలలో నేటి 'మేడో ప్లేస్' (ఛాయా ప్రదర్శనాలు) కూడా ఇవే !!

మనం భూకులనూ, ధనాన్ని పంచుకున్నట్లుగానే - పిల్లలు తమ తోలు బొమ్మలను పెద్దల ఆస్తిగా పంచుకొని - గౌరవించుకొంటారు.

వీరు ఇచ్చే ప్రదర్శనాలలో ఎక్కువగా రంగనాథ రామాయణం ప్రధాన మయినది.

తోలు బొమ్మలు చేసేవిధం

తోలు బొమ్మలను తయారుచేయడానికి - ఓపిక, శిల్ప చిత్ర కళా నైపుణ్యం - ఓర్పు ఉండాలి. మానవా కృతులను, జంతు రూపాలను తయారు చేయడానికి తగిన ఆర్టిస్టిక్ కెపాసిటీ - చాలా అవసరం ! అసలు వీరిని గురించి ఆలోచిస్తూంటే-ఏ నూతన ప్రక్రియలూ తెలియని వీరిలో ఇంతటి కళా కౌశలం, చిత్రకళా విజ్ఞానం ఎలా అబ్బాయా అనిపిస్తుంది !

ఈ తోలు బొమ్మలను రెండు రకాల చర్మాలతో తయారు చేస్తారు. ఒకటి-జింక చర్మం, రెండు - మేక చర్మం. బర్రె, గొర్రె చర్మాలూ ఉపయోగించడం కూడా కద్దు !

దేవతా విగ్రహాలూ అవీ తయారు చేయడానికి మాత్రం ప్రత్యేకంగా జింక చర్మాన్ని ఉపయోగిస్తారు. ఇలా జింక చర్మాన్ని దేవతా విగ్రహాలకు మాత్రమే ఉపయోగించడంలో వీరి భావం పవిత్రమైన దేవతలమీద వుండే భక్తి భావమే !

అలాగే మేక చర్మాన్ని రాక్షస స్వరూపాలను తయారు చేయుటకు ఉప యోగించడం పరిపాటి. విలువయిన జింక చర్మాన్ని కాకుండా, మేక చర్మం మాత్రమే రాక్షస బొమ్మలకు ఉపయోగించడంలో రాక్షసత్వంమీద వీరిమున్న ఏహ్యభావమేనని మనం చెప్పుకోవలసి ఉంటుంది.

శాతవాహనయుగ ఘడియలనుంచి ఈ తోలుబొమ్మల కళ - మూడు పువ్వులూ ఆరు మొగ్గలుతో కలకలలాడ సాగింది. అనేక జానపద కళా రూపాలు తెర మరుగై పోయినా - ఈ తోలు బొమ్మలాటలు - నిలబ్రొక్కుకుని ప్రదర్శన లిస్తున్నాయి.

ఈ ప్రదర్శనాలనే తమిళ దేశంలో ''తోల్పాలై'' అనీ, కర్ణాటక ప్రాంతంలో 'బయలాటము'లనీ పిలుస్తారు. కేరళలో చాలా ప్రచారం పొందాయి ఈ ప్రదర్శనాలు.

దేశాంతరాలలో ఈ తోలు బొమ్మలాటలు - తమవే ఈ ప్రదర్శనాలు అనేంతగా ప్రచారమై పోయాయి.

ముఖ్యంగా ఈ ప్రదర్శనాలు- నాడూ, నేడూ కూడ గ్రామాలలోనే ప్రద ర్శించడం పరిపాటి. ఒకనాడు రాజుల ఆదరణ పొందింది. ప్రజల ఆదరణ నాడూ - నేడూ కూడా ఉంది.

నేడు సంగీత నాటక అకాడమీ లాంటి ప్రజాసంస్థలు - ప్రభుత్వ ఆద రణతో - ఇటువంటి జానపద కళారూపాల పునరుద్ధరణ - పోషణకు-ప్రచా రానికి - కృషి జరుగుతోంది ఇది ఎంతో ఆనందదాయకం - శుభ సూచకం!

ఈ ప్రదర్శనలలో ఒక గొప్పతనం హెచ్చుతగ్గు భేదాలు లేకుండా అన్ని తరహాల ప్రజలూ ఈ కథా గమనంలో లీనమై పోవడం - కష్టాలతో గూడిన ఘట్టాలు వచ్చినపుడు కనులనుంచి నీరు పెట్టుకుని జాలి పడడం ఈ ప్రదర్శనాల లోనే మనకు అగుపిస్తుంది, దౌర్జన్య చర్యలతో కూడిన దృశ్యాలు ప్రత్యక్ష మైనపుడు పళ్లు పటపట మనిపించి – మండిపడుతూండడం ఈ ప్రదర్శనాలకే

పెల్లుతుంది. ఆలాగే హాస్యపూరితమయిన ఘట్టాల ప్రదర్శనా సమయంలో జుట్టుపోలిగాడు, బంగారక్క తెరపైన ప్రత్యక్షమైనపుడు మహోత్సాహం పొందుతూ- ఆయా ఘట్టాలలో, పాత్రలతో కలిసి పోతారు ప్రజలు.

సినిమాలలోలాగా-ఏ సాంకేతిక పరిజ్ఞానమూ అవసరం లేకుండా - ఏ కృత్రిమ దృశ్యాల కల్పనా అవసరం లేకుండా - మనకు కనిపించే ప్రాచీన కళ తోలు బొమ్మల ఆట!

ప్రదర్శనా విధానం

ఈ ప్రదర్శనలిచ్చే దళానికి ఒక పెద్ద ఉంటాడు. ఆ పెద్దకు అను గుణంగా-అనుసరించి మిగిలిన అందరూ నడుచుకొంటారు.

కథ నడపడానికీ, కథలోని వివరం చెప్పడానికీ - తెరలోపలనే ఒకరు ఉంటారు. ఆ పాత్ర చాలా చురుకైనవాడూ, వాక్‌శుద్ధి కలిగిన వాడూ అయి ఉండాలి. అతను కథను - దృశ్య సన్నివేశాన్ని బట్టి - అనేక తరహాల్లుగా - వివిధ పద్ధతులలో - శ్లోకాలలో - గేయాలలో - పదసంలో - నడుపుకు పోతూ ఉంటాడు. ఇలా కథ చెప్పే వారిలో మనం గుర్తించవలసిన గొప్ప తనం అల్లా - పాత్రల గుణ రూపాలను బట్టి గొంతు మార్పుతో కథాగమనం సాగించడం!

రావణాసురుని వైరాగ్య చర్యల వర్ణన విని - మండిపడకుండా ఉండడం ఆ సమయంలో చాలా కష్టం. అలాగే సీతాదేవి అశోక వృక్షం కింద రాక్షసుల బాధలు అనుభవిస్తూ ఉండేం వర్ణన వింటూన్నప్పుడు ఎంతటి కటిక రాతి గుండె వారైనా ఆ సమయంలో కంట తడి పెట్టకుండా ఉండలేరు - దీనిని బట్టి ఈ ప్రదర్శనలు ఎటువంటి ఉన్నత స్థాయిలో కొనసాగుతాయో అర్థం చేసుకోనవచ్చును.

ఈ ప్రదర్శన - రాత్రి పది గంటలు మొదలుకొని తెల్లవార్లూ కొనసాగుతుంది. ఇంత సేపు ప్రదర్శనను చూసే ప్రేక్షకులు విసుగు చెందకుండా - మధ్య మధ్యన హాస్య పాత్రలయిన జుట్టుపోలిగాడు, బంగారక్కలు వచ్చి తమ

సహజసిద్ధమయిన హాస్య ధోరణిలో పలుకరిస్తూ నవ్విస్తుంటారు. ఈ తోలు బొమ్మ లాటలలో వంత పాట పాడే వాళ్ళు సాధారణంగా ఆడవాళ్ళై ఉంటారు. వారు పాడే రాగాలలో ఎక్కువగా ముఖారి రాగం వినిపిస్తూంటుంది. తోలు బొమ్మల దళ నాయకుడికి ఇద్దరు ముగ్గురు భార్యలు ఉండడం (పూర్వ కాలం నాటి మాట) కూడా కద్దు. బహు భార్యాత్వాన్ని అంత నషేధం లోకి తీసుకొరు వీరు. ఇలా బహు భార్యలను పెళ్ళి ఆడవంలో పూర్వకాలంలో వీరి ఉద్దేశ్యం ఒకటై ఉండొచ్చు.

ప్రదర్శనకు వంత పాటలకు, ప్రక్క వాయిద్యాలకు "జీ" కాయడానికి- ఇలా చాలా మంది అవసరం. ఇలా తెప్పుకొనే వారందరికీ డబ్బు ఇవ్వాలి. డబ్బు ఇచ్చి ప్రదర్శన లివ్వడం అంటూ జరిగితే ఇక వీరికి మిగిలేది ఏమీ ఉండదు. అందుకని వీరు ఇద్దరూ, ముగ్గురూ భార్యలను కట్టుకోడం జరిగేది. అదీ కాక ఆట మధ్యలో ఒక ఆడగొంతు కొంగురు పోయినా - ఆనాటి ప్రదర్శనానికి ఆటంకం కలుగకుండా మరో స్త్రీ ఆ స్థానంలో సర్దుకోడం జరుగుతుంది.

ప్రతి బొమ్మలాట దళానికి ఒకటీ, రెండూ గుర్రాలు తప్పనిసరిగా ఉంటాయి. ప్రయాణాలకు బళ్ళ ఖర్చులు లేకుండా - ఆ ఉన్న కాస్త సామానునూ ఈ గుర్రాల మీద మోసుకొని పోతారు. వీటి పోషణ సంతి-ఏ గ్రామల చేలతోనో, వీధులలోనో, గ్రామ కంఠాలలోనో అలా మేస్తూంటాయి.

ప్రదర్శన - సామానులు

ముఖ్యంగా తోలు బొమ్మల ప్రదర్శనానికి కావలసిన సామానులు చాలా తక్కువ. అవి అయినా శ్రమలేకుండా సునాయాసంగా సంపాదించగలిగేవే !

ఒక తెల్లని తెర - ఇది గ్రామంలో చాకలిని అడిగితే ఇస్తాడు. ఈ తెర చాలా వెడల్పుగాను - బిరుసుగానూ ఉండుస్తాయి. ఈ తెరను అమర్చుకోడంలో ప్రదర్శన సమయంలో లైటింగ్, సౌండ్ ఎఫెక్ట్సుకు చేసే ఏర్పాట్లలో కథా గమనానికి తగ్గట్లు బొమ్మలను - కొంకి కర్రలతో ఆడించడంలో చాలా నేర్పరితనం గోచరిస్తుంది.

తోలు బొమ్మలు సరేసరి. ఒక బల్ల - ఇది యుద్ధ ధ్వనులు, గుద్దులాటలు మొదలగు ఘట్టాలలో - వాటితో ట్రాక్కి సౌండ్ ఎఫెక్ట్స్ ఇవ్వడానికి అవసరం. ఇది ఏ గ్రామం వైతున్నా అడిగితే ఇస్తాడు. హార్మోనియం, తాళాలు, పెట్రోమాక్స్ లైట్స్ కావాలి.

పూర్వ కాలంలో - మొట్ట మొదట కాగడాలు పెట్టుకొని ఆ వెలుగులో, ఆ రాత్రి ఛాయలో ప్రదర్శనా లిస్తూండే వారు. కాని రాను రాను కాలంతో పాటు ఆ కాగడాల విషయంలోనూ మార్పు వచ్చింది. పెట్రోమాక్స్ లైట్లు వాడకం వచ్చింది. - ఇప్పుడు అక్కడక్కడ ఎలెక్ట్రిక్ దీపాలు కూడా ఉప యోగించారంటే ఆశ్చర్యం లేదు. కాని ఒకటి మాత్రం నిజం అనుకుంటాను - ఏమిటంటే - పెట్రోమాక్స్ కాంతి, ఎలక్ట్రిక్ కాంతికన్నా-ఈ తోలు బొమ్మలు చక్కగా ఆనడానికి-సీత స్వచ్ఛతగా అగుపించడానికి ఆముదందీపం కాంతే బాగుంటుంచంటారు.

ప్రదర్శనా మండపం

ఏ గ్రామంలో ఏ వీధిలో-ఏ ప్రదేశంలో ప్రదర్శన ఇస్తారో - అక్కడ స్థల నిర్ణయం చేస్తారు. అందరికీ అందుబాటులో ఉండేలా - కూడలి ప్రదేశం చూసి - అక్కడ ప్రదర్శనామండపం నిర్మిస్తారు. దీనిని ఆరుబయలు థియేటర్ అనాలి. ఈ ప్రదర్శనాలకు టిక్కెట్లు లేవు, గేట్లు లేవు. క్లాసులు అసలు ఉండవు.

ఒక చీరకు మరో చీరను ఈత ముల్లులతో అతికి పందిరి ముఖం వెంపు రెండు గడలకూ అడ్డంగా బిగించి కడతారు. ఒక మూల బైటకు వెళ్ళడానికి కొంచెం ఖాళీ ఉంచుకొని నాలుగు మూలలూ మూసేస్తారు. ఆ తోపలవున్నవారు బైట వున్న వారికి కనిపించరు.

ప్రదర్శన చూసే వెళ్లవార్లూ ఆ మండపంలోనే వుండడం జరుగుతుంది కనుక - లోపలే అన్ని ఏర్పాట్లూ - పిల్లల ఉయ్యాలలూ, "టీ" తాగుడునే ఏర్పాట్లూ - చిన్న పడకలు - అన్నీ అక్కడే తాత్కాలిక ఏర్పాట్లు జరుగుతాయి.

ప్రదర్శనకు ముందు తెర మీద వినాయకుని బొమ్మ ఎక్కించి - ప్రార్థనతో ప్రదర్శన ప్రారంభిస్తారు. ప్రదర్శన తెల్లవార్లూ కొనసాగవలసిందే!

తోలు బొమ్మల తయారీ

ఈ తోలు బొమ్మలను ఇంక, మేక చర్మాలతో తయారు చేయడం ప్రాచీన కాలం నుంచీ వస్తూన్న సుప్రదాయం. బర్రె, గొర్రె, చర్మాలూ ఉప యోగించబడడం కద్దు.

చర్మాన్ని చాలా పలుచగా - నాజూకుగా చేస్తారు. ఎంత నాజూకుగా చర్మాన్ని చదును చేస్తారంటే - కత్తిరించిన పలుచని ఆట్టా అనిపించేలా సాఫ్ చేస్తారు. అలా తయారుచేసిన చర్మాన్ని కావలసిన రూపాలలో చక్కగా కత్తి రిస్తారు. ఆ బొమ్మలకు - రెండు వెంపులా రూపాలకు తగ్గట్టు - ముదురు రంగులు పూస్తారు. ఏ కారణం చేతనూ రంగులు పోవు.

ఈ బొమ్మలకు అన్ని అవయవాలూ కదిలికకు వీలుగా - కుట్టుకొని, అలంకరించుకొంటారు. వీటిని ఏ పరిస్థితిలోనూ చేతితో ముట్టరు. కొంకి కర్రలతో ప్రదర్శనను బహునేర్పుగా నడిపిస్తారు. వీటిని చాలా భద్రంగా చాచు కొంటారు. చెడలు - పురుగులూ పట్టి పాడై పోకుండా వెదురు బుట్టలతో భద్ర పరుస్తారు. తోలు బొమ్మలవారు ఆస్తిగా - వారసత్వ ధనంగా - చూచుకొనేవి, పూజించేవి వీటినే!

ప్రదర్శన ప్రారంభంలో-తెర అంతా అనేక విధాల అయిన జంతువులూ, పువ్వులుతో నింపేసి గణపతి ప్రార్థన అనంతరం - తెరను తీసేసి - కథా సంచాలకుడు కథా వివరం ప్రారంభిస్తాడు ! !

బొమ్మలను తెరమీదకు ఎక్కించడంలో, మార్చడంలో, కదిలించ వంలో, అవయవాల కదలికల సంవిధానంలో ప్రదర్శకుడు చాలా మెలకు వగా-నేర్పుగా వ్యవహరించాలి. లేకుంటే బొమ్మల నీడ ప్రేక్షకులకు కనిపించి-తగి లించడం-మార్చడం మొదలగు ప్రతి పనీ ప్రేక్షకుల కంట పడుతుంది. అలా పడకుండా చాలా నేర్పుగా బొమ్మలను ప్రవేశ పెడతారు.

ఈ ప్రదర్శనలలో - సంగీతం అవసరం, వాక్‌శుద్ధి అవసరం-నాటకకళ తెలిసుండాలి-చిత్రకళా అవసరం-అన్నిటినీ మించి ఓపిక, నేర్పు, తెలివి తేటలు మరీ అవసరం.

వర్షాకాలంవచ్చిందంటే మాత్రం ఈ ప్రదర్శకులకు సంపాదన ఉండదు-ఎక్కడా ప్రదర్శన లుండవు. ఈ సమయంలో ఆడవారు ఆదుకుంటారు-మొగవారు ఇంట్లో కూర్చుంటే-ఆడవారు బుజాన హార్మోనియం తగిలించుకొని - పీధి పీధికీ తిరుగుతూ - ఆ పాటా, ఈ పాటా పాడుతూ బియ్యం, పచ్చళ్ళూ ధర్మం అడిగి తెచ్చుకుంటారు.

తోలుబొమ్మల ప్రదర్శనలు ఇచ్చేసమయంలో పబ్లిసిటీ డిపార్టుమెంటుగా పని చేసేది కూడా ఈ ఆడవారే!

ప్రదర్శన రాత్రి అనగా - ఓ హార్మోనియం బుజానవేసుకొని గ్రామంతో పచ్చళ్ళూ ఆవీ - సంపాదించుకొంటూ, రాత్రి ఫలానా చోట-ఫలానా ప్రదర్శనం అని ప్రచారం చేయటం వీరి పని!

నేడు ఛాయాప్రదర్శనాలు (షేడోప్లేస్) అన్న విధానం ఈ తోలు బొమ్మల ఛాయలే.

నేటి సినిమా ప్రదర్శనా విజయానికి మార్గం చూపినదీ ఈ తోలు బొమ్మలాటలే !

ఆంధ్రుల ప్రాచీన సినిమా రూపం-నేటి తోలు బొమ్మలాటలు!

నేటి సినిమాల ప్రాచీన రూపం నాటి తోలు బొమ్మల ఆటలే!!

మన బాధ్యతలు

ఎన్నో విధాల ఆంధ్ర సంస్కృతికీ, ఆంధ్ర కళా రూపాలకీ ఖ్యాతిని చేకూర్చి పెట్టిన మన ప్రాచీన జానపద కళారూపం అయిన ఈ తోలు బొమ్మల ఆటలకు - ఏ విధంగా చూసినా నేడు అంత ఆదరణా - ప్రోత్సాహమూ లేదు. సాంకేతిక విలువలతో ఆకర్షిస్తూన్న సినిమాల ధాటికీ, నాటకాల పోటీకి తట్టుకోడం కష్టంగా ఉన్న నేడు - ఈ కళకు తగిన ప్రోత్సాహం, ఆదరణా అనేక విధాల, అన్ని పైపులనుంచీ రావాలి!

దేవాలయాలలో ఉత్సవ సందర్భాలలో ఈ ప్రదర్శనలను ఏర్పాటు చేయించడం - సభలూ మొదలగు సమయాలలో ప్రదర్శనాలిప్పించడం - ప్రభుత్వం, నాటక అకాడమీ, ప్రజలూ, సంస్థలూ అందుకు పూనుకోడం - చాలా అవసరం.

ప్రభుత్వం - నాటక అకడమీ - నేడు అనేక విధాల మన ప్రాచీన జానపద కళా రూపాలకు ప్రోత్సాహం అందించి - ప్రాచీన ఔన్నత్యాన్ని తిరిగి వెలయించడం కోసం పట్టుదలతో కృషి చేస్తూన్నవి. ఈ కృషికి అందరూ అన్ని విధాలా సహకరించి - కృషి చేసిననాడు తిరిగి కొత్త వెలుగులతో ఈ "కళ" ఆంధ్ర గ్రామసీమలలో పీఠం వేయగల దనడంలో సందేహం లేదు - అటువంటి శుభదినానికి స్వాగతం పలుకుదాం !

సరసాలు-సరదాలు



జానపద సారస్వతంలో శృంగార సాహిత్యది ఒక తరహా ! ఒక ప్రత్యేకత !

ఈ శృంగార సాహిత్యలో ప్రేమీప్రేమికుల మధ్య జరిగే మహదానం దాన్నీ, వారీ ప్రేమైక జీవిత ధర్మాలనూ కళ్ళకు కట్టినట్టు వినిపింపజేస్తాయి ఈ పాటలు.

పాట ! - ఎంత కమ్మని మాటో ! జానపద కథల్లోనుంచి కావ్యాలదాకా, జానపదుల జీవితలోతుల అంచులలో నుంచి చిక్కని తేనెగా, తెల్లటి మల్లెలా, సన్నటి జాజిలా, చందమామలా పాటలు వినిపిస్తూనే ఉన్నాయి. నక్కా కాకి భావని పాట పాడమంది; బొమ్మల పెళ్ళికి కోకిల గాన కచేరీలు తప్పకుండా పెట్టి స్తూనే ఉన్నారు - భవిష్యత్ రథసారథులు మన ఇళ్ళళ్ళో - బొమ్మల పెళ్ళి ళ్ళలో !

ప్రేమించే పూవుని, వరించే కలువని, అనుసరించే అందాన్ని, అందుకో వాలనుకొనే ఆనందాన్ని - ఇలా మాటల్లో పొదిగి, గొంతులోంచి ఒక్కసారి బైటకు వినిపిస్తాయి - అందరి కోరికలు, నమ్మకాలు, అనురాగాలు, సరాగాలు, సరసాలు, సల్లాపాలు, చల్లగాలులు, మేఘాలు, చందమామ, చిలుకలు, హృదయాలు, చూపులు, రూపులు - ఏకమై - ముడివేసుకుని - ఒక్కసారి గుమ్మని - సంపెంగలాగా, మొగలిలాగా స్వాగతం పలుకుతుంది.

పాట - అందులోనూ శృంగారపరమైనది - ఎంత కమ్మనీ, చిక్కనివో విందాం - మనమూ - ఓ భావలాగో, మరో చిన్నదిలాగో, సన్నజాజుల చిన్నది లాగో అయి, ఆ ఆనందాన్ని ఓ నిముషం పంచుకుని పట్టు జరీ కుచ్చుల పాలకేలో ఊరేగుదాం !

*ఈ పాట ఒక పురుషుడు ఒక పడుచుమధ్య జరిగే సంభాషణలాంటిది- అమ్మాయిని చూసిన యువకునికి యువతి ఏవిధంగా ఉంటే అందంగా ఉంటుందో చూడండి.

మగ:- పొట్టిదానికి మట్టెలందం
పొడుగుదానికి గాజులందం
నాగుబాముకు నడుము సన్నం
నెమలిపిట్టకు పించమందం
తకజనత తకధిమిత తా !!

ఆడ:- సిట్టిపొట్టి సిన్నివోడా
సిన్నిదాన్ని సూసినావా
గట్టులేక మట్టువిప్పి
గుటక లెన్నో మ్రింగినావ?
సెట్టుసాటు నున్నదాన్ని
స్పృశించేయద్దురో
బావా నా బావా !!

మగ:- ఆ పక్కా నొకమంటా
ఈ పక్కా నొకమంటా
ఏ తంటా లేకపోతే
నా యెంట రాయే
సినిమా సూపెడతా
నా సక్కని గుంటా
సినిమాను సూపెడతా !!

విశాఖ మండలంలో మోటుసరసపు పాటలు, పచ్చి శృంగార గీతాలూ చాలా ఉన్నట్లు అనుకుంటాను. పై గేయం కాని, ఈ క్రింది గేయంకాని అటు

---

* ఈ పాటలు విశాఖ మిత్రుడు 'వరాహగిరి' ద్వారా సంపాదించినది.

వెంపువే! సెరకుతోటకూ బుచ్చెప్పకూ అవినాభావసంబంధం కలదని చెప్పే ఈ పాట వినండి:

''నీది బాగుందె బుచ్చెప్ప
సెరుకుతోట !
రంగూరంగూలకర్ర
గుంపూగుంపూలకర్ర
నీది బాగుందె
బుచ్చప్పా బాగుందె
సెరుకుతోట బాగుందె...

వచనం:- ఎందుకు బాగుండదు ?

ఉన్నవారైదుగురు
కూకుంటె యెడతారు
నిలబడితె యెడతారు
తోటకి—
నీరు యెడతారు,
నాది మేటేసుకుపోనాది
బుచ్చప్పా మేటేసుకుపోనాది !
సెరుకుతోట మేటేసుకుపోనాది!

వచనం:- ఏటి పిల్లా నీ ఖర్మం ?

ఉన్నవాడొక్కడు
వోటోడై పోనాడె
బుచ్చప్పా వోటోడై పోనాడె
ఎక్కమంటె ఎక్కనేడు
ఏతాము -
నడుపులు నొప్పంటాడు
కాళ్లూరావంటాడు
నా గెహచారం కాలిపోను
మేటేసుకుపోనాది - నాది

బుచ్చప్పా మేటేసుకుపోనాది
నీది బాగుందె బుచ్చప్పా
సెరకుతోటా !!

ఈ 'లచ్చిమి' ఆకులమ్ముకునే పడుచు. ఈమెతో సంబంధం కలిసింది. ఏదో ఇస్తానని కూడా చెప్పి ఇంటికి ఆహ్వానించినట్లుంది. అందుకే లచ్చిమి [పక్కనుంటే స్వర్గమే అని కలలుకూడా కంటున్నాడు:-

"ఆకులమ్మే లచ్చిమీ
సిగురాకులమ్మే లచ్చిమీ
ఆకులమ్మిన రూకలన్నీ
ఏటిసేత్తివె లచ్చిమీ!! ॥ఆకు॥

కోడినిత్తావంటివీ
కోడిపెట్టవిస్తానంటివీ !
గట్టిగా నే నింటికొస్తే
కొంటెగా తలుపేస్తివి !! ॥ఆకు॥

నేను చేసిన పాపమా
ఇది నాకు పట్టిన కరమమా !
సక్కగాసూ పక్కవుంటె
సొరగమే ఇక సావునేదే!!" ॥ఆకు॥

సంతలూ, తీర్థాలూ, అమ్మవారి గుడి [ప్రదేశాలూ, దేముడుగుళ్లూ, చాకిరేవులూ, బల్లకట్లూ, చేనుగట్లూ-చాలా చాలా మందికి బావను కలుసుకోడానికీ, మాముసు పలుకరించడానికీ, మరదలుని చూడ్డానికీ, అత్తను చూడ్డానికీ అనుకూల [ప్రదేశాలు.

మంగమ్మ చాకలి చిన్నది - [క్రితంలో కలుసుకున్నవాడే ఇతగాడు. ఆ ఎండలో ఒంగొని చాకిరేవులో బట్టలు ఉతుకుతూంటే మంగమ్మ సొగసు మంత్రముగ్ధుడ్ని చేసింది - అందుకే అంటున్నాడు:

''మంగమ్మా
సాకిరేవుబల్లకాడ సంగతీ
నీ సక్కదనము కాలిపోను
సుక్కలాంటి మంగమో ॥సా॥

నున్నని బల్లమీద
సాగతీసి కొడుతుంటే
మంగమా —
సాగతీసి కొడుతుంటె
బట్టలు సాగతీసి
కొడుతుంటె —
నీ కష్టము సూసీ మనసు
ఇష్టపడది మంగమో ! ॥సా॥

తాజాగా తాటికల్లు
మజాగా మాపిటికీ
మాయవరం సంతలోన
మారిపోదాం మంగమో !!" ॥సా॥

'సిన్ని'కీ 'బావ'కూ ఒకరిమీద ఒకరికి నమ్మకం, అభిమానం, ప్రేమ ఉన్నాయి. అందులో సందేహం లేదు. అయినా ఒక నిర్ణయానికి వొచ్చాక ఎందుకైనా మంచిది - బావ నన్నేల మని అంటుంటే తను ఉన్నదాన్ని కాననీ - నా ఉసురు పోసుకోవద్దనీ ఎంతయిదిగా మనవి చేస్తుందో చూడండి - 'సిన్ని' ఉన్నది కాకపోయినా 'బావ' సిన్న జమీలున్నవాడుట.

బావ:- సిన్ని నా సిన్ని ఓ సన్నజాజుల సిన్ని
పొన్నపూల సిన్ని నే నందమైన నోడ్ని
నన్నేలుకోవె సిన్ని నిక్కాదిలి వుండలేను !

సిన్ని:- బావా నా బావ బంగారుముద్దుల బావా
ఎన్నటికీ సిన్నే నే నేలుకొంటానోయీ
నే వున్న దాన్నిగాను నా వుసురుపోసుకోకు ! !

బావ:- సిన్నీ నా సిన్నీ నే సిన్నివోణ్ణిగానె
సిన్న జమీలున్నవోడ్ని నిను కలకాలం పూజిస్తా
మీ అన్నలతో సెప్పి నన్నేలుకోవె సిన్నీ !

సిన్ని:- నీకన్న ఎవరు నాకు మా యన్నలతో సెప్పి
అందాలబావ నన్ను ఏ అడ్డు సెప్పకుండ
నన్నింటిదాన్ని సెయ్యి నన్నొడ్డు నేయిబావ ! !

సిన్ని కోరిక ప్రకారం అన్నలతో మాట్లాడి ఈ సిన్ని జమీలున్న బావ ముడివేసే ఉంటాడనుకుందాం.

విడాకుల హక్కులూ, వ్యక్తిగత స్వాతంత్ర్యాలూ ఎక్కువగా గలిగిన ఈ జనంలో ధైర్యం ఎక్కువ. ఏతాటి చెట్టు నీడ ఇల్లు కాదనీ, తగులుకున్నవాడు మొగుడు కాదనీ తెలిసినా-విన్నా-అవి అంత లెక్కలోనికి రావు ! అంత అడ్డం కులూ కావు !

తను వెళ్ళిపోతూంది. ఎక్కడికని, ఎప్పుడొస్తావనీ ఆడుగు తున్నాడు భర్త ! అందుకు పదుచు ఇచ్చే సమాధానం చూడండి :

''రాతిమీ రాజనాల్ పంట పండేయేళ ! రాతి బసవేశ్వరుడు ఠంకెలేసే యేళ'' తిరిగొస్తానని నిక్కచ్చిగా (అంటే ఇక రాననే కదా) సమాధానం ఇచ్చే మనస్తత్వంగల బంధువులే కదా వీరంతా ! అటువంటి తరహాకే చెందిన ఈ క్రింది పాటలో చివరకు గురువు వలస గుంటడు పుట్టాడన్నా వింత అనుకోవడం ఎందుకూ ?

నిరానిరా నిరబండి
నిలుపర బండోడా
నిరానిరా నిరబండి !

అల్లుడొత్తాడాని
అత్త తొంగిచూత్తుంటె
మీసంగీటుకోని
మీదనుపడ్డాడో —
దమ్మిడీ యిచ్చినేను
తాటిపండు కొనుక్కుంటె
పీశము నేదానీ
పిరియాదీకెళ్ళాడో — ॥నిరా॥

వచనం:- తప్పేటి పిల్లా ?

ఏటిసెప్పను మావా?
గురువులు నేనూనూ
గరవులమీద కెలుంటె
గురువుకాలూ తగిలీ
గుంటడు పుట్టాడో!! ॥నిరా॥

డబ్బుకూ, లేదా భూమికి ఆశపడో, హోదాకో, తప్పకనో కాటికి కాళ్ళు చాచుకూర్చున్న ముసలివారికి పడుచుపిల్లలను వివాహం చేయడం ఈ నాడంత లేదని అనుకున్నా పూర్వకాలంలో ముమ్మరంగా సాగిన అత్యాచారం. అటువంటి ముసలిభర్త - పడుచుభార్య మనుసులు ఎలా ఉన్నాయో పరికించండి :

ఏటోలె పిల్లా ?
సీటికిమాటికి జగడమేలోలె !

సీరలెన్నో దెచ్చినాను
రయికలే సరిబెట్టినాను
సరుకులన్నో గూర్చినాను
సరసను నే మెలగుతానూ'! ॥ఏ॥

వన్నెదాన్ని కన్నెదాన్ని
వంతులాపాలై నదాన్ని
సిన్నదానికి ఏటికావలెరా ?
నా ముసలిమొగడా !
పడుసుదానికి ఏటికావలెరా ??

సెంతనుంచె సాలునేటి
సింత నీవు బాపగలవా ?
పడుసుపంతం వదిలిపోనేదా ?
నా ముసలి మొగుడా
సిన్నతనమూ తిరిగివస్తుందా??

సిన్నవారికి తిరముగలదా
మిన్నలా ముసలోళ్ళకంచె
నేతమనసుకు ఆశపడకోలె
నా పడుసుగుంటా
ముసలిగుండెలు ఆగిపోతాయే!!— ॥ఏ॥

అందుకనే 'ఈడూ జోడూ' అన్నారు !

• ఈ పాటలోని శృంగారం వినండి. ఇది సవర పాట.

యౌవ్వనంకెరటాలు తన్నుతూన్న ఓ పడుచుని పలుకరింపులో 'ప్రేమ'ను వినిపిస్తున్నాడు :

''దాచిన దాగవు సఖియా, నీ
కంటిచూపులో కనబడు నీ
సిగ్గూ వలపూ చిరునగవూ
తెలిసికోంటినో చెలియా !

అలాగే భర్తజాడకోసం సందేశం - కాదు - వార్తాహరుని పంపడం :

• ''ధ్వని'' లో — సవర పాటలు — డాక్టరు గిడుగు సీతాపతిగారి వ్యాసం నుండి:

"త్వరపడవోయ్
తమ్ముడ త్వరపడవోయ్ !
త్వరగా తెలుసుకు
రావోయ్ బావను
త్వరగా తీసుకు రావోయ్ !

మూడో నాలుగు
ఏండ్లు గడిచినవి
నా ప్రియకాంతుని
కాననైతినోయ్ !
అయిదు పంటలూ
చెల్లిపోవుకోయ్ !
నా మనోహరుని
చూడనైతినోయ్ !

తల్లిదండ్రులూ
అన్నదమ్ములు
అత్తామామా
బావలు మరదలు
ఎందరుండినా
ఎవరికే వారే
ఎట్లు కలుగునోయ్
ఆనందము !

నా మనోహరుడిట లేకుంటే
నా చెంతకు అతడిట రాకుంటే
తృప్తికలుగదోయ్ తమ్ముడ
తృప్తికలుగదోయ్ !

సిరిసంపద లెన్ని యుండినా
సరియగునా నా కాంతునితో

ఎవరికి కావలె
ఎవరు చూడవలె
నా పతి చెంతను లేకుంటే !

నా ప్రాణేశ్వరుడిక
కనబడకుంటే
నా ప్రాణములిక
నిలబడవోయ్ !

త్వరపడవోయ్ తమ్ముడ
త్వరపడనోయ్ !
త్వరగా బావను
తీసుకురావోయ్!''

పాపం - భర్త అలిగి వెళ్ళాడో-అనుమానించే వెళ్ళిపోయాడో-ఎందుకు వెళ్ళాడో? ఎక్కడికి వెళ్ళిపోయాడో? అతడు వెళ్ళిపోయాక భర్తలేని లోటును గ్రహించింది - ఒక్క క్షణం కూడా గడపలేకుండా ఉంది-''నా ప్రాణేశ్వరుడిక కనబడకుంటే నా ప్రాణములిక నిలబడవోయ్'' -ఎంత ప్రేమ! ఎంత బాధ!!

అటువంటిదే-జొన్న కంకిలాంటి పాట-మరొక్కటి అందులోదే విందాం:-

''రావే చెలియా రావే
చుట్టచుట్టుగా పుట్టినయాకో
చూడ ముచ్చటగు మల్లి చిగురోయను
సందేహము కలుగును నీ దేహము
చూడగ సుందరివో చెలియా !

వలపు కలుగదా ? నీకో సకియా
మనసు పుట్టదా నాపై నీకూ ?
తగిన వాడనే కానా సకియా
నను చేకొనవా చెలియా !
... ...''

ఈ పాట ఇంకా ఉంది. మచ్చుకే ఇచ్చాను.

—ఇప్పుడో, ఇంకాస్త సేపట్లోనో వస్తాడని ఎదురు చూస్తూ కూర్చోవడంలో చాలా శ్రమ వుంది. పిట్ట రెక్కాడిస్తే ప్రియుడేనన్న ఊహ, చెట్ల ఆకు గలగలాడితే అదిగో అతగాడేననే అపోహ, దీనికి పాయం పరాయివారు చూస్తే ఎలాగ ? అనే భీతి - గబగబా రాడేమా ? అనే ఉత్సుకత.

రాత్రికి వస్తాడని రాతి గంధం తీసి వుంచిందట !

''చందమామో
ఓ చందమామో !
రాత్రికి రాత్రికి
వస్తావానీ — చందమామో
రాతీ గంధం
తీసే వుంచితి — చందమామో
ఎప్పుడెప్పుడు
వస్తావానీ — చందమామో
ఎలగా చెట్టూ
నీడ నుంటి — చందమామో
ఇప్పు డిప్పుడు
వస్తావానీ — చందమామో
ఇప్పు చెట్టు
నీడా నుంటి — చందమామో
ఇప్పుడెప్పుడు
రాకుంటేను — చందమామో
ఇప్పు పువ్వు
రాలి నాదీ — చందమామో
మళ్ళీ మళ్ళీ
వస్తావసి — చందమామో
మళ్ళీ పొదనా

నిలిచీ యుంటీ చందమామో
మళ్లీ పొదా
మాటలు వినీ చందమామో
మళ్లి పువ్వే
రాలినాదీ చందమామో

ఈ విధంగా ప్రియుడి కోసం చీకటి రాత్రులను కోటి వెన్నెల రాత్రులగా భావించి ఆ ప్రేమ హృదయంలో వేల జ్యోతులు వెలిగించుకొని ఎదురు తెన్నులు చూచే పవిత్ర పడుచు హృదయాలు ఎన్నో కదా !

''ఒకరికీ చేతూ లిచ్చాన్
ఒకరికీ కాళ్ళూ ఇచ్చాన్
ఒకరినీ చేతా బట్టీ
కూకున్నానోయ్ - బావా
కూకున్నానోయ్..."

అంచి ప్రియురాలు. విన్నాడు ప్రియుడు. ప్రశ్నించకుండా ఎలాగుంచగలదు. ప్రేమైక సామ్రాజ్యాధిపత్యం సల్పుతూన్న అతడి హృదయం.

''ఎవరికీ చేతు లిచ్చావ్ ?
ఎవరికీ కాళ్ళ నిచ్చావ్ ?
ఎవరినీ చేతా బట్టీ
కూతున్నావే పిల్లా
కూకున్నావే ?..."

అని కోపం బుసలు కక్కగా, అనుమానం పెనుభూతమై భయం గొల్పగా - ఆక్రోశంతో అడుగుతాడు.

ఆ సమయంలో చిలిపితనానికి చీరకట్టి, సరసాలకు వారసత్వం వహించిన ప్రియురాలు :

''గాజులకీ చేతు లిచ్చాన్
కడియాలకి కాళ్ళ నిచ్చాన్
డబ్బుల్నీ చేతా బట్టి
కూకున్నానోయ్ - బావా
కూకున్నానోయ్...''

అని ప్రియుడిని నవ్వించి, కవ్వించి, ప్రేమతో ముంచెత్తి ముగ్ధుణి చేస్తుంది - ఈ పాట ఎంత ముచ్చటగొల్పుతూందంటారు. అలాటి నాయికానాయకుల మధ్యన సంభాషణల రూపంలో జరిగే పాటలు లక్షోపలక్షలు.

కూలి పని చేసుకొనే పల్లె జనాళి జీవితమే ఒక విచిత్రమైనది. చిలిపితనం కొంచెతనంతోపాటు రసానుభూతికూడా గోచరిస్తుంది వారి భాషలో, భావాల్లో, ప్రవర్తనలో, కులుకుల్లో - పలుకుల్లో.

మేఘాలతో ఆడుకోవడం వారికే తెలుసు - పక్షులను పలుకరించడం వారికే తెలుసు - దేవతలకు పొలిమేరలలోనే ఊపాహారాలు పెట్టి పొమ్మనగలరు. నెత్తినపెట్టి ఊరేగించగలరు. ఆకాశం అంచుల్లో విహరించగలరు - ఎన్నోకలలు కనగలరు - ఆడగలరు - ఆడించగలరు.

పల్లెపల్లెంతా వారి దృష్టిలో ఒక కుటుంబం. అందుకే మావయ్యా, అప్పా, బావా, తాతా వరుసలలోనే కాని ఒకరు నొకరు పిలుచుకోరు.

ద్వేషాలు లేని - అరమరికలు ఎరుగని హృదయాలు వారివి - అందుకే వారు చెట్ల క్రిందనే జీవిస్తున్నా - గంజినే ప్రాగి వున్నా, వారి పని పాటల్లోనే ఆనందం కల్పించుకొని హాయిగా జీవితాన్ని అనుభవించగలరు - అదే వారు పెట్టి పుట్టింది - వారికి సృష్టికర్త అట్టే పెట్టింది.

ఆ పల్లెలోనే ఉంటూంది గంగి. ఆ పల్లెలోని వాడే గంగడు. గంగడికి పెండ్లి కాలేదు - గంగి పెళ్ళీడుకు ఇంకా రానే లేదు.

గంగడు ఏ పుల్లలో గొప్పలెత్తి కొట్టుకొని గంజికి డబ్బులు తెచ్చుకోవాలి, ఏ తోట వారనో ఎండు పుల్లలు ఏరుకుంటేనే గాని గంగికి గంటలు దొర్లవు.

అలూపి గంగి - సింగిలో సిక్కి చూస్తే చుక్కలా ఉంటుంది. చక్కని చుక్క - చీర సింగారిస్తే తూర్పు రెక్క.

ఏం లాభం — తన అందాన్ని, అద్దంలో కూడా తొంగి చూసుకొనేపాటి అదృష్టం కూడా నోచుకోలేదు గంగి.

నింగినే గొడుగుగా చేసుకొని — ఊపిరినే తల్లిగా నోచుకున్న గంగికి, చెట్టూ చేమలూ బంధువులుగా ఎంచుకునే గంగికి అద్దం ఎక్కడిది ?

అలాటి గంగి చంకన పేడపూసిపతట్ట పెట్టుకుని పెద్ద చెరువు ప్రక్క పుల్లలు ఏరుకుందుకని బయలుదేరి వెళ్ళింది.

ఓ చోట తట్టపెట్టి పుల్లలు ఏరుకుంటూంది గంగి-అంతక్రితమే అక్కడ ఆటలాడుకుంటున్నారు కొంతమంది యువకులు. వారి కంటబడింది గంగి. ఇంక చెప్పేదేముంది-చిలిపితనానికి జాహుర్లు కట్టుకొన్నవారు వీరేకదూ?

''కాటు కెట్టిందిరా పిల్లా
చూడమనీ - ఏలో డొమపులాపి
కమలాలెట్టిందిరా పిల్లా
చూడమనీ ''
పూలు పెట్టిందిరా పిల్లా
చూడమనీ ''

అంటూ గంగి పెట్టుకున్న పూలను, కంటి కాటుకను, చెపే కమలాలనూ వర్ణించి కవ్వించడం మొదలుపెట్టారు.

అయినా అంత పట్టించుకోలేదు గంగి. తన పని ముగించుకొని ఏరుకున్న పుల్లలు గూటికి చేరేసి - కొడవలి తీసుకొని ఏటవతల దూడకోసం గడ్డిపరకలకని వెళ్ళింది. అక్కడ కొంతమంది పశులకుర్రవాళ్ళు దూడలను మేపుకుంటూ ఆడుకుంటున్నారు. గంగి వంగొని గడ్డికోసుకుంటోంది. అంతలో పెద్దకాపు వచ్చాడు-పచ్చగడ్డిలో పచ్చగా కనిపించింది గంగి.

పచ్చగడ్డి కోసేటి
పచ్చని పిల్లా
పమిటకొంగు జారిందే
పలుచని పిల్లా...

అంటూ పాట మొదలుపెట్టాడు పెద్దకాపు. చెవులో కితకితలు పలికింది ఆ పాట గంగికి. ద్వేషం ఎరుగని గంగి చిరునవ్వుతోనే 'పెద్దకాపుగారికి అంతా యేలా కోలమ్మే' అని తన కోత చాలించుకొని రేవువద్దకు వచ్చింది - అప్పటికే చాల పొద్దెక్కింది. పడవమామ అవతలిగట్టున పడవ నిలుపుకొని వున్నాడు - చూసింది గంగి. జాలారన్న (చేపలు పట్టే జాలరి)ను పిలుస్తూంది చూడండి. ఎంత ఆవేశపూరితంగా వినబడుతుందో యీ పాట :

:

ఓ ఓ ఓ ఓ జాలారన్నా
ఏరుదాటెయ్యరా జాలారన్నా
పడవ దాటెయ్యరా ,,
పడ్డునకు జేర్చరా ,,
గోదావరి గాలిరా ,,
గోలపెట్టు కొస్తూంది ,,
ఏటవతల మా ఇల్లు ,,
ఎప్పుడెళ్ళి జేరుతానో ,,
సీకటడి పోతుందీ ,,
ఒంటరిగా ఉన్నాను ,,
మళ్ళీ వచ్చినప్పుడు ,,
మంచిగ మాట్లాడతాను ,,
ఓ ఓ ఓ ఓ జాలారన్నా—

ఎలాగైతే ఏరు దాటింది గంగి. ఇంటికి వెళ్ళేటప్పటికి దీపాలు కూడా పెట్టారు. చాలా పేసుగుగా వుంది గంగికి - ఎండలు ఎక్కువగా ఉన్నాయి.

పక్కపిల్లలను అందర్నీ చేర్చింది.

గంగన్న పంటలు పండించుకుంటూ చేలంపట తిరుగుతున్నాడు, చాలా కష్టపడుతున్నాడు. వర్షాలు లేవు-ఏనాడు వర్షం కురుస్తుందా అని ఎదురుచూస్తున్నాడు గంగడు - అది గ్రహించింది గంగి.

వర్షాలు కురవాలంటే — వానదేవుని కొలవాలని వాళ్ళ ముసలమ్మ చెప్పగా వింది. వెంటనే ఓ చిన్నదీపం వెలిగించింది – చుట్టూచేరి వానదేవుడు పాట మొదలు పెట్టింది.

మ్రొక్రో మ్రొక్రో
వానదేముడా
మమ్మింకా దయచూసి
మావాడకే రావ ॥మ్రొక్రో॥
ఏనుగులాంటి మోగోళ్ళు
ఎత్తులాడిపోయారు ॥మ్రొక్రో॥
.....
ఈనుచున్న చేలన్నీ
ఎండిపోవుచున్నాయి
పండుచున్న చేలన్నీ
పండువారిపోయాయి
చుక్కలెద్దులన్నియు
తూలిపోవుచున్నాయి ॥మ్రొక్రో॥

అప్పుడే గంగన్న గంజి తాగి చూరుముంగిట చుట్టి అంటించుకు కూర్చున్నాడు. గంగి పాడిన ఈ పాట తన కెంతో సేద తీర్చినట్లుగా సవ్వుకున్నాడు.

ఆ నవ్వులోనే గంగిరూపం తన కళ్ళముంచు ఎంతో అందంగా కనిపించింది. ఆ ఆలోచనలోనే గంగడు నిమగ్నించాడు. చూరువార కోడి కూసింది - గంగడు లేచాడు - గునపం తీసుకుని బెల్లు విరుస్తున్నాడు - ఊతంగా తనలో తాను.

ఎన్నాళ్ళు పాటుపడ్డ
ఈ గునపమే మిగులు
ఈ రెక్కలే మిగులు

గంజిముంత వంచిచూడ
గంజిచుక్కకే కరవు...

ఆ పాట ఆఖరి కుసుమంలోవున్న గంగికి విసుపనిపించింది. ఒళ్ళు విరుచుకుంటూ వచ్చింది - గంగన్న బాపు కష్టపడుతున్నాడు—తన మనసును గుర్తించింది. అదే ఆ కూలిజనంలో, పల్లె జనాలిలోవున్న గొప్పతనం - నాది - నీది అనే భేదంలేదు వారికి - ఒకరి కష్టం-అందరి కష్టం-ఒకరి ఆనందం అందరికీ పరమానందం-ఎవరైనా వారి మీదకు వచ్చారా-గూడెం గూడెం అంతా కదులుతుంది-కరాలన్నీ కలుస్తాయి.

గంగి తిన్నగా వెళ్ళింది. గంగడు బెల్లు పెల్లగిస్తూంటే గంగి బెల్లు పైకి పడేస్తూంది - గంగడు గంగినిచూసి చాలా ఆనందం పొందాడు. ఇంతలో గంగి అందుకుంది...

ఓ బాప ఓ బావ ఓ బాప
మోపెన తోలగలవ
ఓ బావ నువ్వు
పోపైన యెయ్యగలవ ఓ బావ...

గంగి పాటవిన్న గంగడి కంఠం ఎలా ఊరుకోగలదు? తను బాపట—అయితే గంగి గంగడికి పరిచలు. అందుకున్నాడు గంగడు పాట...

మరదాల మరదాల ఓ మరదాలా
మోటంటే నాకిష్టం
ఓ మరదలా, మరీ
పోటంటే మహాయిష్టం
ఓ మరదలా...

చూశారా ఈ పాటలో ఎంత ఆహ్లాదం-చనువూ ఉన్నాయంటారు?

గంగి చేతులు దులుపుకుని తన గుడిసెలోకి వెళ్ళబోయింది-అయితే గంగి బాపకు బూరిముక్క ఎప్పుడున్నాడు-సరసంగా గంగడు. ఫో- పో- అంటూ లేడి లాగ సిగ్గుతో గుడిసెలో దూరిపోయింది గంగి.

రానురాను గంగీ, గంగడు మధ్య అన్యోన్యం ఎక్కువయింది. గంగిని చూస్తే గంగదు, గంగడ్ని చూస్తే గంగి ఒక విధమైన అనుభూతి పొందసాగారు.

ఒకరోజున గంగడు పక్క మామిడితోపులో ఉన్నాడు. పనికట్టుకు వెళ్ళింది గంగి. అలా ఎంతసేపో గంగన్న బావ ఒడిలో ఆడుకుంది - వెళ్ళి పోదామని లేచాడు గంగడు. చూసింది గంగి...

ఎల్లొస్తనోయ్ బావ
మళ్ళొస్తనోయ్,
మళ్ళొస్తనోయ్ బావ
యెళ్ళొస్తనోయ్,
కళ్ళు తెరిసేతలికి
కళ్ళెదుట ఉంటాను,
వళ్ళు యిరిసేతలికి
వళ్ళోన ఉంటాను,
సుళ్ళు తిరిగొస్తాను
గళ్ళు కదిలొస్తాను ॥ఎ॥

సక్కని తురాయి క్రింద
చుక్కలాంటి రాయిమీద
ముక్కుతూ మూలుగుతూ
ముడుచుకొని తొంగేవు
మురిసినా తలచినా
ముంగలే ఉంటాను ॥ఎ॥

అంతదాకా సరసాలు ఆడింది గంగి. చాలా సేపయింది కూడాను. వెళ్ళి పోదామని లేచినుంచుంది గంగి. వెళ్ళిపోతూ...

కళ్ళు తెరిసేతలికి
కళ్ళెదుట ఉంటాను

ఒళ్ళు యిరిసేతలికి
వొళ్ళోన ఉంటాను...

అంటూ మామకు ధైర్యం చెప్తుంది.

అంతదాకా సరసాల్లో మునిగిఉన్న బావకు ఈ మాట ఏమంత ఉత్సాహంగా కనుపించదు. ఆలా నిరుత్సాహంగా కనుపించిన బావను చూసి - తిరిగి ఇంకా ధైర్యం కలిగిస్తూ...

ముక్కుతూ మూలుగుతూ
ముడుచుకొని తొంగోకు
మురిసినా తలచినా
ముంగలే ఉంటాను...

అని ఉత్సాహాన్ని కలిగించి మరీ వెడుతుంది.

ఈ పాటలో ఎంత ఆప్యాయతనీ, మనోధైర్యాన్నీ జానపద కవి పొది గాడో గమనార్హం.

బావకోసం సుళ్ళుతిరిగే పరదలు అడ్డుపడినా, వెళ్ళొద్దు అనే అధికారం లాంటి హద్దులు అడ్డుతగిలినా-నీకోసం వస్తానుసుమా బావా అని ధైర్యం ఇవ్వడం ఎంత హృదయంగమంగా ఉందో!

రెండురోజులు కనబడలేదు గంగికి గంగన్న బావ. సాయంత్రం వేళ గంగి నూకలు. దంపుకొంటూంది బావను అల్లంత దూరంలో చూసింది.

బావయ్యొచ్చాడూ
కూరేమి లేదు!
కుళ్ళిపోయిన గుమ్మడికాయ
బావకు కూర—

అని దంపుతూనే వెక్కిరింతలు మొదలుపెట్టింది గంగి. ఇంతలో తలెత్తి చూసేటప్పటికే బావ వెనకాల చాలామంది ఉన్నారు. గంగి తండ్రిని కలుసుకొని

గంగన్నకూ గంగికీ పెళ్ళిమాటలు మాట్లాడదామని వచ్చారు పెద్దలు. ఎక్కడలేని సిగ్గూ వొచ్చింది గంగికి.

పెద్దలు నిశ్చయించిన ప్రకారం గంగిని గంగడికి ఇచ్చి వివాహం జరిపించారు. ఆచి, తూచి చేసుకొన్న సంబంధమేమో చాలా అన్యోన్యంగానే ఉన్నారు.

గంగడు కుక్కమంచం వాల్చుకు కూర్చున్నాడు. గంగి చాటలో నూకలు పోసి చెరుగుతూంది. గంగి గుండెల్లో ఏదో ఒక కోరిక ఉంది — ఆ కోరిక గంగన్న బావకు తెలియచెప్పాలి.

అందుకు పాటరూపంలో తన కోరికను ఎలా వ్యక్తీకరిస్తూందో చూడండి...

మనయింటి యెనకాల
దానిమ్మ చెట్టో
దానిమ్మ చెట్టున్నాది
గంగన్న బావో !
తింటేను దానిమ్మ
పండే తినాలి
కంటేను తొలిచూలు
కొడుకును గనాలీ...

ఆహా! ఎంత చక్కని కోరిక ! "వరి మొలకా, మొగ మొలకా" అన్నారు !

ఈ విధమైన సారస్వతం ఎంతో ఉంది జానపద గేయాలలో !

ఒకరోజు గంగి, గంగడూ కూలిపని కోసమని ఏటవతల ఊరు వెళ్ళారు - అసలే నీరులేని వ్యవసాయాలు - అక్కడ కష్టపడి పని చేసుకొంటేనే కాని రాళ్ళు రత్నాలు కావు.

అటువంటి చోట గంగి చెట్టునీడను పడుకుంది. గంగడు పనిమానేసి గంగిని చేరాడు. అప్పుడు గంగి అంటూంది చూడండి...

వెన్నుమీదా చూపు
మలపరా నా స్వామి
చన్ను మీదా చేయి తియ్యరా... అని ! !

మన ఆటలు తరువాత— ముందు పంటలకు నీరు కావలి - ఆ యాతాం పని చూడకుండా - సరసాలేమిటని అడుగుతూంది గంగి. ఎంతటి జాతీయ భావాలు కలదో గంగి.

ఇక్కడే ఒకమాట.

ఈ పై పాటలో వచ్చిన 'చన్ను' పద ప్రయోగాన్ని బూతుగా కాకుండా కాళిదాసుగారి శ్యామలాదండకంలో 'కుచోన్నతే కుంకుమ రాగశోణే' అని చదువు కొని అభినందించినట్లూ; అల్లసాని పెద్దన్నగారి మనుచరిత్రలో 'తనయా స్తనదుగ్ధము' లను పదము చదివి మెచ్చుకొన్నట్లూ, పోతనగారి భాగవత్‌లోని 'చను కట్టు పయింబడ' అన్న పద్యం చదువుకున్న హుందాతనంతోనే చూడాలి కాని మరోలా చూడకూడదు.

పెద్ద కవులు-చక్కని పద్యాల మధ్య వాడిన ఈ పదాలే చూసి ఉబ్బి తబ్బిబ్బవుతున్న మనం ఈ అమాయక యువతి ఎక్కడో 'చన్ను' అన్నంత మాత్రాన తప్పు పట్టనవసరం లేదు.

అయితే కొంతమంది ఛాందసులకు జానపద సాహిత్యం బూతుమయం అని-

అలాటి సువిశాలత కనుక ఉంటే ఈ జానపద సాహితి ఎంతో ముందుకు రాగలుగుతుంది.

గంగడు ఇదే సమయంలో రంగం ప్రయాణం కట్టాడు - అక్కడే మంచి సంపాదనుందని. అక్కడినుంచి చాలా సరుకులు గంగికి పంపాడు. కాని ఎంతకీ గంగడికి జాబు రాలేదు - అలా రాకేడని ఆలోచిస్తూ...

జోడు గొట్టాలోడమీదా - సిరి సిరి మువ్వా
జోడుంగరాలంపానే ''
తీగజాబులంపానే ''
కవరు జాబులంపానే ''

ఏనాడూ ఓడచూడని గంగడికి రెండు గొట్టాలు ఉన్న ఓడమీద తన సిరిసిరి మువ్వలాంటి గంగికి రెండుంగరాలు పంపాడట.

కాని ఎంతకీ గంగికి అందినట్లు కబురు రాలేదు. ఎలా వస్తుంది ? గంగికి చదువురాదు - సంధ్యారాదు. అందుకు గంగికి అందినా (అందకుండా ఎక్కడికి పోతాయి) జవాబు రాయలేదు.

అందుకు బాధపడుతూ అంటున్నాడు చూడండి: తీగజాబు లంపాలట (టెలిగ్రాం అన్నమాట), కవరుజాబు లంపాలట (కవరు అన్న మాట) ఎంత మనోహరంగా, యదార్థంగా కనబడుతుందో చూశారూ ?

చివరకు గంగి జాబు రాయకపోవడం మూలంగాను, ఒంటరిగా ఉండలేకనూ గంగడు వచ్చేశాడు. అలా రంగంనుంచి వచ్చిన బావని - గళ్ళ లుంగీ, చేతిలో రూళ్ళకర్ర, కంపెనీ చుట్ట, అడ్డగళ్ళ బనీను, కాలికి చైనా చెప్పులూ, ఒంటిమీద పచ్చబొట్లూ - చూసేటప్పటికి మురిసిపోయింది గంగి.

గంగడు రంగంనుంచి వచ్చినప్పటినుంచీ గంగి కొంచం హుందాగా కనబడుతూంది.

ఈ జానపద వాఙ్మయంలో శ్రామిక సాహిత్యం క్రింద చాలా పాటలు ఇంపైనవీ, వింతయినవీ ఉన్నాయి. ఇవి అదో తరహాగా ఉంటాయి. ఈ తరహా శ్రామిక గేయాలలో మోటుగా పదాలు ఉన్నా—ఎన్నో జీవితాను భూతులను, జీవిత సత్యాలను మనకు ప్రబోధిస్తాయి.

చేలో ఊడ్పులు ఊడ్చడానికి బయలుదేరారు. అందుకు ముందుగా చేలలో గణపతి ప్రార్థనచేసి కొబ్బరికాయ కొట్టడం పరిపాటి. అందుకు ఆ పనిని గంగికి అప్పగించారు.

చేను మూల ఒకచోట ఒక రాయికి పసుపు రాసి, కుంకం బొట్టు పెట్టి, కొబ్బరికాయ కొట్టింది - ఆ వెనుకనే ప్రార్థన అందుకుంది :

ఓ గణపతయ్యా గణపతయ్యా
ఉండ్రాళ్లు నీకు పోతురా
ఓ గణపతయ్యా
మందకొతిగ ఉండబోకురా !

ఓ గణపతయ్యా గణపతయ్యా
జమ్మిపత్రి పూజసేతురా
ఓ గణపతయ్యా
ముందె నీకు పూజసేతురా !

ఓ గణపతయ్యా గణపతయ్యా
ఊకిల్లోన ఊరేగించెదా
ఓ గణపతయ్యా
ఉయ్యాలల ఊపుతానురా !

ఓ గణపతయ్యా గణపతయ్యా
ఉండ్రాళ్లూ నీకు పోతురా
ఓ గణపతయ్యా
మమ్ము ఎపుడు మరువబోకురా

ఈ పాటనే కొన్నిచోట్ల ఇలా పాడతారు :

* ఓ ఇగనరాజ ఇగనరాజ
జమ్మిపత్రి పూజసేతురా
ఓ యిగనరాజ
జామిపత్రి పూజసేతురా...

---

* ఈ పాట రాయలసీమలోనిది.
మిత్రులు – కె. సభా సేకరణ.

గంగి చెప్పగా-గణపతి ప్రార్థన అందరూ పాడారు-పూజ పూర్తయింది. ఊడ్పు ప్రారంభించారు - అందరూ ఒంగుని ఊడుస్తూంటే- ఒక పిల్ల సన్నని గొంతుతో - పాట చెప్పతూంది.

ఆ పాట ఆ గాలివాలులో - వీనులవిందుగా ఉంది.

ఏయి వరాలో ఏయి వరాలో
ఏకూ లొడికిన పాప.
యర్రన్న పాప. ॥ఏయి...॥
ఆరూగో అన్నల్లు
వచ్చుచున్నారు ॥ఏయి...॥
ఆరెందు కొత్తారు ?
రాజూ లళ్ళుల్లు
రాజూ లళ్లుళ్ళయితే
రారంటే పాప ? ॥ఏయి...॥
నామాట బోటెతె
మేడెక్కి చూడు ॥ఏయి...॥

ఈ శ్రామిక గేయంలో ఎంతటి భావం కనుపిస్తుందో చూడండి :

ఆరూగో అన్నల్లు
వచ్చుచున్నారు...

అని ఒకతె అంటే-అందుకు ఇంకొకతె - మనబోటి చిన్న కుటుంబీకుల ఇళ్ళకు వాళ్ళెందుకు వస్తారు అన్న అసంతృప్తితో...

ఆరెందూ కొస్తారు
రాజూ లళ్లుళ్లు...

అంటుంది. ఈ జవాబుకి మొదటి యువతి - మనం మాత్రం లేసి పోయామా ? అన్న స్వతంత్ర భావంతో - స్వేచ్ఛాగర్వంతో...

రాజూ లళ్లుళ్ళయితే
రారంటే పాప...?

అని ఎంత నిండుగా ప్రశ్నిస్తూందో.

గణపతి ప్రార్థన చేసి ఊరుకుని, చేలోకి గంగిమాత్రం దిగకుండా హుందాగా గట్టుమీదే కూర్చుంది. చేలోకి దిగమన్నాడు గంగడు. ఊహు అంది గంగి. చూశాడు గంగన్న బావ.

ఉల్లిమళ్లా చీరాగట్టి
కచ్చలూ పైకెగాగట్టి
ఊడుపూకీ దిగామంటే
ఉన్నవాళ్లా పిల్లనంటావే !
ఓలోలె గంగీ
ఉన్నవాళ్ళా పిల్లనంటావే !
ఉన్నవాళ్లా పిల్లానంటే
కన్నుగీసే రమ్మన్నావూ
కంటిబాసలు నాకూ ఒద్దురా
ఓలోలె బావ
కంటి ఇరువులు నాకు ఒద్దురా

అంది గంగి. అందుకు సమాధానంగా గంగన్న బావ...

ఉన్నవాళ్లా పిల్లాననీ
ఉబ్బిపోకే ఓలే పిల్లా
కోతలాకి కోరి వస్తేనూ
ఓలోలె గంగీ
కోతలోళ్ళకి కోప మొస్తుందే

గంగన్న బావ తనను దెప్పి పొడుస్తున్నాడని గంగికి కోపం వచ్చింది. బావకు సమాధానంగా...

కోరమీసాల్ దువ్వూకుంటూ
ఎర్రగుడ్డా చుట్టూకొంటూ
కోతలాకే రావద్దంటావా ?
ఓరోరి బావా
కోరికైనా తీర్చనంటావా—

అని నిలదీసి అడుగుతుంది గంగి.

ఈ పాటల పరుసలనే యేలపాటలు అంటున్నారు. ఈ యేలలు ఇంకా ఇతర పరుసల్లోకూడా ఉన్నాయి. మొదటి రెండు పరుసలూ ఇదే సడకలో సాగి తరువాత నడక మారుతుంది.

ఈ యేలలు మొత్తంమీద చాలా ఉద్రేకపూరితంగానూ, విసురుగానూ ఉంటాయి.

ఆవులు అంబా అని అరుస్తున్నాయి - కోడి కొక్కోరోకో అని లోకాన్ని మేలుకొలుపుతూంది - గంగడు కొడవలి తీసుకొని కోతలకు బయలుదేరాడు—

గంగికి బద్ధకంగా ఉంది - తను యింట్లోనే ఉండిపోయింది. మంచి ఎండగా ఉంది. గంగడు గంజినీళ్ళకు ఎక్కడినుంచి ఎక్కడికి వస్తాడు? అందుకు తలమీద బుట్ట, బుట్టలో గంజిముంతలూ పట్టుకొని బయలుదేరింది గంగి. చేను గట్టున నిలబడి చూసింది. ఆ ఎండలో గంగన్న బావ ఒంటిమీద చెమట మిటమిలా మెరుస్తూంటే గంగికి బాధ వేసింది - అక్కడినుంచే బావను పిలుస్తూంది.

కొచ్చలీ మొలనుంచి
కోత చాలించి
రావోయి బేబేగ
గంగన్న బావా !
తలమీద కొచ్చాడు
తండ్రి సూరీడూ !
ఇలలోన జనులెల్ల
ఎసిగి పోనారూ ! ॥కొ॥

సుఖమెల్ల కప్పింది
ముల్లేల సెమటా !
ఒడ్లెల్ల ఒసివాడి
కందిపోనాదీ ! ॥కొ॥

బంగారు నీ మోము.
ఒసివాడి పోయె
ఒల్లెల్ల కందింది
వెర్రి నా బావా. ॥కో॥

సెలయేటిలో మునిగి
సెమట కడిగేసి
సరసనూ కూకోసి
సల్దారగించూ ॥కో॥

ఎండలో అలసి సొలసివున్న గంగన్నకి తన మతదలు కంతం చెవిని బడేటప్పటికే - ఎంతో తేరుకున్నట్టయింది. కాలుసేతులు కడుగుకుని గంగిని చేరి పిచ్చాపాటి మాట్లాడుకుంటూ గంజిమెతుకులు తిన్నాడు.

సాయంత్రందాకా కోతల్లో మునిగున్న కూలి దంపతులు గంగీ-గంగడూ తిన్నగా రేవుదగ్గరకు పచ్చారు. కాని అక్కడ పడవ తాత లేడు. నావ ఒక గిడసు కట్టి ఎటో పోయాడు.

ఉన్నట్టుండి గంగడు గంగిని ఎక్కించుకోకుండా తను పడవలోకి దూకి అవతలి గట్టుకు వెళ్ళిపోయాడు. ఆ ఆటల్లోనే తమ ప్రేమను మరచేది ఈ జీవితాలు. చూసింది గంగి...

ఆపూ పడవాపూ
సరంగు బావా
పస్తున్నా ఒస్తున్నా
సరంగు బావా...

అంటూ గంగి గంగన్న బావను సరంగు బావగా తలచి— చిలిపిగానే అనుకోండి — పిలిచింది. అందుకు గంగన్న బావ...

కల్లుముంత యిస్తావ
కడగదిలో కొస్తావ
గంగీ ఓ గంగీ
కందకుంద చూస్తానే
గంగీ ఓ గంగీ...

అంటూ వెటకారాలు అందుకున్నాడు గంగడు, తనకు గంగి పరాయి చయినట్లు. సరే! బావే అలా అన్నప్పుడు గంగి ఎందుకు వెనుకపడాలి ?

సడిరేపు మళ్ళాలో
సన్నంసా పెట్టుకూ
నా కొంపా కొచ్చింటే
పదులూ ఓ బావా...

అని తనూ అందుకుంది.

చదువుకోని గంగికి– చదువుకున్నవాళ్ళలాగే – బహిరంగ ప్రదేశంలో మొగాడితో చేయి కలపడం తన కొంపకు తెచ్చుకోవడమే అని తెలుసు. అందుకే...

నా కొంప కొచ్చింది
వదులూ ఓ బావా...

అనడంలో ప్రతిధ్వనించే ప్రత్యేక విశిష్టత - ముందు చూపు.

ఈ విధంగా ఎన్నో గేయాలు కథారూపంలో పరిచయం చేయదగ్గవి జానపద సాహిత్యంలో లక్షోపలక్షలు. *

పాలం పాటలు



దేవుళ్ళనీ, దయ్యాలనీ — చెట్లనీ, పుట్టలనీ పూజించడం పరిపాటిగా— అంటే ప్రాచీనకాలంనుంచే వస్తూన్న ఆచారం- నమ్మకం. వ్యవసాయం చేసు కోవడమే ప్రధాన జీవిలాధారమైన మనకు వానదేవుడిని కొలుపడం కూడా పరి పాటే కదా—అందుకే...

వానల్లు కురవాలి — వానదేముడా
వరిచేలు పండాలి ,,
నల్లని మేఘాలు ,,
చల్లగా కురవాలి ,,
చేలన్నీ నిండాలి ,,
మూనా లెదగాంయ్యా ,,
వెన్నాలే పెయ్యాలి ,,
పచ్చగ నేలన్నీ ,,
పంటల్లూ పండాలి ,,
భాగ్యాలు నింపాలి ,,

భోగాలు నిండాలి — వానదేవుడా
పూజాలు సేత్తాము ,,
పండుగలూ సేత్తాము ,,
మా ఊరి చెరువంత ,,
ముంచెత్తిపోవాలి ,,
కప్పలకు పెళ్ళిళ్ళు ,,
గొప్పగా సెయ్యాలి ,,
వానాలు కురవాలి ,,
వరిచేలు పండాలి ,,

వానదేవుని మీద ఇంకో పద్ధతి పాట :

వానదేవుడా - వానదేవుడా
వానాలు కురిపించు — వానదేవుడా
కప్పతల్లి సీళ్ళాడె ,,
కడవలెల్ల నిండాయి ,,
మొర్రో మొర్రో ,,
ఈగతల్లి సీళ్ళాడె ,,
ఈదులన్ని నిండాయి ,,
మొర్రో మొర్రో ,,
చేపతల్లి సీళ్ళాడె ,,
చెరువులన్ని నిండాయి ,,
మొర్రో మొర్రో ,,
తూర్పున మెరుపులూ ,,
తుంపరలూ రావాలి ,,
చిన్న చిన్న తుంపరులూ ,,
చెలరేగి రావాలి ,,
జల్లుమనీ కురవాలి ,,
జడివానే కురవాలి ,,

ఈ పద్ధతిలో ఒకేభావంలో-అనేక తరహాలుగా పాడుతుంటారు. ఒక మండలంలో ఒక చరణం, మరోమండలంలో ఒక చరణం, మరోమండలంలో మరో చరణం తేడాలతో ఒకేమాదిరి పాటలు చాలా కనిపిస్తుంటాయి. వానదేవుడిని పరి పరివిధాల వారివారి నమ్మకాలనుబట్టి ఆరాధిస్తారు పల్లెజనమంతా.

నాటుకున్న వరిచేలు మొనలు తొడిగి, వెన్నులువేసి పచ్చగా ఎదిగి పంటలు పండాలి. అప్పుడు పండుగలు జరుపుకొంటారు. ఇంతకంటే రైతు ఏం కోరుకుంటాడు? మరేం కోరికలుంటాయి.

'ఏరువాక' అనే పదం తెలుగుజాతికి చిరపరిచితమైనదే. అందులోనూ తెలుగురైతుకూలీలకు మరీ పరిచయమైనది.

వానదేవుని కనికరం కలగడం, చెరువులు నిండడం, తరువాత - ఏరు వాకని స్వాగతం పలుకుతారు-దుక్కి-దెద్దులతో నాగళ్ళను అలంకరించి ఏరు వాక సాగుతారు. ఆ సమయంలో పాడే పాటలు చాలా ఉన్నాయి-చూడండి:

ఒలియ ఒలియో ఒలియో
రావేలుగలవాడా రార పొలిగాడా
పొలి...పొలి...
వెయ్యేలుగలరా పొలి
ఎయ్యేలు కెయ్యేలు ఎనబనూరేలు
పొలిపొలో ఎయ్యేలుగలా పొలి
పల్నాటి కాపోరు ఎటువంటివారు
గుండుపోగులవారు గుర్రాలవారు
దొప్పచెవులావారు దోలికడుపోరు
చెంపతలపాగాలు చేతిరుమాళ్ళు
ఆయేరోసికాపోడు ఏమానిమ్రొక్కా?
నెలకి మూడొర్షాలు కురవమని మొక్కా
ఆ దక్షిణం మెరసిందో దరనిగరిచెల్లి
వడ్డాదికొండాను లొడ్డె వర్షంబు
మాడుగొల్లకొండాకు మల్లెవర్షంబు

తూర్పు వర్షంబు తూలాకురిసేను
పడమటి వర్షాలు పట్టికురిసేను
ఆయడివార పెదచెర్వు అడిచాలనిండె
ముత్యాలయాచెరువు మూడుమదువుల్లు
వజ్రాల మాచెర్వు వాలుగమ్ములుగా
ఆ పొలాన్న శబ్దమన్నో మన పల్నాటి గలదు
ఆ బలభద్రుడిచ్చిన ఒక బద్ది పలుపు
జీలుగానాగలి జిల్లేడువేడి
నారాయుడిచ్చిన నారమోకు
మువ్వలామునకాలి గవ్వల్లకాడి
ఎల్లేడు కాపోడు చేనున్న కడకి
ఏసేను కాపోడు ధరణిపైనింక
ఏసిన ఇత్తనము ధరణిపై మొలచి
మూడురోజులకి మొక్క మొలకారుపడెను
ఆ అయిదురోజులకి మొక్కో ఎంతేరుపడెను
మూడునెలలకుపంట మూలాకొచ్చెనుగా
పొలిపొలో ఎయ్యేలు గలవాపొలి !

ఏరువాకమ్మను పసుపు, కుంకుమలతో, పూలతో అలంకరించి నిలబడాలా ఆరాధించేవారి పద్ధతి ఈ క్రింది పాటలో బోధపడుతూంది.

ఏమికావాలీ ఏమికావాలీ
ఏరువాకమ్మకీ ఏమికావాలీ !
ఎర్రఎర్రనిబంతి మాలాకావాలీ !
ఎరుపు తెలుపుమబ్బుచెండ కావాలీ
ఏమికావాలీ ఏమికావాలీ ?
ఏరువాకమ్మకీ ఏమికావాలీ ! !

పొలమునగట్టుసనిలిచి వేడుకోవాలి
పసుపుకుంకుమలతో పూజసేయాలి

బెంకాయ వడపప్ప చేసిపెట్టాలి
ముత్తైదులందరూ పాటపాడాలి
పాటపాడుతు తల్లి పాదాలు మ్రొక్కాలి
ఆటలాడుతు తల్లి పూజల్లుసేయాలి
ఏరువాకమ్మనూ ఏమికోరాలి
ఎడతెగక సిరులివ్వ వేడుకోవాలి
పాడిపంటలుకోరి పరవసించాలి.

ఈ విధంగా ఎరుపురంగు కుంకుమలతో - పచ్చని పసుపు పూతలతో - రంగు రంగులుగా వింత శోభను చేకూర్చు పూలహారాలు నిండుగా అలంకరించి - ఎండవెలుగుల్లో-సింగారించుకుని వచ్చిన ముత్తైదువుల పాటల సందడితో ఏరు వాకకు స్వాగతం పలికి - హారతులిస్తారు-ఈ తరహా ఏరువాక పాటలు ఎన్నో ఉన్నాయి.

పదములనుపేర చాలా పాటలు ప్రచారంలో ఉన్నాయి. వెన్నెల, ప్రభాత, తుమ్మెద పదములు మొదలగునవి.

ఈ తుమ్మెద పదములు అనునవి 12 వందల శతాబ్దం నాటికే - అంటే పాల్కురికికాళం నాటికే ప్రచారంలో ఉన్నాయి. అంతటి ప్రచారంలోవున్న ఈ తుమ్మెద పదం సమిష్టిగానంగా (కోరస్) పాడుతూ చక్కని తాళం - రాగంతో ఊగూతూగూతో ఉత్సాహంగా కోతలు కోసుకు పోతుంటారు. ఈ పాట మాధుర్యంలో మునిగి - వంతపదంగా ''తుమ్మెదా'' అని అంటూ శ్రమను మరుస్తుంది శ్రామిక జనాళి - ఆ శ్రామైక జీవితంలోనే ఏదో ఆనందం అనుభవించే శ్రామికహృదయం ! ఆ కోవకే చెందే ఈ తుమ్మెద పదం. గమనిద్దాం :

శివశివ అనమేలు — తుమ్మెదా
శివయంటేను వినమేలు ,,
శివుని భక్తులాకు ,,
శరణన్న మేలే ఓ ,,
శ్రీకంఠు డసుపువ్వు ,,

మూడు లోకాములాయేనే తుమ్మెదా
సాకారమై యుండు ,,
పరమే కాంతమును జూడు ,,
ముట్టీ ముట్టని పువ్వు ,,
అది ముట్టింది జగమెల్ల ,,
అందీ అంటని పువ్వు ,,
అది అంటింది జగమెల్ల ,,
ముట్టకూడదే ఓ ,,
ముట్టిపాయ లేవేనో ,,
ఇవ్వనమందూనె ,,
చాల పువ్వుల వాసన ,,
కొవ్వి నీ వెరుగావె ,,
నీ నెవ్వ నేరమూల ,,
ఆరురేకుల పువ్వు ,,
అది మించీన వాసన ,,
వేరు సేయక నీవు ,,
శివునిచేరి భజించాలె ,,
మేలు ఎరిగి నీవు ,,
కేళి జరించాలె ,,
ఏడుగురు రాజులు ,,
నీకు ఈడు జోడు బంటు ,,
చూడపాడు జంపె ,,
రూఢికెక్క మట్టె ,,
ఆస సాపజాతి ,,
పట్టి ఆసచీడు మంచి ,,
మోసబోకు మట్టి ,,
భక్తవాసికెప్క ,,
అష్టదళముమీద ,,
ఉంటి చరిచాలె ,,

కష్టము లెరుగావె	తుమ్మెదా
నీవు ప్రస్టవై యుందూవె	,,
తొమ్మిది వాకిళ్ళు	,,
నీవు నమ్మి చరింతూవె	,,
మమ్ములలలోన	,,
నీవు నెమ్మదిగా ఉండవె	,,
అనాసతోటపువ్వు	,,
నువ్వు ఆనక ఉండావె	,,
అందూన జిక్కిన	,,
తోటమాలీ చేబడుదూవె	,,
నింగి నేలయూను	,,
గంగా గౌరులంద్రు	,,
ఉప్పొంగుచు నొకచోట	,,
వేయివిధాల నటించు	,,
వేయి రేకుల పువ్వు	,,
అది వెదికి కొనాలేవె	,,
సద్గూరు నడుగావె	,,
పూవుమధ్య చూపునీకు	,,
గురునకు హరునకు	,,
అంతరువులేదు నిజము	,,
గురుపాద పద్మములు	,,
నిన్ను దరిశించమంటినే	,,
శివశివ అన మేలు	,,
శివయంటేను విన మేలు	,,

ఈ తుమ్మెద పదంలో ఎంతటి వేదాంత ప్రబోధం ఇమిడి ఉందో గమనార్హం. అలాగే ఎన్నో ఉన్నాయి వేదాంత ప్రబోధంతో కూడిన తుమ్మెద పదాలు–మరొకటి మచ్చుకు :

తుమ్మెదా	ఓ	తుమ్మెదా
తోటల్లోకి		,,
చేలల్లోకి		,,
పూలల్లోకి		,,
వరిచేలల్లోకి		,,
ఇరగబడొచ్చింది		,,
దేవసిరినంది		,,
తేరగ వచ్చింది		,,
గొంతెమ్మ పెంచేన		,,
గొలుసులనందీ		,,
ఈనిన వరిచేలు		,,
ఈ దవడ దొక్కింది		,,
అల్లము చెడతిని		,,
పేడకడి వేసింది		,,
ఆంతటికే ఆసేను		,,
కాపన్న వచ్చాడు		,,
ఎక్కడిది ఈ నంది		,,
ఏడాది ఈ నంది		,,
పండిన వరిచేలు		,,
పాయలడగ ద్రొక్కింది		,,
కట్టండె నందీని		,,
గాజుల్ల శాలాన		,,
వేయాలి నందికి		,,
ఏడుకట్లా చొప్ప		,,
పొయ్యాండి నందికి		,,
గోలాన కుడితి		,,
అంటూనె కాపన్న		,,
గొంతెమ్మ మెడకు		,,
మెడల్లో గొంతెమ్మ		,,

ఏలాగునుందీ	తుమ్మెదా
ఉయ్యాల్లో గొంతెమ్మ	,,
ఊగుతున్నాదీ	,,
ఊగూగు గొంతెమ్మ	,,
చెరువులూ నింపిందీ	,,
ఎక్కడిది ఈ నంది	,,
ఏడాది ఈ నంది	,,
గొంతెమ్మ పెంచిన	,,
గొలుసులా నందీ	,,
మా నంది కొట్టద్దు	,,
మమ్మల తిట్టొద్దు	,,
మా నంది బండెలా	,,
మేపించుతామూ	,,
సోలతో సోలెడూ	,,
మాదలేసుకొని	,,
ఇదిగోర కాపన్న	,,
మా నంది బంది	,,
ఇక్కడకు తీరదు	,,
మీ నంది బంది	,,
తవ్వతో తవ్వెడు	,,
మాదలేసుకొని	,,
మానెతో మానెడు	,,
మాదలేసుకొని	,,
అడ్డతో అడ్డెడు	,,
మాదలేసుకొని	,,
కుంచముతొ కుంచెడు	,,
మాదలేసుకొని	,,
పన్నెండు చెంగులు	,,
పట్టుపంచెలనూ	,,

పట్టుమన కాపన్న తుమ్మెదా
పైమీద కప్పింది ,,
చాలునని కాపన్న ,,
సంతోషపడ్డాడు ,,
మేడలో గొంతెమ్మ ,,
ఏలాగునుందో ,,
పొరుగూరి చేలోకి ,,
పోబోకు నంది ,,
పొరుగు బందులు ,,
తేబోకు నంన్న ,,
కట్టండి నందిని ,,
గాజుల్ల స్తంబాల ,,
వెయ్యండి నందికి ,,
వెయ్యకట్లా జొన్న ,,

ఊడుపు ఊడవడం, వరికలుపులు, కోతలు, కట్టుడు మొదలగు సమయాలలో పాడే పాటలు, వినిపించే వరుసలు - ఆ సమయంలో కామందుల మీద విసిరే విసుర్లు, వెక్కిరింతలు, వేళాకోళాలు వింటూంటే ముచ్చటగా-వినసొంపుగా ఉంటుంది. అటువంటి పాటలలో కొన్ని—

ఉదయం సింగారించుకుని పనులకి వెళ్ళే కూలిజనం ఎంత హడా విడిగా ఉంటుందో చూడండి:

అద్దారి కోతలకూ యెల్లొద్దారే
అద్దరూపాయి డబ్బులకు ఆసలేరాను!
చుక్కపొడిసినయేలకి సోకూచేసుకుని
లచ్చి నాతో రాయె యెల్లొద్దారె!

సెవిలోనా కమలా లెట్టి ముత్తాల బావీలెట్టి
సుక్కలరయికా తొడిగి కరగంచు సీరాగట్టి
కళ్ళాకుకాటూకెట్టి అద్దారీకోతలకీ యెల్లొద్దారే-

నాసోకూ కేమీగానీ నీసోకూ సూసుకోరా
మూటాముల్లెకట్టుకోనీ ముందు నేనొత్తునురా—
కాయపంచ కట్టుకోనీ కిర్రుచెప్పులు తొడుగుకొనీ
పొన్నుకర్రా చేతాబట్టీ పోకకత్తీ మొల్లో చెక్కి
అద్దారి కోతలకూ ఎల్లొద్దారే-

గిత్తాదూడని ఎంటా బెట్టుకు
కోడిపిల్లని సంకా బెట్టుకు
పొగసుట్టే నోట్లో పెట్టుకు
పొగలోత్తును లేసీరారా
అద్దారికోతలకూ యెల్లోద్దారే...

అలాగే దినచర్య పరిచయం చేస్తూన్న మరో పదం వినండి:

వొడిసిండా పసుపేసొక్క ఒయ్యారమేమే గునాసారి గున్నమ్మ !
పొద్దున్న నువులెగసి పొలానికెళ్ళి ,,
ఎండెక్కసూరీడు కొండెక్కసూశాడు ,,
గంపకిందాకోడి కుయేయనికూసె ,,
గుట్టెక్కసూత్తాడో గంద్రోతుకాపు ,,
మద్దేన్నం ఏలపుడు మరిదప్పికేత్తే ,,
సల్దిగంజికాస్త తాగేవుండు ,,
ఆకుమళ్ళాలోనూ ఆకెండిపోయె ,,
తోడండినీరంత బావుల్లానుంచి ,,
కుప్పానూర్పులకాడ కూకున్నావేమె ,,
పండినా సేలోకి పయనామైయెల్లీ ,,
కొయ్యండికోతలు కొడవళ్ళబట్టీ ,,
కొయ్యండి కొయ్యండి కుంచాలతోటి ,,
ఎయ్యండి బళ్ళాకీ ఎగుడుదిగుడూ లేక ,,

వరి పొలాలలో గుంపులుగా చేరి వరిని కోస్తూనో, కడుతూనో "జయ్" మనే వరుసలో కోరస్ సాంగ్‌గా పాడే ఈ పాట మరీ ఉత్సాహంగా వినిపిస్తుంది:

ఎలేమాను ఎలేమాను ఎలేమాను ఓహో
ఈతాచెట్టుకు నుచ్చేనేసి ఈతాపళ్లు కొయ్యాబోతె
ఎలేమాను ఎలేమాను ఎలేమాను ఓహో
ఈతాముళ్లు రొమ్ముగుచ్చె సన్నరవికా సగముతడిసె
ఎలేమాను ... ...

రాజుకొడుకు రాతిఓడుపిల్ల వంకాసూసినాడు
ఓరాసూపుసూసినాడు పిల్లచూడ సకిలించినాడు
ఎలేమాను ... ...

పిల్లదాపుకూ వచ్చినాడు రాజువంకా సూసెపిల్లా
ఎలేమాను ... ...

గడగడమంటూ ఒణికినాదీ రాజుకుదండం పెట్టినాదీ
ఎలేమాను ... ...

మాటవినకారాజు వెంటనె పిల్లనుచేరీ ముద్దెట్టినాడూ
ఎలేమాను ఎలేమాను ఎలేమాను ఓహో !

తుమ్మెదపదముల లాగానే వెన్నెలపదాలు చాలా ఉన్నాయి. ఈ వెన్నెల పదాలు, చందమామ పదాలు ఎక్కువగా శృంగారపూరితం, ఆనంద కోలాహలంగాతో కూడిన భావపదజాలంతో నిండిన నిండుకుండలో సీటితచుకులా ఉంటాయి. అలాటిదే ఈ వెన్నెలపదం పరికించండి. ఈ పాటను గుంపుగా కలిసి మధ్యలో ఒక బుట్ట అందులో ఒక వరికంకి, లేదా జొన్నకంకి పెట్టుకొని గ్రామవీధుల్లో పాడతారు :

ఆరరగ పట్టింది	యెన్నెలా
సీళ్ళకు వచ్చింది	,,
పాపిడి సెట్టెక్కి	,,
పలుకర్ర నయిరిసి	,,
పగడాల రాయెక్కి	,,
వలువరుస తోమింది	,,
ముత్యాల రాయెక్కి	,,

మునిపళ్ళయినతోమె యెన్నెలా
నలుపైన రాయెక్కి ,,
నాలుకై నగీసె ,,
ముడికెడు నీళ్ళల్లో ,,
మొకమైన కడిగింది ,,
చారెడు నీళ్ళలో ,,
జబ్బాలు కడిగింది ,,
చుట్టజలతారుసాపు ,,
సొమ్ములు సుట్టింది ,,
ఆగరగ ముంచింది ,,
ఒడ్డునా ముంచింది ,,
అటుయిటూ సూసింది ,,
ఎవ్వరూ లేరాయె ,,
కట్టమీద కామన్న ,,
గరగెత్తిపోరయ్య ,,
నీకు గరగెత్తితే ,,
నా పాడియావూ నిస్త ,,
నీ పాడావు నాకొద్దు ,,
నీ గరగ నేనెత్త ,,
నాకు గరగెత్తితే ,,
నా గున్న ఎద్దునిస్తాను ,,
నీ గున్నయెద్దు నాకొద్దు ,,
నీ గరగ నేనెత్త ,,
నాకు గరగెత్తితే ,,
నా నాగరం ఇస్తాను ,,
నీ నాగరం నాకొద్దు ,,
నీ గరగ నేనెత్త ,,
అంతైతె నీ మనసు ,,
నేనె పస్తాను! ,,

కళ్లాలతో నిండి - రకరకముల భావాలకు నిలయమైన ఇటువంటి పదాలు ఎన్నో !

సంవత్సరమూ కష్టపడి పొలాన్ని దున్నుకొని, ఆకు నూర్చుకొని, కలుపులు తీసుకుని, నీరెట్టుకుని, కాపలా కాచుకొని, వరి కోసుకుని - కొట్టుకొని కుప్పపోసిన ధాన్యరాశిని చూస్తూంటే - శ్రమించిన కూలీకి, అందుతోనే రైతుకూ ఎంతటి ఆనందం ! - అంతటి ఆనందంలోనూ దేవుడిని మరువలేని హృదయం లోని గొప్పతనం గమనార్హం ! చూడండి వారు ధాన్యరాశిని చూసి ఎలా మురుస్తున్నారో :

ఒలియె ఒలియె ఒలియె ఒలియో
రా వేలు కలవాడా ! రార పొలిగాడా
రా వేలు మీవయ్య రాశిమీదయ్యా
పోయెర పొలిగాడు పొన్నల్లుదాటి
దాగెరా పోలిగాడు దండకట్టుల్ల
కోడెలు తొక్కంగ కొల్లలై రాశి
ఎద్దులు తొక్కంగ ఎదిగెరా రాశి
దున్నలు త్రొక్కంగ దిన్నెలై రాశి
పెయ్యలు త్రొక్కంగ పెరిగెరా రాశి
శ్రీశైల పర్వతము శిఖతేలె రాశి
తిరుపతిగట్టులా దివ్యమై రాశి
కాళహస్తిలాగు కళలూరె రాశి
కోటప్పకొండల్లె గొప్పదీ రాశి
మంగళాగిరిలాగ పొంగెరా రాశి
వేదాద్రిగట్టులా వెలిగేరా రాశి
మర్గమ్మగట్టులా తోచెరా రాశి
సింహాద్రిగట్టూల చెన్నెందో రాశి

తను కష్టపడి పండించుకున్న పరికుప్ప తన ఆరాధనా దైవగిరులైన తిరుపతి కొండలాగా, మంగళగిరిలాగ, సింహాద్రి గట్టులా తోపిస్తూంది. ఇదే పదములు కలిగిన మరోపాట కూడా ఉంది. అది చూడండి :

ఒలే ఒలియ ఒలియో ఒలియా
రావేలుగలవాడా రార పొలిగాడ
రావేలు పదివేలు రాశి పదివేలు
రావేలు నీదయ్యా రాశి మాదయ్యా
పదివేలుగలవాడా రారా పొలిగాడా
పదివేలు నీదయ్యా పంటా మాదయ్యా
నూర్వేలుగలవాడా రారా పొలిగాడా
నూర్వేలు నీదయ్య నూగు మాదయ్య
వెయ్యేలుగలవాడ రారా పొలిగాడ
వెయ్యేలునీదయ్య వెన్ను మాదయ్య
కోటి వేల్గులవాడ రారా పొలిగాడ
కోటి వేలు నీదయ్య కొండ్ర మాదయ్య
పోయెను పొలిగాడూ పొన్నూరుదాటి
వచ్చెనే పొలిగాడూ పరగాణి బాట
వాయెక్కి పొలిగాడు లాలా లాడంగా
కుప్పెక్కి పొలిగాడు కూకా వేయంగ
మర్రెక్కి పొలిగాడు మాటలాడంగ
జువ్వెక్కి పొలిగాడూ జూదమాడంగ
రాసెక్కి పొలిగాడు రంపటిల్లంగ
పొలిగాడు గొట్టంగ పోగాయె రాశి
పెయ్యిలూ ద్రొక్కంగ పెరిగెనే రాశి
చున్నలు ద్రొక్కంగ దిన్నాయె రాశి
కోడెలు ద్రొక్కంగ కొనసాగె రాశి
కొండవీటి కొండల్లా దొప్పాయె రాశి
తిరుపతికొండల్లే తిరెనే రాశి
రామలక్ష్మణులల్లె రాశులు గలవు.

ఈ పిధంగా ఒకే మాదిరి భాపంతో - ఒకే సమయంలో పాడే పాటలూ, పదాలూ చాలా కనుపిస్తాయి.

రెక్కాడితేనేగాని డొక్కాడదు. అంతకన్నా ఈ జీవితాలు నోచుకోలేవు. అంతమాత్రం చేత నిరుత్సాహ పడరు- పైగా ఆ శ్రామిక జీవితంలోనే ఎన్నో సౌధాలూ - ఊహలూ ఉత్సాహాలూ రంగరించుకుని, సృష్టించుకొని ఆనందం అనుభవిస్తారు - ఉన్న దానితో తృప్తిపడి, పెట్టి పుట్టిన కాసిని గంజి నీళ్ళకే సంతృప్తి చెంది, ఆ వెన్నెల వెలుగుల్లో, ఆ చెట్లనీడల్లో, పొలాలలో, చేలలో శ్రమిస్తూ, శ్రమను మరచిపోయి సరదాగా గంటలనూ, గజాలనూ సునాయాసంగా దొర్లించుకు పోతారు - ఆ తరహా పాటలు కోకొల్లలు ఈ వాఙ్మయ క్షేత్రంలో. మచ్చుకు కొన్ని విందాం.

రాయినా శందనాలో ఓయి బామల్లాల బావన్నిలాల॥
రామలచ్చల్లాని రాజులూ లేరు
సీతమ్మలాటి ఇల్లాలు లేదు
రాయినా.....
ఉత్తర వచ్చింది ఎత్తరగంప
కారుమేఘా లాకాశమంటె
రాయినా.....
తొలకర్లో వరసాలు కావాలి
ఎకరానికి బస్తాలు పండాలి
రాయినా.....
నీరుపెట్టి దుక్కి దున్నాలి
దుక్కి దున్ని మొక్కి నాటాలి
రాయినా.....
పల్లెలు బాగుండాలి
పట్నాలు బాగుండాలి
రాయినా.....
పైరుకంకులమీద పిట్టలు వాలాయి
ఇల్లాగ రమ్మరో పిల్లోడ
కొట్టకుండ సుప్పు తిట్టకుండా సుప్పు

అందరిల బెదిరిస్తె అవతలకు పోవురా
రాయినా.....

చూడండి- కొత్తగా వ్యవసాయంకు దిగే రైతుకు కూడా, చేయించే వ్యవసాయ కూలికీ కూడ తొలకరిల్లో వర్షం అవసరమనీ, ముందు నీరుపెట్టి తర్వాత నేల దున్నాలనీ, దుక్కిదున్నాక మొక్క నాటాలనీ పాటల్లో, మాటల్లో వ్యవసాయ శాస్త్రం ఎలా ప్రబోధిస్తూందో జాతి జీవనానికి కావలసిన ఎన్నో రహస్యాలు ఈ పాటలమధ్య మాటల్లో దాగివున్నా యన్నది ఇక్కడ గమనార్హం.

వరి కలుపులకూ, చేను కోతలకూ సంబంధించిన ప్రతిదీ సమష్టిగా (కోరస్) పాడేదే—

పుట్టమీదా పాలపిట్టోయ్ నా సామి
కొట్టబోతే తేలు కుట్టేనోయి!
మంతరించే జానలుంటే నా సామి
మల్లెమొగ్గా పానుపేదూనోయ్!
నేలనేలా నెల్లి కూరోయి నా సామి
పాలపాలా బలుసుకూరోయి !
వాలుగొమ్మా చింతచిగురోయ్ నా సామి
వండిపెడితే వలపు తీరెనోయ్ !
అరుగుమీదా అరటిపండోయి నా సామి
పండుమీచా మనుసులుంటే నాసామి
సంత వేసినపండు రాదోయి !
ఎర్రచెరువు గట్టుకాడా నా సామి
చెప్పరాని దుఃఖమొచ్చిందోయ్!
ఎడ్లకేసే పోలికేకా నా సామి
నాకు యేస్తే నేను రానోయి!
సూపులేలా నీకు పోరా నాసామి
మాటలుంటే చేరి చెప్పోయీ!!

కూలిపిల్ల అయినంతమాత్రాన, కులం చిన్నది అయినంతమాత్రాన వ్యక్తిత్వం ఎక్కడికి పోతుంది చెప్పండి- ఎంత గాఢంగా ప్రేమించే ప్రియుడైనా ఎడ్లను పిల్చినట్లు ''యే యే'' అని పిల్లను పిలుస్తే కోపంరాదూ? - అందుకనే ఎడ్లకేసే పొలికేక వేస్తే నేను రానని నిక్కచ్చిగా చెబుతూంది.

చిక్కుడూ ఆకుల్లు వెన్నియల్లో
శివసుద్దులుగట్టి వెన్నియల్లో
చెయ్యేరునే బోదు చుట్టాలజూడ
అక్కడెవరున్నారె ఆంభోంజ రాజు
మా అమ్మ తమ్ములు మాకు మేనమామలు
మముగన్న తండ్రికి బావమరుదు లమ్మ
బావమరుదులుగూడి బాయి తోడించిరీ
బాయిలో ఉన్నాది బంగారు బిందె
బిందెలో ఉన్నాది చామంతికట్ట
కట్టలో ఉన్నాది చిన్నపు మంచం
ఆ చిన్న మంచానికె సన్నని నులక
దానిమీద పండేటి జాణ లెవరమ్మా
పని జేసి లచ్చమ్మ పవళించి నాది
విసినకర్రలతోటి విసిరిలేపన్నా
విసిరినా లేవదూ విరజాజిమొగ్గా
కొబ్బరి ఆకులతో కొట్టి లేపమ్మా
కొట్టినా లేవదూ కోమటోని పట్టి
దొప్పళ్ళ గంధంబు గుప్పి లేపమ్మా
గుప్పినా లేవదూ ఈ గురిజల బంతి
దొడ్లో పసువులెళ్ళె - దోరెండ లొచ్చె
ఇకనన్న లేవదే దొడ్డవారి బిడ్డ
మందపసులెళ్లె మారు ఎండలెక్కె
ఇకనన్న లేపవే మా ఇంటికోడలా॥

ఈ వరి కలుపు పాటలో కోడలుసు లేపడం - పర్ణన ఎంత ముచ్చటగా సాగిపోతుందో చూడండి—

మంచి పని ! ఎద్దడిగా ఉంది - పండి ఒరిగున్నాయి వరిచేలు - జనమే దొరకడం లేదు. కోతకు మనుషులను పిలుస్తూన్నాడు ఓ బంటా కూలన్న—

కూలికొతాపంటె పిలామరీ
కూలంటె కులాస అయ్యా మాకు !

నేతకొత్తావంటె పిల్లామరీ
నేతంటె నేటోను అయ్యా మాకు !

ఊడ్పుకొత్తావంటె పిల్లామరీ
ఊడ్పంటె ఊగులాట అయ్యా మాకు !

కోతకొత్తానంటె పిల్లామరీ
వహ్వా ! కోతంటె కోలాటం అయ్యామాకు.

సరే ! నాకు కావలసింది. కోతకు మనుషులే. కోలాటం వేద్దాం రా! అని కోతలకు బయలుదేరారు - చేను కోస్తూన్నారు :

కోతకొయ్యండమ్మలాలా సేలు
కోరుకున్నా మమ్మలాలా !
ఆరుమూడు కాలమైన
అసలుకమరి కొసరులేదు ॥కోత॥

సోడిసేలు యెన్నులేసి
సోలెడు గింజలుకైతె
పాలికాపు బత్తాలకు
పనికొచ్చును కొయ్యండి ॥కోత॥

దసరా భోగాలంటి
ఆసరా తీరుస్తాయి !
పసవాడి కసవుంటె
భాగ్యాలే పండాయి ! ॥కోత॥

సాలొచ్చిన మహారాజు
సెయిములగా ఇస్తాడు !
కాసుసేత పడితేను
గగనమందేను సేను ॥కోత॥

—ఈ పాటతో ఎంత నిండు హృదయం కనబడుతుందో ! పంట బాగా పండాలిట, తమకు నాలుగు కాసులు రావాలిట. అలాగే—

"కొయ్యండల్లా కొయ్యండి
కోసి బణుపూలెయ్యండి
వానలవరదల వంగిన సేను
వెన్నులు ఈనిన వన్నెల సేను
తిన్నగదీసి మొదలూకోసి
పనలన్నీనీ పంజెట్టావా
గింజలు, బందలు పడిపోకుండా
పొందుగ వెన్నులు కొయ్యండల్లా
కాలంసూత్తె సీతాకాలం
కొడవలిపాటూ జాగ్రత్తరా
కాలు సెయ్యీ అడితేనే
కుండలొ కూడూ కనిపిస్తాది—"

పనిచేస్తూ కూడా ఆ పనిలో మెలుకవలని గురించీ, జాగ్రత్తలను గురించీ హెచ్చరించుకోడంలో వాని అంతర్గత విశాలత్వభావం సుబోధకం కావడంలేదూ!

విచిత్రంగానే కనిపిస్తూంటుంది దేశి సరస్వతం పరికిస్తూంటే. ఆ పాటల్లో దాగిన పదాల భావాల కలయికలోని అర్థం - పండితులకు సవాలు పలకడం లాందివి. జాతికి నీతిని, దేశానికి బోధననూ, హృదయానికి శాంతినీ, జీవితాలకి క్రాంతినీ, బాటలకు కాంతినీ ఇచ్చే భావాలూ, పదాలూ ఇందులో కోకొల్లలు. దేశి శాఖలో ప్రతి పనికీ పాటలు వినిపిస్తాయి - మానవుడి జీవితచర్య యావత్తూ పాటల్లో ప్రతిబింబించి పలుకుతాయి ! రేచింది లగాయితు నిదురెంచేవరకూ అన్నీ పనులకూ పాటలు. విడ్డూర్యం కాదూమరి ?

శ్రీ హృదయంతో భాగవతతరంగాలు



శ్రీకృష్ణ జననం

*పూనవుని మనుగడ అంతా భగవత్ధ్యానంతోనే ముడిపడి వుందా అనిపిస్తుంది. కృష్ణ పరమాత్ముని లీలలు అగమ్యగోచరాలు-అది ఒక విశ్వరూపం।

కృష్ణుని రూపం నల్లనిదైతే హృదయం తెల్లని వెన్న- అయన పిల్లనగ్రోవి భక్తజన కోటికి ఆనంద తుందిలం। భాగవతపరమైన ఎన్నో పాటలు స్త్రీల నోళ్లల్లో, గుండెల్లో లీలలుగా పాటలుగా కీర్తనలుగా మేలుకొలుపులుగా - అలా ఎన్నో తరంగాలు- అందులో కృష్ణుని జననమునకు సంబంధించినదే ఈ పాట.*

కస్తూరి రంగరంగా నాయన్న కావేటి రంగరంగా
శ్రీరంగ రంగరంగా నినుబాసి ఎట్లునే మరచుంచురా
కంసుణ్ణి సంహరింపా సద్గురుడు అవతారమె త్తెనపుడూ
దేవకీ గర్భమునందూ కృష్ణావ తారమై జన్మించెనూ
ఏడు రాత్రులు చేరిచీ ఒకరాత్రి ఏకరాత్రిగ జేసెను
ఆదివారము పూటనూ అష్టమీ దినమందు జన్మించెను
తలతోను జన్మమైతె తనకు బహు మోసంబు వచ్చుననుచు
ఎదురుకాళ్ళను బుట్టెను ఏడుగురు దాదులను జంపెసపుడు
నెత్తురుతొవుండి యపుడూ ఆ బాల కావుకావున ఏడ్చుచు
నన్నేల ఎత్తుకొనవే ఓతల్లి దేవకీ వందనంబు
ఒళ్లెల హీనంబుతో ఈరీతి నున్నాను కన్నతండ్రి
నిన్నెట్లు ఎత్తుకుందూ నీవొక్క నిమిషంబు తాకరన్నా
గంగనూ ప్రార్థించెనూ జలనిధుల గంగతా నుప్పొంగెను
గంగనదిలో నప్పుడూ దేవకీ జలకంబులాడె నపుడు

ఇకనైన ఎత్తుకొనవే నాతల్లి దేపకీ పందనంబు
కాని బాలుని పలెను నన్నిట్లు ఎడబాసి యుండతగునా
నీ పుణ్యమాయె కొడకా ఇంకొక్క నిమిషంబు తాళుమనుచూ
కామధేనువు నప్పుడూ దేవకీ కడగి ప్రార్థించగాను
పాలవర్షము గురిసెను అప్పుడా బాలుపై చల్లగానూ
తడివస్త్రములు విడిచెనూ దేవకి పొడివస్త్రమును కట్టెను
పొత్తిళ్ళమీద నపుడూ బాలుండు చక్కగా పవళించెను
తనరెండు హస్తములతో దేవకి తనయుణ్ణి ఎత్తుకొనెను
అడ్డాలపై వేసుక ఆబాలు నందచందము చూచెను
వసుదేవు పుత్రుడమ్మా ఈ బిడ్డ వైకుంఠ వాసుడమ్మా
నవనీత చోరుడమ్మా ఈబిడ్డ నందగోపాలుడమ్మ
సితపత్ర నేత్రుడమ్మా ఈబిడ్డ శ్రీరామ చంద్రుడమ్మ
శిరమున చింతామణి నాతండ్రి నాలుకను నక్షత్రము
పండ్లను పరుసవేది భుజమున శంఖచక్రములు గలవు
పీపున వింజామరం నాతండ్రి బొడ్డున పారిజాతం
అరికాళ్ళ పద్మములును అన్నియూ అమరెను కన్నతండ్రీ
నీరూపు నీచక్కనా ఆ బ్రహ్మ ఎన్నాళ్లు రాసెతండ్రీ
అన్నెకారి కడుపునా ఓ అయ్య ఏల జన్మిస్తివయ్య
మా యన్న కంసరాజు ఇప్పుడూ వచ్చు వేళాయెరన్నా
నిన్ను నే నెత్తుకొని ఏత్రోవ నేగుదుర కన్నతండ్రి
ఆ చక్కదనము జూచి దేవకి శోకింపసాగె నపుడు
తల్లి శోకము మాన్పగా మాధవుడు తంత్రమొక్కటి చేసెనూ
పెద్ద బొబ్బలు పెట్టుచూ మాధవుడు గట్టిగా ఏడ్వసాగె
శోకంబు చాలించియూ దేవకి బాలుణ్ణి ఎత్తుకొనెను
నా యన్న ఊరుకోరా నా తండ్రి గోపాల పవళించరా
అల్లడుగో బూచివాడు నా తండ్రి వస్తాడు పవళించరా
బూచులను మర్దించనూ నలినాక్షి బుద్ధిమంతుడను అమ్మా
బూచేమి చేసునమ్మా నాతల్లి బూచి నన్నెరుగు నమ్మా
నీ పుణ్యమాయె కొడుకా నీ వొక్క నిమిషంబు తాళుమనుచు

అల్లదుగొ జోగివాడూ నా తండ్రి వస్తాడు పవళించరా
జోగి మందుల సంచులూ ఏవేళ నాచంక నుండగాను
జోగేమి చేసునమ్మ నాతల్లి జోగి సన్నెరుగుసమ్మా
నీ పుణ్యమాయె కొడకా నీవొక్క నిమిషంబు తాళుమనుచు
అల్లదుగొ పాము పచ్చె నాతండ్రి గోపాల పవళించరా
పాముల్ల రాజె అయినా శేషుండు పానుపై యుండగానూ
పామేమి చేసునమ్మా నరినాక్షి భయము నీకేలనమ్మా
నీలమేఘపు చాయలూ నీమేను నీలాల హారములునూ
సద్గురుడు రాసినాడు నాతండ్రి నీరూపు నీచక్కన
నిన్ను నేనెత్తుకోని ఏ క్రోవ పోదురా కన్నతండ్రి
నాకేమి భయములేదే నాతల్లి నాకేమి కొదువలేదే

మా మామ కంసుకుండు ఈ వేళ నన్ను వెరపించవస్తే
మా మామ నాచేతనూ చచ్చి పొయ్యేది నిజము ఖాయం
వచ్చువేళాయెననుచూ నాతల్లి వసుదేవు పిలువనంపూ
గోపెమ్మ బిడ్డ నిపుడూ శీఘ్రముగ తెచ్చి నీ వుంచవమ్మా
అంతలో వసుదేవుడూ బాలుణ్ణి తలమీద ఎత్తుకొనెనూ
రేపల్లె వాదలోనూ గోపెమ్మ ఇంటనూ వచ్చె నపుడూ
గోపెమ్మ పుత్రినపుడూ వసుదేవు భుజముపై నెక్కించుకూ
అతి త్వరితముగ వచ్చెనూ దేవకి హస్తముల నుంచె నపుడు
దేవకికి తనయు డపుడూ పుట్టెనని కంసునకు కబురాయెను
జల్లుమని గుండెలదర కంసుండు పీఠంబు దుమికె నపుడూ
జాతకంబులు చూచెనూ గండంబు తగిలెనని కంసుకుండు
చంద్రాయుధము దూసుకా శీఘ్రముగ దేవకి పద్దకొచ్చె
తెమ్మని సుతునడిగెనూ దేవకి అన్నదీ అన్నతోసూ
మగవాడు కాదురన్నా ఈ బిడ్డ ఆడపిల్లా నమ్మరా
ఉపవాసములు నోములూ నోచి ఈ పుత్రికను గంటినన్నా
పుత్రి దానము చేయరా నాయన్న పుణ్యవంతుడవురన్నా
దేవాదిదేవులైన బ్రహ్మ రుద్రాదులకు పూజచేసి
పూజ ఫలములచేతనూ వారి కృప వల్ల నే పుత్రి గంటి

నీ పుణ్యమాయెరన్నా ఈ పుత్రికను దయచేయుమన్నా
దయలేని వాడవగుచు నీవిట్లు చేయతగదన్నా
ప్రేమతో చెల్లెలపుడు అన్నను చెయిచాపి బ్రతిమాలెనూ
గంగాది నదులయందూ పుత్ర దానం కొరకు వేడెనూ
కాదుకాదని కంసుడూ దేవకి పుత్రికను అడిగె నపుడు
అడ్డాలపై బాలనూ పట్టుకుని ఎగరేసి నటకబోయె
అంబరమునకు ఎగురగా అ బాల కంసునీ తేరి జూచి
నన్నేల చంపెదవురా అసలోడు రేపల్లె వాడలోను
పెరుగుతున్నాడ వినరా కృష్ణావ తారమై జన్మించెనూ
నిజముగా దోచెనపుడూ కంసుండు ఏ తెంచి పవళించెనూ
రేపల్లె వాడలోనూ పెరుగుచున్నాడనీ దిగులొందెను
నీ యబ్బ నీ తాతరా కంసుడా కృష్ణుండు పుట్టెననుచూ
చల్లమ్మ వారలెల్లా ఆకబురు చక్కగా చెప్పగాను
పూతకికి కబురాయెను అప్పుడా పూతకి చనుదెంచెను
సుతారముగ పూతకి స్తనములకు విషమునే పూసుకొనెను
రేపల్లె వాడలందూ కృష్ణుడు తిరుగుచున్నా చోటకూ
చనుదెంచి విషపుపాలూ కృష్ణయ్య కివ్వగానూ
బాలురతొ బంతులాడ కృష్ణుని బాలురందరు కొట్టగా
గుక్కతిప్పక ఏడ్చుచు పరుగెత్తి వీధి నడుమను నిలచెనూ
ప్రేమతో కృష్ణునీ చూసి పూతకి ప్రియముతో బుజ్జగించి
నా యన్న పూరుకోర నా తండ్రి పాలు ఇచ్చెదను రార
మూడు గుక్కలు పీల్చగా పూతకి భూమిపై కొరిగి పడగా
గోపెమ్మ చూచి అపుడూ బంగారు గిన్నెలో బువ్వపెట్టి
ప్రొద్దున్న ఉగ్గుపోసి కృష్ణుని ఎడలోను పండవేసె
అంతలో కంసహితుడూ బండిరూపై ఎదురుగావచ్చెనూ
పాదములు రెండు పిడుగులావలె దడదడా విసిరెనపుడూ
వృషభమై వచ్చినిలువ ఒక్కలఘువున చంపేసెనపుడూ
చల్లమ్మవారలెల్లా ఈ కబురు చల్లగా చెప్పిరపుడు
రేపల్లె వాడలోను ఉన్నట్టి గోపికలు గుంపుగూడి

"మాయిళ్ళ కొచ్చునమ్మా కృష్ణుడు మమురవ్వ చేసునమ్మా
తాళలేమమ్మ మేము మీ సుతుడు తాలిమితొ ఉండడమ్మా
మగనివలె పనులుసేయా నీ సుతుడు మాఇండ్లలోకే వచ్చునూ
ఇనైకన బుద్ధిచెప్పి ఇంతిరో పనెలమ్మ సేయుమమ్మా"
అనుచునూ గట్టిగాను మనమంత గోపెమ్మ కడకుబోయి
చెప్పుదామనుచు వారు గోపెమ్మ చెంతకేగగ అప్పుడు
గోపాలకృష్ణ డపుడూ అచటనే పాలుత్రాగుచు నుండెనూ
ఇది ఏమి యాశ్చర్యమే ఓ చెలియ ఇదియేమి చోద్యమమ్మ
కనుపాపలను దీసునే కృష్ణుడు దొంగతనములు చేసునే
ఇకనేమి చేసుకోను మన ముబులుపాటమున వస్తిమమ్మా
అమ్మనే నెరుగనమ్మా నా త్రోవ నేబోవు చుండగాను
ననురవ్వ చేసిరమ్మా నేనంత భయపడీ వస్తినమ్మా
కొబ్బరి కురిడీలనుచు గోపికలు గొబ్బున పిలువబోవ
కొబ్బరి కురిడీలనుచు గోపికలు గుబ్బలను చూపినారు
పౌర్ణమి రోజులందు జలజాక్షు లందరూ కూడుకోనీ
చీరలటు తీసివేసి గోపికలు జలకమాడుచు నుండగా
తీసివుంచిన చీరలు కృష్ణుండు వేసె ఆ పొన్నమీద
వేసియూవేణునాదం ఊదుతూ ఉండె నా మాధవుంతూ
జలకమ్ము చాలించియూ గోపికలు మన చీర లేమాయెనే
నమ్మరాదమ్మ కృష్ణుని ఇకను ఈ చినగొల్లవాని నెపుడూ
ఎంతపని చేసెనమ్మా ఓ చెలియ ఏమి యాశ్చర్యమమ్మా
వెదకుచూ కొందరుండీ నీళ్ళలో మునిగియుండిరి కొందరూ
అప్పుతూ గోపికలలో ఒకఇంతీ తాజూచి శ్రీకృష్ణునీ
రారె ఓ అమ్మలార ఈ పొన్న మీదనున్న కృష్ణుని
ఇవ్వరా మా చీరెలూ ఓ కృష్ణ ఇవ్వరా మా రవికెలూ
దండంబు పెట్టెదార కృష్ణయ్య దయయుంచి దయచేయరా
అందరూ ఒక చేతితో దండంబు పెట్టగా చూచి తాను
పొందుగా మీరందరూ దండంబు రెండు చేతుల బెట్టరే
ఎంతపని వచ్చెననుచూ గోపికలు మానభంగము నొందిరీ

వసుదేవ తనయునకునూ దండంబు రెండు చేతుల బెట్టిరీ
పొందుగా వలువలన్నీ కృష్ణుండు పేరుపేరున ఇచ్చెను
నాయత్త తిట్టునేమొ యనుచు నొకరొకరితో వగచిరపుడూ
మాయాడుబిడ్డ ఇపుడూ కొట్టునో నా బావ దండించునో
నా మగడు నన్ను బ్రతుక నివ్వడూ నేనేమి చేతునమ్మా
కస్తూరి రంగ రంగా నా యన్న కావేటి రంగ రంగా
నినుబాసి ఎట్లు నే మరచుందురా! *

గుమ్మడు పాట



కృష్ణుని గాథలు – వెన్నెలాంటివి, వెన్నెలలాంటివి – ఉదయం

ఇళ్లల్లో పెద్దవాళ్ళ నోటినుండి జాలువారే ఆ గుమ్మడేడే...అని వింటూంటే మనం ఏదో ఆనందలోకాలలో లీనమై రసరమ్యజగత్తులో మత్తిల్లిపోతాం.

అందుకు పాఠ్యం ఇది: శ్రీ సారస్వతనందనంలో సందగోపాయని లీలామహత్వతత్వం ఇది

క్రొలికి కంఠపుసరులు చక్కగ గొప్ప ముత్యపుసరులు జారగ
కలికి కరమున కంకణాదులు కలసి ప్రోవగను
గరివి కెదురుగ పెరుగుదించెను కడవ స్తంభం మొదట నిలిపెను
కరమునను దట్టించి కవ్వము ఇంతిచే బూనెను.

చుయ్‌చుయ్ అని పెరుగు తరచగ కోరి విని ప్రార్థించి కృష్ణుడు
అమ్మ వెన్నాయనుచు కవ్వము నణచి పట్టగనూ
నమ్మరా కృష్ణమ్మ పెరుగులో నడుమ గుమ్మడు తిరుగులాడును
నమ్మకున్నను చుయ్‌చుయ్ అను నాదమిటు వినుమీ ॥కృష్ణా॥

వామహస్తము నణచి పాదము వసుధ మీదికి కాలు ఎత్తుకు
భూమి కదలగ నవయవమ్ములు బొజ్జ కదలగనూ
కోమలీకంబైన చక్కని గునిసియాడెడి నడుము వంచుకు

ప్రేమ లెన్నుచు చెయ్యి చాపెను పెరుగు తరచగనూ॥
కాటబోయిన వారి పాపడు కడవలోపల చెయ్యి ముంచెను
తూటుపొడిచి కరచె గుమ్మడు తొలగిపోవగనూ
మాటలేటికి విడుము కవ్వము అన్న నీకును వెన్న బెట్టెద
ఏటికీ ఇంచున్న గుమ్మడు ఎగిరి కరచెడినీ ॥కృష్ణా॥

గుమ్మడేడే గోపిదేవీ గుమ్మడేడే కన్నతల్లీ
గుమ్మడిని పొడచూపగదవే అమ్మ గోపెమ్మా
ప్రుచ్చు తనమున వేదములుగొని తెచ్చి వెరచుచు జలధిలోపల
జొచ్చియున్నా వాని వెంబడి జొచ్చి వెనుదగిలీ

మత్స్యమై సోమకుని ద్రుంచితి మొదటి చదువులు బ్రహ్మకిచ్చితి
అక్షయంబు గుమ్మడనియెడి మాట నేనెరుగా-

సురులు నసురులు జలధి తఱచగ సరగునను భూధరము క్రుంగగ
అల్లసురవరులెల్ల పొగడగ వారి కిష్టముగా
గిరికి కుదురుగ కూర్మమైతిని క్రిందిలోకమునందు గుమ్మడి
తరచుగా నొకమాటకై నను తరుణి నే నెరుగ-

చారు భూమి చరాచరమ్ములు చంకబెట్టుకు హైమనేత్రుడు
వారి నిధిలో జొచ్చి నంతట వాని వెనుదగిలీ
కోరి వరాహరూపమైతిని రక్కసుని రణభూమి జంపితి
వారి భూములలోన గుమ్మడి పేరు నే నెరుగ-

జగములన్నియు విష్ణుమయమని చదువు బాలుండిందు గలడన
పరుగునను దట్టించి స్తంభము పగులవేయగనూ
సగము మృగమై హేమకశ్యపు చంపి దానవసుతుని గాచితి
మగువరో అందున్న గుమ్మడి మాట నేనెరుగా-

వడుగు బ్రాహ్మణ వేషముననే బలిని అడిగితి దానమిమ్మని
పుడమిలో మూడడుగులిచ్చెను పొంగి వేడుకతో
అడుగులను బ్రహ్మాండ భాండము అంటను నే నపుడు నిండితి
అడుగు క్రిందను గుమ్మడనియెడు అరసి నే నెరుగ-

వరుస నెరుగక కార్తవీర్యుడు వచ్చి యా సురధేనుకై గొని
పరగగా జమదగ్ని జంపిన పగ కు నే నపుడూ
వరుస నిరువది యొక్క మారు వెంటబడి భూపతుల జంపితి
వైరి భూములలోన గుమ్మడి నేరు నే నెరుగ-

పరగగా రాక్షసుల బాధకు విభ దేవతలెల్ల శరణని
కోర దశరథ రాజసుతుడై యవని జన్మించి
జలధి బంధనజేసి రావణు జంపి తి రణ మిమిలోపల
బలిమిగల యా గుమ్మడనియెడు మాట నే నెరుగా-

సంతసమ్ముగ రామకృష్ణులు సదయులై రేపల్లె వాడలొ
ఇంతులకు పదియారు వేలకు ఇష్టమొనరించీ
కుంతి సుతునకు సారధై తిని కురుబలమ్ముల నణచుచోటను
మంతనమ్ముగ గుమ్మడనియెడి మాట నే నెరుగా-

యుద్ధయోగము చేయు చోటను పణతులను చెరుపంగవలెనని
వృద్ధ బ్రాహ్మణ వేషముననే వేడ్కలమరగనూ
యుద్ధమున రాక్షసుల చంపితి ఉప్పతిల్లగ భూమి దెచ్చితి
యుద్ధ యోగమునందు గుమ్మడి చోద్యమే ఎరుగా-

మర్మమెరుగక కలియుగమ్మున మత్తులై నీచులను మించియు
నిర్మలాశ్వము నెక్కి వారల నణచి మోదముతో
ధర్మదేవతలనెడి రాజుల ధరణిలో నిలుపంగవలెనని
ధర్మయుద్ధములోను గుమ్మడి తెరవు నే నెరుగా-

చిత్తమును బహుచందములుగా చంద్రకళయును జలసమస్తము
సప్తరాత్రులు వుండినే వటపత్ర శయనమునా
హరియె గతియని అక్షయంబుగ నారదాదులు శ్రుతులు చేయగ
యోగమార్గమునందు గుమ్మడి పేరు నే నెరుగ-

మేదినియు మినొ్నక్కటగుచు మెందు జలముల దీళలు ములుగగ
మోదమలరగనుంటినే నా మొదటి రూపమునా
ఆదరమ్మున తిరిగి యంతట అమ్మ నే జగమెల్ల నుండితి
వెదకితిని జగమెల్లవేమరు గుమ్మడిని ఎరుగా

ఇంచుగలడా గుమ్మడంటివి ఎందుగలడో చూడుమాయని
వందనంబిడివేగ తన నోరు తెరవగనూ
నందనందను నోటిలోపల నాతిపొడగనె చరాచరంబులు
చంద్ర సూర్యులు మొదలుగాగల సకల దేవతలూ

వెరువవలెనని గుమ్మడంటని వెరచితిని నోరు మూయుము
చిరుతలను వెరపించు చందము చేస్తినో తండ్రీ *

బాల క్రీడలు



బాల క్రీడలు: ఆనలు బాల్యమే ఒక రసవత్తరమైన కమ్మని ఒడిలో రచించిన ప్రేమ కావ్యం: కృష్ణుని బాల క్రీడలా? ఆబ్బో- ఎంత పుంది గోపికలో ఆ కథలను కమ్మగా చెప్పి, మనకంటే ముందే చెప్పి-వాళ్ళే ముందు ఆ తన్మయత్వంలో మునిగిపోతారు-కృష్ణుడి బాలక్రీడలకు ఒక రాధేమిటి-ఒక యశోదమ్మేమిటి- ఒక గోపికే ఏమిటి? చెట్లు పుట్టలూ, రెమ్మలూ కొమ్మలూ పమిటలూ జడలూ పాలకుండలూ, యమునా నదీ తరంగాలు, చల్లగాలులు పిల్లగాలులు, ఎన్నో సాక్ష్యాలు కథల్లా కవితల్లా చెబుతాయి వాటి మధురామృతమే ఈ పాటలో వినిపించే చరణాల ఘనంఘనల మంజీరనాదాలు!

శ్రీ రమణీ విభుడూ సకలాశ్రితజనవత్సలుడూ
నారాయణుడూ నాతికి పురుషుడు
విను నందుని ఇంటా లీలా మానుష విగ్రహుడై
వినిపించెదనూ వృత్తాంతంబులు వినవేడుకలౌనూ
వాలాయముగాసూ ఇదుగో బాలక్రీడలసూ
నందుడి దేశమునా గోవుల మందానందములై
వందిబాడుచును మునుకొని వచ్చెను ముకుందుడుదయించె
కొల్లలు గోవులనూ తమ రేపల్లెవాడలోనూ
కొల్లలు గొల్లలు పాడగనేమిట కొదువలేదు సుమ్మీ
ముచ్చటవేడుకతో దాగుడు మూత లాడుకొనుచూ
మూత లాడుచూ నవ్వుచు కేరుచు కొంగుజార విడిచె
వకతె చేతిపండూ పుచ్చుకు వకతై భక్షించీ
పండు పోయెనని పకపక నవ్వగ పళ్ళు గిలకరించె
వుప్పళించె నొకడూ చెవులో గోప్యమాడె నొకడూ
ముక్కుపట్టుకూ మలయుచు వచ్చీ ముఖము చేర్చెనొకడూ
వకడే పోరాడీ తనమది వకడై రాగానూ
కూ అను పదమున అరుస్తూ మరి బెదరించెను వకడూ
గిరిగిరి గింతలునూ బంతులు వెన్నెల గాయగసూ
వడి బొంగరముల నెవ్వడిగలయా సుడిగాలి పడగలనూ
చిమ్మన చింద్రీలు ఇంతికి చిమ్ముగ జారగనూ
సమ్మతి గిరిగిరి పిల్లవాళ్ళను సందడిచూపులను
చిత్తజు బోణిరో దినదిన వన్నెలు హెచ్చుగ గంతులనూ
చెంగుచెంగునా వచ్చి యంతట చిటమటకాయలనూ
సమ్మతి కిచకిచ మేకపిల్లలే సందడి చూపులునూ
మేలుగ నాడుచునూ అవివక లీలలు వెన్నుడివీ
బాలురతో గోపాలుడు ఆడెడి బాలవినోదములూ
బాలకృష్ణుడిపుడూ తమ రేపల్లె వాడలోనూ
పుట్టు దొంగతన మెట్లు భరింతము పురుషోత్తము దలచీ

చోర విద్యనేర్చే మిక్కిలి చార విద్యనేర్చే
అతిప కృష్ణుని వార్తలు యశోద దేవికి జెప్పుదమూ
కలికి నీవు రావే చక్కని కంబుకంఠి రావే
మలయజగంధీ రావే నీవో మదనజనని రావే
ముద్దుగుమ్మ రావే నీవో మోహనాంగి రావే
పెద్దదాన రావె కళావతి ప్రేమావతి రావే
అని ఇంతులు తామూ పకర్ని వకరు పిల్చుకొనుచూ
మలయ సుగంధులు తల్లి యశోద దగ్గరికేతెంచీ
ఏమే యశోదా నీ కొడు కెంత చుండగీడే
మా మందిరమున గల పాలన్నీ మరిగి త్రాగినాడూ
బిరబిర వారింట్లో బిండెడు నెయ్యి త్రాగినాడూ
వెరువక మా ఇంట్లొ కడివెడు పాలు త్రాగినాడు
వెక్కసముగ తానూ వెన్నా గుక్క వీడకుండా
మిక్కుటముగా తిని మరివక్కా చెట్టు ఎక్కినాడే
తరి గుండల పెరుగూ తాగీ వట్టికుండ తెచ్చీ
పొరుగింటిడి మరి వారికి వీరికి కలహము పెట్టేనే
పెరుగు తరచగానే అంతట బిరబిర రావచ్చీ
వెరువక తన చెక్కిలి కజచెను కడు విపరీతము కదవే
గొల్ల వాడకేగీ మీగడ కొల్లగ తా తీనీ
గొల్ల చేడెలా మూతికి రాచెను పల్లపు పాణీరో
వెక్కిరించుకొనుచూ ఒక వృద్ధాంగన పట్టుకొనీ
చిక్కు పట్టుకు ఏదే అవ్వా శివమాడు మనెనూ
చిలిపి పనులూ అన్నీ చెప్పతరము గాదే
ముంచరె దేవుని బోనం వండితె ఎంగిలి చేసెగదే
మందయాన కొమ్మ కొలుపుకి ముందరి బోనములూ
చిందర వందర చేసినాడివీ చెల్లుబడే నటవే
అందముగా మేమూ వాకిట దేవర గొలువగనూ

పందిరి వేసితె కాళ్ళదన్నె మరి పాపముగాదటవే
ఇంపుతొ పోలమ్మా ముందర ఉంచిన పూపొరములూ
పెంపుడు కోతికి పెట్టివచ్చెనవి బిడ్డల పనులటవే
గోనబోయెడింట్లో చక్కని కోగలి పడుచునకూ
అర్ధరాతిరీ పొద్దుకాడ తేలంటవెట్టె గదవే
ఎల్లప్పుడు మమ్మా కలుసుకు ఎడబాయక ఉండే
గొల్ల నెలతలను గట్టిగ బట్టగ నీ కొడుకే మగడూ
వాసిగాను మా వయసులన్ని మీ వాడికి దుంబాలా
అని ఈ లాగుననూ గోపిక లంతా జెప్పగనూ
విని యశోదా దేవప్పుడు వారితొ మాట్లాడే ఇట్లూ
ఏలాగేలాగూ మావా డేమే మీ ఇంటి
పాలును పెరుగును వెన్న దినున మీ ఇళ్ళకు తానొ
పాలు నెయ్యి బోసీ గిన్నెలొ పంచదార వేసి
బాలకృష్ణచే కొమ్మన గిన్నెడు పాలయినా గొనడూ
ఏ కడుపున తాగూ మీమీ ఇళ్ళలోని పాలూ
వాక్రుచ్చంగా నోరెట్లొచ్చును శ్రీ కృష్ణుని మీదా
విన్నవారు కారా బిడ్డల కన్నవారు కారా
ఎన్ని సుద్దులూ పన్నే రే మా చిన్నవాని మీదా
కసిగందుని బట్టే మాటలు కల్పనచేయుదురా
చిన్నవాడు మీ పాపల బోలెడి పాపడుగాదటవే
గండము లిప్పుడునూ కలవే కలికీ కృష్ణునికీ
దండి రక్కసీ వచ్చిన యప్పుడు గండ మొకటి గడచే
బండిరాపు తప్పే అదివక గండంపై గడచే
మదులు విరువగనూ అదివక గండమె గడచే
వెల్లంబో మేమూ కంసుడు చేసిన మాయలకూ
చల్ల వేళ్ళనూ పూదుకు త్రాగుచు సమయము గడుపుదుమూ
తరణులార వీట్టే చూచితె దయలేదా మీకూ
ఓషించెద బాలుని దండించెద కోపము చెందకుడీ
అని వారలనెల్లా తమతమ ఇళ్ళకు పోనంపే

కూరిమితో యెశోదకుమారుని చేరగ పిలుచుకొనీ
ఎమిర శ్రీ కృష్ణా దొంగపనీలాగుశేయకురా
జారుడపని నీవూ భాషలు చాల చెప్పినారూ
ఏపు మీరగా జారుడనై తే అంతా ఎరుగరటే
కల్లలాడ టోకూ గట్టిగ దొంగవు ఇక నీవూ
తల్లికి నీకూ వెరపని పించగ దండించుట లేదూ
అనునయ వచనమునూ ప్రేమతో అపుడు గోపిదేవీ
విస్మృతి నొందుచు విడియం మేన శ్రీ గంధములలదే
నమ్మిన వారిని రక్షించేటి నారాయణ జోజో
మంగళకర జోజో కృష్ణా మా వల్లభ జోజో
స్థిరముగాను సిరులిచ్చి మమ్ము కావవయ్య జోజో *



కృష్ణ లీలామృతం

* కిన్నయ్య చేసిన అల్లరి ఇంతా అంతా కాదు- నల్లనయ్య అల్లరి చెయ్యలేదంటే ఆశ్చర్యం, రామయ్య అల్లరి చేశాడంటే ఆశ్చర్యం ! అతగాడు ఏం చేయకుండా విడిచి పెట్టాడని; విశ్వాన్నే నోట్లో దాచుకొన్న రాజకీయవాది. అనందాన్ని గుండెల్లో పండించుకొన్న రసవాది భగవత్ గీతామృతాన్ని ప్రజాళికి వినిపించినవాడే- మరి ఇన్ని చిలిపి పనులు ఎలా చేశాడా అని ! లేకపోతే యశోదమ్మకు ఇన్ని ఫిర్యాదులా చెప్పండి !*

వినవమ్మ యశోదమ్మ నీవరతనయుడు చేసేటి దుడుకుపనులు
పట్టి విచారింపబోతె భారత భాగోతమాయెను
ఎట్లనే ఇక ఎట్లనే, యశోదమ్మ ఎట్లనే ఇక ఎట్లనే॥
అయిదు ఏళ్ళ బాలుడు వాడెంతవాడు ఏమిచేసెను
మరుగుబెట్టక దాచక ఆ మర్మములనూ విప్పి చెప్పరె
చెప్పరే, చాటి చెప్పరే ఆ ఘాతలేమొ చెప్పరే చాటి చెప్పరె॥
దొరబిడ్డ అనుచు మేము దూరి చెప్పలేము కాని
చిరుతవారలు ఇట్లు సేయగ ఎరుగమెన్నడు ఇరుగుపొరుగుల
పోరి యడుగవె నీవె యడుగవె యశోదమ్మ నీవె అడుగు
ఇంత దుడుకు ఏమి చేస్తిని నావంటి వారు లేరమీకు
ఎంతకైన సాహసులు ఇంతులు
సందులోనూ చిన్నకోడలు జలకమాడుచు నుండగాను
ఇందు ఎవ్వరులేరు దానమిమ్మనీ చెయి ఒగ్గినాడు
ఆడవారి చోటికి మగవాడవై ఏమిటికి బోతివి
చిన్న పిల్లను దానమిమ్మని వేడ నీ కచటేమి ఉన్నది
ఏమిరా కృష్ణా ఏమిరా గోపాల కృష్ణా ఏమిరా కృష్ణా ఏమిరా
పండ్లు పండిన కిచ్చిలి చెట్లుండగా నేనందు కరిగితి
పండ్లు ఇమ్మని దోసిలొగ్గితి కాని నాకేమి తెలియదమ్మా
పెరుగు జిలుకుచు ఉండగా మరుగునను నిల్చుంటి వెన్నను
నాల్గుచేరల తీసుకుని తా బిరబిరను ఉరికేసినాడు
ఆడిగినంత వెన్న నీకు పెడుదును మన ఇండ్ల లేదా
ఇరుగు పొరుగూ ఇండ్లకేగి దొంగలీ తినబోవనేల
దేవరకును పెట్టలేదని ఆ వరకె అనుకొంటా ఉండిరి
దేవరేమొ మింగిపోయెను తెలియక నామీద పెట్టిరి
గొల్లపిల్లలంత గూడి చల్లలమ్మాబోవ కృష్ణుడు
గులక రాళ్ళతో చల్లకుండలు చిల్లులూ పడవై చినాడు

గొల్లపిల్లలంత గూడి చల్లలమ్మాబోవ సీవు
చిల్లరాళ్ళతో చల్లకుండలు చిల్లులు బడవైచినావట
చల్లగా ఆ సమయమందు వడగండ్ల వర్షము కురిసి కుండలు
చిల్లులేమొ పడినవీ చిల్లరాళ్ళని ఏలాగు చేతును
వేణునాదము ఊదుకుంటూ వేడుకలతో పాడుకుంటూ
లేగ పిల్లను పట్టుకోనీ బెదరబెట్టి వైచినాడు
సరసమైన సాధుపిల్లల గురుతుతోటి ఉండవద్దు
అంచె పిరికిపిల్లలొద్ద కెళ్ళి దినదినము ఫిర్యాదుతెస్తవు
అరుగుమీద చెలులతోటి ఆడుకొంటిని అంతకంచె
ఎక్కువ ఏమి ఎరుగనే ఓయమ్మలారా
నోటినిండా విడెము పెట్టుకు సీటుకాటుక చేరిరాగ
బాటలో నిల్చున్న కాంతకు పాపపై ఉమ్మేసినాడట
చూడలేదే అమ్మ నేడు చేడెలెక్కువ చిన్నవాళ్ళు
అడుకుంటూ ఉండి గోడబారుపై ఉమ్మేస్తె పడెకు
గడియగడియకు వచ్చినాడు సీటుగా కూర్చుండి వచ్చి
చెలుల మీద కన్నువైచి బుగ్గలను కొరికొచ్చినాడు
చక్కని శ్రీ కృష్ణ రమ్మని చెక్కిలికి ఒక ముద్దు నిమ్మని
రక్కసివలె నన్ను బట్టిన పక్కపన్నతాకె నేమొ
ఉట్టిమీద పాలు నెయ్యి చక్కగానే జుర్రుకుని తా
నెక్కువైనా పెరుగులంతా ఎంగిలీ చేసొచ్చినాడు
ఇరుగు పొరుగు ఇండ్లకూ పోవద్దురా అంచేసు వినవు
ఎరుగజేయుదు మాను మీ రోటికి కట్టివేతు నిస్నిక
నేను ఇంటిలో నుంచి పోలేదమ్మ నేడు కానిపోని
మాటలను కల్పనచేసిరి మగువ లిందరు నాదుపైని
నిన్న రాత్రి చలగాలి నీటి కూదుకుంచె మేము
భోటులా మా చెయ్యిబట్టి చాటునకు రమ్మనీ పిలిచె

చాకటనగ తిరిగి నీవు చిన్నవాడవై ఉండి
కన్నకడుపూ ఎట్లు ఓర్చును నిన్ను విడచీ కన్నతండ్రి
చెలులు చెప్పిన మాటలన్నీ స్నేహమై ఉన్నాయి నీకు
పామునైన పట్టి భాషలు చేసెదను నే నేమి ఎరుగను
గౌరి పూజచేసి కొలనిలో ఆడుకోపోతే కొలనులో
తాను వచ్చి మమ్మ కోర్కెలు తీర్చమనెను చోద్యకాడు
గోపివద్దకు పోవద్దురా అని అంటె వినవూ ఎన్నినాళ్ళు
తపసు చేసితి నిన్ను కంటిని తనయుడా ఓ చిన్ని కృష్ణ
చాకచక్యపు మాటలమ్మా అవి నమ్మికొట్టకా తిట్టకమ్మా
సాక్షులయితే చాల గలరు చాల చెప్పుదురమ్మ నీతో *



కృష్ణుని ముద్దులు సుద్దులు

*లక్ష గొల్ల వీధులున్నాయో లేదో గాని 16 వేల మంది గోపికలున్నారని నమ్ముదాం ! ఎందుకంటే - ఈ శతాబ్దంలోనే ఓ నిజాం గారికి సంవత్సరం పొడుగునా ఓ కొత్త భామే ఉండాలని జనాన్ని దోచి వారి కన్నుల్లో దాచుకొన్న కథలు విన్నప్పుడు ఆ కథనూ నమ్ముదాం- విందాం- సరే ! ఇంతమందితో ఎన్నెన్ని చిలిపి పనులు చేశాడో- పాపం- పితూరీలు చేసినట్లే చేసి-మనసులో నల్లనయ్యకు అర్పితులయిపోయేవారట ఇదే కాబోలు- మధురభక్తి. ఏది ఏమైనా జీవితం అంటే ఆ కొంటె కృష్ణయ్యదే ఆనాలి- కృష్ణపరమాత్ముడు చెప్పింది సత్యమైంది- పలికింది నిత్యమైంది- చేసింది నిజమై ఇలపై నిలచింది. *

ఈనాడు లీవాడ లేవాడ లనగా ఎన్న ఎనుబది లక్ష గొల్ల వీధులను
ముత్యాలు పగడాలు ముంగిళ్ళ నుండు రత్న మాణిక్యాలు రాసులైయుండు
పెరుగు కడవల వెన్న పేరిన్న నెయ్యి కలశములుగా నిండి కడమోసియుండు
అన్నమూ పాయసము అమృతాన్నములు జున్ను మీగడలకూ నిలయమైయుంతు
సంధాన కరణి సంజీవ కరణి వలనైన రంభయూర్వసి మేనకాది
సుందరులకు పరగ సౌందర్యమయిన శ్రీ లక్ష్మి ఘనమైన శ్రీ సమూహాలు
నల్ల కలువలకన్న నవకంపుమేను గొల్ల బాలురతోటి గోపాలకుండు
నంద గోపసుతుండు ఉండనిరవాయె గెండొ వైకుంఠమైయుండె రేపల్లె
చూడ నద్భుతమైన సుఖసన్నిధులు చూచి ఎరగని దా యశోద ఇట్లనెను
నాడు మీ ఇళ్ళలో నాదు కృష్ణయ్య పాలెల్ల త్రాగెనని పలవించినారు
నిన్న మా ఇంటిలో నిండుకొనియున్న వెన్న బాలుడి కడుపు కొన్నారగించె
బల్లిదుడు నీ కొడుకు పడతి వినవమ్మ కడవలతో వెన్న పాలారగించు
సంతుష్టి బొంది సౌభాగ్య సంపదలు ఇది చూడ చోద్యమే యశోదదేవి
తల్లి నీ కొడుకు ఈ తరముగాదౌట తొల్లి ఎరుగక మేము దూరితిమి అమ్మ
చిన తప్పులన్నియు కొల్లచేసితివి వినవె యశోదమ్మ విన్నపంబొకటి
ఘనుడు శ్రీకృష్ణుని సంకల్పమైన సంపన్నమౌట ఇది సాక్ష్యమ్ముగాదు
బక్క బిడుగైనట్టి బ్రాహ్మణోత్తముడు ముక్కుటుకులో రెండు ముడుచుకొనిరాగ
చెట్టబట్టి యతని చెయి తొణుకులాడి గీర్వాణపతి ఒక గింజ రాలించె
రోయక పొమ్మన్న రోళ్ళరోకళ్ళ కింద రాలిన నూక గింజేరుమనను
సక్తి జేసుకు వాని నతమారగించి సత్యవంతున కిచ్చె నిత్యవైభోగం
మిగుల ముప్పందుము మిరియాల బోనం అధిక పదార్థములు ఆయత్త పరచు
దుర్యోధనుల విందు దూరుగాచేసి పక్షపాతముచేత పాండవుల పట్టు
ధూసర అన్నమ్ము దోసవరుగులను విదురు నింటికి బోయి విందారగించె
చాల సౌభాగ్యము సంతుష్టి పొందు పుణ్యాత్మునీ బట్టి భువనములు మెచ్చు
చాలు పదపద కొడుకు జాణమెరుపులను ఎల్ల దేవతలెరుగుదురె యశోదదేవి
గొల్లలు గోవులును కొలుచుకొని రాగ తన నగరికేతెంచె తన సుతుడు తాను
వనితల ఒప్పుగా విందు చేయించి శ్రీ విష్ణుమూర్తయిన శ్రీకృష్ణమూర్తి
ఆ విశ్వమూర్తయిన ఈ కృష్ణమూర్తి ఆ యశోదాదేవి ఆలకించి పిలచె
అన్న రావే కన్న చిన్నారి పొన్న నాయన్న రావయ్య ననుగన్న తండ్రి

సొర మీనయిపోయి సోమకుని జీరి ఆ వేదముల కాచు అచ్యుతా రావే
ధరణి కుంగిననాడు దయతోడ నెత్తు కూర్మావతార శ్రీ గోవింద రావే
ధరణి శోధకుడైన దానవుని జీరి వరాహ రూపమయిన శ్రీ పల్లభ రావే
కంబమున వెడలి హిరణ్య కశ్యపుని గోర చీరివేసిన నారసింహ రావయ్య
బ్రహ్మచారయిపోయి బలిని యాచించి భూమి వలగొన్నట్టి వామనా రావే
ఇరువై యొక్క మారు క్షత్రియుల జంపి వ్రితను నడిపిన పరశురామ రావయ్య
రావణ కుంభ కర్ణాది రాక్షసాంతకుడా రాజైన దశరథరామ రావయ్య
వీర వ్రతములు చెరపి వైరులను గెల్చి తగవుల బుద్ధావతార రావయ్య
వెలి తురగము నెక్కి సజ్జనులగాచి కల్యాణ మూర్తివై కలికి రావయ్యా
కాళంగి భుజగవర కల్యాణ సంగ శ్రీరంగ జయరంగ శృంగార రావే
అక్రూర పాంచాలి అంబరిష వరదా పాండవ కృపవరద పరమాత్మ రావే
సుజ్ఞాన జనవరద సుగ్రీవ మిత్ర శ్రీబోణి శ్రీవరుడ సుందిరుడ రావే
బృందావన ప్రియుడ భూమి పతిపాలా నంద నందన గోపనాయకుడ రావే
నారద సనకాది వందన ప్రియుడ రాధాంగ నాలింగ నాధుడ రావయ్య
రావయ్య బలభద్ర రామకృష్ణమ్మ ఇనవంశ రత్నాల సోన రావయ్య
గోపికల రవరవలు పొందితివి నీవు నవనిధానములు నా నగరిగలిగుండు
అన్యాయములుచేయ అచ్యుతా తగవ పదునాల్గు భువనాల స్వామివే నీవు
నవనీతములు పాలు నాయంట గలవు పొరుగిళ్ళకే ప్రొద్దుపోకు నాయన్న
ఏలయ్య రాజ్యాలు ఏలువారలకు నీలవర్ణుడు నీవు నిందపడరాదు
కంటకములేల వైకుంఠ వల్లభుడ అంట కంటక మనసు అంటినట్లుండు
అంటక పూర్ణ కళలంటినట్లుండు ఇంటింటి వారు పొడగంటి మనేరు
దోష మెరుగని వాని దొంగ దొంగనిరి దొంగిల బోవుటలు దొరతనమె తండ్రి
ఇట్టి పుణ్యాత్ముడవు రట్టయితివన్న పట్ట భద్రుడవయిన పట్టినాయన్న
నరుల నెరుగను నేను నను రవ్వచేసి తొల్లి ఎవ్వరు నాదు తోవయెరుగారు
కోటబోయని చాన అనుచు తన పేరు ఎల్ల వారికి కల్ల యశోదనయితి
నిండారి నా ఎదుట నుండగా జూచి నిత్య కల్యాణమే నేడు నా ఇల్లు
బుద్ధుల మూట నా బుద్ధావతార ముద్దుల తండ్రి నా ముందరికి రావే
తల్లి వాక్యమ్ములా తా నాలకించి ఉల్లాసమున పొంగి ఉబుకుతూ వచ్చె
అడుగడుకును గజ్జెలందియలు ప్రోయ మొలగంటల ఘసి మువ్వల్లు కదల

కౌస్తుభము పులిగోరు కంఠనిగళమ్ము ముత్యాల రావిరేక ముందరతూల
మిద్దు గురియుచు తల్లివద్ద గూర్చుండె పసిడి కలశములతో నుదకంబు దెచ్చి
మువ్వచాయలు గడిగి మొగమొప్ప గడిగె కుమారుడైన గోపాల కృష్ణమ్మకపుడు
పరగ హారతులిచ్చి బహుమతుచ్చి యశోద పలుకు విని "యశోదదేవి"
అరయ కృష్ణావతారమయి రాగ మునులు తపసులు చేసిరి మునులు దేవతలు.*





ఆనందవల్లరిలో బృందావనం

బృందావనం అన్నా, గోకులం అన్నా ఒళ్ళు పులకిస్తుంది. మనసు రవళిస్తుంది- అలా తలుచుకొంటూ కాస్త సేపు ఉంటే ఉల్లము ఝుల్లనిపించే ఆ వేణునాదం మనసుని ఆనందతుందిలం చేస్తుంది. బృందావనంలో వికసించిన ప్రతి పువ్వుకి, ఎగిరిన ప్రతి పక్షికి, కాచిన ప్రతి కాయకి, చిగురించిన ప్రతి కొమ్మకి తెలుసు-ఆ వేణునాదంలో వేదనాదం ఉందని- విశ్వకళ్యాణ నాదోపాసన సప్తస్వర సంగీతమై నిలచింది. బృందావనం రాధ మధురభక్తితో- నల్లనివాడి కొంటెతనాల గుబాళింపులతో, చల్లనయ్య చిలిపి క్రీడలతో అదో రస జగత్తై భగవత్ విలాస మహత్తై భాగవత సాహితీ నము చ్ఛయంలో మందార మకరందమై నిలచింది.

శ్రీమద మబ్బృందావన విపిన క్రీడను కృష్ణుఁడూ
క్షేపుం బలరగ రాతిరి రెండో ఝూపమున ముదమునఁనూ
మానిత వేణువునూ అమృత సోనలు గురియఁగనూ
తరులు పల్లవించే కొండలు కరిగి సంచరించే
సరసులు పొంగి తరఁగభంగమున సంభ్రమమున మించే
మొదవులు హరిగనుచూ మీఁదికి మోమునెత్తుకునీ
కడలక నిలిచెను కర్ణపర్వములుగా చెవులను వినుచు
పాలుద్రావ మరచీ లేగలు కేళిముర్ళి యలరీ
లాలిత శబ్దామృతమును చెవులను గ్రోలుచుండి నిలచే
ఫణిగణములు కూడీ మీదికి ఫణములెత్తి యాడీ
ప్రణుతింపుచు నుండెను తపులోపల పరమ పురుషు వేడా
సలలితముగ జగమూ చుట్టూ చక్రవాళనగమూ
వఁగొని తిరిగె ప్రదక్షిణ పులరగ వెలయుచుండె ముదము
అందము మీరగనూ మరిమరి బృందావనమునఁనూ
మందర మధ్యమ తారశ్రుతులు తమ చందము తప్పకను ..
సరిగమ పదనిస లా బలుకుచు మురళీనాదమును
విరివిగ మధుర రవమ్ములు వెలయగ వేడుకచే దగనూ
విసుచు గోపసతులూ జేయు పనులు మరచి మతులు
వనజ ధరునిపై కలిగి వెలసిరీ మనసిజరసద్రుతులు
సంచగోపసుతునీ అమందానందము పెనచుకొని
అందరు నధరామృత ధారలు నొగి విందుల నిడుదమని
ఆ చెలులందరునూ పాలు కాచీ కాచకనూ
కాచినవి ఇవీ కాచని వనియను క్రమములు తెలియకను
పరగి క్షీరములనూ తోడులు పెట్టీ పెట్టకనూ
వర్ల దొంతులిడి ఘటములు వుట్ల నుంచి యుంచకను
పడతులు విరహమునా కూళ్ళు కుడిచీ కుడువకనూ
తొడరగ పూవుల దండలు కొప్పున ముడిచీ ముడవకనూ
దొరయ దేహములనూ తొడపులు తొడిగీ తొడగకనూ
సరసిజలోచనుపై వాంఛలతో సందడింపుమూను

ఇందుముఖులు గదలీ తమతమ మందిరములు పదలి
మందగమనములు మాని నదచిరభిమానములే వదలి
మెడలో హారములూ చిక్కులు వడిన శిరోజములూ
అదరెను శబ్దము ఘల్లుఘల్లునా అడుగుల నందియలు
మదన సరసములురా పయ్యెద లెదలో దిగిజార
పదములు తొట్రిల నదచిరి చెమటలు వదనములను వారి
కుచయుగములు గదల ముడిచిన కుంతలములు వదల
రుచిగని చేరిరి యమునానది దరి రూఢిగనున్నటులె
సందడు లాడుచును హరిగోవిందుని వేడుచును
చందన గంధులు నందనందనుని చరితము పాడుచును
కనిరి గోపసుతుని కన్నుల కరువుదీర వూని
వనజాక్షునికి ప్రదక్షిణ మొనర్చు వనితలుండ ధృతిని
ఇందుముఖుల పిండుగనుచా నందనందనుండు
ఇందుముఖుల కిట్లాయెన మరలి ఇళ్ళకు పోపొండు
ఇలు వరుసలు ద్రుంపి పతులకు నెలమి సిగ్గుజెప్పి
జలజాక్షులు వత్తురె చిత్తంబుల జారపనికి జొన్పి
వనితామణులారా జార వాంఛతొ రా మేరా ?
మనువులు చెడునూ మామలు వించే మహిలోపల గనరా
మగడు చూచితే నీ ప్రాణము తెగి చంపును వూనీ
మగువలార మీ రెచ్చట జూడరె జగములొ నెవ్వరిని
రూపసిగాడే నీ ధనము రూఢి గూర్చడే నీ
పతి విడుచుట దోషముగాదా ధాత్రిలోన తరుణీ
శ్రీపతి వచనములు విని యా గోప సతీమణులు
ఆపన్నత నిట్లని రా హరితో నలరి తత్తరముతొ
క్షితిపాలుడవీవె మాకు పతిపుత్రులు నీవె
మతి బూనుచు నీ దరికి చేరుటలు మాకు నేరమటవె
మనవి వినుము కృష్ణ మేమీ మదన సుగమోష్ణ
మనగ జాలము కౌగిలింపు మము వనితావరిధిష్ణ

తొగములుకులు దగిలి మిక్కిలి దగలచేత బొగిలి
నెగడజాల మధరామృత మిడుహరి తగ నీ దయగలిగి
ఎడనొగి దయనెంచి కౌతుక మొదవ కౌగిలించి
మదన కదనములు జరుపకయుంటె మనుదుమె నటియించి
గోపిక లందారూ విరహముతో పగచందరును
శ్రీపతి వెంటను తిరుగుచు నుండగ చూపడి ముందరను
అంతర్ధానమును కృష్ణుడలర భ్రాంతులను
కాంతలు దిరుగుచు నడిగిరి బృందావన భూరుహములను
కేతకి తరులారా తాళకింపుక ఝుటిలులారా
శ్రీ తరుణీ కుచకుంకుమ వహుడు పారడ మీ వార
చందన మందార పాటల చమరిక జంబీర
సందనండనుని జూచినారె మీ బృందములను వార
బిల్వ కందరాళ సాల బిల్వమహింత్తాల
శంబరరిపు జితసుందరహరి మీ చాటులనున్నాడా
మాధవపిచు మంద పనసమంగళ మాకంద
మాధవ కృష్ణుని జూచితి రట వె మాటల మీ క్రిందటవె
మొల్లమాతులంగ లుంగ మల్లికలవంగ
ఫుల్ల పద్మనేత్రుని జూచితిరే పొదలో నొసరంగ
కాంచనకర వీర కేసర కదళీ ఖర్జూర
పంచాయుధ జనకుని జూచితిరె పాటవములు మీర
ఓ చెలి ఇచ్చటను జూచితె పూచిన పువ్వులను
కోసి కొమ్మకిడె పదాంకములను గోవిందుడు దయను
పెదవి చాల ముద్దు గొనియె మదవతి కిటనిందు
పదములు నాలుగు నెదురుగ నున్నవి పణతి జూడుమిందు
శ్వేతలు హరిజాడ గనుచు వెన్నుండొగి చూడ
చేతో మోదమున నిట్టని వేడిరి స్త్రీలందరు గూడ

పాహిపాహి శౌరీ మన్మధ బాణతాపహారి
దేహంబులు శుష్కితిమి దయ దృష్టింపుము జేరి
చిత్తంబులు దూయ మరుడు క్రొత్తంబులు వేయ
తత్తరమ్ముపసి మూర్ఛల చాలమ నాదరమ్మ సదయ
సూటిగ చిత్తముల ముందు నాటిన గాయముల
వాటము దప్పక మదనుడు కృష్ణ వైచెను బాణముల
కరుణ జూడు కృష్ణ మరుడు నిర్దయుండు
శరుణ జొత్తుము వచ్చి కావవే శరుడు చంద్రముండూ
అన్నులు విరహమునా హరిని సన్నుతి సేయగను
వెన్నుడు కనికరమిడి నా కడను ప్రసన్నత నిలువగను
తప్పక కన్నులను కృష్ణుని కప్పరపాటులను
అప్పుడతుక లందరుగని చుట్టలరిరి మూకగను
కటిని బట్టెనొకతె కట్టిన పుట్టము బట్టెనొకతె
ఎటుబోయితివో కృష్ణా యనుచును ఎమటి గదిమె నొకతె
చెట్టబట్టె నొకతె బుగ్గలు పట్టి చిదిమె నొకతె
పట్టుకొనుడి యంచున పూ దీగెను గట్టుదమనె నొకతె
పక్క జెనకె నొకతే చెక్కిరి నొక్కివైచె నొకతె
చిక్కి లిడకుమము కృష్ణా యనుచును సేవించె నొకతె
కరపద్మము లొకతె పదయుగ సరసింబులొకతె
మురహరి బట్టిరి చనగలడనుచును మ్రోల నిలిచె నొకతె
హరిగొని బెనగుచును గోపిక లడగిరి ప్రియమునను
లాలితముగ ఖేల మోషస్త్రీల చిత్తముల
పూవిలుతుని పెంజాలి దీర్పను పాలకు డావేళ
అందరి కందరు నై గోవిందుడు సంధిలను
క్రందుకొనుచు చౌశీతి బంధముల కౌతుక మొదువగను
అమరీ కృష్ణా కేళీ వేత్రలు సమరతులను జేరి

అమిత మైన బ్రహ్మాండంబుల నలరిరి పరవశులై
ఇంద్రియ నిగ్రహత వెలసెను కృష్ణుడు సంగతిని
ఇంద్రాదులు వేల్పులు మూఁగలు ఎలమి గురిసె ఇటను
యమునా జలకేళి హరితో కమలనయన లాడి
కమలాక్షుఁ కృష్ణునిచే నాజ్ఞలు గైకొంచును గూడి
ప్రేపల్లెకు మరలి వచ్చిరి గోపికలూ తరలి
ప్రేపతి కరుణను సకల భాగ్యములు చెలగిరి ధరణిలో.*



విశ్వరూప దర్శనం

సకల చరాచరకోటిని తన నోటిలో చూపిన విశ్వరూపుడు కృష్ణ భగవానుడు- పాపం యశోదమ్మకేం తెలుసు- మన్ను తిన్నాడని నోరు తెరవమని కసిరింది చిన్ని కృష్ణయ్యని. అప్పుడనుకొని ఉంటుంది- అరే రోటికి కట్టాను, కొట్టాను, కసిరాను- ప్రతి చేష్టకీ ఆరా తీసి అల్లరివాడని నేనే రొస్టు పెట్టాను- అని ! ఎంత వాడైనా యశోదమ్మకు కొడుకే గదా మరి. అయన విశ్వరూప దర్శనానికి అక్షర మాలే ఈ పాట !

భారతసేనలూ పన్నిన్ననాడు పరమాత్ము ముఖం చూచి పార్థుండు పలికె
గాండీవమును విడిచి కవ్వడి తాను శ్రీకృష్ణునీజూచి రాజిట్లనీ పలికె
విల్లమ్ములను నిలిపి విజయుండు తాను సేనలోపల ఉన్న చెలువుడిట్లనెను
సేన మధ్యమందు శ్వేతవాహనుడు భిన్నుడై పలికెను కిరీటితాను
కేశవా కృష్ణమ్మ వాసుదేవూడా వామసుద వైకుంఠమేలిన స్వామీ
అసురులను బొక్కిగొన్న జనార్దనూడా అచ్యుతడ నాదొకటి విన్నపము దేవా
గోకులంబేలేటి గోవర్ధనూడా మందల పలగొన్న మాధవస్వామి
వెన్నుడా నాడె ఒక విన్నపం దేవ విన్నపము నా మనవి వినియవధరించు
పుత్రులూ పౌత్రులూ భ్రాతలూ ప్రజలు కడుమంచి చెలువులూ కలరిందు సుమ్మి
ద్రోణుడూ భీష్ములూ కృపాచార్యులు అశ్వత్థామ మొదలుగా ధార్తరాష్ట్రులు
ఆరువేల సంఖ్య వారైన జాంభవులు ఎనమన్మూరువేల వారు యుద్ధరాజుల్లు
తొమ్మిదినూరువేల వారు తురగ క్షత్రియులు పదినూరువేల వారు పట్టభద్రూలు
పన్నుగ పదకొండు అక్షోణిబలము అతిరథులు మహారథులు సమరథులు దేవ
అర్ధరథులను గెలువ నొల్లనుమిదేవ గురువులను పధియించ గోవింద ఒల్ల
బంధువులనందరిని భంగమ్ముపరచి రాజ్యంబువల్ల సుమి బావ శ్రీకృష్ణ
కప్పెర దయచేయి గంగకుసుబోమ వస్త్రమ్ము దయచేయు వనములకు బోదు
అని ఇట్లు అర్జునుడు పలుకగా వినుచు కలకలా నవ్వెనే కమలనాభూలు
రథముపై కూర్చుండి రమ్ము రమ్మనుచు చెయిచేయి చేర్చుకొని చినవ్యుతోసు
సుకరకుండలాల మణులుపై వెలుగ తాంబూల చాయల్లు ఒప్పుగాతేరా
కర్పూర వాసనలు వొప్పుగాతుళ్ళ కిరీటి ముఖంచూచి కృష్ణమ్మపలికె
ఎట్టెట్టు అర్జునా ఎమంటినయ్యా పగదాల పవనాలు పలికిరచ్యుతులు
వీరయ్యా ద్రోణులు వీరు భీష్ములు వీరెల్ల మీచేత చచ్చేటివారా
కర్ణుడు మొదలైన వీరపురుషుల్లు వారయ్యా మీచేత చచ్చేటివారు
అశ్వత్థామ మొచలుగా ధార్తరాష్ట్రులు వారయ్యా మీచేత చచ్చేటివారు
చంపుదురు మీరు మతి చచ్చేదివారు లేకుంటే వీరెల్ల బ్రతికేటివారా
వీరులు ద్రోణులు వీరపురుషులు వీరికి అనగాను చావెందుగలదు
వీరితో స్నేహంబు కారణంబేమి అనియేవి స్నేహంబు అదినాకు గలదు
ఏలయ్యా మా ఎడ భక్తులుగారా అర్జునుడు భారతము వొక్కడే గెలుచు
కోర భూములలోను క్షత్రియులనెల్ల సాధించి జయలక్ష్మి చేకొనిపోయె

భక్తుడౌ భార్గవుడు శ్వేతవాహనుడా ఇంకాను ఇక వొకటి ఎరుగవలెనయ్యా
క్షత్రియ ధర్మంబు ఎరుగవా చెపుమ శత్రువుల మిత్రులా చంపి రాజ్యమ్ము
పల్లనని పల్కుటా ఉచితంబె చెపుమ అధర్మములు శాయసని తలిస్తివే అయినా
అర్జునుడ నువు నాకు అన్యుడవు కావు యుద్ధభూమియందు క్షత్రియులనెల్ల
చంపించి జయలక్ష్మి చేకొనమందు అర్జునుడ అభివత్సలుడ
ఎట్టిదో నీ మాయ నే నెరుగనయ్యా చెప్పితే తెలియదా దేవ నీ మహిమ
పార్థుడా పల్లుమడ శ్వేతవాహనుడ తెలిపేను వినవయ్య దేవరహస్య
వృక్షాలలోకెల్ల విశేషమైనా అశ్వత్థ వృక్షమ్ము నేనెకిరీటి
చెట్లల్లలోకెల్ల విశేషమైనా కల్పవృక్షము నేను కవ్వాడి వినుమీ
వనములలోకెల్ల విశేషమైనా శ్రీతులసి వనమునగ నేనె కిరీటి
తరువులకెల్ల విశేషమైనా శ్రీగంధ తరువనగ నేనె కిరీటి
సంపత్సరాలలో విశేషమైనా విజయ సంపత్సరము నేనె కిరీటి
ఋతువులలోకెల్ల విశేషమైనా వసంతఋతువనగ నేనె కిరీటి
మాసాలలోకెల్ల విశేషమైనా మార్గశిరమాసమ్ము నేనె కిరీటి
పక్షాలలోకెల్ల విశేషమైనా శుక్లపక్షమనగాను నేనె కిరీటి
వారాలలోకెల్ల విశేషమైన భానువార సప్తమ్ము నేనె కిరీటి
దినములలోకెల్ల విశేషమైన దశమి ఏకాదశి ద్వాదశుల్ నేను
దానాలలోకెల్ల విశేషమైన అన్నదానం నేను అర్జునుడ వినుమి
ధాన్యాలలోకెల్ల విశేషమైన నువ్వులూ గోధుమలు తిలలందు నేను
పర్ణాలలోకెల్ల విశేషమైన బిల్వపత్రమనగాను నేనె కిరీటి
పద్మాలలోకెల్ల విశేషమైన అష్టదల పద్మమ్ము నేనె కిరీటి
ఆయుధాలలోకెల్ల విశేషమైన వజ్రాయుధమనగాను నేనె కిరీటి
పర్వతాలకెల్ల విశేషమైన మేరువు పర్వతము నేనె కిరీటి
గజములలోకెల్ల గారాబమైనా ఐరావతమనియేటి వీనుగున్నేను
అశ్వాలలోకెల్ల విశేషమైన ఉచ్చైశ్రవమనియేటి అశ్వమ్మునేను
ధేనువులలోకెల్ల విశేషమైన కామధేనువు నేను కవ్వాడి వినుము
పక్షులలోకెల్ల విశేషమైన వైనతేయుడ నేను వాసవాత్మజుడ
వాహనాలలోకెల్ల విశేషమైన గరుడవాహన మనగ నేనె కిరీటి
ఇంద్రులలోకాంతి ఇంద్రుణ్ణి నేను దేవలోకానికి దేవుణ్ణి నేను
బృహస్పతిని నేను బుద్ధుణి నేను ఈశ్వరుడు మహరుషులు బీభత్సనేను

పృథివని చెప్పగా పృథివంత నేను అంబరీషుడ నేను అర్జునుడ నేను
చెట్లలో తిరిగేటి సింహమ్మ నేను సృష్టిలో నేరేళ్ళు జంబూలు నేను
మహిమీద పారేటి మహానదులు నేను కర్తను నేనుసుమిభోక్తను నేను
హరుడన్న నేనుసుమ శివుడన్న నేను శంభుణ్ణి నేనుసుమ శంకరుడ నేను
క్షీరాబ్ధిచిలుకంగ పుట్టిన్నయట్టి పారిజాతము నేను అమృతము నేను
బ్రహ్మను నేనుసుమి భగవంతుడు నేను చంద్రుణ్ణి నేనుసుమిశంకరుడు నేను
అష్టమాదిక్కులూ అష్టసిద్ధుల్లు సప్తధాతువులనగ సర్వేఘడనగ
గంగయమున సరస్వతి బిందుశ్రేణి నేను బిండమాధవుడు నేను జగన్నాధుడేను
ఋగ్గువేదములకు ఋక్కుల్లు నేను యజుర్వేదములకు యాజ్ఞికుడ నేను
సామవేదములకు స్వరములు నేను అధర్వణవేదాని కాధారం నేను
యజ్ఞపురుషుడ నేను యాజ్ఞికుడ నేను యజ్ఞ సాధకుణ్ణేను యజమాని నేను
ధర్మయజ్ఞములు పూర్ణాహుతులుగొన్న పురుషోత్తముడి నేను కవ్వాడి వినుమ
కాశిలో చేసిన్న స్నానంబు నేను గయలోను పెట్టిన్న పిండమ్మ నేను
బ్రహ్మపద విష్ణుపద రుద్రపదములకు పితృపితరులకెల్ల పితామహుణ్ణి
ప్రేతపర్వతం నేను పితాళ్ళు నేను ప్రీతితో పెట్టేటి పిండమ్మ నేను
అక్షయమగుచున్న ఆవటము క్రిందా అర్పించిపెట్టిన్న అన్నమ్మ నేను
జ్ఞానమ్మ నేను వైరాగ్యమ్మ నేను వేదాంతవేద్యుణ్ణి నేనెకిరీటి
సంగీతవేద్యుణ్ణి సాధురక్షకుడ సకల విద్యలలోన కుశలుణ్ణి నేను
దుర్యోధనుడు మొదలు ధృతరాష్ట్రిపుత్రుల్ని దుర్యోధనుని బలము భూశిగాజేసి
ధర్మరాజ భీమనకుల సహదేవుల్ని తప్పించి చంపుదు సందేహంలేదు
దశరథుని పుత్రుడను శ్రీరామచంద్రుడ వాలిని చంపిన వారిజోదరుడ
ఏడు తాళంబులా వేసినావాడ సుగ్రీపుచుట్టమను శుభలక్షణుడ
సేతు బంధించిన సీతవల్లభుడ లంక సాధించిన రామభద్రుండ
స్వర్గమని చెప్పేది ద్వారకాపురము ఇదె వైకుంఠము ఇదె అయోధ్య
ఇదె పరమ పదము ఇదె వైకుంఠం ఇదె హరిద్వారమ్మ ఇదె నందనమ్మ
త్రైలోక్యనాధుల ద్వారకాపురము సకలలోకమ్మ్మల తల్లి పుట్టిల్లు
యాదవులు నందనులు యముడు ధర్మజుడు రుద్రుడు భీముడు నీ వింద్రుడవు
సహదేవుడు నకులుడు సరసఈశ్వరులు ద్రౌపది పార్వతీ ధనంజయా వినుమి
భక్తవత్సలుడ నేను భక్తుడవు నీవు చెలిమికాడవు గనుక తెలియజెప్పితిని

ఓంకారమని చెప్ప వుత్తముడ నేను అహంకార మనియేటి అర్జునుడ వీవు
మౌనంబు దాల్చేటి మురవైరి నేను శాస్త్రంబులను చెప్ప సరియొజ్జ నేను
సందేహములు లేవు సర్వశాసనుడ స్థావర జంగాలు అన్నీను నేను
మున్నూట ఆరువయ్యో తీరపతులు నేను ఆకాశం బ్రహ్మాండ మంతాను నేను
నూదిగుచ్చిన రంధ్ర మంతాను నేను నిమిత్త మాత్రాన నిన్ను నిల్పితిని
చెలికాడి కిచ్చేనే శ్రీ దివ్యదృష్టి విష్ణుడు విశ్వరూప మంతాను జూపె
శంఖాను పకచేత చక్ర మొకచేత శార్జమ్ము ఒకపద్మ మొకచేత బట్టి
కమలమును పట్టి శ్రీ కమలనాభూలు తపరు పెరిగెను బ్రహ్మాండ భాండమ్మునిండ
పాతాళలోకమున పాదములు పుట్టె పాదముల కిందనె భాగవతులు పుట్టె
మెరసెడి మీగాళ్ళ మేదినీ పుట్టె మడమల పుట్టేను మహాఋషి గణము
రోమరోమమున బ్రహ్మాండములు పుట్టె చెలువంపు చిరుతొడల దేవతలు అయిరీ
సూర్యులు ముఖమాయె చంద్రుల కాంతి శంకరుడు తనువాలొ ముఖమెంచి చూడ
అష్ట దిక్పాలకులు అవి రెండు వీనులు సమస్త నిధులు కుక్షియులు అయిరీ
సరసిజనాభుల నాభిలోపలను సరిగంగ గనె జాహ్నవుల గనెను
పంకజనాభుల నాభిలోపలను పలుపతలనగాను స్త్రీలందుగలరు
సువర్లోక భువర్లోక మహర్లోకమంత వెలసున్న విష్ణులోకమ్మును గనెను
పంచమ్మి నాయకి భగవతి దుర్గా మేరువనెగిరి మేదిని లోకమునా
ఈ భూలోకమ్ము ఈ ఏడు నదులు ఇంద్రుని నందన వనమందు గనెను
నంద వసుదేవుల నగరంబు గనెను పురిటి నాటి పూతకిని చంపిన్నయట్టి
పుండరీకాక్ష పురుషోత్తముల గనెను అన్న భద్రునితొ ఆడిన్ననాడు
అటుకులకు చెయిజాపు హస్తమ్ము గనెను అల్లప్పడాలున్ను అతిరసన్నాలు
చిక్కముల చల్దుల శ్రీహరుల గనెను చెట్లకు తగిలించి రోలును లాగి
మద్దులను గూల్చిన మాధవుల గనెను మందటావుల గండి మాధవుల గనెను
గోకులములోనున్న గోవిందు గనెను కంసుణ్ణి జంపియో మళ్ళీ వచ్చిన్న.
అచ్చదం పచ్చదం అగదవీధులను హారతులిచ్చిన ఆచ్చోట కనెను
తల్లి దగ్గరకొచ్చి త్రైలోక్యస్వామి మొక్కుతు కౌగలించిన ముద్దు కనెను
అర్జునుని దృష్టికీ అశక్యమాయె చూచి చూడాలేక సొక్కతా నిలచి
చప్పలించుకు లేచి ధైర్యంబు చెడరి దైన్య వచనంబున తనయుడిట్లనెను
లక్క గృహాలండు రక్షించినావు నేడు మము రక్షించు నీరజాక్షుండ

అహల్యా పాపనుచ ఆంబరీష వరద కరుణతో మముగావు గజరాజవరద
ద్వారావతినుంచి ద్రౌపది మానంబు సభలోను గాచినా దయజూడు మమ్ము
తల్లివి నీవు సుమ తండ్రివి నీవు తగినచుట్టము నీవు దాతవు నీపు
గురుమంత్రములు నీవు గురువువు నీపు లిమమంత్రములు నీపు తిరుపతివి నీపు
మందునీవే నాకు మహిమీదనైతే కమలనాభుడ నిన్ను కానలేనైతి
కమలాకరా పరద్ధ కంటిసి నేడు వొక్కడే అనుకుంటు వేడితినిస్వామి
బొంగరాలాడితిని స్వామినీతోను సయ్యాటలాడితిని సరసమాడితిని
పొత్తున కుడిచినా భోగేంద్రశయన భమిడి తామరపువులు పాదములబోసి
ప్రదక్షిణాల చేతామంచె చోటింతలేదు అర్జునుడు పట్టినా దేవదత్తంబు
మూడులోకాలకి వీనెయయతోచు పరమాత్మ పట్టినా పాంచజన్యంబు
మూడులోకాలకీ స్వర్గమయితోచు.*





పద్మవ్యూహ
లోకనం

అభిమన్యుని పరాక్రమానికి పద్మవ్యూహం ఒక పరీక్ష. ఆ పరీక్షలో ఈ చిన్నారివాడు ఏంచేస్తాడో, ఏంకానున్నాడో లీలా మానస విగ్రహుడైన నల్లనయ్యకు ముందే తెలుసు. తెలుసుండీ ఎందుకు ఆదుకోలేదో — ఆ రాజకీయం ఏమిటో భారతం తిరిగేసి చదివినా అర్థంకాదు. సమాధానం దొరకని ప్రశ్న అది.

పార్థుడ ఇటువిను పరమరహస్యము సూటిగ వివరించెదా
ఏటీకి ఈ భ్రమలు ఎల్లాజీవకోటి మాటిమాటికిజూడ మాయామౌ టెరుగావె
పాటిగాదిది ధర్మపద్ధతి ఏటికెరుగవు బుధులవాక్యము
బూటకంపు తనువునకె కాక పుట్టుచావులు సున్నసున్నా–
పద్మవ్యూహమనందు పడిన నీ సుతునికై పలుమారు విలపిస్తివీ
ఫద్ధతులెరుగాక పనరూటపనిగాదు అడ్డులేకబోయె అకటా లక్ష్మణుచేత
పద్మమును భేదించుటకునై పరమరహస్యము తెలియజాలక
వజ్రమున గిరివలెను వ్రాలితి వనుచు నీవిటు వ్యసనమొందుట–
ఋణానుబంధము రూపముచే వీరు క్రమమెరిగి వర్తింతురూ
ఋణముతీరినవెనుక క్షణమైన నిలువారు ఋణమున్న వేళలా చనుమన్నచనరయ్యా
కావునను పశుపత్ని సుతనిజ దేహములు శాశ్వతములనుకొని
కానజాలక పరమపురుషుని కర్మవాసనచేత చెడుదురు
వృక్షమండస శాఖ ఏనేకములు కలుగ ఉర్విలోపల ఫల్గునా
పత్రబీజమునే ప్రభవిల్లి కొన్నాళ్ళు విస్తరించి చాల విభముతోనుండి
పత్రసంపద క్రమముతాలగ పట్టితరువులు చదలకదలును
అట్లే మాయాతనువులకు నీ కేల భ్రమలూ పార్థివోత్తమ–
మృత్తికచేతను భాండాలనేకములు కులాలకుడు చేయును
నిన్నభాండములను అన్నీ పారవైచు ఉన్నావె ఉండూను వగజెందునా వాడు
ఆ విధంబుగ మట్టితనువని ఎన్నివిధముల తెలుపుచుంటిని
ఇట్టిమాయాతనువుతో నీ కెట్టి భ్రమలో పార్థివోత్తమా–
విజయ ఆర్జున విడుము విభవమతోడుత సతిసుతులను భ్రమలు
పర్ష ఋతువునందు పచ్చితరువులు రెండు కలసిసాగుచుండు క్రమముగ
వరదందు నదులు భిన్నంబైన తరువులు నాల్గుత్రోవల బోవుగదమరి
భ్రమల జిక్కుటు వగచుచుండక నిర్మలుండై మెలగమేలగు–
ఎన్నిజాతుల ఖగము లెన్నెన్నో విధముల వచ్చిచేరును వృక్షమూ
పన్నాగ ప్రాభాతవేళయందున లేచి ఎగసిపోవుచుంట ఎరుగమే మనమెల్ల

పొందుగా ఈ భూతములును పతంగ విధమని తెలిసి సీమది
తన్నుతా తెలిపేటి గురునీ మన్ననలతో గనుటమేలగు–
ఎంతకాలము కర్మశేషములుండునో అంతకాలము జీవమూ
వింతగా నిలుచుండువెతలా జెందనేల చింతలన్ని గురుపదములు చేరి
అ:తరంగపు దృష్టిగొని సుశ్రాంతి నొందియె పరము దెలిసియె
వింతలేమియు లేని బయలున వేడ్క–మీరగనుండు విజయా–
కిరీటి వినవయ్య ప్రీతితోనీకథ పాతకంబులు మాసుము
జాతస్యమృతమను శ్రుతివాక్యపద్ధతి ఆదినీకు తెలిసియు ఈతీరు సుతుడని
పాతకంబని తెలియజాలక బోటివలె ఇటు మెలగుచుంటివి
ఏటికెరుగవు బుధులవాక్యము బూటకంబిడి నమ్మజాలక–
పుష్పదామమురీతి పొల్పారుయవ్వనము భోగములస్థిరములు
సంపద అశాశ్వతచంచలవాయువు ఎంచిచూడబోక ఏటికి నిజమని
అంచయానను గూడుకొని ప్రపంచవాసన దెలియజాలక
మించిపలుకుచు ఆర్యులను యమకింకరుల బాధలకు లోబడి–
పార్థసారథి ఇట్లు బోధచేతెలిపెను పూజితుడై అర్జుననుకూ
భేదముతోడ మహేంద్రతనయుడు ఆధారంబుగ సుతుపై అశమానకయుస్న
ఫల్గుణా ఇటురమ్మటించును పరమవిమానాగ్రులై
గరుడగంధర్వ యక్షకిన్నెర వరులు పొగడగ సుతుని కలసిరి–
పార్థూద చూడుము ప్రఖ్యాతతనయుని హద్దులేటికి ఇంకనూ
అడ్డులేకపోయె అయ్యా నా ముద్దులయ్యా అనుచు కౌగిటనదుమపోగానే వారించి
అయ్యకనుగొని అతడు పలికెను నెయ్యమేమిటిది ఇప్పుడు నీతో
అయ్యలెందరో అయిరి నాకని అకట నను ముట్టవలదనె–
నాదు పుత్రుడవని నమ్మివచ్చితిగాని నీ కృపను నిజమింతే
కావునను గర్భవేదనచేతను పామరుడనైతి పరమాత్మ తెలియక
ప్రేమమీరగ నన్నుమాయలో తొలగత్రోయక వెలుగుచూపితి
పరమపదమును ఇచ్చిబ్రోవుము పన్నగేంద్రశయాన పాహిమాం–

శ్రీరాములవారి చరణములేనమ్మి చేసితి నీ తత్త్వమూ
వాసిగ నీభక్తి వైభవమలరగ భూసురకోటికి బుధులకు మ్రొక్కెద
మందహాసముతోడనే నిపు డిందిరారమణుని పదంబుల
డెందమెంచగ పరముగని ఆనంద మందుచు నుందు నిలపై*





గోమాత

*గోమాత!

భారతీయ ప్రపంచానికి దైవ స్వరూపం గోమాత.

ఆ గోగణాన్ని లాలించాడు, పాలించాడు గోపాలుడు.

అతని వేణునాదం వింటే చాలు గోగణాలు తన్మయత్వంతో నిలచి గోపబాలుని కోసం ఎదరు చూసేవి. గోగణాల మధ్య గొల్లవారిలో అల్లరివాడై కదకు ఎల్లరివాడైన కృష్ణుని కథే ఈ పాట - బంగారు మూట.*

గొల్లకృష్ణుడు వేణునాదము చేతబట్టుకు వూదుకొనుచు గోవుల మంద
పెంట నడచి

పొన్న పృష్ఠము చెంతచేర గోవులన్ని పొదలమారి కలసి మేయుచుండగానూ
పెద్దకాలపు ఆవులార పేరుపడ్డ మందలార కపిలయావు దూడలార
కర్రియావు చూడరావె తెల్లయావు పిల్లరావె బొల్లియావు నీవురావె
కామధేను కల్పతరువా శ్రీలక్ష్మి పేరిందేవి అన్నపూర్ణ విశాలాక్షి
తెల్లమచ్చ గోపురావె నల్లమచ్చ ఆపురావె చిన్నిఆవు దూడరావె
శనివారము విష్ణుప్రీతి పేరుపేరున పిలిచితాను బట్టివట్టి బిగియగట్టి
తెగనూడల చేతబట్టి శృంగారపు చెంబుపట్టి వెండిత్రాపు తెచ్చితాను
బంధనములు వేయుచూను గోవులకు పాలు పిదిగి గొల్లభామల మూపులందు
బెట్టి వారి ఇండ్లకనిపి చెట్టుయెక్కి పిల్లనగ్రోవి చేతబట్టుకు వూదుచుండగ
గోవులన్ని పొదలదాటి సకలదిక్కుల మేయుచుండగ తూర్పుదిశకూ కొన్నివెళ్ళి
గట్టుపైని మేయుచుండగ గొప్పనాదము చెవులబడగా అదురుకొంటూ
బెదురుకొంటూ

మేతమాని ఎదురుచూడగ గాండ్రు గాండ్రు మనుచు వేగమె పెద్దపులి
యొకడొచ్చి నిలిచి

నాదు పొలము పాడుశాయగ నేడువచ్చిన యావులార పోకుపోకుడు మేతమాని
చిక్కినారుగ నాదు చేతకి వారమొక్క జీవనునుగా గొంతు విరచి రక్తమెల్ల
గ్రోలి పొట్టచించి వేగమె కొవ్వుదీసి నారదీస్తు దాటిపోవా జూతురేమొ
పారిపోవ జూతురేమొ కురుచకొమ్ములు చిన్నయావుల నిడుప కొమ్ముల
పెద్దయావుల

పేరుబడ్డ యావులాను కోల్లకొద్దిగ తిన్నదానను నన్నువిడచి పారిపోతె
పెంటతరిమి చంపివైతును నాదుపొలమూ చేరిమీరు నాదుహారము దొరికినారు
నాదు పేరు వ్యాఘ్రము మాకుమీకు వైరమెందుకు నేను చెప్పిన మాటదాటక
బుద్ధిగలిగి యుండుమనుచూ బల్కగా నాయావులుంచు నిలిచి యుండబల్కుచుండె
పేరుపేరుగ నున్నయావులు వెనుకచేర నిల్వగాను వ్యాఘ్రమా వినుము నామ

ఒక్కమసవి చిత్తగించు మూడుదినముల కించట నేను కవలదూడల కన్నదానను
నన్ను పెంచి దాతలెల్లా పాలు పితుకు చుండగాను రెండు చూడలు పెంచుచుండిని
నాదు రాకకు దూడలెల్లా ఎదురు చూచును బెంగాతోను శలవు ఇచ్చిన
పాలు ఇచ్చే
పుళ్ళివచ్చి నీదు ఆకలి తీర్తుననుచు బల్కగాను నీదు మాటలు నమ్మినేను
పదలి వేయను నమ్ము నన్ను వ్యాఘ్రమును నేనుగానా అనుచు బల్కచుండెనూ
సకల దేవతలార వచ్చెద నాదుపుణ్యము ధారబోసెద నాదు కొడుకుల మీదుగాను
సత్యమైన తల్లిదండ్రి తోడునీదల మీద నేను సకల యానలు బెట్టెదాను
సత్యవాక్యము దప్పితేను స్వామిద్రోహము జేసినట్లు పుట్టినింటి వారికెల్లా
అత్త ఇంటి వారికెల్లా కీర్తి సంపద బోయినట్లు కల్లగాదు మాటనమ్ము
బొంకుగాదు మాటనమ్ము శలవు ఇచ్చిన వేగవత్తును కోరి మ్రొక్కితి దాపునా.
ఇన్ని విధముల కోరగాను గొప్ప యానలు పెట్టగాను పెద్దపులికి జాలి గలిగి
యడవిలోనా యానబెట్టి తప్పితేను ద్రోహమూలు చుట్టిచుట్టి తరుముకొచ్చి
నిన్నుబట్టి చంపివేతును గాన వేగమె వెళ్ళి నీవు నీదుకొడుకులకు పాలు ఇచ్చి
మళ్ళి రమ్మటంచు చెప్ప గంతువేయుచు చంగుచంగున దాటుకొనుచు
ఇంటి మొగమై
దొడ్డి చేరియు కవలదూడల చేరబిలచి పాలు ఇచ్చి తృప్తిపరచే బిడ్డలార
వేగవెళ్ళెద ఆడలిలోను మేయుచుండగ పెద్దపులియొక టొచ్చిబట్టగ బిడ్డలాకు
బుద్ధిగలిగి మసలు చుండుడి పచ్చిచేనూ మేయబోకా కాపుచేతిలో చిక్కబోకా
బొదచాటున మేయబోక - పులుల నోటి కందబోకా ఇండ్లలోనా తిరుగబోకా
కర్ర దెబ్బలు తినక మీరు కాపువాడు మేపబోవు బీళ్ళయందూ నించికనువు
కడుపునిండా తినుచు మీరు దొడ్డికొచ్చి నిద్ర జెందుడి పేరిందేవి మీనాక్షి
ఆదిలక్ష్మి అన్నపూర్ణా కామధేను కల్పతరువా పేరుబడ్డా గోవులారా
నాదుకొడుకుల మీరు చూచి ముందుకొచ్చిన పొదవబోకా
వెసుకకోచ్చిన తన్నబోకా
మందజేర్చుక బుద్ధిగలిగి నపుడేనే వ్యాఘ్రరాజా ఆకలి దీర్చబోయెనా

ఓ గోవులారా నాదు కొడుకుల దయతో జూడుడి తుంగభద్రా నదులలోను
స్నానమూడి భక్తిగాను దేవుని పూజించి లాను అడవి కేగెను ఓ జనులారా
చూడచోద్యముగాను యుండెనూ అన్నలారా చిన్నలారా ఆకలిగనుంచె దోషము
వ్యాఘ్రరాజా వేగపచ్చితి కోపగింపక నన్ను జంపుము కోటి గోవుల తిన్నదానవు
లక్షరుచులను ఎరిగియుండి సకలన్యాయము తేలిసి గడువు మీరక వచ్చినేను
బొబ్బలిడినా రావు నీవు తెలియజాలను ఓ వ్యాఘ్రరాజా వేగవచ్చి నన్ను జంపుము
ఆత్రుచ్చకొంటూ హడలుకొంటూ వచ్చి గోవు కాళ్ళకపుడు మ్రొక్కి చెప్పెను

వ్యాఘ్రరాజా

తల్లి నీవు లక్ష్మీదేవి అన్నమాట దాటనేరవు నిన్ను మించినవారు భువిలో
నీతిపరులా గానలేము నీదు చర్యలు విన్నవారలు చదువువారలు వ్రాయువారలు.
ఎంతమూర్ఖత ద్రోహులయినా పుణ్యమబ్బు మోక్షమందేరు ఓ జనులారా తప్పకను
చదువుచుండూడీ అనుచుచెప్పి ప్రాణమొదలెను బ్రహ్మవచ్చెను రుద్రుడొచ్చెను
విష్ణు వచ్చెను

ఇంద్రుడొచ్చెను సకలదేవతలు పచ్చిరి దల్లీనీవె మాతవునీవు నిన్నుమించిన
నీతిపరులా ఎల్లలోకము లందులేరు నీవుఉన్నా గ్రామమందు పంటలుపండు
పూర్తిగను నెలకు మూడు పర్షమూలు సకలజనులు సుఖమునొందెదరు
ఓ గోవులారా నీదుకీర్తిని జెప్పశక్యమా నీచరితము చదువువారలు విన్నవారలు
జూచువారలు కైలాసపదవి జేరిసుఖమును ఉందురనుచూ
మేముజెప్పినమాటలెల్లా శాశ్వతంబుగ జరుగుననుచును
చెప్పి వారిలోకములకు వెళ్ళినంతట యల్లయావు
మందజేరి బిడ్డలాకు పాలుఇచ్చి సుఖమునుండేను ఓ జనులారా
ఎల్లకాలము జపువుచుండూరు లప్పాటివింత ఈదనంటున జరుగురీతిగనూ *



గోపి మనోహరాలు

*ఆ లీలలు ఎవరికీ అర్థం కావు - లేకపోతే గోపికలకూ ఇళ్లూ వాకిళ్ళూ ఉన్నాయి - భర్తలున్నారు. మరి ? ఆ వేణువు పిలుపులు వింటే ఉల్లము ఝల్లు మనడమేమిటి ? మానసమై ఫలువలు సైతం మన్మథ పరవశలై కట్టుకోక పోవడమేమిటి ? కురులు ముడులుగా జడలుగా అల్లుకోను సరిగారాదం లేదట. ఆవును మళి ఎలా వస్తుంది - మనసు ప్రేమ గీతాలు పాడుతూంటే - గోపికా మనోహరాలు విడిసి విప్పారుతూంటే - విచిత్రం కదూ! అంత మంది గోపీమనోహరాల మధ్య సుమనోహరుడు ఒక్కడే - ఏమిటో దీని అర్థం - దీని పరమార్థం ? *

శ్రీపతి అపకారం మూర్తిని చిత్తంబున దలతూ
గోపిక గీతలనూ భక్తితొ కొనియాడుదు మదినీ
పరమును నీలాద్రీ రమణుని భావంబున నిలిపీ
గురుతుగ రచియించీ చెప్పెద గోపిక గీతలనూ
పొంకముతో శుకుబూ ఉత్తర పుత్రుని కిట్లనియె:
వేడుక వినుమిపుడూ ఈ కథ వృత్తాంతం బంతా
పరమాత్ముండైనా కృష్ణుడు వసంత ఋతువందు
సదయుడు గగనమునా పున్నమి చంద్రుని పొడగనెను
వికసిత వదనుండై కృష్ణుడు వింతగ వేడుకతో
ప్రకటితముగ యమునా తటమున పాడుచునుండగను
విని గోపికలంతా చెలగుచు వెలసిన వేడుకలా
మనసుల విభ్రమలయి పనులతి మరపున జేయుదురూ
గోవుల లేగల విడచీ అతివలు పరవశులై
గోవుల పాలన్నీ కాంతలు కాచీ కాచకనూ
చక్కని గోపికలూ మమతను సందడి తడబడిరీ
పతులను సేవింపా మరచిరి వారిజలోచనలూ
సరసపు రత్నములూ ముట్టరు సతులందరు భ్రమసీ
కాటుక కన్నులకూ నీటగు సూటులు దప్పచునూ
మూటికి తలకురులూ ముడువను వాటను దప్పదురూ
తరుణుల కురులందూ పూవులు తురుముట నెరుగరుగా
సరసాభరణములూ తనువున ధరియించరు చాలా
మేనుల మృగమదమూ గంధము చానలు పూయరుగా
మానముపై వలువా కట్టరు మన్మధ పరవశులై
మామ సహోదరులూ వగడూ మరదులు వలదనగా

ప్రేమతో గోపికలూ పచ్చిరి ప్రియుడగు హరికథకూ
పొలతుల కొందరినీ నాథులు పోనియ్యకయున్నా
వాచానా మేమెరుగము చేయిసంజ్ఞల చూపించే
హరింటిలో నొక్కా కీలడుగూమంచము పై
అలకగృహంబునకేగి సత్యాంగన బవళించే
తలుపుక్రిందా పామాయీ సర్వేశ్వరుడు తావెళ్ళే
ఇంతిచేతి వీవను పుచ్చుకతానేవిసరే
ఇందాకాలేని వింతా ఈ వింతావాసనలు
వింతవాసనలకు ముసుగుతొలగించి తాజూచే
హరియనితెలసీ భామామళ్ళి ముసుగులుబెట్టె
ఇంకన్నా రుక్మిణికి ఏమి చనువు ఇచ్చేనే
పదిమందిదాసీలే పణతి రుక్మిణీ గనరా
పదివేలదాసీలే పంకజాక్షినీ గనరా
నవరత్న భూషణములు నాతిరో నీ గడపలకు
కోమలిరుక్మిణిదేవికి భూషణమ్ములుసహలేవే
బంగారపుమేడలే పసిడిమిద్దెలేకొన్ని
సర్వరాజ వైభోగముసతి నీవాడనె నేను
మంగళవతులైనట్టి మగువుల కెల్లానిపుడు
శృంగారం ఎన్నడును చెదిరుండగరాదనెను
కలువరేకులబోలెటి కలికియే నీ కన్నులకు
రాటుకకన్నులనీరుగారుట ఇదియేమనెను
ఆ పలుకువిని చెలియా అతి దుఃఖమ్మునబలికె
అక్రూరుని నగరికి వింతలు ఆరగింతమనివెళ్ళి
మముబొంకించివేగ పనపగాఁవీరువెళ్ళి
అక్రూరడెసతియాయెన అతి వేగంబున మీరు

అక్రూరునిగని యాతని నడుమెక్కడ–నడిగితిరో
ముందుగ చెలులకు లంచము ఇవ్వకనే మోసపోతి
ఏకాంతపు గృహములకు ఏగిరీ మీరనెనూ
పచ్చలపతకముదెస్తిని పంకజాక్షిరో జూడే
అందుకొని ఆభామా ఆనందముబడుచునూ
సతిపతులిద్దరుగూడుక సంతోషముసుంద్రీ
నిద్రించెను శ్రీకృష్ణుడు నీరజాక్షియు వేడుకతో
అక్కడ వసుదేవకి తన ఆత్మచెలుల బిలుచుకొనీ
కాంతరో మన రుక్మిణికే నవమాసములు నిండే
శ్రీకృష్ణుడు లేడాయెను తోడుకరమ్మనిపలికే
సత్యభామ నగరికిని సరగున తమరేతెంచి
నిద్రించి ఉన్నట్టి నీరజాక్షుని పొడగాంచీ.



జలక్రీడలు

లీలామానస విగ్రహుడైన ఆ నందనందనుడు ఏ క్రీడ ఆడలేదని చెప్పగలం? ఆయన ఆడింది ఆట - పాడింది పాట. జలక్రీడా వినోదం పేరున నల్లనయ్య చేసిన సాహసం ఆ రోజుల్లో సరిపెట్టు కుందా గోకులం. ఈ రోజుల్లోనా—ఆబ్బో, తాటఒలిచేయరూ. ఆ క్రీడకు ఓ భక్తి ఓ ముక్తి అంటకట్టారు-రంగరించి .మధుర భక్తిగా సరిపెట్టుకొన్నారు-అతడు నడిస్తే అది నందనం - అతడు పిలిస్తే అదిగోకులం !

చెన్నరంగవాసా పన్నగశయన రంగధామ
కన్యలు జలక్రీడా కృష్ణుడు చిన్నెలుగావించి
రేపల్లెసుగలరే చక్కని గోపికస్త్రీ లెల్లా
ఏపునచెలరేగీ మామిడితోపున వ్రేలబడీ
ఆడుచు పాడుచునూ గుంపులుగూడుక వేడుకలా
చేడెలు ఈలాగు బహుజలక్రీడలు మదిదలచి
దేవుని సేవింపా వస్తురు గోపాంగనలెల్లా
చద్దులుగట్టుకునీ వస్తురు స్వామిని సేవింపా
శృంగారించుకునీ వస్తురు శ్రీహరిచూతమనీ
మట్టెలుపిల్లేళ్లూ బొబ్బిలి కాయలు విరనరెలు
చిటికెన బొద్దులునూ వేళ్ళకు చిత్తరించినట్లు
హస్తకడియంబులనూ చేతుల కంకణధారులను
వత్తుల జొకట్లు వేళ్ళకు పచ్చల ఉంగరాలు
మెచ్చిన కుంటినాలే మెడలను మునుపునతీగలను
చంద్రికి బొగవగసూ ఆణీ ముత్యపు ముంగరలు
కురులునున్నగదువ్వి చక్కని పాపిడి తీసుకుని
జాజులు ముడుచుకునీ కొప్పులు జారగబెట్టుకొని
కుంకుమ గంధాలూ మేనుకు పొంకముగానలదీ
పాపిటచేర్చుక్కా పగడపు భన్నస్నరములను
పసుపద్దిన చీరె పణతికి భమిడిపూ రవికె
కసములుగల చీరే వొంటికి గుతమైన రవికె
ఆవపూల చీరే మెరసెసి అద్దాల రవికె
సెనగపూల చీరే చేడెకు చంద్రకావి రవికె
ముచతలుగల చీరె నిండా మొగ్గలుగల రవికె
అంచులుగల చీరె మంచి అందమైన రవికె
బొమ్మంచుల చీరె పణతికి భొగవపూల రవికె

చలవచేసిన చీరె చక్కగ జవజనాల రవికె
చేడెలు ఈలాగూ తమతమ చీరలు రవికలును
శృంగారించుకు అందరు ఒక కొలనుకు వచ్చిరీ
చేడెలు ఈలాగూ పైపయి చల్లులాడుకొనుచూ
మొలబంటాయెను కుతుకబంటిలో ముచ్చటాడుచూను
ఆ కథ ఏలాగో తెలుసుకు నంతట శీఘ్రముగా
శ్రీకృష్ణుడు వచ్చి కొలనుకు చేరువగా నిలచి
చిరునవ్వులు నవ్వుచును చేతుల కన్నులు మూసుకుని
హరిహరి అను జలములలో నున్న ఆడవారి
పోరాయింటికి నీ ఓరి నీరజాక్షనీవూ
నేరములౌ గదరా మీ మగవారిట వస్తేను
ఇల్లాళ్ళముకామా మాగురు తెరుగక నీ గుండె
జల్లుమనదు జంకవు నీ వంట జంకించినారు
మిమ్ములను జూడ మీకును మేసబావగానా
నమ్మరె ఎందుకు దేవర అనియైన నాకుజూడనైనా
వలగొని చిక్కితిరీ నీళ్ళలో వాయువులే అదరె
జలములువెళ్ళి రారే మీమీ వలుపలు గట్టుకోరె
మగవారుండగనూ మేమటు మరియాదెంచుదమా
నేమగవాణ్ణటరే బాలుడ ఎరుగరటేమీరు
నిన్నెరిగేగాదా బాలుడ నీ కిట దాగితిమి
చాటుకు నేబోతే గొబ్బున మాటికి వెళ్ళికారే
మాటికినేవస్తే ఇంతులు వాటము కాదటరే
కొన్ని కొన్ని చీరలు రవికలు సచ్చట మూటలుగట్టుకొని
వడిగా చేరువలో చక్కని బొగడకు చిగురీకి
వలనల పువ్వుల కాయల కొమ్మల కనబడుకుండగను
ఇరుపుమీద ఒచ్చి కృష్ణుడు మరుగున దాగగనూ

ఇదియేమే ఓ అక్క ఇది విష్ణుమాయగదరే
వెతకిన లేవిచట చీరలు ఏమైపోయినవో
సుడిగాలొకటొచ్చి చీరలు చుట్టుకుపోయినవో
తడబడలేకున్న ఇచ్చట దొంగలు ఉన్నారా
అవునే ఓ యక్కా సీమాటాలాగే నిజము
మించెను ఓ తల్లీ నేనీ కర్మానికి వస్తే
కొమ్మలార వినరే తనపతి కోపథారికదరే
అమ్మరొ నేజెల్లా తనవిభుడంతకు భేరిధుడు
కానీలేవమ్మా ప్రాణముకన్నా ఎక్కువ
మానముపోకుండా ఇకపైమార్గము చూడరే
ఎవరుతీసేరమ్మా, లలన చీర లెవరుతీసేరమ్మా
చెలియ చీర లెవరుతీసేరమ్మా, సఖియా చీర
లెవరుతీసేరమ్మ మగువా చీర లెవరుతీసేరమ్మా
మనవన్నె చీర లెవరుతీసేరమ్మా, చీరెలజాడ మనకెట్లు తెలుసునమ్మ
ఎవరుతీసిరింతలోనె, ఇంతిరో నా పెండ్లినాడు
వివరముగ మావారు తెచ్చిన రవలపేటంచుల చీర
ఎవరుతీసేరమ్మవారు, ఇందరము మనముండగానే
సుందరి దదీమంచి చీరె సెనగపువ్వున్నంచు చీరె
ఈడువచ్చిన తరువాత వాడకేరమ్మని బిలచీ
చాటుగా నావిభుడు తెచ్చిన కోటలో బొమ్మంచు చీరె
అంగనారొ వినవమ్మ నే తొలిసమర్తయై యుండగ
పెదబావ తెచ్చిన కొంగిపూలున్నట్టి పట్టు
గంగాసాగరపంచు చీరె, ఎవరుతీసేరమ్మ
నాతి సన్నతడు గూడిన నాటినాతగు మామ తెచ్చిన
పోతపోసిన నిండు జలతారుపూలతో వెలిచెండ్ల చీరె
అక్కరోవినవమ్మ నే నీళ్ళాడినా ఇలువరుసగరిగిన
నిక్కముగ మామరది తెచ్చిన నీలి చంద్రకావి చీరె
వివరముగ మన గణపవరమున విశ్వధాముని సేవనాడు
పొంగుచును మన అత్తతెచ్చిన ముంగిపన్నెల రంగుచీరె

అంగనారో రేపల్లె రంగధాముని ప్రతిష్టనాడు
సంగతిగ మన అన్న తెచ్చిన చాల మల్లెపూల చీరె
కొత్తగాను నీవు నేనూ అత్తవారింటికీ బోగా
సత్తుగాను మనతండ్రి తెచ్చిన చిత్రవిచిత్రాల చీరె
ఎవరుతీసిరమ్మా, లలనా చీరె లెపరుతీసిరమ్మా
చెలియల చీరె లెవరుతీసిరమ్మా సాభియ చీర
లెవరుతీసిరమ్మా మగువ చీరె లెవరుతీసిరమ్మ
మన వన్నెచీర లెవరుతీసిరమ్మా చీరలజాడ మనకెట్లు తెలుసునమ్మా
ఆచబోయడ రారా, ఆవల కూచబోయెడ రారా
మాచబోయెడ రారా తీగ మల్లెబోయెడ రారా
అని ఆ గోపికలూ తమతమ పెనిమిట్లను బిలువా
కలగలిగున్నాడే కృష్ణుడు కాంతలు పిలువగను
వారిజలోచనుడా కేశవ నీరజనాభ వరే
పూరిజ గుణధామ కేశవ నారాయణ కృష్ణడా
శంఖచక్ర ధరుడా
చలిపెట్టెను ఇవ్వరా మాతో చలమేలరస్వామీ
కట్టి విడచినన చీరెలు బెట్టులేకా ముట్టుకుండివ
నీబుద్ధి నెట్లుదోచె పట్టణంబేలిన చంద్రుడు
పట్టువిడచి బెట్టుచాయక మా చీరలిట్లు ఇమ్మనిరీ
కట్టువిడచిన చీరలివ్వరా గోపాల పట్టపగలు అల్లరేమిరా
కట్టువిడచిన చీరలివ్వరా, గట్టిగా మావారువిన్నా
కొట్టిగానీ విడువబోరు పట్టుపడకా పో పోరా
మగడుమంచివాడు కాడురా, మా అతమామల,
మనసునీవు, మెప్పించజాలవురా మామనవిచేకొని పోరా
పొంచుండి మమ్మా వంచనలూ చేయబోకురా
అంచితార్థము లిస్తుమాని మంచి మంచి మాటలాడి
కొంచెపూ పనులాకు మమ్మికోరి నీవూ ఉండబోకుర
దండమూ బెట్టేము చూవరా, దయతోడమమ్మ

ధరణీవేలు ఏలుచుండరా.
కన్నివిన్నట్లూ కాంతలు తన్నిట్లాడగనూ
పొన్నమీద నుండి కృష్ణుడు పిల్లికూతకూసే
కూసిన గోపికలూ మెదలకు కూర్చుండిట్లనిరీ
మోసమాయెగదవే ఇక పె మూతలు ఏలాగు
మనకింకేటికి సిగ్గు కృష్ణుని మనమే అడుగుదము
అనుచును గోపికలూ పొన్నచెట్టుకి చనుదెంచీ
వకచేతను సిగ్గూ పయ్యేద వకచేతను మూసి
హరిహరి కృష్ణా దిసమొలనున్నా వలువలు ఇమ్మనిరీ
అక్కరతో మీరు రెండూ హస్తములను ఎత్తి
మొక్కినగా నివ్వనూ మీమీ చక్కని వలువలనూ
గోపికలంతా రెండూ హస్తమ్ములు ఎత్తిరమ్మా
శ్రీకృష్ణుడు చీరలు అందివగా సింగారించుకు వత్తురు రేపల్లె,
పొన్నమీదనుండే కృష్ణుడు కిందికి పడదూకి
తరుణులవెన్నంటి కృష్ణుడు తరుముకుబోగాను.

కృష్ణుని చలుదులు



ఎన్ని చిలిపి పనులు చేశాడో అన్ని మంచి పనులూ చేశాడు— కొంతె కృష్ణయ్య అనిపించుకోడంలోనూ— చేదూ ఒకరుచిలా- ఓ ప్రత్యేకత ఉంది. ఆసలు నాకు అనిపిస్తూంటుంది. చిన్నతనం ఎంత అల్లరిచిల్లరగా గడిపితే వయసు వచ్చేప్పటికి ఆతగాడిలో మంచి తనంతట అదే చిగురిస్తుంచేమోనని.

ఆనాడు యశోదమ్మ అనుకొనే ఉంటుంది- కన్నయ్య అల్లరి చూసి- పిడేం కాగుపడతాడని. కాని కృష్ణయ్య పరమాత్ముడై లోకాలకు సత్యబోధకు దొతాడని ఊహించలేదు కాళింది మడుగులో కాళీయమర్దనం ఏమిటి? కొండని గొడుగుగా గోవులను కాయడమేమిటి- ఇవి చిన్నతనాలా-

అందుకే ఆ నల్లనయ్య లోకోత్తరుడయ్యాడు- అందుకే కృష్ణుని సుద్దులూ చలుదులూ వినిపిస్తూనే ఉన్నాయి

సృష్టిలో వెలసినట్టి శ్రీ వాసిష్టులెల్లగొలువా
శ్రీకాంతుని వల్లభులకూ శ్రీమహిమలు విస్తరింత్రూ
వేడుక రెండే పదములు ఉభయాకారుండని పాడా
కాళింగమర్దనులకు ఘనమైన కల్యాణమ్ము
పంచ శతకోటియోజన విస్తీర్ణమైనా పృథివీ
ఆత్మారక్షించా ఉదయ మైతిరి రాజీవలోచనులు
చెన్నుగ గోపకుమాళ్ళూ చేకోలలు చేతనుబట్టుక
శ్రీ కృష్ణా గోవులుగాయను పోదామా ప్రొద్దునలేచి
అని విన్నపములు సేయగ అచ్యుతులూ మేలుకాంచీ
అవధరింపుతులేచి ఆనందమున పొంగీ
త్రైలోక్యవల్లభులు తమతల్లితో అనిరి ఇట్లూ
గోవులను కాయవలెను చాలా ప్రొద్దాయెను మాకూ
అనుచూ తన పట్టి లేపగ ఆనందమున గోపీ
అఖిలాండనాయకులనూ అంకించీ పిలచే తలీ
సకలకల్యాణా నిలయుడ సకలాగుణ శీలుడ
పరంజ్యోతి తేజోనిలయా బల్లిదుడ మేలుకో
శ్రీ పరమాకల్యాణూడా సృష్టికి కర్తవైనా
క్షీరాబ్ధి శయనుడైనా తనయుడ మేల్కొనరో
అమి వరదా శుభనిలయుడ ఆనందసాగరూడా
ఇందిరానంద కరుడా యదునందన మేల్కొనరో
గ్రాహము తాకిన కొలనా గజరాజు మకరిచేతా
ఆర్తిచే గొలువ భక్తి ఆలించివిన్నాదేవ
పాంచాలీ పలువలు వేగా దుశ్శాసనుడు సభనొలువా
అక్షాయంబుగ పలువల నొసగిన హరి కృష్ణా
పూతకి ప్రాణసంహార మాకల్లా ఉదయమైతి
క్షత్రీయవర్గము లణచిన పుత్రూడ మేలుకో
శశధరుడు అర్జునుడు దిశలెల్ల దృంచవేసి
ఆధారములేక అంతా వృక్షంబున నుండెనపుడూ
కమలాలోచనులు తమరు కరుణించి తలచనపుడె

శరణాగతుల రాజ చయ్యన మేలుకొనరొ
మత్స్యావ తారమున అచ్చుగ అసురుని చీరగ
చొచ్చి వేదములు నిలిపిన వేదా వేద్యుడ లెమ్మా
కూర్మావ తారమున కొండవీపున అని
అమరూల కమృత మొసగిన ఆది కూర్మమలెమ్మా
నట్టేడూ సముద్రములు ధరణీపై కలసీ పార
వసుధా కొమ్మున యెత్తిన వరహావతారుడా
అదరీ రక్కసులూ తమరు బెదర స్తంభమున వెడలి
హిరణ్య కశిపుని చంపు నరసింహావతారుడ లెమ్మీ

బాలప్రాయమున తనరు బలిచక్రవర్తీ నపుడు
మూడే పాదమ్ములు అడిగిన మురవైరి మేలుకో
కార్తవీర బాహులు వెయ్యీ ఖడ్గంబున ఖండించి
క్షత్రియ వర్గము గెలిచిన పరశురామావతారూడా
వాలీ మర్దనుడ వారధి బంధనుడ
సుగ్రీవ హితుడవైన సూర్యవంశుడ మేలుకో
సేతూ బంధానుడా శ్రీ లక్ష్మీ వల్లభుడ
రావణవైరివైన రఘునందన మేలుకొనరొ
గోపీ నందనుడ గోవర్ధనోద్ధారుడ

గోపికా ప్రాణవల్లభ గోపాలుడ మేలుకొనరొ
హలాయుధమ్ము బూని అన్నీ తీర్థములు తిరిగి
అవలీలగాను వచ్చిన బలరామావతార లెమ్ము
రుద్రునికి త్రిపురములు అగ్గాళమయ్యేనంత
మగనాళ్ళ మానము గొన్న బుద్ధావతారుడ
కాళంగి మర్దనూడ కౌస్తుభ హారమువేసి
కలియుగ దుష్టుల జంపిన కలికావతారుడ
అమి వరదా శుభనిలయుడా ఆనంద యోగనిద్ర
ఎప్పూడు మేలుకొంటిరి ఇదిగో గోపకుమాళ్ళు
అనుచూ తిరుబోనం దెరచీ చల్లారబోసెను చల్దీ
దధిచాల శొంఠీ వేసి మృదువుగా కలిపెను చల్ది

ఓ యమ్మా కలిపెను చల్ది ఒప్పా చిక్కములోనుంచీ
మృదువైనా పచ్చళ్ళన్నీ చల్దిపై నుంచెను తల్లి
వాక్కాయ వద్దికాయ వొప్పైన మామిడికాయ
వూరీన అల్లంతోను ఉసిరీ కాయను ఉంచె
చల్లించిన మిరియపు గెలలూ జన్మువుల పెరుగులతోను
అల్లమ్మ ఆవకాయ అనేకం వుంచెను తల్లి
చెన్నూ భావించీ చూచి శిరిపాదములు కడిగీ
ముద్దుతో ఒప్పునట్లూ ముఖపద్మ మొనరించె
నారికేళవు కురుల తలదువ్వి పాపిటతీసి కొప్పూ వొప్పుగ ముడిచే
చేమంతులు చంపాకములు చెంగల్వలు నడుమనుంచే
అతివీరులైనా మల్లెలు అనేకం ముడిచెను తల్లీ
వొప్పూగ కమల నేత్రి ఉభయా భాస్కరులకు
బాగుగా చందనమ్ము బలచందనం అలదే
కడువొప్పు పాదములకు గండూ కడియములుంచె
కనకంపు గజ్జెలు గట్టి ఘనమైన తొడుగులుంచె
మెరుగూ మొలనూళ్ళ బెట్టె మేలైన సొమ్ములు బెట్టె
అంగుళీయ ముద్రికలు మురవైరి కొప్పబెట్టె
వజ్రాగోమేధిక పతకం వైడూర్య రత్నాఖచితం
సువర్ణపతకం కృష్ణుని కంఠమున నుంచెను తల్లీ
పచులేని పచ్చాబొట్టు బాగుగా దిండే జుట్టీ
భమిడీకాదారీ దోపే తొమ్మండుగురు వెంటా నడువ
బాగుగా మళ్ళీచూచె బంగారం వొప్పె బిడ్డూ
నంచూని సుతుడూ వెడలె గోవులకాతా మనుచు
చిలకాలు పలికేటి మోత గోవుల కొమ్ముల మోత
గోపుల తరిమెటి మోత కాంతలు పాడే మోత
కోఎలాలు కూసెటి మోత పుంజూలు కూసెటి మోత

నెమళ్ళు ఆడెడి మోత నెమళ్ళు కూసెటి మోత
నాల్గోజామాయెను పొద్దూ నాథునికి విన్నాపములు
ఎత్తి మూడెత్తుల మోత ఉభయ పార్శ్వములయందు
ఏమీ భాగ్యముగలిగె ఈమంద జనమువారికి
త్రైలోకదాతా పతికి తల్లి యశోదాదేవికి
సర్వేశ్వరుడు పట్టినవేణు సంచారింపుచు విన్న
మాతృశ్రీ కార్యము తలచినమోతా
అనుచున్న దేవగణంబులు గగనమార్గములయందు
పుష్పంబుల వృష్టికురిసెను పుండరీకాక్షులమీద
యక్షాకిన్నర గరుడ గంధర్వ విద్యాధరులు
తుంబూరు నారదూలు స్తుతియించి మిమ్ము గొలువ
చెంగలి గడ్డిమేసి చేకొనుచు గోధనమంతా
యిందరపతి వద్దకువచ్చె మందల్ల నడుమనిలిచె
చిటిచిట్టి లేగాలన్నీ చెవులు రిక్కించి చూచి
చెలువూనీ జేరవచ్చె శ్రీ వేణునాదంబులకు
చిక్కంబున చల్దిదింపే చొక్కంబుగ వెండీవలేను

ఆగ్రజులు అందీ ముద్దలు అందంది వేయువారు
పదులేని పచ్చళ్లన్ని వుంగ్రాలు ఎగసనదోసుకు
వొప్పైన పచ్చళ్లన్ని వేళ్లనడుమకువేయ
బాలచంద్రుని చుట్టు చాల పరివేషంవలెను
కూడెదరు గోపకుమాళ్ళు మేలుగా ఒప్పేభక్తి
ప్రభాతసమయా మప్పుడు భాస్కరులు ఉదయమవగ
బ్రహ్మాండ కోట్లు వెలగ ప్రభుడూ చలిదారగించె
మవునంబున ఆరగించెను మధుసూదన హస్తములకు
పన్నీరు అవధరించెను త్రైలోక్య వల్లభూడు
పచ్చి పోకలతోను పండుతెల నాకులతోను
పచ్చకర్పూర విడియం పరమాత్మ డవధరించె

సావేరీ భూపాలమునా సరసిజ శ్రీరాగా
సర్వంబున నాదముబుట్టే సనకాదులు అంజలిబట్ట
సతులూ తమ సుతులను వీడీ సర్వేశ్వరును తగులుకురాగా
సతులూ తమ పతులను విడచీ సర్వేశ్వరు తగులుకురాగా
అందారు గొల్లలు కూడీ ఆలోచనలు సేయుచుండ్రీ
పెద్దావాడందరు గొల్ల పేదరికం తెలిపెను కృష్ణుడు
పండావాడంరురు గొల్లా పాపపు మాటలాడ
సతినైనా ఇచ్చేగాని సావంగనోపననెను
బింకంవు పరుడో గొల్ల బిరుదూ పాటించీ చూసీ
సతినిచ్చే కష్టంకంటె చచ్చుండుట మేలని పలికె
వివేకపరుడో గొల్ల వివరించి తెలిపెద మీకు
మన మెవ్వరు మన సతులెవ్వరు మధురాపురి కేగుద మనిరి
తల్లీ తండ్రీ కృష్ణుడు దాతా దైవము గురువు
అచ్యుతుడె మన కందరికీ ఆత్మాబంధుడని బలికె
కస్తూరి చుక్కచేది కన్నులా కాటుకబెట్టీ
కస్తూరి ఒక చెలియా కలయంగా పూసుకువచ్చె
వొచ్చేనని వొక చెలితాను హెచ్చూగ హారంతూల
వచ్చేనని ఒక చెలిపేరు గుచ్చార వేసుకొనుచు
కురులూ కుచములుగదల బరువేణి అమ్ములు గదల
జలజాక్షి కృష్ణుని జూచి నిలుపూ నిలుమని బలికె
కనుగీటుచు కృష్ణుడు నందన వనములొ పాలకువచ్చీ
కనకామండపమున కాంతా తెమ్మని బలికె
తెస్తీనిదేవర ఇది ఒక పూర్వాజన్మ ఫలమున
దొరకేనని పరుగూనా వచ్చెచెలి
వెన్నూడి వేణునాదం విన్నవారికి కన్నవారికి
సాయుజ్య పదవీగలదు సంసార భీతితొలగు
ప్రభాత సమయమప్పుడు భాస్కరుండూ రాగ
ప్రభు నీ చలికోలయి పుడిమనులు విన్నవారికి కన్నవారికి
సాయుజ్య పదవి గలదు సంసార భీతి తొలగు *



మేలుకొలుపులు

*మేలు కొలపడం అనే పద్ధతి, అన్న ఆచారం మనలో చాలా నమ్మకమైన ప్రధానవిషయం. ఎవరిని మేలు కొలుపడం? ఎందుకు మేలుకొలుపడం? ఎవరు ఎవరిని ఎందుకు మేలుకొలుపడం - తమ మేలుకోసం ఇంకొకరని మేలుకోమని ప్రార్థించడం, ప్రజలకోసం మేలుకోమని మేలుకొలుపులు పాడి లేపడం-బాగుంది! దేముడిని, గుడిలో విగ్రహాన్ని తెల్లవారు జామున మేలుకొలుపులు పాడి లేపుతారు - అంతదాకా అది ఒక నమ్మిక, ఆచారం అనుకుందాం. కాని శ్రీమన్నారాయణుడు అందరినీ, లోకాన్నే లేపుతాడు తన కిరణప్రసారాల ద్వారా. కాని అతనినే మేలుకొలిపి హుషారుగా ఉండమంటోంది-స్త్రీ హృదయం!

ఆడవాళ్ళు, వారి ఆచారాలు, నమ్మకాలు, వారి నోములు, వ్రతాలు, పూజలు, పునస్కారాలు, పాటలు చూస్తూంటే - మన నాగరికతకు స్త్రీ వాఙ్మయం ఒక నిఘంటువా అనిపిస్తుంది! *

బంగారు చెంబూతో పన్నీరు పట్టుకు
పడతి రుక్మిణి వచ్చే — మేలుకో-
రంగైన బంగారు కెంగేల బూనుకు
తరుణి సత్యవచ్చె మేలుకో—
దంతకాష్టము బూని తామరసాక్షి
సుదంత పచ్చింది — మేలుకో-
అంతకుముందే రుమాలు పట్టుకు
జాంబిపంతుని సుతవచ్చే — మేలుకో
పొందూగ కస్తూరి భరణి పట్టుకు
కాళింది వచ్చింది — మేలుకో
అందముగ అద్దాము పట్టుకు
మిత్రవింద వచ్చినది — మేలుకో
బాలభోగములు పంచాదార తేనే
భద్ర తెచ్చి ఉన్నది — మేలుకో
వాలాయముగ తాంబూలము పట్టుకు
లక్షణ వచ్చినిలుచున్నది — మేలుకో
ముదముతో వీణ వాయింపుచు
నీరజవదన వచ్చె — మేలుకో
పదహారు వేల గోపికలు
సొగటాల పాళి దెచ్చి ఉన్నారు ॥మేలుకో॥

వైకుంఠవాసా

కేశవ అని నిన్ను వాసీగా భక్తులు
వర్ణించుచున్నారు లేరా !
వాసవ వందిత వసుదేవ నందనా
వైకుంఠ పురవాసా లేరా !
॥—తెల్లవార వచ్చెను లేరా॥

నారాయణా నిన్ను నమ్మిన వారినీ
కరుణాబ్రోతువు గాని లేరా !
శరణన్న విభీషణాదులను బ్రోచిన
బిరుదు నీకున్నది లేరా ॥తెల॥

మాధవాయని నిన్ను యాదవు లందరు
మన్నించు చున్నారు లేరా
మందర గిరిధర మణి భూషణధర
సుందర రూపుడ లేరా— ॥తెల॥

గోవింద యని నిన్ను గోపికా లందరూ
గొల్ల వాడందురు లేరా
చల్లని చూపులు తెల్లాని నామము
నల్లని నా సామి లేరా— ॥తెల॥

హృషీకేశ భూమీన మంచివార్తలు దెలుప
వచ్చి కూర్చున్నారు లేరా
ఖరదూషణాదుల ఖండించినటువంటి
కరుణా కటాక్షుడ లేరా ॥తెల॥

పద్మనాభుడ నిన్ను పద్మభవాదులు
భారుడనియేరు లేరా
పరమ పావనమైన తారకనామము
నమ్మి గొలుచుచున్నారు లేరా ॥తెల॥

దామోదర నీ నామమె దిక్కని
దాసులున్నారయ్య లేరా
దాసాను దాసులపు దయతోటి బ్రోచేటి
ధర్మము పాలింప లేరా ॥తెల॥

సంకర్షణ నామము స్వామి దాల్చినావు
సరవి తెల్లవారె లేరా
భామామణి సత్యభామ రమ్మంటు
భామను పంపింది లేరా ॥తెల॥

వాసుదేవ భక్తవర జనపోషక
వసుదేవనందన లేరా
కంస సంహారక కలుషము లెడబాప
కరుణా కటాక్షూడ లేరా ॥తెల॥

ప్రద్యుమ్న నామూడ ఖర్జూర ఫలములు
కానుకాలొచ్చాయి లేరా
కానుక లందూక కరుణతొ బ్రోచేటి
కరిరాజపరదూడ లేరా ॥తెల॥

ఆదిదేవవరద అసురసంహారక
అనిరుద్ధనామూడ లేరా
అఖిల జంతువులకు ఆహార మియ్యాలి
ఆదినారాయణ లేరా ॥తెల॥

పురుషోత్తమానీదు పుణ్య చరిత్రము
భూమిలో వెలసింది లేరా
శరణాగతత్రాణ బిరుదునీకున్నది
శశిధరసన్నుత లేరా ॥తెల॥

అనుదినంబును భక్తజనులను బ్రోచెడి
అధోక్షజా నీవు లేరా
ఘనమైన రుక్మిణి కానుకలంపింది
కరుణా బ్రోతువుగాని లేరా ॥తెల॥

నరసింహరూపము నరుదుగ దాల్చిన
నరహరి రూపుడ లేరా
నారదాదిమునులు నమ్మి కొలిచెదరిదె
నందతనూభవ లేరా ॥తెల॥

అచ్యుత మాధవ అసురాంతకహరి
అమరేంద్ర నందిత లేరా
స్వచ్ఛమైన శేషయనుడందురు నిన్ను
జగదేక నాథుడ లేరా ॥తెల॥

శ్రీ జనార్దన నిన్ను సేవింపవలెనని
శ్రీ రుక్మిణి వచ్చె లేరా
సుందరముఖులతో సొక్కి నిద్రించేవు
సొంపెల్ల దెలిసేను లేరా ॥తెల॥

పాపపురక్కసి పాలు ద్రావినట్టి
ఉపేంద్రనాముడ లేరా
పాపాములన్నియు పారద్రోలినట్టి
భవ్య చారిత్రుడ లేరా ॥తెర॥

శ్రీకృష్ణునీ తోడ చెలులందరుగూడి
జలక్రీడలాడేరు లేరా
చెలులవలువలన్ని చెట్లు బెట్టినట్టి
శేషాద్రివాసుడ లేరా ॥తెల॥

నల్లనీ నాసామి

తెల్లవారెనమ్మ చెల్లనే నేమందు
నల్లనీ నాసామి లేరా !
మరల పడుకొనేవు మసలుచున్నావు
మర్యాదగా దిగిపోరా ॥తెల్ల॥

కలకలమని పక్షూలన్నియు కూసె
కాంతూడ ఇక నిద్రలేరా
జలజారికాంతూలు వెల వెల బారెను
తలుపు తీసి చూడవేరా ॥తెల్ల॥

తరుణులందరు లేచి చల్లాచిలుకు వేళాయె
తడవుండరాదింక లేరా
అరగంటి చూపుతో నట్టిట్టు చూసేవు
నెరజాణ వౌదువు లేరా ॥తెల్ల॥

గోపీ మనోహర గోవర్ధనోద్ధార
నాపాలియదుపీర లేరా
కాపురము కొత్త గడుసుదీమాయత్త
నీకు పుణ్యముంటుంది లేరా ॥తెల్ల॥

గుసగుస మాటాడకూడదంటే నీవు
గుప్పెత్తుచున్నావు లేరా
పసితనంబేగాని పెద్దరిక మూ లేదు
బాగాయె నిక చాలు లేరా ॥తెల॥

బాలగోపాల శ్రీలోల సత్కృపాల
వాలధర్మ లేచి రారా
చాలు చాలీరీతి ప్రొలుమాలగనేల
వేళాగాదూ లేచి పోరా ॥తెల॥

పొమ్మంటున్నానని బుద్ధినానెంచకు
పొద్దు లేదని యంటి లేరా
దీపకాంతులెల్ల తెలతెలనయ్యేను
దేవదేవ మేలుకోరా ॥తెల॥

ఈరేడు లోకములు నీ నోట తలికి
నెరుగ జూపిన స్వామి లేరా
కారుణ్యమూ ర్తి నా నేరములెంచాక
కరుణించి లేచిపోరా ॥తెల॥

నీ జగన్మోహన రూపము కనులార
చూడంగ లేచిరారా ॥తెల॥

అమ్మా సీతమ్మా

అమ్మా సీతమ్మా మా యమ్మా
ముద్దులగుమ్మా
అమ్మ బంగరుబొమ్మ లెమ్మా ! ॥అ॥

అమ్మరో ఇమ్మాగ
అరుణోదయంబాయే
అమ్మల కన్నమ్మ లెమ్మా ! ॥అ॥

భక్తులందరు లేచి
ప్రార్థించుచున్నారు
భక్తాపరాధీన లెమ్మా ! ॥ఆ॥

భక శిఖామణి
పావణి అరుదెంచె
ముక్తిప్రదాయినీ లెమ్మా ! ॥ఆ॥

బ్రహ్మాండ మలరంగ
బ్రహ్మాది సురులెల్ల
ప్రార్థింపుచున్నారు లెమ్మా ! ॥ఆ॥

బ్రహ్మ రుద్రాదులు
ప్రస్తుతి సేయంగ
బ్రహ్మ స్వరూపిణీ లెమ్మా ! ॥ఈ॥

మేలుకొలుపుల నడక, శైలి, అందలి అర్థం చూడండి :

* * *

మేలుకో సుగుణాల
వాలా జానకిలోలా
భక్త పరిపాలనా
మేలుకో ! ॥మే॥

వాలాయముగ మమ్మ
పాలించు వేళాయే
ఓ వైకుంఠవాసూడా
మేలుకో ! ॥మే॥

తీరైన కస్తూరి
తిలకంబు జారిందీ
తీర్చిదిద్దావలె
మేలుకో ! ॥మే॥

భేరి మృదంగాది
వీణాది రవమూలు
భోరూ కొలుపసాగె
మేలుకో ! ॥మే॥

అతివశిష్టాది మునులు
మీ కృపగోరి
పాత్రులై వున్నారు
మేలుకో ! ॥మే॥

పారిజాతా కుసుమా
మాలికా చేబట్టీ
నారదా మునీ పచ్చె
మేలుకో ! ॥మే॥

ఇదీ మేలుకొలుపేగాని, ఇదో వరుస !
జాజిపూల జలకమాడి
పాలవెళ్ళి పాలకెక్కి
అత్తఇంట నడుగుపెట్టి
మొగుడు రాగ మొగముదాచి

ఎందు కింత సిగ్గుపడుదు
వేల నీకు ఇంత సిగ్గు ?
తాడిచెట్టు తలనుదన్ని
తాత నీడ తరిగిపోయె

నిదురలెమ్ము నిమ్మకాయ
కళ్ళువిప్ప కందపిలక
త్వరగ లెమ్ము తల్లిగాదె
చిలుకవచ్చి చెట్టుమీద

పిలుచుచుండె పిల్ల నిన్ను
వేగలెమ్ము వెన్న ఇదిగొ !

పాడుకోడానికి అంత ఇదిగా వుండదు ఇది - మేలుకొలుపులు అనగానే భూపాళరాగంలో గొంతెత్తి పాడుతుంటేనే వినాలి - అందలి సంగీత సుధా రసాన్ని ఆస్వాదించాలి !

లాలిపాటలు



లాలిపాటల కమ్మదనం, జోలపాటల సొగసు, ఉయ్యాల ఊపుల హాయి తెలియని వారుండరు- జీవితంలో ప్రథమఘట్టం- వీటితోనే ప్రారంభం! లాలిపాట- విని హాయిగా నిద్రించే పాపలకు అందలి కమ్మదనం, తియ్యదనం బాగా తెలుసు- వారు చెప్పలేకున్నా- ఆనందం అనుభవించగలరు! చెట్టుక్రింద ఏ కొమ్మకో చీరకట్టి అందులో పాపడ్ని ఊపుతూ పాడినా, పెద్ద మేడలో పట్టు ఊయ్యాలలో ఊపినా బాలలకు ఏం తెలియదు- ఇద్దరూ వినేది లాలిపాటనే, ఊగేది ఉయ్యాలలోనే- హాయిగా నిదురించేందుకే! ఒక్కొక్కప్పుడు ఈ జోల, ఉయల పాటలను వింటుంటే పెద్దవాళ్ళకే కునికిపాట్లు వస్తాయి- అటువంటివి ఎన్నో పాటలు ఉన్నాయి. చూడండి వీటినే ఇంగ్లీషులో ''లల్లబీ'' లంటారు, హిందీలో వీటిని ''లోరి'' అంటారు!

లాలిశ్రీ జనలోల
లీలా వినోదా
లాలి ద్వారకపురీ
దాల గోపాలా!

తొలుత బ్రహ్మాండంబు
తొట్టిగా వేసి
నాలుగూ వేదములు
గొలుసు లమరించీ!
బలువైన ఫణిరాజు
పాన్పు లమరించీ!
చిత్తమనిమేటి
దూలములు వేసి! ॥లాలి॥

అందముగ జాంబవతి
చందనము పుయ్యా!
పొందుగా కాళింది
పూవు లందియ్యా!
మందయానయు రాధ
మనపులందియ్యా!
ఇందుమతి లక్షణా
విజామరెయ్యా! ॥లాలి॥

చుట్టుగోపస్త్రీలు
తొట్టె నూచంగా
కోటరంగారాజు
కోర్కెలొసగంగా ॥లాలి॥

మరో జోల పాట:—

జోజో ముద్దులబాలా
జోజో పరమసుశీలా
జోజో భారతపుత్రీ
జోజో పావనగాత్రీ ॥జో॥

చిన్న మోమూ చిన్నబోవా
కన్నులూ చెదిరి ఏడవనేల
కన్నతల్లి కారణమేమొ
కన్నులు మూయవె కనకపు బొమ్మా! ॥జో॥

దంతపు టుయ్యాలలోను
ధగధగ మెరిసేటి పానుపుపైనా
చింతలేకా నిదురబోవా
ఇంత యాగడమేలతల్లీ! ॥జో॥

పాలుత్రాగీనాడేవాడూ
పాదపలయును సీతాచెరిత
కన్నతల్లీ కారణమేమే
కరములెత్తీ ఆడవెతల్లీ! ॥జో॥

ఈ నిదురపాటను వినండి:

నిదురా పోడమ్మా
మా రామయ్యా!
బెదిరీ నాడమ్మా
నిదుర పోడమ్మా!
మదవాతీ తానెంతో
నిదురబుచ్చిన గాని
బెదరీ బెదరీ చూచు! ॥ని॥

లోలాక్షిరో పశి
బాలాలతో గూడి
ఆడుకోబోగానే
గాలి సోకినదేమో ! ॥ని॥

మచ్చికతొ నెంతొ
గ్రుచ్చి కౌగిలించి
చిచ్చికొట్టి నా కన్నులు
విచ్చి విచ్చి చూచు ॥ని॥

కలలోనా యాపది
తలలావాడూ వచ్చి
ఎదుటా నిలచీనటుల
పలువారింపసాగె ॥ని॥

ఖరదూషణాదు
దురవస్థలను చెందీ
పరమపురుషులు చూసి
పరితాపామొందేను ! ॥ని॥

హేతువా దెలసియా
భూతావైద్యుని పిలిచి
నాతీ రక్షారేకు చేతాగట్టిన గాని
గట్టిగా మనము వశిష్టుని
పిలిపించి దిష్టివిభూతై నా
నుదుట పెట్టాగానే ॥ని॥

పచ్చిపసుపూ సున్నం
తెచ్చి వసంతం చేసి
ఎర్రని నీళ్ళుపోసినాగాని ॥ని॥

మేలుకోడాని కే
యూరకుండాడూ
వాలాయ:ముగ
వేంకటచలపతి! ॥ని॥

పౌరాణిక విషయాలతో కూడి నడుస్తూండడం కూడా వీటిల్లో మనం వింటుంటాం!

కృష్ణుని సంబోధిస్తూ పాడే పాట ఇది :

లాలీబాల కృష్ణాలాలీ
లాలీయనుచు బంగారుయ్యల నీకువేసిరి
వయ్యారముగాను గొల్ల

తొయ్యలెల్లనూ చేదారయ్య కృష్ణయ్య
ముద్దులయ్యా నెయ్యాముల్లార ॥లా॥

నీటుగల తొట్టి బాలుడాటమాని నిదురపోర
సాటిలేనిమాట వేలా
కోటిరత్నాలా మూట! ॥లా॥

తెల్లవార గొల్లపిల్లలెల్ల
నిన్నల్లుకొనచు
నుల్లముల్లసిల్లూనటా
నెల్లా సేవింతుగానీ ॥లా॥

లేచి, నిదురపోవాకున్నా
బూచివారాలొచ్చినిను
దోచుకొనిపోదూరు
నే నోచిన నోములపంట ॥లా॥

భామాలే మొదలే లేమ
మీ మదినికోరి నార
రామలలామలను
ప్రేమదీర పెండ్లిచేయ! ॥లా॥

ఈ 'లాలి'ని పరికించండి—

బాలగోపాల రార
ఉయ్యాల లూగ! ॥బాల॥

బాలగోపాలను రార
పాలూవెన్నార గించా
నీలాపర్ణుడ రారా
కాళింగ మర్దనుడ! ॥బాల॥

బంగారు తొట్టెలోనూ
చెంగావిమెత్తావేసి
శృంగారించెదను రార
ఓరోరి కృష్ణా! ॥బాల॥

గొల్లావారిళ్ళలోనూ
కుండా పెరుగారగించి
దండితనము సేయకురా ॥బాల॥

అండజానా రక్షక
పుండరీకాక్ష వరదా
పళ్ళు పాలూ పెరుగు
మన ఇళ్ళనే కలవు దేవా! ॥బాల॥

మంగళ వీణా
వాయిద్య సంగీతమ్ములే
పాడుచు పొంచు తొట్టెలోను
రంగయ్య నిదురపోరా ॥బాల॥



సవతుల సంవాదాలు



సవతులు :

అంటేనేచాలు - అబ్బో - బోలెడన్ని అనుమానాలు - అవమానాలు - ఆక్రోశాలు - పట్టింపులు - వంతాలు, సాక్షాత్తు పరమాత్ముల కుటుంబాలలోనే సవతుల గిల్లికజ్జాలు ఇంత ఎత్తున ఉంటే - సామాన్య మానవ మాత్రులలో సవతుల కయ్యాలు ఓ లెక్కా ? గంగ గౌరీ సంవాదం వింటూంటే-ఓ గరళ కంఠా ఎలా వేగావయ్యా - అని అనాలని - ప్రశ్నించాలనీ అనిపిస్తుంది. ఏమో - మన ప్రశ్నలకు సమాధానాలు - ముఖాముఖీలో చెప్పడానికి ముఖ్యమంత్రా ? సినీ నటుడా - మన భ్రమ కాని.

సంవాదాలు అన్న పదంలోనే ఇద్దరిమధ్య చర్చ అని ధ్వనిస్తూంది. అయితే ఇవి పాటల రూపంలో - మాటలు పొడిగిన సంవాదాలు. ఈ సంవాదాలు ఎక్కువగా పౌరాణిక గాథలతోనే సడుస్తాయి. దేవదేవుల మధ్యనే - కుటుంబాల తోనే కలతలూ, అనుమానాలూ గూడుగట్టుకొని, భర్తను భార్య, భార్యను భర్త నిలవేసి-బిరిగీసి, అడగడం, హడలు గొట్టడం, చివరకు సరేలే ! అన్న పద్ధతిలో సంవాదం ముగియడం జరుగుతూంటుంది.

తలుపులు దగ్గర పాటలనేని - అనగా పెళ్ళిళ్ళలో పెళ్ళి కొడుకునీ, పెళ్ళి కూతురినీ ద్వారం వద్ద నిలిపి తలుపుదగ్గర పాటలని పాడుతూంటారు-వీటిలో కొన్ని ఇవి !

సంవాదాలుగా జరిగే రాయబారాలు కొన్ని "తడిక రాయబారం", "చిలుక రాయబారం", "చందమామ" రాయబారాలు కొన్ని కనుపించకనూ పోలేదు !

ఈ క్రింది సంవాదం అనుమానంతో కూడిన లక్ష్మి-విష్ణు సంవాదం ! విష్ణుమూర్తిని నిలవేసి లక్ష్మి ఏమని అడుగుతూందో-ఇద్దరిమధ్యా సంవాదం ఎంత పట్టుగా జరుగుతూందో చూడండి !

కలికి కపాటము
బంధన చేసిన
కారణమేమే లక్ష్మి - నీకు
కారణ మేమే లక్ష్మి !

కారణ మేమని
అడిగెవు నీ మది
తెలియలేద ధవళాక్షా - మరి
తెలియలేద ధవళాక్షా ?

తెలిసీ తెలియక
చెంచిత చేరితి
పంతమేలనే లక్ష్మీ - నీకు
పంతమేలనే లక్ష్మీ !

కొంచపు జాతని
చెంచిత సవతిని
చెంతదీరెనో సామీ - నాకు
చెంతదీరెనో సామీ !

జిలుగు పుటేదల
చీరలు తెస్తిని
చెంతచేరవే లక్ష్మీ-నా
చెంతచేరవే లక్ష్మీ !

జిలుగు పుటేదల
చీరలు తెస్తే
చెంచితచేరును పోవోయీ-నీవు
చెంచితచేరును పోవోయీ!

చేపట్టు చెల్వ బంగారు
రవికలు తెస్తినె
జాగుసేయకే ధవలాక్షీ-నను
చేరనీయవే కమలాక్షీ !

జాల్వారు బంగారు రవికలు
చెంచిత కిచ్చిన
వేలుపు స్వామీ-నీ విచ్చిన
వేలును స్వామీ!

ఇప్పపు బంతులు
ఇంపుగ తెస్తిని
ఇంపుగ ఏలవె లక్ష్మి-నను
ఇంపుగ ఏలవె లక్ష్మి!

ఇప్పపు బంతులు
ఇంతి చెంచితకి
ఇస్తే ఏలును స్వామీ-నిను
ఇస్తే ఏలును స్వామీ!

మల్లెపు బంతులు
మగువరొ తెస్తిని
మన్నించవె లక్ష్మి-నను
మన్నించవె లక్ష్మి!

మల్లెపు బంతులు
మగువ చెంచితకిస్తే
మన్నించేలును స్వామీ-నను
మన్నించేలును స్వామీ!

రవ్వలు చెక్కిన
రాగిడి తెస్తిని
రానియ్యవె ఓ లక్ష్మి-నను
రానియ్యవె ఓ లక్ష్మి!

రవ్వలు చెక్కిన
రాగిడి తెస్తే
చెంచితకివ్వగదోయీ-నీవు
చెంచితకివ్వగదోయీ!!

గరిమిష్టమ్మున
గండభేరుండంబులు
గాసిబొందితెనె భామా-నేను
గాసిబొందితినె భామా!!

గండభేరుండంబులు
గాసిబొందితే
చెంచిత ఏలును స్వామీ - నిను
చెంచిత ఏలును స్వామీ!

శరణే శ్రీహరి శరణే లక్ష్మి
శరణంటిని గైకొనవే - లక్ష్మి
శరణంటిని గైకొనవే!

కొత్త పెళ్ళికొడుకై నీవూ
వర్ధిల్లుము వసుధేవా - స్వామీ
వర్ధిల్లుము వసుదేవా!

పద్మగంధి నీ పాదములాకు
వందనములు పదివేలే - లక్ష్మి
వందనములు పదివేలే!

నవ్వుతూ శ్రీలక్ష్మి వాకిలి తీసెను
గడియ తీసె వరలక్ష్మి - అపుడే
గడియ తీసె వరలక్ష్మి!

మగువ జనక తన
మగుపని తోడుకొ
మందిరముల కేతెంచెన్!

మహా విష్ణువుకే భార్య చేతిలో అంత పని జరిగితే సామాన్యుల సంగతి కేమిటి చెప్పండి ?

గౌరి ఎక్కడికో బయలు దేరింది. చెలిక త్తెలు చూని ఎక్కడికని అడుగు తున్నారు. గౌరికీ, చెలిక త్తెలకూమధ్య జరిగే ఈ సంవాదం ఎంత ఇంపుగా, సొంపుగా ఉందో వినండి :—

ఘల్లు ఘల్లున పాద
గజ్జెలందెలు మ్రోయ
కలహంసా నడకాల
కలికి ఎక్కడికే ?

జడలోనూ గంగాను
ధరియించుకొన్నట్టి
జగము లేలే సొంబ
శివుని సన్నిధికే !

బొత్తూ మల్లెలు జాజి
దండాలు మెడ నింద
అందా మెరిగిన జగ
దాంబా ఎక్కడికే !

అందాము విభూతి
అలరూ గంధాము
నలచిన నీల
కంతేసు సన్నిధికే !

తళ తళ మను రత్న
తాటంకములు మెరయ
పసిడీ మండలముల
ఫణితీ ఎక్కడికే !

కలియుగ జన్మము
గల శివుడైనట్టి
గురులైన శంభు
శంకరునీ సన్నిధికే !

పెచ్చుపాపటా బొట్టూ
రత్నా కిరీటమ్మూ
ఏమమ్మా కరుణా
కటాక్షి ఎక్కడికే ?

కడుపెద్ద రుద్రాక్ష
మెడలో హారముదాల్చి
నందీనెక్కెడు జగ
ధీసు సన్నిధికే !

ముఖమున చిరుసవ్వ
కల ఎరుపు కుంకుమ
రేఖా చెలిసెడు లోక
మాతా ఎక్కడికే ?

కంఠాన కాల
కూటమ్ము ధరియించుకు
మండలా మేలే జగ
ధీమా సన్నిధికే !

చెంగావి చీరలూ
చెంగూన జారంగ
రంగైన నవమోహ
నాంగీ ఎక్కడికే ?

చంద్రుని శిరసూన
ధరియించుకొన్నట్టి
మండల మేలే
సందీసూ సన్నిధికే!

సన్నంపు నడుమూపై
బిళ్ళాలా ఒడ్డాణం
మెరిసేటి బంగారు
బొమ్మా ఎక్కడికే?

కిన్నులు మూడూ
భుజంబులారూ
అంబాలుగల అర్ధ
నారీసు సన్నిధికే!

అభయ హస్తములచే
కరకంకణమురాజ
వరమూ లిచ్చేటివారు
గౌరీ ఎక్కడికే!

—శివుడు అక్కడక్కడా తిరిగి ఇంటికి వచ్చాడు. తలువులు వేసున్నాయి - పిలుస్తున్నాడు. తలుపవతల పార్వతి సుంచుని ఏమంటుందో వినండి.

శివభక్తులకే దయగలవాడను
శివచందురు నాపేరు - సాంబ
శివుడందురు నా పేరూ!

శివనామంబులు సకలెందుల జెల్లును
చేరికతో ఉంచనోయీ - శివ
చేరికతో ఉండవోయీ!

వడిగినలందిన కుంతనలొసగెటి
ఉరపతి దరుడనె గౌరి - నే
ఉరపతి దరుడనె గౌరి !

ఉరపతిధరుడవై తె ఏలాయెను
వడలుకడకు పోవోయీ - శివ
వడలుకడకు పోవోయీ !

బలానరాముడు బలసతినడిగిన
బలదిందుడనే గౌరీ - నే
బలదిందుడనే గౌరీ

బలదిందుడవైతే ఏలాయెను
భక్తులిళ్ళకు పోవోయీ - శివ
భక్తులిళ్ళకు పోవోయీ !

కొమరుగ గంగని జటలోనించుకు
కొమరజంగాన్నే గౌరీ - నే
కొమరజంగాన్నే గౌరీ !

కొమరజంగమైతేమాయెను
కొమరులిండ్లకు పోవోయీ – శివ
కొమరులిండ్లకు పోవోయీ !

కాశిలోపల మోక్షములొసగెటి
గంగాధరుడనె గౌరీ - నే
గంగాధరుడనె గౌరీ !

వాశికియేలాగై తిరగేమీరు
వార్నాసివై ఉండవోయీ - శివ
వార్నాసివై ఉండవోయీ !

పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళగానే ఇవి తేలేదు, అవి తేలేదు అని కోడలిని వేపుకుతినడం చాలా చోట్ల వింటుంటాం. వింతకాదు, విడ్డూర్యముకాదు అలవాటైపోయింది. సుభద్రకూ అత్తవారింట అటువంటి సమస్యే ఎదురౌతుంది. సుభద్రను అర్జునుడు ఏమని అడుగుతున్నాడో వినండి.

పున్నెంబునాడైన
బూరెలొండుకొనీ
పుణ్యీద రమ్మని
పిలచిర మీవాళ్ళు !

అమవాస్య నాడైన
అట్లువండుకొనీ
అల్లుడా రమ్మనీ
పిలచిరా మీవాళ్ళు ?

అని భార్య సుభద్రను దెప్పిపొడుస్తుంటే తను సమాధానం ఇస్తూంది :

మావాళ్ళా పేదవాళ్లూ
మాకేమి కలదు ?
పెట్టగల పెద్దింటి
పెళ్ళాడితానూ
అచ్చటలు ముచ్చటలు
అన్నీ తీరేనూ !

భార్య మాటలకు సహించలేకపోయాడు పార్థుడు.

అనగావిని పార్థుండు
అతి కోపమునను !
ఎడమ మీసందువ్వి
పొంకోడుతో తన్నె !

అప్పుడు సుభద్ర ఏంచేసిందనుకొన్నారు ?

మువ్వలా ముదృష్టి
చంకా బెట్టుకొని,
పున్నమా చంద్రుడ్ని
వెంటా బెట్టుకొని
వెళ్ళినే సుభద్ర
అన్న వాడలకూ !

చెల్లెలు సుభద్ర నడిచి తనవద్దకు రావడం గమనించిన అన్నకు ఆశ్చర్యం కాక మరేమిటి ?

ఏనుగులు వుండగ
గుర్రా లుండంగా !
పల్లకీ లుండంగ
బానిస లుండంగ !
కాలీ నడకనురాను
కారణం బేమీ ?

అన్నతో సుభద్ర చెప్పుకుంటూంది.

అన్నారో వింటీవ
అన్నారో నీవు !
ఎన్ని మాటలు నేను
పడతి ఇటువస్తి !
.....
... .

అర్జునుడు తనను అన్నమాటలు పూస గుచ్చినట్లు అన్నకు చెప్పింది.

అటకమీ దున్నాయి
అంచు బిందెల్లూ
ఇదిగోనే చెల్లెలా
నీకు హరణమ్మ

మందాలో ఉన్నాయి
పాడి ఆవుల్లు
ఇదిగోనే చెల్లెలా
నీకు హారణమ్ము !

పసుపు కుంకుమ నీకు
పళ్ళాలా పోస్తి !
ఇదిగోనే చెల్లెలా
నీకు హారణమ్ము !
గౌరవమున నీవూ
కలిసిమెలిసుండూ !
పార్థునీ మాటకూ
జవదాట కమ్మ !

ఈ క్రింది సంవాదం శ్రీకృష్ణుడికి - రుక్మిణికి సంబంధించి నడుస్తుంది.

చక్కని మిక్కిలి రుక్మిణి
వాకిట సరసములాడెనె భామా !
తను సరసము లాడెనె భామా !

చిటపట చినుకులు
దుప్పటి తడిసెను
తలుపు తియ్యవే భామా - నీవు
తలుపు తియ్యవే భామా !

మెడలోనున్న ముచ్చపు
హారము ఎవరికిచ్చినావోయీ - నీవు
ఎవరికిచ్చినావోయి ?

గొల్లది ఒకసతి పెండ్లికిబోతే
కోరితె ఇస్తినె భామా !

శంఖు చక్రములు
చదరక గంధపు
రేఖ లున్న వేమోయీ ?

ఏమేభామా నమ్మకుంటెనూ
బామునై న బట్టేనే - నే
బామునై న బట్టేనే !

లక్ష్మి - నరసింహస్వామికి సంబంధించిన సంవాదం ఇది :

తరుణి నేను రాగా జూచీ
తలుపులూ మూసున్న విధమూ
అరదుగా నీ మదికి తోచేనా
ఓ లక్ష్మిదేవీ !
అతివనీకూ అలుక ఏలానే ?

గాయకూడ నీ వగలు
కానవచ్చే నీ తలాలు నేడూ
మాయసుద్దు లెన్నడావోయీ
ఓ నారశింహా !
మమ్మ రవ్వ లేల చేశావూ !

దుష్ట విగ్రహముతోనూ
దోరుకోని వేటాడితే
దుష్టు విగ్రహామాయెనే
ఓ లక్ష్మిదేవి !
సృష్టి పాలింప నే వస్తినే !

వేటబోయేననుచు బోయి
నీటుమీరా నీవందూయే
బోటులాకూడుకూ వస్తివి

ఓ నరసింహా !
బొంకులూ నాతోటి బొంకేవు !

కాముకో నీరాజువేటా
లాడబోయే నాచోటేనా
భామాముఖము నే నెరుగానే
ఓ లక్ష్మీదేవి !
పడగవేటా లాడి వస్తినే !

నిద్రపోయేటి వేళాలో
సద్దుసేయా వచ్చినావురా
ఓ నరసింహా !
బుద్ధులెట్లూ నీకు తోచెరా !

కోమలాంగీ శ్రీ గురుడాద్రీ
శ్రీ నారసింహుడనే నేనూ
కోరినిన్ను కూడివస్తినే
ఓ లక్ష్మీదేవి !
చేరనిచ్చితలుపూ తియ్యవే !

అందమలర నీ వెందుందూ
ఏ సుందరులా నెరుగాననుచూ
గంధమేలా కలిగేరా జాణా
ఓ నారసింహా !
కల్కి ఎవతో నీకు పూసేరా !
తప్పాడి పొదలలోనూ
తరచు వేటలాడబోతే
పుప్పొడి నామీదరాలేనే
ఓ లక్ష్మీదేవీ !
పూసినట్టే గంధమాయేనే !

సుద్దులూపల్కే-వు చాల
పరమాత్మపై ఇంగారు చాలు
వాసంతమేలా కలిగేరాజాణా
ఓ నారసింహా
వనిత ఎవరో నీకు పూసేరా !

పూచినామృదులాతరులా
పూలసరులా శృంగారములు
చూచివస్తామనుచు పోతినే
ఓ లక్ష్మిదేవీ !
సొంపుతేదే రసమూచిందేనే !

ప్రాకటముగా చెంచువనితా
భామకూడే నా వాకిటా
నాకు దత్తేమియ్యారా స్వామి
ఓ నారసింహా
వాకిలి నే తీసేనుగానీ !

తరుణినేను శ్రీ రూపాము
దాల్చియున్నా వాడ్నీ కనుకా
అరుదుగా నీమదికి తోచేనే
ఓ లక్ష్మిదేవీ
అతివనీవూ అలుకమానావే !

పద్దూలుపల్కే-వు చాలా
పరమాత్మా మీవద్దనున్నా
ముద్దుగుమ్మా ఎవతె రాజాణా
ఓ నారసింహా !
మొరసి మొరసి నిన్నే చూసేరా !

సన్నుతాంగీ సీవిప్పుడూ
సఖియాలా గుత్తెరుగాననుచు
నిన్నుముట్టి బాసా చేసేనా
ఓ లక్ష్మిదేవి !
మమకూలీనే నెరుగానే !

వాసుదేవా మీరునాతో
బాసాలు చేసెదానంటే
వాసవాదులెల్ల నమ్మరూ
ఓ నారసింహా !
దాసులై నవారూ నవ్వేరూ !

ఖాసురామ రామాగుణమా
బాసాలు చేసేదానంటే
వారుమమ్మెందుకు నమ్మారే
ఓ లక్ష్మిదేవి !
వారుమమ్మెందుకు నమ్మరే !

కంజనాభా మీరూనాతో
షుమకించీ మాటలాడేరూ
ముంజేతి కంకణమే మెరసేరా
ఓ నారసింహా !
మరచిచూడా అద్దమేలరా ?

గజరాజ సింహాములా నేనూ
సునమూగనే వేటాడితే
సురలునాకూ మురయుచు నిపుడు
ఓ లక్ష్మిదేవి !
సొంపుతోకంకణము కట్టేరూ !

సారసాక్షా నీవందూయా
సఖియా నీ గూడియుందాకా
సన్నిధీకే ఏలా వస్తిరీ
ఓ నారసింహా !
సరసమూ నీతో ఏలరా ?

అండజా గమన నా
దండీ తప్పులాకు నీకు
ఒక్కదండమునీకు పెట్టేనే
ఓ లక్ష్మీదేవి !
దండము నేరమూ మమ్మేలూ !

చిత్తజాజాణా చెన్నూ మీరగానీ
నిత్య కొత్త పెళ్ళికొడుకై వుండరా
ఓ నారసింహా !
కోరి పుత్రూలనూ ఎత్తారా !

అలాగే సత్యభామా - శ్రీకృష్ణుల సంవాదం :

వాకిలి తీయగదే వారిజ
ముఖి కోమలాంగి నాపై
కోపముసేయక కోరివచ్చిన
వాడనే వాకిలివేగ ! ॥వాకి॥

మాటిమాటికిని మారము,
సేయక మురహర
పోపోరా మోహనకారా ! ॥వాకి॥

పారిజాతమ్ములు పణతినీకిస్తును
పంతగించక తీయుమా
వాకిలి వేగ ! ॥వాకి॥

సత్యభామతోగూడి సరసమ్మా
లాడాగా సరసుడ లేచిరార
వాకిలి తియ్యను ! ॥వాకి॥

సుదతులందరిలోనూ
సుందరాంగీవానీ
వలచివచ్చినవాడానే
చెలియరో వేగ ! ॥వాకి॥

దోసిలొగ్గితినమ్మ
దోషాములెంచక దాసూడాను
దయను చూధుమా
దయతోడ చెలియా ! ॥వాకి॥

ఇది ఇద్దరు స్త్రీలు - సామాన్యులు కారు — ''లక్ష్మి-గౌరిదేవి''ల మధ్య జరిగే సంవాదం !

సాధారణంగా స్త్రీల మనస్తత్వమే అంత అనుకుంటాను. తనవాడు గొప్ప! తను అందగత్తె !! దానికి నిదర్శనంగా ఈ సంవాదం సాగేతీరు చూడండి :

గౌరిదేవి నీశంభుదేవునకు
గళమున నలుపేమమ్మా ?

నారీమణి నీ విష్ణుదేముడూ
నలుపుకాదటే కొమ్మా ?

ఏమిలేక నీ కాంతుడు జగమున
ఎద్దునెక్కెనే కొమ్మ ?
పంతముతో నీ కాంతుడు
పసులకాసెనే కొమ్మా ?

అద్దులేక నీ వల్లభుడూ
సగమాకరూప మేమమ్మా ?

ముద్దుగుమ్మ నీ మురహరి పెనిమిటి
మోహినికాదుటె కొమ్మా !

పంకజాక్షి నీ శంఖరికరము
జింకవున్న దేమమ్మా !

పంతముతో వనవాసము కేగి
జింకనువేసెనె కొమ్మా !

చింతలేక నీకాంతుడు బ్రహ్మను
శిరసుత్రుంచె నే మమ్మా ?

పంతముతో రావణబ్రహ్మను
పదితలలు త్రుంచెనే కొమ్మా !

విశాలాక్షి నీ విభుని మాయలా
జంగముకుల మేమమ్మా ?

పాలు పెరుగులమ్మగను గొల్లవారి
కులముగాదుటే కొమ్మా ?

పార్వతిదేవి నీ విభునికి
నిలువున పాములున్న వేమమ్మా ?

పార్వతిదేవి వైదేహి పలికిన
పంతము వినరమ్మా ?

విన్నవారికే విష్ణులోకమూ
కైలాసముకాదటే కొమ్మ !!

* * *

శివశరణు మాంపాహి శివశరణు సోమా శివశరణు మనపాల శివునకు శరణు
గురుశరణు మాంపాహి గురుశరణు సోమా గురుశరణు మనపాలి గురువులకు శరణు
హరశరణు మాంపాహి హరశరణు సోమా హరశరణు మనపాలి హరులకు శరణు
ఎక్కెను గౌరమ్మ ఎలనంది మీద కోసెను హాలన్ని కొమ్మ విరువకను

ముడిచెను ఆ పూలు ముందుగా తాను ముడుప మిగిలిన పూలు పళ్ళెరమునుంచి
పంపెను గౌరమ్మ గంగ మేడలకు వాడిన పూలుపంపిన వనిత ఎవరమ్మా
వడలిన పూలుపంపిన వనిత ఎవరమ్మా చాలకుంటే తన్ను సరికొల్లలాడు
సరికొల్లలాడను సరిదానవటవే సరిధాన్ని కాకుంటె శివుడేలదెచ్చు
శివుడేల తెచ్చును జగమేలమెచ్చు శివునికి చిన్నారిని నీకు చెల్లెలను
తన్నెను తనసవతి గుండెల్లు పగుల అక్క మీ పాదాల రాలినమన్ను
సందుల్నిగట్టిస్తు గొందుల్నిగడుము కొడుకు వీరన్నకు కోటగట్టిస్తు
కోడలగు భద్రాద్రికి మేడగట్టిస్తు బసపన్న పడుకునే పంచటరుగేస్తు
శివునికి శివపూజ గద్దిగట్టిస్తు నీకు అసగ సరిగద్దెకడుదు
సరిగద్దెకట్టను సరిదానవటవే సరిదాన్ని గాకుంటె శివుడేలదెచ్చు
శివుడేలదెచ్చును జగమేలమెచ్చు శివుడికి చిన్నాలిని నీకు చెల్లెలను
తన్నెను తన సవతి పళ్ళన్నిరాల అక్క మీపాదాల రాలినపళ్లు
కూర్చుండి ఏరిస్తు గుండు గంపలను నిలుచుండి ఏరిస్తు నిలువు గంపలను
పరుండి ఏరిస్తు ఒకటయినలేక పిన్నలకు పెద్దలకు నీవు పంచిపెడితె
పసిపుత్రబాలాది నే పంచిపెడుదు సమముగ పంచిపెట్ట నీవు సరిదానవటవే
సరిదాన్ని కాకుంటె శివుడేలదెచ్చు శివుడేలదెచ్చును జగమేలమెచ్చు
శివునికి చిన్నాలిని నీకు చెల్లెలను అని పలికి గంగమ్మ జనెను మేడకు
అంతట గౌరమ్మకు చెంగులూమాసె ఉదకాల జాడలు కానరావాయె
తనకొడుకు వీరన్నను వెంటనే పిలిచి రావోయి వీరన్న రాజశేఖరుడా
వయసు గలిగి వర్ధిల్లు వీరన్న ఉదకాల జాడలు కానరావాయే
ఉదకాల జాడలు చూచిరా కొడుకా అటుబోయి వీరన్న ఆ కొలను జూచె
ఆ కొలను ఉదకాలు దాచింది గంగ ఇటుబోయి వీరన్న ఈ కొలను జూచె
ఈ కొలను నిరంత దాచింది గంగ చిలుక సముద్రమును జూడ చిన్న మెత్తులేవు
పాల సముద్రం జూడ పాతికెత్తు లేవు ఎచ్చట తిరిగినా ఉదకంబు లేదు
వీధూదిగుండాన ఇంకిపోయినవి మల్లయ్య గుండాన మరిగిపోయినవి
సవతులగుండాన చట్టుపోయినవి వెళ్ళెను వీరన్న గౌరి మేడలకు
ఉదకాల జాడలు కానరావాయె దక్ష మేడలదాక పోయిరా కొడుకా
పోయినే దక్షునితో ఏమండుసమ్మా దయపుట్ట జెప్పరా మీ తాతతోను
అయిదు దినములబట్టి స్నానమ్ము లేదు ఆరు దినముల నుంచి శివపూజ లేదు

శివపూజ మా తల్లి చేసుకొనలేదు ఉదకాలు జాడలు కానరావాయె
ఉదకాలు జాడలు మిమ్మడుగమనెను ఆ మాట విని తల్లి వీరన్న అపుడు
బల్లెంబు శూలంబు పల్లెతాయొకటి రాక్షసుల మర్ధింప రమ్యంబుచేత
బయలుదేరి వీరన్న సంతాపమునను గుజ్జుమామిడి దాటి గురివెంద దాటి
కొమరుగా వీరభద్రుండు గుండెకదల వెళ్ళెను వీరన్న దక్షవేదలకు
ఎన్నడు నా మేడ ఎఱుగవు తండ్రి ఏమిపనికొస్తివి నీవు వీరన్న
అయిదు దినముల బట్టి స్నానంబులేదు ఆరు దినముల నుంచి శివపూజ లేదు
శివపూజ మా తల్లి చేసుకోలేదు ఉదకాల జాడలు కానరావాయె
ఉదకాల జాడలు మిమ్మడుగ మనెను ఇటుబోయి దక్షుడు ఆ కొలను చూచె
ఆ కొలను ఉదకాలు దాచింది గంగ గంగకు అధికార మెవరిచ్చినారు
చిలుక సముద్రంలోను చిన్న మెత్తు లేవు పాల సముద్రంలోను పాతికెత్తు లేవు
వీభూదిగుండాన చుక్కైనలేదు
మల్లయ్యగుండాన్న మరిగిపోయినవి సవతులగుండాన చట్టుపోయినవి
కాశి కావడికట్టి కాశికే పంపె కాశిలో ఉదకాలు కళ్ళబడవాయె
గంగకావడి గట్టి గంగకే బంపె గంగలో ఉదకాలు కానరావాయె
పట్టించు పదివేల పాలకావిళ్ళు కట్టించు పదివేల నేతికావిళ్ళు
పాలకావిళ్ళొచ్చి పందిళ్ళదిగెను నేతి కావిళ్ళొచ్చి మేడల్లదిగెను
పాలతోనేగొరి స్నానంబు జేసె నేతితోగొరి శివపూజ జేసె
చీమలు దోమలు చెడకుట్టసాగె గండుచీమలు కుట్టుతూ ఉండె
పంచవటిదాక పోయిరా కొడుకా పోయి నే శివుని ఏమడుగనమ్మా
ఆయిదు దినముల నుంచి స్నానమ్ములేదు ఆరు దినముల నుంచి శివపూజలేదు
శివపూజ మా తల్లి చేసుకోలేదు ఉదకాల జాడలు కానరావాయె
ఉదకాల జాడలు మిమ్మడుగ మనెను బల్లెంబు శూలంబు పల్లెత్రాడొకటి
రాక్షసుల మర్ధింప రమ్యంబు చేత గుజ్జుమామిడి దాటి గురివింద దాటి
కొమరుగా వీరభద్రుని గుండెలు కదుల వెళ్ళెను వీరన్న తండ్రి మేడలకు
ఎన్నడు నా మేడ ఎరుగవు తండ్రి ఏమి పని కొస్తివి నీవు వీరన్న
నీ మంచి గుణములు నే చెప్పుచుందు కూర్చుండు వీరన్న కూర్చుండవయ్యా
శరజార్థి మా తల్లి శివశరము మీకు అయిదు దినముల నుంచి స్నానంబులేదు
ఆరు దినముల నుంచి శివపూజలేదు శివపూజ మా తల్లి చేసుకోలేదు

ఉదకాల జాడలు కానరావాయె ఉదకాల జాడలు మిమ్మడుగ మనెను
మీ అమ్మ తక్కువేమి నా ఎక్కువేమి పుట్టించ గిట్టించ శివుడు కర్తగును
నోచిన నోములకు గౌరితా కర్త జగములో నీళ్ళకు గంగతా కర్త
ఏ ప్రొద్దు గంగతో ఎదురు వాదంబు
కూడదని చెప్పుమీ ఆ గౌరితోను ఈ ప్రొద్దుగంగకు తా ప్రమొక్క మనుము
గంగ సమ్మతి చేత ఘన ఉదక మొచ్చు నదులన్ని నీళ్ళతో నిండుండునయ్యా
స్నాన పానమ్ములా సకల జపములు నీరుండె నెరవేరు నెలమి వీరన్న
మీ తల్లి స్నానంబు అటు చేయవచ్చు అని చెప్ప వీరన్న తల్లి మేడలకు
చని దెల్సి నీ వార్త ప్రధమంబుగాను మీ అమ్మ తక్కువేమి నా ఎక్కువేమి
పుట్టించ గిట్టించ శివుడు కర్తగును ఆయుస్సు పోయుటకు బ్రహ్మ కర్తయగును
అందరిని రక్షించ విష్ణు కర్తగును నోచిన నోములకు గౌరియే కర్త
ఆ నీళ్ళ జాడకు గంగతా కర్తా ఏ ప్రొద్దు గంగతో ఎదురుకయ్యమ్మ
ఏ ప్రొద్దు గంగతో ఎదురు వాదమ్మ కూడదని చెప్పుమీ ఆ గౌరితోను
ఈ ప్రొద్దు గంగకు తా ప్రమొక్క మనుమీ గంగ సమ్మతి చేత జలకాలు వచు
నదులన్ని నిధులయి నిండుండునయ్యా స్నాన పానమ్ములు సకల జపములును
నీరుండె నెరవేరు నెల్ల వీరన్నా తల్లి స్నానమ్మ ఆటు చేయవచ్చు
అని చెప్పుమని చెప్పెనమ్మరోయనగ ఆ పల్కులు విని అంబ తన సుతునితో
కంట నీరుంచి తా కఠినంబుగాను నీచదానింటికి పోవను కొడుకా
జాలారి దానితో పొత్తేల మనకు నీవైన పోయిరా ముద్దు వీరన్న
వెళ్ళెను వీరన్న గంగ మేడలకు ఎన్నడు నా మేడ ఎరుగవు తండ్రి
యేమి పని కొస్తివీ నీవు వీరన్న అని పల్కు వీరన్న గంగతో జెప్పె
అయిదు దినముల నుంచి స్నానంబులేదు ఆరు దినములనుంచి శివపూజలేదు
శివపూజ మా తల్లి చేసుకోలేదు ఉదకాలు జాడలూ కానరావాయె
ఉదకాలు జాడలు నిన్నడుగ మనెను మీ అమ్మ తక్కువేమి నా ఎక్కువేమి
ఆమెకులేనిగొప్ప నాయందుకలదా ఉదకాల జాడలు నేనెరుగ ననెను

ఆ మాట వీరన్న విని మండిపడుతు తలపగులగొట్టేను చంపివేసేను
యమభటులకు నిన్ను అప్పగించేను యమదండన నిన్ను చాలచేతును
వద్దు వద్దు వీరన్న వాదము నాతో పోవోయి వీరన్న పొంకమ్ము మాని
వచ్చెను వీరన్న తల్లి మేడలకు ఏమని చెప్పెరా ఎలమి గంగమ్మ
మీ అమ్మ తక్కువా నా ఎక్కువేమి ఆమెకంటే ఘనత నాయందుకలదా
ఉదకాల జాడలు నేనెరుగ ననెను ఆ మాట విని గౌరి దిగులంది
ఎందుకీ వైరమ్ము ఏమి పాపమ్ము దైవ విధి గడుపను తరమె ఎవరికి
శివునికి చిన్నారి శిరసెక్కెగనుక ముచ్చట్ల మురియుచు ముదిత గూర్చుండె
అని తాను తలపోసి బయలుదేరింది ముందరను వీరన్న వెనుక గణపన్న
ఇద్దరి నడుమ గౌరితా నడచె గవరప్ప రాకాలు గంగప్ప జూచి
వంచన జేయుటకు వంచన తాదలంచి పచ్చిచాపలు దెచ్చి పందిళ్లు వేసె
పందుటాకులు దెచ్చి తోరణాలు గుచ్చి పెద్దచాపలు పంచరంగులు గట్టె
కప్ప జచ్చిన నీళ్ళు కళ్ళాపు జల్లె చేప చచ్చిన నీళ్ళు చెయ్యి తాకడిగె
ఎన్నడు నామేడ ఎరుగవూ అప్ప ఏమి పని కొస్తివీ నీవు గవరప్ప
ఆ మాట విని ఇట్లు చెప్పె ఐదు దినములు బట్టి స్నానములేదు
ఆరు దినముల నుంచి శివపూజలేదు శివపూజ అయినాను చేసుకోలేదు
ఉదకాలు జాడలు కానరావాయె ఉదకాల జాడలు చెప్పు గంగమ్మ
ఉదకాలు జాడలు నేనెరుగ ననెను

నా కొడుకు వీరన్న నీ కిస్తుగాని ఉదకాలు జాడలు చెప్పవే గంగ
నీ కొడుకు వీరన్న నా కొడుకు గాడా ఉదకాల జాడలు నేనెరుగ నక్కా
నా కోడలు భద్రగిరిని నీ కిస్తుగాని ఉదకాల జాడలు చెప్పవే గంగ
నీ కోడలు భద్రగిరి నా కోడలు గాదా ఉదకాల జాడలు నేనెరుగ ననెను
నాకున్న రవికెలు నీకిస్తుగాని ఉదకాల జాడలు చెప్పవే గంగా
నీకున్న రవికెలు నాకునులేవా ఉదకాల జాడలు నేనెరుగ ననెను
నాకున్న చీరెలు నీ కిస్తుగాని ఉదకాల జాడలు చెప్పవే గంగా
నీకున్న చీరలూ నాకునూ లేవా ఉదకాల జాడలు నేనెరుగ ననెను

నాకున్న సొమ్ములూ నీకిస్తుగాని ఉదకాల జాడలు చెప్పవే గంగా
నీకున్న సొమ్ములూ నాకునూలేవా ఉదకాల జాడలు నేనెరుగ ననెను
నా శివుని నీకిస్తానుగాని ఉదకాల జాడలు చెప్పవే గంగా
ఇప్పుడన్నామాట తప్పకుమి అక్కా ఈ మాటకు సాక్షి ఎవరనీ బలికె
భూమి ఆకాశాలు రెండునూ సాక్షి అడవి మద్దులూ మాలేళ్ళు అవి రెండు సాక్షి
సకల దేవతలు వారెల్లా సాక్షి
అనగ సంతోషించి గంగప్ప తాను గుప్పు గుప్పున గంగ ఉప్పొంగుచుండ
ఏరులన్నీ చానలోకమయినింద గౌరి స్నానమ్ముజేసి శివపూజచేసి
శివుడొచ్చురాకలు గౌరితాచూచి గడియ గ్రక్కునబెట్టి గవరమ్మతాను
భోరునతలుపెయ్య మేలాయెనక్క భూమి యాకాశమ్ము వారైరి సాక్షి
మద్దులూ మారేల్లు అవి రెండు సాక్షి సకలమైన దేవతలు వారెల్ల సాక్షి
ఈశ్వరా గవరప్ప ఇచ్చెను నిన్ను అని చెప్ప శివుడపుడు అందరిని బిలిచి
సాక్ష్యంబు ఇచ్చుకొని సఖియ గౌరితో మీ కిద్దరకు కలహంబు వద్దనీ చెప్పి
వారంత సఖ్యముగ కలిసి మెలిసుండె !

మరో కయ్యం



ఇందుపదనరొ విందివా సుద్దూలు ఛంద్రపదనరొ గంటివా
మందగమనరో వింటివా మా రంగాడి మర్మమెల్లా దెలసెనూ
కోమలిరొ నన్నెడబాయకుమనిచెప్పి పాదముల బట్టేగదే
చెయ్యేరాని బాసాలు జేసేగదే దానింటికి పోనాని బొంకేగదే
అదిచాల వలపించుకుందేగదే తిరువేంగళరాయుడు పరిమెళగంధము
దాని కుచములపై నిండాను ఘుమ్మ్మఘుమ్మ్మని కన్పడేగదే
నాంచారు మందూల మహిమలు

ఏడాదికొకతూరి వరయూరువస్తేను ఏమయ్య నన్నింత రట్టుజేసేరూ
ఏలమ్మ నన్నింత రవ్వజేసేరూ

ఉంగారమిమ్మాని కావేటిరంగాని రంగూగ తానడ్డుకున్నాడట
పట్నాములోవున్న ప్రజలంతజూడగ విభునిచెయి జిక్కించుకున్నాదట
రంగాని బంగారు రొమ్మెక్కి కూర్చోను తప్పాదె నావల్ల తగనాదె నేను
ఏఏ వలయూరు నాంచారు చెలులాతో ఏమాని నన్నాడి పల్కితివొ చెపుమా
పుట్టితే పెరిగీతి ఇంతదాననైతి ఇటువంటి బూటాక మెన్నాడు ఎరుంగ
దేవాతలందారు జేజేయనగా బృందావనమ్మున పుట్టితినిగాని
పేరుప్రతిష్ఠలతో పెరిగితిగాని ఇటువంటి బూటాక మెన్నాడు ఎరుగ
యాళ్వారింట ఇచ్చాకములాడిన హితవూలు జెప్పిన రంగడ్డేకాదా
న్యాయము దప్పదు నాటికి నేటికి నన్నెదబాయాడు నాప్రాణనాథుడు
నాకేమి భయమే నీరాజనేత్రి నీకన్న మూరెడు పెచ్చయినదాన్ని

అక్కారొ మూరెడు పెచ్చాని పల్కితివి తిరుపాతి కొండపయి కెక్కి నిల్చుదేని
నేను నేడు పెద్దదాన నగుదును నావద్ద కాకుండగా నీ వరుని వద్దానయినను
అరవ బ్రాహ్మడికూతురా నీకింత అణకువా లేదాయెనే

అక్క అరవవారి చిన్ని పాపాను నేనైతె అన్నింట నెరజాణ లౌదుము మేము
బ్రహ్మకు చుట్టాలమగుదుము మేము కొమ్మాన కొనగోరు వంచంగగలవా
నీళ్ళలో బుట్టిన జాలారి కన్య నీటి మత్స్యంపట్టు మీ వారు ఇంట
నీటిమంగళాలు తెల్లాని మత్యాలు కూర్మాలు గలవాడటవే మీ వారలు జాణాలు
గారాటవే

వొప్పయిన మత్యాలు గొప్పావి గలవే కోరిన పుట్టిల్లు గొప్ప భువనామే
ఎట్లైట్టు బ్రహ్మకు ఎలాటి చట్టాలు నేను ఎరుగాకుండమా నా నాధుడెరుగ
కుండనూ

ఉత్తమాసూర్యజా వంశాజుడతడు గంగా గౌతమి యమున నర్మద కావేరి
అయిదుగురు పట్నంపు రాణులతోను ఎల్లాలోకములు ఏలుచున్నాడు
బంగారు కోటలు బాగయిన మేడలు నేటయిన నాటకపు శాలలొకజోటు
బ్రహ్మాండ భాండములు నా బొమ్మరిళ్ళు బ్రహ్మదులెరుగూదురే

దేవుని పెండ్లి కొచ్చేటప్పుడు విష్ణునిసేవ కొచ్చేటప్పుడూ
కుంచెడు బియ్యమా కూరాకులాకట్ట దానమిచ్చుంటివా
నీవింత దాచుకున్నాదానవా అమ్మక్క నెగ్గితివా సవతిపోరుకు వస్తివా

అక్క వెయ్యికాళ్ళ మండపంబూలోన రంగడు వేడుకకో కొలువుండగా
ఇరువంకలా సతులుండగా పరమభాగవతులు స్తుతులుసేయా
నారదుడు వీణెమీటా ఆ వేళ కంఠసరులూ ఇచ్చేనే ఈ రోషం నాడేల లేద్దాయెనే
సవతి నేడేల నీకు గల్గెనే అక్కా క్రోవెలతో రంగేశుడూ
పరిజనముతో కొలువుండగా ఇరువంకలా సతులుండగా పరమ భాగవతులు పాడగా
ఆళ్వార్లు సన్నుతి జేయగా నారదుడు వీణెమీటగా
వేయి కోట్లూ జేయు వెలవేని పచ్చ లక్ష కోట్లూ జేయు రత్న మాణిక్యం
నాధూడు చేబూని నావిడిది కొచ్చె బంగారు గొలుసూల పట్టెమంచమున
తూగుటుయ్యాలపై శయనించియుండ కోపామేల నీకు కోమాలియాని
మోవిముద్దాడియు మోహంబు దీర్చి తెచ్చిన సొమ్ములు కానుకా ఇచ్చె
వేడుకతో నా మెడను ధరియిస్తి నమ్మ
మోహంపుసుదతివి ముగ్ధారాలవు నీవు వద్దానే ఉండాకనూ
ఇటువంటి సుద్దూలు నీకేటికే అక్క పెద్దాదానవని మిట్టిపడేవేమె

చుట్టుపట్ల వాడు చూడంగనూ మన్మధునీవంటి కొడుకూను గన్నావనా
మండలాధిపతి ఆలినంటివి నీవు నాపతిని రానివ్వావటే
దేవిడి బంగారు తలుపూలు మూయించి నావిడిదీకి రాకుండ జేతుపటే
దేహూని ఆరట్లు బెడుదూవటే

అక్క రాకుండ జేసిలె నగుబాట్లు గాదటే రంగాని నాయింటికీ బంపవద్దా
అలుక జూపవద్దా అతనిపై నయినా ఇటువంటివి కలికీకి లక్షణమా
సతియు పతియూ గలసి ఒక్కచోటుండాలి పతినివిడచి సతి ఉండూనటే
నీవంటి వంచలమారి గాబోలునూ అక్కా నేల స్త్రీలకు వన్నెకాడయి తిరిగినా
వరుని నడతకు ఓర్వాక నీ వశమా పార్వతివంటి దానికయిననూ
చనువు నాది అంటివా నా కన్నా చక్కానిదానావటే

ఎక్కడనుండొస్తివే నా విభూని ఎంత రాపిడిబెడితివే
ఊరేది పేరేది నీవున్నస్థలమేది ఇచటికిరా కారణమేమే ఈడుజోడుదాన

నాఊరేల దలచేవు పేరేల దలచేవు నావార్ని తలపాను కారణమేమే
వియ్యామందగ వచ్చిరా నీతోటి కయ్యామందగ వచ్చిరా

తాటంక ముత్యాల కమ్మాలు గదలా తాటాకీ తలవూచకే నీవు సాటిదానవటవే

అక్కముందుగా వల్లాను ఏమి ముచ్చాట గన్నావు
కాక నావల్లాను కడతేరదిపుడూ

వన్నెలాడి నీవాడిన మాటలు భువిలోన చోద్యాములే
వన్నెలాడి యని నన్నంటివి ఇపుడూ వన్నెమృగమును నేను దెమ్మంటినా
పతిని ఆడవికి బంపితినా రక్కసుని వరియించి రథముపై నెక్కి
లంకలోకి వెళ్ళియుంటినా నేనూ

బిత్తరి నీ వగుదువే దేశదిమ్మరి అటుపోగదే

దిమ్మరివని నన్ను అంటివి ఓకొమ్మా రొమ్ము పగుల గొట్టించేద
ముడిచి విడిచిన పూలు రంగానాధునికంపి వలపించుకున్నట్టి నెరజాణపోవే

ఆడదాన పోవే నీతోటి మాటలు ఇక నేటికే

ఆడదానివని నన్నంటివె ఇపుడూ
ఖట్టూజూచుకువుండు పదిలామునానూ తిట్టకా నేమాననే అక్క
మసిబూసి నేరేడు పళ్ళమ్మనేలా
అంగజ జనకూని అంగట్లో బెట్టుదురా పలుమారు

శాంతురాలవని వచ్చి ఉంటినిగాని నీతిదప్పిన దానివని ఎరుగనె
నీవూరి కొస్తూంటే నీవుండ వాడలకు నేవత్తునా అక్కనీ పేరు
కలయిన దలతునా సప్తసముద్రాలు ప్రళయం పొంగంగా
నక్కనిచూచి నేను వణకూదునా

శునకంబు నేజూచి బెదురుదునా కుటిలకుంతలి రావె నాంచారురావె

పట్నంపు రాణీకో గొబ్బునరావె పళ్ళురాలగొట్ట
దాని ధైర్యాలు ఇక చూతమూ

ఏమిచేయ గలవదే నన్నిపుడు వంచనలు జేతువందే
ముందు చెవులాకన్నా వెనుక కొమ్మలు వాడి అన్న సామ్యంబు నిజమాయెనే

ఇందుముఖులంతాను ఒకచోట గుమిగూడి విభునిగూర్చి ఏకాంత మాడంగలేదా
ఇందువదనా నీకామాటలు చెవులాలో సీసంబు పోసినట్లుండు
కర్ణములకు పెద్ద ములుకులయి ఉండు

మాటలు నేరాని మృదుభాషివ నీవు పద్మానాభుని ముద్దుగుమ్మారొ రావె
పారుజాతములు ముడిచీ పరిమళద్రవ్యముతొ శృంగారించి
చేరబోయి దాని కొప్పుబట్టితీసి కొప్పులొ విరులన్ని విప్పిదీసుకురారె
కానుకలిత్తూగదె చెలులార కట్నంబులిత్తూగదే

అక్క గజ్జలా గుర్రమ్మ ఎక్కిరంగేశుడు ఘల్లుఘల్లు మనుచు రవళి మ్రోయంగ
మకరకుండలములు మణికిరీటములు శిరసున శ్రీరామస్తాళి ధరించియు
వచ్చుచున్నాడమ్మ మీ ప్రాణేశుడు ఓయమ్మ వాదులు మానారె
వనజాత విభూడంత వాహనంబూదిగి ఆది రుద్రాదుల నందర్ని బిల్చుకుని
మావటి కొలువునకు రమ్మనిచెప్పంకి రావమ్మా శ్రీరంగనాంచారువేగ
మేలిమగు లడ్డూలు తియ్యని బూరెలు మరిమరి మండియ్యలు
తేనె తొనలు చక్కిలములు ఆరగించెను రంగేశుడపూడు

రావమ్మ శ్రీరంగ నాంచారువేగ రావమ్మా నిగనిగముత్యాల కమ్మాలు మెరయాగ
నటనాతో బంగారు బొమ్మ గజరాజపరచూడు మెచ్చి నాకిచ్చినా
కంఠసరులుజూడవే నా కంఠాన వెలుగుతున్న విప్పుచూ
పచ్చలా పల్లకీ పట్టుమాని ఇంకనే పుట్టింకి బోవాలెనూ
పెరియాళ్వాకుల కూతుర్ని అనినన్ను వేవేలవిధముల పూజిస్తురూ గదవే

తెచ్చుకున్నట్టి ఆ దొమ్మరి సతిచే తిట్టుబడపలసొచ్చెనే
ఏలయ్య ఈ వాదు లాడించుతున్నావు రంగాధామా
మాటడబోతేను సవతికొట్టగవచ్చె రంగధామా
పోయి నా పుట్టింట పొందూగనుండెద రంగధామా
ముప్పదిమూడు కోట్ల ధనరాసులంపింది రంగాధామా
హస్త కంకణాలు ఆ వనిత జేయించె రంగధామా
మకరా కుండలములు మీ మామ బంపెను రంగధామా
పన్నీరు చెంబులు బంగారు కోకలు వన్నెల రవికలు రంగధామా
మాణిక్యాలతోకట్టిన మకరీ పత్రికాలు జవ్వాది భరిణేలు ఆడేటి బొమ్మలు
అపరంజి సొమ్ములు పట్టెమంచపు పరుపు
పాలిచ్చు మొదవులు పదివేలిచ్చిరయ్య నీలవర్ణుడా
వెండివీ కడవలూ వెలలేని రత్నాలు పగడంపు రోకళ్లనూ
వజ్రములా రోళ్ళు దంతపు దువ్వెన్న ముత్యంపు చిక్కంటు
కాటుక్కారాటము పంపింది ఎరుగవా నీలవర్ణుండ
ఏటేట తప్పాక సారె చీరిబెట్టె రంగధామా
మురిసేవ ముద్దులా కోమలాంగినిజూచి నీలవర్ణుండ
కడుపునిండగ నీకు అన్నంబు బెట్టీర పచ్చాని కమ్మాల దుప్పాటి ఎరుగూనటే
నీపాదధూళీ మాపైన సోకితెచాలు విజయలక్ష్మి జన్మ పావనమాయెను
పతితుల మగుదుము ఆదిలక్ష్మి సిగ్గాయె నీ ఎగ్గు మాటాలు వినగానె నీలవర్ణుడు
మురసేపు ఆ ముద్దు కోమలాంగిని జూచి చక్రధారుడా పరిణయ కాలమందు
నాగవల్లి రోజున నేను మీరు రత్నపీఠంబుపై గూర్చుండ హోమంబు చేయంగ
బ్రహ్మదేవుడు వచ్చి కల్యాము జెప్పగ సముద్రుడూ యేతెంచి
కట్నకానుకలిచ్చె నీలవర్ణూడా కరనూడి పచ్చాల నడయాలు బెట్టుకుని
చెలలేని పతకములు మీకంఠమునవేసి పీతాంబరం గప్పె మీకు విష్ణూడు
కోటి సొమ్ములిచ్చె తావీడుల నిచ్చీరి వెల్ల ఏసుగులయిన పక లక్ష ఇచ్చీరి

పట్టుడేరాలూను పల్లకీలయినాను పట్టిమంచంబులు పరుపులూ తలగడలు
పతికిచ్చిరయ్య పద్మనాభా
ఏటా కోటిధనము జంబూద్వీపమంత మొఖాసా ఇచ్చిరి సీటుకాడా
పెద్దభార్య లేచి పంచభక్ష్యాన్నములు వడ్డించ నంబెరుమాళ్ళయితె తానారగించెను
హస్తములు కడుగుకుని కర్పూర విడెంజేసి
సతియు పతియును గలసి సౌఖ్యముగానుండె....

పైన పరిచయం చేసిన సంవాదాలు అన్నీ ఆవతారాల్లో, రూపాల్లో పరిచయం చేయబడినవి - సామాన్యంగా భార్యా భర్తలమధ్య మూతి ముడుపులూ, మాట పట్టింపులూ వస్తుంటాయి. అప్పుడు ఏ ఒకరూ తగ్గరు ! తగ్గుతే ఎలాగ? చులకన అయిపోదూ ! అందుకు ఏ చిలుకమీదో, పిచుకమీదో, లేదా తడిక మీదో, తట్టమీదో - పిల్లమీదో, పిల్లిమీదో పెట్టి - ఒకరితో ఒకరు మాట్లాడు కోవడం కద్దు. అటువంటి సంవాదాలలో తడికమ్మ మధ్యగా నిలచిన ఒక సంవాదాన్ని పరిచయం చేస్తాను - వినండి.

కొర్రకూర తెచ్చాను
గోంగూర తెచ్చాను
వండామని చెప్పవే - తడికమ్మా !
వండామని చెప్పవే - తడికమ్మా !!

కొర్రకూర తెస్తేను
గోంగూర తెస్తేను
వండానని చెప్పవే - తడికమ్మా !
వండానని చెప్పవే - తడికమ్మా !!

తాటిపండు తెచ్చాను
బుర్రగుజ్జు తెచ్చాను
పండామని చెప్పవే - తడికమ్మా !
వండామని చెప్పవే - తడికమ్మా !!

తాటిపండు తెస్తేను
బుర్రగుంజు తెస్తేను
వండానని చెప్పవే - తడికమ్మా !
వండానని చెప్పవే - తడికమ్మా !!

కొత్తబియ్యం తెచ్చాను
కొత్తకుండ తెచ్చాను
వండామని చెప్పవే - తడికమ్మా !
వండామని చెప్పవే - తడికమ్మా !!

కొత్తబియ్యం తెస్తేను
కొత్తకుండ తెస్తేను
వండానని చెప్పవే - తడికమ్మా !
వండానని చెప్పవే - తడికమ్మా !!

నులకమంచం తెచ్చాను
కంబళి తెచ్చాను
వెయ్యమని చెప్పవే - తడికమ్మా !
వెయ్యామని చెప్పవే - తడికమ్మా !!

నులక మంచం తెస్తేను
కంబాళి తెస్తేను
రమ్మాని చెప్పవే - తడికమ్మా !
రమ్మానీ చెప్పవే - తడికమ్మా !!

తడిక మధ్యవర్తిత్వం వహించవలసిన ఘట్టాలు చాలా ఉన్నాయి ! తడిక సంబోధనతో మరో పాట :

వంకాయ వండాను
పరికూడు వార్చాను
తిసమని చెప్పవే
తడికా ! తడికా !!

వగలాడి మాటలకు
ఒళ్ళంత మండింది
వద్దనీ చెప్పవే
తడికా ! తడికా !!

పట్టుచీర తెచ్చాను
పెట్టెలో పెట్టాను
కట్టమని చెప్పవే
తడికా ! తడికా !!

చీరకంచులు లేవు
చుట్టూచెంగులు లేవు
వద్దనీ చెప్పవే
తడికా! తడికా !!

సంతలోకి వెళ్ళి
సరిగంచు చీరను
అద్దాల రవికను
అతివతెచ్చెద కట్టుకోవే !!

ఈ విధంగా మధ్యన అలుగులు వస్తే తడికతోనో, గోడతోనో మాట్లాడుతూ, పనులు ముగించుకొనడం పరిపాటి - ఆది కాస్తసేపేలెండి - తర్వాత తడికను వదిలి - ఇద్దరూ ఒకటవక మానరు !

పైన తెలిపిన తడిక సంవాదాలుతోపాటు బావను మాటల్లో ఎంత గమ్మత్తు చేస్తూందో ఈ సంవాదంలో చూడండి - ఇటువంటి పాటలు చాలా సరదాగా ఉంటాయి.

ఒకరీకి చేతూలిచ్చాన్
ఒకరీకి కాళ్ళానిచ్చాన్
ఒకరీని చేతబట్టీ
కూకున్నానోయ్ బావా !
కూకున్నానోయ్ !

ఎవరీకి చేతులిచ్చావ్
ఎవరీకి కాళ్ళనిచ్చావ్
ఎవరీనీ చేతబట్టి
కూకున్నావే పిల్లా !
కూకున్నావే ?

గాజులకి చేతూ లిచ్చాన్
కడియాలకి కాళ్ళ నిచ్చాన్
దబ్బుల్నీ చేతాబట్టి
కూకున్నానోయ్ బావా !
కూకున్నానోయ్ !

ఒకరీని నానావేశాన్
ఒకరీని చితకాగొట్టాన్
ఒకరీని చుటాచుటీ
కూకున్నానోయ్ బావా !
కూకున్నానోయ్ !

ఎవరీని నానావేశావ్
ఎవరీని చితకాగొట్టావ్
ఎవరీని చుట్టాచుట్టీ
కూకున్నావే పిల్లా !
కూకున్నావే ?

సున్నాన్నీ నానవేశాన్
వక్కల్నీ చితుకాకొట్టాన్
ఆకుల్నీ చుట్టాచుట్టీ
కూకున్నానోయ్ బావా !
కూకున్నానోయ్ !

ఒకరీని కట్టేవేశాన్
ఒకరీని పదిలీవేశాన్
ఒకరీని చేతాబట్టీ
కూకున్నానోయ్ బావా !
కూకున్నాయ్ !

ఎవరీని కట్టీవేశాప్
ఎవరీని పదిలీవేశావ్
ఎవరీని చేతాబట్టి
కూకున్నావే ఓసీ !
కూకున్నావే ?

ఆవుల్నీ కట్టివేశాన్
దూడల్నీ వదిలీవేశాన్
చెంబూనీ చేతాబట్టీ
కూకున్నానోయ్ బావా !

పిల్ల చమత్కారం చూడండి - బావను మాటల్లో తాలింపువేసి ఉడికించి-వేపించి - ఆఖరున పకపక నవ్వులు కురిపిస్తుంది.

సంసారంలో - జీవిత నాటకరంగంలో - అసంతృప్తి, లోటు - బాధ, ఆలోచనలు - సమస్యలు - ఏవో ఉంటూనే ఉన్నా - ఆ కాస్త లోనే - ఏదో ఒక సంతృప్తి కల్పించుకుని, ఆ సంతృప్తినే మధురానుభూతిగా తలచుకు, పులచుకు - ఆనందంలో మునగడం.

కట్టుకున్న భార్య, లేదా ప్రేమికురాలు - వేడెక్కిన హృదయాలకు - చల్లని పానీయంలా - నాలుగు మాటలు పలుకరించి - ఓ చిలిపి చూపు పారేసి-ఓ కొంటె పలుకు విసురుతే - ఆ ఆనందానికి హద్దెక్కడ ? మేకవన్నె ??



నోము వ్రతాల పాటలు

*వ్ర*తాన భారతీయ సంప్రదాయంలో హిందూమత ధర్మంలో మహిళకు అన్ని వారాలూ నోములే-శ్రావణ మంగళవారం వ్రతం, శ్రావణ శుక్రవారం నోము-ఇలా అన్నింటికీ ఏదో నోము, వ్రతం, పూజ ఉన్నాయి-చేసుకోవాలే గాని-సంవత్సరం పొడు గునా కావలసినన్ని చేసుకోవచ్చు. అలాటి వ్రతపు పాటల గుత్తి లోనిదే ఈ శ్రావణ మంగళవారం పాట*

ఈశ్వర పుత్రునకు గజాప తారుసకు పార్వతీ తనయుసకు భక్తితోనూ
వాక్కు బుద్ధినిచ్చు వైభోగరాయునకు శారదాంబను నేను సన్నుతింతూ
మహిమీద ఒకరాజు సంతానము లేక సౌభాగ్యవతి పదవి తా నేలుచుండె
పరమేశ్వరుడు తన యాత్మలో హర్షించి ఇహపరాదులు వారి కిత్తమనుచు
లింగంబు తానొక్క జంగమొతారమై గురుధర్మ ఘోరాండమనుచు వచ్చె
మేడమీదనుంచి దిగివచ్చి యాసతీ బంగారు పళ్ళెముతో నాపెముగనూ
వణచిరాగా చూచి పరమేశ్వరుడు తాను నిమిషంబు నిలువగా పోయెనపుడూ
ఇదియేమి చోద్యమో ఎరుగవలెననీ మరుదినము నాటికీ ముందుగానూ
మరుగు చాటున యపుడు కాచికొని ఉండగా గంటలు మ్రోగుచువచ్చె శివుడూ
పచ్చిస జంగాన్ని పోనీక పట్టుకొని ఇదియేమి కారణము అని యడిగెనూ
పుత్ర పౌత్రులు లేరు మీచేత భిక్షం హరహర అంట రాదని బల్కెనూ
మాకేగతియనుచు సతిపతు లిద్దరు సాష్టాంగ మొసగిరి శివునికపుడూ
పరమేశ్వరుని గూర్చి తపస్సు చేయమని ఆనతిచ్చిపోయె ఆ జంగము
సతిపతు లిద్దరును రాజ్యమును విడిచి పరమేశ్వరుని గూర్చి తపస్సు చేయ
వారిభక్తికి మెచ్చి పరమేశ్వరుం డపుడు ప్రత్యక్షమయ్యేనూ రాజుకపుడూ
ఇచ్చితిని ఒక వరము మెచ్చితిని పొమ్మనుచు స్త్రీజన్మమా పురుషజన్మ మనగ
ధర్మవతియైనట్టి పుణ్యవతిని నిత్తునా పదహారు వత్సరముల సుతునిత్తునా
సతిపతులిద్దరు చర్చించుకొని వారు పరమేశ్వరునితో భాషించి
ధర్మపతిని చూసి తాళలేము మేము పుణ్యమేమో గాని పుత్రుడనెనూ
ఊరికి ముందరా కాళికా గుడివెనుక చూత వృక్షమునందు ఫలమున్నదీ
ఆ ఫలము తెచ్చుకొని భుజియింపుమని పలికి మాయమయ్యే నా దేవుడూ
ఆరాజు హర్షముస ఆవృక్ష మెక్కియు ఆఫలమున్నియు కోసి తెచ్చి
పణతి ముందరపెట్టి విప్పిచూడగానే ఒకటే ఫలమై నొప్పుచుండె
ఈశ్వరుండిచ్చిన ఫలము ప్రాప్తియింతే అధికఫలము వచ్చునా
అనుచు భుజియించగ అతివ గర్భమునిలిచి నవమాసములు నిండె నాతికపుడు
సూర్యతేజంబుతో వొప్పేటి సుతునికి పుత్రోత్సవం బుట్టే బుణ్యశాలి
సంతోషమున రాజు నామకరణం బ్రాసె నారాయణా యని నామమిడిరి
రాజకుమారునకు రమణుబందరు గూడి ఉగ్గుబమనాబెట్టి ఒప్పుగానూ

దిష్టితగలకుండ చుక్కబొట్టూ పెట్టి శిరసంటి తొట్టిలోనుంచి రపుడూ
బాలప్రాయమునాడు బాలతొడుగు తొడిగి ఆట ప్రాయంబునా ఆటజూచి
నాట పెంచినవాని నూట పెంచీనట్టు కాశీయాత్రకు చాల ధనముకట్టి
కాశికి బోదామంచు ఘనముగా ఇద్దరూ కాశిపట్నానికే వచ్చారూ
ఆ వనానికిపోయి అతిచాల బడలికగొని పరమేశ్వరాజ్ఞచే నిలచిరపుడూ
శ్రావణమాసాన భౌమవారమున మంగళగౌరినీ పూజింతురూ
అంగనలు తామరపూలు కొయ్యారాగా రాజకూతురు వచ్చె రమణివెంట
పుణ్యాంగన లెల్ల పువ్వులు కోసుకురాగా సంపడివడి రాజు నడుమనిలచె
సత్యవతీకన్న మాంగల్య పతియని చెరుగుముడి వేసికొని శీఘ్రముగనూ
అరాత్రి నగరులో ఆ ఇద్దరును నిలిచి తోటలో నుండగానూ
అక్కడికి చనుదెంచి తన్నంత నిమిషమున తోడుకొనిపోయి మధుపర్క మిడీ
తా జదువు శాస్త్రాలు అన్నియును గావించిలాజహోమము వేల్చె రమణితోనూ
అగ్నిసాక్షిగ పెండ్లి ఆడినా సతిగూడి సప్తబుషులకు ప్రొక్కి సంభ్రమముగ
వధూవరు లిద్దరికి వొప్పు బువ్వంబు చేయించి రచ్చోట శీఘ్రముగనూ
రాజు అందరు తాము రమ్యముగ భుజియించిరా వెనుక గద్దెనుండె
చిత్తరువు వ్రాసినా చవికెలోపల మంచి మట్టిమంచెము వాల్చి పరుపు పరచి
కస్తూరి పునుగు జవ్వాది మొదలుగ దెచ్చి వొప్పుతో కలిపిరి వధువరులకూ
గిన్నెలో పాలు చక్కర తేనె లెన్నింటినో ఆరగించ తగబెట్టిరీ
కర్పూర భాగాలు పచ్చని చెంబుతో పన్నీరు తెప్పించి ఉంచిరపుడు
దంపతు లిద్దరు ఇంపుతో భుజియించి సంతోషముగ తాంబూల మొసగి
సతిరొడమీద పాదమూని యాగిన్నె భక్తితో ఉంచెనూ గుర్తుగాను
తూగుటుయ్యాలపయి దంపతులిద్దరూ శయనించి నిద్రలూ జేయగానే
కాలమృత్యువు వచ్చి కాల సర్పంబయి బాలకుని గరువంగ జొచ్చెనపుడూ
మంగళగౌరీ మగువ స్వప్నమందు నీపతికిని గండ సమయమీది
మాంగల్యవతి నిద్ర శీఘ్రముగ మేల్కొని కనుదెరచి చెలియచూసీ
మాంగల్యవతి నిద్ర శీఘ్రముగ మేలుకొని కన్నూలూ తెరచి తా కలియచూచీ
కృష్ణ సర్పము చూసి కిలకిల నవ్వుచు స్వర్ణ కలశము తెచ్చియుంచి
బాలభక్తికి మెచ్చి నాగేంద్రు డప్పుడు కలశంబులో ప్రవేశించెనపుడు
చుట్లు చుట్లును అతను పవళించియుండ ప్రదక్షిణం తాజేసి ప్రొక్కి నిలిచె

ముత్యాలు గూర్చిన దవికె తాను విడచి వాసినాకట్టుకొని ఎదుట నిలిచె
పతిప్రాణ మెత్తుకొని పంకజాక్షి తాను తిరిగి శయనించి కడునిద్రపోయి
అరుణోదయం వేళ ఆరాజు మేలుకొని నేటి గండం మనకు గడచెనిపుడూ
ఎవ్వరికీ చెప్పకా ఇద్దరూ తరలి కాశికి చేరిరీ శీఘ్రముగనూ
తెల్లవారంగానే ఎల్ల ప్రజలూలేచి పన్నీరుచిల్క్రా ముగ్గులు పెట్టి
రత్నాలు గద్దెలు రమణులు ఉంచిరి వధూవరులు వచ్చి నిల్చిరపుడు
పెండ్లికూతుర్ని లేపి శృంగారములు జేసి రత్నాల గద్దెపయి ఉంచగనే
తప్పక వరుని ముఖముతాను చూచి తనపతికాడనీ తలచెనపుడూ
లేచి మేడమీద కూర్చుండి చింతించి జాణలైనట్టి సఖియలెల్ల
నేర్పుతో నీపతి అవునని అందరూ తలపోసి తెలిపిరా సఖియలెల్ల
సవ్యవతి యాదకన్నె తన తండ్రినీ బిలచి నామాట వినియు నన్నాదరించు
నీవు సత్రమునేడు నిజముతో నిలిపితే భక్తితో తాంబూల మిత్తునేను
కాశిచేరియు వాడు గంగ స్నానముచేసి కాలభైరవుల దర్శనము జేసిరీ
అన్నపూర్ణను చాల అతిభక్తి వేడుకొని విశ్వేశ్వరుని గుడి దర్శించిరీ
మణికర్ణికాదేవి తిరువేణి దర్శించి బిందుమాధవ దర్శనముచేసిరీ
భాగీరథిని చాలభక్తితో వేడుకోని తిరిగివచ్చినవారు కాశికపుడూ
కాశిచేరినవారు గంగస్నానము జేసి కాశిపట్నానికే వచ్చినపుడు
మహారాజు సత్రాన మామ లల్లుళ్ళు గంగదించి నిలిచిరపుడు
వచ్చినవారినీ భుజియింపు డంచేను వొల్లమని వారితో పలికిరపుడు
స్వయంపాక ముందుకోని అందరూ భుజియించి నిలిచిరీ నిమ్మాల నీడలోను
కర్పూర బాగాలు కాంతతా నిచ్చె అక్కడికి వేంచేసే అందునుండి
కాశి వాసులకేల కర్పూరభాగాలు వొల్లమని వారితో పలికిరపుడు
అరదేశి పరదేశి రాజులు విప్రులు భుజియించి తాంబూల మందుకొనిరాగ
మీరేల ఎల్లరని పరిచారకులు పోయి తోడుకొనిపోయి రాజసమక్షమునకు
రాజ రాజసముఖమున రమణితా కూర్చుండి నాథుడూ వచ్చేటి రాకజూచి
తాను మనంబున చాల సంతోషించి తాంబూలమిచ్చి తా కరముబట్టె
తాంబూలమూ ఇచ్చి కరముతానుబట్టి ఆనందబాష్పముల కురిపించెను
ధన్యురాలనై తి దరిజేరితిని నేను రాజుకు ముద్దు కూతురనై తిని
ఇదియేమి చోద్యమో వెరుగుపడి జూచుచు ఆశ్చర్యబడి రాజు అడుగగానె

నీకు గుర్తుగలవు నీలవర్ణపు సీవు సత్యముగ తెల్పుమో వృత్తాంతము
కాశికి బోదామనుచు కాంక్షతో నిద్దరము నిలిచి తోటాలోనె ఉండగాను
అక్కడికి వేంచేసి నన్నింక నిమిషమున మధుపర్క మిచ్చి కల్యాణమండె
పణతి నా తొడమీద పాదంబు నానించి హత్తుగా నిలిపెను
సువర్ణ కలశంబుదెచ్చి దేదీప్యమై వెల్గ బుజ్జగింపుచు కంఠమాలవేసె
ఆకాశమంతాను పందిళ్ళుగా వేసి భూమి అంతటి అరుగువేసి
తోరణములు గట్టి నగరు శృంగారించి కళ్యాణ వేడుకగాచేసిరి
గోదానముజేసి భూదానముజేసి సువర్ణదానము చేసె సొంపుతోను
అశ్వదానముచేసి గజదానము చేసి కన్య దానముజేసె ఘనముగాను
ఆ రాత్రి నగరిలో కన్య వధూవరులు తల్లిదండ్రులను తలచుకొనెను
అని బుజ్జగింపుచూ మామతో అల్లుడు శీఘ్రముగా సీమకు వెళ్ళవలెను
ముద్దుకూతురికిచ్చె ముత్యాల పల్లకీ పచ్చలపల్లకీ భాగీరధి
కోటివేలుజేయు ఉత్తమాశ్వమునిచ్చి అల్లునీ కూతురిని అంపించెను
తెలిసిన ఫలమెల్ల గ్రక్కున వెడలెను భక్తితో గూడ బాలుడును
గంగను ముందర నుంచుకొని తమ సీమచేరి తనక్షేమములు చెప్పిపంపెనూ
తనతోడి జనమెల్ల తక్షణం వెడలగా భక్తిగా నీబాలు డొచ్చెననుచూ
పుత్రుడని చెప్పగా ఉత్సాహమును బొంది ఆలింగనము చేసి అతివతోను
ఏమినోమునోచి ఏవ్రతముజేసితి పుత్రభిక్షంబెట్టె పుణ్యశాలి
సత్యము తప్పకా మాంగల్యములు గడా మంగలగౌరునూ పూజించిరి
భాగీరధీ చాల భక్తితో పూజిస్తి మీవంటి అత్తమామను గలుగునా
ఎక్కువ రాజ్యము మిక్కిలి సంపదా తరగతి అయిదు సాధక సౌఖ్యములూ
ఎప్పుడూ పూజపై మాంగల్యములు గలవు మంగళగౌరునూ బూజిస్తిని !

చిలుకు ముగ్గులు



శ్రీకరంబగుచున్న శ్రీ లక్ష్మితులసీ ఏకచిత్తంబునా ఏమరకదలకు
మహిమీద వెలసినా మహలక్ష్మి తులసి మనసు పూర్ణంగాను మరి హరినిదలతు
వేదశాస్త్రంబులా వెలసినా తులసి పాదుకొని నా హృదయ పావనంగాను
నల్లనిరేకులా తులసమ్మదెచ్చి బృందావనంవేసి కుదురొప్పనిల్పి
సూర్యోదయంబందు గోమయందెచ్చి అలికిన అత్యంత పాపములు పోవు
ముగ్గున పద్మములు పెట్టిరెవరయినా మూడులోకంబుల ముక్తులై ఉండ్రు
పద్మాన పంచవన్నెలగూర్చి రెవరయిన లెక్కలేని పుణ్యఫలమనుభ విండ్రు
ఎండిన పండినా ఏచిపూచినను నిండయిన భక్తితో నినుగొల్వ వలెనూ
మృత్తికసోకినా మేనంతలోనే అపమృత్యు లెడబాయు నా క్షణమునందు
నిండుపుదకంబులూ పోసినవారలు మండలం ఏలుదురు మత్తేభ గమనా

తుఁసమ్మ కళ్లార చూచి మ్రొక్కినను అపమృత్యు లెడబాసి ముక్తి బొందెదరు
పలగొని అభినందనఁబు జేసినను వారణాసీ పురివాసమే గద్దు
విప్రకుల వర్ధనుడు వేదబ్రాహ్మణుడు తప్పదు తనపూర్వ కృతఫలము ఎంతొ
పలుమారు వేదములు పల్కుచూతాను సతిపతులు ఇద్దరు అతివినయముతో
సంతతిలేకయూ చింతించుచుండి పరమేశ్వరుని గూర్చి బ్రస్తుతిశాయ
ఘోరమైనట్టి ఆ తపసునకుమెచ్చి వనజనాభుండంత ప్రత్యక్షమాయె
విప్రవేషంబునా వచ్చితానిఁచి ఎందవాననకయే ప్రొద్దుమీరు
నిండుభక్తితో నుండ కారణంబేమి తపమునకు మెచ్చితిని కోరుడీ వరము
ఇచ్చెద ఇష్టంబు ఈ క్షణమునందు సుతులులేని వెల్తి వక్కటేగాని
మహరాజ చింతలూ మరియేమి లేవు విప్రునిమాటలకు విష్ణుండు తాను
ఇచ్చెద వకవరము ఇంపుమీరంగా పదహారు వర్షములా బాలునిత్తునా
సౌభాగ్యవతి గాని సుదతి నివ్వనా విప్రుని పల్కులకు పేద బ్రాహ్మణుడు
సతిపతులు ఇద్దరూ మదిలోన దలచి పుత్రునిశోకంబు పొందలేమింక
సౌభాగ్యవతిగాని సఖియ నిమ్మనెను ఊరువెలుపల నుండు వక చూతమ్రాను
ఫలము దెచ్చి పణతికిమ్మనెనూ అనిచెప్పి విష్ణుండు వైకుంఠమేగె
దంపతులిద్దరు తమ గృహముకొచ్చి వేకువఝామునా వేగ మేల్కొని
తోటకు ఏతెంచి బ్రాహ్మణోత్తముడు చూతఫలములుగోసి వడినిండవేసి
ఇరవుగా తన ఇంటి కేతెంచి చూడ వనిత ముందరబెట్టి విప్పి తాజూచె
పక్కటే ఫలమందు వొప్పుగానుండె పరమేశ్వరుండిచ్చు ఫలమింతె గనుక
అధిక ఫలమొచ్చునా అతివరొ మనకు ఆనుచును ఆ నాతి ఫలమారగించె
నవమాసములు నిండె నాతి కంతటను దశమాసంబొచ్చు తగు సమయమందు
చిత్తమొచ్చినట్లు చేసెనా బ్రహ్మ చిత్తరువు ప్రతిమవలె చెలియ జన్మించె
కట్టడిబుద్దులుగా గాంతకూ జెప్పి గట్టిగ లలాటాన ముమ్మారు వ్రాసి
ఇచ్చెను వక సుతమ ఇంపుమీరంగ దశ దినంబులు గడపి తరుణికే తమరు
నారాయణమ్మనుచు నామంబుబెట్టె అచ్యుతుని బలచుచూ అనుదినంబునను
నాటనుబెంచియు మాటబెంచీరీ పణతికి పరిణయం బాచరించీరి
పంచమాదినమందు బాలుండు తాను ఎంచంగ యమపురికి అతివేగజనియె
ముద్దుపుత్రిక జూచి ములసు లిద్దారు సతిపతులిద్దరు అతిదుఃఖమొంది
అతివకు తగినంత ధనములు ఇచ్చి పరలోక గతులయిరి వృద్ధమిధున్నంబు

జనని జనకులు లేక చేడె తానుండె బృందావనంవేసి కుదురొప్పనిల్పి
పూజసేయుచునుండె నా విప్రకన్య విప్రులు వచ్చినా బిడియంబు విడదు
పెద్దలు వచ్చినా ప్రియము సేయాదు కాంతలు వచ్చినా కండ్లజూడాదు
కనకంబుపై తాను కాంక్షచూపదు పరమాత్మకు దయవచ్చి పణతిదగ్గిరకు
విప్రకులవేషమున వృద్ధరూపమున జన్నిదము ధరియించి వేదంబు జదివి
కప్పుకో చల్లని కావిధోవతులు వస్త్రంబుచాటునా వటపత్రమూని
హస్తంమున దండంబు అవలంబించి పట్టుకు చనుదెంచె పణతి వాకిటకు
పెట్టును వకభిక్ష పేదబ్రాహ్మణుడికి చుక్కతెల్లవారె వక్కభిక్షమ్మ
ఎక్కడ ఉన్నదని ఇంటింతా బల్కె ఆరణోదయంబాయె ఆకలికి వోర్వ
మరణకాలమువలెను మరి వచ్చినాది పెట్టుము వకభిక్ష పేదబ్రాహ్మడికి
వండి వార్చి తెల్లవారింది ఇదిగో వృద్ధువని వగచి నీవద్ద బెట్టెదను
బలి అయిన పెట్టుమనె బ్రాహ్మణోత్తమడు బల్బల్లె పొమ్మని పణతి తాబల్కె
ఏమయిన గైకొనక ఈడనొక్కడును ఏమయిన ఇవ్వనీయింతి తాబల్కె
గోశుద్ధిజేసి నా గోమయంగుడ్డ గొంతితా కోపించి గోవిందుపైని
పడవేయగైకొని ఆ పొరుడపుడూ ఇదె పదివేలని అందుకుని చాల
సరస్సు వద్దకి పరుగునా జనియూ పేరికి వస్త్రంబు పెద్దగాజేసి
పరికించి చూచితే ఫలమొక్కటుండె కందిగింజయుజూచి కడు సంభ్రమమున
కడువేగమునదెచ్చి యా కందిగింజ నేల పెల్లాగించి నీలవర్ణుండు
సత్యంగల పాదునా విత్తనంనాటి దొప్పకుడురుగజేసి దోసెడుదకంబు
నిత్య సంరక్షణలు నేర్పుతో జేసె కొమ్మ పువ్వాకాయ కొమరొప్పచుండె
నారాయణమ్మయూ నాగలోకంబు చక్రధరు సన్నిధిని చేరినిలచుండి
కరుణసాగర నాకు గతియేమొచెప్ప పెట్టినవారికే పుట్టుదేసాక్షి
పెట్టనివారికి పుట్టనిదెనిజము పెట్టినవారికే పెద్దకాలమ్మ
అయివ్వార్య విభవములు అజుడుతానిచ్చు కసువు నీళ్ళనుత్రాగి కడుమయిలగట్టి
ఇసుకతిన్నెలవెంట ఇంతి నీవుండూ దూసుకుతినుకాయ దోసెడుదకంబూ
ఆశ్రయించుకువుండు అవనిమడుగులనూ పణతిపొమ్మని పల్లె పురుషోత్తముండూ
వెలదులకు ఆ వ్రతం కాచెంచినపుడూ ఆశ్వయుజశుద్ధ యేకాదశి మొదలు
పాటింపకార్తీక పున్నమవరకూ పఠియింపుడే ముగ్గు పరిపూర్తిగాను
చాతుర్మాస్య నెల్లాళ్ళు తుడిసి పూజించి ఏకాదశినాడు ఉపవాసముండి

నాల్గఝాములు మగ్గునాతి తా బెట్టి హరివాసరంబునా జాగరణ జేసి
ఉత్తమ ఏకాదశి చిలుకు ద్వాదశి తులసెమ్మనెవ్వరు పూజించువారు
తులసిని పూజించె శ్రీలక్ష్మిదేవి అన్ని లోకంబుల ఆనతిచ్చిందీ
శ్రీలక్ష్మి ఆనతిని సృష్టిలో జనులు శుభకరంబుగ తులసి పూజింపుచుంద్రు
అందముగ తులసి దేవగురుమందార కుందనంపూరోలు కుదురుగాద్రోచి
అయిదుశేర్ల బియ్యం పిండి మరగొట్టి పీసె యేబులం బెల్లమ్మువేసి
ముత్తయిదు తా జేసె మూడు ముద్దల్లు తులసమ్మ కొకముద్ద తృప్తితోబెట్టె
బ్రాహ్మణుని కొకముద్ద భక్తితోబెట్టి తన పాలిముద్దయు రోటిపై నుంచె
తనపాలి ముద్దలో పాలునెయ్యి బోసి శ్రీరక్ష్మి వేంచేసె శ్రీహరికడకూ
దండ నమస్కారంబు దగభక్తి జేసి వందనంబులు జేసి ముందరను నిలిచె
చిరునవ్వు నవ్వుచూ శ్రీకృష్ణుడపుడూ శీఘ్రముగ శ్రీహరి సతితోడబల్కె
ఓసతి శ్రీలక్ష్మి సుభద్ర నీవు కడువేగవచ్చినా కారణంబేమి
చేతులు ముడుచుకొని చేడె తా నపుడూ శౌరితో ప్రియురాలు చెప్పంగదొడగె
శ్రీకృష్ణ ప్రీతితో చిల్కుదంపేము శీఘ్రూనవేంచేయి శ్రీహరి మీరు
అవనిలోబుట్టినా అన్ని జీవులకూ ఆధారమివ్వకా అటుమేము చనమూ
మనకులపావనీ మనభక్తురాలు మన నామ మెన్నడూ మరువదెన్నాడు
ఆ చేడె దోడుకొని ఆతివ నీవొస్తె వచ్చెద నేనని పల్లభుడు బల్కె
ఆ మాట విని పణతి ఆశ్చర్యపడుచూ ఇంటికి పేరేమి యిల్లెక్కడయ్యా
ఇలలో నారాయణమ్మ ఇంతిపేరు ఇల్లులేకను వుండె అలమర్రి క్రింద
ఆతివయొద్దకు యేగె నతి శీఘ్రముగనూ అందెలు పాదార విందమున క్రోయ
పొంకముగ మృగనాభి కుంకుమాజార మానుకడ కేతెచి మగువలిద్దారు
మానవతి వేంచేసి మా నగరుకిపుడు కోరిన వరమిస్తు కొమ్మరమ్మనగ
పేరెరిగి పిల్చితివి ప్రేమతోననూ ప్రేమతో మీ నగరున పనియేమొ చెపుడీ
శ్రీకృష్ణ ప్రీతిగా చిల్కుదంచేము శీఘ్రూన వేంచేయి చెలియ మా కడకూ
బిందు ఫలమిచ్చితే అందు వచ్చెదనూ బిందు ఫల మీకున్న అందు రా ననెనూ
ఇచ్చెద వక వరము ఇంతి రమ్మన్నా హస్తము చాచెనా అతివంతలోన
హస్తకంకణాల ఆ ఆదిలక్ష్మి అక్షింతలుదకంబు అతివదానుంచె
ఆ చేడె దోడుకుని కడువేగమునను శ్రీలక్ష్మి వేంచేసె శ్రీహరికడకు
వక వరము ఇచ్చి ఆ ఇంతి నిటుదెస్తి వచ్చిపోకనయిన హరి జోదరుడ

పతికి వరమిచ్చితే ఆతివగూడెదను పతి నంపగా నేను సరగుననురాను
జన్మ జన్మాలకు జేసిన పాపమ్ము చపలాక్షి నాతోటి చెప్పుమిపుడయినా
పదివేల జన్మాల పతిని వేసితిని పాపపు జీవుడికి హరిప్రాపుగల్గె
పతితోడ బుట్టినా పతివచ్చితేను గైకొనక కంట్రకా లాడినదాన్ని
ఇరుగనక పొరుగనక ఏ ప్రొద్దుబోయి కాంచుడి కలహంబు బెట్టినదాన్ని
కరుణసాగర నాకు గతియేమొ చెపుమీ నా నామమును విడిచి నన్నుదలచితివి
నాతి నీవు వైకుంఠమందు నుండుమీ పణతి వైకుంఠపురము కపుడేగె
శ్రీలక్ష్మితోగూడి శ్రీహరియుతాను ద్వారకాపురమునకు చనుదెంచి వేగ
కశ్యప వశిష్టాది గౌతమా మునులు అట్టె భారద్వాజులా జమదగ్ని
శౌనకాదులంత ననుమ్మనీశ్వరులు కలకంఠుడూ హరికి జలకంబు వేగ
కమల నాభుల వెంట కదలిరారమ్మా సరగునను రుక్మిణి జలకమందిచ్చె
తరుణి సత్యభామ తళ్కొప్పనొత్తి వలనొప్పరాధికా వస్త్రమందిచ్చె
గంధంబు హరిమేన మిత్రవిందదె సూటిగా లక్ష్మణ సురటితా విసరె
విరులు దండలుయిచ్చె వేడుకతో భద్రజాంబవతి తొడుగులు తెచ్చియందిచ్చె
కాళింది శ్రీహరికి కడునలకరించె ముద్దుల గుమ్మలు తులసికడకేగి అంత
కుందనపూరోలు కుమురుగా ద్రోసి అయిదుశేర్ల బియ్యం
ఆందులోనుంచి కుందనపు పచ్చలా దోరణాల్గట్టి
మట్టెలల్లాడగా చిట్టిపాదము పట్టుదొడుగుల సరసపణతి యేతెంచె
కమ్మలల్లాడగా బొమ్మవలెనీవు రమ్మ సరస్వతీ రమ్మి పేరంటం
శంఖుపూసల పేర్లు ధరియించుకూని శంకరుల పార్వతీ రమ్మి పేరంటం
ఏడువారపుసొమ్ము లింపుతోబెట్టి ఇంద్రశచీదేవి రమ్మి పేరంటం
చెరుకుచీరలగట్టి చామంతి ముడిచి చంద్రుని రోహిణీ రమ్మి పేరంటం
హస్తకంకణములు హస్తమున మెరయా అర్జునుల సూభద్ర రమ్మి పేరంటం
పట్టుపీతాంబ్రము బాగొప్పగట్టి పాండవుల ద్రౌపదీ రమ్మి పేరంటం
నూడిగంబులుంచి సూటిగా మెరయంగా సూర్యుని ఉషాదేవి రమ్మి పేరంటం
కొల్లారు బళ్ళెత్తి కొడుకులాతల్లి వేగరా వెంకటరాయులా మంగా
గ్రక్కున కరకంచు చీరయుగట్టి కాశీవిశాలాక్షి రమ్మి పేరంటం
బ్రాహ్మణవీధులా ఓ పణతులారా భక్తితో మాతులసి పాడరారయ్యా
వేసారివీధుల ఓవెలదులారా వేడుకతో తులసి పాడరారమ్మా

కోమటివీధుల ఓ కొమ్మలారా భక్తితో మాతులసి పాదరమ్మా
అనుచు పేరంటాళ్ళ నందర్ని బిలువ అర్జునుల సుభద్ర లక్ష్మితో వచ్చే
కాంతలందరుగూడి కడువేగవచ్చె అందముగ తులశిదే వరుగు ముందార
గోమయం చేతను శుద్ధి దగచేసి పంచవన్నెల ముగ్గులు పణతులు బెట్టి
పంచదళపద్మములు పణతులుంచిరి అష్టదళ పద్మాలు అతివలుంచిరి
లక్ష్మియు శ్రీకృష్ణులు అలంకరించుకూని వచ్చి కూర్చుండిరి వరుసతోడుతను
లక్ష్మీనారాయణుల స్థాపించిరచట పుష్పగంధములతో పూజించిరపుడూ
పొన్నలు పొగడలే బొండు మల్లెలుసూ పారుజాతంబులా తులసి దలంబులతో
పరమాత్మ శ్రీకృష్ణ పూజించిరపుడూ బెల్లము పంపియు చలిమిడిగొట్టి
ముత్తయిదు తాజేసె మూడుముద్దలూ ధూప ధీపంబులు తృప్తితో యిచ్చి
నయివేద్య నిచ్చెనూ నారాయణునకూ వేదంబు జదివినా విప్రుని బిలచి
గంధ మక్షతలిచ్చి పాదాలుకడగీ దక్షిణ తాంబూలాలు భక్తితో నిచ్చి
వాయన దానంబు వనితదా నిచ్చె దానమందుకు నంత వేదవిప్రుండూ
ఆశీర్వచనము చేసి అక్షింత లిచ్చె తనపాలి వకముద్ద రోటిలోనుంచీ
పాలు నెయ్యిబోసి పరగ మర్దించి వేళ్లగల చెరుకు కోలలూదెచ్చి
నల్లచెరుకు కోల నాతిచేపట్టి వుంగరములా చేతయు విధాతబట్టీ
కంకణములాచేత కాంత తాబట్టె
సోమకుని జంపి వేదము లుద్ధరించి అందముగల మత్స్యావతారా సువ్వి
మందరగిరి అయిన మరిగ్రుంకిపోను కూర్మావ తారుడైన గోవింద సువ్వి
వసుధ చుట్టుకుపోగ వారాహమయినా వరహావతారుడా వనజాక్ష సువ్వి
స్తంభము వెడలియు కశ్యపుని జీరి నరసింహరూపుడౌ నలినాక్ష సువ్వి
పృధ్వి మూడడుగులూ దానంబుగోరి బలిదైత్యు నణచు నావామనుడ సువ్వి
పృధ్వి రాజులను బరిమార్చినట్టి పరశురామావతార నీకునూ సువ్వి
రామావతారమున రావణునిజంపి సీతానేలునట్టి శ్రీరామ సువ్వి
ముసలముసలనియని అసురులు క్రమవిబలాముతైయున్న పరమాత్మ సువ్వి
బౌద్ధావతారమున బుద్ధులూ బెంచి స్త్రీల నేలినట్టి శ్రీకృష్ణ సువ్వి

కల్క్యవతారమున ఖలులనూ ద్రుంచి కలియుగమే బ్రోచినా కమలాక్ష సువ్వి
ఆల్లోనేరడల్లో ధ్యనుచూ అతివలంతా కలసి చిలుకుదంపేరు
సతులు పతులూగలసి చల్లులాడేరీ శ్రీవిష్ణు పైజల్లె శ్రీలక్ష్మితాను
బ్రహ్మపయి జల్లె భారతీదేవి శంకరులపయిజల్లె ఆ ఉమాదేవి
ఇంద్రుని పయిజల్లె శచియుదేవంత చంద్రుని పయిజల్లె రోహిణీదేవి
సూర్యుని పయిజల్లె ఆ ఉషాదేవి అర్జునుల పయిజల్లె నింతి సుభద్ర
పాండవుల పయిజల్లె ద్రౌపదంతటను పతులు సతులు తమరు చల్లులాటంగా
విడియమ్మ లిచ్చిరి వేడుకలాయె ముత్తయిను కాముద్ద మునముకో నిచ్చె
అల్లానేరేడల్లో యనుచూ ఉత్తమ ఏకాదశి చిల్కు ద్వాదశి
తులసమ్మ నెవ్వరు బూజించువారు తులసి బూజించెనే శ్రీలక్ష్మిదేవి
అన్నిలోకములకూ ఆనతిచ్చిందీ శ్రీలక్ష్మి ఆ సతిని సృష్టిలో జనులు
శుభకరంబుగ తులసి బూజ చేయుదురూ *

నాగుమయ్య పాట



నాగస్వరం పాడితే నాగులకు నిద్ర
పుట్టలో నుంటేను భూములకు నిద్ర
అమావాస్య పున్నాల మసగలేసుద్ది
పాటమీదాకొస్తె కక్షకట్టేను
బూకరించుచు పడగ బుస్ కొట్టేను
గుడిలో నాగులు కొల్చిన దేముడు
పిల్లలందరు కొలిచి పుల్లలేరాబోతె
పుల్లల్లో ఉండేటి ఓ పుల్లనాగ
ఇల్లలికి ముగ్గెట్టి మల్లెలు విరజిమ్మి
మల్లెల్లో ఉండేటి ఓమల్లినాగ

గొల్లభామలు గూడి చల్లల్లు చేయంగ
చల్లకుండా క్రింద చల్లనాగయ్య
ఇవతలా ఇటుకొండ అవతలా అటుకొండ
నట్టనడుమకొండ నల్లత్రాచయ్య
ఉసిరిక చెట్టుక్రింద పసిరికపాము
కుబుసమూడిన పాము పడగ బుస్సంది
పాము నన్నూ చూసి పడగనెత్తింది
పడగలెత్తకు నాగు పగవారము కాము
పడగెత్తి చూసింది నాలుకలు రెండూ
నాలుకలు దూయకే నీవారము నాగు
మంచినాగూవైతె పంచెలెట్టేము
కోడెనాగూవైతె కోకలెట్టాము
పడగలెత్తకు నాగు పగవారముకాము
మా చేను పండితే చలిమిడేసేము
మా నువ్వులు పండితే చిమ్మిలేసేము
నాలుకలు దుయ్యకే నీవారము నాగు
మా పత్తి పగిలితే పంచెలెట్టేము
మా ఆవులీనితే పాలుపోసేము !
పడగలెత్తకు పాము పగవారముకాము
నీ పూజ చేసెదము నీకు మ్రొక్కెదము
నాగమయ్య దిగరా నా తండ్రి దిగరా
నాగన్న దిగిరార నాగా దిగరా
దిగుదిగునాగా దివ్యసుందరనాగ
నల్లన్ని నా నాగ నా ముద్దు నాగ
నవనవలాడేటి నల్లచుక్కలనాగ
తళతళలాడేటి తెల్లచుక్కలనాగ
పసిమిపొరలు గల పచ్చన్నినాగా
కొండచిలువలకెల్ల కోర్కెతో రోజులై
పరుగుడు పాములకు ప్రభువులై రాజిల్లు

మొగలి చెట్లా పైసి మొగిసితిరుగాడి
పాలు ఆరగించవే పచ్చనీ నాగా
పక్కనా పదిహేను మచ్చలే కలవాడ
గురివింద పూసల్లె కళ్ళు కలవాడా
పరికిముళ్ళవంటి కోరలేగలవాడ
పుట్టలో నాగన్న బూచినాగన్న
ఎండలో పడుకోకు ఎర్రి నాగన్న
కలవోరికోడళ్లు కడుగర్వపోతులు
కళ్లాపి జల్లేరు కాళ్ల జిమ్మేరు
ఎంగిళ్లు జల్లేరు భంగపుచ్చేరు
అటుపోకు నాగన్న చాకిరేవులకు
చాకిరేవుల్లోన చేరిపడుకుండె
సాలెపురుగని నిన్ను చంపేరువారు
అటుబోకు నాగన్న చెరుకు తోటలకు
చెరకు తోటలలోన చేరి పడుకుంటే
సల్లనీ చెరుకాని నరికేరు వారు *



శివప్రార్థన

ఏమయా స్వామి శివశివా కైలాసవాసా
ఏమయా స్వామి సొమ్ము లేమిలేకపోయె నీకు ॥ఏ॥

పాములను ధరియించు చెంత పాపమో శివశివా
వెర్రివాడవయితే కావు వెండికొండ దొరవు నీవు
పుర్రెలో భుజించు చేమిపుణ్యమో శివశివా
లెక్కలేని వాహనములు ఎన్నియైన కలవు నీకు
ఎద్దునెక్కి తిరుగు చెందుకోసమో శివశివా
ఎగ్గులేని పరిమళములు ఎన్నియైన గలవు నీకు
బుగ్గిబూసుకొనుట ఎంత పుణ్యమో శివశివా
ఎల్లవేలుపులకును నాది మూలమైన వేల్పునీవు
బిచ్చమెత్తుకొనుట ఏమి ధర్మమో శివశివా * ॥ఏ॥



హాస్య వల్లరి

*హాస్యం !

సాహిత్య ప్రక్రియ లన్నింటిలో హాస్య రసం లేనిదే రక్తి కట్టదు. నవ్వడం, నవ్వించడం అంటుకొనే కాస్తసేపు ఆనందాన్ని పండించుకోడం - మన నిత్య జీవితాలలో తప్పనిసరి ! కాస్త - మోటు గానూ ఘాటుగానూ ఉందని అప్పుడప్పుడు అనిపించినా - జ్ఞాన పద కవితా కదంబంలో అరవిచ్చిన మొగ్గ అది *

పెళ్ళి సమయంలో, ఆటల సమయంలో, పండుగల సందర్భాలలో పాడే పాటలు వింటూంటే వినోదంతో పాటు - కడుపుబ్బ నవ్వు వస్తూంటుంది. వినోదం మానవునికి తప్పనిసరి! ఉన్న వాళ్ళు సినిమాలూ, నాటకాలూ పెద్ద ఎత్తున చూస్తే - సామాన్యులు వీధి నాటకాలూ, తోలు బొమ్మలూ, గారడీలు, పగటి వేషాలు, గంగిరెద్దుల గెంతులు, బుడబుక్కల ఆశీర్వచనాలు, జంగం, సాతాని పాటలు, పలుకులు, కాశీపట్నం చూడర బాబూ మొదలగునవి చూసి - శ్రమ అనేది ఆ కాస్తసేపూ మరచి అందులోనే అందం, ఆనందం, సృష్టించుకుని హాయిని అందుకుంటారు —

హాస్యపూరితం, వినోద ప్రధానం అయిన పాటలు, ప్రదర్శనాలు మన గ్రామసీమల్లో చాలా చూస్తూనే ఉంటాము - వాటికి సంబంధించిన రకరకముల పాటలు ఇది:

ఈ పాట హాస్యం కోసం మాత్రమే

పతివ్రతా ధర్మంబు
భక్తితో సలిపి
అతని చెంపా మీద
అంటిస్తువుండు
మగనితో నీ కసలు
సరిపడకపోతే
పగదానివలె నీవు
పడబోవు తల్లీ
అత్తమామలు నీకు
అతకకా ఉంటె
కొత్త ముగ్గులు పెట్టి
కృంగతీయి తల్లి
సేవ చేయించుకో
చిన్నత్తలా చేత
బావగారిని నీదు

బానిసగ చూడు
తోటికోడలి బిడ్డ
కూటి కేడిస్తే
పిటకోడిచ్చుకొని
ఒకపెట్టవమ్మ
అత్తవచ్చి నిన్ను
పనిచెయ్యమంటే
తలకి పట్టేసుకో
పడకేయవమ్మ
పెద్దలూ నినుచూసి
పిలువ వచ్చితే
పెద్దపెట్టున గోల
పెట్టి కేకేయవే
ఏకువలె మెత్తంగ
ఎరుగనట్లుండి
మేకువలె బిగుసుకొని
మేలుకొనిఉండు !

—ఈ నీతులు కనుక ఆమలులో పెడితే కాపురం చేయగలిగే మొగాడే ఉండడు – అందుకే దీనిని హాస్యం అనుకుందాం !

—పెళ్ళిళ్ళలో భోజనాలు జరిగే సమయంలో ఆడ పెళ్ళివారిని వెక్కిరిస్తూ - హాస్యంగా పాడే ఈ విందు పాట పరికించండి.

ఏలాగు భోంచేతుము
ఈ విందు మే మెలాగు
భోంచేతుము ? ॥ఏ॥

విస్తర్లు వేశారు దోసెడేసి
వెడల్పు లేదండి హస్తంబు
కదులుటాకూ
ఔరా ! చోటులేదు ఏలాగు
భోంచేతుము ॥ఏ॥

ముక్కబియ్యము వండిరీ
దానిలోకి ముద్దాపప్పే వేసిరీ
చెప్పకుంటే సిగ్గౌతుంది
చెయ్యికడిగిన జిడ్డేలేదు ॥ఏ॥

కూరే వంకాయకూర
దానిలోకి మాడ్చే పచ్చడీలేదు
కలహంబులే కానీ కారంబులు
గుచ్చెత్తిరి ! ॥ఏ॥

పులిహార పులుపాట
అబ్బ ! చింతకాయ పులుసు
ఏకలహంబు లేకామరి
కరివేపాకు గుచ్చెత్తిరి ॥ఏ॥

లడ్డు జిలేబీలు
లే పాకములో మడ్డీ
తేలిందాటా
నడ్డించే వదినగారికి
వడ్డాణ మూడిపోయె ॥ఏ॥

గ్రామాలలో ఇప్పటికి ఊరిమధ్యలో ఓ గెడ పాతి నాలుగు దబ్బులు అడుక్కోడానికి విద్యలు చూపే గారడీ వాళ్ళకూ, వాళ్ళు పాడే పాటలకూ ఏం కొదవలేదు - వారి నోటినుంచి వెలువడే పాటల సముదాయంలో ఇదొకటి-

నా మగడు వాడకేళ్ళే
నాకు తోడు ఎవరులేరు
కోడి కూసే వేళదాకా
తోడు రారా వన్నెకాడా !
ఓ వన్నెకాడా !

చింతచెట్టూ చిగురూచూడు
చిన్నదానీ ఈడూ చూడు
అద్దములో నీడా చూడూ
ఇద్దరికీ జోడూ చూడారా !

నరసాపురము నుంచి
నలిగి నలిగి వొస్తుంటే
తాళ్ళపాలెము కాడ
తగిలిందీ జ్వరము !

చంకలోని సీళ్ళకడవ
నీడ చూచి నిందగట్టిరి
ఇద్దరికీ ఇష్టమైతె
ఎవరిదేమె భయమూ !

ఇంటిమొగుడికి వంచెద్దుబండి
రంకుమొగుడికి రెండెడ్లబండి
మధ్య తిరిగే లాతగాడికి
దొరలు త్రాగే మందుసీసా !

తల్లిపిల్ల నిడిసియాడు
సేసుకున్న భార్యనిడిసి
దొమ్మరదాని ఎంటబోతే
డోలు మెడకు ఏసెరా !

కల్లుతాగి ఒళ్ళుమరసీ
కైపుయెక్కి తిరుగబోతే
పెళ్ళిచేసి పంపుతారూ
పెందలకడ మేలుకోరా !

నా మగడు వాడకెళ్ళి
నాకు తోడు ఎవరులేరు
కోడికూసె ఏళదాకా
తోడురారా వన్నెకాడా !

ఎన్ని వంకరలువున్నా అత్తారన్నప్పటికి, కట్నంపేరు చినేసరికి తాడి లేచి నుంచుంటుందిట !

ఆల్లూడంటే వంకరతాడి
లేచీ నుంచుందోయ్
లేచీ నుంచుందోయ్
మూడూవంకల వంకరతాడి
సాగీ నుంచుందోయ్
సాగీ నుంచుందోయ్ !
అత్తారంటె వంకరతాడికి
కట్నం కావాలోయ్
కట్నం కావాలోయ్
పిల్లా అంటే వంకరతాడికి
పెళ్ళీ కావాలోయ్
పెళ్ళీ కావాలోయ్ !

సోనీ అంటే వంకరతాడికి
కట్నం కావాలోయ్
కట్నం కావాలోయ్ !

పిల్లల మనస్సును అర్థం చేసుకోవడమే చాలా కష్టం- వారి పనులూ పలుకులూ అన్నీ చిలిపితనం చిగురింతలు పెడ్తూనే ఉంటాయి- పెద్దవారికి కోపం రావచ్చు, నాలుగు దెబ్బలు తినవలసివచ్చినా వారికి లెక్కలోకి రావు - ఏదో చిలిపితనంగా పాటలూ, పలుకులూ కుమ్మరిస్తూనే ఉంటారు. ఒక్కప్పుడు నవ్వు వస్తుంది. మరొక్కప్పుడు కోపం బుస కక్కుతుంది. ఒకప్పుడు అబద్ధం అని పిస్తుంది - ఆ పనులూ, ఆ పలుకులూ వింటే. మచ్చుకు:

మేష్టారు మేష్టారు
మెట్టొంకాయ్
మేష్టారి పెళ్ళాం
నీరొంకాయ్ !

ఆడదికదూ మరి - కొంచం నిగారింపుగా ఉండకపోతే ఎలాగ - అందుకే మేష్టారి పెళ్ళాన్ని నీరొంకాయతో సరిపోల్చారు !

అరటాకుల కట్ట
పొయిలో పెట్ట
నిన్ను తగులపెట్ట
కోడిపుంజు రెట్ట
నీ నోట్లో పెట్ట !

ఈలాంటి చిలిపిపాటలు బాలసారస్వతంలో వేనకు వేలు !

తాతా పీతా
ముంజకాయ మూతా
కొడవలిపెట్టి కోత
నంజు నాచేత !
పాపు నీచేత !

అలాగే బ్రాహ్మడికి, కోమటికి సంబంధించింది-

బ్రాహ్మడు బ్రాహ్మడు
బెడ్డముక్క
బ్రాహ్మడి పెళ్ళాం
సుద్దముక్క !

కోమటి కోమటి
కొత్తబెల్లం
కొంటావా తింటావా
కొంటే డబ్బుఖర్చు
తింటే కడుపునొప్పి !
— అందుకు కొనడు, తినడు - రెండూ కలిసివస్తాయి !

జామికాయ జామికాయ
సంతెప్పుడూ ?
సన్యాసి గొల్లిగాడి
పెళ్ళెప్పుడూ ?

ముసలాడి నడ్డిబాగ
ఒంగినప్పుడు
మూతిమీద మీసాలు
నెరిసినప్పుడు !
మూటుంటె పిల్లొస్తది
తాతా నీకు !
ముద్దాడితె కరుస్తుంది
తాతా నిన్ను
ఒంగుండి మ్రొక్కవయ్యా
తాతా నువ్వూ !

బాగా చెప్పాడు-డబ్బుంటే ముసలాడికి పిల్ల రావడం సులువే. కానీ ముసలాడి ముద్దుకు కరుస్తుండట పిల్ల – అదీ నిజమే మరి ! ఈ సారస్యతంలో ''సన్యాసిగాడు'' - ''గొల్లిగాడు'' చాలాచోట్ల ప్రత్యక్షమౌతారు !

చింతకాయ దప్పళం
పప్పేసి కలపటం
కంతమెల్ల మెక్కటం
కడుపునొప్పి రావటం !

పై చరణం అక్షరాలా యదార్థం. అప్పనంగా దొరికింది కదా అని మెక్కితే - కడుపునొప్పికే దారి తీస్తుంది.

కోమటింటి కెళ్ళటం
శొంఠికొమ్ము తేవటం
అపుడె సానతీయటం
అరగతీసి నాకటం !

అలా కడుపునొప్పి రాగనే ఆలస్యం చేయకుండా శొంఠికొమ్ము అరగ దీసి నాకమని ప్రధమచికిత్సా ప్రబోధం రెండో చరణంలో ఇస్తున్నాడు - అయినా వెంటనే కడుపు నొప్పి తగ్గిందనుకోటం ఎలాగ !

చెంబు చేతబట్టటం
దొడ్డికెళ్ళి రావటం
మంచమెక్కి దొర్లటం
నిద్రపట్టి పోవటం

ఉదయాన్నే లేవటం
బడికి వెడలిపోవటం
జరిగిందతా పంతులుకి
సాగతీసి చెప్పటం !

ఇష్టమైన భర్తకు - తదితర బంధువులకు తేడా చూపుతూంది ఒక పదుచు !

మొగుడంటె మొహమాటం
లేదూ నాకు
అత్తంటె అసయ్యం
అసలే నాకూ !

మొగుడుకైన మల్లెపువ్వుల
పక్కేస్తాను
అత్తకైన నూతిమీద
పక్కేస్తాను !

మామకైతె నలేరు
పక్కేస్తాను
మొగుడుడంటె మంచిగంధం
బాగా తీస్తానూ !

ఒదినకంటె ఆవపిండి
బాగా రాస్తానూ
మరిదికైన దూలగుంద
బాగా పూస్తాను

వచ్చినవాళ్ళకు నల్లేరు
నలుగు లెడ్తాను !

హాస్యంకు సంబంధించిన పాటలలో - కొంచం మోటు నరసాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి !

అత్త కొడుకొచ్చాడు
పంది రెయ్యండీ
పందిట్లో బావకీ
పీట వెయ్యండీ !

పీటముందర బుడ్డి
చెంబు పెట్టండీ
పీటాముందర కోడి
గుడ్డు పెట్టండీ !

కోడిగుడ్డుమీచా
కూరార బోయండి
బావకి బలుహారం
బాగా పెట్టండీ !

పల్లేరు తెప్పించి
పక్కా వెయ్యండి
నల్లేరు తెప్పించి
నలిచీ విడువండీ !

నల్లేరు చేతాను
నయము కాకుంటే
దూలగూండా తెచ్చీ
దులిపి పంపండీ !

అత్తకొడకా నీకు
అందింద మరియాద ?
నువుతెచ్చిన కోక
మొలతిరుగ లేదు !

నువుతెచ్చిన రైక
ముడికంద లేదూ !

మామకూతుర నువ్వు
చేసిన మేలూ !
దూలగుండా చేత
దులిపిందె చాలు !

ఈ పాట వినండి -పండుగ వచ్చింది. ఎన్ని బియ్యం పోసి పిండివంటలు వండమంటావని అత్తగారిని కోడలు అడుగుతూంటే అత్తగారు సలహా ఇస్తూంది- ఎంత వింతగా ఉందో !

కోడలు :- పండుగా వొచ్చింది
ఓ అత్తగార !
పండుక్కి బియ్యము
ఎన్ని పోసేది ?

అత్త :- వెయ్యవే నిచ్చెనా
తియ్యవే గాది
పొయ్యవే తలగీచి
తవ్వెడు బియ్యం !
ఆ బియ్యం నానేసి
పిండిగా దంచి
పిండివంటలు చేసి
అరసెల్లు వండు !
ఇరుగుపొరుగూ వారి
కింతింత పెట్టు
ఇంట్లోని పిల్లలకు
కసరకా పెట్టు !
మాపటికి మామకు
మారుమూ తెట్టు
మరునాటి చద్దులకు
మర్దులకు పెట్టు
మనయింటి పాలేర్లు
మురియంగ పెట్టు !
మనయింటి మరదలకు
మనసుతో పెట్టు !

తవ్వెడు బియ్యం పిండివంటతో ఎంతమందికి పెట్టగల అత్తగారో చూడండి !

పల్లెలలో డప్పు వాయించుకుంటూ, తాడెట్టి కొట్టుకుంటూ - ధమరుకం వాయించుతూ, పంబ మ్రోగిస్తూ, శంఖం ఊత్తూ, సన్నాయి నాలాపిస్తూ, కోతిని ఆడిస్తూ, పాలకీని మొగ్గలేయిస్తూ, గెంతుతూ, పాడుతూ రకరకాల వినోద ప్రదర్శకులు వస్తూంటారు - హాస్యం, వినోదం రెండూ అక్కడ మనకు ప్రత్యక్షం అవుతాయి. అలాటివి చూదాం -

ఈ పాట పంబ వాయిద్యంతో పాడేది.

పార్వతీ వోయించే
పంబ నాదంబు !
పంబ పుట్టించాడు
రొంబ పుట్టింది !

ఆ రొంబకోసం దేవతలు గిజ గిజ గించుకున్నారు!

ఆ పంబ వోయించె
అంబరీసుండు!
ఆ పంబ వోయించె
పరచూరాముడు!
ఆ పంబ వోయించె
పద్దనాటుండు!

పార్వతీ ఆ పంబ
పరమేసుడోయించె !
పరవతా లేడెక్కి
బద్దలైపోతుంటె
ఆ బద్దలైపోతుంటే!

అగ్గిదేముడీ ఇల్లు
బగ్గూమన్నాదా!
అగ్గిదేముడిఇల్లు
బగ్గూమన్నాదా !
అగ్గిదేముడి ఇల్లు
బగ్గుబగ్గుమంటేను !
ఆ బగ్గు బగ్గు మంటేను !
నీలాకంఠుని మేడ
కూలీ పోనాదా?
అ నీలకంఠుని మేడ
కూలీ పోతుంటేను
కుమారసోమకుడు
పుట్టూకొచ్చాడా ?

ఇనప్పంబ కాదు, ఇత్తడిపంబ కాదు, కంచు పంబ కాదు, కరివేణి పంబ కాదు - మరేం పంబయ్యా - తోలుపంబ !

దేవతాలందరును
తోలు పంబట్టుకొని
ఆ తోలూ పంబట్టుకొని
తోవేసినారా !

కాశీ కావడి అంటూ కాశీ పటాలనూ - లోకాలను ఫలితాలను చూపిస్తూ వస్తుంటారు-ఈ ప్రదర్శన ఇద్దరి పని !

కాశీకి పోయాను
రామాహరీ
కాశి తీర్థమూ తెచ్చాను
రామాహరీ !

కాశీకి పోలేదు
రామాహరీ - పూరి
కాలువలో నీళ్ళండి
రామాహరీ !

కాశీకి పోయాను
రామాహరీ
కాశి విభూతి తెచ్చాను
రామాహరీ !

కాశీకి పోలేదు
రామాహరీ - పీడి
కాష్ఠంబులో బూడిదండి
రామాహరీ !

పంచేంద్రియములూ
రామాహరీ - నేను
బంధించి ఉన్నాను
రామాహరీ !

కొంచమూ నమ్మినా
రామాహరీ -
కొంపముంచి వేస్తాడండి
రామాహరీ !

ఆలు బిడ్డలు లేరు
రామాహరీ - నేను
ఆత్మయోగీ నండి
రామాహరీ !

ఆలు బిడ్డా లెల్ల
రామాహరీ - పీని
కాయూర సున్నారు
రామాహరీ !

ఇతగాడి హడావిడి జోరుగా ఉంటుంది. చూసే వాడొకడైతే మూగే జనం చాలా మంది. "పైస తమాషా" పాట ఇది. నాలుగు కోళ్లూ-పైనపెట్టే-లోపల బొమ్మలూ, చూడడానికి అద్దం, ప్రదర్శకుని పాట, అందుకు తగ్గ తాళం - వినండి :

పైస తమాషా
చూడరబాబూ
ఏమి లాహిరీ
నున్నది చూడు
ఏమి తమాషా
లున్నయి చూడు
కాశీపట్నం
చూడర బాబూ !
అదిగదిగదిగో
కాశీపట్నం
చూడర బాబూ !

గలగల లాడే
గంగా నదిని
కన్నుల కింపుగ
చూడర బాబూ
హరిశ్చంద్రుడు
సత్యం కోసం
ఆలు బిడ్డలను

అమ్మిన చోటు !
అదిగో ! అదిగో
విశ్వేశ్వరుడు
హర హరమను
భకుల చూడు ?
చూచి మోక్షం
పొందర బాబూ
కాశీపట్నం
చూడర బాబూ ! ॥పైస॥

హస్తినాపురీ
పట్నం చూడు
పాండవు లేలినా
పట్నం చూడు !
విజయనగర
రాయలను చూడు
బెజవాడ
దుర్గమ్మను చూడు
భద్రాద్రి రామ
దాసును చూడు
కన్నుల పండుగ
చూడర బాబు
చూచి జ్ఞానం
అందర బాబూ ! ! ॥పైస॥

దేశ సాహిత్యంలో కురవంజి పాత్ర ప్రసిద్ధమైనది. పలుకుబడి గలిగిన జ్యోతిష్కురాలు - సోడె చెప్పడంలో అందె వేసిన ఘటం - ముక్కుకు రింగు, చెవులకు లోలకులు, రవికలేని బట్టకట్టు, కాళ్ళకు కడియాలు, చేతులకు

గాజులు, చేతిలో వెండికట్ల చిన్నకర్ర, బుట్టతో ప్రత్యక్షం - ''సోదోయమ్మ సోదె ' అంటూ -

ఆ...వో యమ్మ
బాగ్గెంగల సేయి !
రాన ధర్మపు సేయి
దండిగల సేయి

ఒకటంటే ఒకటి
రెండంటే రెండు
ఒకటీ రెండూ కలిసి
సంగమించేనూ

మందారలాయమ్మ
మల్లెలా తావి !
అందాల బాలొసె
సందడే లేద !

ఒచ్చి ఉండారమ్మ
ఊరు చివరాకి !
శివరాత్రి శివుడికీ
జపము చేసూకో !

కొడుకు పుట్టాలాని
కోరుకో తల్లి !
ఆదివారము నాడు
అపవాశనాడు !

ఆహోశసమ్మతో
అణగిమణగుండు
కులము నిలిపేటంటి

కొడుకు గలిగేడు
కులము, బలముగలిగి
వర్ధిల్లుతల్లి

కోయవాళ్లు మొగవారుకూడా పేసవిదినాలలో గ్రామాలలో తిరుగుతూ సాముద్రికం చెబుతూంటారు. గోచీగుడ్డ పెట్టుకుని, మెడనిండా కర్రపూసల దండలు, జబ్బలకు పేముతో అలంకరణలు, చెవులకు వెండి రింగులు, కాళ్ళకూ అలంకరణలు, భుజాన అమ్మలపొది, చేతిలో బాణంతో ఇంటింటికీ వస్తూ సాముద్రికం చెబుతారు.

సేయిసూస్తా రా పిల్లా
సేయిసూస్తా రా !
సేతిలో బంగారు రేఖున్నది
కళ్ళాయి కుచ్చున్నాది
కూచుండి తింటావుపిల్ల !
బాలెంత రూపుంది
బాధపడతావు పిల్ల ॥సేయి॥

ఉట్టిముంతకళ్ళువుంది
ఉసారుగుండాది
తాగు తాగు పిల్లా
తన్నులు తింటావుపిల్ల ॥సేయి॥

ఈ రకం కోయమామలే పాడే పాటలలో మరోటి-

నీలాటి కోయమామ
మాలాటి దేశమొస్తె
ఉట్టిమీదపెట్టి
ఊరేగించెదము
రాయి రాయి కాగితం !

వాడీడి పుణ్యాన
ఆబ్బాయి పుడితేను
కోయరాజు పేరు పెట్టుకోండి
రాయి రాయి కాగితం !

పడీలు సిడీలు
ఎక్కువై కొందరు
ఎనక సెక్కరాలు
వెంటబడ్డాయి
రాయి రాయి కాగితం !

దమ్మిడీ కూలోళ్లు
దగుల్బాజీ గుత్తోళ్లు
గొప్పకు రమ్మంటేను
రాయి రాయి కాగితం !

కొప్పులు దిప్పేరు
ఇంటిలో తలదువ్వి
ఈధిలో కొస్తేను
బేడాకు దాని కొప్పు బేరాయ్యింది !
రాయి రాయి కాగితం !

పైకి బిగించిగట్టిన బిళ్ళపంచెకట్టు, ముఖాన తిరుచూర్ణపు నామం, జుట్టుముడి కలిగిన కొంతమండి చుట్టూ తిరుగుతూ మధ్యలో ఎన్నో ప్రమిదలతో జ్యోతులు కలిగిన దీపపుసెమ్మా ఒకటి పెట్టి పాడే ఏడుకొండలివానికి సంబంధించిన ఈ భక్తి గీతం వినండి !

"అయ్యా శావాలవాడా" అని ఒకరు కధగా చెబుతూంటే మిగిలినవారు వింతగా "గోవింద గోవింద" అని అంటూ బహు ఉషారుగా సాగుతుంది.

అయ్యో శావాలవాడా
గోవింద గోవింద !
తిరుపతి మ్రొక్కులవాడా
గోవింద గోవింద !
వడ్డీకాసులవాడా
గోవింద గోవింద !
గాలిపీడా ధూళిపీడా
గోవింద గోవింద !
వేపాచెట్టూమీద
గోవింద గోవింద !
కన్నేపిల్లా రోరీ
గోవింద గోవింద !
నీమీద ప్రేమాతోడి
గోవింద గోవింద !
నిలువూగుడ్లేసింది
గోవింద గోవింద !
ఆశరమ్మ బలంగాదు
గోవింద గోవింద !
గొట్టాలమ్మ గుణంకాదు
గోవింద గోవింద !
అద్దారేతిరికాద
గోవింద గోవింద !
సద్దూ మద్దూలేక
గోవింద గోవింద !
ఆరుపలా లావునెయ్యా
గోవింద గోవింద !

నిలువూ గోరిచ్చుకో
గోవింద గోవింద!
అయ్యా శావాలా వాడా
గోవింద గోవింద!

ఈ "గోవింద గోవింద" పాట చాలాచోట వినేదే!

సాతాని జియ్యరులు తెల్లవారు సమయమున లేచి గ్రామవీధులలో చల్లగాలి పిల్ల తెమ్మెరలు వీస్తూంటే పాడే మేలుకొలుపులూ- వారి వేషం ఎర్రని అంచులతో కూడిన తెల్లపంచెలు, నామాలు, మొలకు బిగించిన ఎర్రంచు ఖండువా- ఒంటినిండా నామాల ముద్రలు, చేతిలో చిరుతలు, తలమీద రాగిచెంబూ- కాలికి గజ్జెలు, ఆ వేషం- ఆ ధీని- ఆ పాట- చూడాలి, వినాలి.

అమ్మా సీతమ్మా మాయమ్మ
ముద్దుల గుమ్మా
అమ్మ బంగరు బొమ్మలెమ్మ! ॥అమ్మ॥

అమ్మరో ఇమ్మాగ
అరుణోదయంబాయే
అమ్మాల కన్నమ్మ లెమ్మా! ॥అమ్మా॥

భక్తులందరు లేచి
ప్రార్థించుచున్నారు
భక్తా పరాధీన లెమ్మా! ॥అమ్మా॥

భక్తా శిఖామణి
పావణి అరుదెంచె
ముక్తిప్రదాయిని లెమ్మా! ॥అమ్మా॥

బ్రహ్మాండ మఱరంగ
బ్రహ్మాది సురులెల్ల
ప్రార్థించుచున్నారు లెమ్మా! ॥అమ్మా॥

బ్రహ్మ రుద్రాదులు
ప్రస్తుతి సేయగ
బ్రహ్మ స్వరూపిణి లెమ్మా ! ॥అమ్మ॥

ప్రతి గ్రామానికి ఒక్కొక్కదేవత ప్రత్యేక ఆరాధన ఆధిపత్యం వహించి ఉంటుంది- ఒక ఊరివారికి ముత్యాలమ్మ, మరో ఊరువారికి పోలేరమ్మ-ఇలా అనేక పేర్లతో దేవతలుంటాయి. వాటికి జాతరులు ప్రతి సంవత్సరం జరుపు తుంటారు- బలులు ఇవ్వడం, ఊరేగించడం, సేవలు చెయ్యడం- ఇదే సమయంతో ఆ దేవత ఒక్కొక్కరికి పూనడం జరుగుతూంటుంది. అటువంటి పూనకంకు సంబంధించినదే ఈ పాట—

నరుడ, నరుడ, నరుడోం
ఓ నరుడా...
ఏటితల్లీ
ఏటపరాధం చేశాం?
ఏందోలెతల్లీ
ఈ కోపము?
కోకలిచ్చినావా
నరుడా
కోరిక తీర్చావా
నరుడా
కోళ్లు కోసినావా
నరుడా
గొర్రె లిచ్చినావా
నరుడా
సున్న మేసినావా
నరుడా
కుంకమిచ్చినావా
నరుడా
ఓ నరుడా!

నేదు తల్లీ! నేదు!! ఇప్పుడిత్తాం సెప్పు??

గనమైన భాగోతం
గట్టిగా కట్టించు
సద్దినై వేద్యాలూ
ముప్పూటా బెట్టించు
ముంగిటా దివ్వెలూ
ముచ్చటగ వెలిగించు
పందిట్లో బాజాలు
బాగుగా వాయించు
వేపాకొమ్మాలతో
ఎనుబోతూ పూజించు
పసుపు కుంకుమతోటి
నలుగేమో పెట్టించు
గదపా గదపాలో నాకు
గండాలు బ్రమొక్కాలు
బోండాపు కాయలు
మండిగల పారాణి
దండీగ పెట్టించు
నరుడ! నరుడ! ఓ నరుడా !
ఓ—నరుడా!
ఏటికూళ్ళా తల్లీ
అంకమ్మ తల్లీ
పండుగలు సేత్తాము
పబ్బాలు సేత్తాము
జనమంత మీ ఓళ్ళు
కాపాడుతల్లీ!

నచ్చినావుర నరుడా
మెచ్చినానుర నేను!

ఊరసుట్టోర తిరిగి
ఊళ్ళో నా కాలెదతా
మిమ్మల్ని దీవిస్తా
మాటా తప్పక నరుద
మంచీదానను కాను
నరుద! నరుద!! నరుడోం!!!
ఓ-నరుడా!

దేముడికి దడవకపోయినా, న్యాయానికీ, ధర్మానికీ, దడవకపోయినా ఇటువంటి వార్నింగ్‌లు ఇవ్వగలిగిన దేవతలకిమాత్రం దడవకమానదు జనం!

పంటలు పండి ఇళ్ళకు వచ్చేకాలం అది. నాలుగు డబ్బులు రైతురాజుల చేతుల్లో గలగలాడే రోజులు అవి. దానాలూ, ధర్మాలు జోరుగా చేయించే సంక్రాంతి పుణ్యదినాలు అవి - అటువంటి మంచి సమయంలో గంగిరెద్దుల ఆటలు, సన్నాయి మేళాలూ చాలా జోరుగా ఉంటాయి. ఈ సంక్రాంతి సమయంలో బసవన్న, వెంకన్నలదే రాజ్యం!

చక్కని రంగురంగుల చీరలతో, ఖండవాలతో, గంగిరెద్దును అలంకరించుకుని, కొమ్ములకు రంగులు తీర్చిదిద్ది తను నోటిలో సన్నాయి, మెడలో డోలు, చేతిలో పల్లెం మ్రోగించుతూ, ఎర్రని తలపాగా, నల్లని కోటు, పంచతో-బసపయ్య విద్యలు చేయిస్తూ - ఆశీర్వదిస్తూ గడపగడపకూ వస్తాడు. అదిగో వినండి - ఆ పాట!

డూ డూ డూ డూ
ఎంకన్నా
డూ డూ డూ డూ
బసవన్నా!

అమ్మగారికీ
దండంపెట్టు

అయ్యగారికీ
దండంపెట్టు !

పెబువుగారికీ
దండంపెట్టు
బాబుగారికీ
దండంపెట్టు !

సీతమ్మగోరికి
దండాలెట్టు
రామయ్యగోరికి
దండాలెట్టు !

పిల్ల పాపలు
చల్లగ వుండి
పైరు పంటలు
గాదులు నిండి!

పచ్చగాను
పది కాలాలుండి
దానం ధర్మం
చేత్తావుండి!

ఎండి గిట్టలు
ఇస్తారంట
పైది కొమ్మలు
కదతారంట!

పట్టు శాలువ
పైన ఏసుకు
పదిమందిలో
పేరు సెప్పుకు !

ఇంటి కొక్కడు
ఈరభద్రుడు
పంచ కొక్కడు
బసవేశ్వరుడు !

చలగ వెలసి
పెబువులు వుంటె
కళ్ళ వేడుకలు
మన కంతాను !

డూ డూ డూ డూ
ఎంకన్నా
డూ డూ డూ డూ
బసవన్నా !

గంగిరెద్దు పాట, ఆట, మాట, దృశ్యం ఎంత ముచ్చటైనదో ! వింత అనేది, వినోదం అనేది, హాస్యం అనేది - ఈ మూడు చాలా దగ్గరగానే కనుపిస్తాయి. పిల్లవాడు నడుస్తూ క్రిందపడితే వినోదంగా ముద్దెట్టుకుంటాం. పెద్దవాడు నడుస్తూ క్రిందపడితే వింతగా చూస్తాం.

కుర్రాడి దగ్గరనుంచి పెద్దవాడిదాకా నమ్మకాలూ, శకునాలూ చాలా ముఖ్యమైనవి - ఎదుటివ్యక్తి మనసుకు నొప్పి అనిపించినా - తన శకున నమ్మకం విడువని వింత మనస్తత్వం మనది. సాటివ్యక్తి ఎదురొస్తే ప్రయాణం సాగించం.

అటువంటి శకునశాస్త్రానికి సంబంధించి కాకిని అడిగే ప్రశ్నే ఈ పాట.

కాకీ కాకీ కలువల కాకీ
కొమ్మామీదా గుమ్మాకాకీ
ఇంటిమీద దంటూకాకీ
పెంటమీద నలుపు కాకీ

చెట్టుమీద చెవిటికాకీ
అంటూ సొంటూ అంగటికాకీ
నంజూ పంజా నప్పే కాకీ
సాయం సంధ్యల నప్పను కాకీ
వేకుసాకులూ విప్పేకాకీ
చుట్టాలూ, పక్కాలూ
ఒస్తారంటే ?
మా బావ లొస్తారంటే ?

మా వాళ్ళు ఒస్తారంటే
మా ఇంటిమగవా రొస్తారంటే
అరిదేశంటే, పరదేశంటే
పన్నంటె, బందంటే

పాడి పశువంటే
మంద గొడ్డంటే
సొమ్మంటే, సారుగంటే
పాప నీపాప లొస్తారంటు

కాకీ - ఎగిరి గంతెయ్ !
కాకీ - ఎగిరి గంతెయ్!!

ఇలా పైన చెప్పినవన్నీ వల్లించి, ఆఖరున కాకిని గంతెయ్యమని అడుగుతారు. గంతేసిందా - తను అనుకున్నట్లు జరుగుతుందని ఒక నమ్మకం.

రెండు త్రాచులు కలిసిఉండగా చూస్తే గొప్ప అదృష్టమని చెబుతుంటారు. ఒక పామును చూసీ చూడడంతోనే కళ్లు మూసుకొనే మనకు రెండు పాముల జంట కనుపడడంకల్ల!

ఈ పాములకు సంబంధించిన జాతి ఒకటి ఉంది. రకరకాల నాగులను బుట్టల్లో పెట్టుకుని నాగస్వరం ఊదుతూ బిచ్చం అడుక్కోవడం, మెడమీద పాకించుకుంటూ డబ్బులు సంపాదించడం, గారడీల్లో వింత వింతగా పడగ విప్పించి, ఆడించి, వినోదం చూపిస్తుండడం పరిపాటి అయిన విషయమే. తెలుగు జాతికీ, నాగమయ్యకూ చిరకాల సంబంధం, బంధుత్వం ఉన్నట్లుగా మనకు గోచరిస్తుంది- "నాగయ్య, నాగేశ, నాగులు, నాగేశ్వర్రావు, నాగి, నాగ లక్ష్మి, సుబ్రహ్మణ్యం, సుబ్బారాయుడు" మొదలైనవన్నీ ఈ నాగుమయ్య మీద అభిమానంతో, భక్తితో జ్ఞాపకచిహ్నంగా ధరించుకొన్నవే. అదేకాదు, మన ప్రాచీన శిల్ప సముదాయంలోనూ, గుడి, గోపురాలలోనూ నాగచిహ్నాలు చెక్కడం ఒక ఆచారంగా కనుపించడంద్వారా కూడ-నాగుమయ్యకు తెలుగయ్యకు దగ్గర సంబంధం చాలా ఉన్నట్లు కనుపిస్తుంది.

ఈ పాటల్లో వింత ఏమిటంటే - భయంగొలిపే నాగులను నిద్రబుచ్చడం, నీతులు గరపడం చూస్తూంటే వింతగానే అగుపిస్తుంది - అటువంటి పాటలలో కొన్నిచూదాం.

(1) నాగమయ్యకు బుద్ధులు గరపడం-

పుట్టలో నాగన్న
బూచి నాగన్న
ఎలడలో పడుకోకు
వెర్రి నాదన్న !

కలవారి ఇళ్ళలో
గర్వంబువారు
కాలాపి జల్లేరు
కాళ్ళా జల్లేరు!

ఎంగిట్లు ఏసేసి
భంగపుస్తారు
అటువెళ్ళి కూకోకు
చాకి రేవులకు!

చాకిరేవులోన
చేరి పడుకుంటె
సాలిపురుగని నిన్ను
చంపేరు వారు!

అటు వెళ్ళకు నాగన్న
చెరుకు తోటలకు
చెరకు తోటల్లోన
చేరి పడుకుంటె !

నల్ల చెరుకని నిన్ను
నరికేరు వారు !

అస్తమానం — రాత్రనక, పగలనక, చేలంటా, దొడ్లంటా, తోటలంటా తిరిగే రైతు - ఎక్కడ పురుగూ పుట్రా వుంటుందోనని భయపడే రైతే - నాగు మయ్యకు ఇటువంటి సందేశం, సలహా ఇస్తూంటే వింత కాదూ !

ఒక వేళ మనం కొడతామని బెదిరే కరిచిందో, కరవాలనే కాటేసిందో - నాగుమయ్య కాటేస్తే అప్పుడూ మంత్రంతో, ప్రార్థనతో విషం పోగొట్టుకోడం చూడండి !

నాగా దిగరా
నా తండ్రి దిగరా
నాగన్న దిగరా
నాగా దిగరా !

దిగు దిగూ నాగన్న
దివ్య సుందర నాగ
నల్ల చుక్కల నాగా
నా ముద్దు నాగా

సవ నవ లాడేటి
నల్ల చుక్కల నాగ
తళతళ లాడేటి
తెల్ల చుక్కల నాగ !

పసిమి పొరలు గల
పచ్చన్ని నాగా !

కొండ చిలువలకే
కోర్కెతో రాజు
పరుగుడు పాములకు
ప్రభువై రంజల్లి

మొగలి చెట్లపైన
మసలి తిరుగులాడి
పాలు ఆరగించు
పచ్చన్ని నాగా !

పక్కాను పదిహేను
మచ్చాలు గలవాడ
గురివింద పూసల
కళ్ళయిన కలవాడ

పరికి ముళ్ళవంటి
పళ్ళు గలవాడ
నాగా దిగరా
నాగన్నా దిగరా !

పై పాటను చదువుతూంటే పాములలో రకాలు, వాటి ఆకారాలు ప్రత్యక్ష మౌతున్నాయి. అవి ఎక్కడుంటాయో కూడా వినండి-

ఇల్లలికి ముగ్గెట్టి
మల్లెలు విరజల్లి
మల్లెల్లా వుండేటి
ఓ మల్లినాగ !

పిల్లలందరుగూడి
వుల్లలేరాబోతె
పుల్లల్లో వుండేటి
ఓ పుల్లనాగ !

గొల్ల భామలుకూడి
చల్లల్లు చెయ్యఁగ
చల్ల కుండక్రింద
చల్లనీ నాగయ్య !

ఇవతలా ఇదికొండ
అవతలా అదికొండ
నట్టనడుమను కొండ
నల్లత్రాచయ్య !

నాగులచవితి పండుగ మనకందరకూ తెలిసిందే- నాగపూజకు సంబంధించినదే ఈ పాట-పుట్టల్లో పాలోయడం, తొట్రలో పాలోయడం, పుట్టకు పూజలు చేసి, పాలోసి, గంధం పూసి, బొట్టెట్టి, దండాలెట్టడం నాగులచవితికి జరిగే విధానం - నాడు నాగుమయ్యను కొలిచి, పూజించి, "నీ జోలికిరాము నాగుమయ్యా, ఇది ఇస్తా అది ఇస్తా" అంటూ పాడే ఈ పాట పరికించండి —

పడగలెత్తుకు పామ
పగవారము కాము
పడగెత్తి చూసింది
నాలుకలు రెండూ
నాలుకలు దూయకే

నీవారము నాగూ
మంచి నాగూవైతె
పంచెలెట్టేము
కోడె నాగూవైతె
కోక లెట్టేమూ !
పడగ లెత్తకు నాగు
పగవారము కాము
మా చేను పండితే
చలిమిడేసేము !
మా నువ్వు పండితే
చిమ్మి లేసేము
నాలుకలు దియ్యకే
నీవారము నాగు
మా పత్తి పండితే
పంచె లెట్టేము !
మా యావు లీనితే
పాలు పోసేము
పడగలెత్తకు నాగు
పగవారము కాము
నీ పూజ చేసేము
నీకు మ్రొక్కేము !

అంటే-ఈ నాగమయ్య పాటలో ఒక్కసారి నవ్వూ హాస్యం కనుపించక పోయినా నాగుకు బుద్ధులు చెప్పే పద్ధతి, బట్టలు ఇస్తామన్న విన్నపాలు చూస్తే వింతేమరి !

నాగుల చవితికి నాగన్న
స్నానం సంధ్యల నాగన్న
పూలు పడగలు నాగన్న
మడిబట్టలతో నాగన్న

చిమ్మిలి చలిమిడి నాగన్న
పాలూ పండ్లూ నాగన్న
దివిటితేజున నాగన్న
ఉపవసించుచూ నాగన్న
ఉద్దాపించుచు నాగన్న
ఊరేగొస్తాం నాగన్న
పుట్టకు వస్తాం నాగన్న
పూజలు గొనరా నాగన్న !

పళ్లు, కాయలు అమ్ముకొని తన పొట్టకు తాను సంపాదించుకోవాలనుకొనే పడుచులు చాలామంది కనుపిస్తుంటారు ! బీదతనం, అలుసుతనం, యౌవనం, అమాయకత-వీటితో నెత్తిన బుట్టలూ, తట్టలూ పెట్టుకుని 'పళ్ళో'యని అరచుకొంటూ తిరిగే వీరిలోనూ, చిలిపితనంగా కొంటెగా కావాలని పిలిచే కుర్రకారులోనూ కనుపించే హాస్యం, వింత భావాలు, పద చమత్కారాలు వినడానికి శృంగారం, చూడడానికి వింతగానూ ఉంటాయి. అటువంటి పాట మచ్చుకు ఒక్కటి.

''గరువుకు'' గోంగూరకు ఒంటరిగా వెళ్ళిన పడుచూ, పుల్లలకోసం ''కూపు''కు వెళ్ళిన పడుచూ, చేనుగట్టుకు పచ్చగడ్డి పరకలకోసం వెళ్ళే పడుచూ-ఈ పళ్ళమ్మి కోవలోకే వస్తారు. శృంగారసాహిత్యంలో వీరిది ప్రత్యేక తాంబూలం.

పళ్ళమ్మ వచ్చేను పళ్ళో
పుంచి పరువు కొచ్చిన
జామిపళ్లూ ! ॥ప॥

మగ:- పరువైన పళ్ళెతె
కొంటాను నేను
పట్టి నొక్కి సూసుకుంటాను !

ఆడది:- కొంగుసాటున కప్పి వుంచాను
నేను సేతబట్టి సూడనివ్వానూ

పళ్ళు కావలెనన్న
కళ్ళతోడనె సూసి
కాళ్ళ దగ్గరకొచ్చి
కానిస్తె రెండిస్త ! ॥ప॥

మగ:- పరువైన పళ్ళాతె
కొంటాను నేను
పట్టి నొక్కీ సూసుకుంటాను
అరువు బేరము కాదు
అమ్మోరి కెట్టాల
ఉరవ జూడగనిమ్ము
ఉండు పారొస్తాను !

ఆడది:- పళ్ళమ్మవచ్చేను పళ్ళూ
పళ్ళు కావలెనన్న
కళ్ళతోడనె చూసి
కాళ్ళదగ్గిర కొచ్చి
కానిస్తె రెండిస్త ! ॥ప॥

ఈ 'పళ్ళు' అమ్మి పలుకులూ, కొనే 'అబ్బి' పలుకుల కులుకులూ మధ్య భావాన్ని పరమాన్నంగా భావించి జుర్రుకోవాలెగాని ఇక్కడ చెప్పడం అవసరం ఉండదు.

మరొక్క పాటతో ముందుకు వెడదాము - ఈ చెల్ మోహనగరంగ పాట శృంగారపరమైనదే అయినా— ఆ మాటల నీటూ, ఆ కోర్కెల గోటూ కలిపితే వినోదమూ, హాస్యమూ కూడా మనకు వినిపించడం జరుగుతుంది - వినండి.

చెల్ మోహనరంగ పాట విననివారు ఎవరూ ఉండరు-ఉన్నారంటే ఆశ్చర్యమే ! భోగం మేళాల వారినించి - పడక గదిలో దాకా ఈ పాటకు బంధువులే !

* రంగారు చెట్టుమీదా
బంగారు గోరువంక

వినిపించే కతలు
విందము పదరా !
చెల్ మోహనరంగా

చివురాకూ పళ్ళెరములో
మిగుల పండిన పండ్లు

సవరించీ మనము
ఆరగిందము పదరా
చెల్ మోహనరంగా !

బొగడ పూపులు కోసి
పొందుగనే దండగుచ్చి

దంచ నీ మెడకు
వేసుకుపోరా
చెల్ మోహనరంగా !

చిరి మంచుకోటలోన
గురుతైన మంచెమీద

సిరి పాట మనసుంద
పాడుదము పదరా
చెల్ మోహనరంగా !

చెట్టు తుమ్మెదలు గూడి
గట్టి బాజాలు పాడి

---

*ఈ చెల్ మోహన పదం - రెండు, మూడు సేకరణలను ఆధారం చేసుకుని అందినంతమట్టుకు కొంచెం అటూ ఇటూగా ఇవ్వడమైనది.

అట్టిట్టు తిరుగుతు
కదులుచున్నవి కదరా
చెల్ మోహనరంగా !

కొనమావి కొమ్మలందు
గురుతైన రామచిలుక

దనములు అందిస్తు
పిలుచుచున్నాది గదరా
చెల్ మోహనరంగా !

గుబురైన చింతమీద
కబురు తెచ్చేటి చిలుక
సొగసైన గూడుకట్టెను కదరా
చెల్ మోహనరంగా !

నీవు పోయేదారిలోను
నిలువు టద్దములలోన
నీదు రూపు నిలచిపోయెను గదరా
చెల్ మోహనరంగా !

చిరునవ్వు నవ్వితేను
కురియు పువ్వులవాన

చిరునవ్వూ ఆశించి
కోరియుంటిని గదరా
చెల్ మోహనరంగా !

శనివారం సంతలోన
పనిబూని సంతలోన

నిను వెదకి పరువెత్తి
పట్టుకొంటిని గదరా
చెల్ మోహనరంగా !

బొండుమల్లె పూలదండ
నిండుగా నీ మెడనువేసి
నిండారా కౌగలింతును రారా
చెల్ మోహనరంగా !

ఇక్కడ మనకు జ్ఞాపకం వచ్చే పాటలు చాలా ఉన్నాయి- జావలీలు, శృంగార భక్తి కీర్తనలు. ఆ కోవలోకే చెందేదే ఈ "చెల్ మోహనరంగని పదాలు" - పోతే అవి భక్తితో రంగరించిన శృంగార "మార్గ" కవితలు అయితే, ప్రేమతో కలిపి పలకరించే "దేశి" కవితలు ఇవి !

మువ్వగోపాలుని పిలుస్తూ పాడే మువ్వగోపాల కీర్తనలలో అడుగడుగునా కనిపించే శృంగారం వింటే ఈ జానపద శృంగారం చాలా హాయిగానే కనుపిస్తుంది !

చెల్ మోహనరంగా పదమే ఇంకా ఉంది-

"చీకటి రాత్రినాడు
కోక నల్లది కట్టుకోని
చీకట్లో కలిసిపోతిని గదరా
చెల్ మోహనరంగా !

ఊదలా మ్రింగి క్రిందా
మోడైన తుమ్మ చూసి
చీకట్లో ధడుసుకొంటిని గదరా
చెల్ మోహనరంగా !

పాపం ! ఎంత భయమో చూడండి - ఏదో ఒక నిర్జీత ప్రదేశం ప్రేమికు లకు కొండగుర్తు. అలాగే ఊడల మర్రి క్రింద చీకటి వేళ కలుసుకుందాం అనుకున్నారు. మోహనరంగడు రావడం ఆలస్యమైంది. ప్రియుడుకోసం ప్రియురాలు ఇలా ఒంటరిగా ఎదురుతెన్నులు కాయడం అంతశ్రమ మరోటి లేదనే చెప్పాలి.

గాలి వీస్తే ఆశ - పక్షి రెక్కాడిస్తే అనుమానం; కొమ్మ కదులుతే ఒల్లు జల్లు, నీడ ఆసితే ఒళ్ళంతా చెమట- మనసంతా గల్లంతు-ఎవరో? ఏమో? అన్న భీతి-అనుమానం-ఈమెకూ ఇటువంటి పరీక్షే ఎదురైంది. ఓ తుమ్మమోడు నీడను చూసి జడుసుకొందిట-మరి చెల్ మోహన రంగడు దిష్టి తీయించాడో లేదో ?

''గట్టుదాటి పుట్టదాటి
ఘనమైన అడవిదాటి
అన్నిదాటి అరసి తరలితిగదరా
చెల్ మోహనరంగా !

ఒంటిగా పోవద్దు వద్దని
పైటబట్టి లాగగానే
పైటజారి సిగ్గుపడితిని గదరా
చెల్ మోహనరంగా !

పొడుపు కొండలమీద
నిండైన చందమామ
నీలాగే నిలబడెను గదరా
చెల్ మోహనరంగా !

నే నొంటిగాను పోతే
నీవు నావెంట వస్తే
నీడజూసి జడుసుకొంటిని గదరా
చెల్ మోహనరంగా !

ఈ పాటల్లో ఎంత ధైర్యం పనుఁలో కనుపిస్తుందో-ఆంత అనుమానం, భయం (సంఘం కోరలు చూసే అయుంటుంది) కూడా కనుపిస్తుంది. నందూరి వారి యెంకీ ఇలా భయపడితే ''దడుపూగిడుపూమాని...''అని ధైర్యం యివ్వ వలసివచ్చింది అనుకుంటా !

నీవు నేనూ నిలబడితే
వచ్చిపోయే టట్టివారు
చిరునవ్వూ నవ్విపోయిరి గదరా
చెల్ మోహనరంగా !

ఆది ఎప్పుడూ, ఎక్కడా ఉన్నదే ! ఓ జంటను చూసి నోళ్ళు నొక్కుకొనేవారు కొందరైతే, మరో చిన్నారి జంటను చూసి బుగ్గలు సొట్టలు పొడుచుకొనేవారు మరికొందరు; గసగసలు ఒకచోట అయితే పకపకలు మరొకచోట; అందులోనూ తీరని కోర్కెలతో, అందని ఆశయాలతో - ఓటమి తిన్న హృదయాలకు - ఇటువంటి ప్రేమ జంటలను చూస్తే వెక్కిరింతలు, వేళాకోళాలు, బుగ్గలు నొక్కుకోడాలు, (ఈర్ష్య అందాం) సహజం ! అయినా ఈ అమ్మలక్కల మాటలను పట్టించుకు కూర్చుంటే ఎలాగ చెప్పండి ?

నీకు నాకు నేస్తమైతే
మల్లెపూల తెప్పగట్టి
తెప్పమీద తేలిపోదుము గదరా
చెల్ మోహనరంగా !

నాలోని వలపు తీగ
నీలాల పేరులాగ
నీ కంఠమునే చుటితి గదరా
చెల్ మోహనరంగా !

నీ మీద వలపు తీపి
నా మీద కెక్కిపోయె
నిన్నింక విడువజాలనురా
చెల్ మోహనరంగా !

ఎన్నాళ్ళకైన గాని
చిన్న నీ మొగము జూచి
నిలవునా సొక్కిపోతిని గదరా
చెల్ మోహనరంగా !

నీకూ నీ వారు లేరు
నాకూ నా వారు లేరు
ఏటి ఒడ్డున ఇల్లు కడదాం పదరా
చెల్ మోహనరంగా !

నీవే చందురుడవైతే
నేనే వెన్నెల నౌదు
భావించి వెంటనుందును పదరా
చెల్ మోహనరంగా !

పాపిష్టి గాలివాన
బెజవాడకు రాకపోతే
కష్టాలే లేకపోవును గదరా
చెల్ మోహన రంగా !

— బెజవాడలో కొంతకాలం చెల్‌మోహనునితో కూడా తిరిగినట్లుంది.

కంటికి కాటుకెట్టి
కడవా చంకాన బెట్టి
కన్నీరె కడవ నిండెను గదరా
చల్ మోహనరంగా !

నీ రూపె చూడగోరి
దారులూ గాచగానె
పాడు శకునమాయెను గదరా
చెల్ మోహనరంగా !

ప్రేమ అనేది హృదయంలో నాటుకోవాలేగాని, తదుపరి ఎన్ని అడ్డులు దుడ్డుకర్రలలాగా ఎదురు నిలచినా ఆగదు. అందులోనూ హృదయం ఇచ్చి పుచ్చుకొనే పవిత్ర ప్రేమకు ఎదురులేదు. తను నమ్ముకున్న హృదయం కోసం ప్రాణత్యాగంకైనా వెనుకాడదు !

చూడండి - తన చెల్ మోహనరంగడిని కనులారా చూడాలని ఆశ - అందుకోసం కళ్ళల్లో వత్తులు పెట్టుకుని దారులుగాచివుంటే - శకునం మంచిది కాలేదుట - అంటే అతగాడు రాలేదనే అనుకోవాలి.

ఏమిటో - ఈ నమ్మకాలు, శకునాలు, తను ప్రేమించిన మోహనరంగని కోసం - క్షేమంకోసం, మంచికోసం సోదులుచూపి, ప్రొక్కి సంతృప్తి పడడం జరుగుతుందంటేనూ ఆశ్చర్యం ఎందుకు?

నీవు నేను ఏకమైతే
నిండు చందురుడు నవ్వి
మేఘాల దూరిపోయెను గదరా !
చెల్ మోహనరంగా !

నిన్ను జూచి నన్ను జూచి
పున్నమ చందురుడు
నవ్వి చిక్కి శల్యమాయెను గదరా
చెల్ మోహనరంగ

విరజాజి పూలుపూసె
ఉరవైన వనములోన
గురివింద లేరుదము పదరా
చెల్ మోహనరంగా !

పసిడి పన్నీటిలోన
మిసిమి కాంతులతోడ
బంగారుచేపలున్నవి గదరా
చెల్ మోహనరంగా !

బలమైన అలలు రేగి
చలియించు సాగరమున
సంగీత మాలకింతము పదరా
చెల్ మోహనరంగా !

సరులు కన్నడని చోట
సురలు చెన్నారు వీట
అంచముగా ఆడుకొందము పదరా
చెల్ మోహనరంగా !

తెలితామరాపు జండా
ముత్యాల రథముమీద
దేశాలు తిరుగుదాము పదరా
చెల్ మోహనరంగా !

ఇంతకన్నా ప్రియురాలు ఏం కోరుకోవాలి - హాయిగా ఆనందంగా, పూలరథంమీద దేశాలు తిరిగి - తీర్థాలు చూసి- ఏవేవో ఊహల్లో విహరించాలనే తియ్యని కోరిక - బాగుంది !

పూపుల రథముగట్టి
చిలుక గుర్రములుగట్టి
పోయివత్తము గాలివాలునరా
చెల్ మోహనరంగా !

పూలతోటి బుట్టగట్టి
బుట్టకు ముయ్యలుచుట్టి
బుట్టలోనే ఎగిరిపోదమురా
చెల్ మోహనరంగా !

అమృతా ప్రవాహమైన
ఆకాశ గంగలోన

సరిగంగాలాడుదాము పదరా
చెల్ మోహనరంగా!

ఇది మరీ బాగుంది - ఆకాశం ఎత్తు ఆశ - ఆకాశ గంగలోనే సరిగంగా లాడుతుందట! అంతేకాదు-

నీ మొగము చందమామ
నీ కళ్ళు కలువపూలు
నీ మొగముతోటి చేర్చిపోరా
చెల్ మోహనరంగా!

నీ నోటనున్న మురళి
నా నోటనుంచి చూడు
నే నొక్క పాటపాడెద వినరా
చెల్ మోహనరంగా!

మధువూ నీ మోవితేనె
అది రానే రాదాయె
మతిమాలి నొక్కిసోలితిగదరా
చెల్ మోహనరంగా!

నీవొక్క హంసవైతె
నేను మానసమగుదు
పన్నీట నిదురబుత్తునుగదరా
చెల్ మోహనరంగా!

తేట పన్నీటిలోన
నీటుగాను జలకమాడి
మధుర నీ రూపు చూపనుపదరా
చెల్ మోహనరంగా!

మధురా నీ గుండెలచరా
నిడురా కంటికిరాదు
రెండు కొండలద్దమాయెనురా
చెల్ మోహనరంగా!

బంగారు పంజరాన
చెంగావి చిలుకలంటే
చెంగావి నీదు మోవిగదరా
చెల్ మోహనరంగా!

కస్తూరి బొట్టుపెట్టి
కలికి తురాయిగట్టి
నీవే నా రాజవై తివిగదరా
చెల్ మోహనరంగా!

కళ్యాణ మండపమున
కనకంపు గద్దెపైన
మంగళహారతి చెప్పెదరా
చెల్ మోహనరంగా!

మొత్తంమీద జీవితంలో ఉండవలసిన అన్ని కోర్కెలకు ఈ పాట ఓ లిస్టు! పాతకోటానికి జెస్టు!!

శృంగార వల్లరి



వేళచూడ వెన్నెలాయె
వెండికట్ల కిన్నెరాయె
మల్లిపూల పందిరాయె
వయ్యారి రావె
నవ్వుల్లోనె తెల్లవారును
కొండగోలుగు పూసెనేమో
కొండనిమ్మలు కాసెనేమో
దొండపండులాంటి పెదిమె
వయ్యారి రావె
మనసు ఎవరిపాలుజేతుసు
మల్లెపూలుపూసినట్లు
మల్లిమల్లి మాటలాడు
మల్లిపూలవంటి మనసు
వయ్యారిరావె
పూవులెవరిపాలు జేతును
నందిపూసె కందికాసె
కందికొసలు నందిమేసె
అందమైన మేలినడకల
పయ్యారావె
గంధమైన పంపబోతిని

ఇలాల్లి విశ్వాసం

చిలుకలు చిలుకలు అందురేగాని
చిలుకలకురూపేమి పలుకులేగాని ?
చిలుకల్లు మాఇంటి చిన్నకోడళ్లు !

కోయిలలు కోయిలలు అందురేగాని
కోయిలకు రూపేమి మోషలేదాని ?
కోయిలలు మాఇంటి కొత్తకోడళ్లు !

హంసల్లు హంసల్లు అందురేగాని
హంసలకు రూపేమి ఆటలేగానీ ?
హంసల్లు మాఇంటి ఆడబడుచుల్లు !

పావురాల్ పారావుల్ అందురేగాని
పావురాలకు రూపేమి పాటలేగాని !
పావురాలే మాఇంటి బాలపాపల్లు !

-అవును మరి, తన ఇంట అడుగు పెట్టిన చిన్న కోడలైనా, పెద్దకోడలైనా నట్టింట ముద్దుగా ఆడే పసిపాపైనా ఆమెకు ఆనందమే - అదే జీవిత మాధుర్యం అందుకే అలా-చిలుకలను, కోయిలలను, హంసని-పావురాయిని కాదని-తనవారిలో అన్నీ ఉన్నాయన్న ఆత్మవిశ్వాసాన్ని పాటలో వెలిబుచ్చుకొంటూంది ఆమె.

అప్పగింతలు



పెంచి పెద్దదాన్ని చేసి, ఓయింటిదానిగా చేసి, ఓ అయ్యకు ఇచ్చి పెళ్ళిచేయడం, పెళ్ళిలో ఆఖరున పెళ్ళికూతుర్ని మొగపెళ్ళివారికి "అప్పగింత" పెడుతూ పాడే పాటలనే అప్పగింతల పాటలు అని పిలుస్తారు.

ఈ అప్పగింతల సమయంలో పిల్లతల్లి, తండ్రి పడే బాధ అక్షరాలలో వ్యక్తపరచడం చాలా కష్టం. ఆ దృశ్యం చూడాలి. వారి కళ్ళల్లో, ముఖంలో, హృదయంలో, ఆ ఒక్క నిముషంలోనూ పడే బాధ అంతా ఇంతా కాదు— చూసేవారికే తాము ఓ చెల్లిని, లేదా ఓ బంధువుని దూరంగా పంపుతున్నామే అన్న బాధ కలుగుతుంది. అప్పగింతల సమయంలో కళ్ళు చెమ్మగిల్లక మానవు.

తను తల్లి కనుక ఆలస్యంగా లేచినా కసరదు. ఏదేనా కావాలన్నా తనతో కూతురు చెప్పి - నాన్నచేత కొనుపించుకొంటుంది. తను ఏ పాల చెంబునో, నేతి గిన్నెనో తెలియక పారబోసినా,పొరపాటు, పిల్లలు అంతే అని కన్నతల్లి సరిపెట్టుకుంటుంది. ఆకలేస్తే అన్నను పంపి, ఏదైనా కొనిపించుకు తింటుంది. పొరపాటుచేస్తే కసిరేతల్లే కౌగిలించుకుంటుంది. అవసరసమయాలలో హద్దులుపెట్టి స్త్రీ కట్టుబాట్లు నేర్పుతూనే - కట్టూ - బొట్టూ, మాటా - పాటా, నడక నడవడిక, వంటా వార్పూ నేర్పుతుంది. కాదంటే కసిరినా కోపం లేని కల్లైర, ద్వేషంలేని ఆర్డర్ ! కాని పరాయి గడపలో, కొత్తవారిమధ్య ఏం అనుకుంటుందో? - తొమ్మిది నెలలు మోసి కనిపెంచిన మాతృహృదయం అలా అనుకోడం తప్పదు. ఆడది అన్నాక నేడు కాకపోతే రేపైనా పరాయి ఇంట కాపురం చేయాలి. అయినా కని, పెంచి, పెట్టి, దిద్దిన చిన్నారిని అత్తవారింటికి పంపుతూ కంట నీరెట్టకుండా ఉండడం కష్టమే !!

శకుంతలను అత్తవారింటికి పంపుతూ కణ్వుడు అంటున్నాడు :

"పొరుగిండ్ల నిరుగిండ్ల
బ్రొద్దు వోకలకైన
బలుమారు నరగుట
పొడుకాదు"—

ఈ అప్పగింత ఆప్యాయతకు మారు రూపం - బాధ్యతకు ప్రతిధ్వని !!

ఈ రోజులలో ప్రేమ వివాహాలు, రిజస్ట్రేషన్ వివాహాలు ఎక్కువ అయినా - అమ్మాయి తల్లి తన కూతురును గురించి అలా అనుకోకుండా ఉండ లేదు. అందుకే తల్లికి అంత ప్రత్యేకపు హోదా సమాజంలో, సంఘంలో, ప్రపంచంలో !

వదినారో నా పుత్రి
ఇది వప్పగింత!
పదిలంబుగా దీని
బాగా చూడమ్మా ॥వ॥

పాలుకాచగలేదు
బాలా మా వదినారో
భాగ్యంబు తానీవె
బాగా చూడమ్మరో ॥వ॥

మాటలై నారావు
నెలతసుమి పదినరో
నేర్పుగ చెప్పుకో
నెలత మీ సుతను ॥వ॥

ఆకలై నాగాని
అన్నమడగని బాల
దాని నంపిన నేను
తాళాలేనమ్మారో ॥వ॥

ఎదురింటి భాగ్యమే
ఏమిసేయుదు తల్లి
ఎన్నగ అత్తింట
పుట్టినింటికి నీవు
కీర్తిగా మెలగుమా ॥వ॥

మరో రచన వినండి:—

పూజిత మగుచున్నది
భూజమ్ము బంతి
భోజనాలందారూ
పొందుగా జేసే
దశరథులు తమరంత
కడు సంభ్రమపడుచు
జనకునకు జెప్పెనే
సీతాపయనమ్ము !

ఇంతలో జనకుండు
కంది ఒడికట్టియో
బొమ్మ ఒడిగట్టి
తెల్లన్ని ముత్యాలు
దేవికీ కట్టి!

నెయ్యి కాచనేరదూ
నెలతసుమి ఒదినా
నేర్పుగ జెప్పూ
సీతామీదమ్మా
పాలుగాచనేరదు
పడతి సుమి ఒదినా
భాగ్యములు సీవేనె
బాగుగా చూడు
బుద్దులెరుగదు మంకు
బుద్ధిలేగాని
బుద్ధి ఒచ్చినదాక
దీద్దుకోవమ్మా!

పాలలో చెయిముంచి
భూమీసుతదెచ్చి
కౌసల్య చేతిలో
చెయివప్పగించె
శ్రీరాములు సీతా
పయనమై రాగా
మేలు శకునములాయె
వాడా లోపలను

కోటివేల దివిటీలు
కొపరొప్ప వెలుగ
కొమరుడీ గృహా

ప్రవేశంబులాయె
వేవేల దివిటీలు
వేడుకతొ వెలుగ
రాముడి గృహ
ప్రవేశంబులాయె!

పైన పరిచయం చేసిన ఈ అప్పగింతలపాట సీతారామ కళ్యాణ వైభవానికి సంబంధించినది.

ఈ అప్పగింత ఎంతగా హృదయాన్ని హత్తుకొనేలా ఉందో పరికించండి.

మా యమ్మ కామేశ్వరి
పోయీ రావమ్మా
పోయీ మీ అత్తింటా
బుద్ధి కలిగుండు! ॥మా॥

గడపపై కూర్చుండి
జడవిప్పబోకూ
కూర్చున్నప్పుడేతల్లి
కురులుదులపాబోకు ! ॥మా॥

వెండీ మట్టెలకాలు
ఎత్తీనడువరుమా
నడిచీనప్పుడు తల్లీ
చేయూచకమ్మా ॥మా॥

మగవార్ని చూచియో
మగువా సవబోకూ
తగపూలాడేచోటా
తల ఎత్తకమ్మా ॥మా॥

పతికంటె ముందులేచి
పనులెల్ల దీర్చి
పతిపాదముల సేవ
భక్తితో సేయుమా! ॥మా॥

పైన పరిచయం చేసిన "అప్పగింత" లాంటిదే ఈ పాటకూడా.

మా యమ్మ లక్ష్మీదేవి
పోయి రావమ్మా!

పోయి నీ అత్తింట
బుద్ధిగలిగుండూ
ఎవ్వరేమాడిన
ఎదురాడకమ్మా
వీధి నిలుచుండీ తల
విప్పి ముడువకుమీ
మాటలెన్నెన్నాను
మాటాడకమ్మా

పలుమారు మామీద
ప్రేమాలుంచకుమా!

ఆకలున్నా గాని
అని అడుగబోకు
మాటాకీ పదహారు
నాటకు దతడు

అతని కాదని పూలు
ముడవబోకమ్మా!

అంటూ పెళ్ళిచేసిన కూతురుని అప్పగిస్తుంది తల్లి, తను అంతదాకా ఆడుకున్న చెల్లెల్ని, తమ్ముడ్ని పిలిచి తన ఆట వస్తువులు అప్పగిస్తూంది అక్క!

బొమ్మరిళ్ళున్నాయి
బొమ్మలున్నాయి
నేను ఆడేటి సాల లున్నాయి!
నా మారుగా మీరు
ఆడుకోరమ్మా!

పోయి నా అత్తింటికి
పోయి వస్తాను
దీవించు అన్నల్లు
దీవించు అక్కా!

మాయమ్మా లక్ష్మీదేవీ
పోయీ రావమ్మా!



అప్పగింతలు

పాటలేనిదే బ్రతుకే లేదా అనిపిస్తుంది! లేచింది మొదలు పడుకొనే వరకూ- ఆటకు పాట, గెంతుకు పాట, నిద్రకు పాట, పనికి పాట, వెక్కిరింతకు పాట, పూజకు పాట, నీతికి పాట, పాపకు పాట, అటుచూసిన పాట, ఇటు చూసిన పాట, బ్రతుకే పాట- శ్రామికులు ఏపనిచేస్తున్నా పాట లేనిదే చేయరు, బండతో యడం నుంచి పగ్గం పట్టడం వరకూ; చెట్టుకొట్టడం నుంచి గట్టుత్రవ్వడంవరకు, చేను కోయడం నుంచి ధాన్యం మూట కట్టడంవరకూ; బెల్లు తవ్వడం నుంచి ఏతం వేయడంవరకూ; కర్ర పట్టడంనుంచి కొడవలి ధరించడంవరకూ; సూరీడు లేచింది మొదలు పడుకొనేవరకూ పాట - అందుతో పని- అదే బ్రతుకు ఆ జాతకాలకు- అదే వారికి నిత్య కార్యక్రమం.

నేడేకాదు నాడూ మన భారతజాతి జీవనంలో కదురు చాలా గౌరవం అందుకున్న పని! రాట్నంలేని కొంప లేదేమో ఆ రోజుల్లో. "కవ్వమాడని ఇల్లు, కదురుతిప్పని కొంప, మగ్గము లేనూరు కానరాదుట!"- నిజమే! నే డంటే యంత్రాలూ, తంత్రాలు, మంత్రాలు వచ్చి కదురు కవ్వం, మగ్గం మూలకు నెట్ట

బడ్డాయి కాని, ప్రాచీన భారతంలో ఈ మూడూ మన జాతి జీవనానికి బలమైన వృత్తులే మరి!!

కదురుపాట- (రాట్నం) లో ఎంత సంతృప్తి కనుపిస్తూందో వినండి:

అందచందములేని ఆడకూతురికి
అందమేరుపరుచు ఆ పత్తిచెట్టు!
పాడిపంటలున్న బంగారమిచ్చు
పైడిపత్తినిపెంచ బంగారు హెచ్చు!
పాలుపెరుగులున్న పాపలకొరకు
పత్తి నూలుదీయ పాతలకొరకు!
కవ్వమాడని ఇల్లు, కదురు తిప్పనికొంప
మగ్గములేనూరు మరి గానరాదు!
రాట్నాల మ్రోతమ్మ రవ్వలా మ్రోత
కనకగిరి గొల్లోరి కవ్వాల మ్రోత!
ఏకుల్ల రాట్నాము కాళ్ళ సంకెళ్ళు
కలవారి అల్లుడి కాళ్ళ సంకెళ్ళు
ఏకేకు ఒకబార ఎల్లుండి సంత
నాయేకులయిపోయె నా కేమిచింత!
పుంజమ్ము నూలుకు పోగుతక్కువ
కొండమీద పొద్దుంది కొట్టబోకత్త!
చేనివారొస్తారు చెప్పబోకత్త!

—తోటలకు నీరుపెడుతూ పాడుతున్నారు:

ఊడ్పులా కాలాన
ఒద్దన్న మొగుడు!
కోతలా కాలాన
కోరి రమ్మన్న !

ఏమిరా ఓ బావ
ఏమిరా నీవు?
ఆలికన్నం పెట్టవు
ఊరి కుపకారమా!

ప్రజ్ఞకి పెళ్ళాడా కాని
కూడెట్టడం నా కులానలేదు!

అల్లాగ సెబితేను
బోడిగొల్లోడ
పిల్లల్ని కంటావ
సిగ్గు లేకుండ!
పిల్లలంటే భాగ్యం!
మొగుడంటె దుఃఖం!
మొనగాడ వయ్యావ
మామాటం లేక
పొద్దున్నె పోతాను
మాపటికి వస్తాను!
నీ సోకులకు నేనేమి
అడ్డు వచ్చాను?

—సంపాదించకుండా ఉంటూ పిల్లలిని కని తనకేం పట్టనట్లు వుండే మగవారికి ఇదో వెక్కిరింత. అయితే తను సంపాదన పరుడూ కాకనో, లేదా పొద్దున్న పోయి మాపటికి వచ్చే చిన్న కూలీ కనుకనో- ఇంటిదాన్ని ఏ అడ్డం లేకుండా సోకులకు జల్సాగా వదిలాడు!

—చేనులో అకు నూరుస్తున్నారు- రంగురంగుల దుస్తులూ, రంగైన పూలకొప్పులూ, ఖంగ్ ఖంగ్ మను కంఠాలూ, ఓ- కోలాహలంగా ఉంటుంది :

ఒయ్ రాజ ఒయ్ రాజ
ఒయ్ రాజ!

ఓరాకూర్చున్నట్టి	ఒయ్‌రాజ
ముక్కూకాడున్నట్టి	,,
తప్పాకాలున్నట్టి	,,
దిబ్బముక్కున్నట్టి	,,

ఓయ్ ఓయ్ ఓయ్ రాజ	ఓయ్‌రాజ
ఓయ్ రాజ!	,,
నెత్తినైన జుట్టులేదు	,,
కత్తిపదునులేదు	,,
కంటికైన చూపు లేదు	,,
కాలూపుతాడయ్యా	,
కన్నెకొడతాడయ్యా	,,
కన్నెత్తిచూస్తేను	,,
కన్నంలో దూరాడు	,,

బాగుంది! పనులచేస్తూ కూటిజనం - ఆండలోనూ ఆడజనం - ఏ కామందునో, కాపునో, రెడ్డినో, దొరనో, ఏదోఒక వంకపెట్టి పాటల్లో యిలా వెక్కిరించడం చాలా చోట్ల కనిస్తూంది - "నెత్తికైన జుట్టులేదు, కత్తికైన పదునులేదు"ట. పౌరుషంలేనివాడని అర్థం. తమనిచూసి కన్నుకొడ్తాడట - తీరా వారు కన్నెత్తిచూస్తే కన్నంలో దూరాడట— ఎంత ఆలసుతనమో - ఎంత వెటకారమో !!

ఏతాము తోడుతూ పాడేపాటలు కొన్ని ఉన్నాయి - ముగ్గురు అవసరము ఈ యేతాము తోడుటకు ! నూతులూ, కాలువలూ దగ్గరలోలేని మెట్టప్రదేశాలలో ఏతాము గట్టి నీళ్ల తోడుతూండడం కద్దు.

ఏతాముతోడరా తమ్ముడా !
నీకు చేతైన సాయమదే తమ్ముడా !!
పాతాళ గంగమ్మ పైకుబికి పొంగింది
ఏతాముతోడి మెరక సేలన్ని తడపాలి
గూడు నొప్పనకుండ గూనలాగాలిబేగ
సేలన్నితడిసి మరి మూనలు బాగెదగాలి
కట్టతెగిపోకుండ కట్టండి గట్లన్ని
బద్దిపై సిన్నోడ భద్రముగ నడపాలి
పట్టుతప్పితె పళ్ళు భళభళా రాలేయి

ఏతమెక్కినవాడు ఏరుకట్టినవాడు
ఏటేట పంటలతో ఎలగాలి పది నాళ్ళు !

ఇదీ ఏతాము పాటే - గాని, ఈ ఏతాము ద్వారా తను అనుభవించే కష్టాలను విన్పిస్తూన్నాడు :

ఏటికేతంబట్టి వెయిపుట్లు పండించి
ఎన్నడూ మెతుకెరుగనన్నా ! నేను
గంజిలో మెతుకెరుగనన్నా !

కాల్తీయి కడుక్కొని కట్టమీద కూసుంటె
కాకితన్నీ పోయెరన్నా - కాకి
పిల్లతన్నీ పోయెరన్నా !

పోరుకూజాల్లేక పొయికాడ కూచుంటె
పోరితన్నీ పోయెరన్నా - పోరి
తల్లి తన్నీపోయెరన్నా !

చుక్క పొద్దున లేచి బొక్కెనెత్తాబోగ
బొక్కబోర్లా బడితిరన్నా !
నాదేటి బ్రతుకాయె ఓరన్నా !
నేను నాడే చావకపోతిరోరన్నా !

ఈ యేతాము పాట-అందలి నిరాశ, దురదృష్టమూ చూస్తే - ఈ క్రింది పాట జ్ఞప్తికి వస్తూంది.

ఎన్నాళ్ళు పాటుబడిన
ఈ గునపమే మిగులు
ఎందుకో ఈ జన్మ - ఓరన్నా !
కంటరాక్టరు మేడ
కలకదేరూ మేడ

కట్టించుకు కట్టపడక
సౌఖ్యాలూ పొందుతుంటె
ముందూ మనకేదంచు
మోసపోతూవుంటె
ఎండసెగనా మాడుతున్నా
గంజిముంతకు బరువులేదు !
గంగమ్మతల్లి చలువకు తిరుగులేదు !

పాపం ! ఇతగాడు గంజిముంతలో గంజికే నోచుకోలేదు కాని, నీళ్ళకి మాత్రం నోచుకున్నాడు. అంటే - నీళ్ల త్రాగి బ్రతుకుతున్నట్లున్నాడు !

ఈ పాటనే డా॥ బి. రామరాజుగారు అభ్యుదయలో (1958 జనవరి) "శ్రామిక గేయములు" అన్న వ్యాసంలో 'కాకి'ని గ్రామాధికారిగాను, 'కాకి పిల్ల'ను, గ్రామాధికారి కొడుకుగాను చూపిస్తూ తన్నులుతిన్న వైతుని పరిచయం చేశారు మరోరకంగా.

బస్తా దిగుమతికి టూతం సరిగా కుదరాలి - ఆలా టూపు సరిగా వచ్చిందంటే ఎంత బరువైనా బస్తాలైనా బంతులలాగా దిగుమతి జరిగిపోతాయి !

హైలేసో యల్లా	హైలేసో
ఒ చూరుకాడా	,,
ఓ పిల్లదాన	,,
ఓ పెళ్ళిచేసుకుంటె	,,
ఆ పెద్దకాసులదండ	,,
ఆ పెట్టేదెగాని	,,
ఆ చుక్కాలరయికా	,,
ఆ కుట్టించి పెడతాను	,,
నీ సన్న సన్నాని	,,
నీ నడుముకూ	,,
నేనొక్క ఒడ్డాణం	,,
నే చేయించి పెడ్తా	,,
హైలేసో యల్లా హైలేసో !	

గొడ్డళ్ళతో కట్టెలు కొట్టడం, చెట్టు నరకడం చేస్తూంటారు. ఆ సమయంలో ఈ పాట పాడతారని ఒకరు అన్నారు కాని గొడ్డలి ఊతానికి ఈ పాట తాళం సరిపోతుందా అని ? అయినా విందాం :

"నరకవయ్యా నరకవయ్యా
ఓహో-నరకవయ్యా !
వాడేమి కొట్టాడు-చింతచెట్టు
వీడేమికొట్టాడు - చిన్నచెట్టు
నీవేమి కొట్టావు- ములగచెట్టు
నరకవయ్యా నరకవయ్యా
ఓహో - నరకవయ్యా !"

ఈ పాటలో కష్టంఅనిపించేపని చింతచెట్టు కొట్టడం, లేదా అలాటిదే మరో గట్టి చిన్న చెట్టు కొట్టడం - కాని ఇంకోడు గొడ్డలితో ములగచెట్టు కొట్టానం టున్నాడు-నవ్వురాదూమరి? అందుకే-పాటలోనే నవ్వుతున్నారు.

"వాడేమి కొట్టాడు ఓహో చింతచెట్టు !
వీడేమి కొట్టాడు అదో చిన్నచెట్టు !
నీవేమికొట్టావు ఇహిహీ ములగచెట్టు!!"

కులం గోత్రం ఉన్నా, లేకున్నా, అనురాగం అనేది ఆ కూలి జనంలో ఉన్నంతగానూ, సంతృప్తి వారు అనుభవించినంతగానూ, ఉన్నవాళ్లూ పెద్దవాళ్లూ అనుభవించలేరేమో అనిపిస్తూంటుంది-బావ కోడికూతతో లేచి చేనుమీదకు కూలి కోసం వెళ్ళిపోయాడు - అప్పుడే "తలమీద కొచ్చాడు తండ్రి సూరీడు"- అంటే అపరాహ్ణం అయింది - బావకి ఆకలిదూపరి? - గంజిపట్టుకని తనే చేలకేసివెళ్ళి అల్లంత దూరాననే నుంచుని బావను పిలుస్తూంది:

తలమీద కొచ్చాడు
తండ్రి సూరీడు !
ఇలలోన జనులెల్ల
ఇసిగి పోనారు

కొడవలీ మొలనుంచి
కోతసాలించి
రావోయి బేబేగ
రంగన్న బావా

మొగమెల్ల కప్పింది
ముత్యాల సెమటా
ఒల్లెల్ల వొసివాడి
కందిపోనాదీ

కొడవలీ మొలనుంచి
కోత సాలించి
రావోయి బేబేగ
రంగన్న బావా

బంగారు నీమోము
వొసివాడి పోయె
వొల్లెల్ల కందింది
వెర్రినా బావా ॥కొడ॥

ఎంతప్రేమో రంగన్న బావ అంటే - 'మొకమెల్ల కప్పింది ముత్యాల సెమట, బంగారు నీమోము వొసివాడిపోయె' ఎంత అనురాగం - ఆనందమయ జీవితం !

అడవులలో పుల్లలూ, కట్టెలూ, కుట్టుడాకులూ ఏరుకుని, కోసుకుని తీసు కెళ్ళడానికని ''కూపు''లు అని నిర్ణయిస్తారు. ఫలానా అడవిప్రదేశంలో పుల్లలు ఏరుకోవచ్చునని నిర్ణయించే ప్రదేశానికే ''కూపు'' అని అంటారు. అటు వంటి కూపుకువెళ్ళే ఒంటరిపడుచులను - ఫారెస్ట్ గార్డు లాంటి ఓ అధికారి చీటి చూపమంటున్నాడు. అప్పుడు ఆ పడుచు అంటుంది.

ఏటోరి బాబూ
సీటిమాటికి
సీటి సూపమంటరూ
మాటిమాటికి
తనికి సేత్తమంటరు
సీటిలేకుండా రాలేదు
కూపుకూ
అడ్డాకుకూ

ప్రక్కన మరోపిల్ల అడుగుతూంది:

ఎవుడోలెంకి ఆ సోకుదారు నాయాలు?
ఏటమ్మీనిల్దీసి అడుగుతుండు?

తన సమాధానం: ఎవరూనేదే మన చింగం పిల్చెంకన్న మనుషుడు. ఈమద్దెన పారెట్టు గార్డయినాడు

దించునీదీ నెత్తిబరువూ
సూపించునీదీ సీటిపిల్లా
కూపుసీటి నేకపోతె
ఆపు సేత్తనమ్మీ
కేసు వూపు సేత్తనమ్మీ

పిల్ల అంటున్నది:- వూపు సేసినట్టే ఉన్నవు బాబూ!

అడ్డాకుల మూటబాబు
సెడ్డా బరువుందిబాబు
ఎత్తితే దించలేము
దించితే ఎత్తలేము

సెప్పరాని కాడుంది
ఇప్పి సూసుకో సీటి

అతడు:— ఏంసేయమంటావే పిల్లా ఉద్యోగదరమం

ఓడి నొడతలుపడి
సీటి తడిసిందేవమ్మీ

పిల్ల:— బాబుసేతికి తడి తగిలిందా?

అతడు:— మీదనున్నాయే గదుపిల్లా ఆటికి రాసేస్తాను.

ఒద్దోయ్ బాబు
గాడ్డుబాబు
సంతర్పణ తింటారు
మంచిది ఈ అడ్డాకు

ఏటోరిబాబు
సీటిమాటికి
సీటి సూపమంటరు
మాటిమాటికి
తనికిసేత్త మంటరు
సీటిలేకుండ రాలేదు
కూపుకూ అడ్డాకుకూ

ఊడ్పులు-ఆ మాటలోనే ఎంతో బలం కనిపిస్తుంది - ఎంతపని, ఎక్కడి దెదరి, తండాలుగా కూలీలు, బళ్ళు, ఆకు, నీరు, ఓ! ఆ కోలాహలం, పచ్చని పరి ఆకు ఊడుస్తూ, పాటలు పాడుతూ, పిట్టలు ఎగురుతూన్న ఆ దృశ్యం-ఎంత అందమైనదీ-ఈ ఊడ్పు పాట-వినండి:

నోమినోమన్నారె తుమ్మెదా !
నోమన్నలారా ,,
కలువరేకులె కళ్ళు ,,
కలికి సీతమ్మావి ,,
ఆ అందచందాలు ,,
అవనిలోనే లేవు ,,
బంతు లాడబోయె ,,
సీమంతి సీతమ్మ ,,
సీత బంతుల యాట ,,
చేలుకిలే చూశాయి ,,
సీత చెలిక త్తెలె ,,
సిగ్గులే పొందారు ,,
అంతలో నాబంతి ,,
అరచేతిలో పడి ,,
జనకుడు తెచ్చినా ,,
శివునింటి కింటికీ ,,
దొర్లుతూ పోయింది ,,
సీత చెలులను చూసి ,,
నవ్వుతూ పలికింది ,,
అమ్మ అతివలార ,,
నా అందమైన బంతి ,,
పెట్టె క్రిందకు పోయె ,,
తీసి ఇవ్వారమ్మ ,,
చెలులు అందరుగూడి ,,
చేతులు కలిపారు ,,
సత్తువలు చూపారు ,,
బలములే చూపారు ,,
శివదేవుడి ఇల్లు ,,
కదలాకెపోయెను ,,

నవ్వుచు సీతమ్మ తుమ్మెదా !
అంసనా గొచ్చింది ,,
తామరలె చేతులు ,,
అరికాళ్ళు బంగారు ,,
ఆతిసులువుగాను ,,
అవలీల నెత్తింది ,,
జనకుడె చూశాడు ,,
దేవతలు చూశారు ,,
పుష్పవృష్టి కురిసె ,,
దేవదుందుభు లెల్ల ,,
దేవఘోసలు చేసె ,,
జనకు డంతటతోను ,,
జానకొద్ద కొచ్చి ,,
సంబరముతో తాను ,,
తన పంతమె పలికాడు ,,
కన్నతల్లీ నిన్ను ,,
పొగడతరమూ కాదు ,,
దేవతలె జంకారు ,,
రాక్షసులు రానేరు ,,
నరుల వశమూ కాదు ,,
నీ బలము చూడంగ ,,
నా మనసు పొంగింది ,,
నీ బలము మించిన బలము ,,
నే నవని చూడాలేదు ,,
ఈ విల్లు విరిచేటి ,,
వీరునకె నిన్నిత్తు ,,
సీత సిగ్గుతోటి ,,
చెలులాతో చేరింది ,,

బరువు పని చేస్తూన్నప్పుడు పాడే పాటలు అనేక రకములు ఉన్నాయి - ఐతే, నీటిమీద నడిచే పడవ బరువుకూ, నేలమీద దొర్లే రోడ్డు రోలరుకూ ఒకేపాట అతకదు. భావాలూ, మాటలూ ఒకలా కనుపించినా - ఎత్తు గడ - తాళం మరోలా సాగుతుంది. పాటను ఆధారం చేసుకుని పడవగాని, రోలరుగాని సాగవు. వాటి బరువును ఆధారం చేసుకొనే పాటా - బండా సాగుతుంది. సాగడమేమిటి ! ముందుకు పరిగెత్తి బరువున్న పనిని పడిల పరుస్తుంది- ! రోడ్డు రోలరు పాటలు, పడవ పాటలు ఈ తరహా క్రిందకే వస్తాయి- ఈ బరువు పని పాట పరికించండి :—

జంబైలే జోతులంగరు
అవుర, అవుర, మనోళ్ళబ్బయి ॥జం॥
నీకు జారులేదు, జోరులేదు ,,
నీకు రోసంలేదు మీసంలేదు ,,
నా చల్లనీళ్ళు అల్లిమొగ్గ ,,
నా ఉడుకునీళ్ళు ఉల్లిపువ్వు ,,
కాకి దుస్తులు కట్టుకొని ,,
కాకినాడకు పోతుంటె ,,
కాకిపిల్ల నెత్తిమీద ,,
కావు కావు తన్నింది ,,
కడపమీద కడపపెట్టి ,,
కాకినాడ రేవు కెళితె ,,
కాకినాడ కలకచేరు ,,
కడవడించె కొగలించె ,,
బిందెమీద బిందెపెట్టి ,,
భీమడోలు రేవు కెళితె ,,
భీమడోలు మునసబు ,,
బింది దింపి మాటలాడె ,,

ముంతమీద ముంతపెట్టి ।జం॥
ముంజవరం రేవుకెళితె ,,
ముంజవరం మొగోడు ,,
ముంత దింపి ముద్దులెట్టె ,,
ఆ ! జంబైలే జోతులంగరు ! ,,

పసుపు తోటలలో పసుపు ఏరుపాట ఇది. దీనిని ఎక్కువగా పాడేది, పని చేసేది ఆడవారే - ఈ పసుపూ వారి మాంగళ్యరూపమేగా ?

నీలాటి రేవంత
నిగ్గు తేలిందీ
ఏ చేడె కడిగిందీ
ఈ ఛాయాపసుపూ !

పచ్చిపసుపు బావల్లా
మరదా లాడిందీ !
అనపపసుపు అన్నల్లా
చెల్లెలాడిందీ !!
కొట్టు పసుపు కొడుకూలా
తల్లి ఆడిందీ —

కొడుకూలా తల్లియే
తానూ గోపమ్మా !
గొంతయాడిన పసుపు
గోవ పూఛాయ
అన్నల్ల చెల్లెలే
తానూ అమ్మాయి !

అతివ ఆడినపసుపు
ఆవపూచాయ,
బావల్లా మరదాలె
తాను అమ్మాయి
పణతిఆడిన పసుపు
బంగారుచాయ.

ఈ బస్తా బరువుపని పాట చూదాం :

వస్తావటోలె పిల్ల
వస్తావంటె నిన్ను
వరంగల్లు తీసుకపోత
వస్తావంటె.

నన్ను వరంగల్లు
తీసుకపోతె వస్తానుగానీ
మన దారిఖర్చు దప్పిఖర్చు
తెస్తావటోయి.

మన దారిఖర్చు
దప్పిఖర్చు తెస్తానుగానీ
అడుగు దాటకుండ మాట
ఇంటావంటే ?

అడుగు దాటకుండ
మసలుకుంటు ఉంటానుగానీ
మాట పేచీరాకుండ నువ్వు
సూసుకుంటావా ?

పోటీ రాకుండగాను
సూసుకొంటానుగానీ

పోకిట్ల పోతవుంటె
కూకలెడ్తాను.

భావ కవిత్వం, జానపద కవిత్వం, వచన వక్క గేయాలూ మొదలగు శీర్షికల క్రింద నేడు వెలువడే తరహా క్రిందనే ఈ శ్రామిక, శృంగార, స్త్రీల, పాటలలోనూ పై మూడునాలుగు రకాల నియమాలూ కనిపిస్తాయి. కొన్ని భావాలకి మాత్రమే అందంగా ఉంటాయి. కొన్ని పాడుకోడానికి హుందాగా ఉంటాయి- కొన్ని పంక్తులుగా విరుచుకని చదివి కూర్చునూ, అందలి నేర్పునూ చూసి మురియడానికే బాగుంటాయి.

గుంటూరు చిన్నదానా
గుబురు కేశాలదానా
గుబురూ కేశాలమీదా
గొబ్బిపూలు సోకే
—ఓ చిన్నదానా
గొబ్బిపూలె సోకే
—ఓ చిన్నదానా

పువ్వాడ చిన్నదానా
పువ్వాల జడలదానా
పువ్వాల జడలమీదా
మనసెంత నీకే
—ఓ చిన్నదానా
మనసెంత నీకే
—ఓ చిన్నదానా

రంగాము పోయి నేను
రంగైన రయిక తెస్తే
రంగైన రయికమీద
మనసేల లేదే

—ఓ చిన్నదానా
మనసేల లేదే
—ఓ చిన్నదానా.

రంగంకు కూలిపనులకోసం వెళ్ళడం- అక్కడి నుంచి దవస్తూ చుక్కలు రయికలూ, మద్దుటుంగరాలూ, కమ్మల జోళ్లూ పిల్లలకు తేవడం పరిపాటి- తను పనికట్టుకుని తన చిన్నదానికోసం "రంగైన రయిక తెస్తే" మనసేల లేదో దురూహ్యం. మరి అతగాడిని గురించి చిన్నదాని అభిప్రాయం ఏమిటో?

అలాగే మరో రోడ్డురోలరు పాట చూదాం:

ఓ చిన్నదానా విడువనే చెంగు!
ఓ చిన్నదానా వదలనే చెంగు!!

బందారు చిన్నదాన
బాజా బిందూలదాన
బాజా బందూలమీద
మోజేలలేదే- ఓ చిన్నదానా

గుంటూరు చిన్నదానా
గుళ్లా పేరూలదానా
గుళ్లా పేరూలమీద
కళ్లూ పోలేదే- ఓ చిన్నదానా

కాకినాడ చిన్నదాన
కాసుల కంటెదాన
కాసుల కంటెమీద
మనసేల లేదే- ఓ చిన్నదానా

అర్ధరూపాయ పెట్టి
అద్దాలరయిక తెస్తె

అద్దాల రయిక మీద
బుద్దేల లేదే - ఓ చిన్నదానా

నల్లా నల్లానిదాన
నడుము సన్నానిదాన
తళుకూ సేపలమల్లె
కులుకూ సూపులదాన - ఓ చిన్నదాన

నిను సూసి ఈ మనసు
నిలువాకున్నాదోలె - ఓ చిన్నదానా.

—ఇటువంటి పాటలు చాలా ఆకర్షణగా ఉంటాయి, నా రేడియో ప్రసారాలలో 10 సం॥ అనుభవంలోనూ ఇటువంటి పాటలే శ్రోతలను ఆకట్టుకున్నాయని అనుకుంటాను. అదే కాదులెండి, లలిత సంగీతశాఖ ప్రధాన వ్యక్తుల పట్టుదల, శ్రద్ధ మరీ మెరుగుపెట్టి ఈ సారస్వతానికి చక్కని ఆదరణ లభింపజేశాయి.

పై పాటల పరుసలో మరో రకం చూదాం :

గూడూరు చిన్నదానా
గూడూరు గుట్టాలదాన
గూడూరు గుట్టాల మీద
గాజులుంటె సోకే — ఓ చిన్నదాన

నీలీ నీలాటిదాన
నిలువు సన్నాటిదాన
నీలీ నీలాము మీద
సగలుంటె సోకే — ఓ చిన్నదాన

సన్నా సన్నానిదాన
సన్నాని కురులదాన
సన్నాని కురులామీద
జాజిగుత్తి సోకే — ఓ చిన్నదాన

—అవును ! కఁరుల సౌందర్యానికి పెట్టిపుట్టిన తెలుగు పడుచులకు మల్లె మొగ్గలు, జాజి గుత్తులు కాపీరైటు లాంటి సింగారింపు !

—ఈ బరువు లాగు పాటలోని పదాల పరుగులఁఉరుకులు - హుషారులు పరికించండి.

ఓ ఆరిజెల్ల
బేరి మోత
ఓ నల్ల నేలల
దున్నదలచేరా

మొర్రిక్క-బోతే
ఓ దయ్యమైరా
పట్టినాదిరా
ఓ మానయంబరా
గాలిమ్రోతరా
ఓ గాలి మ్రోతరా
ధూలి మ్రోతరా

ఓ రేమి రన్నయా
ఉసారు లేదురా
ఓ రాగి డబ్బురా
ఈడు ముంతరా

ఓ బొట్టు పెట్టరా
బొమ్మ చూడరా
ఓ మిద్దె మీదరా
మిరప చెట్టురా

ఓ కాయ చూడరా
నీలు లేవురా
పాలు లేవురా
ఓ కూకున్నాదిరా
కుర్రికుంకరా
ఓ మేతిరోడురా
దానెంపచెల్లెరా

ఓ కుంచమంతరా
ఓ గుడిసెలోనురా
ఓ మాని కంతరా
ఓ రోలు తోసెరా
ఓ ఆడిజెల
బేరి మ్రోత
ఓ నల్ల నేలల
దున్నదలచేరా

—'మేతిరోడు' ఈ పాటల్లో ఎంత సర్వ సాధారణంగా విసిపిస్తూంటుందో- "కుర్రిగుంట, చిన్నది, పడుచుది"కూడా అంత సర్వ సాధారణమే. ఈరెండూ ఏదో సమయంలో, అంటే కూలి పని చేయిస్తూ ఖజమాయిషి చేయించే మేతిరోడు- అతడి క్రింద పని చేసే కుర్రకుంక - అనుకోకుండా ఓ ఇంటి వాళ్ళు అయి, కుంచమంత గుడిసెలో ప్రత్యక్షమవడం సర్వ సాధారణం.

ఈ పాట వరి కలుపుల సమయంలో సమిష్టిగా పాడేదిలాగుంది :

రాయే రాయే భామా నందానా
రమణి ముద్దుల గుమ్మానందానా

సామోరు సత్తెభామా కూడెసు
సరివాదములు ఏసుకొన్నారు
వేడికూటి ఏళాకి యారాలు తెస్తాను
సల్దికూటేళాకు సవతిని తెస్తాను
చాల పొద్దూ లేదు సరివాదమేశారు

రాకయ్యా రాకయ్యా సామోరూ
మా అన్నలొస్తారు సామోరూ
మమ్మల్ని తిడవారు సామోరూ

మిమ్మల్ని కొడతారు సామోరు
రాకయ్యా రాకయ్యా సామోరు
పొద్దు చాలా లేదు సామోరు
ఏడుగురు అన్నలూ సామోరు
వచ్చే వేళాయింది సామోరు

ఈ "సామోరు" ఎవరో గుడిసెలూ, గూడాలూ పట్టడం అలవాటు పడ్డ పెద్ద మనిషిలాగున్నాడు - ఎంతకీ కదలడు కాబోసును, "రాకయ్యా రాకయ్యా సామోరూ, పొద్దు చాలాలేదు సామోరు, ఏడుగురు అన్నలూ సామోరు, వచ్చే వేళాయింది సామోరూ" అని బ్రతిమాలుతున్నారు.

—గోడలు కట్టుకప్పుడు, మేకలు మిద్దెలు కట్టుకప్పుడు, పెద్ద పెద్ద భవనాలు, భవంతులు, మిల్లులు కట్టుసమయంలో – కూలిజనం బంటాలుగా చేరి

ఎవరి పనులు వారు చేసుకుంటున్నప్పుడు చూస్తే అది ఒక మహాయంత్రం తనంట అదే అలా పనులు చేసుకుపోతున్నట్లు కనిపిస్తుంది !

ఒక గుంపు తవ్వుతుంటుంది. మరో బంటా ఏదో బరువెత్తుతూంటుంది, ఒక తండా ఇటుక పేరుస్తూంటుంది. ఒక వరుస సిమెంటు బాల్చీని వైర్ వర్కులా ఒకరిచేతినుంచి ఒకరిచేతికి అందించుకుపోతూంటుంది. ఎవరిదృష్టి వారిది, ఎవరి పని పాటవారిది - అలాటి సమయంలో పాడేదే ఈ క్రిందిపాట. ఈ పాట వరుస చాలా ప్రచారమైనదే ! బాల సాహిత్యంలో కూడా ఈ వరుస పాటలు చాలా ఉన్నాయి.

నాటారమ్మా నాటారు
ఏమీ మొక్కా నాటారు
జాజారమ్మా పూలతోటలో
జాజీమొక్కా నాటారూ

సాగేసమ్మా సాగేనూ
ఏమీ తీగ సాగేను
జాజారమ్మా పూలతోటలో
సన్నాజాజి సాగేను

ఏసేనమ్మా ఏసేను
ఏమి సిగురు ఏసేను
జాజారమ్మా తోటలోనా
చామంతే సిగురేసేనూ

తొడిగేనమ్మా తొడిగేను
ఏమిమొగ్గలు తొడిగేను
జాజారమ్మా తోటలోనా
జాజిమొగ్గలు తొడిగేసు

విచ్చేనమ్మా విచ్చేను
ఏమీ పూలు విచ్చేను
జాజారమ్మా పూలాతోటలో
మొగలి రేకులు విచ్చేనూ *



పడవ పాటలు

పడవ పాటలు ఎన్నో రకాలు. ఆ పడవల రేవు - ఆ ఎగురుతూన్న తెరచాపల వరుసలు, సరంగుల హడావిడి, కూలి జనం కోలాహలం - గంగమ్మ గలగలలు - గొల్లమ్మ పకపకలు, ప్రయాణికుల పరుగులు.

పడవ సరంగులు నీటి ప్రయాణంలోనే, ఆ పడవ మీదనే, ఆ గాలిలో ఆ జోరులో, ఆ నీటి కెరటాల ఒడిలోనే శ్రమను మరచి, వెన్నెల వెలుగుల ప్రయాణాల్లో శృంగారమయమైన పాటలు పాడుకుంటూ సునాయాసంగా బరువునూ పడవనూ ముందుకు నెట్టుకుపోతారు. ఎన్ని పాటలు - ఎన్ని అర్థాలు వీటిలో - ఎన్ని పదాలు అందులో-అదే వారి ఆనందం - అదే వారి స్వర్గసీమ !

పెళ్ళి తూతురు చూడు	హైలేసా
బహు పెద్ద మనిషిరా	,,
చూసిరమ్మందేసు	,,
చేసుకొచ్చిందిరా	,,
గంగమ్మ గౌరమ్మ	,,
దండాలు మాతల్లి	,,
కొలుపులు మాతల్లి	,,
దిగిరావె మాతల్లి	,,
దండాలు ఇవిగోను	,,
దండాలు గంగమ్మ	,,
కన్నేసి కనిపెట్టు	,,
మాతల్లి కనిపెట్టు	,,

-ఈ "హైలేసా" "ఏలేలో" "హవ్వారి హవ్వ" ఊత పదాలు. ఎంత బరువైనా ఈ "ఊతపదాల" ఊపుకో నెట్టుకు పోతుంది.

హైలేసో హవ్వారి హవ్వ
లాగరోరీ లంగరు త్రాడూ
పీకరోరీ పిల్లాడి జుత్తూ

జంబైలే బోతులంగరు
లాగరోరీ లంగరుత్రాడూ !

మూడు నెల్లా ముండాపోరు
ఆరు నెల్లా జన్మాఖైదు
ఎక్కరానీ పడవామీదా
సెప్పరానీ దుఃఖ మొచ్చే

హైలేసో హవ్వారి హవ్వ
హైలేసో హవ్వారి హవ్వ

జీవిత రహస్యాలు ఎన్నో ఈ పాటల్లో విసిపిస్తాయి. ఈ క్రింది పదవ పాటలో ఆ హుందా కనండి.



నేలను నమ్మి ఏలేలో
చెట్టూ ఉన్నది హైలేసా!
చెట్టును నమ్మి ఏలేలో
కొమ్మా ఉన్నది హైలేసా !
కొమ్మను నమ్మి ఏలేలో
రెమ్మా ఉన్నది హైలేసా!
రెమ్మను నమ్మి ఏలేలో
అమ్మి ఉన్నది హైలేసా !
ఆమ్మిని నమ్మి ఏలేలో
పువ్వూ ఉన్నది హైలేసా !
పువ్వును నమ్మి ఏలేలో
పిందే ఉన్నది హైలేసా !
పిందెను నమ్మి ఏలేలో
కాయా ఉన్నది హైలేసా!

కాయను నమ్మి ఏలేలో
పండూ ఉన్నది హైలేసా !
పండును నమ్మి ఏలేలో
నేనున్నాను హైలేసా!
నన్ననమ్మి ఏలేలో
నువ్వున్నావు హైవేసా !

ఏకాకిగా బ్రతుకు దుర్భరమనీ, ఒకర్ని ఒకరు అనుసరించుకుని, ఒకరికి ఒకరు సహాయపడుతూ - చెట్టూ నేలా లాగ, పూవూ కాయాలాగ – ఆదమగా జీవితాలు కుటుంబాలు — ప్రజలు – ప్రపంచం కొనసాగాలి అన్న దివ్యసందే శాన్ని వినిపించడం లేదూ ఇంచులో?

ఏలియాలా ఏలియాలా
ఏలియాలా ఏలియాలా
జోరుసెయ్యి అయిలెసా
బారుసెయ్యి అయిలెసా !

అయిలపట్టు అయిలెసా
బల్లకట్టు అయిలెసా
అద్దిరబాబు అయిలెసా
అక్కడ పట్టు అయిలెసా !

సాపసుట్టి అయిలెసా
సంకనెట్టి అయిలెసా
సందమామ అయిలెసా
సక్కంగా అయిలెసా !

జోరుసెయ్యి అయిలెసా
బారుసెయ్యి అయిలెసా !

సన్నజాజి అయిలెసా
సీరకట్టి అయిలెసా
పొన్నపూలు అయిలెసా
కొప్పునెట్టు అయిలెసా
సిన్నదొచ్చి అయిలెసా
కన్నుగీటె అయిలెసా!

సన్నజాజి, సందమామ, కొప్పు ,ిండపూలూ, జానపద కవితల్లో సర్వ సాధారణాలు. చిన్నదొచ్చి కన్ను గీటిందట - మరి చిన్నవాడు ఏం చేశాడో ? చూడండి - ఒంటరిగా పడుచు కనుపించే సరికి యువకుని మనసు ఏ విధంగా కొంటెగా పలుకుతూ కవ్విస్తూందో :

ఏలూరెళ్ళిందొక చిలుక దాని
ఎర్రకోక మీద నా మనసు - హెయ్ ॥ఏ॥

ఒంగో లెళ్ళిందొక చిలుకా దాని
ఒంపు చూపుమీద నా మనసు ॥ఏ॥

ముదునూ రెళ్ళిందొక చిలుక దాని
ముక్కు పుడకమీద నా మనసు ॥ఏ॥

రంగూ నెళ్ళిందొక చిలుక దాని
రవిక సొంపుమీద నా మనసు ॥ఏ॥

కాకినా డెళ్ళిందొక చిలుక దాని
కంటి విరుపుమీద నా మనసు ॥ఏ॥

ఇలా ఒంటినీ, కంటినీ, బట్టనీ, కట్టునీ వర్ణించి, కవ్వించే కవితలు చాలా ఒకే మాదిరివి కనుపిస్తాయి వీటిలో !

కొంచం ఊపు - ఊతం కలిగి రయ్‌మని వీచే జోరుగాలిలాగా వినిపించే పాటల్లోదే - ఈ పదవ సందడి పాట – పరికించండి.

ఓ ఓ ఓ పల్లెమామా
పదవాపు పదవాపు పల్లెమామా
పదవొడ్డు పట్టించు పల్లెమామా
పచ్చి చాపలగంప పల్లెమామా
బరువూగా ఉందోయి పల్లెమామా ! ॥ఓ॥

ఓ ఓ ఓ పల్లెదానా
ఏ వూరు దానవే ఎర్రిదానా
ఏ జాతి దానవే పొట్టిదానా
నట్టేటి పదవకీ పడుచుదానా
గట్టులేదు పుట్టలేదు పల్లెదానా
సందె చీకటి పడ్డాది పల్లెమామా
గదవేసి ఒడ్డుకురా పల్లెమామా ॥ఓ॥

పదవొడ్డు కొచ్చింది పల్లెదానా
గంప దింపుతాను రాయె పల్లెదానా!

పల్లె జాతి మాటల వరుసలలో మామ, మరదలూ వరుసలూ, బరువు దింప డాలు, గద వెయ్యడాలూ ద్వందార్థాలతో ఎక్కువగా దొర్లుతూంటాయి.

పదవ పాటలలో ''సిరిసిరి మువ్వ'' పాటలూ చాలా ఉన్నాయి. ఇపన్నీ ప్రియుడూ — ప్రియురాలూ మధ్య డ్యూయెట్‌గా శృంగార రసం ఒలుకపోస్తూ నడుస్తాయి. ఇవి రకరకములుగా దర్శన మిస్తాయి.

రంగం వెళ్ళాడు ప్రియుడు - ఏదో సంపాదించుకు వద్దామని; అక్కడ ఎవరో మధ్యలో స్నేహం అయినట్లున్నారు. ఆఖరుకి కాని తను విడిచి వెళ్ళిన 'సిరిసిరి మువ్వ' జ్ఞాపకం రాలేదు - అప్పుడు అనుకొంటున్నాడు :

జోడు కొయ్యలోడమీదా సిరిసిరి మువ్వ
జోడగ్గిపెట్టె లంపినానె ,,
ఆవి అందెనాయె అందలేదో ,,

నాకు తిరుగు జాబు లంపలేదే	సిరి సిరి మువ్వ
మూతు కొయ్యల వోడమీదా	,,
నీకు ముక్కు పుడక లంపినానె	,,
అందిందో లేదోనె	,,
నాకు తిరుగు జాబు లంపలేదు	,,
నాల్గు కొయ్యల ఓడమీదా	,,
నీకు నానుకోడులంపానే	,
ఆందిందో లేదోనే	,,
నాకు తిరుగు జాబు రాలేదో	,,
అర్ధరూపాయి దబ్బులకు	,,
నువ్వాశపడబోకంది	,,
ఆసుపత్రి పాలైతే	,,
నిన్నాదుకొనేవారు లేరందీ	,,
కసరి కసరి కొడితేను	,,
నే సరస మనుకున్నానె	,,
కంటికి కాటుక పెడితె	,,
నేను కన్నె ఆనూకున్నానె	,,
పైట పావడా గడితే	,,
నే పడుచు అనుకున్నానే	,,
పౌడరేసుకుంటేను	,,
నేను బాలికనూకున్నానే	,,
తళుకు జూపిస్తేను	,,
నా వలపులనూకున్నానే	,,
ని మీద వలపంటే	,,
కామాలు ననుకున్నానె	,,
సంకురాత్రి పండగనాడు	,,

నేను సారానీళ్ళు త్రాగబోతే సిరిసిరి మువ్వ
ఒంటిగ నుంటేను ,,
నాకొక్క చుక్క దిగలేదూ ,,
కష్టపడ్డ డబ్బంత ,,
ముండ కాటిమీద పెట్టినానె ,,
ముద్దుగుమ్మ నేడిపించి ,,
పాడు ముండలకు బెట్టానె ,,
సముద్రాలు దాటిపోతే ,,
పైసా అయిన లేకపోయె ,,
బుద్ధిలేక రంగమెళ్ళి ,,
ఈ రద్ది పాలు పడ్డానే ,,

పాపం - రంగంలో ఓడాని వలలో పడి, పడ్డ పాట్లు తలుచుకుని బాధపడి, చేతులు కాలాక సిరిసిరి మువ్వను తలుచుకుంటున్నాడు -

ఈ రంగం పాట ఇలా కూడా ఉంది. 'సిరిసిరి మువ్వ' ఈత పదం మామూలే !

జోడగొట్టా లోడమీదా సిరిసిరి మువ్వా
జోడుంగరా లంపానె ,,
జోడుగొట్టాలోడమీదా ,,
జోడు సవరా లంపానే ,,
అందినాయె అందలేదో ,,
తీగజాబు లంపావె ,,
కవరుజాబు లంపావె ,,
జోడుగొట్టా లోడమీదా ,,
జోడుబొమ్మ లంపానె ,,

జోడుగొట్టా లోడమీద సిరిసిరి మువ్వ
జోడు పెట్టెలంపానే ,,
జోడుగొట్టా లోడమీద ,,
జోడు సవరాలంపానే ,,
అందినాయె అంటేదో ,,

తను కన్నేసిన పిల్లమీద - తను చెప్పదలుచుకున్న మాటలు ఏ పిచ్చుక మీదో - చెట్టుమీదో పెట్టి - పాటల్లో ప్యక్తపరచడంకూడా పరిపాటి !

జాలి బొంబై లే జాలిరా ఓ బేరిజల్ల
,, అన్నలార తమ్ములార
,, అందమైన సూరులార
,, నూగునూగు మీసగాళ్ళు
,, నూటికొక్క కాపుబిడ్డ
,, జోరుతో జొన్నాడదాటి
,, బారుతో బందారుదాటి

జాలిరావోబేరి జెల్ల - జాలిరా ఓ బేలిజెల్ల—

అంతరాల పదవమీద పూలు కొయ్యబోతే రాలిన పువ్వు రంగంపెళ్ళి భంగపడడం, రొమ్ముమీద ఈతములు గుచ్చుకోవడం చాలా పాటల్లో కనుపిస్తుంది. ఈ పదవ పాటలోనూ అదే భాపం—

జంబె లేలో - జోతులంగరు
అన్నలారా తమ్ములారా
... ...
జోడుగుళ్ళా ఈదీలోనా
జోరుసేసీ పలుకారన్నా
మిద్దెమీదా మిరపాచెట్టూ
నీళ్లులేకా జోలీపోయే

అంతరాలా పదవామీదా
అందిపూలు కోయబోతే
రాలిపూవూ రంగమెన్నో
భళ్లు భళ్లున తెల్లవారె
రంగామంతా భంగాపుచ్చే
మంచినీళ్ళ బావికాడా
పుట్టమీదా పాలాపిట్ట
కొట్టబోతే తేలూకుట్టె
బావగారు మంతారించే
భళ్ళు భళ్లున తెల్లవారె
పెద్దచెరువూ గట్లామీదా
ఎడ్లుమేపే చిన్నవాడా
ఎడ్లకేసే పొలీకేకా
నాకువస్తే నేనూరాసూ !

—పదవపేరో, లేక వన్నెకాడైన వ్యక్తిపేరో కాని భీమరాజు నుద్దేశించి నడుస్తుంది ఈ పాట !

వాదమీద వన్నెకాడో
భీమరాజు

వాసనకి సంపెంగ వనమూ !
చేతినిండ ఉంగరాలు
భీమరాజు

చెప్పరాని చక్కదనమూ !
కాయపంచలు కట్టుకొని
భీమరాజు

కమ్మని చక్కదనమూ !
కర్రచేత బట్టుకోని
భీమరాజు

కిర్రుచెప్పులు తొడుగుకోని
కలకచేరులాగ వచ్చెను
భీమరాజు

కాకినాడ రేవులో
కేవుగట్టి ఓడఎక్కి
భీమరాజు

రంగురంగుల బావుటాతో
భీమరాజు

రంగుగా రంగమెళ్ళి
వాడమీద వన్నెకాడో
భీమరాజు !

ఈ భీమరాజు రంగురింగుల మనిషిలాగున్నాడు. ఇటువంటి పదములలో వచ్చే మాండలిక పదముల నాధారం చేసుకొని ఈ పాటలు ఏ మండలానికి చెందినవో గుర్తించవచ్చును !

పడవ పాటలో ఒక విచిత్రం వినిపిస్తూంటుంది. అందరూ కలిసి లాగుతూంటారు పడవ బరువుని. అందులో ఏ ఒక్కడు లాగకున్నా ఎవరికీ తెలియదు. అటువంటి పని దొంగలను దృష్టిలో పెట్టుకుని-రోషం కలిగించే పాటల గుత్తిలోది ఈ పాట.

హైలేసో హవ్వారి యవ్వ
హెలేసో హెలాసా !
జానాకొక్కా ,,
బారా కొక్కా ,,
పట్టండిగట్టి ,,
బండాడిపేరు ,,
భద్రాద్రదిగో ,,
హనుమంతుడన్న ,,

పట్టండీ జాన ,,
గట్టిపట్టే హైలేసా
పట్టినవాడు ,,
పెద్దావోడూ ,,
పట్టనివాడూ ,,
చెడ్డావోడూ ,,

ఇక్కడ పట్టడం అంటే లాగడం అని అర్థం. ఈ పాటల్లో లాగనివాడిని తిడుతూండే భాష వ్రాయలేం-అంత కటువుగా ఉంటుంది. అటువంటివి వదిలేయాలి.

అతగాడితో చాలా కాలంగాఉన్న ఆ సంబంధం ఈ రోజు తన్నొదిలి ఓడెక్కి ఎక్కడికో వెళ్ళిపోతున్నాడు - కనుపించినంత మేర కళ్ళను మైళ్ళకొద్దీ పొడిగించి ఓడకేసి - తన రాజు కేసి చూస్తూ వాపోతుంది చిన్నది.

ఓడెళ్ళిపోతున్నది
మారాజో
ఓడెళ్ళిపోతున్నదీ !
చెన్నపట్నం రేవులోన
చెట్టపట్టాలేసుకోని
చెవిలో గుసగుసలేమో
చెప్పిపోయిన మారాజో
ఓడెళ్ళిపోతున్నదీ !
కాకినాడ ఈదుల్లోన
కాటుక కన్నులుజూచి
కన్నీళ్ళు చేతతుడిచి
కావలించిన మారాజో
ఓడెళ్ళిపోతున్నదీ !

భీమారం పట్నంలోనా
పెద్దలందరుజూడ
పెద్దాపందిరిలోనా
పెళ్ళాడిన మారాజో
ఓడెళ్ళిపోతున్నదీ !
కంచాన సలెట్టుకుని
తెల్లానెన్నెల్లోనా
కసిగాటు గొట్టుకుంటూ
కలుపరించిన మారాజో
ఓడెళ్ళిపోతున్నదీ !
అందమైన నీమోము
చంపురుని చూస్తుంటే
గుండెచలబడతదాని
గునిశాడిన మారాజో
ఓడెళ్ళి పోతున్నదీ !

జాలారన్న అంటే పడవసరంగనుకొంటాను. వరదతో నిండిన గోదావరి మీద ప్రయాణం - ఎంత తీపో ప్రాణమంటే ఈ పల్లెపడుచుకు. "మళ్ళీ వచ్చినప్పుడు మంచిగ మాట్లాడుతా"నని ఆశకూడా చూపిస్తూందీపడుచు.

ఓ ఓ ఓ ఓ జాలారన్నా
ఏరూ దాటెయ్యరా
జాలారన్నా
పొంగి పొర్లుకొస్తూంది
జాలారన్నా
పడవా దాటెయ్యరా
జాలారన్నా

వరదానీరోస్తూంది
జాలారన్నా
వడ్డునకు జేర్చరా
జాలారన్నా

గోదారి గాలిరా
జాలారన్నా
గోలపెట్టుకొస్తూంది
జాలారన్నా

ఏటవతల మా ఇల్లు
జాలారన్నా
ఎప్పుడెళ్ళి గా
జాలారన్నా

సీకటడిపోతూంది
జాలారన్నా
పలుకరో పుల్లయ్య
జాలారన్నా

ఒంటరిగా ఉన్నాను
జాలారన్నా
ఒడ్డునకు జేర్చయ్య
జాలారన్నా

గోదావరి ఒడ్డూన
జాలారన్నా
మా గుడిసెలున్నాయి
జాలారన్నా

వరదొచ్చిందంటేను
జాలారన్నా

గంగపాలౌతాయి
జాలారన్నా
కనికరించి విడువరా
జాలారన్నా
మొరపెట్టినప్పుడూ
జాలారన్నా

మంచిగమాట్లాడుతాను
జాలారన్నా !

సరంగు ఈ పడుచును ఏదో అన్నట్టుగా ఉంది, పాట ఆఖరి చరణం చూస్తే. అందుకే 'కనికరించి విడువరా' అని బ్రతిమాలుతూంది. ఇటువంటి వన్నీ సర్వసాధారణాలేమో ఈ జీవితాలలో !



దంపుడు పదాలు

వనకు ఈనాడు అంటే పిండిమరలూ, ధాన్యం మిల్లులూ వచ్చాయి నాడు విసురురాళ్ళు, రోళ్ళుకదా ఆదుకున్నవి! ప్రతి ఇంట ఒక తిరుగలి (విసురు రాయి), ఒక రోలు, రోకళ్ళు ఉండడం తప్పనిసరి!

ఈనాడు కాఫీ గింజలకు మర, పంచదార నలగడానికి మర, పోక చెక్కకు మరకత్తెర, ధాన్యానికి మర, పిండికి మర, పళ్ళు పిండుకోడానికి మర- ఆఖరికి మనిషి బ్రతుకే మరజీవితమై పోయింది.

తిరుగలి విసురుకొనే సమయంలో ఇద్దరుమాత్రమే అందుకు అవసరం. దంపుకు నలుగురూ అవసరం. ఈ రెండు పనులకూ డోతంగా దంపు పదాలనీ, విసురురాతి పదాలనీ ఉన్నాయి. చదువుకోడానికి ఒకేపాటా అనిపించేంత దగ్గరగా కనుపించినా- రెండు రకాలు వేరుగానే ఉన్నాయి—

తనే తుమ్ముకుని చిరంజీవి ఆనుకునేలా విసురు పదాలుంటే, ఎదుటివారు తుమ్మితే ప్రక్కవారు తలమీద నీళ్ళు జల్లినట్లుగా దంపు పదాలు ఉంటాయి.

ఈ దంపు పదాలు ఎన్నో కనుపిస్తాయి. వీటన్నింటినీ ఓ చిన్న బుక్కు చేయవచ్చు- కొన్నింటిని విందాం.

(1)

సువ్వ సువ్వన్నా
చుంచూ మల్లన్నా
పసువారీ సుబ్బన్నా
సూరమ్మా మొగుడూ
హా - సువ్వీ!

సూరమ్మా మొగుడూకీ
మీసాలూ లేవు
కోటప్పా కొండాకూ
వాసాలూ లేవూ
హా - సువ్వీ!

రాచారి దంపులకే
తాయె వెడదామూ
రాచోరీ కోడాలూ
సారె తెచ్చిందీ
హా - సువ్వీ!

రాచోరీ కోడలూ
గోసాలో ఉంటె
మన్నెవరు సూత్తారె
మాతల్లి కానా
హా - సువ్వి!

తిండేను రాచోరి
సారే తినాలి
కండేను తొలిచూలు
కొడుకును కనాలి
హా - సువ్వి!

(2) నాచేతి రోకళ్ళు
నల్లా రోకళ్ళు
చేయించు అన్నయ్య
చేవ రోకళ్ళు,

వేయించు అన్నయ్య
వెండి పొన్నుల్లు

సువ్వానీ నే నొక్క
పోదేసుతేనూ
చుక్కలు పిక్కటిల్లు
నూరన్న కదులు,

అస్సని నే నొక్క
పోదేసితేను
ఆకసమ్ము కదలు
ఆ రాజు కదలు,

ముగ్గురన్నలతోడ
నే బుట్టినాను
నా నడుము మువ్వంచు
చీరగోరింది!
అయిదుగు రన్నలతోడ
నే బుట్టినాను
నా ఒళ్లు అద్దాల రయిక కోరింది!

(3)

గుమ్మడి కాయంటి
గురువొచ్చినాడు
సికాయ పంచెలతో
శిబువెళ్ళినాడు!

కాళ్ళు కడగనైతి
కాళ్ళ బ్రొక్కనైతి
పంగి దండంబెటి
వరమడగనైతి

నాతోటి వారెల్ల
నాను లడిగితిరి
నే నొక్కటడిగితి
ఐదవతనము!

చాలు ఐదోతనము
సంతాన బలము
కోటి ఐదోతనము
కొమరులా బలము!

(4)

సువ్వి కస్తూరిరంగ
సువ్వి కావేటిరంగ
సువ్వి రామాభిరామ
సువ్వీలాలీ
ఆ సువీ - ఆ సువీ!

తుమ్మకర్ర రోలుదోసి
తూముడొడ్లు వాయవేసి
దంచుదామా బియ్యం
దంచుదామా
ఆ సువ్వి - ఆ సువ్వి!

ఒక్కవేలు చుక్కబొట్టు
అందరికీ చాలదమ్మ
దంచుదామా బియ్యం
చెలియలందరు
ఆ సువ్వి - ఆ సువ్వి

ఒకరికొకరు కొప్పులోస
గుప్పెదేసి మల్లెమొగ్గలు
మగువకాంత కొప్పులోన
మల్లెజాజులు
ఆ సువ్వి-ఆ సువ్వి!

(5) కోడలా కోడలా
కొడుకు పెళ్ళామా
పచ్చిపాలామీద
మీగడా ఏది?

వేడిపాలమీద
వెన్నలు ఏవి?
నూనెముంతలమీద
నురగలూ ఏవి ?

అత్తరో ఓ అత్త
ఆరళ్ళ అత్త
పచ్చిపాలామీద
మీగడుంటుందా!
వేడిపాలామీద
వెన్నలుంటాయా!
నూనె ముంతలమీద
నురగలుంటాయా!

ఇరుగు పొరుగూలార
ఓ చెలియలార
అత్తగారారళ్ళు
చిత్తగించండి
పెత్తనం లాగుతె
పేచీలు పోను !

(6) పడుచువారము మేము
పని చేయలేము
పగలు వెన్నెలగాయి
ఓ చందమామ !

ప్రొద్దు గూకిందంటె
మేముండ లేము
బుద్ధులూ చెప్పవే
భూదేవి తల్లి!

సందెళ్లు గూకితే
మేముండ లేము
సంతాన మీయవే
ఓ చందమామ !

7) చిక్కు డాకులమీద
చిలుక వాలింది
అరటి యాకులమీద
హంస వాలింది!

హంసెక్కి ఓ రాజు
అమరియున్నాడు
కొబ్బరాకులమీద
గోరవాలింది!

గోరెక్కి ఓ రాజు
కోరిఉన్నాడు
మావిడాకులమీద
మంచు వాలింది

మంచెక్కి ఓ రాజు
పొంచిఉన్నాడు !
గుమ్మడాకుల మీద
గువ్వ వాలింది

గువ్వెక్కి ఓ రాజు
గూడొగ్గినాడు!
చిక్కు డాకుల మీద
చిలుక అబ్బాయి

చిలకెక్కి అమ్మాయి
చిక్కియున్నాది!
అరటిఆకుల మీద
హంస అబ్బాయి

హంసెక్కి అమ్మాయి
అమరిఉన్నాదీ!

8) కారాలలో కెల్ల
రెండు కారాలు
ఉప్పుకారా మొకటి
ఉపకార మొకటి
వాసాలలో కెళ్ళ
రెండు వాసాలు

రాణివాసా మొకటి
విశ్వాస మొకటి
కుంటలాలో కెల్ల
రెండు కుంటల్లు

వడకుంటా ఒకటి
వైకుంఠ మొకటి!

(9) తమలపాకుల మీద
వడ్డెండబోసి
రా చిలుక పో చిలుక
పోటేసి పోవె!

అత్తదంచిన బియ్య
మధిక సన్నాలు
కోడలు దంచిన బియ్యం
కొత్త సూచూలు

అల్లమా రింటికి
చల్లకు బోతె
అల్లమూరీ కుక్క
భౌ మన్నాది!

నా కాళ్ళమట్టెలూ
ఘల్లుమన్నాయి
పొయ్యిలో పాము
బుస్ మన్నాది !

10) మా బావలొచ్చారు
కూరేమి కూర?
పందిట్లో సొరకాయ
బల్లి తలకాయ !

మా యన్న లొచ్చారు
కూరేమి కూర ?
అడవి చిక్కుడుకాయ
ఆలచంద పప్పు !

11) దంపు దంచాలేను
దండె త్తలేను
దంచీనా బియ్యము
వండానేలేదు!

అమ్మకి ఒక్కర్తిని
నా తల్లికానా
పని నేర్వలేదమ్మ
పుట్టినా ఇంట!

అరిటాకు వంటిది
ఆడజీవితము
ముల్లొచ్చి పడినాను
ఆకూకే లోపం!

నీ అల్లుడొచ్చి
పంపమని యంపె
నా కూతురు చిన్నది
అని చెప్పు తల్లి !

12) నీళ్ళు ఇద్దామంపె
చిల్లి చెంబాయె
చాప వేద్దామంపె
చోటు ఇరుకాయె

కోడి కొడదామంపె
గుడ్లకోడాయె
వడ్లు దంచీచూడ
విత్తనాలాయె

పీట వేయాబోవ
పిల్లడ్డమాయె !

13) రోక లేత్తాలేను రోలెత్తలేను
చామంతి కడియాల చేయెత్తలేను
కోటకు పోటాశ పొరుగు నాకాశ
కంటికి రెప్పాశ శ్రీవెంకటేశ !

14) తవ్వెడు బియ్యంబు
దండెంపు కూర
దొడుబాజి గోత్రంబు
తల్లి పుట్టిల్లు !

మానెడు బియ్యంబు
మంకెన్న కూర
మహరాజు గోత్రంబు
నే పుట్టినిల్లు !

15) పిండికొట్టామాని
పిందుకోకండి
ఇరుగు పొరుగుల్లార
ఇది ముగ్గుపిండి
సువ్వి - హా - సువ్వి !

పిండికొట్టి అల్లుడిని
పిలువ నంపితె
రానాని అల్లుడు
రచ్చ కొమ్మెక్క-
సువ్వి - హా సువ్వి !

రానని అల్లుడు
రచ్చ కొమ్మెక్కె-
పిలువనని వారి మాము
పేటా కొమ్మెక్క-
సువ్వి - హా - సువ్వి !

పిలువనని వారి మామ
పేటా కొమ్మెక్కే-
వండానని వార త్త
వంటిల్లు సొరద
సువ్వి - హా - సువ్వి !

దంపు పాటలు, సువ్వి పాటలు, దంపుపదాలు అని పిలువబడేవన్నీ ఒకటే! కాని నలుగురు దంపు సమయంలో పాడే పాటకూ ఇద్దరు పాడే పాటకూ తేడా కనిపిస్తుంది. కాని రెండూ దంపు పదాలే - వీటిని కొంచం తేడాతో తిరుగలిచద్దా రోలువద్దా పాడగలగడం జరుగుతుంటుందనుకొంటాను–



(16) సువ్విగిరి రామలింగ
సువ్వి కస్తూరిరంగ
సువ్వి యనుచు పాడరమ్మ
సుదతు లందరు!

అంచులంచు లరగవేసి
పంచవన్నె ముగ్గువేసి
పాడి పాడి దంచరమ్మ
పదతు లందరు!

ఉల్లిపూవు జల్లెదమున
శ్యామపూవు కుందనమున
శ్యామపూవు కుందనముకు
సెరుకు రోకిళ్ళే!

దాదూలు దంచేది
దూదీ పోకండ్లేమె

మగువలు దంచేది
మాని రోకండ్లే!

చిన్నవడ్లు పెద్దవడ్లు
పేరైన రాజనాలు
కృష్ణా నీలాలుదంచి
కీర్తి పొందరే!

దంచి దంచి కన్యలంతా
దాహము కొనినారే
ముత్యమంత చెంబుతోన
దప్పి కందిరే!

మోవలంగి కొప్పులోన
మొగలిరేకు లంటబెట్టి
కులుకులాడి పమిట చెరగు
కుంకుమాయెనే!

అక్క చూడె చుక్కబొట్టు
అమరినట్టె యుంది
మోహనాంగి కొప్పులోన
మల్లె గుత్తులే!

అంటకుండ వండకుండ
వంటచెరకు వేరకుండ
అంటుముట్టు లేనిచోట
వంట చేయరే!

భక్తితోను వంటచేసి
పళ్ళెరమున తీసినారు
పద్మజాక్షిని కొలువ
పాట పాడరే!

17) రోకలి చిన్నాది
రోలూ చిన్నాది
సువ్వీ హా సువ్వీ !

నాతో దంచేది
చెలియ చిన్నాది
సువ్వీ హా సువ్వీ !

నా చేతి రోకలి
నల్లా రోకలీ
సువ్వీ హా సువ్వీ !

నే పాడినన్నాల్లూ
రామలక్ష్మణులూ
సువ్వీ హా సువ్వీ !

వీరెక్కు గుర్రాలు
నీలీ మేఘాలూ
సువ్వీ హా సువ్వీ !

రోకలికి నా
రెండూ దండాలూ
మముగన్న తల్లికీ
వేయి దండాలూ
సువ్వీ హా సువ్వీ !

ఈ దంపు పదాన్ని పరికించండి - కొంచం విసురు పాటా అనిపిస్తుంది.

(18) దంపు దంచాలేను
దంపి చూడాలేను
దండెత్తి ధాన్యమూ
దంచగా లేనూ !

సువ్వీ హా సువ్వీ !

నిమ్మలబుగ్గపాప పుట్టినాడూ
నిమ్మతోటకు తోడి నీరెట్టినాడూ
నిలువూనా నిమ్మల్లు లేచికాయంగ
నిగనిగ పండ్లన్ని బుట్టాలు నిండ !
సువ్వి హా సువ్వి !

సంతాకు బుట్టలు
బండ్లాతో చేర్చె
సంతోషమున డబ్బు
జేబూలొకొచ్చె !
సరసాల కాతోట
సల్లన్ని తోట
సంతపోయే జనపు
సంపెంగ తోట
సువ్వి హా సువ్వి !

(19) పాపమ్ము చేసుకుని
ఖావిలో పడితె
పై మురికియేగాని
పాపాలు పోవు

చేటుకాలామ్రట
శంకరుడ నీకు
ఆలిమీదా పెండ్లి
ఎట్లాడినావు ?

ఓరిముందర చేను
వేయబోకన్న
ఓళ్ళోన విత్తనంబు
చేయబోకన్నా !

ఊరిముందర చేను
కాకులాపాలు
ఊళ్లోన వియ్యంబు
కయ్యాలపాలు

చేను మంచీదాని
చెప్పబోకన్న
చెరుకన్న రాజనం
పండిన్నగాకి

ఆలి మంచీదాని
అన బోకురన్నా
అదివచ్చి మనలోన
అణిగుండుదాక

అ త్తింటి కోడలవు
కావుగా వున్నె
ఆజ్ఞసిగ్గులు నీకు
లేవుగా వున్నె

పీపునిండా కొంగేది
ఇరువరుస లేవె?
మదమతిరగ బట్టేది
మాట వాసేది!

(20) ఆడదాన్నీ నేను
అయిపుడితిగాని
గంద్రగొడ్డలి క్రింద
కొమ్మనైన జాలు

గొడ్రాలి బ్రతుకేల
కోటి ధనమేల

స్వారాజ్య మిచ్చినా
సవతి పోరేల ?

చూడకా ఆడేరు
చూచి ఆడేరు
కానకా ఆడేరు
కల్లలీ ప్రజలు !

పాటలు పాడితే
పలవరంటారు
పాడకుంటే జనులు
మూగ దంటారు !

పై రెండు పదాలూ ఎదుటివానికి నీతిబోధించే రీతిలో సాగుతున్నాయి. మొదటి పాటలో ఎంత నీతి, అనుభవపూరిత ప్రబోధం ఉందో, రెండో పాటలో ప్రజల మనసులు ఎలాగుంటాయో చూపుతూ, "ఆడ" బ్రతుకు కష్టం వినిపిస్తుంది.

21) రాజనాల వడ్లయిన
భోజనాలయిన
రాజు పెనిమిటైతె
చింతేల దేవి
ఆడదీ పుట్టింది
అసరు పుట్టింది !
దండాన కోడలను
దైత పుట్టింది !

ప్రేమలేని మగని
పెండ్లాడితేను !
కాపురాలకు చేటు
కాకుండ పోదు !

వెంకటేసుని కొండ
వెలుసుంద వలెను !
ఎప్పటికి పుట్టిల్లు
కలిగుంద వలెను !

విత్తులొడ్లు దంచితే
బెత్తులయినాయి
అమ్మ నీ కుమాళ్లు
రాజు లైనారు

రాజులకు తగినట్లు
రంభలొచ్చారు
రంభలా కడుపునా
పిల్లలుట్టారు !

పిల్లకీ పెళ్ళోరు
అడగొచ్చినారు
ఇద్దామ అన్నయ్యా
ఇద్దామ వదినా ?

అనుకూలమయిన
మామ మంచివాడైన !
మాటకారైన
కాముడూ లేతైన
కన్య నిత్తాము !

మా తాత పెళ్ళికీ
నే నెంతదాన్ని
తలదువ్వి బొట్టెడితె
తవ్వంతదాన్ని !
అన్నిసొమ్ములు పెడితె
అద్దంతదాన్ని !

పూర్వకాలంలో పెళ్ళిళ్ళు ఎంత బాల్యంలో జరిగేవో ఈ పాట సాక్ష్యం చెబుతూంది - ''తలదువ్వి బొట్టెడితె తవ్వంత మనిషిట, అన్ని సొమ్ములు పెడితె అడ్డంత పిల్ల''ట. బాగుంది ఉపమానం !

ఈ విధంగా దంపులూ, సువ్వీపాటలూ చూపిస్తూ రావాలంటే ముందరే చెప్పినట్లు ఇది ఒక పెద్ద గ్రంథం అవుతుంది. కనుక ముఖ్యం అనుకొన్నవి మాత్రం పరిచయం చేయడం జరిగింది.

సరే! ఈ శ్రామికతరహా పనిపాటలలో బ్రతుకే భారమై, బరువుగా బ్రతుకీడ్చే జీవితం విదిల్చే ఉచ్ఛ్వాస విశ్వాసాలే శ్రామికజాతి పాటల సంపద- ప్రతిబింబం - కాదు - ప్రతిధ్వని !

తను చేయగలిగినా లేకున్నా, మోయగలిగినా లేకున్నా జానెడు పొట్ట కోసం ఎకరాలకొద్దీ చాకిరి, పంపెములులేని ఈగూడుకోసం బండలకొలదీ బరువు లాగడం - ఆ సమయంలో అప్రయత్నంగా ఊతంగా వాడే 'హెయ్' అన్న పదం, 'హుఁ' అన్న శ్వాస; తన బ్రతుకురోత మీద ఏవగింపుతో పలికే 'ఆరు నెల్లా జన్మాఖైదు - మూడు నెల్లా ముండాపోరు' అన్న ఏ వాక్యమో కలిస్తే వెలువడిన ఈ జానపద శ్రామిక గేయ స్రవంతిని ఎంతని చూపగలం! ఎన్నని వ్రాయగలం !

''తుమ్మెదా'', ''చందమామా'' ''వెన్నెలా'' పాదాంత పదములుగానే ''తందానా'' పదాంత పాటలూ ఈ పని పాటలలో ఉన్నాయి. ఒక విషయం - జంగంకథలలోనూ, బుర్రకథలలోనూ ఈ ''తందాన'' పదం చాలా పీఠం వేసుకుంది. అందుకే వీటిని తందాన పదాలని కూడా అంటారు.

ఏదేనా మాటలసందర్భంలో - ప్రతి విషయానికీ ఒప్పుకుంటూ - ఎదురు చెప్పని వాడిని చూసి - ఏమిట్రోయ్ ''తందానతాన'' అనడమేనా?అనడం కద్దు. కథల్లో ప్రతిపాదం చివరా ''తందాన'' అనడమే పైమాటకు కారణం.

చెట్టుమీద కూర్చున్న తందానా!
రాజూలు కారూపె ,,
చెట్టుమీద కూర్చున్న ,,
రాజూలెపరూ ,,
మేడమీద కూర్చున్న ,,
రాజూలెవరూ ,,
గట్టుమీద కూర్చున్న ,,
అల్లుళ్ళు కారుడే ,,
గట్టుమీద కూర్చున్న ,,
అల్లుళ్ళెవారు ,,
కొండమీద కూర్చున్న ,,
అల్లుళ్ళెవారు ,,

అలాగే "ఉయ్యాల" పాదాంత పనిపాటలలో ఉయ్యాల పాటలని ఉన్నాయి! ప్రతి మాటకూ "ఉయ్యాలా" అంటుంటారు! ఈ పాటలు చేను కలుపులకు, కోతలకు, నాట్లకు సంబంధించినవి అనుకోవచ్చు.

ఉయ్యాలా దంబాలా!
ఉయ్యాలా దంబాలా!!
కోటిపల్లికాడ ఉయ్యాలా!
గోరంటతోట ,,
కొండంత చెట్టూ ,,
గొడుగంటి చెట్టు ,,
కొమ్మలు రెండూ ,,
రెమ్మలు రెండూ ,,
వాలిసాయిరా ,,
కాచినాయిరా ,,
అందినాయిరా ,,

కాయలు నిండా ఉయ్యాలా!
కాయలు తింటేనే ,,
పచ్చి పులుసురా ,,
పులుసు కాదురా ,,
గోదారమ్మ ,,
కోరి పెంచెరా ,,
ఊగుటకేరా ,,
ఆ ఊరివోరూ ,,
అక్కడేనురా ,,
ఆడుతారురా ,,
అమ్మోరు నక్కడ ,,
అంకమ్మ సక్కడ ,,
అలక నింపుతారు ,,
ఉయ్యాల లేసి ,,
ఊపుతారురా ,,
కోటిపల్లి కాడ ,,
గోరింట తోటా ,,
కొండంత చెట్టురా ,,
ఉయ్యాలా దంబాలా!
ఉయ్యాలా దంబాలా !!

దంపు పాటలనీ, సువ్వి పాటలనీ పైన చదివాం—వాటికి చాలా దగ్గరలో కనుపించే విసురు రాతిపదముల (తిరుగలి పాటలు)ను గురించి నాలుగు ముక్కలు పరిచయం చేస్తాను. ఈ విసురు రాతి పనికి ఇద్దరు అవసరం - గుండ్రంగా ఉండి గిరగిర తిరగడానికి ఉసులుగా ఉండి-త్రిప్పడానికి ఒక కర్రపిడి (తిర గలిపిడి) ఉంటుంది. దానిని ఇద్దరు చేతులుపెట్టి త్రిప్పుతూ పాడుతుంటారు !

(1) అయిపోయె అయిపోయె
అయిపోయె గౌరు
అయిపోయిన ఇండ్లల్లో
ఆడుకో గౌరూ !
సరిపోయె సరిపోయె
సరిపోయె గౌరు
సరిపోయిన ఇండ్లల్లో
సరసా లాడమ్మ !

భావాలకు పదునుదేరిన కత్తిగా మెరిసే ఈ విసురు రాతి పాటలు చాలా హుషారుగానే ఉంటాయి.

(2) ఆదివారమునాడు
అమవాశ్యనాడు
అన్న ఇంటికి నేను
గిన్నె నడుగబోతే

మా వదిన శాంభవి
లేదు పొమ్మనెను
మా యన్న మంచివాడు
మళ్ళి రమ్మనెను!

చిన్నోడికి చీటంగి
సిలుకు కుళ్ళాయి
బాలునికి పొట్టంగి
పాలుపోసె గిన్నె
నాకు నల్లచీర
నెమలి పన్నెల రవికె!

వడినింద బియ్యము
వళ్ళో కొబ్బరి గిన్నె

పసుపు కుంకుమ ఇచ్చి
పంపె మాయన్న!

(3) కలిమియ్యి బలిమియ్యి
కదిరి నరసింహా
నా చిన్నారి తమ్ములకు - సిరి
సంపద లీయవయ్యా !

బిడ్డల్ని కన్నతల్లి
నీళ్ళు తేబోవ
ఆడికలూ ఎండాయే
ఆ జలధిలోనా !

కొడుకుల్ని కన్నతల్లి
నీళు తేబోగా
ఆడికలూ అణిగాయీ
ఆ జలధిలోనా !

తోటన ఎంకన్నా
తోపూ నరకంగా
తోపూ పమిటల్లూ
తొలగీ పోనాయీ !

గుట్టెక్కి ఎంకన్న
కూతలెటంగా
గుడిసెల్లో పడుచులకూ
గుండె లల్లల్లాడా !

(4) తూరుపు వాకిళ్ళకు
దూలాలు గావు
పడమటి విండ్లకు

పలకల్లు గావు
మా ఇంటి కోడండ్లకు
రోకళ్లు గావు
ధనము రాసులిచ్చె
తండ్రి రామయ్య
నీవైన చెప్పరాద
ఆ మానిపేరు

అమ్మరో నీకింత
వినవేడుకైతే
మాడల్లో పోయేటి
మరదళ్ళ నడుగు

మాడల్లో పోయ్యేటి
మరిది సుబ్బయ్య
నీవైన చెప్పరాద
ఆ మానిపేరు !

అమ్మరో నీకింత
వినవేడుకైతే
మైసాక్షి పత్తుల్ల
మాసుల్ల నడుగు

అమ్మరో నీకింత
వినవేడుకైతే
బారాసావిటమీది
బావల్ల నడుగు

అమ్మాకో నీకింత
వినవేడుకైతే
కొలువు సాడిమీది
కొడుకుల్ల నడుగు

అమ్మరో నీకింత
వినవేడుకైతే
నేలాన పండిన
పల్లేరు చెట్టు !

(5) పట్టుచీరలవారు
బావకూతుళ్ళు
అంచు చీరలవారు
ఆడబిడ్డళ్ళు
తోపుచీరలవారు
తోడికోడళ్లు
అందుట్లో మా లక్ష్మి
చెరుగు చీరలచి
దబ్బున మాలక్ష్మి
బరిణందుకొమ్మ
ఇంత చక్కని బరిణె
ఎవరంపినారు
నీకని పెద్దేటి
అన్నంపినాడు !

(6) నల్లకొండల నడుమ
ఉతికె చాకలి
మాయన్న ఏసిన
దటిపేరేమొ !
చింతకూట నూలమ్మ
శిరువెళ్ళ తొగరు
నంద్యాల నల్లంచు
లంజెపేటించు
కందనోలు కరకంచు
కంది బేడంచు

ఉతకరా చాకలి
ఉల్లి వువ్వుల్లె
మడసరా చాకలి
మల్లి మొగ్గల్లె
యిచ్చిరా చాకలి
అన్న వాడలికి

ఇచ్చేను వొచ్చేను
ఇల్లు నే నెరుగ
గచ్చుతో కట్టిన
గాజు స్తంభాలూ
సున్నంబు పూసిన
సుకటి మిద్దెలు
వేపమాని ఎదురిలు
ఎద్దూల మిద్దె !

(7) పుణ్యవంతులమ్మ
ఈ ఇంటివారు
అన్నలని పిలిచితివి
తమ్ములని పిలిచితివి
నన్నేల పిలువవే
ఓ చిన్ని మరదలా !
ఏమని పిలుచుదును ఓ వెర్రి శిపుడా !
నీళ్ళ బాణము తొడిగి
నరలోక మేలెనే
నా పుణ్య పురుషుండు
పువ్వులా బాణం తొడిగి
కప్ప రథమెక్కి పురుషుడు
భూలోక మేలినాడని చెప్పు

వచ్చేటి పొయ్యేటి దారిగలదు
శివునికి శివపూజ
కోరినానని చెప్ప !

(8) సఖియ ఇల్లు జొచ్చె
ఎల్లజాలాడె
సక్కన్ని వాడమ్మ
సారంగధరుడు

ఇరుగు పొరుగమ్మలార
ఇతని పొమ్మనర
ఇరుగోరి మాటలు
వినరొచ్చిరేను

పొరుగోరి మాటలు
పొనరొచ్చిరేను
చిలుక నీళ్ళతోడె
జలక మూడేను

హంసలన్నము లొండె
ఆరగించేను
వెలదీ మంచము లేయె
వెన్నెల బైట
పడతి పానుపు లెయ్యే
వవ్వళించేను

ఆకు తేవె పోక తేవె
అడక త్తెర తేవె
చూడ సున్నపుకాయ
చుట్టియ్యో మడుపు
సన్నంగ సుట్టియె

సగము కొరికియె
ఎంగి లెంగిలి శివుడ
ఎగ్గు పట్టేవు
మనకేమి ఎంగిలీ
పుణ్య పురుషులకూ

విసన కర్రలతోను
విసరె ఒక జాము
ఇసిరిసిరి ఆ కాంత
స్తంభాని కొదిగె
కాంతకీ కన్నీళ్ళు
కాల్వలై పారె
వాన కురవాలేదు
వరద ఎక్కడిది ?

అమ్మరో మన ఇంట్లో
వొరువ లెక్కడివే
నువుపోయి పరసింట్లో
పండుంటివి కొడవ
ఆడువారి శోకంబు
ఆటువంటిదప్ప !

ఈ దంపు పదాలలో కనుపించని సందేశం, వినిపించని ధర్మ ప్రబోధం, అందులోనే వెటకారం, అంతలోనే వెక్కిరింత - అన్నీ కలుపుతే నవ్వులు - ఈ పాటలకు ధర్మకర్తలు ఆడవాళ్ళు - అందుకే ఒకవిధంగా ఈ దంపు పదాలు స్త్రీల పాటల గుత్తిలోకే చెందవలసి ఉంటుంది !!



ఏల పదాలు

మన వాఙ్మయంలో యేల శబ్దాలు చాలా కనిపిస్తాయి.

ఈ యేలలు చాలా చక్కగా శృంగారపూరితమై యౌవ్వనాన్ని ప్రతిఫలిస్తూంటాయి.

రకరకాలుగా ఎన్నో యేల పాటలు ఉన్నాయి - అవి కొంచెం చూదాం :

ఎక్కడో ఉన్నాడు తన రంగడు - ఇప్పుడు వస్తాడు అప్పుడు వస్తాడు అని ఎదురుతెన్నులు కాస్తూంది. ఎంతకీ రాకపోతే కాకిచేత కబురైనా, గువ్వచేత గురుతైనా పంపమని కోరుకొంటూంది.

ఎరువురంగూ ఎదురు చుక్కురా
నా సామిరంగా !
ఎన్నిదినము లెదురుచూతురా !

వలపునిలుపా జాలలేనురా
నా సామిరంగా !
కలలోనైనా కానవేమిరా!

కాలుకురచ ఆడదానినిరా
నా సామిరంగా !
కాలుకురచ ఆడదానినిరా

మూరతక్కువ చీరలంపరా
నా సామిరంగా !
ఆకులాతో పోకలంపారా
నా సామిరంగా !
ఆలసించీ ఆపబోకూరా
నా సామిరంగా !
అలపగానికి చెడుపు బుద్ధీరా
నా సామిరంగా !
గువ్వచేతా గురుతులంపారా
నా సామిరంగా
కాకిచేతా కబురులంపారా !

అనుకోకుండా అగుపించే ఆడుదానిని చూస్తే యువత మనస్సు ఎలా ఉంటుందో ఈ పాట చెబుతూంది:

ముద్దు మొగమూదాన
ముక్కు పోగూదాన
కాకివేషముదాన
కామంచి పడుచా - మంచె దిగవే !

ఆరకచేనూలోన
ఆవులున్నవి భామ
ఆలమందానన్న
ఆదలించిరావె - మంచె దిగవే !

రూమాల మూటలో
రూకలున్నవి భామ
మంచెకిందకి రావె
పంచుకుందాము - మంచెదిగవే !

మంచె దిగవే అన్న సంబోధనతో మకో పాట ఉంది. "మంచె" అనగా చేలమధ్య పిట్టలను తోలుటకు ఎత్తుగా కట్టే స్టేజి లాంటిది.

పురు :- మంచె దిగవె పొంచాల
సిలకా మంచె దిగవె
మంచె దిగవె
ఓ పంచెవన్నెల సిలకా
ఒంచిన తలయెత్తి
వాలుసూపులు సూసి
మంచె దిగవె
పొంచాల సిలకా !

స్త్రీ :- సెబాసు కుర్రోడా
సెవుల పోగులవాడ
మా బావ విన్నకన్నా
మరియాద దక్కునా
మంచె దిగను నేను
కంచెదాటి రాను

పురు :- అల్లాము బెల్లాము
తెల్లాకొంగున కడుదు
తెల్లా కొంగునకట్టి
తెల్లవారేసరికి పోదు
మంచె దిగవె
పాంచాల సిలకా !

స్త్రీ :- అల్లాము బెల్లాము
వల్లామ నా మనసు
అన్నాదమ్ములు సూత్తే
ఆచోటు నిలువారు
మంచె దిగనూ
మంచీ మురుగులవాడా !

పురు :- పూలారైకదానా
వాలుసూపులచానా
కాలులో ములుదిగెను
కాసంత ములుదియవె
మంచె దిగవె
పాంచాల సిలకా !

స్త్రీ :- కాలులో ములుదిగితే
కర్రిమంగలి గలదు

తాలికట్టినవోడు
తాయెత్తుకట్టూను
మంచె దిగనూ
పొంచున్న చినవోడా
నే మంచె దిగనూ !

ఈ పదుచ్చు చాలా తెలివైనదీ-ముందుచూపు గలదీ లాగుంది. తాలికట్టిన వాడు "తాయెత్తుకట్టు" నని ఎంత సున్నితంగా చెప్పి ముందుచూపు కనబరుస్తున్నిదో.

ఈడ్పుకు దిగమన్నాడు పిల్లని - ఊహుఁ ! అంది. ఉన్నవాళ్ళ పిల్లపనా అని అడుగుతున్నాడు.

ఉల్లిమల్లా చీరాగట్టీ
కచ్చలూ పైకేగాగట్టీ
ఉన్నవాళ్ళా పిల్లనంటావే !
ఓలోలి రంగీ
ఉన్నవాళ్ళా పిల్లనంటావే !

ఉన్నవాళ్ళా పిల్లానంటే
కన్నుగీసే రమ్మన్నావూ
కంటిబాసలు నాకూ ఒద్దురా !
ఓరోరి మామా
కంటివిరుపులు నాకూ ఒద్దురా !

ఉన్నవాళ్ళా పిల్లానాసీ
ఉబ్బిపోకే ఓలేపిల్లా
కోతలాకీ కోరివస్తేనూ
ఓలి రంగీ
కోతిళ్ళకి కోపమొస్తుందే !

కోరమీసాల్ దువ్వుకుంటూ
ఎర్రగుడ్డా చుట్టుకొంటూ
కోతలాకే రావద్దంటావా !
ఓరోరిమామా
కోరికైనా తీర్చనంటావా !

ఎంత కమ్మని కోరికో ఈ చిన్నవానికి ! మల్లె పందిరి క్రింద కూర్చుని వయ్యారి రాకతో తెల్లవారుద్దామని ఆశ ! తన ఆశను కమ్మగా ఎలా వ్యక్తీకరిస్తున్నాడో !

వేళజూడ వెన్నెలాయె
వెండికట్ల కిన్నెరాయె
మల్లెపూల పందిరాయె
వయ్యారి రావె—మన
నవ్వులోనె తెల్లవారునూ !

కొండగోగులు పూసెనేమొ
కొండనిమ్మలు కాసెనేమొ
దొండపండులాంటి పెదిమె
వయ్యారిరావె—ఈ
మనసు ఎవరి పాలుజేతూను

మల్లెపూలు పూసినట్లు
మళ్ళిమళ్ళి మాటలాడు
మల్లెపూలవంటి మనసు
వయ్యారిరావె—నే
గంధమైన పంపబోతిని !!

విరిచిన మల్లెపువ్వులాగ మళ్ళిమళ్ళి మాట్లాడాలిట - ఎంత మాధుర్యంగా మలచినాడో ఇందలి మాటలను.

మల్లెలు తెలుగువారి బంధువులేమో! మల్లెపూల తెప్పమీద తేలిపోవడం. మల్లెపందిరి క్రింద గడపడం - ఎంత తెల్లనీ చల్లనీ ఆశలూ ఆశయాలో. అలాటిదే మరొకటి:

మల్లెపొదనూ ఇంట
పెంచుకోవాలీ
మల్లెతో మనసార
పాడుకోవాలీ
మల్లెపొద మాటున
మాటిచ్చినాను
తప్ప కొస్తానని
చెయ్యేసినాను!

మాటతప్పితె మళ్లి
కోపగిస్తాది
మరిచావులే మాట
నెక్కిరిస్తాది
మల్లెవాసన మధ్య
మాటల్ల మధ్య
మళ్ళి వస్తాననీ
మాటిచ్చినాను!

మాటతప్పి నేను
మళ్లి చేరకపోతే
మాట తప్పావనీ
మాటలంటది మళ్లి
మల్లెపొదమాటున
మనసిప్పుకోని
మనసులో వీటోను
దాసుకున్నాము.

ఈ పాట సంగీత ప్రధానంగా లేకపోయినా - ఇందలి భావం బలంగా ఉంది. మల్లితో ఈ పడుచుకెంత స్నేహమో చూడండి - మాటతప్పితే మల్లి ఎక్కిరిస్తుందిట !

ఒంటరిగా కనుపించింది సిన్ని. యౌవనంలోఉన్న తనకు - ఇక ఏం కనుపించడం లేదు - తన ఎదుట సిన్ని ఎంత అందంగా కనుపిస్తూందో చూడండి :

సిన్నీ నా సిన్నీ
ఓ సన్నజాజుల సిన్నీ
పొన్నపూల సిన్నీ
నే నందమైనవోడ్ని
నన్నేలుకోవె సిన్నీ

నిన్నొదిలి ఉండలేనూ

బావా నా బావా
బంగారు ముద్దుల బావా
ఎన్నటికీ నిన్నే
నేనేలుకొంటానోయి
నే నున్నదాన్నికాను

నా ఉసురు పోసుకోకు!

సిన్నీ నా సిన్నీ
నే సిన్నవోడ్ని కానే
సిన్న జమీలున్న ఓడ్ని
నిన్ను కలకాలం పూజిస్తా
మీ అన్నలాతొ సెప్పి

నన్నేలుకోవె సిన్నీ!

నీకన్న ఎవరు నాకు
మా యన్నలతో సెప్పి
అందాలబావ నన్ను
ఏ అడ్డు సెప్పకుండ
నన్నింటిదాన్ని సెయ్యి
నన్నొడ్డునెయ్యి బావా !

ఇలాటిదే ఇంకోటి, పై దానిలో 'సిన్ని - బావా' అయితే ఇందులో 'చంద్రి - బాలయ్య'ల మధ్య సంభాషణ—

నీ లేడికన్నులోలె శంద్రి
నీ లేతనవ్వులోలె శంద్రి
ఆ తీగసొగసులోలె శంద్రి
ఆ పళ్ళగుత్తులోలె శంద్రి
ఆ నడకజోరులేమె శంద్రి
నీ నడుము సన్నమోలె శంద్రి
నీ రంగుపింగులు సూత్తే
రంభలాగున్నావు
రంగం ఎదదామోలే శంద్రి !

నే కైకాల సిన్నదాన్ని బాలయ్య
నన్ను కంకులుబెట్టకు బాలయ్య
నా కమ్మ బాబులేరు బాలయ్య
నను ఆరళ్ళు బెట్టకు బాలయ్య
నా మేనత్త సాకుతూంది బాలయ్య
నాకు మేనరికమున్నాది బాలయ్య
ఈ ఇరుగు పొరుగూ సూత్తె
ఏమనూకుంటారో
ఎంట రాకూరోరి బాలయ్యా!

కమ్మోరి బావికాడ శంద్రి
నువ్వు కడవ నెత్తినెట్టి శంద్రి
సందు గొందులు దాటి శంద్రి
నువ్వు సిందులు దొక్కంగ శంద్రి
నీ కొప్పు తిప్పులుసూసి శంద్రి
నా కోరిక లూరేయి శంద్రి !

నీ కాళ్ళ కడియాలోలె శంద్రి
గణగణా మ్రోగాయి శంద్రి
గిలుకుమట్టెలతోటి శంద్రి
నువ్వు గిర్రునా తిరిగేవు శంద్రి
సుక్కలో సూపెడితె
సుక్కలాగున్నావు
లక్క రైకలిస్తానోలె శంద్రీ !

నే మరలుగొన్నానోలె శంద్రి
నువ్వు మాయదారివోలె శంద్రి
మత్తుమందు జల్లావె శంద్రి
నావి ఉత్తమాటలుగావె శంద్రి
నా కెర్రెత్తిపోతూందె శంద్రి
నువ్వు ఎంత పాపివోలె శంద్రి
సేతిలో సెయ్యేసి
సందిటలో కొత్తేను
సంక లెగరేస్తానే శంద్రి !

పాపం ఎంతకీ లొంగడంలేదు- ఆఖరికి తన బాధను విప్పి చెప్పాడు-
శంద్రిని సూత్తూందే ఎర్రెత్తిపోతూందట—

సూర్యచంద్రావహ్నా నడుమా
బాధ్యమానే చిలుకాగంటి
సూర్యదీప్తి గాయూచుంతగా

ఏ గంటలింగా!

జూడ జూడాశ్చర్యమాయెరా
ఏ గంటిలింగా!

కాంతాల పాశెములోనా
చింతమానూ పుట్టేగదరా
చింత అనలూ కొనలూ సాగేనా
ఏ గంటిలింగా!

చింతపూసి పండూ పండేరా
ఏ గంటిలింగా!

కానరాని అడవిలోనా
వానలేనీ మడుగూనిండె
వానలేని మడుగూమీదానూ
ఏ గంటిలింగా!

మానరానీ అగ్నీ పొడమేరా
ఏ గంటిలింగా!

ఆకులేని యడవిలోనా
తోకలేని మృగమూపుట్టె
తోకలేని మృగమూ కడుహూనా
ఏ గంటిలింగా!

ఈకలేని పక్షిపుట్టేరా!

—ఏమిటో! తోకలేనిమృగం, ఈకలేని పక్షి! ఈ తరహా ఏలలు చాలా కనుపిస్తున్నాయి.

ఓబలేసుని కొండలనడుమా
వొంచిగడ్డి కోసేదానా
వొంచిగుడ్డా ఒల్లిగడ్డామే ॥ఓబులేశ॥

గిద్దెలగిరీ కొండలనడుమా
ఎద్దులుకాచే ముద్దులమరదీ
నన్నుచూసి నవ్వబోకోయి ॥ఓబులేశ॥

కట్టమీదీనుం చెళ్ళేదానా
కాలుకురచా. చిన్నదానా
కాసులిస్తా ఎంటపస్తావా ॥ఓబులేశ॥

ముద్దుటరకా దున్నేవాడా
ముద్దులా మేనత్తాకొడకా
దాపటెద్దుకు దప్పికాయెనురా!

—ఈ దాపటెద్దు ఎవరో? ఇటువంటి యేలలు వింటూంటే మనకూ గొంతు కలుపుదాం అనిపిస్తూంటుంది.

చింతమాను చిలుకాలారా
చింతలేటి జాణలారా
చందమామావంటి దానినిరా

ఓ ముద్దులాత్మంగా
సందుగాదూ ఏమిసేయనురా!

చిలుకలుంటే బంతేగట్టీ
చిలుకలూరి మభ్యాదున్నీ
మిసిమివడ్లా మొలకజల్లితే

ఓ ముద్దుల్లారంగా
కలుపుతీయా మరచిపోతినిరా!

చిలుకనిచ్చీ నేసూకొంటి
చిత్తమైన పందిరిమంచం
ఇద్దరికీ ఇరుకుగుండూరా

ఓ ముద్దులరంగా
విరిగి రెండూ ముక్కలాయెనురా!

— బండి కట్టుకుపోతున్నాడు ఓ చిన్నవాడు - ఎంత ఆందంగా పిలుస్తూందో.

ఆవునెద్దు బండికట్టి
పరుగు పరుగున పోయేవాడ
బండినిలిపి బాసలాడారా
ఓ- పెడమల్ల చిన్నా !
బండినిలిపి బాసలాడారా !

ఆకసమునా అరటివనము
ధరణిమీదా నిమ్మవనము
నట్టనడుమ బండి బాటోయి
ఓ పెడమల్ల చిన్నా !
బండిబాటలో బొమ్మలాటోయి !

ఉదయగిరీ గట్లమీదా
ఉలవలెండాబోసే పాపా
ఉలవలకు ఎద్దులొచ్చేనే
ఋద్దులాడా పొద్దుపోయేనే !

బాటవార బండ్లమీద
చెక్కగొట్టె అక్కామొగడు
చెక్కవచ్చి చెంప దగిలేను
ఎక్కడలేని దుఃఖమొచ్చేనే !

బాటవార గట్టుమీదా
వడ్లుదంచే చిన్నపాప
నానబియ్యం నాకూ బెట్టావా
మళ్ళిరారా మలచిపెట్టేను !

—తను నమ్ముకున్న ప్రియుడాయెను- దగ్గరగా ఉన్నంతవరకూ చూడకుండా ఉండడం ఎలాగ - అందుకే ''ఉంటే ఈ ఊరిలో ఉండూ - పోతే పొరిగూరికి పోరా'' అని పలుకుతూంది!

లింగా నిను మరువలేనురా
చక్కని నామాలకొండ
లింగా నిను మరువలేనురా!

ఉంటే ఈ ఊరిలోఉండూ
పోతే పొరుగూరికి పోరా
చుట్టుప్రక్కలా పల్లెలయుంటే
చూడకుండా ఉండలేను

లింగా!

కూలికిపోతే నాకేరారా
నీలికిపోతే నాకేరారా
నీ జనుము నేనే కోస్తా
నా జనుమూ నేనే కోస్తా
కోసి అంతా కట్టలు కడతా
కట్టినదంతా గూటికేస్తా
గూటిమీదనె కూకుండ బెడతా
కూడువండీ నీకే ఎడతా
మెరమెరనీ కన్నులుచూస్తా

లింగా నిను మరువలేనురా
చక్కని నామాలకొండ
లింగా నిను మరువలేనురా!

—బెదరగొడితే మేసే ఎడ్లుకూడా అదురుపడి సరిగా పనిచెయ్యవట - మేనత్త కొడుక్కు సలహా ఇస్తూంది.

ముందచేరు దున్నువాడా
ముద్దుల మేనత్త కొడకా
దాపచెద్దుకు దప్పికాయెనురా
ఓ అందగాడా నరసన్న బావా
నూతికాడా నీలుపెట్టారా !

దూరబారము దున్నబోకు
దిబ్బచేరి చూడలేనూ

ఊరుముంగిటా ఉల్లిచేనూరా
ఓ అందగాడా నరసన్నబావా
ఉల్లికోతకు పిలుపులంపారా!

ఉల్లితెల్ల మీసమోడా
ఉల్లిచేను చేయువాడా
నాకు కుంచెడు ఉల్లి అంపారా
ఓ అందగాడా నరసన్నబావా
ఉల్లిపులుసూ వండగలనురా !

కాలువపతల అందగాడా
పెసరచేనూ దున్నువాడా
ఎడ్లకీ కాసుకు వేయకురా
ఓ అందగాడా నరసన్నబావా
అట్టులేస్తే అమరుపుడ్తాదీ !

ఒకరిని ఒకరు ప్రేమించుకొన్నారు. "నడిసి రారా సరసాకు ..." ఎంత కమ్మగా స్వాగతం పలుకుతూందో!

సెక్కుమీదను సన్నగోరూ
సెంపనా జవ్వాది పూతా
సొంపుగా నీకెవరు బూసారే ?

చక్కాని బాలా
ఇంపుగా నీకెవరు బూశారే!

ఇత్తడి జూన్నెన్ను కొలుతూ
ఈనినావుల పాలుగొలుతూ
రాగిమాను పూలుగొలుతబ్బి
బంగారుసామి
నడిసి రారా నాదు సరసాకూ!

కుంకమూ గురువేరు చేనూ
దవనమూ దానింటితడికే
వంగి రారా సుంకు తగిలేసీ
బంగారుసామి
తమలపాకూ మడుపులందేసీ!

కుట్రికుట్ర సినుకులోనా
ఉంటిరా దానింటి ఎనుక
దూడ తొత్తుమాట వినేరా
బంగారుసామి
దుక్కిపంట నానిపోయేరా!

గారడీదానింటి వెనుక
మావిడికొమ్మలు రెండూ
అందలేదూ పొందలేదూర
బంగారుసామి
అన్నెకారీ కోడికూసేరా!

గాజులుండే చేనిమీదా
కమ్మకెగ్గిరి చెట్టుపుట్టా
కమ్మకెగ్గిరి వాసనాకేరా
బంగారుసామి
ఉండలేదురా ముందనా మనసు!

అయితే పైన స్వాగతం పలికినామె కంటె రెండాకులు ఎక్కువ చదివిన పడుచుక త్తె ఈమె. ఉపాయాలను సదుపాయాలను ప్రియుడికి తనే బోధిస్తూంది—

కొత్తకుండ నీరు తీపి
కోరిన మగవాడు తీపి
వాడినా చెరుకెంత తీపబ్బీ
పెరుమాళ్ళ చిన్నా
పదరా బందారుపోదామూ !

నీకు నీవారు లేరూ
నాకూ నావారు లేరూ
ఏటిగట్టున ఇల్లు కట్టబ్బీ
పెరుమాళ్ళ చిన్నా
ఏరువస్తే కూడబోదాము !

చెంపనా సంపంగనూనె
అంచునా చెంగల్వమొగ్గ
ఏటిఒడ్డున ఇల్లు కడదాము
పెరుమాళ్ళ చిన్నా
పదరా బందారుపోదామూ!

బావిలోపల బల్లి పలికె
బన్నసరమూ కొలుకులూడె
బిళ్ళలా మొలత్రాడు తెగెనబ్బీ
పెరుమాళ్ళ చిన్నా
ఏరువస్తే ఈదిపోదాము!

ఆకసాన ఆకుతోట
దారిమధ్యన పూలతోట
పూలతోటలో బండ్ల బాటమ్మి
పెరుమాళ్ళ చిన్నీ
బండ్లబాటలో మంచిమాటమ్మి!

ఇంత ధైర్యం తనుగా తాను ఇస్తే-వెనుదిరిగే మొగాడు ఎవరు? అందు లోనూ తను ఎందుకో ఏటివొడ్డునే ఇల్లు కడదామంటూంది!

ఇక్కడ 'తాను మునిగింది గంగ, తావలచింది రంభ' అన్నది - 'కోరిన మగవాడు తీపి'తో వినిపిస్తున్నాయి.

ఈ పాట 'చిలుక-గోరువంకల'ల మధ్య నడుస్తూంది.

మొవ్వాకు చీరకడతా
మొగలిరేకులు పెడతా
ననూ్నా పెండ్లాడుతావా-ఓ కన్నెగోరా
ననూ్నా పెండ్లాడుతావా ?

ముత్యాల పేరూపెట్టి
ముద్దుటుంగరము పెట్టి
నిన్నే పెండ్లాడుతాను
ఓ చిన్నీ చిలుకా
నిన్నే పెళ్ళాడుతాను !

మల్లెపువ్వులు చుడ్తా
మొలకూ వడ్డాణం పెడతా
ననూ్నా పెళ్ళాడుతావా ఓ కన్నెగోరా
ననూ్నా పెళ్ళాడుతావా ?

పసుపున పాదాలు కడిగి
పచ్చాపట్టంగీ తొడిగి
నిన్నే పెళ్ళాడుతాను ఓ చిన్నీ చిలుకా
నిన్నే పెళ్ళాడుతాను !

గజ్జలందియలు పెడతా
పచ్చకు తాళికడతా
ననూ్నా పెండ్లాడుతావా ఓ కన్నెగోరా
ననూ్నా పెండ్లాడుతావా ?

న్యాయంగా - ధర్మశాస్త్రంగా పెళ్ళి మాటలు కానిచ్చి - పుస్తి కడతా సంటున్నాడు.

నిమ్మ చెట్టూ సోకు చూడూ
నీదనున్నా పిల్లని చూడు
ఓరోరి మామా
నిమ్మకాయల సోకు చూశావా !

దబ్బ చెట్టు దారిలోనా
ధాటిగానూ పోతున్నాదీ
దానితోనూ సైగ చేశావా !
ఓరోరి మామా
దానితోనూ సైగ చేశావా !

మామిడి చెట్టూ మాటుసున్న
మాలపిల్లని నీవే చూసీ
పళ్ళు ఇమ్మని సైగ చేశావా !
ఓరోరి మామా
పళ్ళు ఇమ్మని సైగ చేశావా !

అనప్పాదూ అందం చూడు
అత్తగారీ సోకు చూడు
అనపకాయల అందం చూడు
పళ్ళలోనే పళ్ళు రాలాయా
ఓరోరీ మామా
పళ్ళలోనే పళ్ళు రాలాయా ?

ఇతగాడు ఏదో మోటు సరసం చేసినట్లు కనిపిస్తూంది. అందుకే పళ్ళు రాలాయేమో ? ఈ పాట ద్వంద్వ భావ పూరితం !

పెసర మెట్టా చేసీకాడా
జోరు నిద్రా పోయే పాపా
సేయి తియ్యే మొగము జూతాము
ఓ ధింకిజెల్లా
నీకు బాస నాకూ కోపామే !

గోరింటాకు కొమ్మ తగిలి
కొంగు కొమ్మన తగులూకొందీ
మొగలిరేకుల ఊయలేయరా
ఓరోరి మామా
మొగలిరేకలే నన్ను చేరారా !

రాజసీమను పుట్టిందాన
రాసులంచే మురిసేదాన
రావె ఎడదాం ఏడు కొండలకీ
ఓ ధింకిబొర్రి
కదులు పోదాం కంచి క్షేత్రానికి!

తను ఏదో వేళాకోళం కోసం ముఖం మూసుకుంది - అలా మూసుకోడం తనకు కోపంగా ఉంది. ఎంతటి ఆటల్లో మునిగున్నా - దేవుడూ భక్తి మరువలేని ఈ హృదయం చూడండి —

ఓ వాలు కన్నుల మువ్వ వెంకటస్వామి
నిన్ను నేను విడువజాలరా!

ఇంటి ముంగల ఇనుపరోలు
సేతిలో శామంతి రోకలి
దంచి దంచి నీ వంక చూసితె
ధరణి మీదా కాలు నిలువ దెంకటస్వామి
నిన్ను నేనూ మరువజాలరా !

ఓ వాలు కన్నులా మువ్వ వెంకటస్వామి
నిన్ను నేనూ విడువజాలరా !

ఉంటే ఈ ఊళ్ళో ఉండూ
పోతే మరు దేశం వెళ్ళు
సుట్టుపట్ల ఏమూలన ఉన్నా
చూడక నా మనసుండ దెంకటస్వామి
నిన్ను నేను మరువజాలరా !

ఓ వాలు కన్నులా మువ్వ వెంకటస్వామి
నిన్ను నేనూ విడువజాలరా !

ఎర్ర సెరువు నాలుగు ముక్కలు
గోలకొండ గుల్ల సింతపండు
అవాలు ధనియాలు వేసి వండితే
ఆ వాసనకి సుట్టు తిరిగే ఎంకటస్వామి
నిన్ను నేను మరువజాలరా !

ఓ వాలు కన్నులా మువ్వ వెంకటస్వామి
నిన్ను నేను మరువజాలరా !

ఓ అందకాడ నా కోడెకాడ
సందెకాడను గోడ దూకి
తొంగి చూడ గడబిడాయేను
ఓ మువ్వ వెంకటస్వామి
నిన్ను నేను మరువ జాలరా !

ఓ వాలు కన్నులా మువ్వ వెంకటస్వామి
నిన్ను నేను మరువ లేనురా !

ఈ మువ్వ వెంకటస్వామి లాగే, పోలీసు వెంకటస్వామి కూడా ఒక తున్నాడు.

ఓరాళ్ళగమ్మలా
పోలీసెంకటసామి
నిన్ను నేను మరువజాలరా !

ఓ పోలీసెంకటసామి
నిన్ను నేను మరువజాలరా !

ఉంటే ఈ ఊరిలో ఉండూ
పోతే పొరుగూరికి పోరా
కోమటాయనా కొట్టుకాడా
కొత్త కోకా ఇచ్చినపుడూ
మడతలన్నీ ఇప్పి చూస్తే
మనసు నీరై పరుగు లేసెనురా

ఓ పోలీసెంకటసామి
నిన్ను నేను మరువ లేనురా !

ఇంటి ముందర ఇనుప రోలూ
చేతిలో చామంతి రోకలి
దంచు నపుడు నిన్ను చూస్తే
ధరణి మీదా కాలు నిలువదురా

ఓ రాళ్ళగమ్మలా
పోలీసెంకటసామి
నిన్ను నేను మరువ జాలరా !

పుట్టినింట ఉన్న యువతి అత్తింటికి వెళ్ళక తప్పదు. ఆలా వెడుతూంటే అంతదాకా కలిసి తిరిగిన ప్రియుడు దూరమవుతున్నాడే అనే బాధ - అలా వెళ్ళిపోతూ కబురు చెబుతూంది:

ఒండుకోసు ఒడ్డుపల్లె
పండుకోసు పల్లెసెరుపు
ఒల్లకుంటే గొల్లపల్లెయ్యా
దయగల్ల సామీ
రేపు పయనామాని దెల్పారా !

మిట్టలెక్కి చూసువాత
ముష్టి కాకర సెట్టుకాడ
ముద్దుముద్దూ గలసిపోయేరా
దయగల్ల సామి
రేపు పయనామాని దెల్పారా !

కానరానీ గట్టుమీదా
కమ్మగెగ్గర సెట్టుకాడ
కారణాలూ సెల్లిపోయేరా
దయగల్ల సామి
రేపు పయనామాని దెల్పారా !

నీళ్ళలారా నిమ్మలారా
నిత్యబూసిన మల్లెలారా
నీళ్ళగొచ్చిన నీళ్ళగన్నోయి
దయగల్ల సామి
రేపు పయనామాని దెల్పారా !

ఆ త్తింటికి వెడుతున్నానని దయగల సామిచేత కబురు అందించడమో? లేక రేపు మూటాముల్లే గట్టి వెళ్ళిపోదాం అని కబురో !

లగ్గోపిల్ల - చిన్నవాడు మధ్యస జరిగినసంభాషణ ఇది :

''నల్లనల్ల మబ్బునుండి లగ్గోపిల్లా
అదె తెల్ల తెల్ల చంద్రుడొచ్చె ,,
అల్లిబిల్లి తీగెచూడు ,,
అదో నేరేడుక్రింద జూడు ,,
చల్లనైన చలమ జూడు ,,
నేరేడు నీడలోన ,,
నీ బారెడేసి కళ్ళచూపు ,,
మారేడు నీడలోన ,,
నీ బారెడంత జడను జూపు ,,
నిండూ పున్నమనాడు ,,
పండూ వెన్నెలగాచె ,,
చిన్నారి చిన్నదాన ,,
నా కన్నుపండువ సేయరాదె ,,
పొన్నపూలు ఏరి తెచ్చి ,,
నీ చిన్నచేత నియ్యరాదె ,,
అందమైన నీదు మోము ,,
ఆ చందురుడ్ని ఓడించె ,,
తెల్లజొన్న రొట్టెజేసి ,,
వెన్న బూసి వెంటతేవె ,,
పల్లెదరి తోటకాడ ,,
తెల్లమల్లి పూలు తేవె ,,
నా చేను పండిపోయె ,,
ఇంక నీ చేను పండదాయె ,,
చేనుచేను గలిసినట్టు ,,
మేనుమేను కలపరాద ! ,,

అని చిన్నోడు అంటుంటే లగ్గోపిల్ల సమాధానం అందిస్తూంది :

''కారుమాట లాడబోకు పిల్లవాడా !
మా వారు వచ్చి చూస్తారు ,,

కారుమబ్బు లొచ్చినాయి పిల్లవాడా
నాకు దారిచూపు లేచివచ్చి ,,
కటికి చీకట్లుకమ్మి ,,
చిటుకుపొటుకు వానజూడు ,,
అటకమీద పిడకలన్ని ,,
అటకమీదె ఉండిపోయె ,,
గుడిసె మంచకెళ్ళుదాము ,,
తడిసి వణుకుతాము ,,

తను ఆ మాటకు సమాధానం ఇస్తూన్నాడు :

నీ చేను గుడిసెమంచె లగ్గోపిల్లా
నా చేను ఒట్టిమంచె ,,
తెప్పమీద తెప్పవచ్చె ,,
తెప్పతోటి చినుకులొచ్చె ,,
ఆంగట్లో మొన్నాగొన్న ,,
గొంగడన్న కప్పుకోవె ,,
దగ్గరికి రారాదె ,,
నీవు సిగ్గుపడితె తడుస్తావు ,,
వానవెలిసి వెన్నెలొచ్చె ,,
మనం తానమాడినట్టులాయె ,,
బట్టలన్ని తడిసిపోయె ,,
నేను పట్టుకోక తెచ్చుకుంట ,,
నీవు పట్టుకోక తెచ్చుకుంటె లగ్గోపిల్లా
నేను పట్టంచు ధోతిగడత ,,
లగ్గమైన మనసుతోటి ,,
మనం లగ్గమైతె బాగుండు ,,
ఊరుపల్లె విడిచిపెట్టి పిల్లవాడా
ఈ ఊరుబైట లగ్గమేంది ,,
బాజా బజంత్రీ లేవి ,,

మంచి మోజుమీద సవ్వడేది	పిల్లవాడా
కులము కులము కలిసినాక	,,
ఈ పొలముగాద తొందరేమి	,,

పాత పరిచయస్తుడే ఈ బావ. కొత్తకోరికల్లా పచ్చబొట్టు పొడిపించడం-
అది చూసి తను మురియడం!

పచ్చబొట్టు పొడిపించు బావా
పావలా ఆర్ధిచ్చీ
పొడిపించూ బావా
పచ్చబొట్టూ పొడిపించు బావా!
కొండమీద దేముడంట
గుడిలోనీ దేముడంట
మేదుమోరి ఇంటి ఎనుక
యర్రబొట్టు పెట్టుకొని
కోమటోరి ఇంటియెనుక
కోకలన్ని కట్టుకోని
నిన్నే పిలవాలీ బావా!
కోకే బాగుండాలి బావా!
చుక్క పొడిపించు బావా
చుక్క బాగుండాలి బావా!
పచ్చబొట్టు పొడిపించు బావా
పావలా ఆర్ధిచ్చీ
పొడిపించు బావా!
పచ్చబొట్టు పొడిపించు బావా!

సాధారణంగా లంకలలోను, మెట్టప్రదేశాలలోను, అటవిప్రదేశ గ్రామాల పరిసరాలలోను. పడుచులు ఏ పుల్లల కోసమనో ''కూపు''లకు వెళ్ళడం– ఏ పేడకనో వెళ్లడం- తోటకూరా, గోంగూరా తెచ్చుకుని అమ్ముకుందామని వెదు తూండడం పరిపాటి. ఈ సమయంలో ఒంటరిగాకనుపించే పడుచులను పెటకారం చేయడమూ ఈ పాటలద్వారా పరిపాటిగానే కనుపిస్తూంది.

గోంగూరకని గరువుమీదకు వెళ్ళి ఒళ్లు అంతా ఖరాబు చేసుకుని ఆ అనుభవాలను ఆఖరున తలుచుకుంటూంది:

నే నెరక్క పోతినే గోంగూరకు
నే నెవరితోను చెప్పకుండ ,,
ఆ గరువుమీద కెళ్లినే ,,
పరువు తక్కువ నా కొడుకె ,,
నెత్తి మోతలమారి ,,
అత్తగారు చూడకుండ ,,
కొత్తదైన లేఅంచుచీర ,,
కుచ్చుళ్ళుపోసి కట్టి ,,
గుత్తముగ రయిక తొడిగి ,,
నెత్తిమీద గంపెట్టి ,,
నోరెత్తిచెబితె సిగ్గుచేటు ,,
పెతనాల కెళితెనే ,,
దడి అవతలనుండి ,,
తొంగితొంగి చూశాడు ,,
నుంచున్నా ననుచూసి ,,
మీసం మెలిపెట్టినాడు ,,
పకసదార పెట్టుంటు ,,
పైనా బడబోయాడె ,,
లంచ మిదిగొ నన్నాడు ,,
నన్ను లాలన చేశాడె ,,
నోరెత్తిచెబితె సిగ్గుచేటు ,,

తమకు అంగీకారమైందా నెత్తిన పూజించే పల్లె జనం, ఇష్టం లేదా పాతాళానికి ద్రొక్కుతుంది. మొత్తం మీద వీడెవడో చాలా రభస చేసినట్లున్నాడు. అందులోనూ పెళ్ళి అయిందట - మరికష్టంగా ఉండదూ, అత్తగారున్న కోడలికి? ఒళ్ళు తెలియని పొగరుతనానికి ఈ పాట ఒక సాక్ష్యం!

ఈ గోంగూర పాటే ఇంకోలా కూడా వినపడుతుంది :

నే నెల్లకెల్ల కెళ్తినమ్మ — గోంగూరకి
మాయదారి నా కొడుకు — ,,
నన్ను పాక చుట్టు తిప్పాడె — ,,
పాకలోకి లాగాడె — ,,
కొంగుబట్టి లాగాడె — ,,
రయిక ముడి ఇప్పాడె — ,,
మాయదారి నా కొడుకు — ,,
నన్ను మాయజేసి ముంచాడె — ,,

ఒకే పాటను - కొంచం తేడాలో అక్కడక్కడ — ఇటువంటి దౌర్భాగ్యుల నామాలు చేర్చి పాడుకోడం కూడా కద్దు !

ఒంటరిగా కనుపించింది పిల్ల ! దాని ఒంటినీ, బట్టనీ, కట్టునూ ఎలా వర్ణించి కవ్విస్తున్నాడో చూడండి :

కాటు కెట్టిందిరా పిల్ల - ఏలో డొమకులాడి
కమలా లెట్టిందిరా — ,,
గాజూ లేసిందిరా — ,,
సూపూ సూసిందిరా — ,,
చరపూ చరిచిందిరా — ,,
చంకదాక బాడీని — ,,
బాగా ఏసిందిరా — ,,
పూలూ పెట్టిందిరా — ,,
షోకూలో ఊందిరా — ,,
అందరినీ చూసి పిల్ల — ,,
అదిరి పోయిందిరా — ఏలో డొమకులాడి

ఈ తరహా 'కొయ్యోడు' పాట నా చిన్నతనంలో విన్నట్లుంది. దీనిని పరికిస్తే ఈ మధ్యలో అనేక చరణాలు కలుపుకుని వినిపించే పాటా ఇది అని అనుమానం,

చుక్కల కోకా కట్టుకోని
చుట్టూ గోడు రైకా తొడిగి
తల నున్నగ దువ్వూకోని
బొట్టూ కాటుక బెట్టూకోని
నోటికి చుట్టా పెట్టూకోని
గోటుగాను నడుచుకొంటు
చక్కదనమె చూసుకొంటు
ఎక్కడి కెళ్తవు చిట్టమ్మండె

- ఆ - పుల్లల కెడ్తను కొయ్యోడో
రయ్యో కొయ్యోడా
ఓ రయ్యో కొయ్యోడా !

కూలి జనంలో సింగారించుకుని పయన మవడంతో పాటు చుట్ట కాల్చడం ఆచారం అలవాటుగా కనిపిస్తుంది. అటువంటి నాగరికురాలే ఈ చిట్టమ్మ-నోటిలో చుట్ట పెట్టుకొని వెళ్ళింది.

కర్ర చేతపట్టుకోని
కిర్రుచెప్పులు తొడుకొక్కని
కాయపంచలు కట్టుకొని
వక్కలాకులు వేసుకొని
ఎక్కడికెళ్తావు కొయ్యోడంటే

పోలేరమ్మా మెరకలమీదికి
పొగాకు కెళ్తిని చిట్టమ్మి
ఓ లమ్మి-చిట్టిమ్మి !!

చీటికి మాటికి చిట్టెమ్మంటూ
చిట్టెమ్మున్నా నడీదిలోనూ
చిన బాబుంటడు పెదబాబుంటడు
కరణాలుంటరు కాపులుంటరు

చిట్టెమ్మాని పిలువకురో
ఓరయ్యో కొయ్యోడ !
నే కుందన్నాయుడి కూతిరో
రయ్యో - కొయ్యోడ !

అబ్బో అబ్బో అలాగునై తే
కురసాగురసా మొక్కలిపీటా
కుందన్నాయుడి కూతురివా
లమ్మి చిట్టమ్మి !
నే మద్దెప్పయ్య మనవడ్ని
లమ్మి చిట్టమ్మి !

ఈ చిట్టెమ్మి నాలుగు ఆకులు చదివి - చిన్నోడినీ, పెద్దోడినీ బుట్టలో వేసుకున్న దానిలాగుంది. కొత్తగా పలుకరించవచ్చిన కొయ్యోడిని ఆ గ్రామంలో కొంచం ఘటికుడు కాబోసు నేను కుందన్నాయుడి కూతురినని బెదిరిస్తూంటే మరీ ఘటికుడును కాబోసును - నేను మద్దెప్పనాయుడు మనవడినని సవాలిస్తున్నాడు. గుడిని మ్రింగేవాళ్ళు ఒకరైతే గుడిలో లింగాన్నే మ్రింగాన్నే వారొకరు. ఒంటిమీది నగలనూ, నగలకుమించి తీర్చినట్లు తనకు కనుపించే అవయవాలనూ వర్ణిస్తున్నాడు - ఈ తరహా పాటలకి ఈ వాఙ్మయంలో కొరవలేదు.

గైరమ్మో గైరమ్మా
నిన్నేతల్లి కన్నదే
గైరమ్మో గైరమ్మా !

నీ ముక్కెంత చక్కనే గైరమ్మో గైరమ్మా
నీ ముక్కెంత సత్తెంత ,,
నీ నడుమెంత చక్కనే ,,
నీ వడ్డాణ మెంతందమే ,,
కాలెంత చక్కనే ,,
నీ కాలి అందెలెంత అందమే ,,

నీ ఒళ్ళెంత చక్కనే గైరమ్మో గైరమ్మా
నీ ఒళ్ళుమీదినగలెంత అందమే ,,
నీ కళ్ళెంత చక్కనే ,,
నీ కళ్ళకాటుకెంత అందమే ,,

పొరుగింటి పుల్లకూర చాలా రుచిగా కనుపిస్తుంది. చివరకు మొహం మొత్తుతుంది. అప్పుడు ఇతగాడికీ ఈ అందాలూ కనుపించవు - పాములూ జెర్రెలూ కనిపిస్తాయి -

యుద్ధం రోజులలో చాలాచోట్ల సిపాయిభావల రంగురంగు దుస్తులకూ, సిపాయిమామల టక్కుటక్కు అందాలకు మాటలకూ, లొంగి మోసపోయి నమ్మి కొన్నవాడిని మరచి తాత్కాలికంగా మాట నమ్మకుని-మురిసిపోయినవాళ్ళెంత మందో ఉన్నారు. రాజును చూసినమీదట మొగుణ్ణి చూస్తే మొత్తబుద్ధి వేసిన దన్నట్లు అలాటి సిపాయిబావతో స్నేహం చేసి - అతను పెట్టిన వస్తువులను తల్చుకుని పాత అనుభవాలను కొత్త జ్ఞాపకాలుగా వల్లె వేసుకుంటూంది.

సిపాయి బావా
సిరికన్నేసి
మరలీపోనావా !

ఆనాడు నీ వెట్టూవ్
అందమైన దుద్దులూ
లోలకులూ
అవి సెక్కిళ్ళపై జారి
సల్లగూగుతుంటేను
జల్లూజల్లున ఒళ్ళు
సెమ్మగిల్లిందోయీ !
కల్లగాదోయీ
సిపాయిబావా
సిరికన్నేసి
మరలీపోనావా !

ఆనాడు నీ వేసిన మొలక
ఈనాడు పెద్దదాయె
పువ్వుపూసి కాయ
కాసిందోయీ !
సిపాయిదావా
సిరికన్నేసి
మరలిపోనావా !

పాపం అమాయకురాలు. సిపాయిబావ ధర్మమా అని ఒక పాపకూడాను! ఆకొచ్చి ముల్లుమీద పడ్డా ముల్లొచ్చి ఆకుమీదపడ్డా ఆకుకేకదూ దెబ్బ !

ఎంతసేపూ పురుషునిదే తప్పుగా కనిపించుతుంది. కాని యువకుణ్ణి కవ్వించి - మురిపించి - లోబరచుకొనే స్త్రీ లెంతమంది లేరు? అందుకు ఈ పాటే సాక్ష్యం :

గాజులుండే సేతిలోన
గంధపొడి పూతవూసి
పీధిపీధులు
పలుపరించారా !
ఓ యెరుకలీ
పీధిపీధులు
పలువరించారా !

బావిలో బచ్చలీకూర
చేనిలో చెంచలీకూర
చెంపకూ సంపెంగనూనెరా
ఓ యెరుకలీ
చెంపకూ సంపెంగనూనెరా!

నూగునూగు మీసమోడ
నూగుచెట్ల కావిలోడ
పసరచేసీ బాట తెలుపుమురా!
ఓ యెరుకలీ
పసరచేసీ బాట
తెలుపుమురా!

కూడుపెడతా తినిపోరా
కూడవస్తా తీసుకుపోరా
ముళ్ళులేని మొల్లక్రిందికీ
ఓ యెరుకలీ
ముద్దులాడీ నన్ను పంపారా!

ఈతమానూ ఇల్లుకాదూ
తాటిమానూ తావుకాదూ
తగరమూ బంగారుకాదూర!
ఓ యెరుకలీ
తగులుకున్నోడు మొగుడుకాదురా!
ఓ యెరుకలీ
తగులుకున్నోడు మొగుడుకాదురా!

ఈమెకు చాలా విషయాలు తెలుసునులాగుంది. ఈతమాను ఇల్లుకాదనీ తెలుసును, తగులుకున్నవాడు మొగుడు కాదనీ తెలుసును - తెలుసుండే పలువ రిస్తూంది.

తనతో లేచిరమ్మని ప్రోత్సహిస్తున్నాడు యౌవనంలో ఉన్న పడుచుని.

చక్కనిగుంట
సరసనుకూచుంట
నాయెంటరాయె
చక్కనిగుంట!

సినిమా చూపెడత
నేతిమిఠాయి కొనిపెడత
ఏతంట లేకపోతె
నాయంటరాయె
చక్కనిగుంటా!

సినిమా చూద్దామన్న అభిలాషమూలంగాను, నేతి మిఠాయి పొట్లాలు రుచిమరగడం మూలంగాను లంగాగుడ్డలు పొందడంద్వారాను లొంగి బోల్లాపడే అమాయక హృదయాలు లేకపోలేదు.

ఈ పాటలాగే ఇంకోటికూడా ఉంది.

చక్కనిగుంటా
రాయె నాయెంట
సరస కూచుంట
పెళ్ళిచేసుకుంట
సుద్రాన్నెక్కిస్తా
కూడానేనొస్తా
సద్రున ఊరంత
సైదిరిగి వత్తాము

నిన్నే పెళ్ళాడతానంటా
నాకునీకు జోడంటా
నా తోమి పెట్టకు తంటా!

చేపలబుట్టా చంకనెట్టి
సందెడుపూసలు మెళ్ళోబెట్టి
పసందుగ బండార్లంక చీరనుగట్టి
పచ్చలరవికా తొడగబెట్టి!

వెనుకబడిన కులాలలో - మాల, మాదిగ మొదలగు జాతులలో వివాహానికి పెళ్ళికూతురు గుర్రాన్నెక్కితే - పెళ్ళికొడుకు నడుస్తూ ఊరేగడం ఆచారం. ఆ సంప్రదాయానికి సంబంధించినవాడే ఈ పెళ్ళికొడుకనుకుంటా - ''గుర్రాన్నెక్కిస్తా, కూడానేనొస్తా, గిర్రున ఊరంత సై తిరిగొస్తా''నని అంటున్నాడు.

ఈ పల్లెపాటలలో గొప్ప విషయం ఒకటి ముఖ్యంగా మనకు కనుపించేది- మన పాత ఆచారాలూ, నమ్మకాలూ, కట్టుబాట్లు, చరిత్రలూ గ్రహించడానికి చాలా వీలు. ఆయా మండలాలలో జరిగిన చిన్నచిన్న సంఘటనలు కూడా కథల్లా ఈ పాటల్లో అల్లబడి మనకు వినబడడం కూడా కద్దు!

ఈ ''నాయుడు'' చాలా ధైర్యంచేసి, ఎంతమందినో మసిబూసి మారేడు కాయ చేసినట్లు కనిపించేలా 'నాయుడోరింటికాడ' వంటి పాటలు అనేకం వినబడుతున్నాయి! కాని, ఈ పాటలో నాయుడ్నే మసిచేసి-మైకంలో మత్తెక్కించి, చాలా సంపాదించినట్లుగా ఉంది. ఇటువంటి మంత్రముగ్ధుల్ని చేయగలిగిన సానుల చేతుల్లో ఎంతమంది నాయుడులాంటి వాళ్ళు స్వాహా అయ్యారో?

నాయుడోళ్ళింటికాడ
నల్లతుమ్మ చెట్టుకాడ
నాయుడేమన్నా డేపిల్లా?— ఆబ్బ
ఎంతవింతగున్నాడేపిల్లా !
నాయుడోళ్ళింటికాడ
నల్లతుమ్మ చెట్టుకాడ
నాలుగురూపాయలిస్తానన్నాడే-ఆబ్బ
నా గుండెఝల్లుమన్నదే లమ్మీ !
కోమటోరింటికాడ
గున్నమామిడి చెట్టుకాడ
కోరికేమన్నాడె పిల్లా !

కోమటోరింటికాడ
కొట్టూబజారుకాడ

కోరికోరి రమ్మన్నాడమ్మి - అబ్బ
నా గుండె బడేల్ మన్నాదె లమ్మి !

కరణంగా రింటికాడ
కన్నెమామిడి గున్నక్రింద
కాసుల పేరిస్తానన్నా డమ్మి !

మునసబుగారింటికాడ
ముందల దరవాజకాడ
ఆతడేమన్నాడె పిల్లా !

మునసబుగారింటికాడ
ముందల దరవాజలోన
ముక్కపుడకలిస్తానన్నాడమ్మి ?

మాలపల్లి తూముకాడ
మల్లెపువ్వుల తోటకాడ
బాలుడేమన్నాడే పిల్లా ?

మాలపల్లి తూముకాడ
మల్లెపువ్వుల పందిరిక్రింద
మళ్లి మళ్లి రమ్మన్నాడమ్మి-అబ్బ
నా గుండె ఝల్లుమన్నాదె లమ్మి !

క్రిందనున్న కడియాలు
మీదన పావడాలు
నెత్తిమీద నాగరము
ఏ దేవుడిచ్చాడె పిల్లా?

కడియాలు కామరాజు
పావడాలు పాపయ్య

నాగరము నాగరాజు
నన్ను కోరికోరిచ్చేరమ్మి - అబ్బ
నా గుండె ఝల్లుమన్నాదే లమ్మి!

ముంతంత కొప్పుమీద
మూడు చేమంతిపూలు
ఏరాజు పెట్టాడమ్మి - అబ్బ
ఎంత చక్కగున్నావొలమ్మి!

చామంతి పువ్వులూ
చెంగూలోనాబెట్టి - నన్ను
కోరికోరి పిలచాడే నాయుడూ - అబ్బ
గుండె ఝల్లు మాన్నాదె లమ్మి!

కాళ్ళకూ కడియాలు
వ్రేళ్ళకూ మట్టెలూ
నాయుడెప్పుడిచ్చాడె పిల్లా?

కాసులపేరు వేసుకోనీ
కాలువగట్టున వెళ్ళుతుంటె
కానిపట్టుబట్టాడే నాయుడూ - అబ్బ
నా గుండె ఝల్లు మన్నాదే లమ్మి!

ఇదే పాటను ఓ గారడీవాడు ఇలా పాడుతూంటేవిన్నా.

నాయుడోరింటి కాడ
నల్లతుమ్మచెట్టు కాడ
నాయుడేమన్నాడే పిల్లా - నిన్ను
నాయుడేమన్నాడే పిల్లా ?

నాయుడోరి తోటకాడ
నల్లతుమ్మచెట్టు కాడ
నాయుడో రబ్బాయిరన్న
నా ఎంటాపడ్డాడు రోయన్నా !

గలగల గాజులూ
ఏడొచ్చినాయి నీకు
పుల్లలేరబొంకుతావ – నువ్వూ
బాసలకి పోలేదా పిల్లా !

పాటకపుజనం ఎక్కువగా మామ,- బావ వరుసలను వాడుతూంటుంది. సంతలో మావయ్యలూ. తీర్థాలలో బావలూ వీరికి చాలమంది కనుపించి పలకరిస్తారు. అటువంటి సంతలో బావలకు బంధువే ఈ బావ :

శుక్రవారం సంతలోన
బావయ్యో బావయ్యో !
చుట్ట మీద తొక్కినావు
బావయ్యో బావయ్యో !
నువ్వు తొక్కినందు కేడ్వలేదు
బావయ్యో బావయ్యో !
నీ కాలునొప్పి కేడ్చాను
బావయ్యో బావయ్యో!

ఆదివారం సంతలోన
బావయ్యో బావయ్యో!
అంది అంది గుద్దినావు
బావయ్యో బావయ్యో!
నీవు గుద్దినందు కేడ్వలేదు
బావయ్యో బావయ్యో!

నీ గుట్తినొప్పి కేడ్చాను
బావయ్యో బావయ్యో
బుధవారం సంతలోన
బావయ్యో బావయ్యో
బుగ్గలట్టుకు కరిసేవు
బావయ్యో బావయ్యో
నువు కరిచినందు కేడ్వలేదు
బావయ్యో బావయ్యో
నీ పంటికొప్పి కేడ్చాను
బావయ్యో బావయో !

ఈ సంత జనానికి చుట్టూ చూస్తూన్నారనీ, ప్రక్కవారు చూసి నవ్వు తారనే సిగ్గువుండదు. కట్టుకున్నదాన్ని పట్టిక్కగా గుద్దడానికి, ఉంచుకున్న దాన్ని సంతలో గుద్దడానికీ వెనుకాడరు - వారిలో మార్పు ఏనాటికో—?

పాపం, బావను తను ప్రేమించింది - నమ్మింది ! గాఢంగా నమ్మింది ! అయినా సంతలో గుద్దాడు, కొట్టాడు - కరచాడు. అయినా తను ఏమనదు బావని. పైగా - తనను కొట్టడంలో బావకు ఏం నొప్పి కలిగిందోనని మరీ ఏడుస్తుంది అమాయకురాలు ! ఎంత నిర్మల హృదయయో ?

ఇదీ ప్రియునితో ప్రియురాలు పలుకుతూంది:

రాజా నిను మరువలేనురా
చక్కని నామాలకొండ
రాజా నిను మరువలేనురా!
ఉంటే ఈ ఊళ్ళో ఉండూ
పోతే మీ ఊరికిపోరా
చుట్టు పట్టు పల్లెల్లో ఉంటే
చూడకుంటె నా ప్రాణాలుండవు
రాజా నిను మరువలేనురా

చక్కని నామాలకొండ
రాజా నిను మరువలేరురా!
కూలికిపోతే నాకేరారా
నాలికైనా నాతోరారా
నీచేను నేనే కోస్తా
నా పొలము నేనే కోస్తా
కోసిందంత కట్టలు కడతా
కట్టినాకా కొంపలొకేస్తా
గంజినీళ్లూ నీకే పోస్తా
ఉల్లిమిరప నీకే వేస్తా
మోజుతీరా ముఖము చూస్త
రాజా నిను మరువలేనురా
చక్కని నామాలకొండ
రాజా నిను మరువలేనురా!
కన్నులిరుపూ సూడంగానే
రొమ్ములుబ్బి పోతున్నాయి
నన్ను ఇడిసి ఏడికి పోకురా
రాజా నిను విడువలేనురా
చక్కని నామాలకొండ
రాజా నిను మరువలేనురా!



కళ్ళ

జానపద సాహిత్యంలో

రామాయణ కథామృతం



అంతా రామమయం !
జగమంతా శ్రీరామమయం!!

ఇది అక్షరాలా నిజం !

ఆ దశరథ రాముని పూత చరితతో జగమే సీతారామ కళ్యాణమై భక్తి పారవశ్యంతో ముత్యాల ముగ్గులు వేసింది.

పాటగా, మాటగా, పద్యంగా, కథగా, కథనంగా, నాటకంగా, యక్షగానంగా, కీర్తనగా, పదంగా, నృత్యంగా అంతటా అన్నిటా రామనామం పంచామృతమై తొణికిసలాడింది.

రామదాసు కీర్తన లేమిటి, అధ్యాత్మ రామాయణ కీర్తన లేమిటి, యక్షగాన, వీధి నాటక సీతారామ కథ లేమిటి— అన్నీ తెలుగునాడున అనేకానేక రూపాలలో భక్తినీ, ముక్తి మార్గాన్నీ ఆధ్యాత్మికతనూ, సాంఘిక పరిణతినీ రంగరించిపోశాయి.

తెలుగువారి ఇష్ట దైవం సీతారాములు.

ఇక జానపద సాహిత్యం వెంపు ఒక్కసారి దృష్టి మరల్చితే - ఓ బోలెడన్ని రామ కథలు, రామాయణ పాటలు.

అటువంటివాటిలో కొన్నింటిని దిఙ్మాత్రంగా పరిశీలించడమే ఈ నాలుగు ముక్కల ప్రయత్నం.

జానపద వాఙ్మయంగా - శారద రామాయణం, ధర్మపురి రామాయణం, మోక్షగుండ రామాయణం, కూచికొండ రామాయణం, రామకథా సుధార్ణవం, సూక్ష్మ రామాయణం, గుత్తెనదీవి రామాయణం, అధ్యాత్మ రామాయణం, సంక్షేప రామాయణం, చిట్టి రామాయణం, శ్రీరామ దండములు, రామాయణ గొబ్బి పాట, శ్రీరామ జావళి, అడవి, శాంత, పెండ్లి, సేతు, గోవింద నామాలు ఇలా మరెన్నో.

రంగనాథ రామాయణం, రామకథా సుధార్ణవం, సుందరకాండ పదము, కుశలాయకము; కుశలవకుచ్చుల కథ, లంకా యాగం, శ్రీ వైకుంఠ మాహాత్మ్యం.

అలాగే సీతా కళ్యాణం, సీత సమర్ప, సీతామ్మవారి అలుక, సీతాదేవి ఆనవాలు, శ్రీరాములు వారి అలుక, ఊర్మిళాదేవి నిద్ర, సీత అగ్ని ప్రవేశం, లక్ష్మణ మూర్ఛ, గుహ భరతుల అగ్ని ప్రవేశం, లక్ష్మణ దేవర నవ్వు, సీత వేవిళ్ళు, వామన గుంటలాడు పాట, సీత ఘడియ— ఇవన్నీ ప్రచారంలో ఉన్నవే.

ఇక్కడ ఇంకొక విషయం చెప్పవలసి ఉంటుంది. ఏమిటి అంటే, శత కంఠుని, దశకంఠుని, సహస్ర కంఠుని రాముడు జయించడం వంటివీ కథలుగా పేరొందాయి. పసగాడ సన్యాసి రాసినదే ఈ శతకంఠ రామాయణం.

జానపద సాహిత్యంలో రామాయణ కథామృతం ఇంతని చెప్పడం కష్టమే.

* చూడండి: దీనిని జానపద గేయవాఙ్మయ పరిశోధక మిత్రులు శ్రీహరి ఆదిశేషువుగారు కూడా కొంచెంగానే అయినా - చక్కని ఘట్టాన్ని పొందుపరిచారు.

ఇది సీత ఘడియ పాటలోనిది.

"అత్తమామల కుపచారాలు చేస్తూ సీత శయ్యాగారానికి చేరడంలో ఆలశ్యం చేసింది. అవనిజ మైమరచి ఉందని భావించి తల పంకించి రామ చంద్రుడు గడియవేసుకొని తల్పంపై శయనిస్తాడు – కొత్త కోడలైన సీత:

మామ దశరథులకు మడతలందిచ్చి
సుమిత్ర కైకలకు సురటీలు వేసి
పరగ కౌసల్యకూ పాన్పుల బరచి
మజ్జనంబులుజేసి పసుపులు పూసి

తరువాత అలంకరించుకొని శయ్యాగారానికి వస్తుంది. అప్పుడు ఆమెకీ శ్రీరాముడికీ రసవంతమైన సంవాదం నడుస్తుంది.

---

* చూ॥ జానపద గేయ వాఙ్మయ పరిచయము — హరి ఆదిశేషువు, పుట-247.

పుడమిలో నరులకు తలవొగ్గకుండా
పరశురాముని భంగపరిచిరేమున్ను
నన్ను ఏలే స్వామి కాకుత్స్థ తనయా
తలుపేయ కోపమా తాళగా గలనా
నిలుచుండ పాదాలు చేతులూ నొచ్చే
దంతంపు తలుపులూ తియవోయి నాధా
వంటింటి చినుకుకే ఒక చెంగు దడిసే
కాముడా తియవోయి కనకంపు గడియ
పటపటా చినుకుపడి పైకొంగు తడిసే
పచ్చలా బాలుడా తియవోయి గడియ
నాలుగోపుమాయె నాప్రాణనాధా
రత్నహారంబిస్తు తియవోయి గడియ
కడణించి దీస్తివా కాళ్ళ కాడనయిన
మరచి ఒకనిద్రైన శరణందిబోదు

– ఇంతదాకా సీత అనేక విధాల అడిగింది. అప్పుడు సీతతో:



నిద్ర నీకు లేకుండె నాకేమిసీత
గంటవలె దీపమ్ము అది నాకు తోడు
నీవు నిలుచుండేను నాకేమి సీత
పువ్వు బుక్కాయలు అవి నాకు తోడు
నీవు నిల్చుండేను నాకేమి సీత
గంధమ్ము కస్తూరి అవి నాకు తోడు
పట్టి మంచం పరుపు అవి నాకు తోడు

– అంటూ శ్రీరాముడే కోపతాపాలు వెళ్ళబుచ్చుతాడు –

ఇంకేం చేస్తుంది. కొత్త కోడలాయె సీత - అన్నీవింది. తిన్నగా అత్తగారి వద్దకే వెళ్ళింది. కౌసల్యతో జరిగిందీ, ఆడిగిందీ, చెప్పిందీ వివరించింది.

అన్నీ వివరంగా వింది కౌసల్య - సీత మాటలకు కరిగి పోయింది. లేచి తిన్నగా రాముని గదికి వచ్చింది.

దశరథుని పుత్రుడవు జనకుల్లుడవు
భూమి దేవల్లుడవు బుద్ధటరానీకు
సీత చేసిన తప్పు శీఘ్రానజెప్పు
నాకు ఎరిగించరా ననుగన్న తండ్రి

— అని నిలదీసి అడిగింది కౌసల్య.

సీత ఏంచేసిందని? అత్త మామలకు సపరిచర్యలు చేసింది. దానిని రామచంద్రుడు తప్పనలేడుగదా? అలంకరించుకొనివచ్చి తానే పిలిచింది - పలకరించింది - కోపాన్ని అర్థం చేసుకొని లాలించి పాలించమంది - స్త్రీ అంతేకదా చేయగలిగింది.

అందుకే శ్రీరాముడు ఏం చెప్పలేకపోయాడు.

అమ్మ నీ కోడల్ని అతి గౌరవమునా
నళినాక్షి పెంచితే నన్ను గైకొనుమా

అని కిమ్మనకుండా తలుపు తీశాడు.

సీతా రాముల కథా చరిత్రలు ఎన్నెన్నో ఉన్నాయి.

ఇంకా జానపద వాఙ్మయంలో రామకథలు చాలానే కనిపిస్తాయి. కౌసల్యా వేవిళ్లు, శ్రీరాముల ఉగ్గుపాట, రాఘవ కళ్యాణం, సుందరకాండ పదము, సుగ్రీవ విజయం, కోవెల రాయబారం.

ఒక్క మాటలో చెప్పాలంటే - తెలుగు హృదయంలో సీతా రాములు తమవారే-ఆ బాధలు గాథలు, చరిత్ర అంతా తమదే నన్నంతగా మురిసిపోతాము.

రామాయణం అంతా ఇక్కడే జరిగినట్లు, సీతారాములు తమవారే అన్నట్లు చరిత్రలను కథలుగా, చరిత్రలుగా, పాటలుగా, పదాలుగా, హరికథలుగా, నాటకాలుగా, యక్షగానాలుగా - ఎన్నో రూపాలలో మలచుకొన్న తెలుగు జానపదుల హృదయమే రామాయణం - ఆనందా రామమయం.

ఒక్క సీతాదేవి మీదే ఎన్నిరచనలు వెలువడినవో చూడండి :

సీత పుట్టుక, సీతాకళ్యాణం, సీతను అత్తగారింటికి పంపడం, సీత సమర్త, శుభగోష్ఠి, సీత గడియ, సీత వామనగుంటలు, సీతామ్మవారి ఆలుక, సీత వసంతం, సీత దాగుడుమూతలు, సీత సురటి -సీత ముద్రికలు, సీతఅనవాలు, సీత అగ్ని ప్రవేశం, సీతవేవిళ్లు---ఇలా ఎన్నో భావాలు జానపద కవితావల్లరికి బంగారు పూలు అయినాయి.

సీత వసంతంకు సంబంధించి నాలుగు ముక్కలు పరిచయం చేస్తాను--



మున్నూరు చిమ్మ గోవుల వసంతములు
పట్టుకొని పరమాత్ముడేతెంచెనపుడు
ఓ యమ్మ మా మీద వసంతములు జల్లి
ముచ్చవలెనే వచ్చి దాగి ఉన్నాది
అంపుమని శ్రీరాముడటు పలుకగాను
పంపనని కౌసల్య ఇటుపలుకగాను
అక్కడకువచ్చెనే అత్త సుమిత్ర
శ్రీరాములుండేటి చందంబు జూచి
ఈ వేడుక మనము కనులజూతాము
ఆ కోదలునెత్తుకుని అంతఃపురమునకు
ఆరగబోగా నిలువు నిలువుమనుచూను
నీలవర్ణుడు సీత కడ్డముగ వచ్చె
భేరినీలు నాపిరీలు పెంపుదీపింప
తమ కొల్వు చాలించి దశరథేశ్వరుడు
అంతఃపురంబులకు అటువేగవచ్చె
తలవంచు కోడలును జూచి ఆ రాజు
ఇది ఏమి చోద్యమో అని పలుకగాను
కలకలనవ్వెనే కౌసల్య దేవి
సతిపతులు సరసములు సలుపుచుండంగ
తిలకింపగ నేనేల కొలువులోనుంటి
ఈ వేడుకలు కనులచూడంగనైతి
నా పాపమునగాని నాకెట్లు కలుగు
ఓయమ్మనీకు సిగ్గుబిడియములు లేవె
నీ మీద చల్లిన సీలవర్ణుడ్ని
నెలతరో రఘురాముతోడుకొనివచ్చి
నీ చేత వసంతము చల్లింతునేను—

ఈ ఘట్టము ఎంత మనోహరంగా కళ్ళకు కట్టినట్లు ఉందో గమనార్హం!

సీత గడియ పాట ఇది:

అత్త కౌసల్యకూ అడుగులూవొత్తి
మామ దశరథులకు మడతలందించీ
సుమిత్ర కైకకూ సురటీలువేసి
పరగ కౌసల్యకూ పాన్పులూ పరచి...

—ఇలా సాగుతుంది ఈ పాట.

అలాగే శ్రీరామ చంద్రుడు అడవులకు వెడుతూందగా దశరథుని కౌసల్య ఓదార్చిన ఘట్టం కరుణరసబంధురం:

పతిజూచి శోకించి పతిముఖము దుడిచి
అతివ దుఃఖముతోడ పతికిట్టు లనియె
అటనాడు వరములూ ఏలనిచ్చితివి
పూర్వజన్మమందు జేసినాకృతము
కుడువకతీరునా ఎట్టివారలకు
అనుచు తనయుని దీసితా గారవించి
ఎవరికనులలో మండెనో మంట
ఎవ్వరి నేత్రాలు చిచ్చుబెట్టాయె
ఎడబాటు చేసెనే పాడుదైవంబు
మాకేల పుడితివిర ఓ రామచంద్రా
కైకకు పుడితేను రాజ్యమేలుదువు...

—ఇలా ఎంతో బాధపడి పంపుతారు.

సీతా సమేతులై రామ లక్ష్మణులు వనవాసానికి ఇలా బయలుదేరుతారు:



విల్లును అంబులను ధరణిపై ఉంచి
హస్తములు ముడుచుకొని మ్రొక్కి లక్ష్మణుడు
స్పృష్టంత నీవెసుమి భూమి శ్రీదేవి
అచ్యుతుని అడుగులకు వొత్తకుడి రాళ్లు
ఆనుచు ధరణికి మ్రొక్కి అందరును తరలి
రఘుపతి ముందరను సౌమిత్రి వెనుక
అవనిసుతయూ నడిచె అరణ్యములకు
పొదుపుచుక్కవలెను పొందుగానీవు
అదవులలో తిరుగ అమరితివిసీత
మీనాక్షి నీపుణ్యమెట్టిదోగాని
మా భాగ్యములు అరణ్యముల పాలాయె
ఇంతకంటే సుఖములేదు పొమ్మనుచు
సంతోషచిత్తుడై కదలె రాఘవులు
ఇంతితోకూర్చుండె ఇరువింద కింద
ఇరువింద నీవింత చల్లనైవుండి
కౌసల్యకంటెనూ ప్రేమజూపితివి—

—అలాగే ఆంజనేయునికి రామచంద్రుడు సీతను గుర్తుపట్టడానికి ఎన్ని ఆన వాలులు చెబుతాడో !

మహిమీద మాదేవి గాంచేటి తెరవు
వినవయ్య చెప్పేను శ్రీవాయుసుతుడా
నిజమునకు విప్పినవి నీలంపుకురులు
జడలుగట్టి పెద్దవిగనుండు
తల అంటు ఆడకే ఆడినట్లుండు
పచ్చి పసుపలదకే అలదినట్లుండు
పెట్టకను కాటుక పెట్టినట్లుండు
దిద్దకను తిలకమ్ము దిద్దినట్లుండు
అలదకను పరిమళం అలదినట్లుండు
చేయక శృంగారం చేసినట్లుండు
తొడుగులు వేయకే తొడిగినటుండు
తొలకరి మెరుపువలె తామెరయుచుండు
మసిపాతగట్టిన మాణిక్యం వలెను
శీతకాలమునాటి ఉదకమ్ము వలెను
పాద్యమి జదివిన వేదమ్ము వలెను
పరమసతి ప్రభావమెల్ల జెడి ఉండు

—ఈ పై కవి వర్ణన అక్షరాలలో జానపద చిత్రం కళ్లకు కట్టించాడు.

రామునితో సీత ఆడవులకెళ్ళింది - ఆ విషయం జానపద కవితల్లో ఎలా ముత్యాల హారాలు అల్లుతూందో గమనించండి :

ఆ దేవి కదులుతా భూదేవి కదిలా
భూదేవి కదులుతా భూదేవిపైనున్న
రుషాలె కదిలా
రుషాలపై నున్న పశువులే గదిలా

—సీత అరణ్యాలకు వెళ్లడం భరించలేదు ప్రకృతి, పక్షి, చెట్టు గుట్టా-అన్నీ !

మాయ జింకను బాణం వేసి చంపిన ఘట్టంలో-

ఏసెనే రామస్వామి ఎండమ్మితోనా
కూలిసే ఆ మెకము కుమ్మురామాలా
సోలెనే ఆ మెకము సొప్పకట్టాలా-

ఒకటేమిటి రామాయణం అంతా ఇలా జానపన సాహిత్యంలో శంకరా భరణం వినిపిసుంది.

చూడండి-రాముడు మృతి చెందాడని భ్రమించిన సీతతో మరది లక్ష్మన్న అంటాడు-

ఆడవిలో మాయన్న కతిభారమైతే
చుక్కలూ జలజలా రాలునోయమ్మ
సూర్యచంద్రులు గతి తప్పుదురమ్మ
పగలెన్నెలగాసు పసులిండ్లకొచ్చు- అంటాడు.

అలాగే ఇంద్రజిత్తు లక్ష్మణుల యుద్ధ ఘట్టాన్ని మనోజ్ఞంగా వర్ణిస్తాడు :

మేఘాలమరుగున ఆ ఇంద్రజిత్తుడూ
అగ్గిబాణము తొడగెనో
లక్ష్మన్ననియేటి ఆదారి తెలుసుకుని
నీళబాణము తొడిగెనో
మేఘాలమరుగునా ఆ ఇంద్రజిత్తుడూ
నాగబాణము తొడిగెనో
లక్ష్మన్ననియేటి ఆదారి తెలుసుకొని
గరుడబాణం తొడిగెనో
మేఘాల మరుగునా ఆ ఇంద్రజిత్తుడూ
తేళ్ళబాణము తొడిగెనో
లక్ష్మన్ననియేటి ఆదారి తెలుసుకొని
కోళ్ళబాణము తొడగెనో.....

ఇక్కడే ఒక విషయం ప్రధానంగా చెప్పాలి. సీత, లక్ష్మణుడు, రాముడు హనుమంతుడుతో అల్లుకొని ఉన్న పూత చరిత్రే రామాయణం. ఇవన్నీ స్త్రీల పాటలుగా చాలా ప్రచారంలో ఉన్నాయి.

ప్రియమిత్రులు డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణయ్య గారి వద్ద ఆ రోజులలో (అందే మద్రాసులో వారు ఉన్న సమయం రామరాజుగారు పరిశోధన కోసం మద్రాసు వచ్చిన సమయంలో) నా స్త్రీల పాటలు అటు భారత భాగవతాలవీ, ఇటు రామాయణంకి సంబంధించినవీ– టైపు చేసిన నా వాల్యూమ్స్ ఉండేవి. దరిమిలా నేను ఉద్యోగరీత్యా వెళ్లిపోడం- వాటిని వారే పరీక్షించి పుస్తకాలుగా తేవడంలో కృతకృత్యులైనారు- పాపం, వారు లేకపోయినా నేనూ వారూ పరిష్కరించిన స్త్రీల పాటలు పుస్తకాలుగా వచ్చాయి- ఇది చాలా ఆనందదాయకం.

ఆ నా సేకరణల్లో రామాయణ కథారూపానికి స్త్రీల పాటలుగా వన్నె కెక్కిన వందలాది పాటలు అందులో చోటు చేసుకోడం నా అదృష్టం-

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి పేరుతో నా వందలాది తెలుగు సామెతలు చోటు చేసుకున్నట్లు—

ఏతావాతా ఎందుకు చెప్పొచ్చానంటే – రామాయణం స్త్రీల పాటల్లో మరీ మధురామృతాలు పంచింది.

ఇక్కడ చూడండి. హనుమన్నతోనే సీతను గురించి రాముడు ఏమంటున్నాడో-



మరియొక్క ఆనావాలు కలదు సుమి హనుమ
మరవక చెప్పుమీ మా సీతతోను
కళ్యాణ మండపంబులలోను సీతా
వామన గుంటలు ఆడుచుండగను
సుదతి జానకిదేవి జూడదలపొచ్చి
వచ్చిన రాముని జూచి యా చెలులూ
జానకితోడనే చెలులు ఇట్లనిరి
రాముని కన్నులే రమ్యంపు కనులు
శృంగార కన్నులే దీపంపు కనులు
నినుజూడ వచ్చెనే నీలమేఘుండు
నిన్నడగ వచ్చెనే కమలబాంధవులు
నినుజూడ వచ్చినా మన్మధుం డితడు
అని ఇట్లు చెలికత్తె లానతియ్యగను
సిగ్గుపడి శిరసొప్ప వంచుకొని యుండె
తమ తల్లి ఉండేటి మందిరము కేగె
సిగ్గుపడి వచ్చావు చెప్పవే నాతో
నిను చూడ వచ్చేరు రామచంద్రులు
నిన్నడగ వచ్చిరే కమలబాంధవులు
అని ఇట్లు తమ తల్లి ఆనతియ్యగను
సిగ్గుపడి శిరసొప్ప వంచుకొని ఉండె
మరియొక్క ఆనవాలు కలదు సుమి హనుమ
మరువక చెప్పుమా మా సీతతోను
అద్దమ్ము లోపల అతివ తన రూపు
అందులో జూచి కురులంకించి ముద్దువా
ఈ అద్దములోను ఈ రూపుతోను
ఇంత చక్కని దేవి ఇది ఎవ్వరనుచు
అహహా శ్రీరామ ఆయోధ్య రాపు
సృష్టికి తావులు చేసి ఇట్టు లెరిగితివా
ఏకపత్నీ వ్రతుడవని ఇచ్చె మా తండ్రి

ఏకపత్నిత్వంబు ఇంపుగా తెలిసె
ఇట్టి మాయల సతిని పిలిపించ దగునా
అవనిజ కడు ముగ్ధ అగుట తా దెలసి
లోలాక్షి ఎరుగదని మదిలోన దలచి
కరస్థలము పట్టుకొని కాంత నిట్లంటి
పతిలేని సతి జూచి అతివ కోపిస్తివి
పతి జూచితే ఆలుక బాసునా చెపుము
నిలువు టద్దము దెచ్చి మెరుగు తుడిపించి
తీగ మెరపు బోడి ముందరా నిలపె
ఇద్దరీ రూపులూ అందులో జూచి
ఇద్దరీ వన్నె సౌందర్యములు జూచి
నరనాథ వారెవరు ఎరిగించమనెను
సీత భయము బాప అతివరో వినవే
సీతయూ రాముడూ చేరి యున్నారు
ఈ ఇంటనింకెవ్వరుండంగ గలరె
అతివ వెరచి తాను పాదములు మ్రొక్కె
ఇదియొక్క అనవాలని చెప్పుమా హనుమ –

– ఇలా ఎన్నో అనుభవాలనూ అనుభూతులనూ పేరు పేరున హనుమన్నకు చెబుతాడు రామచంద్రుడు.

సోదర ప్రేమ ఎంత గొప్పదో జాన పద కవికలం, కంఠం ఎన్ని ఆనందానుభూతులను కుమ్మరిస్తోందో ఈ నాలుగు పంక్తులు వింటే చాలు.

లక్ష్మణుడు మూర్ఛపోతాడు - ఆ దృశ్యం చూసిన అన్న రామయ్య హృదయం బద్దలయిపోయింది —

దిన దినమున నాము దిద్దినట్లే ఉంది
దీయరత్నము తమ్ముడా
అనుదినము నీనాము అమరినట్లే ఉంది
అతియ చక్కని తమ్ముడా
ఎద్దుకొమ్ములవోలె ఇద్దరే ఉంటిమీ
ఒంటిగాడిని అయిపోతినో

– అంటూ బాధ పడుతూ దుఃఖిస్తాడు. ఆ సమయంలో రామచంద్రుని స్థితి ఇలా ఉంది :

రంగైన ముత్యాల పేరు తెగినట్లు
రాలె కన్నుల ఉదకమూ
చిక్కనీ తిరమనీ ముత్యంపు కన్నీరు
వుక్కంటి దిగజారెనూ

ఇలా ఎంతగానో ఆయా ఘట్టాలు మన కళ్ళముందు ప్రత్యక్షిస్తాయి.

జానపద కవికలం మన కావ్యకర్తల ఊహలనీ ఉద్దేశ్యాలనీ అధిగమించి ఎలా ఎదిగిపోయిందో గమనించండి. ఇటువంటి భావస్ఫోరకాలయిన కవితా చందనాలు జానపద సాహిత్యం నిండా ముప్పిరిగొన్నాయి.

ఉదాహరణకు–

ఒకనాడు స్నానం చేయడానికని సీతాదేవి కొలనుకు వెళ్ళింది.

పచ్చి పసుపలదుకొని పద్మాయతాక్షి
కొలని దగ్గరకేగె గోవిందుదేవి

అంతలో ఏదో అనుమానం కలిగింది సీతావేవికి – వెంటనే తిరిగొచ్చేసి రామ ప్రభునితో అంటుంది :

ఇది ఏమి చోద్యమో ఇసవంటిదుండా
మింటచంద్రుడు వచ్చి ధరణిసున్నాడు
తుమ్మెదలు వచ్చాయి చూడ రమ్మనెను

– సరే –సాక్షాత్తూసీతే ఇలా అంటూంటే దొరుకోగలడా రాము ప్రభువు– వెంట వెళ్ళాడు. ఇదిగో చంద్రుడు చూడు, ఇవిగో తుమ్మెదలు పరికించు అంది. సాక్షాత్తూ భగవత్ స్వరూపుడయిన దశరథ రామునికి తెలియక కాదు. వెంట వెళ్ళింది–ఏమిటో అక్కడే చూసి చెబుదామనే–చూసి పక పక ముత్యాల జల్లులా నవ్వాడు–ఇలా అంటాడు :

మింటచంద్రుడుగాడు
అతివ నీమోము
తుమ్మెదలవిగావు
సఖియ నీకురులు

అని సీతాదేవి అనుమానాన్ని తీరుస్తాడు.

రామాయణ పాటలలో ఊర్మిళాదేవి నిద్ర చాల ప్రచారం ప్రాధాన్యమూ వహించింది.

అన్న ఒదినగార్ల సేవలో మునిగి కట్టుకొన్న భార్యనే పట్టించుకోలేదు. లక్ష్మణుడు. ఇది సీత గ్రహించింది. శ్రీరామచంద్రునితో ఊర్మిళ సంగతి విపరించింది. రామాజ్ఞకు తిరుగు ఏముంది - వెంటనే బయలుదేరాడు లక్ష్మన్న.

వెళ్ళినవాడు కాస్త విషయం పరిశీలించవచ్చుగా - చాలా కాలంగా భార్యకు దూరంగా ఉన్నాడేమో - వెళ్లే వెళ్లడంతోనే తిన్నగా ఊర్మిళ ఉన్న గదిలోకే వెళ్లాడు. ఊర్మిళాదేవి నిద్రలో ఉంది. అయితే ఎవరో వచ్చినట్లు గ్రహించింది–అదే ఈపాట :



అయ్య మీ రెవ్వరయ్యా
మీరింత యాగడమ్మున కొస్తిరీ
సందుగొందులు వెదకుచూ
మీరింత తప్పు శాయగవస్తిరీ
ఎవ్వరూ లేనివేళ మీరిపుడు
ఏకాంతమున కొస్తిరీ
మాతండ్రి జనకరాజు
వించె మిము ఆజ్ఞా సేయక మానరూ
మాయక్క బావవిన్నా మీకిపుడు
ప్రాణమునకే హానివచ్చు
మాయక్క మరదివిన్నా
మిమ్మిపుడు ప్రతకనివ్వరు జగతిలో–

అని హెచ్చరిస్తుంది.

–ఇలా చెప్పుకుంటూ పోతే దీనికి అంతం లేదు - రామాయణ కథా సాగరం అది.

తెలుగు గుండెల్లో రామతారకమై అంతా సీతారామమయమైన రామాయణం తెలుగునాడున జరిగిన కథే-రాముడు సీతా మావాళ్లే అన్నంతగా గుండెల్లో గోపురాలు నిర్మించుకొంది.

రామనామం



శ్రీమహత్తత్వార్థ బోధ విశేషమైనది రామ నామం
సోమ సూర్యాగ్నులను మించిన స్వప్రకాశము ,,
మూడు గుణములు ప్రకృతి వికృతికి మూలకందము ,,
ఏడు తత్త్వంబులకు నావల నెసగుచున్నది ,,
న్గాలం సాధనములు వహించిన నడత దెలుపును ,,
వెల్గులోపల వెలుగుదానై వెలుగుచున్నది ,,
మూడు మూర్తుల జన్మభూమికి మూలదైవము ,,
ఏడు వ్యసనములను హరించెడి యుద్ధసూత్రము ,,
సకల లోకంబుల భరించెడి సత్కరూపము ,,
ప్రకట యోగీంద్రులకునైనను పరము గోప్యము ,,
నాదబిందు కళామయంబగు వేదమంత్రము ,,

వాద భేదదులను దొలగిన వారి భోగము	రామ నామం
జ్ఞాన దృష్టిని చూడగలిగిన మాననీయము	,,
లోనవెలుపల నిండి ఉండెడి జ్ఞానదీపము	,,
నిరుపమానమునిర్విశేషము నిష్కళంకము	,,
పరమకళ్యాణప్రదంబగు ప్రణవనాదము	,,
చూపు నిలిపి భజించువారికి సుఖమునొసగును	,,
చూపు మనసులు నొకటి జేసిన శుభకరంబగు	,,
పంచవింశతి తత్వములకును మించియున్నది	,,
పంచదశ మంత్రాక్షరములకు ప్రాణకరణము	,,
కోటికమలజ యజ్ఞఫలముల సాటియైసది	,,
మాటమఱిచిన దూరదర్శికి మంత్రయోగము	,,
రెండు నొక్కటి జేయు వారికి నిండియున్నది	,,
పండువెన్నెలకాంతిగల్గిన ప్రబ్రహ్మనాళము	,,
అన్నిరూపంబులనుదానై ఆడుచున్నది	,,
అన్నిరూపంబులను దనలో నణచుకొన్నది	,,
పాపమనియెడు మేఘమునకును ప్రళయ వాయువు	,,
పావనడుమను మెరియుచుండెడి దీపరాజము	,,
కర్మయోగము లెన్ని సలిపిన గానరానిది	,,
నిర్మలాత్మజ్ఞులకు నెపుడు ధర్మమైనది	,,
నోహమను మంత్రార్థవిదులవి దేహముక్తియు	,,
దేహవాసన వదలినను ఘన దివ్యదృష్టియు	,,
నిరురలోపలనిగురదెలిసిన నిజము దెలుపును	,,
పదిలముగ సాధించువారికి బరమపదమగు	,,
జన్మదుఃఖాబ్ధిని దరింపగ జలుపుచున్నది	,,
చిన్మయాత్మల కెల్లగాలము చిన్మయముశ్రీ	,,
అష్టదళముల కమలమందున నమరియున్నది	,,

అష్టదేహాంతరము లందున ఆంటకున్నది రామనామం
ఏడుమై నిరవధికనిరూపము లోకమైనది ,,
శోకమోహవినాశకరమై చూచుచున్నది ,,
ఏక ప్రాకారముల కాలము నెసగుచున్నది ,,
ఏడుశక్తుల గెలిచినను దన తోడ బల్కును ,,
సర్వశబ్దంబులును తానై సాక్షి ఐనది ,,
నిర్వికారము శుద్ధతత్వము నిర్మలముశ్రీ ,,
మూడు కాలములందు బొలయని ముఖ్బిబము ,,
మూడు నదులును దాటువారికి మోక్షలక్ష్మియు ,,
మేరు చక్రాంతరమునందున మెరయుచున్నది ,,
కారణాజన్మని కతంబున గానవచ్చును ,,
అమృతపానముచేయు సురులకు నచలమైనది ,,
అమృతవర్షముకురియుచుండెడు నభపుశ్రీ ,,
ధారణాయోగీంద్రులకును నీ చాటైోది ,,
ఘోర రోగవనంబులకును గు ఠారపేశ్రీ ,,
ఆదిశేషుని నిఘంటలేపిన బోధసేయును ,,
అది మూలప్రకృతి గతికిన నాదియైెచది ,,
తత్త్వమసి క్ష్వార్థమనియెడి చత్వపేశ్రీ ,,
సాత్త్వికాది గుణంబులకు నిస్సంగమైనెది ,,
అజప గాయత్రిని రచించిన ఆదిబీజము ,,
భజనపరులకు నెల్లకాలము బ్రహ్మయజ్ఞము ,,
దేశమును గాలమును బొందని దివ్యతేజము ,,
ఆశలను సర్పముల ద్రుంచువిఖ గేశుడగుశ్రీ ,,
తారకబ్రహ్మానుభవులను జేరిఉండును ,,
దారి తప్పక మ్రొక్కి కొలిచిన దర్శనంబగు ,,
ఎరుకమరుల నెరిగి యుండెడు నెరుకయేశ్రీ ,,



గరుడగమనాదులకు ఐనను గణ్యమయినది	రామ నామం
ముక్తి కాంతిమణికి నెప్పుడు ముదమొసంగును	,,
భక్తవరులకు క్షేమకరమయి ప్రబలుచున్నది	,,
కామరాగాదులకు అంటని ధామమే శ్రీ	,,
సోమసూత్ర బిలంబులోపల జ్యోతియె శ్రీ	,,
చిత్తశాంతిని కలుగజేసెడి చిత్స్వరూపము	,,
సత్తు చిత్తులరెంటి నెనసెడి స్వప్రకాశము	,,
మహదహంకారాది పరిగణ సహితమయినది	,,
దహన గగనపథంబు లోపల దర్శనము శ్రీ	,,
హృదయకమలజ బిందువులను బెం పొదవ జేయును	,,
ముదముతో భ్రూ యుగము నడుమను ప్రమోయుచుండును	,,
దశవిధములగు మండలములను దాటి ఉన్నది	,,
కుశలబుద్ధిని గలిగిదలచిన గోర్కె దీర్చును	,,
నిత్యమయి పదియాఱు కళలను నిలిచి ఉన్నది	,,
కుశలబుద్ధిని గలిగిదలచిన గోర్కె దీర్చును	,,

నిత్యమయి పదియారుకళలను నిలిచిఉన్నది రామ నామం
సత్యలోకము నందు సుప్రస్థానమయినది ,,
జన్మమృత్యు జరాది మహిమకు జందరస్మియు ,,
తన్మయత్వము నొందువారికి దత్పరము శ్రీ ,,
రజతగిరిపతి సతికినెప్పుడు రమ్య మయినది ,,
సృజనపాలన విరయములదా జేయుచుండును ,,
యోగమాయనుదాల్చినట్టి ప్ర యోగమే శ్రీ ,,
ఆగమంత విచార నిపుణుల కాదినామము ,,
నాల్గు దళముల కమలమందున వెల్గుచున్నది ,,
నాల్గు నక్షర నాదములగా నాడి యున్నది ,,
క్షరము నక్షరమును రచించిన గురు నిరూపము ,,
కరణముల మూటికి నవశ్యం బెరుగుటకు శ్రీ ,,
పరమగోప్యము బ్రహ్మ వాచము భద్ర చరితము ,,
స్థిరముగను బిందువును నిల్పిన సిద్ధి యొసంగును ,,
ఆరుదళముల కమలమందుక ఆమరిఉన్నది ,,
ఆరు నక్షర నాదములుగా నాడుచున్నది ,,
గర్భనరకములన్ని బాపెడు గానమే శ్రీ ,,
భూర్భువాదిక లోకములకును భూషణము శ్రీ ,,
షేద చోదితమయి వెలింగెడి విశ్వరూపము ,,
వేదవాక్య ప్రమాణములచె బాచుకొన్నది ,,
పరమ గురురూపంబు దానై పరగుచున్నది ,,
నిరతిశయబోధ స్వరూపము నిర్మలము శ్రీ ,,
పది దళంబుల కమలమందునగా గదలకున్నది ,,
పది విధములగు నాదములు బలుకుచున్నది ,,
సప్తకోటి మంత్రములకును గుప్తమయినది ,,
సప్త జిహ్వాన మండలములలో జ్ఞప్తి యే శ్రీ ,,

జ్యోతి రూపంబును వహించిన సుప్రకాశము రామ నామం
జాతి నీతులు లేని మానస జప విధానమురా ,,
జ్ఞాన యోగముచేత జూచిన గానవచ్చును ,,
మనసానందము నొసగెడి మౌనమేశ్రీ ,,
అమర ద్వాదశ పత్రకమలము నంటిఉన్నది ,,
సమరసముగా బదియురెండక్షరము లాయెను ,,
బిందుచలనములె లేనివారల బొందిఉన్నది ,,
దుమండల మధ్యగతమగు నిండురూపము ,,
ఘనసుషుమ్నానాడియందలి కాంతియే శ్రీ ,,
అనిమిషత్వము నొందినను బ్రహ్మత్వ మొసంగును ,,
మూడుదేహంబులనునోని మూలదేహము ,,
ఏడుప్రాకారములకావల నెసగుచున్నది ,,
బంధకంబులనెల్లద్రుంచెడి ప్రకటయోగము ,,
అందులైఉన్నట్టి వారల కందమయినది ,,
పదునాఱు దళంబులను గల పద్మమే శ్రీ ,,



ఈ పదునారు స్వరాక్షరాలుగ బలుకుచున్నది రామ నామం
దూర దృష్టియు లేని వారికి దుర్లభము శ్రీ ,,

చిరుపాలనునేర్పరించెడి సీతి తెలుపును రామ నామం
లేత ముదురును దెలియువారికి దాతయగు శ్రీ ,,
దాత ద్రోసిల ద్రోలుదుడి చెడి దైవమే శ్రీ ,,
ఎందు జూచినగాని యొకటై పొంది యున్నది ,,
సందు లేక యజాండ రూపము నొంది యున్నది ,,
ఆది మధ్యాంతరములు లేక సనాది యైనది ,,
ఆది శక్తికి బ్రాణ పంక్తియు బాది జేయును ,,
శాంభవిని ధరియించువారికి సాధనము ,,
శంభు నేత్రము దెరచి చూచిన శత్రు నాశనము ,,
త్రిపుటి మధ్యమునందు వెలిగెడి దీప్తయే శ్రీ ,,
ఉపరిజిహ్వాకు ముందు పలికెడి జపనిదానము ,,
కపట యోగము చేత నెవరికి గానరానిది ,,
జపతపో వ్రతయజ్ఞములచే జెప్పరానిది ,,
రెండు దళముల కమలమందున నిండి ఉన్నది ,,
రెండు నక్షర నాదములతో బండి ఉన్నది ,,
మొదటి తంత్రము దెలియువారికి ముక్తి మార్గము ,,
పదిలముగ బఠియించు మునులకు బ్రహ్మకర్మము ,,
ఐదు ముఖములు గలుగు పక్షికి నక్షరము శ్రీ ,,
నీదు భూతలబులను ద్రిమింగెడు నాకసము శ్రీ ,,
మేను మవమనుదురభిమానము లేనిదే శ్రీ ,,
మేను నేనని యున్నవారికి లేనిదగు శ్రీ ,,
సర్వ లోకాతీతమై శివ సహితమైనది ,,
నిర్వికల్పము నిర్జరామృత నిత్య భోగము ,,
ద్రష్ట దర్శన దృశ్యజాలవి రహితమయి శ్రీ ,,
దృష్టికిని గోచరముగానిది దూరదేశము ,,

కుండలిని భేదించి చూచిన బండు వెన్నెల రామ నామం
గాలి మనసును దూల జేసెడి ఘనుని తపసే ,,
నీల తోయద మధ్యమందున నెగడి యున్నది ,,
అమల భావమి చేత గొలిచిన నమృత మొసగును ,,
అమృత నాదము లాలకించిన నమిత సౌఖ్యము ,,
ధరణికి నాకాశ వీధికి - దగిలి యున్నది ,,
మరణ మూర్ఛల బాపు చుండెడి మంత్ర యోగము ,,
పరమ తారక రాజయోగ భ్రాజ మానము ,,
చిరతరంబగు పూర్ణ దృష్టికి సిద్ధి మొసగును ,,
ప్రకృతి వికృతుల రెంటికిని స ద్బ్రహ్మ మేశ్రీ ,,
సుకృత దుష్కృత యోగములలో సోకకున్నది ,,
అచలమయి ఆనందమయివర మాణువైనది ,,
అచల మానసమున భజించిన నఖిల శుభములు ,,
శివ విరించి హరీంద్రసుమన స్సిద్ధియేశ్రీ ,,
భవము దోషము కులము రేయుంబగలు లేనిది ,,
తెలివిలోపల దెలివి దానై తెలియు చున్నది ,,
వెలుగు చీకటి రెండు లేకయు వెలుగుచున్నది ,,
సాంఖ్య యోగము బూటకు బల్ సాధనము శ్రీ ,,
సంఖ్యంలేని చరాచరంబుల సాగ జేయును ,,
ఆత్మ తపమును జల్పువారికి నాత్మ యజ్ఞము ,,
ఆత్మ జీవాత్ములను దానము ఆడుచున్నది ,,
మూడువస్థల నెందు నంటిని మోక్ష పదవియె ,,
అనిమిషపానంబు చేసెడి అమృత బిందువు ,,
నారదాది మునీంద్రులకు సంసారమయినది ,,
మారుతాత్మజు మనసు లోపల మరిగి ఉన్నది ,,
జన్మ మరణంబులను బొందని చదువు నేర్పును ,,

చిన్మయంబై సృష్టికిని సువిశేషమయినది రామ నామం
నరకమగు చీకటికి సదమల తరణి బింబము ,,
పరమ గుహ్యాముధీ ప్రకాశము బ్రహ్మవాదము ,,
విష్ణు లోకము శైవలోకము విశ్వమయమగు ,,
విష్ణు మాయను గెల్చువారికి విశదమగు శ్రీ ,,



నిర్గుణంబగు చిత్సమాదికి నిశ్చలము రామనామం
దుర్గుణంబులదుంచివై చెడి తుల్యరూపము ,,
నిత్యం ముక్తికి నిత్యభుక్తికి సత్యవచనము ,,
సత్యవాక్యధరిణులకు సం సర్గమే శ్రీ ,,
సోహమసుమంత్రార్థ విదులకు సోమపానము ,,
మోహమును లోభమురు బెంగని ఊహయే శ్రీ ,,
గరుని పాదద్వయమ్ తానై మెరయుచున్నది ,,
పరమపదముకు మార్గమిచ్చెడి చరమరూపము ,,

వేయిదళముల కమలమందున వెలుగుచున్నది	రామ నామం
మాయమాటలు పలుకువారికి మార్గమియ్యదు	,,
కుండలీంద్రుని పడిగమీదను బండి ఉన్నది	,,
నిండుగా నిర్గుణ సమాధికి బండువెన్నెల	,,
దృక్కు దృశ్యవిదులకు మిక్కిలి ఎక్కువయినది	,,
ఒక్కనిముషములోన మనమున నిక్కజేయును	,,
నిక్కుచుండెడి మనసు వృత్తిని సుక్కజేయును	,,
ఒక్క యక్షరనాదమై పెం పెక్కి ఉన్నది	,,
ప్రతి నిమేషము జపముజేసిన బరమ ధర్మము	,,
అతలితంబై సర్వగతమై ఆడుచున్నది	,,
వాసనాత్రయములను విడచిన వారి ధనమే	,,
శ్రీ సవాశివయోగ పధమున క్షిప్రసిద్ధియు	,,
జ్ఞానశక్తికి వాదిశక్తికి మౌనమే శ్రీ	,,
జ్ఞానభూములు నేడుగదచిన మౌనదేశము	,,
తాను వచ్చెడి దారివెలిపెడి జ్ఞానమే శ్రీ	,,
తాను బొయ్యేమార్గసరణిత చగ విధించును	,,
జీ విభావమునీ నభావము చెప్పుచున్నది	,,
జీవునికి నీశునికి నైక్యము చెందజేయును	,,
అత్మమంత్రం బాత్మమంత్రం చాత్మతంత్రము	,,
అత్మభోగం బాత్మయోగం బాత్మయోగము	,,
నిర్వికల్ప సమాధియోగము నిర్విచారము	,,
సర్వమును వ్యాపించియున్నది సత్యముగ శ్రీ	,,
క్షుద్రమంత్రజ్ఞులకు నెప్పుడు క్షోభకరమగు	,,
నిద్రజెందక తన్ను దెలిసిన ముద్రభావము	,,
ఉపనిషత్సారాంశమునకా మ హోత్సవము శ్రీ	,,
జప తపస్స్వాధ్యాయములకును జన్మభూమియు	,,

ఉపని షద్గావ్యంబుతానయి ఒప్పిఉన్నది రామ నామం
కృపణులై కనుగొనెడి వారికి చపలచిత్తము ,,
కుముమతములేని బుధులకు గోర్కిదీర్చును ,,
సలలితంబు గ్రబణవరవమును వెలయజేయును ,,
బట్ట బయలుగ భక్తులకుగను పట్టుచున్నది ,,
పట్టు గొమ్మ్మెపరమమునులకు బరగుచున్నది ,,
సర్వమును దనిలోన నుంచక నిర్వహించును ,,
సర్వజగములలోన యుండియు సంస్మరించును ,,
విశ్వమంతయు నశ్యమయినను ప్రీలదెప్పుడు ,,
విశ్వరూపము విగ్రహముగా వెలసి ఉండును ,,
కంటికిని మనసుకును గుటిగా గానరానిది ,,
మింటచిత్తర్వు లిఖించెడి మేటిదైవము ,,
కంటిపాపను నెనసి మెఱసెడి ఘనగురుండే ,,
తుంట విల్తుని భయముబాపెడి ముంటి చంద్రుడు ,,
ద్వాద శాక్షరిషోడ శాక్షరి బోధచేయును ,,
వేదముల నాల్గింటికిని దను పాదుకొన్నది ,,
పంచదశమంత్ర ప్రభావము మించియున్నది ,,
సంచిత ప్రారబ్ధముల నుప సంహరించును ,,
బయలులోపల బయలులోనయి ప్రకటమయినది ,,
భయములన్నియు బాపుచుండెడి బ్రహ్మమే శ్రీ ,,
చక్రతీర్థములోన వెలగెడి చంద్రబింబము ,,
వక్రములమూడింటి బాపెడి సుక్రమము శ్రీ ,,
అమృతకుంభము మీద నాడెడి హంసయే శ్రీ ,,
అమృతనాడి మధ్యమందున నమరిఉన్నది ,,
బీజమును మూలమును లేనిసు భూజమే శ్రీ ,,
రాజయోగ సుధాబ్ధిగతమగు రత్నరాజము ,,

పశ్చిమ ప్రాదేశమందున బరుగుచున్నది రామ నామం
నిశ్చలంబుగ గన్ను దెరచిన నిజసమాధియు ,,



అండమును బిండమును రెంటిని అంటి ఉండదు ,,
పండిగా బ్రహ్మాండమంతయు నిండి ఉన్నది ,,
కార్య కారణములను మఱిచిన ధైర్యమొసగును ,,
ఆర్యలేపకులైన వారికి అంది ఉన్నది ,,
సుప్తి జాగ్రత్స్వప్నమూర్ఛల జూచుచుండును ,,
జ్ఞప్తిమరచిన వారి మనసున వ్యాప్తమయినది ,,
నేను నీవును లేని నిర్గుణమౌనమే శ్రీ ,,
జ్ఞానమజ్ఞానములు రెండును లేనివే శ్రీ ,,
ఎన్నికంబులు నశించిన నేకరూపము ,,
సన్నుతించెను దూరముగానిది ఎన్నటికి శ్రీ ,,
స్వచ్ఛమగు వాచామగోచర సత్ప్రకాశము ,,
అచ్చలంబై నిర్భయంబై అమరిఉన్నది ,,

కర్మనేత్రద్వయముచేతను గానరానిది	రామ నామం
మర్మమెరిగిన గురువరేణ్యుని మర్మమే శ్రీ	,,
సకల దృశ్యంబులకు నెప్పుడు సాక్షియైనది.	,,
ఒకటియై నానా స్వరూపము బొందిఉన్నది	,,
చీకటిని వెల్తురును రెంటిని చెందకున్నది	,,
లోక ధర్మములన్ని విడిచిన శ్రీకరంబగు	,,
నిరతిశయము నిలీషభావము నిరుపమానము	,,
పరమపురుషత్వమయమై పరగుచున్నది	,,
ఇట్టిదని వర్ణించుటకు గురినెవరెరుంగరు	,,
గట్టు దెలిపిన దేశములకేగురుతుపడు శ్రీ	,,
శ్రీ మహావాక్యార్థవేత్తల నామమే శ్రీ	,,
వ్యోమమార్గము మీజినన్ సంయోగభావము	,,
వేయి దళముల కమలమందు మేయుచున్నది	,,
శ్రీయుతంబగు శక్తి విద్యకు గాయమే శ్రీ	,,
గంగయమున సరస్వతీనదు లంబములుగా	,,
లింగదేషములోన నిల్చుచు బొంగుచున్నది	,,
అంగమును లింగమును గల్గిన అపుడెపల్కును	,,
సంగరహిత విచారమైన సత్సంగమైనది	,,
తోడబుట్టిన బొకదెడి జూపదెలుపునా	,,
మూడు దీక్షలబొందినను సమ్మోదమొసగును	,,
తడియులేని సుపాద తీర్థము వడయజేయును	,,
పొడియులేని ప్రసాదమొసగెడి పూర్ణతత్వము	,,
దుష్ప్రసంగములన్ని బాపెడి తుర్యరూపము	,,
నిష్ప్రపంచనిమునిర్మమత్వము నిత్యశుద్ధము	,,
సప్తసాగరములు తరించిన సాధ్యమగు శ్రీ	,,
గుప్తమగు నవ్యక్తత్వ వ్యాప్తమయినది	,,

సృష్టికిని బూర్వంబు నొకటై చూచున్నది రామ నామం
సృష్టిగలిగిన పిదప రెండై స్పష్టమైనది ,,
అంతరింద్రియములకునైనను అంతుదెలియదు ,,
అంతరింద్రియ నిగ్రహులకే అమరుచున్నది ,,
మాత్రు సంసర్గము నెరింగిన మార్గమే శ్రీ ,,
మాతృభార్యాక్రమమునొకటై మరగిఉన్నది ,,
అప్రమేయంబైన చిద్బ్రహ్మాండకోశము ,,
అప్రతర్క్యంబైన మహా నందరూపము ,,
పంచవిధసంస్కారభ్రమలను బాపుచుండును ,,
పంచకోశములను విడచిన బ్రహ్మనిష్ఠయు ,,
పంచభూతంబులకు లంకెలు ద్రెంచివైచు ,,
పంచయజ్ఞాతీతదృజ్ఞ్యయ బ్రహ్మమే శ్రీ ,,
సచ్చితానందరూపము సత్యలోకము ,,
ఇచ్చలేనిమహాత్ములకు జగ దేకరూపము ,,
సర్వశూన్యంబప్రమేయము నర్వారోధము ,,
సర్వతోముఖమయి జగంబుకు సాక్షియైనది ,,
కారణము దృష్టాంతమును బొడ గానరానికి ,,
కోరువారికి గురుని జేరిన గోర్కెదీర్చును ,,
పంచపావక వెంకటార్యుని పానయుగళము ,,
చెంచురామ కవీంద్రునికి గరు ణించుచున్నది ,,
ఈ మహాశ్రీదివ్యనామము నెపరు చదివిన ,,
సోమ సూర్యాగ్నులనుమించిన గ్రామమిచ్చును ,,
సకలసుఖములు సకల సుఖములు సత్కరించును ,,
సకలమగు సంపదల నొసగు సంతతము శ్రీ ,,

కొం



ఆనంద మానందమాయెనే

*"రామ" శబ్దం ఎప్పుడో ఒకప్పుడు నోటంట రాక తప్పదు. అలా రామనామంతో పునీతము అయిన తెలుగునాడులో రామకథతో సీత, హనుమంతుడు - లక్ష్మణుడు ఆ కథా సరిత్సాగరంలోనిదే అయిన ఊర్మిళ నిద్ర-ఇలా అంతా రామ మయమైంది.

ఆ కథలోంచి ఆ చరిత్రలోంచి జానపదుల హృదయాల్లోంచి కమ్మగా, చల్లగా, వింతగా, పసందుగా - భక్తి రాగరంజితమై సుమనోహర జానపద కవితా కల్హారమై విడిసి విస్తరించింది. అందులోనివే ఈ రామాయణ సంబంధి పాటలు! *

ఆనందమానందమాయెనే శ్రీరాములు పెండ్లికొడుకాయెనే
అల జానకి పెండ్లికూతురాయెనే
ఇల జనుల సంతోషమాయెనే
సురమునులకు వినవేడుకలాయెనే
ఆనందమానందమేమందునే
ఆ సీతారాములు పెండిజూడ
సతిపతులు స్త్రీ పురుషులెల్లగూడెనే
చతురంగ బలములెల్ల చేరెనే
అతిమోదమున విప్రవరులెల్ల పొగడుచుండ
వశిష్ట వాల్మీకాదులొనర్చి వేగఅర్చించి
బ్రహ్మముళ్ళోసిరి అరుంధతినిజూపి బ్రమొక్కించిరి
అంగానమణులెల్ల సంతోషించిరి కట్నములాను ఇచ్చిరి
కొట్నములుదంచి కోమలులంతగూడి భూసురాంగనలెల్లగూడిరి
పుష్పతాంబూలచందనముల్ గూర్చిరి
పసిడిపళ్ళరములచేతబూనిరి
దశరధాత్మజునకు రయముతో హారతులొసగిరి
పంకజాక్షుని పెండ్లిజూడను
శంకర బ్రహ్మాదులెల్లగూడెను
ఇరువంకలజేరి కూర్చుండెను మంగళం



ఊర్మిళ

సుషుప్తి

ఊర్మిళ వెడదామనే అనుకొన్నట్టుంది - మరి ఎందుకనో లక్ష్మణస్వామి అత్తలకు సపర్యలంటూ ఇక్కడే వదిలేశాడు. అప్పటి నుంచీ ఆమె సుషుప్తిలోనే ఉంది. అయితేనేం - వచ్చీ రాపంతోనే కేళికా గృహంలోకి ఒక్క ఉదుటున వెళ్ళాడు-కీరవాణిని కన్నులారా చూశాడు- అమృత ధారలు కురియగా - ఆనంద లోకాలలోనే విహరించాడట - లక్ష్మన్న.

శ్రీరామభూపాలుడూ పట్టాభిషిక్తుడై కొలువుండగా
భరత శత్రుఘ్నులపుడు సౌమిత్ర వరుససేవలు సేయగా
మారుతాత్మజులప్పుడు రాఘవులచేరి పాదములొత్తగా
తుంబురు నారదులునూ ఏతెంచి నిలిచిగానముచేయగా
రంభాదు లాసభలలో ఇంతిశుభ రమ్యమున నాట్యమాడా
సనకాది మౌనీంద్రులు కొలువులో శాస్త్రములు తర్కింపగా
సకల దేవతలు గొలువ ఉదయాన పుష్పవర్షము గురిసెను
సభయంత కలయజూచి ఏతెంచె సంతోషమున జానకీ
పతిముఖము జూచినిలిచే వినయముతో పట్టియంజలి గ్రక్కునా
దేవ దేవేంద్ర వినుమా విన్నపము తెలిపేను చిత్తగింపు
ధరశేషు డవతరింప నొకచిన్న మనవి గలదని పలికెను
ముందు మనమడవులకును పోగాను ముద్దుమరదీ వెంటను
పయనమై రాగజూచి తన చెలియ పయనమాయెను ఊర్మిళా
వద్దు నీవుండుమనుచు సౌమిత్రి మనల సేవింపవచ్చె
నాడు మొదలుగ శయ్యపై కనుమూసి నాతిపవళించున్నదీ
ఇకనయిన ఆనతిచ్చి తమ్ముని ఇందుముఖి కడకంపుడీ
ప్రాణసఖి ఈలాగునా కూర్మితో పలుకంగ వినిరాముడూ
తలపోసి చూచెనంతా తనమదిని తగువిచారము బుట్టెను
ఆశ్చర్యపడి రాముడు గ్రక్కునా పిలచెలక్ష్మణ రమ్మనె
రమ్ము లక్ష్మణ గ్రక్కునా ఉచితమా రమణినెడ బాసిడుండ
తడవాయె ఇకనైనను ప్రియురాలి దగ్గరకు నీవుపోయి
సరససల్లాపములచే దుఃఖోప శ్రమనెల్ల మాన్పవయ్య
అన్న మాటలకప్పుడు అనుజుడు మహా ప్రసాదంబనుచును
అనిపించుకొని గ్రక్కునా సభవిడిచి చనుదెంచె తనగృహముకు

వచ్చెలక్ష్మణుని సెలవా సత్రంబు వాకిళ్ళు గదచిపచ్చి
కేళికా గృహముజొచ్చి లక్ష్మన్న కీరవాణిని జూచెను
కోమలీ పాన్పుపయినీ కూర్చుండి కోకసవరించివేగా
తొడగులను ధరించివేగా చల్లనీ తళ్ళుపూరించె మేనా
ప్రాణనాయకి పాస్పునా గూర్చుండి భావించె విరహమ్మునా
కొమ్మనీముద్దు ముఖమూ సేవింప గోరినాడే చంద్రుడూ
తాంబూల మెడబాయకు ఓపెనే నగుమోవి చిగురుకొనను
అమృతధారలు కురియగా పుకవే ఆత్మచల్లగ జేయవే
చిటితామరలు బోలెడి పాదములు క్రీంచి సత్వరమునా
తస్ను దామరిచిడన్నా ఆకొమ్మ తమకమున వణకదొడగె*



ఆలోచనా లోచనం

లక్ష్మణుడు శ్రీరామ చంద్రునితో అడవులకు వెళ్లాడు - సీతా వెళ్లింది-మరి లక్ష్మణుని విడిచి ఊర్మిళ ఒంటరిగా ఎందుకు ఉండి పోవలసి వచ్చిందో? ఉన్న ఆమె నిద్రలోనే ఉండిపోవడానికి కారణా లేమిటో ? ఆరా తీస్తే మన పుక్కిటి పురాణాలు చాలా కథలనే చెబుతాయి మరి ! సరే - అది అలా ఉంచుదాం. నిద్రపోతున్న ఊర్మిళకు ఎవరో తన వద్దకు వచ్చినట్లు అనుమానం కలిగింది. కళ్లు తెరచి, లేచి ఎవరా అని పరిశీలించలేదేమో - అందుకే లక్ష్మణుడే వచ్చినా - ''అయ్యో మీరెవ్వరయ్యా ? మీరింత తప్పు చేయగ వస్తిరే'' అని ప్రశ్నిస్తుంది.

అయ్యో మీ రెవ్వరయ్య మీరింత యాగదమ్ముల కొస్తిరీ
సందులు బొందులు వెదకుచు మీరింత తప్పు జేయగ వస్తిరీ
ఎవ్వరూ లేనివేళా మీరిపుడు ఏకాంతములకొస్తిరా
మాతండ్రి జనకరాజు వించెమిము యాజ్ఞసేయక మానరు
మాయొక్క భావవిన్నా మీకిపుడు ప్రాణమునకు హానివచ్చు
మాయొక్క మరదివిన్నా మిమ్మిపుడు బ్రతుకనివ్వరు జగతిలో
హెచ్చయిన వంశానికీ అపకీర్తివచ్చె నేనేమిసేతు
కీర్తిగల ఇంటబుట్టి అపకీర్తి వచ్చె నేనేమిజేతూ
ఒకడాలిని గోరిగాదా ఇంద్రునికి వొడలెల్లహీనమాయె
పరసతిని గోరిగాదా రావణుడు పూర్తిగా హతమాయెను
ఒకడ్డాలిని గోరిగాదా కీచకుడు ప్రాణాలు గోలుపోయె
ఇట్టి ద్రోహములు మీరు ఎరిగుండి ఎంత ద్రోహమున కొస్తిరా
ఆడతోడూ బుట్టలేదా మావంటి తల్లి లేదా మీకును
అనుచు ఊర్మిళ పలుకగా లక్ష్మణుడు వినివగచి ఇట్టులనెను
శ్రీరాము తమ్ముండనే అతడనగా సృష్టిలోనొకరు గలరా
జనకు నల్లుడుగానటే భూమిలో జనకులనగా నెవ్వరు
శతకమలముల బుట్టినా చేడిరో సీతకును మరిదిగానా
సీతయనగా నెవ్వరు భూమిలో సృష్టికర్తను నేను ఎరుగా
భూమినూర్మిళ అందురే నీపేరె బొంకవద్దీపట్టను
దశరథుల నెడబాసియు అక్కడా జానకి చెరబోయెను
రావణుని సంహరించి ఆధరణి దోవితోడుక వస్తినీ
చేకొన్న ఇందువదనా లోకాపకీర్తినే లోనొదును
సీతమ్మరదిని గానటే చేడెరో దయయుంచి మేలుకొనవే
నిన్ను బాసినది మొదలూ ప్రాణసఖీ నిద్రాహారము లెరుగనే
నీవు లేవాకున్నను ఓసఖీ ప్రాణములు నిలుపలేనే
అనుచుకన్నుల జలములూ కారంగ లక్ష్మణుడు తాబలికెను
కత్తియెరతీసి అపుడు సౌమిత్రి తావేసి కొందుననెను
అనుచు వాదము సేయగా ఊర్మిళా గద్దిని పడిలేచెను
ప్రాణేశుడగుట తెలిసి కోమలికి ప్రాణములు తేజరిల్లె *



లక్ష్మణోదార్పులు

*ఒక రోజా, రెండు రోజులా పదునాలుగేండ్లు ఒంటరిగా ఉన్న స్త్రీ ! ఒంటరితనం, ఆశలు, కోర్కెలు, అనురాగాల చిక్కిలిగిలులు–ఎన్ని ఓర్చిందో పాపం–ఊర్మిళ. అందుకే పదునాలుగేండ్ల బాధనీ కన్నీటి ప్రేమామృతంతో భర్తముందు కుప్ప ఓసింది– "చిత్త మొక దిక్కు నుంచీ సమయమున చిన్నబుత్తురు ఇంతులా..." అని ఎంత కాదన్నా స్త్రీ కదా–అంటూంది. కుటుంబ జీవనంలో ఇవి అందరికీ అనుభవైక వేద్యేలేకావాలి మరి ? *

ప్రతిపాద పద్మములకూ ప్రణమిల్లి పదతిలేపక ఉన్ననూ
పాదముల పయినఉన్నా తనసతిని కరమునా లేవనెత్తె
చూసికౌగిట చేర్చియా కాంతకు కండ్లజలముల దుడిచెను
మాతండ్రి జనకరాజూ మిమునమ్మి మరచిపెండిలి జేసెను
మానవ తల్లుడనుచు తెలయకా మదినియుప్పొంగుచుండె
చిత్తమొక దిక్కునుంచి సమయమున చిన్నబుత్తురు ఇంతులా
అనుచు ఊర్మిళ బలుకగా లక్ష్మణుడు మనసులో చింతించుచు
దుఃఖవశమున బలికినా ఉండేటి సుదతి భావమ్ము తెలిసి
చింతింప నిక నేటికే ఓబా అనిఇట్లు లాలించును
తరుణి పదునాలుగేండ్లు నినువిడిచి ధరియిస్తినే ప్రాణమూ
ఆహార నిద్రలూను ఎరుగనే యతివ నీమీదయాన
పుణ్యపురుషుల స్త్రీను ఎడబాసి పూర్వజన్మమున మనమూ
ఎన్నెన్ని యుగములైనా ఇదిమనకు అనుభవింపక తీరదు
సతిపతుల చింతజూచి కౌసల్య సంపెంగ నూనెదెచ్చి
రత్నపీఠము నుంచియా కౌసల్యదంపతుల శిరమంచెనూ
గంధమట చెలితెచ్చియు ఒక్క చెలి పన్నీట జలకమార్చె
మేలయిన వలిపట్టుతో లక్ష్మణుకు మేలుకళ్ళోత్తిరపుడు
బంగారు పూలపట్టు ఊర్మిళకు బాగుమీరా గట్టును
కోటిసూర్యాదీప్తితో వెలిగేటి మేలయిన రవికదొడగె
ఆభరణములు సొమ్ములు ఆయారులక్ష్మికే యలంకరించి
ముత్యాల తిరుచూర్ణము లక్ష్మన్న ముద్దుముఖమున దీర్చెనూ
రత్నాల కంఠమాల లక్ష్మన్న రంజిల్ల ధరియించెను
వెలలేని మాణిక్యము పతికూడి నిలువుటద్దము జూచెను
సిగ్గుపడి శిరసొంచుక ఊర్మిళా చిరునవ్వుతో నిలచెను
భోజనపు శాలలోన ఆయాణి ముత్యాల పీటమీద
రాజశేఖరు దప్పుడు దేవేంద్ర భోగముతో గూర్చుండెను

మరదలా మాణిక్యమా రమ్మన్న మగువతోడుకవచ్చెను
మురిపెంపు సిగ్గుచేతా చిలుకలా కొలికి ముఖమట వంచుచూ
హంస నడకల చేడెతా పాదముల యందెలటు రవముజేయ
వయ్యారమూ జూపుచూ ఉండె నొక ఒప్పులా కుప్పవలెను
కులుకు ముద్దుల గుమ్మను సుమిత్ర కొడుకు బొత్తుక ఉండెను
బంగారు పళ్ళెరములా పంచదారములు వడ్డించెను
వెండి గిన్నెల నేతులు కౌసల్య వేడుకతో వడ్డించెను
ఆవు నెయ్యి తిరసమును సుమిత్ర కొమరునికి వడ్డించెను
కౌసల్య గౌరవమున బట్టి దవ్వుల శాంతాతాను బలికె
అన్న పదునాలుగేండ్లు అడవిలో ఆహార నిద్రలూను
ఉన్న బడలిక తీరగా నేడు మన ఊర్మిళతో నారగించు
పిండి వంటలు నేతులు ఉబ్బట్లు దండిగా నారగించు
మీగడా పెరుగు మీరు మజ్జిగలు వాంఛ తీరగ త్రాగుడి
ఆరగించియు లేచిరీ సంపూర్ణ మారగించి నిలచిరీ
గంగ జలమున హస్తమూ కడగి తాంబూలములు సేయుచుండ్రి
చేడె వినవే శాంతకి తెలియ ఈ ఊర్మిళా బుద్ధులన్నీ
పయిడి పానుపు పోలి ఉండెనొక పదునాలుగేండ్లు పణతి
కుందనపు ప్రతిమలూ ఈ కళలు ఎందుండి దాగున్నవో
దృష్టి తగులావుండను నీలలు నివ్వాళు లివ్వరమ్మా
అని శాంత పలుకగాను విని సీత వినయముతో నిట్టులనెను
సృష్టంత ఏలేటియో శ్రీరామచంద్ర లక్ష్మణ దేవరా
భరత శత్రుఘ్ను మొదలు అయినట్టి పట్టాభిషేకులమ్మా
ఇంద్రాది చంద్రులూను వలచేటి చంద్రులు మీ తమ్ములు
దృష్టి తగలాకుండను నీలాల నివాళు లివ్వరమ్మ
అని సీత బలుకగాను విని శాంత నవ్వుమూ ఇట్లనియెను
అక్క చెల్లెండ్రు మీరు మిక్కిలి సౌందర్య శాలులమ్మ

మా తమ్ములు నలుగూరిని వలపించు జాణలకు దృష్టి తగులు
అని శాంత బలుకగాను విని సీత నవ్వుతూ ఇట్లనియెను
మాయన్న ఋష్యశంగు నీ వనములో గూడి బాయకున్నను
యేమి యెరుగని తపసిని ఓ వదినె కేళించి విడిచినావు
తామర కమలమందు పుట్టి ఈ ధరణిపయి నిలువలేకా
ఈశ్వరా జనకు నింట ఈశ్వరా ధనువు ఖండించి వేయా
కోమలిసీత నీవూ కోడలవు పావనమాయె గృహము
అలసి వచ్చిన కొడుకుకూ సుమిత్ర సాంసపానుపు బఱచెను
పట్టు తలగడలు పఱచి పాన్పుపయి పన్నీరు జిలకరించి
వట్టి వేళ్ళా సురటియు ఒక కీరవాణి యక్కడ నుంచెను
గంధ కస్తూరి పునుగూ జవ్వాది గిన్నెలలో తెప్పించెను
పచ్చి పోకలు నాకులు ముత్యాల సున్నమక్కడ నుంచెను
సంపెంగ పువుల గాలి తలుపులప్పుడు వేసిరి
మల్లెపూవుల గాలియా విసరగా శయ్యపయి కూర్చుండిరి
కీలుకొప్పమర విడిది లక్ష్మణుడు నేర్పుతొ జడలల్లెను
భొండుమల్లెల జాజులూ జడపయిని శృంగారముగ జుట్టెను
తాంబూలములు వేయుచూ దంపతులు కలసి ముచ్చటలాడుచు.
అక్క చెరపోయిన విధమును ఏమని నడిగెనప్పుడు ఊర్మిళా
సింహ విక్రములు మీరు ఉండగా రమనెట్లు చెరపోయెను
రాజ్యాధిపతులు మీరు ఉండగా వనిత ఎట్లు చెరపోయెను
కౌసల్య మొదలు నయినా సుమిత్ర కైక శాంతదేవులూ
గద్దె పీటలు వేసుక మరుగునా సద్దు సేయక ఉండిరి
రామలక్ష్మణులు మీరు ఉండగా తమనెట్లు చెరబోయెను
అనుచు ఊర్మిళ పలుకగా లక్ష్మణుడు విని మగుడి ఇట్లనియెను
తలవిధి గడుప వశమా ఎవరికైన బహ్మకైనాయని
అయోధ్య వెడలి మేము అందొక్క పర్ణశాలను నుంటిమి

బంగారు మాను మృగమూ ఆ పర్ణశా వాకిట కొచ్చెను
ఆ మృగమును తెమ్మనుచును మీ అక్క స్వామి కాళ్ళకు మ్రొక్కెను
విల్లంబు చేతబట్టి శ్రీరామచంద్రులు వేటకు కదలి
హా సీతా! హా లక్ష్మణా! అని పలుక యతి భీతిల్లి పలికె
నన్ను పొమ్మని పలికినా ఎరుగపూ తల్లి వద్దంటి నేను
కర్ణ శూలంబు లయినా వినరాని మాటలే నన్నాడెను
గిరిగీచి యానబెట్టి - పోయితిని మాయున్న దగ్గరికిని
పోయినంత వేగమూ రావణుడు మాయ వేషము వేసుక
నారాయణ యనుచు వచ్చి నళినాక్షి ఎదుటనే నిలుచుండెను
హరిదాసుడాని తోచి ఆ మగువ యతివేగ భిక్ష పెట్ట
పది తలల జూడగానే ఆ చెలి పడి మూర్ఛలేబోయెను
గడ్డతో పెళ్ళగించి ఎత్తుకొని పోయెనే తన లంకకూ
బసిడి మృగమును బట్టుక శ్రీరామచంద్రులు యే తెంచిన
వనమెల్ల జూచివెదకి ఆపర్ణశాలెల్ల వెదకియలసి
కిష్కింధ పర్వతాన వెదకగా పరమఋషి సుగ్రీవుడూ
కౌసల్యా తనయుండని సుగ్రీవుడు కానుకలు తెచ్చిచ్చెను
కానుకలు విప్పిజూడ అందులో జానకి తొడవులుండె
తమ్ముడా రమ్మనుచును - ననుబిలిచి తనకుచూపెను తొడవులు
ఇన్ని తొడవులు ఎరుగను శ్రీరామ సూర్యోదయముకొక్కా
ఇందుముఖ పాదమ్ములా ఉండేవి యందెలటు నమ్మిస్తినీ
అంజనీ సుతునిపిలచి ఆ రాము ఉంగరము చేతికిచ్చి
ఆసవాలెల్ల జెప్పి అంపెనే దేవిని చూచిరమ్మని
వారధి దాటిపోయి అశోక వనమెల్లి వెదకిచూచి
ఉంగరము దేవికిచ్చి మాణిక్య మందుకొని మాటలాడి
తిరిగివచ్చియు వేగమే శ్రీరామచంద్రుని ఎదుట నిలిచి
రాజభూపాలచంద్రా మీసతిని ఏవిధంబున దెత్తును

తలలెల్లా జడలుగట్టి ఉన్నదీ ఉదరమున వెదురు మొలచి
తల్లి ఉండే విధమును తలచితె తాళశక్యము కాదయా
దుఃఖవశమని జెప్పినా రాఘవులు విని మూర్ఛబోయి తెలిసి
ఆలంక చుట్టు నెలసి రావణుని అక్షోహిణిబలముల బరిమార్చెను
శృంగారము చేయుచు తెమ్మనెను సీతను తన యెదుటకు
తెచ్చి శ్రీరాము నెదుటా నిలిపితే యచ్యుతం దిట్టులనియె
పదినెలలు చెరయున్నయీ భామతో భాషించనని పలికెను
వట్టిసత్యము లేటికి ఓరామ చిచ్చుగావించు మనెను
ఆకాశమంత పొడవూ మంటలో మావదినె మాటలాడె
జగమూలు నిండునటులు జలములు తటాకమై ఒప్పెను
పరమపతివ్రత గనుకను మావదినె పట్టినే రాముచెట్ట
సీత శ్రీరాములకును సృష్టిలో కట్టిరయోధ్యపురము*

సీతమ్మ వేవిళ్లు!



*ప్రకృతి చాలా విచిత్రమైనది.

అది ఉన్నదానిని లేనిదానిని బట్టి ఉండదు-పూరి పాకలో అయినా అంతఃపురంలో అయినా స్త్రీ మాతృ మూర్తి అవుతూందంటే—మన భారతీయ తత్త్వంలో ఒక గొప్ప విశేషం. ఆలా మాతృశ్రీగా నిలవడానికి ఎన్ని పరీక్షలు-ఎన్ని అనుభవాలు-అనుభూతులు. శ్రీరామప్రభుని సహధర్మచారిణిగా సీతమ్మ తల్లి కాబోతూంది-నిజంగా అదే జరిగింది-సీతమ్మకూ తప్పలేదు వేవిళ్లు-ఈ వేవిళ్లూ అందరికీ ఓలా ఉండవు. కొందరికి మట్టి ఇష్టం-కొందరికి చింతపండు-మరొకరికి పచ్చి వెలక్కాయ - ఏమిటో ప్రకృతి*

స్పష్టంత ఏలేటి రామచంద్రులు
రాజ్యపాలకులయిన రామచంద్రులు
ఎదురు లేకా భూములు ఏలుచున్నారు.
ఆనంద భక్తులయి అయోధ్యలోను
అంతట జనకసుత గర్భంబులాంచె
నెలవెళ్ళి రెన్నెళ్లు అమరియుండగను
వేవిళ్ళు ఘనమాయె లోపల్కులాయె
తలవాల్చి కుడి చెయ్యి తలక్రింద నుంచి
పాన్పుమీద పవళించె పద్మాయతాక్షి
అన్నము ముట్టదు ఆ రామసీత
తాంబూలము వెయ్యదు సర్వేశ్వరులదేవి
నిత్యతన దాసీల నిల్చి పిలువాదు
పాదాలు వత్తుమని పణతిపల్కాడు
మధురాలమామిడి పండ్లయినగోరు

అతివ అరటిపండ్లయినగోరు
కాంత ఖర్జూరములయినగోరు పణతి పసస పండ్లయినగోరు
వలది వెలగ పండ్ల యినగోరు నాతి నారంజిపండ్లయినగోరు
బాటకొమ్మలమీద పండ్లయినగోరు చింత గొమ్మలమీద చిగురయినగోరు
దోర చింతలుగోరు యాపద్మగంధి
ఈ రీతికోరికలు గోరుచుండగను
ముగుదకు ముత్యాల పట్టెడేసడలె
నాతినడుము వడ్డాణమెసడలె
పణతిచేత గాజుబంతులెసడలె అచ్చనవరత్నాల
పేరువులె సడలె అనేక రత్నాల సొమ్ములె సడలె
పాన్పుమీద పవళించె బద్మాయతాక్షి
రాముడు తనసతి మేడకు వచ్చి రెప్ప వేయక కన్ను విప్పి
మోహాము తప్పక జూచెను తరుణి తావంక రణభీతి గొనిరమ్ము
రామచంద్రులు ఏమి జనకసుత నీవున్నవిధము
కారడవి తిరిగావు కష్టపడినావు ఆనాడు ఈరీతి పడియుండలేదు
అదవులన్నియు తిరిగి ఆకుభక్షిస్తే ఆనాడు ఈరీతి పడియుండలేదు
బావుల నీళ్ళన్ని జేదివడిత్రావి ఆనాడు ఈరీతి పడియుండలేదు
ఎండలో ఎండి వానలోనే తడిసి ఆనాడు ఈరీతి పడియుండలేదు
పండుటాకులవలె వాడిఉన్నావు పారుటాకువలె పవ్వళించావు
నీ విధము కెరెగింపవలెను గాజులమరించినా
గడపలుదాటి ముత్యాల మర్చినా
ముంగిళ్లు దాటి పగడలమర్చిన పందిళ్ళుదాటి పచ్చలమర్చినా
రచ్చల్లు దాటివచ్చెనే రఘురాము లక్ష్మన్న కడకు,
అల్లంతటొచ్చేటి అన్న పొడజూచి
పొడగని ముమ్మారు ప్రదక్షిణంచేసి నాష్టాంగ దండ ప్రమాణంబుజేసె
వందనము జేసికడు ముందరానిలిచి
అన్నవిను లక్ష్మణా విన్నపమునాది
అన్న మీవదినెంత బడిలిఉన్నది కారడవి తిరిగినది కష్టపడినాది
ఆ నాడు ఈ రీతిపడియుండలేదు
అదవులన్ని తిరిగి ఆకుభక్షించి ఆనాడు ఈరీతి పడిఉండలేదు.
బావుల నీళ్ళన్ని చేదివడిత్రాగి ఆనాడు ఈరీతి పడియుండలేదు
ఎండ లోనే ఎండి వానలోనే తడిసి అనాడు ఈరీతి పడియుండలేదు
పండుటాకుల వలె వాలి

ఉన్నాది పారుటాకువలె పవ్వళించింది
నా చేతి కొక్కటి ముద్దుటుంగరము, ముంజేతి దొడగొచ్చు
శ్రీ లక్ష్మన్నా ఆయింతి గర్భిణిని తా విచారించి
మనసు సంతోషాన మరి పొంగుచుండె
పాలుపొంగినట్లు పొంగి లక్ష్మన్న
నక్షత్ర పర్వతం నడిచినట్లుండె
చుక్కలా పర్వతం జూచినట్లుండె
అటులయితె మా వదిన్ని జూచివత్తూరు
అంబులు ఆయుధాలన్ని అన్న కడనుంచి
బిగదీసి లక్ష్మన్న పడికట్టుకట్టె
లక్షవేలా అడుగు తాచేపట్టే వచ్చెనె
లక్ష్మన్న వదిన తావుకు అల్లంతటొచ్చేటి
మరిది పొడజూచి, కాళ్ళ పాపిరాపె కడుశీఘ్రముననను
బంగారు చెంబుతో పన్నీరు దెచ్చి
పాదములు కడిగించె నా రాముదేవివు
బంగారు తీగెలా దివాసి బరచి,
వచ్చకర్పూరాన తాంబూలంజుట్టి,
అలసలసి వచ్చారు కూర్చుండవయ్యా
సాష్టాంగదండ ప్రమాణంబు చేసె
వందనంజేసి కడుముందరా నిలిచి
అమ్మ మేము పోతాము ఆజ్ఞ ఇవ్వండి
వేగిరం మీయన్న కడకు పొండయ్యా
కడువేగ మీయన్నకడకు పొండయ్యా
గాజులమర్చినా గడపలుదాటి ముత్యాలమర్చినా ముంగుళ్ళు దాటి
పచ్చలమర్చినా రచ్చలుదాటి పగడాలమర్చినా పందిళ్ళుదాటి
అల్లంతవచ్చేటి అన్న పొడజూచి, పొడగనిముమ్మారు ప్రదక్షిణంచేసి
సాష్టాంగ దండ ప్రమాణంబుచేసె
వందనంజేసి కడుముందరా నిలిచి
మీకంటెఘనులు పుట్టునున్నారు
మీరేలు రాజ్యము లేలునన్నారు,
మీరెక్కిన సింహాసనం ఎక్కనున్నారు
మీరు పట్టు ఆయుధం పట్టనున్నారు

ఆ యింతి గర్భిణీని తావిచారించి
మనసులో సంతోషం మరి పొంగుచుండె
పాలుపొంగినట్లు పొంగు రఘురాము, నక్షత్ర పర్వతము గడచినటులుండె
చుక్కలాపర్వతం జూచినట్లుండె
ఆ లంకలోపలాదండుదిగిరాగ,
అక్కటా రావణాబ్రహ్మ గూతురలగి తన అత్తింటికెళ్ళి
పోగాను హస్తముల చేపట్టి ఎత్తలేనయితి నిండుగాఉన్నది నీలభద్రి
ప్రక్కలు నిండు పంజాజగంధి ఆయింతికదిముదురు గర్భిణాయన్న,
వెండిబల్యాలువారు వెయిలక్షవేలు
రాగిబల్యాలవారు లక్షవెయివేలు
కంచుబల్యాలువారు కమ్మకున్నారు
పాదాల చప్పుడు పణతి వినకుండ
పాన్పుమీదకొచ్చిరి పద్మనాభులు
గూర్చున్న దాసీలు నిల్చుండిరంత
ఆడవలె ఓడవలె గెల్వవలెగాని ఆటవిడిచి మీరు లేవపనిలేదు
చిరునవ్వునవ్విరీ దాసీలంతా, ఉత్తరం దక్షిణం జూచెనాదేవి
తూరుపూ పడమరా చూచెనాదేవి ఆడేటి సొగటాలు ఆటపారవేసి
పాన్పుమీద కొచ్చెను పద్మాయతాక్షి
గ్రుచ్చి కౌగిలించి ఎత్తి తొడనుంచి అటుకులు చక్కెరా మంచివస్తువులు
ఈ మాట మా అమ్మకు చెప్పిపంపితేను ఈక్షణము తెప్పిస్తు ఇందీవరాక్షి
పాలపండ్లు మంచి ఖర్జూరమూలూ ఈక్షణము తెప్పిస్తు ఇందీవరాక్షి
ఆనాడు నీ మేడకొచ్చితినేదేవి
చాలా చిక్కుంటివే చదరాలనీవు
ఆనాడు నీచెంత నేపవ్వళిస్తె చాలా చోటాయనే దరాలనాకు,
ఈనాడు నీ మేడకొస్తినే దేవి
చాలనిండుంటివే చదములదేవి
నీ సుతులు నీవూను పయిబవ్వళిస్తే పాదముల క్రిందనే నేపవ్వళిస్తు
రాజాధిరాజులకు విన్నపమయ్యా రాజులు ఎల్లరకు విన్నపామయ్యా
ఆ మాట మీరేల ఆజ్ఞచేసేరు మా మీద దయయుంచి మమ్మురక్షించు
దండంబు నీకు రఘురామ ప్రభుత *

63

బంగారు చెంబులో...



*మేలుకో ! అని సంబోధిస్తూ దేవుడిని మాటల్లో పాటల్లో పని పాటుల్లో నిద్రలేపడం ఆడవారి నమ్మకానికి గుర్తు. ఏమిటో - ఆలా దేవుడన్న ప్రతివాడినీ ఇలా మేలుకొలుపుల పాటల పేరిట లేపడం జరుగు తూనే ఉంది. కాని-ఇన్ని యుగాలుగా ఏ ఒక్కభక్తుని మేలుకొలుపుకైనా కాస్త గుండె కరిగి ఓయని-నేనున్నానని - వచ్చాడా ? అపసమ్మకంతో కన్నా-ఉన్నాడనీ, ఏదోచేస్తాడనీ సమ్మతిస్తూ ప్రబతకడంలో గట్టి సంతృప్తి ఉందేమో ! *

బంగారు చెంబులో పన్నీరు పట్టుక
పణతిరుక్మిణి వచ్చె మేలుకో
రంగైన బంగారు కొంగోర బూసుక తరుణి సత్యభామవచ్చె॥మే॥
దంతకాష్టము బూని తామరసాక్షి సుదంత వచ్చియున్నది ॥మే॥
అంతకు ముందె రుమాలుపట్టుక జాంబవంతుని సుతవచ్చె ॥మే॥
పొందుగా కస్తూరిబరిణెపట్టుక కాళింది వచ్చి ఉన్నాది ॥మే॥
అందముగ నిలువుటద్దమపట్టుక మిత్రవింద వచ్చిఉన్నాది ॥మే॥
బాలభోగంబులు పంచదారతేనె సుభద్ర తెచ్చిఉన్నది ॥మే॥
వాలాయముగ తాంబూలము పట్టుక లక్ష్మణవచ్చి నిలుచున్నది॥మే॥
ముదముతో వీణవాయించుచు వేవేగపద్మనాభవచ్చె ॥మే॥
బదియారువేల గోపికలు సొగటాలపాళిదెచ్చి ఉన్నారు
॥మేలుకో తెల్లవారవచ్చెను॥

మరో పిలుపు

దీనుల రక్షింప దీక్షవహించిన దేవదేవ నిద్రమేలుకో
బూనికతో నిను బూజించువారల పోషింపవలెవేగ మేలుకో
ఘోరనాయన సంసార బాధల గడతేరలేరు జనులు మేలుకో
దారిజూపివారి దరిజేర్పకున్న నెవ్వారుదిక్కు మేలుకో
ఎంతో వేడుకొన్న సుంతయిన కృపజూడనింతపరాకేల మేలుకో
చింతాలుదీర నీ చెంతచేరినాము మేలుకో
సీటుగ వీణలు మీటుచు బోటులు పాటలు పాడేరు మేలుకో
మేటిదొరవని మేలుకొల్పుదు రీపాటి నిద్రచాలు మేలుకో



సువ్వి హా సువ్వి

సువ్వి రామచంద్ర సువ్విసువ్వి
కీర్తిసాంద్ర సువ్విసువ్వి
సీతమ్మ మాకు శుభములిమ్మా సువ్విసువ్విలాలి
సృష్టికోసు సీతమ్మ సమర్థకొట్నాలుదంచ
వేచ్రతో పేరంటాండ్రు వేగవచ్చిరీ
సువ్విసువ్వి రామచంద్ర శుభములిమ్మా
పసిడి రోకల్లుబట్టి పద్మముఖులు సువ్వీదంచ
కమలపాడుగాయ కౌసల్యకప్పుడు
సువ్వి రామచంద్ర సువ్వికీర్తిసాంద్ర
సువ్విసువ్వి సీతమ్మ మాకు శుభములిమ్మా
ఘల్లుఘల్లు మనుచు హస్తకంకణమ్ములూ గదల
గొబ్బరి బెల్లము కోరిదంచిరీ సువ్వి రామచంద్ర సువ్విసువ్వి
కీర్తిసాంద్ర సువ్విసువ్వి సీతమ్మా మాకు శుభము లిమ్మా
నువ్వులాపప్పుదంచి నూటికీ పంచిపెట్టి
ఘనముగా పేరంటాండ్రు కలసి దంచిరీ
సువ్వీరామచంద్రా సువ్వికీర్తిసాంద్ర సువ్విసువ్వి సీతమ్మ మాకు
శుభములిమ్మా *

వేదాంత పర పాటలు



వేదాంతపరం, తత్త్వప్రబోధ పూరితం అయిన పాటలు చాలా రూపాలలో ఉన్నాయి. 'తుమ్మెదా' అన్న సంబోధనతో నడిచిన వేదాంతపర పాటలు విన్నాం. 'నరుడా' అన్న సంబోధనతో, 'చిలుకా' అన్న సంబోధనతో, 'కూసమ్మ' సంబోధనతో, "ఒరే ఒరే", "నిజం నిజం", "మనసా" సంబోధనలతో వేదాంత పరంగా ఎన్నో పాటలు మనకు వినిపిస్తూనే ఉన్నాయి.

తెలుగునాడున ఎందరో యోగిపుంగవులు జన్మించి ఎన్నో తత్త్వాలను ప్రబోధించారు. అవి చాలా ప్రచారంలో ఉన్నవే!

అసలు మన తెలుగుసీమను పరికిస్తే గ్రామానికో 'సిద్దప్ప', నగరానికో 'బ్రహ్మం' ఉన్నారా అనిపిస్తూంటుంది.

పేరుతో కొందరు, అజ్ఞాతంగా మరికొందరు, ఎదుటి వ్యక్తిమీద పెట్టి మరికొందరు, కాకిమీదా, చిలుకమీదా, చెట్టుమీదా, పుట్టమీదా అలా ఎన్నో రచనలు వెలువడినాయి !

ఈ తత్త్వాలను చదువుతూంటే-వింటూంటే మనం కూడా వయసు మళ్ళి, జీవితంమీద విరక్తి చెంది, ఆ దివ్య ప్రబోధపు పోలిమేరల్లో అడుగేసి సిద్ధప్ప శిష్యులుగానో, బ్రహ్మంగారి శిష్యులుగానో అయి, మనకు తెలియకుండానే–మన లోంచి ఒక్కసారి 'వేదాంతం' పెళ్లుబికి తొంగిచూస్తుంది - మనుషున్ని అంతగా అవి ఆకర్షించి ఆకట్టుకుంటాయి.

ఈ మాటలు ఎంతవరకూ నిజం అన్నది ఈ క్రింది పాటలను పరికించడం ద్వారా పరిశీలిద్దాం :

మూన్నాళ్ళ ముచ్చటకు
మురిసేవు తుళ్ళేవు
ముందుగతి కానవే - చిలుకా
ఓ రామచిలుకా ! ॥మూ॥

ఏనాడూ ఏ తీరా
ఎవరు చెప్పాగలరు ?
మూడుగతి కానవే - చిలుకా
ఓ రామచిలుకా ! ॥మూ॥

ఊరికి ఉత్తరాన
టూపులా చెట్లలోనా
ఉండాది నీ ఇల్లు - చిలుకా
ఓ రామచిలుకా ! ॥మూ॥

ఈ ఇల్లు ఈ దొడ్డి
ఇల్లాలు పిల్లలూ

ఏది శాశ్వతమమ్మ-చిలుకా
ఓ రామచిలుకా ! ॥మూ॥

శత్రులే పుత్రులూ
రుణపోళ్ళు చుట్టాలు
భార్య మెడకూ లంకె-చిలుకా
ఓ రామచిలుకా ! ॥మూ॥

నీ మేలు నీ మంచి
నీ వరము కానుకో
నీకు ఎవ్వరులేరు-చిలుకా
ఓ రామచిలుకా ! ॥మూ॥

ఇల్లు యిల్లన్నావు
ఇల్లు నాదన్నావు
ఇంటిలో ఏముంది-చిలుకా
ఓ రామచిలుకా ! ॥మూ॥

కట్టులే సుట్టాలు
బట్టలే బంధువులు
పై బట్టడాముడే-చిలుకా
ఓ రామచిలుకా ! ॥మూ॥

ఆలాగే మరో తత్త్వం చూదాం :

తెలిసీ తెలియక నీవు
చెడిపోకే మనసా-నీ
తలపు రాముసిపైనా
నిలుపావె మనసా ! ॥తె॥

ఆరుమూటిని కూడి
కోరాకే మనసా-నీ

వాడూ మూడై పోకు
అయ్యయ్యో మనసా ! ॥తె॥

సిరి సంపదలూ చూసి
మరువాకె మనసా !
ఇది తెరచాటు బొమ్మలాట
తెరువే ఓ మనసా ! ॥తె॥

ఆలీ బిడ్డల చూసీ
అతి మోహపడకే-సీ
కన్నీ జన్మములా
వారేరీ మనసా ! ॥తె॥

పర భామలాపేక్షా
పడబోకే మనసా-సీ
పర లోకాయమ బాధ
పడలేవె ఓ మనసా ! ॥తె॥

ఉన్నవారిని చూసి
ఉబ్బాకే ఓ మనసా
పర తత్త్వ మార్గంబూ
గనుగొనవే ఓ మనసా ! ॥తె॥

అలాగే 'కూనలమ్మ' పదాలని తత్త్వ పూరితమైనవి చూదాం. ఈ ''కూనలమ్మ పదాలు''కు ''కూనిరాగాల''కూ సంబంధం ఏమిటో ?

ఈ కూనలమ్మ పోతరాజు భార్యకూడా ! ఈ 'కూనలమ్మ' పదం, శబ్దం చాలాచోట్ల వినిపిస్తూంటుంది.

అన్న మిచ్చినవాని
నాలి నిచ్చినవాని

సపహసించుట హాని
ఓ కూనలమ్మా !

అడితప్పినవాని
నాలి నేలనివాని
నాదరించుట హాని
ఓ కూనలమ్మా !

భీష్ముడనుభవశాలి
భీముడే బలశాలి
కర్ణుడే గుణశాలి
ఓ కూనలమ్మా !



దుర్యోధనుడు భోగి
ధర్మ రాజొక జోగి
అర్జునుండే యోగి
ఓ కూనలమ్మా !

కవితా రసపుజల్లు
ఖడ్గాల గలగల్లు
కరణాలకే చెల్లు
ఓ కూనమ్మా !

కాపువాడే రెడ్డి
గరిక పోచే గడ్డి
కానకుంటే గుడ్డి
ఓ కూనలమ్మా !

మగని మాటకు మాట
కెదురు బల్కెడి బోటి
మృత్యుదేవత సాటి
ఓ కూనమ్మా!

జపతపంబులకన్న
దుచవు సాములకన్న
ఉపకారమే మిన్న
ఓ కూనలమ్మ ! !

చాలాకాలం క్రిందటే వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ ''బాలభాష''లో ఈ ''కూనలమ్మ పదాల''ను ఇచ్చారు. ఈ పాట ఇంకా ఉన్నట్లు తోస్తుంది.

ఓ కోడలమ్మ !
ఓ కోడలమ్మ !!

ఆదరగొట్టేవాని
హద్దుమీరేవాని
ఆదరించుట మోసమన్నా !



ఆడి తప్పినవాని
ఆలి మరచినవాని
ఆదరించుట మోసమన్నా !!

ఇలాంటి చరణాలు అక్కడక్కడా ''కూనలమ్మ'' మాదిరిగానే ''ఓ కోడలమ్మ'' సంబోధనగా వినిపిస్తాయి !!

''ఏగంటి'' పదాలు కొన్ని ఉన్నాయి. "ఏగంటి లింగా'' అని సంబోధించినవిలాంటివి. ఈ క్రింద చిలుక ప్రబోధంలో ''యాగంటి గురుపాదములు చేరి..." అన్నది గమనార్హం.

చెలగి చెప్పెద బుద్ధి
చేకొనీ వినుసీదు
చింతమీదా నుండు - చిలుకా !
కులముతో వైరంబు
కొరగాదు విక్కిలీ
గూడు వెళ్ళకయుండు - చిలుకా !

పట్టుబడలేని యాపదలకై
కెమ్మోవి పండ్లకీ రాకుమీ - చిలుకా !
పట్టముట్టగరాని బట్టబైటను తేనె
పండువున్నది చూడు - చిలుకా !

గురులైన యాగంటి
గురుపాదములు చేరి
గిరగడుచియమీది - చిలుకా !
సిరులు మాయని తెలిసి
జీవగుణమది యెరిగి
చిగురు వేతలబోకు - చిలుకా !!

"బేట్రాయి సామిదేముడా" అని, "పేట్రాయి సామిదేముడా" అని కూడా వినబడే ఈ పాటలు అవతారములను గురించిన వర్ణన. దీనిని తూర్పు గోదావరి జిల్లా ప్రాంతాలలో సంపాదించినదని గుర్తు. రెండు రకాలుగా కను పించే ఈ పాటలను రెంటినీ పరికిద్దాము :

పేట్రాయి సామిదేముడా
మమ్మేలినోడ
పేట్రాయి సామిదేముడా !

కాటమీరాయుడా
కదిరి నరసిమ్ముడా
నీ పెన యాటకాడ
నిన్నె గోరి నమ్మినోడ ॥పేట్రా॥

చేప కడుపున చేరి
పుడితివి రాకాసి గాని
కోపమూని
కోరి కొడితివి

ఆ పెన్నీటిలోన
బలసి గ్రక్కున దూరి
బాపనోళ్ళ సదువులెల్ల
బెమ్మదేవుడి కిచ్చినోడ ॥పేట్రా॥

రాబేలై తాను
పుట్టగా ఆ నీళ్ళకాడ
దేవాసురులెల్ల గూడగా

తావు సూపి కొండ క్రింద
దూరగానె సిల్కినపుడు
చావులేని వెన్నముందు
దేవర్ల కిచ్చినోడ ॥పేట్రా॥

అందగాడ వవుదులేవయా
గోపాల గోవింద
రచ్చింప రావయా

పందిలోన సేరుకోని
పంటభూమి నెత్తి క్రింద
సిందర సిందర సేసినట్టి
సందమామ నీవె కావ ॥పేట్రా॥

నారసిమ్మ నిన్నె నమ్మితి
నీ నాడనే
కోరితి నీ పాదమే గతి ॥పేట్రా॥

ఔర కొలువు కంటాన
సేరి పెమలాడు గాసి
కోరమీసమైన
శత్రుగుండెలగల జీల్చినోడ ॥పేట్రా॥

బుడుత పాపనయ్యె తివీ
ఆ చక్రవర్తి
నడిగి భూమి
తెలుసుకొంటివీ !

పొడుగు కాళ్ళోడవై
అడుగువానిమీద బెట్టి
తడవులేక లోకమెల్ల
పుడిక్కొని తిరిగినోడ ॥పేట్రా॥

రెండుపదులు ఒక్క మాఱుతో
ఆ దొర్లనెల్ల చెండాడి
తారపరసుతో
చండకోలబట్టి
కోదండరామసామి కాద
చెండుకోల సేసుకోని
కొండకప్పు డేగినోడ ॥పేట్రా॥

రామదేవ రచ్చింపరా
మా కెల్ల భూమిలోన
బుద్ధి సెప్పరా !

ఏమి తప్పు సేసినోడ
సామినాయప్ప బుద్ధి
నీ మనసు చల్లదనము
మా మీదా సూపరోరి ॥పేట్రా॥

దేవక్కదేవి కొడుకురా మా కెల్ల
దేవుడై నిల్చినావురా

ఆవుల మేపుకోని
ఆదోళ్ళ గూడుకొని
తావు బాగ సేసికోని
తకిడి చికిడి సేసినోడ
వేదాల నమ్మరాదనీ, చాత్రముల
వాదాలు బాగులేదనీ

బోధాలు సేసుకోని
బుద్ధులు సెప్పుకొన్న
నాడ వినోదనయ్యా
నల్లనయ్య నీవె కావ



కలికి నా దొరవు
నీవెరా నాతోడ
పలుక వేమి
బాలకృష్ణుడా !

సిల్లగట్టు పురమునందు
చిన్నిగోపాలుడై
పిల్లనగ్రోవి పట్టుకోని
పేటపేట తిరిగినోడ

పేట్రాయి సామిదేవుడా
మమ్మేలినోడ
పేట్రాయి సామిదేవుడా !!

దీనితాగే సాగి, ఇదే వర్ణనతో కూడిన రెండవపాట కూడా పరికిద్దాం :

బేట్రాయి సామిడేవుడా
నన్నేలినాడా
బేట్రాయి సామిదేవుడా !

కాటామరాయుడా
కదలి నారసింహుడా
నీకైన వేటగాడా
నిన్నెనమ్మియుంటినయ్య ॥బేట్రా॥

చేపకడుపు చేరిపుట్టగా
రాకాసివాని
కోపమూన చేతబట్టగా
ఓపినీవు నీళ్ళలోన
వచ్చినీవు వెతికివెతికి
బాపనోళ్ళ చదువులన్ని
బెమ్మదేవుడ కిచ్చినోడ ॥బేట్రా॥

తాబేలై తానుపుట్టగా
ఆ నీళ్ళకాడ
దేవరాక్షసులెల్ల కూడగా
తోవచేసి కొండక్రింద
దూరగానె చిలికిచిలికి
పావనంబైన యెన్న
డేవర్ల కిచ్చినోడ ! ॥బేట్రా॥

అందగాడవౌదులేవయ్యా
గోవింద గోపాల
రక్షింపరావయ్యా
పందిలోనెచేరి కోరి

పట్టి చేత ఎత్తిభూమి
చిందుబిందు చేసినట్టి
సందమామ నీవెగదరా



నారసింహ నిన్నెనమ్మితి
ఏనాటికైన మీ పాదమేగతి
ఓరి నీవు స్తంభాన
పచ్చి ప్రహ్లాదుగాచి
కోరమీసమెల్ల దువ్వి
గుండెచల్లన చేసినోడ ! ॥బేట్రా॥

బుడతబాపనయ్య పైతివీ
ఆ చక్రవర్తి
అడుగుభూమి నేలుకొంటివీ !
పొడుగుకాళ్ళవాడవై
అడుగు వానిమీదపెట్టి
తడవులేక లోకమెల్ల
మడవచేత తొక్కినోడ ! ॥బేట్రా॥

రెండుపొదల నొక్కసారిగా
ఆ పొదల నెల్ల చెండాడి దేహపట్టగా

వెండికోత భమిడికోత
దండకాలు చేతబట్టి
దొడ్డసామి నీవు నా
కొంచకిప్పుడొచ్చినోడ!
॥బేట్రా॥

రామదేవర రక్షించరా
ఈ జగతిలోన మా కెల్లరికీ
బుద్ధి చెప్పరా!
ఏమితప్పు చేసినామొ
సామి నా అప్పుజూడ
నీపంటి చల్లదనం మామీద
నుండజూపు
॥బేట్రా॥

దేవకీదేవి కొడుకువై
ఈ జగతిలోన దేవుడవై
నీపు బుట్టితీ
ఆవులనూ కాచుకుంటు
ఆడోళ్ళను చూచుకుంటు
టక్కుటిక్కు చేసినోడ!
॥బేట్రా॥

వేదాలూ నమ్మరాదయా
ఆ శాస్త్రాలూ బోధాలూ
బాగులేవయ్యా!
వేదాలు చదువుకొంటు
సుద్దూలు చెప్పుకొంటు
నాదా వినోదుడవైన
నల్లనయ్యా నీవె గదర
॥బేట్రా॥

కలిగినా దొరవు నీవయా
నన్నింక రక్షించరా
బాలకృష్ణయ్యా

వుల్లంగంటి పురమునాసు
చిన్నా గోపాలుడవై
పిల్లంగోరు చేతబట్టీ
పేట పేట తిరిగి నోడ ॥బేట్రా॥

పడ్డెకులమునందు బుట్టితీ
నీ విచ్చినట్టి మట్టిబుట్టి
చేతబట్టితీ !
టీరు డీరు తిరుగుకుంటు
ఉన్నోళ్ళని చూసుకుంటు
నీవూ నే నన్న మాట
నిక్కముగా తెల్పు సామి ॥బేట్రా॥

"వడ్డెకులమునందు బుట్టితీ, నీ విచ్చినట్టి మట్టిబుట్ట చేతబట్టితీ" అన్న చరణం ఆధారంగా ఈ పాటను మట్టి త్రవ్వు ఉప్పర్లు, వడ్డెవారు పాడతారని అనుకొందాం.

పంచేంద్రియాలతో నిర్మాణమైన ఈ పడవ పాట వినండి. చుక్కాని బ్రహ్మదిట, ఎందరో దేవతలు ఎక్కారుట. ఖర్మలకు ప్రతిధ్వనిగా తెరచాప ఆడుతూందిట. సత్యమనే జ్యోతి వెలుగుతూంటే పయనిస్తూంది. కాలమనే కింకరులు లాగుతూండే పడవట - చూడండి :

పడవెళ్ళిపోతున్నదీ
ఓ భక్తులార !
పడవెళ్ళిపోతున్నది ! !
బాసురముగ సంసార
భవజలధీలోనుండి ॥పడ॥

దీనిలో గొప్ప ప్రభువుండె
గానారేమి
పంచభూతాములందు
పంచివేసినా పచవ
గాంచగనె నెదు
గదులతో కూడున్న ॥పద॥

పొల్నెయ్యి పెరుగులతో
మేల్ మేల్ మెరుగులతో
వాలాయముగా నెన్నో
వన్నెలూ కల్గియుండ
కాలా మను కింకరులు
కనిపెట్టి ఈడ్చుచుండ ॥పద॥

చంద్ర సూర్యు లాదిగా
ఇంద్రాదు లెక్కిరిగా
ముందుగా గణపతీ
ముక్కోటి దేవతలు
ఎందరో ఎక్కినారు
ఇది ఏమి చోద్యమో ॥పద॥

చుక్కాని బ్రహ్మదండి
పదవకూ మిధ్య టక్కు
స్థంభముగానుండీ
గ్రక్కునను వైమానుగట్టీ
తెరచాపగుడ్డ పెక్కు
ఖర్మవైమాను
పెనుగాలి వీచుచుండ ॥పద॥

సత్య మైనట్టి
జ్యోతి సొంపుగా వెల్గుచుండ
అబ్బబ్బ! తీర్చుకానీ
బారారా యనుచుండె ॥పద॥

మోహ జలధిలో
నడుపుచూ ములిగీ
పోకుండా బాహుబలంతో
నూచుచూ
ఆహా! విజ్ఞాన విరతి

యని కళాసులు కూడ
సాహసమున హరిని పాడి
సోహమను గెడ వేయ ॥పద॥

ఆంధ్రదేశంలో భక్త రామదాసు పేరు విననివారు ఉండరు. అలాగే ఎడ్ల రామదాసు పేరూ ఏదో సమయంలో వినకుండా ఉండరు. ఈ క్రిందిపాట ఎడ్ల రామదాసుదే - వినండి!

ఈశ్వరా పరమేశ్వరా
జగదీశ్వరా కరుణింపరా !
శాశ్వతుడవని వేడితిని
విశ్వాస ముంచర ఈశ్వరా !

ముందు జేసిన పూర్వకృతములు
ఇందుబాపుము ఈశ్వరా !
పొందుగా మీ పాదపద్మము
జెందియుంటిని ఈశ్వరా !

కపట విద్యలు నేర్చి పొట్ట
గడుపుచుంటిని ఈశ్వరా!

నెపము లెన్నక నన్ను
నీకృప నేలుమీ పరమేశ్వరా !

ఆరుగురు శత్రువులు నాపై
క్రూరమెంచిరి ఈశ్వరా!
పరమమంత్రముచేత శత్రువుల
నణచవలె పరమేశ్వరా!

తొమ్మిదీద్వారముల కొంపిది
నమ్మనేటికి ఈశ్వరా !
బొమ్మలాట పాలుచేసి
బ్రోవకుంటివి ఈశ్వరా !

మూడుగుణములు విడువజాలక
మోసపోతిని ఈశ్వరా !
వేడ్కతో నీ మాయదాట
నుపాయమేదో ఈశ్వరా !

చంక దుడ్డెమ కింకరులకు
జంకనేరను ఈశ్వరా !
అంకమందునజేర్చి సద్గురు
శంకదీర్చర ఈశ్వరా !!

ఈ "కృష్ణయతండ్రీ" అన్న తత్వం కూడా శరీరంతో పోల్చి పాడినదే. ఈ పాటలో చాలా ఇంగ్లీషు పదాలు దొర్లాయి. దీనినిబట్టి ఈ పాట ఈ మధ్యలో ఇంగ్లీషు సంపర్కం ఉన్న వారిద్వారా వెలువడిఉంటుంది అనుకుంటాను — "గుమాస్తా" – "సూపర్నెంటు" – "లాకు" – పదాలు గమనార్హములు :

కృష్ణయతండ్రీ
ఓ కృష్ణయతండ్రీ

నా కష్టములు తీర్చవయ్యా
కృష్ణయతండ్రీ

ఘోరమైన సంసార
సముద్రమూ
నీనామమనే నావమీద
నే దాటెదా ! ॥కృష్ణ॥

రాగలోభమోహమనే కరాసులు
పడవ లాగివేయుచున్నారయ్యా
కృష్ణయతండ్రీ ॥కృష్ణ॥

బుద్ధియనే గుమాస్తా
కృష్ణయతండ్రీ !
చుక్కాని బట్టి త్రిప్పుచుండె
కృష్ణయతండ్రీ ॥కృష్ణ॥

జ్ఞానమనే సూపర్నెంటు
కృష్ణయితండ్రీ !
లాకుచక్ర మేయుచుండెనయ్యా
కృష్ణయతండ్రీ ॥కృష్ణ॥

మనసుయనే త్రాడుబట్టి
కృష్ణయతండ్రీ !
తెరచాప పట్టి లేవనెత్తి
కృష్ణయతండ్రీ ॥కృష్ణ॥

ఏటిలోనా నీరులేదు
కృష్ణయతండ్రీ !
చాలింపుమయ్యా పడవబాట
కృష్ణయతండ్రీ ॥కృష్ణ॥

పదవ మునిగిపోకముందె
కృష్ణయతండ్రీ
పరమపదవిలోనె చేర్చవయ్య
కృష్ణయతండ్రీ ॥కృష్ణ॥

ఇదీ తత్త్వమే - గమనించండి :

బ్రహ్మమేదో తెలుపరయా
బ్రహ్మజ్ఞులారా
భ్రాంతిరేకా జీవునికీ
ఖర్మరహితమైన మోక్ష
గతిని పోయేటందు కిప్పుడు ॥బ్రహ్మ॥

యజ్ఞక్రతువులంట
యోగ యోగములు సమముగ చేసి
భావము మీ రెరిగినందుకు ॥బ్రహ్మ॥

రేపుమాపు సంధ్యా వార్చి
రేచించి ఓంకారమందూ
ఆహుతి మరగినందుకు ॥బ్రహ్మ॥

ప్రొద్దెరిగి పొద్దున్న
లేచి పొద్దు చెప్పి
పంచాంగము న్యాయము
మీ రెరిగినందుకు ॥బ్రహ్మ॥

మరొకటి :-

మాయా కాయమురా
మమతలలో
పడి చెడితివిగదరా ॥మా॥

అడియాసలతో పడుటేగానీ
కట్టుకుపోయే దేమిటిరా జీవా ॥మా॥

కట్టె బొగ్గులో కాలేటప్పుడు
గవ్వరాదురా నీ వెంబడినీ
వీటికి నీ యారాటంబింకా ॥మా॥

ఎపుడో ఏమో ఎరుగుమురా
త్వరపడరా కడతేరెడు
గతి కనుగొనరా జీవా ॥మా॥

ఈ తత్త్వంలో నీతి, ప్రబోధం కూడా ఉంది :

నాదబ్రహ్మానందయోగీ వీడు
వేదాంతసారము వినిచే బైరాగీ
రాజసంబు దుఃఖదమురా ఘన
రాజయోగమార్గమే సౌఖ్యమురా ॥నాద॥

చిత్తశుద్ధి కల్గియుండు భక్తి
జేరి సద్గురు నీవు సేవించుచుండు ॥నాద॥

మత్తత్వము లేక యుండు - స
మస్తమింద్రజాల మంచూరకుండ
పెదల నిందించవలదు ఓరులు
పీడించినా నీవు భీతిల్ల వలదూ ॥నాద॥

వణిత లేకున్న దుఃఖమురా - కాని
వణిత గల్గినేని వంగదుఃఖమురా
ధనము లేకున్న దుఃఖమురా - చాల
ధనము గల్గినేని దాచదుఃఖమురా ॥నాద॥

పచ్చికుండవంటి మేను - ఇది
చచ్చుగాక ఆత్మ చావ దెన్నడును
విచ్చికుండ ప్రక్కలైనా - లోన
పెచ్చియున్న బయలువిచ్చి రెండౌన ॥నాద॥

తల్ల బ్రబ్దలు కొట్టుకొన్నా అర్థంకాని భావంలో, భాషలో ఈ తత్త్వాలు ఉన్నాయి. కొన్ని కొన్ని తత్త్వాలు ఒకే మాదిరిగా వున్నట్లు ఉన్నా కొంచం తేడా కనుపిస్తుంది.

చిలుకాను పెంచాను
ఎదముద్దూ లాడేను
కనుసైగ లేదయ్యో చిలుకా !

మూడ్లాళ్ళ ముచ్చటకు
మురిసేవు దిరిసేవు
ముందు గతి కానవే చిలుకా !

కుక్క మంచంమీద
కూలబడిపోతేను
దిక్కెవ్వరే నీకు చిలుకా !

ఇల్లు ఇల్లనియేవు
ఇల్లు నాదనియేవు
నీ ఇల్లు ఎక్కడే చిలుకా !

ఊరికి ఉత్తరాన
సమాధిపురములో
కట్టె ఇల్లున్నదే చిలుకా !

కర్రలే చుట్టాలు
కట్టెలే బంధువులు
కన్న తల్లివరే చిలుకా !

నువు కాలిపోయేదాక
కావలుందురు గాని
వెంట నెవరూ రారు చిలుకా !

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ కలిసి చేసిన యంత్రమే మనిషి, తొమ్మిది చర్మాలు (నవ రంధ్రములు గలది) తో తయారయింది.

విష్ణు, ఈశ్వర, బ్రహ్మ ముగ్గురూ
అన్నదమ్ములంట !
ఈ భూదేవీ ఆకాశవాణీ
వీరె కర్తలంట !

వారి మహిమతో చేసిరీ ఒక
మట్టిబొమ్మనంట
ఈ తొమ్మిది కిటికీల దర్వాజాలూ
మాటలాడుకుంట ॥విష్ణు॥

పస్తావట్టిదె పోతావట్టిదె
ధర్మము తన వెంట
సాంబశివుడు నిను పిలువనంపినడు
జల్దిగ రమ్మంట ॥విష్ణు॥

చేతిలో బెల్లం ఉన్నంతసేపే
కాకి బలగమంట
చేతిలో బెలం సరిపోయినాక
ఎవరు రారు వెంట ॥విష్ణు॥

ఇంటి ముంగిటా పిల్ల మేకలు
ఇల్లు బలగమంట
ఏడ్చేవారు మరి ఆర్చేవారు
ఎవరు రారు వెంట ॥విష్ణు॥

తొలినాడు యములోళ్ళనైన తను
గుంజుకు రమ్మంటా
యములోళ్ళంతా చుట్టు నిలచినరు
తాళ్ళా తెమ్మంటా ! ॥విష్ణు॥

చిన్న పెద్దలూ కూర్చున్నారు
చింతలు పడుకుంట
సిళ్ళుబోసి కూర్చుండబెట్టినరు
మాయ బొమ్మనంట ! ॥విష్ణు॥

పువ్వులదండలు వేసినారయా
మాయ బొమ్మకంట
దింపుడు కల్వము
కాడ దింపినరు
మాయ బొమ్మనంట! ॥విష్ణు॥

సొమ్ము సమస్తము తీసుకున్నారూ
పోతరు వారంత
గురువు పోస్తాడూ
శంఖు తీర్థమూ
ముక్తిఫలము కంటా! ॥విష్ణు॥

మంట్లో మన్ను కలిపినారు ఈ
మాయ బొమ్మనంటా
ధన ధాన్యంబులు
ఎవరి పదార్థము
ధర్మమె తన వెంట
చేసిన పుణ్యము పాపకర్మములె
వచ్చును తన వెంట! ॥విష్ణు॥

పైన చదివిన తత్త్వంలో ''చేతిలో బెల్లం ఉన్నంతసేపే కాకి బలగమంట, చేతిలో బెల్లం సరిపోయినాక ఎవరు రారు వెంట'' - అన్న చరణం వేరే పాటలోంచి ఇందులోకి వచ్చిందా అని నా అనుమానం. ఆ చరణంతో కూడిన వేరొక పాటకూడా ఉంది-ఆ పాటను పరికించండి:

సేతిలో బెల్లం
వున్నంతసేపే
కాకి బలగమంతా
ఆ సేతిలో బెల్లం
అయిపోగానే
ఎవరు రారు వెంటా! ॥సేతి॥

ఒంట్లో సత్తువ ఉన్నంతసేపే,
ఉంది నీకు జంటా!
ఆ ఒంట్లో సత్తువ సన్నగిల్లుతే
ఎవరు రారు వెంట! ॥సేతి॥

పెమిదలో నూనె ఉన్నంతసేపే
దివ్వె వెలుగులంతా!
ఆ పెమిదలో నూనె అయిపోగానె
దీపమారునంటా! ॥సేతి॥

ధన ధాన్యాలూ
భోగ భాగ్యములు
క్షణిక సుఖములంట
చెరువులో చేపలు సెల్లి పోగనే
కొంగ లోలవంటా ! ॥సేతి॥

ఎంతటి యదార్థసత్యాన్ని ప్రబోధించాడో ఈ తత్త్వంలో! ఇంతకంటే జీవితానికి వినిపించవలసిన మేలుకొలుపులు ఏం కావాలి, చెప్పండి?

బ్రతికుండగా నువ్వు చేసేపనులకు తరువాత శిక్ష అనుభవించవలసిందీ నువ్వే, తెలుసుండీ తప్పులు చేసి పరలోకంలో బాధలు పడకు. మంచి మార్గం కనుగొని బ్రతుకు అంటూ రేపటి విషయాన్ని నేడే నూరిపోస్తుంది ఈ తత్త్వం:

తెలిసీ తెలియక నీవు
చెడిపోకే మనసా
నీ తలపూ రామునిపైనా
నిలుపవే మనసా !

ఆరూ మూటినికూడి
కులకాకే మనసా
నీ వారూ మూడై పోకు
అయ్యయ్యో మనసా ! ॥తె॥

సిరిసంపదలు చూసి
మరువాకె మనసా
ఇది తెరచాటూ బొమ్మలాట
తెరువావే ఓ మనసా! ॥తె॥

ఆలీ బిడ్డలు చూసి
అతి మోహపడకే
నీ కన్నీ జన్మమూల
వారేరీ ఓ మనసా! ॥తె॥

పర భామాలాపేక్షా
పడబోకే ఓ మనసా
నివు పరలోకా యమబాధా
పడతావే ఓ మనసా ! ॥తె॥

ఉన్నవారిని చూసి
ఉబ్బాకే ఓ మనసా

పరతత్త్వ మార్గంబూ
కనుగొనవే ఓ మనసా ! ॥వె॥

ఎన్ని చేసినా చివరకు శాశ్వతం అనేది ఏదీ లేదుట - చూడండి ఈ తత్త్వం ఇస్తూన్న ప్రబోధం :

ఒట్టిదీ మాయాశరీరం
గుట్టు లెలుసుకొనరయా
బట్ట బయలైనట్టి శాశ్వత
బ్రహ్మమును కనుగొనరయా ! ॥ఒట్టి॥

ఉన్నదేదో లేనిదేదో
ఊహ లెలిసూకొనరయా
కన్నతల్లీ తండ్రి గురువుల
కరుణ చూడారేమయా ! ॥ఒట్టి॥

ఎన్ని విద్యలు ఎన్ని ప్రజ్ఞలు
ఎన్ని నేర్చిన నేమయా
కల్ల సంసారంబులంబడి
కాసు వీసము రాదయా ! ॥ఒట్టి॥

ఎల్ల బాంధవు లన్నదమ్ములు
ఎందరుండిన నేమయా
తల్లి పోయేనాడు ఎవ్వరు
తనకు సాయము రారయా !

వేరులేనీ చెట్టుకీ ఒక
పేరులేనీ పండయా
పండు కన్నా వారి కిది
ప్రేమ దీరిపోనయా ! ॥ఒట్టి॥

మరొక తత్త్వం - చిలుకని సంబోధించి ప్రబోధిస్తూంది.

చిలుకా పలుకదాయె
ఎవరు ఏమన్నారె నిన్నూ
గూటిలోనా రామచిలుకా
గురుని పాదం చేందెరా ! ॥చి॥

చిలుకా పలుకదాయె
ఎవరు ఏమన్నారె నిన్ను ॥చి॥

అందమైన ఇల్లురా ఇది
బృందావనముండే స్థలమురా
బృందావనములో తిరుగు
చుండే రామచిలుకరా ॥చి.॥

హరిచేతిలోనే ఒత్తి నలిపి
ప్రమిదలోనే నూనెపోసి
ప్రమిదచుట్టూ తిరుగుచుండే
రామచిలుకా ! ॥చి!

చిలుకా మోసమాయె
ఎవరు ఏమన్నారు నిన్ను
బద్దలల్లిన గూడురా ఇది
బ్రహ్మ చేసిన మాయరా
మాయలోనే తిరుగుచుండె
రామచిలుకా ! ॥చి॥

ఈ తత్త్వమును పరికించండి-దీనిని ముంగండలో ఒక పండు ముదుసలి వద్ద సంపాదించాను. ఇంచలి వేదాంతధోరణి సరిగా అర్థం చేసుకోవడం కష్టం.

చిట్టిబొమ్మల పెండ్లి
చేసే సూజ్ఞానాంబు
చిత్రాము చూడరమ్మా !
ఘటములోపల పంచ
భూతముల బొమ్మలుచేసి
హితముగా ప్రమతో త్తముతో
వియ్యామొంద
బూటకమనే బొండి
బొమ్మరిల్లుగజేసి
పృధితత్వము
పెండ్లరుగుగచేసి
దారిగా ఆకాశం
పందిరిగా చేసి
పుండరీకముల
అలివేణి కుండలు చేసి
తలుపు ఆశాజ్యోతి
తాళిబొట్టుగ చేసి
ఫలబింమజలము
వాసంతముగజేసి
బలుసత్యశౌచము
భాషికంబులచేసి
చెలగి అణువులనెల్ల
శేషబియ్యముచేసి
సుగుణ సద్గుణము
కర్పూర గంధము చేసి

శ్రుతులా విశ్వాసముల
వింజామరముచేసి
పరగ ఓంకారము
ప్రణవవాద్యముచేసి
ప్రియభక్తియనే రెండు
పేరంటాండ్రుగ చేసి
కామక్రోధములను
కంకణంబులు చేసి
తనివి ప్రాణికి కన్యాదానముచేసి
పసిబూని సద్గురుని
పౌరోహితునిజేసి
తనదు సంతోషము
తాంబూలముగజేసి
ఇలను చిల్లమూరి
ఈసూనెన్నగజేసి
పాపాబంధము లెడబాపగజేసి
వాసిగ పుద్దూరి
పురమువాసముచేసి
ఎలమవెంకట్రాయు
నేలినా సుజ్ఞానాంబ!!

తుమ్మెద, ప్రభాత, చందమామ మొదలగు పదములను పాల్కురికి సోమనాథుడు (క్రీస్తుశకం పన్నెండు వందలు) పేర్కొని ఉన్నాడు. చివర 'తుమ్మెద' అని వాడడంబట్టి ఈ పదములను 'తుమ్మెద' పదములు అని నామం వచ్చిఉంటుంది. తుమ్మెద పదములలో అన్నీ వేదాంతపరమైనవికావు-కాని ఈ క్రింది తుమ్మెదపదం వేదాంతపరంగానే నడుస్తుంది :

శివశివ అనుమేలు తుమ్మెదా!
శివయంచేను వినమేలు ,,
శివుని భక్తులాకు ,,
శరణన్న మేలే ,,
శ్రీకంఠుడను పువ్వు ,,
మూడు లోకమ్ము లాయెను ,,
సాకారమైయ్యుండు ,,
పర మేకాంతమున జూడ ,,
శివశివయనవే ,,
శివుడనగ విన మేలు ,,
శివుని భక్తులాకు ,,
శివ శరణన్న మేలే ,,
ముట్టీముట్టని పువ్వు ,,
ముట్టింది జగమెల్ల ,,
ముట్టి చూడావేల ,,
అది ముట్టిపాయలేవె ,,
యవ్వాన మందూన ,,
బహు పువ్వుల వాసన ,,
క్రొవ్వి నీవెరుగావె ,,
నీకు నెవ్వినేరములేడు ,,
ఆరు రేకుల పువ్వు ,,
అవి మీరిన వాసన ,,
వేరుసేయక నీవు ,,
శివు జేరి భజియించావె ,,
మేలు ఎరిగినీవు ,,
కేళి చరించావె ,,

ఏడుగురు రాజులు తుమ్మెదా!
నీకు జూడబండ్లజోడు ,,
ఆశగోసివేసి ,,
మోసపోకుమంటి ,,
రాశికెక్కుమంటి ,,
అష్టదళముమీద ,,
మెట్టి చెరించావె ,,
కష్టము నెరుగావె ,,
గ్రుష్టవై యుండావె ,,
తొమ్మిది వాకిళ్ళు ,,
నీవు నమ్మి చరించావు ,,
ముమ్మూల కోటాల ,,
నీవు నెమ్మాది నుండాపె ,,
పదిపదే నింటను ,,
వెండి పదునొండు తావులసు ,,
మెదలాక నిల్చినా ,,
నిన్ను కదిలించగలరదే ,,
ఎనసితోటా పువ్వు ,,
నీ వెనయమానలేక ,,
దాని చేజిక్కిన ,,
తోట వానిచేబడుచుపు ,,
నింగి నేల వేయ ,,
గంగగౌరు లేనినాడు ,,
పొంగుచును నొరుబోడ ,,
వేయి భంగుల నటియించు ,,
వేయి రేకుల పువ్వు ,,

అది వెలుగును జగమెల్ల తుమ్మెదా !
సద్గురు నడుగావె ,,
పువ్వు సద్యజూపు నీకు ,,
గురునకూ హరునకూ ,,
అంతరువు లేదేమి ,,
గురుపాద పద్మాలు ,,
నిన్ను దర్శించుమంటిని ,,
శివ శివ అనమేలు ,,
శివయంటేను వినమేలు ,,

ఈ పాటను వినండి : "నేజూచినానె బ్రహ్మము నాలో" అన్నదానిని బట్టి బ్రహ్మంగారి దర్శనంగా చెప్పవలసి ఉంటుంది.

నే జూచినానె బ్రహ్మము నాలో
నే జూచినానె సద్గురు నాలో
నే జూచినానె !
నే జూచినానమ్మ
నెలతరో తారక
రాజయోగమునందు
రంజిలు నా గురుని ॥నేజూ॥

కన్నుల నడుమాను
సన్నంపుదిడ్డినా
తిన్నాగ వెలిగేటి
పున్నమ చంద్రుని ॥నేజూ॥

పాలభాగమునందు
నీలజ్యోతుల నడుమ
ఓలలాడుచున్న
పరలింగమూర్తిని ॥నేజూ॥

చూపుల లోపల
పాపల నడుమను
వ్యాపించి వెలిగేటి
ఆ పరంజ్యోతిని ॥నేజూ॥

చతురాగ్రమునందు
పశ్చిమ వీధిని
నిక్షేపమైవెలుగు
సాక్షీభూతిని నాలో ॥నేజూ॥

చందమామకు నడుమ
కుండలాకృతియని
ఆనందముగ నేడు
హరి పోతులూరయ్య ।నేజూ॥

ఆలాగే "చిలుక" ప్రబోధంతో మరో తత్వం—

మూడ్నాళ్ళ బులుపులకు
మురిసేవు భ్రమసేవు
ముందుగతికానవే - చిలుకా !

ఆరు పటములలోన
హంసమేడల్లోన
ఆటలాడే రామ - చిలుకా !

ఆటలేలా మనకు
పాటలేలా మనకు
మాటదెల్పా రామ - చిలుకా !

తొమ్మిదీ వాకిళ్ళు
ఈ తోలుకోటకు
దిమ్మదిరుగూ రామ - చిలుకా !

తలుపుదీస్తే పిల్లి
పొంచిచూస్తున్నాది
తప్పించుకో రామ - చిలుకా !

సిద్ధప్పగురుని నామ ప్రబోధంతో వెలువడిన ఈ తత్త్వం పరికించండి :

బాల చిన్నది గోలరా
కడు ముదిమి యవనము లేదురా !
నీలమేఘా మధ్యమందొక
మెరుపువలె మెరసేనురా ॥బా॥

తొమ్మిదీ దరవాజులమరిన
మేడగది నున్నాదిరా
నమ్మకముగలయింటు
లార్వుర కావలీ పెట్టిందిరా ॥బా॥

సత్తుసిత్తుల తెలివితో
తను సిత్తమున ఉన్నాదిరా
తప్పకా తను కొలుచుబత్తుల
ఒప్పుగా బ్రోచేదిరా ॥బా॥

నిశ్చయముగ సిద్దయ్యగురునీ
వద్దగూచున్నాదిరా
ముదుగా గొలసేటిబత్తుల
ఒప్పుగా చూసేనురా ॥బా॥

ఏనాటినుంచో మనం వింటూవస్తూన్న ఎన్నో ''జానపద గేయాలు'' నేడు సినిమాలలో కొంచం మార్పులూ కూర్పులతో, వరుసల తేడాతో వినబడి, అన్నింటికంటే ఇవే ఎక్కువగా ప్రజాదరణ పొందడం చూస్తున్నాం, ట్యూన్స్‌ను తీసుకున్నా, పాటలను పరికించినా వాటివెనుక ఈ జానపద గేయాల ప్రభావం -

బలం చాలాఉంది. పేరుపేరున ఏ యే సినిమాలలో ఏ యే జానపద గేయం ఏ రూపంలో - ఏ వరుసలో యివ్వబడిందో వ్రాయాలంటే అంతు అనేది ఉండదు.

ఈ 'ఒరే ఒరే' పాటలాంటి వరసలూ ఎన్నో మనం విన్నవే.

చిల్లర రాళ్ళకు
మ్రొక్కుచునుంటే
చిత్తము చెడిపోను
ఒరే ఒరే!

చిత్తమునందున
చిన్మయరూపుని
చూచుచునుందుట
సరే సరే!

ఒక్కపొద్దులని
ఎండుచునుంటే
ఒకరుగ చెడుదువు
ఒరే ఒరే!

ఏకమైనయా
వైభవమూర్తిని
చూచుచునుందుట
సరే సరే!

సిళ్ళలో మునిగి
గొణుగుచు ఉంటే
నిలకడ చెడునుర
ఒరే ఒరే!

నీళ్ళలో ఉండే
నిర్మలజ్యోతిని
చూచుచునుండుట
సరే సరే!

బాధగురువుల
పంచనుచేరితె
భావము చెడునుర
ఒరే ఒరే!

భావమందునా
బ్రహ్మశాంతిసి
చూచుచునండుట
సరే సరే!

భూములు అడవులు
తిరుగుచునుండే
బుద్ధులు చెడునుర
ఒరే ఒరే!

బుద్ధిలో ఉండే
పున్నమచంద్రుని
చూచుచునుండుట
సరే సరే!

ఈ పాట తత్త్వ ప్రధానమైనది - ఆడవాళ్లు పాడేది:

నూరిపోసే మందుకాదు
నూరువరహా లిస్తెరాదు
కరుణాగురుని కరుణచేతను
ఘడియలో కడతేరెనందు ॥నూ॥

కనలేరు, కొనలేరు, తినలేరు
ఈ మందుకనుగొని లిన్నవారికి
ఘడియలో కడతేరెమందు ॥నూ॥

అక్కలూ చెల్లెండ్రు గురువును
అందరూ భావించు
మందు పెక్కుగలరు
తిన్నవారికి తక్కువేమి
లేదు మందు ॥నూ॥

జ్ఞాన ముక్తి విరాగములను
పానము సరియించుమందు
తాను నేనని వాదభావము
కలడం బందించెమందు ॥నూ॥

ఎరుక మరుపు లేనిపక్షము
ఎప్పుడుం సదికేళిమందు
తిరిగి జనన మరణ మనియేటి
తరణము తపించుమందు ॥నూ॥

అందు ఇందు సందులేకను
అందమైనది ఈ మందు
నందశైలాద్రి నివాసిని
నమ్మితే కడతేరుమందు ॥నూ॥

ఈ తత్త్వమును వినండి. 'చందమామ' పరంగా సాగింది.

చందమామ చందమామ — చందమామ
ఈ సంధి తెలిపే జ్ఞానుల్లెవరే — ,,
జంటనాగస్వరములూది — ,,
పామును పాదు పెకలించాలి — ,,

కొమ్మిది వాకిళ్ళుమూసి ,,
పామును పట్టవలెను ,,
కాయమనే పుట్టలోను ,,
మాయగానే మెలగియుండు ,,
భక్తియనే కట్టుకట్టి ,,
యుక్తిచేత పట్టవలెను ,,
దేహిదేహములసందు ,,
తెలియకుండ చుట్టుకుంది ,,
ఆ జపమంత్ర ధ్యానముచేత ,,
అఖండకళలతో వెలుగుచుండు ,,
పాముపట్టే యోగి ఎవరె ,,
ఆతనిపేరే సిద్ధగురుడె ,,

ఈ పాట - తత్త్వమే - కలికాల మహిమను గురించి చెబుతూన్నది :

నీరు పోసిన చెట్టు
నిర్మూలమౌతుంది!
పడినచెట్టు
ప్రబలానికొస్తాది!
యుగము జగము
తల్లడిల్లుతాయిరా!
చిత్రాట లాడేరు
శివపూజ మరచేరు!
చింతగుంటాజోరు
లయ్యారురా !

మీసాలు లేనోడు
దేశాము లేలాడు !
దేశమెల్లా ఒక్క
కరువు వచ్చిందిరా!
తాటిచెట్టూమీద
తాబేలు పుడతాది!
తల్లక్రిందుల కాల
మొచ్చిందిరా!

ఆరేళ్ళవానికి
మూడూండ్లవాడైన
అరువుచెప్పేకాల
మొచ్చిందిరా!
చేటికిచ్చిన రూక
ఎగవేసి దిగమ్రింగి
బాయూడి బాసలు
చేస్తారురా !
రాచూరుదగ్గరా
రాతిబస డున్నాడు !
రంకెలేసేకాల
మొస్తుందిరా !

ఈ కాలమొచ్చింది
దురుకాల మొసుంది !
దుష్టుల కెల్లనూ
దుర్బుద్ధి పుడతాది !
అత్తలకు సేలలు
కోడలకు మంచాలు !
కొడుకు తల్లినికొట్టు
కాల మొస్తుందిరా !

ఆలు చెప్పినమాట
అరటి పండౌతాది !
తల్లి చెప్పినమాట
త్రాచుపామౌతాది !

బాగానే చెప్పాడు - కలికాలంలో జరుగుతూన్న సత్యాన్ని.

ఇది 'దూదేకుల సిద్ధయ్య'గారి తత్త్వం ! చూడండి-ఎంత చక్కని సందేశం ఇస్తున్నారో ! కులంను గురించి ఎంత బాగా చెబుతున్నారో పరికించండి.

కులం, గోత్రం, జాతి - వీటిని నమ్ముకుని మోసగించుకొని, విసిగి వేసారే - లోకులూ, కాకులూ ఆడిగే ప్రశ్నలకు సమాధానం ఏమిటి? వినండి సిద్ధప్పగారి సమాధానం :

"ఏ కులమని నను
వివరమడిగితే
ఏమని దెల్పుదు
లోకులకూ !
లోకులకూ
పలుగాకులకూ !
దుర్మార్గులకూ
ఈ దుష్టులకూ !

ఫాలభాగమున
ఏలలుబాడుచు
భావమొకన్నది
నా కులము !

ఇంటిలోపలను
ఇల్లు గట్టుకొని
మంటలోపల
రాట్నం పెట్టుకు

కంటిలోపల
కదుపు పెట్టుకు
ముక్కులోపల
వీకు పెట్టుకు
చెవులో దారా
చేతికిదీసుకు
నారాయణయను
నరము తీసుకొని
అష్టాక్షరియను
తడిక వేసుకొని
పంచాక్షరియను
పంచదీసుకొని
తధిమి తధిమి
గబదెబ గబదెబ
వీకినకులమె
మా కులము !

వీకిన వీకులు
పేకిన పిందెలు
లోకమంత నొక
పాకము చేసుకు
వీకినకులమే
మా కులము !
రొమ్మున లక్ష్మి
చీరగట్టుకొని
చక్కగా సిరి
పావడ దొడిగి
ఆనందమైన
వీరబ్రహ్మ
కాల్వ కప్పుకొని

నిండి ఉన్నదే
నా కులము !
ఒంటరిగాదె
నా కులము !

ఏ కులమని నను
వివరమడిగితే
ఏమని దెల్పుదు
లోకులకూ ?

తత్వాలలో ఓ కాస్తసేపు గడిపాం - మనలో మనమాట - జీవితంమీద రోత, జాతకంమీద అసంతృప్తి, భవిష్తత్తుమీద నిరుత్సాహం, సంసారం అంటే వెగటు, ఆఁ ! ఏముందిలే అన్న విసుగు !

ఆలా అనిపించి కొంచం ఆలోచనకేసి పరుగెత్తిస్తుంది మనసుని-తత్వాలలో ఉన్న ప్రబోధాల మహత్తు అటువంటిది ! మరెన్ని తత్వాలు ఇంకా దాగి ఉన్నాయో కదా ఈ ప్రవంతిలో !



నా విన్నపం



జానపద వాఙ్మయం మహా స్రవంతి! ఆ స్రవంతిలో ఎన్నెన్ని పాయలో వచ్చి మహా స్రవంతిగా చేశాయి.

ఆ స్రవంతిలో నురగలుగా వచ్చే తరంగాలలో-ఎంత నిండుదనం, ఆ నిండుదనంలో ఎంత గడుసుదనం. ఎంత లోతు! ఎన్నెన్ని ఊహలు, ఆలోచనలు-మరెన్ని ఆశయాలు.

ఈ జానపద స్రవంతిని ఎంతగా పరిశీలించినా, పరిశోధించదలుచుకున్నా ఆ గభీరతకేసి అలా చూస్తూ - ఆ నిండుతనంలో - ఊహాజగత్తులో నిలబడి పోతాము.

ఒక విషయమా, రెండు విషయాలా? జీవితం అంటే ఏమిటో-బ్రతుకు పల్లవిపాడే పాటల రాగాల-మధురాక్షరాలలో పదాల మాటల గుత్తులలో ఇమిడి మోషిస్తుంది.

కోడి కొక్కొ-కోకో అనడం తడవుగా మేలుకొంటుంది లోకం. చిరు గంటల లేగల అంబా-అనే పిలుపులు, రైతుకూలీ జనం పని పాటుల కోసం ఉరుకులు - మేలుకొలుపులు.

ఆలా అలా గంటలు-కాలం సూర్యోదయం, ఎండలు, వర్షాలు, గాలులు, పొలాలు, మిల్లులు, గృహాలు, పెద్దలు, పిన్నలు, పాపలు, పనులు, ఊహలు, ఉత్సాహాలు, గెంతులు, చిందులు-భజనలు, రాగాలు, అనురాగాలు!

మరెన్నో ! సాయం సమయం.. పక్షుల కిలకిలా రవాలు, రేకులు విచ్చిన సన్నజాజులు, బుగ్గలపై ఆశల చిత్ర విచిత్రాలు, సంపెంగల మౌనప్రేమ లేఖలు, మల్లెల కన్నుగీటులు-ఇన్నీ కలిసి పూలబాసల పసందులు, సువాసనల ఘుమఘుమలు !

సూర్యునికి విశ్రాంతి సమయం ! కూలి జనం పాటల జోరులో హోరులో బారుల్లో ఇంటికి నడకలు, రెక్కల పక్షుల గూటికి ఎగురులు !

కోర్కెల కూని రాగాలు ! ప్రేమల పల్లవి గీతాలు. కొంటెతనం సింగిరి గీతాలు—ఎంత గమ్మత్తు !

"ఉంగ" తో జీవితం ప్రారంభించి ఎన్నెన్నో మజిలీలు - మైలురాళ్ళని దాటుకుంటూ ప్రయాణం చేసి, పసితనం బాల్యం యౌవ్వనం, సంసారం, బాధ్యతలు - పెద్దరికం. చుట్టూ కొడుకులూ కూతుళ్ళూ కోడల్లూ అల్లుళ్లూ, మనుమలూ మనమరాళ్ళూ, పనివాళ్ళూ —

ఒడుగులు, పెళ్ళిళ్ళు-సన్నాయిమేళాలు, పేరంటాలు, నోములు, వ్రతాలు, పూజలు పునస్కారాలు, గుడులు గోపురాలు, దేవుళ్ళు అమ్మవార్లు !

జీవితం అంతా ఎడతెగని ప్రయాణం. అందులో ఎన్నో అనుభవాలు. అనుభూతులకు ప్రతిరూపాలు — ఇన్నింటి ముత్యాలహారమే — జానపద గీతాలు. ప్రాచీన దేశి సంప్రదాయ సాహితీ భాండాగారాలు.

ఏముంది జీవితం? అన్న ప్రశ్న! ఆ ప్రశ్నతో-ప్రతిధ్వనించే తత్త్వాలతో ఈ వాఙ్మయానికి మంగళం!

జానపద సాహిత్యం! 20 ఏళ్ళ నాడు నేను వెలువరించిన దేశి సారస్వత విభూతిగా-వెలువరించిన "మధుర కవితలు" అని నామకరణం చేశాను. సుమారు 800 పేజీలలో మందార మకరంద మాధుర్యాలను ఆవిష్కరించాను.

సరిగ్గా ఇరవై ఏళ్ళ అనుభవం - పరిశీలనం వింగడించి - నేడు సమగ్ర జానపద వాఙ్మయమూర్తిని ''జానపద సాహిత్యం''గా మీ ముందుంచుతున్నాను. అనేక గ్రంథాల అవలోకనం, పరిశోధనం అనంతరం దిఙ్మాత్ర ఆలోచనామృతంతో ఈ బృహత్ గ్రంథాన్ని జనం ముందు, సాహితీలోకం ముందు ఉంచుతున్నాను.

ఎన్నెన్నో గేయాలను, మరెన్నో కథా కావ్యాలను, పదాలను, పాటలను, సంకలనాలను, వ్యాసాలను, వ్యాసపీఠాలను, జానపద హృదయాలను తడిమి-సమగ్రావగాహనకు వీలుగా ఈ గ్రంథాన్ని పాఠకలోకం ముందు ఉంచుతున్నాను.

ఇందులో ఉన్న పుంచి అంతా జానపద గేయకర్తలయిన అజ్ఞాతకవులది,
ఏమైనా తప్పులు ఉంటే అవి నావి అని చేతులు జోడించి
నమస్కరిస్తున్నాను.

సుకవితాయవ్యస్తి రాజ్యేనకిం?

ఎలోరా

అధ్యక్షులు– జానపద సాహితీ సమాఖ్య

ఈ గ్రంథ రచనకు ఉపకరించిన గ్రంథాలు

ప్రేరణ: మా తల్లిగారు గొడవర్తి రమణమ్మగారు పాడుతూండే గుమ్మడేడే గోపిదేవీ వంటి పాటలూ, పదాలూ, కీర్తనలూ విని.

2. జానపద గేయాలు - నిడదవోలు వెంకట్రావు.

3. ప్రముఖ విద్వాంసులూ హైదరాబాదులోని సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ గొడవర్తి శ్రీరామమూర్తి గారితో ఈ సాహిత్యాన్ని గురించి అప్పుడప్పుడు చర్చించిన సమయంలో వారు ఇచ్చిన అపూర్వ సలహాలు.

4. జానపద సాహిత్యం – బి. రామరాజు

5. మధుర కవితలు – ఎల్లోరా (1981)

6. మున్నీరు, మిన్నీరు – గంగాధరం

7. కాటమరాజు కథలు – తంగిరాల

8. జానపద వాఙ్మయం – ఎన్. కృష్ణకుమారి

9. జానపద గేయాలు – ఎల్లోరా (1967)

10. దేశి సారస్వత విభూతి – కృష్ణశ్రీ

11. హరి హరీ పదాలు – వేకుపళ్ళ

12. దేశి సారస్వతం – దోణప్ప

13. యక్షగానాలు–కిన్నెర – జోగారావు

14. జాణతనాలు – కె. సభా

15. మధుర కవితలు–పీఠిక – నార్ల

16. సరాగాలు-పీఠిక – విశ్వం

17. జానపద గేయాలు-పీఠిక – గిడుగు సీతాపతి

18. త్రివేణి

19. ఆలిచిప్పలు - ఆణిముత్యాలు

20. సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర

21. రేడియో సమీక్ష – తాపీ ధర్మారావు
22. యక్షగానాలు - నాట్యకళ – ఎల్లోరా
23. పండితారాధ్య చరిత్ర
24. బసవ పురాణం.
25. స్త్రీల పాటలు – శ్రీపాద
26. జానపద సాహిత్య వ్యాసాలు – ఎల్లోరా : కిన్నెర, ప్రసంచి, ఆంధ్ర ప్రభ, విశాలాంధ్ర మొదవి.
27. దేవేంద్ర సత్యార్థి వివరణలు
28. బ్రౌన్, బోయెల్ సమీక్షలు
29. తోలుబొమ్మలు – ఎల్లోరా
30. ఇందులోని నోములు-వ్రతాలు, స్త్రీల పాటలు, వ్రతాలు, ఫలరకాల పదార్థాల కోససీమ స్త్రీ వృద్ధ భాండాగారం.
31. అన్నమయ్య కీర్తనలు
32. 'చలనచిత్ర'లలో 'సినిమాలలో' జానపద గేయాలు' వ్యాసం
33. తెలుగు సాహిత్యంలో [illegible] – పి. శమంతకమణి
34. జానపద గేయ వాఙ్మయ పరిచయం - హరి ఆదిశేషువు

A. B. K. PRASAD
Accn. No.
4130
LIBRARY

1781

NRRB01D374

జీవిత రేఖలు

పుట్టింది ముంగండ అగ్రహారంలో. ఆడిందీ పాడిందీ కోనసీమ ప్రకృతి సౌందర్య సీమలో.
1951లో ఆంధ్రప్రభలో ప్రవేశం.
1960 సినీప్రభ ఎడిటర్
1961 ప్రభుత్వ ఫోక్ లిటరేచర్ కమిటీలో సభ్యత్వం.
1962 ఆంధ్రజ్యోతిలో ఉద్యోగం
ప్రస్తుతం: ఆంధ్రప్రభ వీక్లీ అసిస్టెంటు ఎడిటర్
1977లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డ్.
1981లో జాతీయ కవిగా ఎన్నిక. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సావనీర్ ఎడిటర్. కవిగా సత్కారం మలేసియాలో జరిగిన ద్వితీయ ప్రపంచ తెలుగుమహా సభలలో సత్కారం. సాహిత్య అకాడమీ మోడరన్ లిటరేచర్ కమిటీ సభ్యులు.
హైదరాబాద్ దూరదర్శన్ సలహా మండలి సభ్యులు
జానపద సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి
సాహితి (సాహిత్య వేదిక) అధ్యక్షులు.



	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	NKRBOID574
పుస్తకం పేరు	బొమ్మకదు సామెతలకై యల్లలు
తారీఖు	10-10-24
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	683
పెద్ద సైజు పేజీలు	NO
ఖాకీ పేజీలు	4,B 9A BC
లేని పేజీలు	1to3,XXVI,XXVII
తయారు చేసినది	Nawin
పేజీలు విడదీసినది	Mounika
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యవివి	
తప్పులు	NO
పరిస్థితి	Good